శ్రీమదాంధ్ర వాల్మీకి రామాయణం

అయోధ్యా కాండ • మందర మకరందం



వక్త
"ఆంధ్ర వాల్మీకి – కవి సార్వభౌమ"
శ్రీవాసుదాస స్వామి

అనువక్త – వాచవి
వనం జ్వాలా నరసింహా రావు

ఆధ్యాత్మిక వార్తా మాసపత్రిక విశిష్ట ప్రచురణ

శ్రీమదాంధ్ర వాల్మీకి రామాయణం

అయోధ్యా కాండ

మందర మకరందం

Srimadandhra Valmiki Ramayanam
Ayodhya Kaanda - Mandara Makarandam

వక్త

“ఆంధ్ర వాల్మీకి–కవి సార్వభౌమ”

శ్రీ వాసుదాస స్వామి

అనువక్త - వాచవి

వనం జ్వాలా నరసింహా రావు

‘దర్శనమ్’

ఆధ్యాత్మిక వార్తా మాసపత్రిక

సభక్తిపూర్వక సమర్పణమ్

శ్రీమదాంధ్ర వాల్మీకి రామాయణం
'అయోధ్యాకాండ' మందర మకరందం

Srimadandhra Valmiki Ramayanam
Ayodhya Kaanda - Mandara Makarandam (Telugu)

వనం జ్వాలా నరసింహారావు

ప్రథమ ముద్రణ : నవంబర్, 2017

వెల : ₹ 300/- (మూడువందలు)

ప్రతులు : వేయి

అక్షరాలకూర్పు : **ఆరవేటి వెంకటసుబ్బయ్య**
98492 42028

టైటిల్ కవర్ డిజైన్ : **శ్రీరామోజు గణేశ్**

ముద్రణ : **సాయితిరుమల ప్రింటింగ్ ప్రెస్**
చిక్కడపల్లి, హైదరాబాద్

ప్రతులకు:

మరుమాముల వెంకటరమణశర్మ
'దర్శనమ్' ఆధ్యాత్మిక మాసపత్రిక
29-105/1/1, న్యూ విద్యానగర్,
నేరేడ్‌మెట్, సికిందరాబాద్ - 56.
94410 15469,
040-27220401

మంగళాభిముఖి

బ్రహ్మ పదావతీర్ణ కవితా లీలావతీ వల్లభుడైన వాల్మీకి మహర్షి శ్రీపాదములను శ్రీవావిలికొలను సుబ్బారావు (వా.సు.దాసు) గారు పట్టుకోగలిగారు. గాయత్రీ మంత్రాక్షరాలకు సహస్రగుణితంగా అంటే 24 వేల పద్యాలతో మూల వాల్మీకాన్ని "మందరం" అనే పేరుతో తెలుగువారి మనస్సులు అనే పాలకడలిలో స్థాపించ గలిగినారు. 'మందరా'నికి "మందర మకరందం" పేరుతో శిష్టవ్యావహారికంలో – వాచవి వ్రాయడం ద్వారా శ్రీవాసుదాసు గారి పాదాబ్జాలను పట్టుకో గలిగారు శ్రీజ్వాల నరసింహారావుగారు. అసలు శ్రీ రామాయణాన్ని ముట్టుకోడానికే ఎన్నో జన్మల పూర్వపుణ్యం కావలె. శ్రీ 'జ్వాల' గారు ఈ పాటికే "సుందరకాండ" "బాలకాండ"లకు అనువక్త అయ్యారు. ఇప్పుడు – "అయోధ్యాకాండ". ఇది 119 సర్గలు కలిగి 4315 శ్లోకాలు కలిగిన చాలా పెద్ద కాండ. శ్రీ వాసుదాసు గారు అంతే బృహత్తుగా దీన్ని 'మందరీ'కరించినారు ఈ అయోధ్యాకాండ – దశరథుడు శ్రీరాముణ్ణి ఆయన సద్గుణవంతుడు కాబట్టి యువరాజును చేయాలి అని గ్రామీణ ప్రజలతో ఆలోచించటముతో మొదలై – దశరథుణ్ణి కైక వరాలు అడగడం, రాముడు సీతాలక్ష్మణ సహితుడై అయోధ్యను వీడడం, శ్రీరాముని అరణ్యవాసము, ఆ అరణ్యవాసములో ఆతడు అత్రి మహాముని ఆశ్రమానికి వెళ్ళడం అనే కథాభాగాలతో పూర్తి అవుతుంది. ఇంత పెద్ద కథా భాగానికి శ్రీ'జ్వాల' వ్రాసిన వాచవిని – కొంత మేర అక్కడక్కడా స్థాలీపులాక న్యాయంగా చదివా. మామూలు లోకవ్యవహారంలో మాట్లాడుకున్నట్లుంది. సహజసిద్ధంగా చాలా బాగుంది. "వనం జ్వాలా నరసింహారావు" అన్న పేరులో ఒక విచిత్ర విరోధాభాసమో లేక అత్యంత స్నేహ సమన్వయ హాసమో ఏదో– ఒకటి వుంది. వనానికి – జ్వాల. జ్వాలకు – వనం – ఎలాగో – ఆలాగ.

శ్రీజ్వాల గారు తమ వాచవులకు అమెరికా తత్కాల వాసం కొంత దోహదకారి అన్నారు. ఏమైనా నిరంతర రాజకీయ కార్యధౌరంధర్య వ్యగ్రతకు నిలయమైన ముఖ్యమంత్రి కార్యాలయంలో ఆయన వృత్తి. కానీ అదే సమయంలో – సంతతం రసవత్ కవితా – అధ్యాత్మవిద్యా పరిమళాన్వితుడైన ముఖ్యమంత్రి వర్యుల సాహచర్యంలో ఆ వృత్తి కావడం ఒక పుణ్యోపపత్తి. ఇటువంటి సాహచర్యం వాటికి విద్యాదోహద సంపత్తి.

శ్రీ 'జ్వాల' గారి వాచవి – సరళం – సుందరం – స్నిగ్ధం – సురభిళం. ఈ నేటి సమాజానికి యిటు వంటి సరళీకరణలు అవసరం. రామాయణంలోని అన్ని కాండలకు వాచవి వ్రాయుదురుగాక! అవధాన సరస్వతీ పీఠ నిలయయైన ఐం మహాసరస్వతీ దేవి మిమ్ము కటాక్షించు గాక!

కం॥ "మందర"మని రాఘవ గుణ
'మందిర'మని చదవరులకు మకరంద మనన్
కుందన మని శ్రీ"జ్వాల"కు
చందనమయి రామ కృపలు సౌభాగ్యములౌ.

ఆశీః

హేమలంబ– **(మాడుగుల నాగఫణి శర్మ)**

కార్తీక సోమవారం

30.10.2017

❖ ❖ ❖

మంగళాచరణమ్

'నమోఽస్తు రామాయ స లక్ష్మణాయ దేవ్యైచ తస్యై జనకాత్మజాయై'!

శ్రీరామాయణం వేదానికి ఉపబృంహణం. ఇది వేదమే! శ్రీసీతారాములు మాధ్యమంగా ధర్మసంస్థాపనకూ, ధర్మప్రబోధానికీ, ధర్మపరిరక్షణకూ రక్షాబంధనం గావించే ధర్మరక్షా శిక్షణం శ్రీరామాయణం! భారతదేశంలో ప్రధానంగా శ్రీరామాయణం కోట్లాదిమందికి ఆజీవన నిత్యపారాయణేతిహాసం. శ్రీమాన్ వనం జ్వాలా నరసింహారావుగారు ఆవిష్కరిస్తోన్న నవ్యాంధ్రవాల్మీకం ఇది.

మాది 'వైరమైత్రి'. అలవాట్లు, జీవనశైలి, పరస్పర వైరుధ్యాలు. ఒక విచిత్రమైన రీతిలో సమస్త కళ్యాణ గుణధాముడైన శ్రీరామచంద్రుడు మా మధ్యన హృద్యమైన చెలిమిని మేలుకొలిపి, పాదుకొలిపి, పాదుచేసి తన కల్యాణగుణామృతాన్ని పంచి, స్నేహలతను పెంచాడు. 'దీమాన్' వనం జ్వాలానరసింహారావు పురాకృత శుభాధిక్యతతో బాటు, అపూర్వమైన హైందవ ధర్మశాస్త్ర నిగూఢ మర్మాలను శోధనచేసే నైపుణ్యాన్నీ, క్రమంగా ప్రారంభించి శ్రీరామాయణ ప్రావీణ్యాన్ని వారసత్వంగా పైతృక ప్రసాదంగా సంతరించుకున్న సత్పురుషుడు, మర్రిచెన్నారెడ్డి మానవవనరుల అభివృద్ధి సంస్థలో మేమిద్దరం ప్రొఫెసర్స్ క్వార్టర్స్ లో ఇరుగుపొరుగులవడం యాదృచ్ఛికం. ఆయన ప్రచ్ఛన్న శ్రీరామభక్తుడు. ప్రకాశ లోకానురక్తుడు. ఆపన్న మిత్రుడు. అజాత శత్రుడు.

మా నాయనమ్మ గారు చిలకపాటి పంకజవల్లి తాయారమ్మ గారు. వారి తండ్రి కౌస్తుభం శౌరిరాజాచార్యుల వారు. ఆయన అప్పటి (1915 ప్రాంతంలో) కృష్ణాజిల్లా కలెక్టరు ఆఫీసులో హుజూర్ సిరస్తదార్. ఆమె అన్నగారు కలెక్టరు గారి స్టెనోగ్రాఫర్. తండ్రిగారు నాయనమ్మ గారితో అంటూండేవారట ? శ్రీరామచంద్రుడు అవతరించి వున్న కాలంలో శ్రీరాములవారి దర్శనమైతే తప్ప ఈ జన్మలో శ్రీరంగంలో వేంచేసి వుండే శ్రీరంగనాథుడి దర్శనం కాదని'! ఈ మాట నేను ఇతరత్ర కూడా విని వుండడం చేత జ్వాలా గారి దంపతులతో అన్నదే తడవుగా వారు ధర్మపత్ని ల!!సౌ!! విజయలక్ష్మీ సమేతులై శ్రీరంగం వెళ్లి శ్రీరంగనాథుడ్ని దర్శించి వచ్చారు. జ్వాలా దంపతులు నిత్య ఏకాదశీ శ్రీ సత్యనారాయణ వ్రతనిష్ఠులు.

వెంటనే వారు, మేము, భద్రాచలం వెళ్ళి శ్రీ సీతారామచంద్రస్వామి వారిని దర్శించి వచ్చాము. కారులో వెళ్ళే సమయంలో శ్రీరామాయణంలో విశేషాలను

ముచ్చటించుకుంటూ వెళ్ళాము. 'ఆంధ్రవాల్మీకి' గా సకలాంధ్ర విద్వజ్జనావళిచే సంభావించబడిన 'వాసుదాసు' (శ్రీమాన్ వావిలకొలను సుబ్బారావు గారు 23-1-1863 నుండి 1-7-1936 వరకు) నూటపదేళ్ళ క్రితం 1908లో 70వ యేట రోజుకు 20 గంటలు శ్రమించి వాల్మీకి రామాయణాన్ని యథాతథంగా పద్యరూపంలో ఆంధ్రానువాద గంగావతరణం గావించారు. 'వాసుదాసు' గా తెలుగు పాఠకలోకంలో వారు లబ్ధప్రతిష్ఠులైనారు. తరువాత వాసుదాసుగారే టీకా, తాత్పర్య, వ్యాఖ్యానాలతో ఆంధ్రవాల్మీకి రామాయణాన్ని 'మందరం' అనే పేరుతో ఆలోచనామృత కావ్యాన్ని అందించారు. ఈ మహాకావ్యాన్ని కడపజిల్లా ఒంటిమిట్టిలో వేంచేసియున్న శ్రీ కోదండరామస్వామి వారి శ్రీచరణ కమలాలకు సమర్పితం చేశారు. వాల్మీకంలో ప్రతీ శ్లోకానికి యథానువాద రసనిర్భమైన తాత్పర్య పూర్వక పద్యరచనం ఆంధ్రవాల్మీకి రామాయణం. గోవింద రాజీయానికి సరళసుందర యథాయోగ్యానువాదం. తెనాలి పొలిమేర గ్రామమైన అంగలకుదురులో వాసుదాస స్వామివారు స్థాపించిన శ్రీ కోదండరామ సేవక ధర్మసమాజం (దాసకుటి) లో 'మందరం' అన్ని భాగాలు పునర్ముద్రణ పొంది ఆర్తిగల వారికి ఆప్యాయంగా అందుబాటులో ఉన్నాయి. 'జ్వాలా' గారు వీటిని చదివిన స్ఫూర్తితో అనువక్తగా మందరంలోని నానావిధ ఛందోరీతులను, కథాసూత్ర పీయూషధారల రుచులను తెలుగువారికి ఆస్వాదింపచేసేపుణ్యాన్ని మూటకట్టుకుంటున్న 'వాచవి' అయినారు. మాన్యులు, సామాన్యులు, ధీమాన్యులు వీరి మొదటి 'మందర' మందార మకరంద మాధుర్యమైన 'సుందరకాండ' ను సమాదరించారు. వెంటనే వీరి 'బాలకాండ' ను శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్ స్వామివారి ఆశ్రమమే ప్రచురించి లోకాయత్తం చేసింది.

ఇది అయోధ్యాకాండ. కండ కలిగిన కలకండ కొండ. శ్రీరామగుణార్ణవం! సమస్తకల్యాణ గుణాకరుడు శ్రీరామచంద్రుడు. అయోధ్య'మందరం' లో వాసుదాస స్వామివారి మహాద్భుత వ్యాఖ్యానానికి సంక్షిప్త వచనానువాద పీయూషం ఇది. శ్రీమదాంధ్ర వాల్మీకి విరచిత శ్రీరామాయణ క్షీరార్ణవ మందరమునందలి తాత్పర్య రామాయణ మధురామృత వచనపారమ్య రమ్యకోశం.

జ్వాలాగారు అయోధ్యకాండలో గల 119 సర్గలకు విడివిడిగా ఆంధ్ర వాల్మీకానికి 'నవ్యాంధ్రవాల్మీక విశద వచన' రూపంలో అందిస్తున్నారు. సంభాషణాశైలిలో నడచిన వచన రచనం గావడంతో పాఠక సౌలభ్యమేగాక, వాల్మీకి హృదయాన్ని సామాన్యులకు సైతం సదవగాహనం చేస్తోంది. జ్వాలా గారి మాటతీరు గూఢ సంస్కార సంపన్నం. ఎంత క్లిష్టమైన, అయిష్టమైన విషయాన్ని కూడ సరసంగా, సరళంగా, సహృదయ సమ్మితంగా చెప్పడం వారి వైలక్షణ్యం. ఆ ప్రతిభే ఇందులోనూ కన్పిస్తోంది.

ప్రజారంజకమైన పాత్రికేయ భాషాశైలి వారి వృత్తినీ, రచనా ప్రవృత్తినీ, ప్రస్తుత నివృత్తి పథకథారచననూ శోభిల్ల చేసాయి.

జ్వాలాగారు యిందులో నివేదించినట్లు 'మందరం' అందించిన శ్రీరామకథామృతాన్ని 'ఆస్వాదించే తీరికా-ఓపికాలేని జీవులమైపోయి, సూక్ష్మంలో మోక్షం' కావాలనుకుంటున్న మాదృశులకు వాసుదాస స్వామివారి క్షీరార్ణవజనిత శ్రీరామాయణ మధురామృతాన్ని తాను హాయిగా ఆస్వాదించి, ఆ ఆనందాన్నితమలో యిముడ్చుకోలేక యిలా మనకూ పంచి వారు తరిస్తున్నారు. మనల్నీ తరింపచేస్తున్నారు. శ్రీ సీతారాముల కథను ఏదో రూపంలో వ్రాయనివాడు కవి కానేరడని లోకోక్తి!

వాల్మీకి హృదయాన్ని అవగాహించడం అంత సులభం కానేకాదు. దీనిని పెద్దల సన్నిధిలో శ్రద్ధాసక్తులతో శ్రవణం చేస్తేనే కొంతవరకు తాత్పర్యం బోధపడుతుంది. శ్రీరామాయణాన్ని ధర్మశాస్త్రమనీ, దీర్ఘశరణాగతి శాస్త్రమనీ అంటారు. అంతేకాదు మహామహులైన అప్పటి టి.కె.గోపాలచార్యస్వామి, శ్రీ భాష్యం అప్పలాచార్యస్వామి, ఆచార్య పుల్లెల రామచంద్రుడు, ఇప్పటి సాతులూరి గోపాల కృష్ణమాచార్య, సామవేదం షణ్ముఖశర్మ, చాగంటి కోటేశ్వరరావు, మైలవరపు శ్రీనివాసరావు ప్రభృతులు శ్రీరామాయణంలో అనేకానేక ఆధునిక శాస్త్రాలను ఆవిష్కరిస్తూనే ఉన్నారు.

శ్లో॥ కామార్థగుణ సంయుక్తం ధర్మార్థగుణ విస్తరం ।
సముద్రమివ రత్నాఢ్యం సర్వశ్రుతి మనోహరమ్ ॥ (రామా -1-3-8)

శ్రీరామాయణం వేదోపబృంహణం. వేదార్థాలను కథల రూపంలో వివరించే కావ్యం. గేయం. తంత్రీలయ సమన్వితం. ఆపాతమాధుర్యం. సమమధురోపనతార్థ వాక్యబద్ధం. పైకి అన్పించే అర్థం వేరు. అందులో ధ్వనించే అంతరార్థం వేరు. శ్రీరామాయణం అంతా అలాగే శ్లోకసాగర సమాకీర్ణంగా సాగుతుంది. ఉదాహరణకు అయోధ్యకాండ ప్రథమసర్గ-ప్రథమశ్లోక-ప్రథమపాదం "గచ్ఛతా!" ఆ పదంలోనే అయోధ్యకాండ కథాంశమంతా ధ్వనిస్తోంది. 'గచ్ఛతాం అంటే 'వెళ్ళిపోవడం' అని బహిరార్థం. అంతరార్థానికి వస్తే.. దశరథుడు స్వర్గానికి, శ్రీరాముడు వనాలకు, భరతాదులు మేనమామ గారింటికి, ఋషులు చిత్రకూటం విడిచివెళ్ళడానికి సూచితమైన భావనా గాంభీర్యం. గ్రంథమూలాన్ని అనువ్యక్తం చేసేటప్పుడు 'నామూలం లిఖ్యతే కించిత్ నానపేక్షిత ముచ్యతే' అని మల్లినాధ సూరి చెప్పినట్లు మూలచ్ఛేదం జరగకుండా జ్వాలాగారు జాగ్రత్త వహించడం గమనార్హం! గణనార్హం! ఇది చదివాక, ఆంధ్ర వాల్మీకాన్ని చదివితే వాసుదాస స్వామివారి మహాద్భుత పాండిత్యం, సాధికారిక ఆంధ్రానువాద నైపుణ్యం తెలుస్తుంది.

ఎందరో మహానుభావులు శ్రీరామాయణాన్ని తమదైన శైలిలో, భావనలో రచన చేశారు. మళ్ళీమళ్ళీ చేస్తూనే ఉన్నారు. అమాటకొస్తే తెలుగులో లెక్కలేనన్ని రామాయణాలున్నాయి. ఇంకా వస్తూనే ఉన్నాయి. ఇన్ని అవసరమా?అంటే శ్రీ విశ్వనాథ సత్యనారాయణ గారు ఇచ్చిన తీర్పు 'ఇదేల రామాయణంబన్నచో...." స్మరణీయం.

జయదేవుడు తన 'ప్రసన్నరాఘవ' నాటకంలో అన్నట్లు:

శ్లో॥ స్వసూక్తీనాం పాత్రం రఘుకుల తిలకమేకం కలయతాం।
కవీనాం కో దోషః సతు గుణ గణానామ వగుణః ॥

కవులు శ్రీరామచంద్రుడినే ఎందుకు తమ కావ్యాలలో కథానాయకుడిగా ఎంచుకోవాలి? అంటే శ్రీరాములవారికి మించిన గుణాధిక్యుడు వేరొకడు లేకపోవడమే! అది శ్రీరాములవారి గుణగణాల దోషమే కానీ కవులది కాదుకద!

అలాగే మా వనం జ్వాలా నరసింహారావు గారు ఆంధ్రవాల్మీకానికి అనువక్త మాత్రమే కాకుండ రుచులను తెలిపే 'వాచవి' కూడా! మనోహరమైన శ్రీ సీతారామ కథారుచులను మనకు హృద్యమైన నైవేద్యంగా అందిస్తున్నారు. వారి తండ్రి పరమపదవాసులు వనం శ్రీనివాసరావు గారు నిత్యరామాయణ పారాయణ పరాయణులు కావడం విశేషం! 'అవశ్యం పిత్రాచారమ్' అని ఆరోక్తి. అలాగే శ్రీశ్రీశ్రీ త్రిందండి శ్రీమన్నారాయణ రామానుజచిన్నజీయర్ శ్రీచరణుల అభిమానపాత్రులు కావడం మరొక విశేషం. ప్రస్తుతం ఉన్నతపదవిలో వుంటూ నిత్యమూ వందలాదిమందితో హడావిడిగా కాలం గడుపుతూ కూడా ఈవేళ ఇలాంటి జన్మతారకమైన శ్రీరామ కైంకర్యంలో అన్వయించడం అదృష్టమే! సీతాన్వేషణానికై వానరవీరులను వివిధ దిక్కులకు సాగనంపుతూ సుగ్రీవులవారు వానరులతో చెప్పిన ఆప్తవాక్యం స్మరణీయం.

శ్లో॥ కృతం హి ప్రియమస్మాకం రాఘవేణ మహాత్మనా।
తస్యచేత్ ప్రతికారోస్తి సఫలం జీవితం భవేత్ ॥ (కిష్కింధా-43-6)

మహాత్ముడైనట్టి రాఘవునికి ఏదైనా చిన్నపాటి ఉపకృతి లేదా సంతోషం కల్గించే పని మనం చేస్తే దానివల్ల మనకు లభించే ప్రతికృతి జన్మసాఫల్యమేనట! అందుకే "బంటు రీతి కొలువు ఈయవయ్యా రామా!' అని త్యాగరాజ స్వామివారు కీర్తించారు.

ఉత్తమవంశ నేపథ్యం, భగవద్భాగవత భక్తియుతులైన సాంస్కారిక మిత్రపరివారం, శ్రీసీతారామ శ్రీచరణాశ్రయం, విలక్షణ లక్షితమైన జీవనయానం అన్నీ కలిసిన 'ముత్తార తపో'వనం జ్వాలా నరసింహారావు గారు ఇలాగే శ్రీరామాయణంలోని

మిగిలిన 3,4 కాండలను శ్రీఘ్రంగా పూర్తిచేయాలని ఆశిస్తూ, అందుకు తగిన సదవకాశ సామర్థ్య 'సద్గోష్ఠి' ప్రయోజనాలను కల్పించాలని శ్రీరామచరణ కమలాల మ్రోల సాంజలిబద్ధంగా శరణాగతి చేస్తున్నాను. వాస్తవానికి ఈ నాలుగు మాటలు వ్రాసే యోగ్యత నాకు లేకపోయినా, మా యిద్దరిమధ్య గల ప్రణయ పరీమళాల కారణాన వ్రాసే భాగ్యం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలియజేసుకుంటూ, సెలవు తీసుకుంటున్నాను.

శ్లో॥ యావత్స్థాస్యంతి గిరియః సరితశ్చ మహీతలే ।
తావద్రామాయణ కథా లోకేషు ప్రచరిష్యతి ॥

చ॥ ఇతడు దురాత్ముడంచు జనులెన్నగ నాఅడిగొంటి నేనెపో
పతితుడనంటిపో పతితపావనమూర్తివి నీవుగల్గ నే
నితరుల వేడనంటి నిహమిచ్చిన నిమ్ము పరంబొసంగు మీ
యతులిత రామనామ మధురాక్షరపాళి నిరంతరంబు హృ
ద్గతమని నమ్మి కొల్చెదను దాశరథీ! కరుణాపయోనిధీ!

శ్రీరామ శరణం మమ
శ్రీరామ దాసానదాసుడు

S.I.T.A. సీతానగరం
24-10-2017 శతాభిషేకి

(చిలకపాటి విజయ రాఘవాచార్యులు)
డైరెక్టర్, హిందూ ధర్మ పరిరక్షణ ట్రస్ట్,
ఆంధ్రప్రదేశ్.

❖ ❖ ❖

ముందుమాట

ఎంత చదివినా తనివి తీరనిది రామాయణం. ధర్మానికి ప్రతిరూపమైన రామాయణం ప్రపంచభాషలన్నింటిలోకి అనువదించబడిందంటే దాని గొప్పతనం సులువుగానే మనం గ్రహించవచ్చు. కవి అనిపించుకున్న ప్రతివ్యక్తి ఏదో ఒకరకంగా రామాయణకథని తమ తమ జ్ఞానానికి అనుగుణంగా రాసినవారే! అటువంటి రామాయణ సాహిత్యమంతా పాఠకుల చేతిలోచేరి వారి ధర్మదాహాన్ని తీరుస్తోంది.

శ్రీవనం జ్వాలా నరసింహారావుగారిచే "దర్శనమ్" ఆధ్యాత్మిక వార్తా మాసపత్రికలో అనేక ఏండ్లుగా పైగా ధారావాహికగా ప్రచురించబడి అశేష పాఠకుల ఆదరాభిమానాలను పొందిన అయోధ్యకాండ ఈనాడు పుస్తకరూపంలో వెలువడుతోంది. సులువైన భాషలో, సామాన్యుడు సైతం చదువుకునేలా, చదువుతున్నకొద్దీ ఆసక్తిని కలిగించేలా ఉన్న కథనం ప్రత్యేక ఆకర్షణగా చెప్పవచ్చు. విస్తృతమైన, వర్ణనాత్మకమైన రామాయణాన్ని మందర వ్యాఖ్యాసహితంగా వెలయించిన 'ఆర్షకవి' వాసుదాసుగారి రామాయణానికి అనువక్త-వాచవిగా నిలిచిన వనం వారి రచన ఆసాంతం హృద్యంగా, మనోజ్ఞంగా సాగుతుంది.

గత పన్నెండు సంవత్సరాలుగా దాన్ని ప్రచురించే మహదవకాశం **'దర్శనమ్'** పత్రికకు దొరకడం శ్రీరామచంద్రస్వామి కృపగానే భావిస్తున్నాను. ఇప్పుడు ముద్రణ పొందుతున్న ఈ గ్రంథం కూడా పాఠకులను విశేషంగా ఆకట్టుకుంటుందని భావిస్తున్నాను.

ప్రత్యేకంగా 'దర్శనమ్'పై వున్న ఆత్మీయానురాగంతో తన రామాయణ రచననంతా ప్రచురణకు అవకాశం కల్పించిన విఖ్యాత రచయిత, ధార్మికవేత్త శ్రీ వనం జ్వాలా నరసింహారావు గారికి జీవితాంతం ఋణపడి వుంటాను.

ఈ అక్షర యజ్ఞంలో భాగస్వాములైన మా 'దర్శనమ్' సబ్ ఎడిటర్ బాలసుబ్రహ్మణ్యం, వేదపండితులు బ్రహ్మశ్రీ అప్పాల శ్యామ్‌ప్రణీత్‌శర్మగారికి, ధారావాహికకు అందమైన బొమ్మలను అందించిన సునీతావాసు గారికి, చక్కని ముఖచిత్రాన్ని అందించిన శ్రీరామోజు గణేశ్, ఈ పుస్తకానికి అక్షర కూర్పు నందించిన ఆరవేటి వెంకటసుబ్బయ్య, ఎల్లవేళలా తన తోడ్పాటు నందిస్తున్న అర్ధాంగి రుక్మిణికి, తక్కువ సమయంలోనే అందంగా ముద్రించి ఇచ్చిన లక్ష్మీ నర్సు గారలకు ధన్యవాదాలు.

ఈ 'దర్శనమ్' ధార్మిక యజ్ఞంలో నాకు ఆశీరానుగ్రహాన్ని అందిస్తున్న గురుదేవులకు, మా పితృదేవులు కీ.శే. మరుమాముల రాజమౌళి శర్మగారికి, మాతృమూర్తి మరుమాముల అన్నపూర్ణమ్మ, సోదరుడు శ్రీ మరుమాముల దత్తాత్రేయ శర్మగారలకు నమస్సుమనస్సులు.

శ్రీ హేవళంబి కార్తిక
బ॥ ఏకాదశి
తేది: 14-11-2017.

(మరుమాముల వెంకటరమణశర్మ)
సంపాదకులు
'దర్శనమ్' ఆధ్యాత్మిక వార్తా మాసపత్రిక

❖ ❖ ❖

జయభేరి

మ్రొక్కెద రామచంద్రునకు మోడ్చెద గేలు సుమిత్ర పట్టికిన్
మ్రొక్కెద దద్విదేహ పతనూజకు శ్రీ రఘురాము దేవికిన్
మ్రొక్కెద ధర్మ వాసవ మరుద్గుణ మారుత రుద్రపాళికిన్
మ్రొక్కెద సూర్య చంద్రులకు మ్రొక్కెద దామర సాప్తు సూతికిన్
నిజయము జయంబు రామునకు సారపరాక్రమ ధన్యమూర్తికిన్
జయము జయంబు! విద్విషద సహ్యత రస్వి సుమిత్ర పట్టికిన్
జయము జయంబు దాశరథి సంపరి పాలితుడౌ వలీ ముఖో
చ్చయపతి సూర్యపుత్రునకు సాహస విక్రమ కీర్తి శాలికిన్
నిదాసుడ సర్వ సద్గుణ వితాన మనోహర రామ మూర్తికిన్
గోసల దేశ వల్లభునకున్ హత శత్రుడ వాయు పుత్రుడన్
నాసరి గారు సంగరమునన్ దశ కంఠులు వేవురేనియున్
వాసియడంతు రాల ద్రుమ పాళుల నే హనుమత్స మాఖ్యుడన్
నిఅయోధ్యాపుర నేతారం, మిథిలాపుర నాయకీం
రాఘవాణా మలంకారం, వైదేహానా మలంక్రియామ్
రఘూణాం కులదీపంచ, ని మినాం కులదీపికామ్
సూర్య వంశ సముద్భూతం, సోమ వంశ సముద్భవమ్
నిపుత్రం దశరథ స్యాపి, పుత్రీం జనక భూపతే
వసిష్ఠాను మతాచారం, శతానంద మతానుగామ్
కౌసల్యా గర్భ సంభూతం, వేదగర్భోదితాం స్వయమ్
పుండరీక విశాలాక్షం, స్ఫురదిందీ వరేక్షణామ్
నిమత్త మాతంగ గమనం, మత్తహంస వధూగతామ్
సర్వలోక విధాతారం, సర్వలోక విధాయినీమ్
లోకాభి రామం శ్రీరామం అభి రామాంచ మైథిలీం
అన్యోన్య సదృశా వేతౌ త్రైలోక్య గృహదంపతీ

❖ ❖ ❖

విషయ సూచిక

❖ ❖ ❖

ముందుగా నా మాట

డాక్టర్ మర్రిచెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో (హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్) అడిషనల్ డైరెక్టర్ గా, నేను ఉద్యోగం చేస్తున్నరోజుల్లో, మా పొరుగున శ్రీమాన్ చిలకపాటి విజయ రాఘవాచార్యులు గారుండే వారు. అప్పట్లో ఆయన నా సహొద్యోగి. ఇటీవల వరకూ ఆయన తిరుమల తిరుపతి దేవస్థానం ధర్మ ప్రచార పరిషత్ కార్యదర్శిగా పనిచేశారు. ఇప్పటికీ అక్కడే మరో విభాగంలో పనిచేస్తున్నారు. ఆయన లేచింది మొదలు నిద్ర పోయే దాక రామనామం స్మరిస్తుండేవాడు. కార్యాలయంలో అధికారిక విషయాలను చర్చిస్తున్నప్పుడు, ఉన్నతాధికారుల సమక్షంలో ఉన్నప్పుడు కూడా, సందర్భోచితంగా రామాయణంలో చెప్పిన అంశాలను సంస్థలో నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమాలకు అన్వయించి మరింత నైపుణ్యంతో–నాణ్యతతో శిక్షణా కార్యక్రమాలను నిర్వహించేందుకు తోడ్పడేవాడు. ప్రతి నిత్యం రామాయణం పారాయణం చేసేవాడు. నాకంటే వయసులో చిన్న వాడైనా, జ్ఞానవృద్ధుడు. నా నిత్య కృత్యాలు చాలావరకు ఆయనకు నచ్చకపోయేవి. ఆయన ప్రతి ఉదయం అనుష్టానం చేసుకుంటుంటే చనిపోయిన మా నాన్న గారు జ్ఞప్తికొచ్చేవారు. వాసు దాసు గారు రచించిన ఆంధ్ర వాల్మీకి రామాయణం మందరం కాండలన్నీ పాతిక సార్లకు పైగా పారాయణం చేసారు మా నాన్నగారు. వాసు దాసుగారూ ఆయన శిష్యులు సుబ్బదాసుగారూ (దాసశేశుడు) ఖమ్మం జిల్లా, ముదిగొండ మండలం, వనం వారి కృష్ణా పురం గ్రామంలో వున్న మా ఇంట్లో వారి పాదాలు మోపి మా ఇంటిని పావనం చేసారు నా బాల్యంలో. మా నాన్నగారితో చిన్నతనంలో నేను, అంగలకుదురులో వాసు దాసుగారు స్థాపించిన శ్రీ కోదండ రామస్వామి సేవక ధర్మ సమాజం ఆశ్రమానికి వెళ్లాను. అలా నాకు వాసు దాసుగారిని గురించి కొంత మా నాన్నగారి ద్వారా, కొంత విజయరాఘవాచార్యులగారి ద్వారా తెలుసుకొనే అవకాశం కలిగింది.

ఆయన దగ్గర వాసు దాసుగారి ఆంధ్ర వాల్మీకి రామాయణం సుందర కాండ మందరం తీసుకొని చదవడం, ఐదేళ్లక్రితం అమెరికా వెళ్లి, సిన్సినాటిలోని మా రెండో కూతురు కిన్నెర ఇంట్లో వున్నప్పుడు గ్రాంథికమైన తెలుగులో వున్న దాన్ని శిష్ట వ్యావహారిక భాషలో "సుందర కాండ మందర మకరందం" గా రాయడం, పుస్తకరూపంలో బాపుగారి ముఖచిత్రంతో తీసుకుని రావడం జరిగింది. మొదటి ముద్రణ పుస్తకావిష్కరణ ఆగస్ట్ 8, 2004న, రెండో ముద్రణ పుస్తకావిష్కరణ ఆగస్ట్ 8, 2009న, మా శ్రీమతి అన్నగారు–డాక్టర్ అయితరాజు పాండు రంగారావు బావగారి చేతులమీద గా జరిగింది. ప్రథమ ముద్రణకు అప్పట్లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సమాచార పౌర సంబంధాల శాఖ కమీషనర్ గా పనిచేస్తున్న ఐఏఎస్ అధికారి శ్రీ.

కే.వి. రమణగారు (ఇటీవలి వరకు ఆయన తిరుమల తిరుపతి దేవస్థానం కార్యనిర్వహణాధికారిగా పనిచేశారు) సహాయపడడమే కాకుండా, పుస్తకావిష్కరణకు గౌరవ అతిథిగా మా ఇంటికొచ్చి నా ప్రయత్నాన్ని ప్రోత్సహించారు. యాదృచ్ఛికంగానో-అదృష్టంగానో, ఈ బాల కాండ పుస్తకం రాయడం పూర్తయిన రోజున కూడా, ఆయన నేనున్న శాన్ ఫ్రాన్సిస్కో (అమెరికా) లో వుండడం, పుస్తకం రాయడం పూర్తయిందని మొదట ఆయనకే చెప్పడం జరిగింది. "సుందర కాండ మందర మకరందం" రాయడానికి శ్రీరామచంద్రుడు అప్పట్లో అమెరికాకు పంపించినట్లే, "బాల కాండ మందర మకరందం" రాయడానికి ఆ శ్రీరాముడే, ఇప్పుడు కూడా అమెరికా శాన్ ఫ్రాన్సిస్కోకు పంపాడు. అప్పుడే మో సిన్సినాటిలో వున్న మా అమ్మాయి కిన్నెరకు కూతురు పుట్టే సమయంలో నేనూ-మా శ్రీమతి కలిసి వెళ్లాం. ఇప్పుడేమో, శాన్ ఫ్రాన్సిస్కో లో వున్న మా కుమారుడు-కోడలు పారుల్ కు కూతురు పుట్టే సమయంలో వచ్చాం. ఇలా మా ఇద్దరు మనుమరాళ్లు నేను రెండు **"మందర మకరందాల"**ను రాసేందుకు కారణమయ్యారు. ఒక మనుమరాలు (పేరు-మేథ) వాళ్లమ్మ గర్భంలోంచి, సాక్షాత్ శారదాదేవి అంశతో, తన మేధస్సును పరోక్షంగా నాకందించి "సుందర కాండ మందర మకరందం" రాయడానికి తోడ్పడింది. ఇక మరో మనుమరాలు (పేరు-కనక్) వాళ్లమ్మ గర్భంలోంచి, సాక్షాత్ లక్ష్మీదేవి అంశతో, సీతా మాతగా ప్రోత్సహించి, "బాల కాండ మందర మకరందం" రాయడానికి తోడ్పడింది. హైదరాబాద్ లో వున్న అందరికంటే పెద్ద మనుమరాలు (పేరు-మిహిర), లక్ష్మీ-సరస్వతుల ఉమ్మడి అంశ, రెండు సార్లుకూడా, త్వరగా పుస్తక రచన పూర్తి చేయాలనేది-కారణం, ఎంత తొందరగా పూర్తి చేస్తే, అంత త్వరగా, దాని దగ్గరకు మేం వస్తామని. అందుకే, నాకు ఈ ముగ్గురంటే ఇష్టం. అంతే ఇష్టం, మా మనుమలు యష్విన్, అన్ష్ అన్నా కూడా.

వాల్మీకి సంస్కృత రామాయణాన్ని, యథా వాల్మీకంగా పూర్వ కాండలతో సహా ఉత్తర కాండనుకూడా తెనిగించిన ఏకైక మహానుభావుడు ఆంధ్ర వాల్మీకి-కవి సార్వభౌమ వావిలికొలను సుబ్బరావు(వాసు దాసు) గారు. ఆయన సొంత-స్వతంత్ర రచన అనిపించుకున్న శ్రీమదాంధ్ర వాల్మీకి రామాయణం మందరాలన్నీ, తెలుగునేల నాలుగుచెరగులా విశేష ప్రాచుర్యాన్ని ఏనాడో-ఐదారు దశాబ్దాల క్రితమే సంతరించుకున్నాయి. దురదృష్టవశాత్తు, కాలక్రమంలో, అవన్నీ మరుగున పడిపోతున్నాయేమోనన్న భయం-ఆందోళన నా లాంటి కొందరికి కలిగింది. ఆ అలోచనతో, వాసు దాసుగారి మందరాలన్నీ, "మందర మకరందాలు" గా, ఆయనే వక్తగా, నేను కేవలం అను వక్త-వాచవిగా, సరళమైన వాడుక భాషలో-సాధ్యమైనంత లఘు కృతిలో అందించుదామని తొలి ప్రయత్నంగా "సుందర కాండ మందర మకరందం" రాసి, మలి ప్రయత్నంగా "బాల కాండ మందర మకరందం" రాయడం

ఆరంభించాను. రామానుగ్రహంవల్ల "సుందరకాండ మందర మకరందాని" కి పెద్దల అనుగ్రహం లభించి రెండో ముద్రణకు కూడా నోచుకుంది. ఆ పుస్తకం చదివిన పలువురి ఆశీర్వచనాలను–ఆదరాభిమానాలను అనునిత్యం పొందడం నా అదృష్టంగా భావిస్తున్నాను. ఆ పెద్దల ఆశీర్వచనం, రాముడి అనుగ్రహం లభించి, "బాల కాండ మందర మకరందం" రాయడం కూడా పూర్తి చేయగలిగాను. ఇప్పుడు అయోధ్య కాండ రాశాను.

ప్రాతఃస్మరణీయుడి ఆణిముత్యాలు: ఇక్కడొక విషయం చెప్పాలి. 1909 వ సంవత్సరంలో నాటి చెన్నపురి (నేటి చెన్నై) లోని "శ్రీ వైజయంతీ ముద్రాశాల" లో ముద్రించబడి, ఒక అజ్ఞాత మహానుభావుడి ద్వారా "కాలిఫోర్నియా (అమెరికా) విశ్వవిద్యాలయం" కు చెందిన "బర్క్ లీ" గ్రంథాలయం చేరుకుని, "గూగుల్ సంస్థ" డిజిటలైజ్ చేసినందువల్ల నాకంట పడిన వాసు దాసు గారి అలనాటి "శ్రీ మదాంధ్ర వాల్మీకి రామాయణం" మొదటి సంపుటి నుంచి సేకరించిన విషయాలను "మందర మకరందం"లో పొందుపరుస్తున్నాను. అపురూపమైన అలనాటి గ్రంథకర్త అభిప్రాయాలు అక్షర లక్షలు చేసే ఆణిముత్యాలు. తెర మరుగవుతున్న వందేళ్లనాటి అపురూపమైన తెలుగు సాహిత్యంలోని అత్యంత ఆదరణీయమైన వాసు దాసుగారి అలనాటి "నిర్వచన రామాయణం" లోని నాలుగు (బాల, అయోధ్య, అరణ్య, కిష్కింధ) కాండలతో పాటు, ఆయన ఎందుకు–ఎలా వాల్మీకి రామాయణం చదివింది, ఎలా రాసింది, ఎలా అంకితం ఇచ్చింది లాంటి విషయాలనేకం వున్నాయందులో. గూగుల్ సంస్థ కృషిని అభినందించాలి. ఆ సంస్థలో మా అబ్బాయి ఆదిత్య ఉన్నత హోదాలో పనిచేయడం నిజంగా మాకు గర్వ కారణం.

చిలకపాటివారు "సుందర కాండ మందర మకరందం" పుస్తకానికి రాసిన "మంగళ తోరణం"లో, మిగిలిన కాండలను కూడా అదే రీతిలో రాయగల శక్తి–సమయ–సామర్థ్యాలను నాకనుగ్రహించాలని ఆశిస్తున్నానన్నారు. బహుశా ఆయన ఆశ, నా ఆశయం ఈ విధంగా నెరవేరుతున్నదేమో. వాస్తవానికి "బాలకాండ మందర మకరందం" రాయడానికి ప్రేరణ–ప్రోత్సాహం లభించింది మాత్రం "దర్శనమ్" ఆధ్యాత్మిక మాసపత్రిక సంపాదకుడి గారి వలనే అనాలి. అప్పట్లో ఆ పత్రికను ప్రతినెలా ప్రచురించడానికి తన వంతు సహకారాన్ని అందిస్తున్న సీనియర్ పాత్రికేయుడు శ్రీ బీ.ఎస్.రామకృష్ణ ప్రోద్భలంతోనే బాల కాండను నెల నెలా దర్శనమ్ పత్రికకు రాసేవాడిని. ఇప్పుడు అయోధ్య కాండను రాస్తున్నాను. "రామాయణం రసరమ్యం" అన్న శీర్షిక కింద దాన్ని వారు ప్రచురిస్తున్నారు. బహుశా వారి ప్రోద్భలం లేకపోతే నేను అంత తొందరగా ఇది రాయడానికి పూనుకోక పోయేవాడినేమో.

"రామాయణం రసరమ్యం... ... ... రామనామం సదాస్మరణీయం... ... ... రామాయణం రసరమ్య కావ్యం. అష్టాక్షరీ మంత్రంలోని –రా– శబ్దం, పంచాక్షరీ

మంత్రంలోని –మ– శబ్దం కలిపి వశిష్ట మహర్షి ఏ పుణ్య ముహూర్తంలో దశరథ తనయుడికి –రామ–నామాన్ని ఖరారు చేశారో కాని, యుగయుగాలకు, రామనామం తారక మంత్రమైంది–అజరామరమైంది. రామాయణాన్ని ఎన్నిసార్లు చదివినా–విన్నా తనివి తీరదు. ఆదర్శ పురుషుడైన రాముడి చరితాన్ని రామాయణ కావ్యంగా వాల్మీకి మహర్షి అనుగ్రహించారు. ఎందరో మహానుభావులు రామాయణాన్ని భక్తజన కోటి ముందుంచారు. ఎన్నో ప్రపంచ భాషల్లో విరాజిల్లుతున్న రామాయణం నిత్య పారాయణ గ్రంథమైంది" అని అంటూ, రామాయణ మాధుర్యాన్ని దర్శనమ్ ఆధ్యాత్మిక మాసపత్రిక పాఠకులకు అందించి, రామ సేవకు అంకితమవ్వాలని, ఆ పత్రిక సంపాదకులు, సీనియర్ పాత్రికేయులు శ్రీ. బీ.ఎస్. రామకృష్ణ గారి ద్వారా నాకు తెలియచేసి, నన్ను ప్రోత్సహించి ఆ పని నాకప్పగించారు. డిసెంబర్ 2005 సంచికనుండి బాల కాండను ప్రతి నెలా రాయడం ఆరంభించాను. రాసి పూర్తి చేశాను.

పరమ భాగవతోత్తములు, ఋషితుల్యులు, ఆంధ్ర వాల్మీకిగా–కవి సార్వభౌమగా ప్రసిద్ధికెక్కిన వాసు దాసుగారి (వావిలికొలను సుబ్బారావు గారు) విరచిత శ్రీమదాంధ్ర వాల్మీకి రామాయణం–బాలకాండ మందర మకరందంగా, ఆయనే వక్తగా, నేను కేవలం అను వక్త–వాచవిగా 'దర్శనమ్' ఆధ్యాత్మిక వార్తా మాసపత్రిక ద్వారా అందించిన దాన్నే పుస్తక రూపంగా అందించాను. ఇప్పుడు అయోధ్యాకాండ కూడా పూర్తి చేసాను. అదే ఈ పుస్తకం. ఈ సందర్భంగా 'దర్శనమ్' ఆధ్యాత్మిక మాసపత్రిక చేస్తున్న కృషి అభినందనీయం.

ముందు మిగతా కాండలను కూడా మందర మకరందాలుగా మల్చాలని నా కోరిక– భగవదనుగ్రహం వల్ల అది నెరవేరుతుందని ఆశ.


మా నాన్న వనం శ్రీనివాసరావు గారు ఇప్పుడు జీవించి వుంటే బహుశా ఆయన కంటే ఈ విషయంలో సంతోషించే వారెవరూ వుండరనుకుంటా ! ఆయన బ్రతికున్నప్పుడు నేనెట్లా వుండాలని ఆయన కోరుకున్నాడో అలా కొంతవరకు వున్నాననడానికి ఇంతకుముందు రాసిన సుందర కాండ మందర మకరందం, ఇప్పటి ఈ బాల కాండ మందర మకరందం ఒక నిదర్శనం.

నన్నింత వాడిని చేసిన నా తండ్రి–తల్లి, వనం శ్రీనివాసరావు గారికీ–సుశీలమ్మ గారికీ, వారి ద్వారా ముత్తవరం శ్రీసీతారామచంద్ర స్వామి వారికీ ఈ పుస్తకం అంకితం చేస్తున్నాను.

వనం జ్వాలా నరసింహారావు

❖ ❖ ❖

అంకితం



నాన్న–అమ్మ

స్వర్గీయ వనం శ్రీనివాసరావుగారు – వనం సుశీలగారు

(ఆగస్ట్ 14, 1982న తీసిన ఫొటో)

ఆంధ్ర వాల్మీకి-కవి సార్వభౌమ-వాసుదాసస్వామి

శ్రీ వావిలి కొలను సుబ్బరావు



శ్రీ రామాయణం క్షీర ధార. వాసుదాసుగారి శ్రీ మదాంధ్ర వాల్మీకి రామాయణం, మందరాలన్నీ, మందార మకరంద మాధుర్యాలే. కవికులగురువు కాళిదాసు అన్నట్లు. "చరిత్ర మా రాముడిది. రచన సాక్షాత్తు వాల్మీకుల వారిది. గానం చేసినవారు కిన్నెర గాత్రులైన కుశలవులు. ఇంతటి మహనీయమైన రామాయణ కావ్యంలో శ్రోతలను పరవశింప చేయని అంశం అనేదేదీ లేదు.

భగవద్గీత, శ్రీ విష్ణుసహస్రనామ స్తోత్రం, శ్రీ రామాయణం భారతీయ సంస్కృతీ రూపాలు. సనాతన ధర్మ ప్రతిపాదకాలు. వీటి మౌలిక తత్వాలు ధర్మ-జ్ఞానాలు. ఈ రెండింటినీ వాచ్య-వ్యంగార్థాలతో శ్రీ మద్రామాయణం ఆవిష్కరిస్తోంది. వాల్మీకి ఆదికవి. రామాయణం ఆదికావ్యం. ఇది ధ్వని-అర్థ ప్రతిపాదిత మహా మంత్రపూతం. గాయత్రీ బీజసంయుతం. ఔపనిషతత్వసారం. స్మరణ-పారాయణ మాత్రంగా అంతఃకరణ శుద్ధి అవుతుంది.

వాల్మీకి రామాయణాన్ని యథావాల్మీకంగా, పూర్వకాండలతో సహా ఉత్తర కాండను కూడా కలిపి తెనిగించిన ఏకైక మహాకవి కీర్తి శేషులు వావిలికొలను సుబ్బారావు (వాసుదాసు) గారు. ఆ మహానుభావుడి ఆంధ్ర వాల్మీకి రామాయణం మందరాలన్నీ, తెలుగునేల నాలుగు చెరగులా విశేష ప్రాచుర్యాన్ని ఏనాడో సంతరించుకున్నాయి. కానీ, కాలక్రమంలో అవన్నీ మరుగున పడిపోతున్నాయి. రామాయణానికి రచయిత ఒక్కడే. వాల్మీకి మహర్షి తప్ప ఇతరులెవరికీ రామాయణం రచయిత అని చెప్పుకునే హక్కులేదనే అనాలి. వాసుదాసుగారు కూడా వ్యాఖ్యాతననే అంటారు తన ఆంధ్ర వాల్మీకి రామాయణానికి.

వాల్మీకి రామాయణ క్షీరసాగర మథనాన్ని చేసి "మందర" మకరందాలనూ, రమా రామ పారమ్య పీయూషాలనూ, నాలుగు చెరగులా పంచి, ఆ మథనంలో ఆవిర్భవించిన శ్రీ సీతారాముల తత్వాన్ని, వేద వేదాంగేతిహాస స్మృతి శ్రుతి శుభంగా అన్వయించి, ఆంధ్రుల హృదయ కేదారాలను ప్రఫుల్లంచేసిన పరమ భాగవతోత్తములు "ఆంధ్ర వాల్మీకి" వాసుదాస స్వామి. "రామ భక్తి సామ్రాజ్యం యే మానవుల కబ్బెనో మనసా! ఆ మానవుల సందర్శనం అత్యంత బ్రహ్మానందమే" అన్న త్యాగరాజస్వామి వారి కీర్తనకు సాకార దివ్య స్వరూపులు వాసుదాస స్వామి. ఆంధ్ర వాల్మీకి వాసుదాస స్వామి అవతరించి వున్న కాలంలో, వారి దర్శన-అనుగ్రహ భాషణా సౌభాగ్యమబ్బిన వారు, "శ్రీ మద్రామాయణం-మందరం" పారాయణ పరులై, తమ పరంపరకు శ్రీ వాసుదాస స్వామి గారి దివ్య స్మృతులను అందించి తరించారు. వాల్మీకి సంస్కృత రామాయణాన్ని అందరికంటే మొట్ట మొదలు ఆంధ్రీకరించి, పదే-పదే రామాయణ పఠన పాఠన శ్రవణాదుల పట్ల ఆంధ్రులకు అత్యుత్సాహాన్ని కలిగించి, "రామ భక్తి సామ్రాజ్యం" అంటే, ఆంధ్ర దేశమే సుమా, అనిపించిన నిరుపమ రామ భక్తులు వాసుదాస స్వామివారు.

ఇరవైనాలుగు గాయత్రీ మంత్రాక్షరాలలో నిబంధించబడిన మంత్ర మంజూష వాల్మీకి మహర్షి రచించిన శ్రీమద్రామాయణం. మహా మహానుభావులూ, మహా విద్వాంసులూ కీర్తిశేషులు శ్రీమాన్ వావిలికొలను సుబ్బారావు (వాసుదాసు) గారు, వాల్మీకి రామాయణాన్ని యథాతథంగా మంత్రమయం చేస్తూ, ఛందో యతులను ఆయా స్థానాలలో నిలిపి, వాల్మీకాన్ని తెనిగించారు. వాల్మీకి రామాయణానికి తుల్యమైన స్థాయినీ-పారమ్యాన్నీ, తొలుత నిర్వచనంగా ఆంధ్ర వాల్మీకి రామాయణానికి అందించి, తదనంతరం, "మందరం" అని దానికి విశేష ప్రాచుర్యాన్ని కలిగించారు. ఆంధ్ర పాఠక లోకం మందరాన్ని అపారంగా అభిమానించింది-ఆదరించింది.

వాసుదాసుగారి కీర్తికి ఆలవాలమైంది ఆంధ్ర వాల్మీకి రామాయణం. ఆంధ్ర భాషలో అంతకుముందు రామాయణానికి యథా మూలాలు లేవని, అర్థ పూర్తి

కలిగి, కావ్య-ఇతిహాస గౌరవపాత్రమై, సర్వజన పఠనీయమై, ప్రామాణికమై, మూలానుసరమైన రామాయణం తెలుగులో వుండడం లోకోపకారంగా భావించి, రచించించారీ గ్రంథాన్ని వాసుదాసుగారు. ఎనిమిదేళ్లలో రామాయణాన్ని తొలుత నిర్వచనంగా ఆంధ్రీకరించి, అలనాటి కడప మండలంలోని ఒంటిమిట్ట కోదండ రామస్వామికి అంకితం చేసారు . ఆయన రచించిన నిర్వచన రామాయణం, ఆయన జీవిత కాలంలోనే, నాలుగైదు సార్లు ముద్రించబడింది. ఆంధ్ర వాల్మీకి రామాయణం బాల కాండలో, తన స్వవిషయం గురించి ప్రస్తావిస్తూ వాసుదాసుగారు, సంస్కృత రామాయణాన్ని శ్రీరామచంద్రుడి కుమారులైన కుశ-లవులు లోకానికి ప్రకటించినట్లే, తనకూ ఆయన కుమారుడిగా, అలాంటి అధికారం వుందని, అయితే సంకల్పించడం మాత్రమే తన వంతని-నిర్వహించడం శ్రీరాముడి వంతని, పూర్తిచేయించే భారం ఆయన భుజాలపైనే వేస్తున్నానని, ఆయన వలదన్నా వదలనని చెప్పుకుంటారు.

వాసుదాసుగారు రచించిన ఆంధ్ర వాల్మీకి రామాయణానికి తెలుగులో సరైన వ్యాఖ్యానముంటే, సంస్కృతం రానివారికి చక్కగా అర్థమవుతుందని మిత్రులంటారు ఆయనతో. మూల గ్రంథం రాయడంకంటే వ్యాఖ్యానం రాయడం కష్టమనుకుంటా రాయన మొదట్లో. బాగా ఆలోచించిన తర్వాత, (శ్రీ మదాంధ్ర వాల్మీకి రామాయణం) "మందరం" పేరుతో గొప్ప వ్యాఖ్యానం రాసారు వాసుదాసుగారు. వాస్తవానికి అదొక గొప్ప ఉద్గ్రంథం. సరికొత్త విజ్ఞాన సర్వస్వం."మందరం"అంటే, క్షీరసాగరాన్ని మథించడంలో కవ్వంగా ఉపయోగించిన మందర పర్వతమే గుర్తుకొస్తుంది సాధారణంగా ఎవరికైనా. కాని, వాసుదాసుగారి శ్రీపాద సంబంధులకు మాత్రం, "మందరం" అంటే, మొదట గుర్తుకొచ్చేది, ఆంధ్ర వాల్మీకి రామాయణం మందరమే. వాల్మీకి విరచితమైన రామాయణాన్ని శ్రీవారు, "క్షీరవారాసి" గా సంభావించి, దానిని మధించిన తమ "మేథ" అందించిన మకరందాలను-మధురిమలను, ముచ్చటగా "మందరం" అని పేర్కొన్నారు. సహృదయ నైవేద్యంగా-అనుభవైక వేద్యంగా వచ్చిన రచనలకు అసాధ్యంగా-నిగమ గోచరంగా భావించబడిన రామాయణానికి "మందరం" అని నామకరణం చేయడంలో తను కొంతవరకే న్యాయం చేయగలిగానని అంటారాయన. ఇందులోంచి చిలికిన కొద్దీ ఎన్నో దివ్య రసాయనాలు ఉద్భవిస్తాయని, భావితరాలవారు ఇందుకు పూనుకోవాలని కూడా సూచించారు వాసుదాసుగారు.

తను రచించిన నిర్వచన రామాయణంలో సంస్కృత రామాయణంలో వున్న ప్రతి శ్లోకానికొక పద్యం వంతున రాసారు వాసుదాసుగారు. మందరంలో తను రాసిన ప్రతి పద్యానికి, ప్రతి పదార్థ తాత్పర్యం సమకూర్చారు. ఒక్కో పదానికున్న వివిధార్థాలను విశదీకరించారు. భావాన్ని వివరణాత్మకంగా విపులీకరించారు. ఆయన మందరాలలోని శ్రీరామాయణ వ్యాఖ్యానంలో "జ్ఞాన పిపాసి" కి విజ్ఞాన సర్వస్వం

దర్శనమిస్తుంది. ఇక ఆయన రాసిన నిర్వచన రామాయణంలో సాధారణంగా అందరూ రాసే చంపక మాలలు, ఉత్పల మాలలు, సీస–ఆటవెలది–తేటగీతి–కంద–శార్దూలాలు, మత్తేభాలు మాత్రమే కాకుండా, తెలుగు ఛందస్సులో వుండే వృత్తాలన్నిటినీ, సందర్భోచితంగా ప్రయోగించారు. వాటిలో, "మత్తకోకిలము" , "పంచ చామరం", "కవిరాజ విరాజితము", "తరలము" , "ప్రహరణకలిత", "సుగంధి" , "ఉత్సాహం", "మనోహరిణి", "వనమయూరము", "తోటకము" , "మానిని" , "ఇంద్రవంశము", "లయగ్రాహి" , "తోదకము", "మాలిని", "కలితాంతము", "మధురగతిరగడ", "వనమంజరి", "కమల విలసితము", "వసంతమంజరి", "మంజుభాషిణి", "స్రగ్ధర", "వసంతతిలక", "మాలి", "కరిబృంహితము", "చారుమతి", "వృషభగతిరగడ", "స్రగ్విని", "మనోరంజని", "తామరసం", "పద్మనాభ వృత్తం", "అంబురుహ వృత్తం", "మందాక్రాంత" లాంటి వెన్నో వున్నాయి. ద్విపదలూ వున్నాయి. దండకం కూడా వుందో సందర్భంలో. ఎక్కడ ఎందుకు ఏ విధంగా ఛందో యతులను ఉపయోగించారో కూడా వివరించారు. వీటికి తోడు అనేక వ్యాకరణ విషయాలను అవసరమైన ప్రతి చోటా పాఠకులకు అర్థమయ్యే రీతిలో విపులంగా తెలియచేశారు.

వాసుదాసుగారి ఆంధ్ర వాల్మీకంలోని ప్రతి కాండకొక ప్రత్యేకతుంది. ప్రతికాండ ఒక్కోరకమైన విజ్ఞానసర్వస్వం. ప్రతి కాండలోని, ప్రతి పద్యానికి, ప్రతి పదార్థం ఇస్తూ, చివరకు తాత్పర్యం రాస్తూ, అవసరమైన చోట నిగూఢార్థాలను–అంతరార్థాలను–ఉపమానాలను ఉటంకిస్తూ, సాధ్యమైనంత వరకు ఇతర గ్రంథాల్లోని తత్సంబంధమైన అంశాలను పేర్కొంటారు కవి. ప్రత్యుత్తరం కోరి చదవాల్సిన విషయాలన్నింటికీ సోదాహరణంగా జవాబిస్తారు. శ్రద్ధగా చదువుకుంటూ పోతే–అర్థం చేసుకునే ప్రయత్నం చేసుకుంటూ చదువగలిగితే, ప్రతి కాండలో ఆ కాండ కథా వృత్తాంతమే కాకుండా, సకల శాస్త్రాల సంగమం దర్శనమిస్తుంది. ఒక సారి ధర్మశాస్త్రం లాగా, ఇంకో సారి రాజనీతి శాస్త్రం లాగా, మరో చోట ఇంకో శాస్త్రం లాగా బోధపడుతుంది. ప్రతికాండ ఒక భూగోళ శాస్త్రం–ఖగోళ శాస్త్రం–సాంఘిక, సామాజిక, ఆర్థిక, సామాన్య, నీతి, సంఖ్యా, సాముద్రిక, కామ, రతి, స్వప్న, పురా తత్వ శాస్త్రం లాగా దర్శనమిస్తుంది. బహుశా, క్షుణ్ణంగా చదివితే, ఇంకెన్నో రకమైన శాస్త్ర విషయాలు గోచరిస్తాయి. అసలు–సిసలైన పరిశోధకులంటూ వుంటే, మందరం ఏ ఒక్క కాండ మీద పరిశోధన చేసినా, ఒకటి కాదు–వంద పీహెచ్‌డీలకు సరిపోయే విషయ సంపద లభ్యమవుతుంది. డాక్టరేట్ తో పాటు, అద్భుతమైన రహస్యాలు అవగతమౌతాయి. పాదరసం నుండి బంగారం చేసే రహస్యమైన విషయాలలాంటి అనేకమైనవి తెలుసుకోవచ్చు, పరిశోధనా దృక్పథంతో చదివితే. ప్రతి కాండ చివర వాసుదాసుగారు రాసిన ఆఖరు పద్యంలో, ఆ కాండలో వున్న మొత్తం పద్యాలెన్నో తెలియచేసే పంక్తులుంటాయి.

ఆంధ్ర వాల్మీకిరామాయణం రాయడానికి ప్రేరణ-స్ఫూర్తి, భాగవత గ్రంథకర్త బమ్మెర పోతన సంకల్పం ద్వారానే తనకు లభించిందంటారు వాసుదాసుగారు. పోతనను కరుణించిన శ్రీరామచంద్రమూర్తి, ఆయనతో భాగవతాన్ని తెనిగింపచేసి భవ బంధ విముక్తుడిని చేసాడని, అందుకే, పలుకుపలుకులో తేనెలొలికించి, వ్యాస భాగవతాన్ని మరిపించగలిగాడని వాసుదాసుగారి అభిప్రాయం. ఆ విధంగానే, శ్రీరాముడి కరుణ తనపైన కూడా ప్రసరించిందని వాసుదాసుగారు భావించి వుండాలి. తద్రూపమే ఆంధ్ర వాల్మీకం. వాల్మీకాన్ని ఆమూలాగ్రంగా పరిశోధించిన పరమ భాగవతోత్తముడు వాసుదాసస్వామి. 108సార్లు వాల్మీకి సంస్కృత రామాయణాన్ని పఠించి-పారాయణం చేసి, పట్టాభిషేకాలు, సామ్రాజ్య పట్టాభిషేకం నిర్వహించిన ఏకైక మహానుభావుడు వాసుదాసస్వామి.

తనకంటే ముందు కాలం నాటి పూర్వ కవులెవరు, రామాయణాన్ని (పూర్వ కాండలు, ఉత్తరకాండ కలిపి) సంపూర్ణంగా తెనిగించలేదని గ్రహించిన వాసుదాసుగారు, అన్ని కాండలను తెనిగించి, విశేషించి తెలుగు పాఠక లోకానికి ఆవిష్కరించాలని సంకల్పించుకున్నారు. "వాల్మీకిరామాయణాన్ని సమగ్రంగా, యథామూలంగా పలికినవారు పూర్వ కవులందూ-నేటి (ఆయన కాలం నాటి) కవులందూ లేరు. నేటి (ఆయన కాలం నాటి) రామాయణాలలో మూలానుసరణంగా వుంది, సమగ్రం కాదు. సమగ్రమయింది మూలాను సరణం కాదు. తమ అభిప్రాయాలను, ఇతరుల అభిప్రాయాలను మూలంగా చేర్చిపెడితే, అది వాల్మీకి పలికిందెలా అవుతుంది?" అని ప్రశ్నించాడు వాసుదాసుగారు.

భగవత్ చరిత్రలెన్నో వుండగా రామాయణ రచనకే ఎందుకు పూనుకున్నావని అడిగినవారికి తనదైన శైలిలో జవాబిచ్చారు వాసుదాసుగారు. జనన-మరణ రూపకమైన సంసార బంధం నుండి విముక్తి చేసేది రామ కథేనని, భగవత్ సాయుజ్యం పొందేందుకు రామాయణ రచన చేసానని అంటారాయన. పూర్వం కొందరు రాసారుకదా, మరల ఎందుకు రాస్తున్నావంటే, "ఎవరి పుణ్యం వారిదే. ఒకరి పుణ్యం మరొకరిని రక్షించదు" అని జవాబిస్తూ, శ్రీరాముడి అనుగ్రహం కొరకు రామాయణాన్ని రచించి వాగ్రూపకైంకర్యం చేయదల్చానంటారు వాసుదాసుగారు. భారద్వాజ గోత్రీకుడు, ఆపస్తంబ సూత్రుడు, గోల్కొండ వ్యాపారి శాఖీయుడయిన వావిలికొలను సుబ్బరావుగారు, కడప జిల్లా-జమ్మలమడుగులో 1863లో జన్మించి 1939లో పరమపదించారు. ఎఫ్.ఎ చదువు పూర్తిచేసి, పొద్దుటూరు తాలూకా కార్యాలయంలో చిరుద్యోగిగా చేరి, రెవెన్యూ ఇన్స్పెక్టర్ హోదాకెదిగారు. ఆ విధంగా 1893-1904 మధ్య కాలంలో పదకొండేళ్లు రెవెన్యూ శాఖలో ఉద్యోగం చేసారు మొదట్లో. కందుకూరి వీరేశలింగం పంతులు గారి తర్వాత, మద్రాస్ (నేటి చెన్నై)

ప్రెసిడెన్సీ కళాశాలలో ఆంధ్ర పండితులుగా 1904-1920 మధ్య కాలంలో పనిచేసారు. వాసుదాసుగారి తర్వాత ఆ పదవిని అలంకరించింది అక్కిరాజు ఉమాకాంతం గారు. కళాశాలలో చేరక ముందే, పినతండ్రి మీద తనకున్న కృతజ్ఞతకు గుర్తుగా, "శ్రీ కుమారాభ్యుదయం" అనే ప్రబంధ గ్రంథాన్ని రచించి, ఆయనకు అంకితమిచ్చి శాశ్వత స్వర్గ సుఖాన్ని కలిగించారాయనకు. ఆయన రచించిన ఆ ప్రబంధం, నాటి కవి పండితులను ఆశ్చర్య పరిచింది. ఆయన ప్రతిభకది తొలి హారం.

ఆంధ్ర పండితుడిగా పనిచేస్తున్న రోజుల్లోనే, భార్యా వియోగం కలగడంతో, వాసుదాసుగారు భక్తి-యోగ మార్గం పట్టారు. జీర్ణదశలో వున్న ఒంటిమిట్ట రామాలయాన్ని సముద్ధరించాలన్న సంకల్పంతో, బిక్షాటనచేసి లభించిన ధనంతో ఆలయాన్ని అభివృద్ధి చేసారు. ఆంధ్ర వాల్మీకి రచనాకాలం 1900-1908 మధ్య కాలంలో గాయత్రీ మంత్రం, రామ షడక్షరమంత్రం మూలంలో వున్నట్లే, అనువాదంలో కూడా నిక్షిప్తం చేసారాయన. వాల్మీకంలో వున్న బీజాక్షరాలన్నీ, ఇందులోనూ యథాస్థానంలో చేర్చబడ్డాయి. విడిగా వాసుదాసుగారు, గాయత్రీ రామాయణం, శ్రీరామనుతి కూడా రాసారు. ఆంధ్ర వాల్మీకం అనువాదమైనా, స్వంత రచన-స్వతంత్ర రచన అనిపించుకుంది.

వావిలికొలను సుబ్బరావుగా పండిత పదవీ విరమణ చేసిన అనంతరం, తన జీవితమంతా, భక్తి మార్గంలోనే గడిపారు. ఈ నాటికీ క్రమం తప్పకుండా గుంటూరు జిల్లా తెనాలి దగ్గరున్న అంగలకుదురు నుంచి ప్రచురించబడుతున్న "భక్తి సంజీవని" అనే భక్తి-జ్ఞాన-కర్మ యోగాలను తెలిపే ఆధ్యాత్మిక మాసపత్రిక సంస్థాపక సంపాదకులుగా-వాసుదాసుగా-ఆంధ్ర వాల్మీకిగా-కవి సార్వభౌమగా ప్రసిద్ధికెక్కారు. అంగలకుదురులోని శ్రీ కోదండ రామ సేవక ధర్మ సమాజం స్థాపించింది ఆయనే. కడప జిల్లాలోని ఒంటిమిట్ట కోదండ రామస్వామి ఆలయాన్ని పునరుద్ధరించి, ఈ నాటికీ దర్శనీయమైన రీతిలో శాశ్వత కైంకర్యం చేసిన వాసుదాసుగారు, వాఙ్మయ ప్రపంచంలోని భక్త కవులలో తనకంటూ ఒక స్థానాన్ని సంపాదించుకున్నారు."సత్కవి మిత్రుడను" అని చెప్పుకున్న ఆయనకు, తిరుపతి వేంకటకవులు, కొక్కొండ వేంకట రత్నం పంతులు, వేదం వేంకటరాయ శాస్త్రులు మొదలైన ప్రసిద్ధ కవులందరూ స్నేహితులే.

వాసుదాసుగారు "కౌసల్యా పరిణయం" అనే ప్రబంధం, "సుభద్రా విజయం" అనే నాటకంతో పాటు, "హిత చర్యలు", "ఆధునిక వచనరచనా విమర్శనం", "పోతన నికేతన చర్చ", "పోతరాజు విజయం", "రామాశ్వమేధం", ఆంధ్రవిజయం" కూడా రాసారు." ఆర్యకథానిధులు" అన్న పేరుతో ఆయన రాసిన సులభ వచన గ్రంథాలు తెలుగువారందరికి అత్యంత ఆదరణీయమైనాయి. "సులభ వ్యాకరణం"

తెలుగు వ్యాకరణాన్ని నిజంగానే సులభం చేసింది. ఆయన రచించిన "కృష్ణావతార తత్త్వం" ప్రశస్త కృతి పాండిత్యంతో, ఆధ్యాత్మిక భావనతో, పాఠకులలో ఆంధ్ర భాషాభిమానాన్ని ఉద్దీపించచేసి–తాను తరించి, ఇతరులను తరింపచేసిన ధన్యాత్ముడు, మహామనీషి వావిలికొలను సుబ్బారావుగారు.

ఆంధ్ర వాల్మీకిరామాయణం తర్వాత రచించబడిన పలు గద్య–పద్య రామాయణాలకు విశేష ప్రాచుర్యం లభించినా, ఆ రోజుల్లోనూ–ఈ రోజుల్లోనూ, వాసుదాసుగారి రామాయణానికి ప్రాచుర్యం లభించినా తగినంత గుర్తింపు ఎందుకు లభించలేదనేది జవాబు దొరకని ప్రశ్న. "ఆదికవి–ఆంధ్ర వాల్మీకి", యథాతథంగా మంత్రమయం చేస్తూ, ఛందోయతులను ఆయా స్థానాలలో నిలిపి తెనిగించిన వాల్మీకానికి రావాల్సినంత మోతాదులో, ఎందుకు గుర్తింపు రాలేదు? వ్యాస మహాభారతాన్ని మొదట తెనిగించిన నన్నయను "ఆదికవి" గా పిలిచినప్పుడు, వాల్మీకి రామాయణాన్ని యథావాల్మీకంగా పూర్వ కాండలతో కలిపి ఉత్తర కాండను కూడా మొట్టమొదట తెనిగించిన వాసుదాసుగారు కూడా "ఆదికవే" కదా? నన్నయంతటి గొప్పవాడే కదా. వాస్తవానికి సరైన పోషకుడో–ప్రాయోజకుడో వుండి వుంటే, వాసుదాసుగారి ఆంధ్రవాల్మీకి రామాయణం, ఎప్పుడో–ఏనాడో నోబెల్ సాహిత్య బహుమతికో, జ్ఞానపీఠ పురస్కారానికో నోచుకుని వుండేది. ఏ మాత్రం మన తెలుగువారు ప్రయత్నం చేసినా, ఆ మహానుభావుడికి భారతరత్న–జ్ఞానపీఠ ఆవార్డులతో పాటు నొబెల్ బహుమానం వచ్చేది. ఇప్పటికైనా ఆ ప్రయత్నం చేస్తే మంచిదేమో.

వాసుదాసుగారు ఆంధ్ర వాల్మీకిగా లబ్ధ ప్రతిష్ఠులయ్యారు. మహనీయమైన "మందర" రామాయణాన్ని అనేకానేక విశేషాలతో, పద్య–గద్య–ప్రతి పదార్థ–తాత్పర్య–ఛందోలంకార విశేష సముచ్ఛయంతో, నిర్మించి, వేలాది పుటలలో మనకందించారు. రామాయణ క్షీర సాగరాన్ని "మందరం" మథించి, మనకందరికీ ఆప్యాయంగా అందించింది. అయితే, దానిని ఆస్వాదించే తీరికా–ఓపికా లేని జీవులమైపోయాం మనం. భాష, శైలి, అర్థం, తాత్పర్యం కాలక్రమంలో పరిణామం చెందుతున్నాయి. "సూక్ష్మంలో మోక్షం" కావాలంటున్నారు నేటి తరం పఠితులూ, పండితులూ.

కాలం గడిచిపోతున్నది. వాసుదారుగారు మారిపోతున్న తరాలకు గుర్తురావడం కూడా కష్ఠమైపోతున్నది. వారి "ఆర్యకథానిధుల"తోనూ, "హితచర్యల" పరంపరలతోనూ, పరవశించిపోయిన ఆనాటి తెలుగు పాఠక మహనీయులు క్రమంగా తెరమరుగవుతున్నారు. మళ్లీ–మళ్లీ జ్ఞాపకం చేసుకోవాల్సిన, మరువలేని మహనీయుడు, ప్రాతఃస్మరణీయుడు వాసుదాసస్వామి.

❖ ❖ ❖

అయోధ్యాకాండ

వ్యాఖ్యానారంభం

సర్గ-1

శత్రుఘ్నుడితో తన మేనమామ ఇంటికి పోయిన భరతుడు

అయోధ్యకాండలో, శ్రీరామచంద్రమూర్తిలోని వాత్సల్యాది సుగుణాలైన, స్వామిత్వ, సౌశీల్య, సౌలభ్య, సర్వజ్ఞత్వ, సర్వశక్తిత్వ, సర్వసంకల్పత్వ, పరమకారుణికత్వ, కృతజ్ఞత్వ, స్థిరత్వ, పరిపూర్ణత్వ, పరమోదారత్వాలు వర్ణించడం జరిగింది. ఈ గుణాల లక్షణాలు ఆయనలో ఏ విధంగా అన్వయించుకోవాలో వివరంగా చెప్పడం కూడా జరిగింది. శ్రీరామచంద్రమూర్తిలో వున్న ఈ సకల సద్గుణాలు మనపై ఎలా ప్రయోగించుకోవాలి తెలుసుకోవడం ముఖ్యం. అలాగే శ్రీరాముడి శ్రీ పాదాలను ఆశ్రయించడమంటే, పూలతో పూజించడంతో సమానమని, ఆ విధంగా స్మరణ చేయడమనే దినిండు మనస్సుతో వుండాలని, భావించాలని ఈ కాండలో తెలుసుకోవచ్చు. శ్రీరాముడినే ఎందుకు స్మరించాలని అడుగవచ్చు. దానికీ జవాబు వుంది. మనమందరం స్వప్నం (సొమ్ము) అనీ, ఆయనేమో స్వామి (సొమ్ముకలవాడు) అని, అందువల్ల మనం ఆయన విషయంలో ప్రతికూల తను విడనాడి, అనుకూలమై వుంటే, ఆయన మనల్ని ఇంకా ఎక్కువ ప్రేమతో రక్షించుతాడు. అలాంటప్పుడు, మనం ప్రార్థించకుండానే ఆయనమనల్ని రక్షించు తుంటే, కనీసం కృతజ్ఞతన్నా చూపాలి కదా? జీవులకు-ప్రకృతికి, ధారణ-పోషణలకు ఆయనే కర్త కాబట్టి ఆయన మనకు స్వామి అయ్యాడు.

ఇలా రకరకాలుగా, పూర్వ కాండలో, స్వరూపాన్ని స్థాపించి, ఈ కాండలో స్వభావాన్ని-అంటే, హేయగుణరహితత్వాన్ని, కల్యాణ గుణ సహితత్వాన్ని-తెలియచేయడం జరిగింది. పూర్వకాండలో శ్రీ యోగం, ఈ కాండలో భూ యోగం వివరణ వుంది. అలానే పూర్వ కాండలో పరత్వం, ఈ కాండలో

సౌలభ్యం. ముందు లక్ష్మీ విశిష్టమైన ప్రాప్యస్వరూపం, దీంట్లో ప్రాప్తృ రూప జీవ స్వరూపం తెలియ చేయబడింది. అతి రహస్యమైన, అవశ్యం తెలుసుకోవాల్సిన, భాగవతాభిమాన నిష్ఠ ఈ కాండలో నిరూపించబడింది.

తమ్ముడు శత్రుఘ్నుడిని వెంటబెట్టుకుని భరతుడు తన మేనమామ ఇంటికి వెళ్లాడు. అక్కడ, మేనమామ, భరతుడిని కన్న కుమారుడివలె ప్రేమతో చూసుకొనడంతోపాటు, ప్రతిరోజు బహుమానాలిస్తుండడంతో, తమ్ముడితో సహా వుండగలిగాడు. (కర్మ యోగం, జ్ఞాన యోగం, భక్తి యోగం, ప్రపత్తి, ఆచార్యాభిమానం అనేవి ఐదు రకాల ముఖ్యమైన ముక్తి మార్గాలు. వీటిలో కర్మం కంటే జ్ఞానం, ఆ రెండింటికంటే భక్తి శ్రేష్ఠమైనది. దానికంటే ప్రపత్తి, ఆ ప్రపత్తి కంటే ఆచార్యాభిమానం శ్రేష్ఠమైనవి. ఇదే భాగవత పారతంత్ర్యం. ఇదే పరాకాష్ఠ-చివరి దిక్కు. దీన్ని మించింది లేదని భక్తినిష్ఠుల అభిప్రాయం. భాగవత పరతంత్రులకు భగవంతుడు కూడా తమ ఆచార్యుడికంటే తక్కువవాడే. వారికి రెండోవాడు భగవంతుడు. భాగవత పరతంత్రుడికి భగవంతుడు-భగవత్ సేవ, ఆయన చేస్తున్న భాగవత సేవకు అడ్డుతగులుతే, భగవత్ సేవను వదిలి భాగవత సేవకే ప్రాధాన్యత ఇస్తాడు. శత్రుఘ్నుడు, శ్రీరాముడిని వదిలి భరతుడి వెంట వెళ్లడం అంటే, భాగవతానుగ్రహం కొరకే. అలాంటివారికి భగవదనుగ్రహం దొరకదన్న విచారం వుండనవసరం లేదు). మేనమామ ఇంట్లో వున్న భరత-శత్రుఘ్నులు తమకు లభిస్తున్న సుఖాల ద్వారా సంతోషపడుతున్నప్పటికీ కూడా, తమ సాధువర్తనను మరిచిపోలేదు. తండ్రి ముసలివాడైనందున, రాజ్య భారం వహించలేడని, రామచంద్రుడిని ఇంకా యువరాజుగా చేయలేదేమని, చేసినట్లయితే, ఆయన సేవ చేయడానికి అక్కడ లేకపోయినామే అని ఎప్పుడూ అనుకుంటుండేవారు. ఇక అయోధ్యలో వున్న దశరథుడు, ఇంద్ర-వరుణులతో పోల్చ దగ్గ స్నేహితులైన తన ఇద్దరు కొడుకులు-భరత శత్రుఘ్నులు, తన దగ్గర లేకపోతిరే అని అనుకుంటుండేవాడు. నాలుగు చేతులలో రెండు చేతులు లేకపోతే ఎలా వుంటుందో, అలానే, తన నలుగురు కొడుకులలో, ఇద్దరు లేకపోవడం దశరథుడికి కొరతగా తోచింది.

శ్రీ రామచంద్ర కల్యాణగుణవర్ణన

నలుగురు కుమారులలో, అందరి కంటె గొప్ప మనసున్న-గొప్ప స్వభావం కల-గొప్ప తేజం కల మహాత్ముడు శ్రీ రామచంద్రుడు. బ్రహ్మ దేవుడు ఆయన తోడబుట్టిన భూతములయందు, తన తండ్రి ఐన విష్ణుమూర్తియందు ఏ విధంగా ప్రీతిగలవాడో, అలానే, శ్రీ రామచంద్రమూర్తి ఆయన తండ్రి విషయంలోను, తమ్ముల విషయంలోను ప్రీతి కనబర్చేవాడు. సూర్యుడు ఎల్ల లోకాలకు కనిపించక ముందు ఎలాంటి స్వరూప-స్వభావాలు కలిగుండేవాడో, ఆ స్వరూప-స్వభావాలతోనే మనకిప్పుడు ఎలా కనిపిస్తున్నాడో, ఆ విధంగానే రామచంద్రమూర్తి కూడా తన పరత్వాన్ని విడువకుండా లోకాలకు కనిపిస్తాడు. దేవతలకు అధిపతైన ఇంద్రుడిని చూసి అదితి వికసించిన తరహాలోనే, అమిత తేజస్సుతో ప్రకాశిస్తున్న తన చిన్న కుమారుడైన శ్రీ రాముడిని చూసి కౌసల్యా దేవి శోభించింది. సౌందర్యంలోను, భుజబలంలోను, అసూయ లేకుండా వుండడంలోను, పితృసమానుడైన శ్రీ రామచంద్రుడితో పోల్చదగినవారు ఈ భూమి మీద ఒక్కరు కూడా లేరు. తనపై ఎవరైనా కోపగించుకుని మాట్లాడితే, చిరునవ్వుతో వాడి కోపం పోయేటట్లు మొదట జవాబిచ్చి, ఆ తరువాత, వాడి ఆక్షేపణానికి తగు సమాధానం ఇచ్చే గుణం కలవాడు. తనకెవరైనా, ఏ కొంచెమైనా ఉపకారం చేస్తే, ఆ కాసేపు మాత్రమే కాకుండా, కలకాలం, దానిని గుర్తుంచుకుంటాడు శ్రీ రాముడు. తనకు అపరాధం చేసినవాడిని, క్షమించి రక్షించుటే గొప్పదనమని భావించుతాడు.

జ్ఞాన వృద్ధులైన సజ్జనులు, వయోవృద్ధులైన సజ్జనులు, సదాచార సంపన్నులైన సజ్జనులు, జ్ఞాన శీల వయోవృద్ధులు, శీల జ్ఞాన వృద్ధులు, జ్ఞాన వయోవృద్ధులు, శీల వయోవృద్ధులు, శ్రీ రాముడి దగ్గరకు, ఆయన ఎలాంటి పనిలో నిమగ్నమై వున్నప్పుడు వచ్చినప్పటికీ, విలువిద్య నేర్చుకుంటూ గురి కొట్టడం అభ్యాసం చేసే సమయంలో ఐనప్పటికీ, తనపని తాను చేసుకుంటూనే, వారి సందేహాలను తీర్చే గుణవంతుడు. అలా వచ్చేవాడు శత్రువైనప్పటికీ, తీయని మాటలతో ప్రియంగా మాట్లాడతాడు. తన బలంతో శత్రువులను వెనుతిరిగేట్లు చేయగల సమర్థుడు. వారందరికీ, తాను ఇంకా చేయాలని

అనుకుంటాడు కాని, ఎంతో చేశానని పొగరు పడడు. అసత్యం పలుకడు. రెండు రకాల మాటలను చెప్పే వాడు కాదు. ఇలా ఎన్నో రకాలుగా ప్రజలతో సన్నిహితంగా మెలిగేవాడు శ్రీ రామచంద్రుడు.

పరుల దుఃఖాన్ని తన దుఃఖంగా భావించేవాడు. సామాన్య ధర్మంలోను, విశేష ధర్మంలోను సరిసమానమైన ప్రీతికలవాడు. శరణాగత రక్షణనే తన నియమాన్ని ఎప్పుడూ ఉల్లంఘించలేదు. ధర్మ విరుద్ధమైన కథలను వినడంలో కూడా ఆసక్తి కనబర్చేవాడు కాదు. శ్రీ రామచంద్రమూర్తి యాదితో కాని, వ్యాధితో కాని బాధపడేవాడు కాదు. యుద్ధంలో అసమానుడు. ఇంతటి గొప్ప గుణాలున్న శ్రీ రాముడు జనుల మనస్సును రమింప చేస్తూ, వారందరికీ బహిప్రాణమయ్యాడు. వారందరు రాముడిని విడవలేక, మరిచిపోలేక, ఉపేక్ష చేయకుండా, ఎల్లప్పుడూ, "రామా, రామా" అంటూ స్మరించేవారు.

వ్రతాలను, వేదాధ్యయనాన్ని, పరిపూర్ణంగా చేసి స్నాతకుడైనాడు. వేదాలను అంగాలతో సహా చదివాడు. శస్త్రాస్త్ర ప్రయోగ జ్ఞానంలో తండ్రిని మించిన తనయుడనిపించుకున్నాడు. తండ్రి వంశాన్ని, తల్లి వంశాన్ని, లోకంలో ప్రసిద్ధిపొందేవిధంగా చేశాడు. దోష రహితుడు. ఎలాంటి సంకట సమయంలోను క్షోభ చెందనివాడు. సత్యసంధుడు. ఋజువర్తనుడు. ధర్మార విషయాలు బాగా తెలిసినవాడు. ఎప్పటికప్పుడు వికసించే ప్రజ్ఞకలవాడు. లౌకికాచారాలను, సమయాచారాలను సంస్థాపనములతో ఆచరించగల సమర్థుడు. వినయవంతుడు. మిత్ర సహాయ సంపత్తికలవాడు. తలపెట్టిన కార్యాన్ని సాధించేంతవరకు తన ఆలోచనలను బహిర్గతం చేయకుండా దాచిపెట్టగల నేర్పరి. ఆర్జించే విధానం, వ్యయం చేసే విధానం తెలిసిన బుద్ధిమంతుడు.

శ్రీ రామచంద్రుడికి గురుదేవులయందు దృఢమైన భక్తి, ఆ భక్తిలోను చలనం లేని స్థిర బుద్ధి కలవాడు. పరుష వాక్యాలను నాలుకమీదకు కూడా రానీయడు. చెడ్డవారి విషయంలోను, చెడ్డ పనులలోను ఎంతమాత్రం ఆసక్తి కనబర్చడు. శాస్త్రాధ్యయనంలో, దానికి అనుగుణంగా పనులు చేయడంలో నేర్పరి. తన దోషాలను, ఎదుటివారి దోషాలను కనుక్కొన గలిగే తెలివిమంతుడు. మనుష్యుల ముఖం చూడగానే ఎవరు దుష్టుడో, ఎవరు శిష్టుడో తెలుసు కొనగలిగే

సామర్థ్యం కలవాడు. ధర్మశాస్త్రానికి అనుగుణంగానే మిత్రులను ఎంపిక చేసుకుంటాడు. ఏ పని ఎప్పుడు ఎలా చేయాలో ఆ విధంగానే చేయగల సమర్థుడు. తుమ్మెదలు పూల నుండి తేనెను ఎలా లాగుతాయో అలానే శాస్త్ర పద్ధతిలో సంపాదన, వ్యయం చేయగల నేర్పరి. ఆదాయంలో నాలుగవ భాగమో, మూడవ భాగమో, ఆరవ భాగమో ఖర్చు చేస్తాడు. తర్క-న్యాయ-మీమాంసాలలో, నాటక విద్యలో, చిత్ర రచనలో శ్రేష్టుడు. ధర్మాన్ని, అర్థాన్ని అనుసరించి సుఖపడాలనుకుంటాడేకాని, కామాన్ని కోరడు. ధనాన్ని ఐదు భాగాలుగా ఎలా విభజించాల్నో తెలిసినవాడు. ఎలాంటి ఏనుగునైనను, గుర్రాన్నైనా ఎక్కగల సమర్థుడు. దుష్టులను సాదువులుగా మార్చగలడు. ధనుర్వేదాన్ని సమర్మముగా తెలిసిన గొప్పవాడు. అతిరథులకందరికీ పూజ్యుడు. శత్రువును వాడివద్దకే పోయి అణచగల సమర్థుడు. సేనలను నడిపించడంలోనూ కడు నేర్పరి. యుద్ధంలో దేవతలు-రాక్షసులు కలిసి వచ్చినా ఓడించగల శక్తిమంతుడు.

(బాలకాండలో, ప్రథమ సర్గలో, వాల్మీకి మహర్షి నారదుడిని అడిగిన ప్రశ్నలన్నింటికి ప్రత్యుత్తరాలు ఈ సర్గలో ఇవ్వడం జరిగింది).

ఇంతవరకు శ్రీ రాముడిలో వున్న కల్యాణ గుణాలను చెప్పిన కవి, ఆయనలో హేయ గుణాలు లేవని చెప్పడం మొదలెట్టాడు. శ్రీ రాముడిలో అసూయ లేదు. ఆయన రమ్మంటేనే కోపం వస్తుంది. పొగరంటే ఏమిటో అసలే ఎరుగడు. తానెంత బలవంతుడైనప్పటికీ, అసాధ్య కార్యాలను చేయగల వాడైనప్పటికీ, ఎవరిని-దేనిని అవమానంగా చూడడు. శుద్ధ సత్త్వ స్వరూపుడై, ప్రకృతి గుణాలకు, కాలమునకు లోబడి వుండేవాడు కాడు. ఇతరులు అభివృద్ధి చెందుతుంటే సంతోషపడేవాడు. ద్వేషించడు. బుద్ధిలో బృహస్పతితో, వీర్యంలో ఇంద్రుడితో, ఓర్పులో భూమితో పోల్చదగినవాడు. ముల్లోకాలను సంతోషపెట్టగలవాడు. సూర్యవంశంలో పుట్టి, సూర్యుడిలా అన్ని లోకాల వారిచే పూజించబడే వాడు. అంతరింద్రియ-బాహ్యేంద్రియ నిగ్రహం కలిగి, ప్రజలకు, తండ్రికి సంతోషకరమైన తన గుణాలవల్ల. సూర్యుడు ప్రకాశించినట్లే శ్రీ రామమూర్తి కూడా రాజిల్లాడు.

(శ్రీ రాముడు తన గుణాల వల్ల తండ్రిని-ప్రజలను సంతోషపరుస్తున్నా డనడంలో అర్థం వుంది. రాజ్య భారం వహించడానికి అన్ని విధాలా యోగ్యుడని, సమర్థుడని దీని భావం. శ్రీ రామచంద్రమూర్తి గుణాలకు తండ్రి ఎంతగా సంతోషించాడో, అంతే మోతాదులో సమస్త ప్రజలు, బాలురు, వృద్ధులు, స్త్రీలు, పురుషులు సంతోషించారని భావం).

దోషరహితుడు, ఇంతవరకూ చెప్పిన కల్యాణ గుణాలను నింపుకున్న సంపన్నుడు, మొక్కబోని పరాక్రమం కలవాడు, లోకులనెల్ల రంజింప చేయగల స్వభావం కలవాడు, సర్వత్రా వ్యాపించిన ప్రకాశం కలవాడు, లోకపాలురతో సమానమైన వాడు శ్రీ రామచంద్రమూర్తి. అట్టి శ్రీ రాముడిని భూదేవి కూడా తనకు తగిన ప్రియ భర్త అని తలచి, స్వీకరించాలని కోరుకుంటుంది.

శ్రీ రామచంద్రుడిని యువరాజు చేయాలనుకున్న దశరథుడు

అసమానమైన లోకోత్తర గుణాలతో సంపన్నుడైన తన కుమారుడు శ్రీ రాముడిని చూసి, తాను జీవించి వున్న రోజులలోనే, అతడిని ఎలా రాజ్యానికి పట్టాభిషిక్తుడిని చేయగలను అని ఆలోచించుతాడు. తాను ముసలివాడైనందున, తనకు పుత్ర వ్యామోహం విస్తారంగా వున్నందున, పట్టాభిషిక్తుడైన రాముడిని ఎలా చూడగలనా అని మిక్కిలి విచారంతో వుంటాడు. అప్పటికప్పుడే శ్రీ రాముడిని రాజుగా చేయాలా? వద్దా? చేస్తే మంచిదా? చేయకుంటేనా? అని పదే-పదే ఆలోచించి, చేయడమే శ్రేయస్కరమని భావించాడు. రాజైన వాడికి ప్రజల అభివృద్ధి కావాలన్న కోరిక వుంటుంది. అలాంటి కోరిక శ్రీ రాముడిలో వుందని దశరథుడి నమ్మకం. వరుణదేవుడు తగినంత వర్షాన్ని కురిపించి లోకులను సంతోషపరిచినట్లుగా, రామచంద్రుడు కూడా చేస్తున్నాడు. తనపైకంటే కూడా ఎక్కువ శ్రీ రాముడిపై ప్రీతి కనబరుస్తున్నారు ప్రజలనుకుంటాడు దశరథుడు. అలాంటివాడే ప్రభువు కావాలి.

(లోకంలో అందరికంటే మించినవాడు తనే అన్న భావన వున్నప్పటికీ, ప్రతి తండ్రికి, తన కొడుకు తనను మించినవాడైతే మంచిదను కుంటాడు).

దశరథుడింకా ఇలా అనుకుంటాడు: "పరాక్రమంలో ఇంద్రుడికి-యముడికి, బుద్ధి బలంలో బృహస్పతికి, ధైర్యంలో మేరుపర్వతానికి సమానుడు శ్రీ రాముడు. సుగుణాలలో నాకంటె గొప్పవాడు. సజ్జనులతో పొగడ్తలను పొందిన నడవడిగలవాడు. సార్థకంగా పుత్ర శబ్దాన్ని పొంది, నన్ను పున్నామ నరకాన్నుంచి రక్షించి, వంశాన్ని పావనం చేయగలవాడు. రాముడు ఈ రాజ్యాన్ని పాలిస్తుంటే, ఈ ముసలి వయసులో నేను, కళ్లారా చూసి ఆ పుణ్యంతో స్వర్గానికి పోయే భాగ్యం నాకుందో? లేదో?సామ్రాజ్య పట్టాభిషేక భాగ్యం నిర్భాగ్యులకు కలగదు కదా!". ఇలా ఆలోచించిన దశరథుడు, లోకాతీతమైన, ప్రమాణ సాధ్యం కాని వైన, ఇతర రాజ శ్రేష్టులకు దుర్లభమైన, గుణ-గణాలున్న శ్రీ రామచంద్రమూర్తిని యువరాజు చేయాలని, మంత్రులతో ఆలోచించి నిశ్చయించుకుంటాడు.

రామపట్టాభిషేకానికి దశరథుడు తొందరపడటానికి కారణముంది. దశరథుడికి మరణం ఆసన్నమవుతున్నదని సూచనగా కొన్ని అపశకునాలు ఆయనకు ఆకాశంలో గోచరించాయి. ఐతే ఆయన అపశకునాలకు భయపడి తీసుకుంటున్న నిర్ణయం కాదు. తాను మిక్కిలి వృద్ధుడవడం, యోగ్యుడు-సమర్థుడు ఐన కుమారుడు, అందునా ఎదిగినవాడుండడం, ఇంకా రాజ్య భారం వహించడం ధర్మం కాదని భావించడం రామ పట్టాభిషేక ప్రయత్నాలను వేగవంతం చేయడానికి కారణాలు. మరణం సమీపంలోనే వున్నందున ఇంకా ఆలశ్యం చేసి ప్రయోజనం లేదనుకుంటాడు దశరథుడు. మనస్సుకు సంతోషం కలిగించగల-తన శోకాన్ని పారద్రోలగల సమర్థుడు, సౌందర్యవంతుడు, అపరిమితమైన కల్యాణ గుణాలు కలవాడైన శ్రీ రామచంద్రుడిపై ప్రజలకున్న అనురాగాన్ని గురించి కూడా ఆలోచన చేశాడు దశరథుడు. తనకు, ప్రజలకు ప్రీతి కలిగించే రామ పట్టాభిషేక కార్యాన్ని జరిపించడానికి సరైన సమయం ఆసన్నమైందని గుర్తించిన దశరథుడు, ఆ కార్యాన్ని ఎప్పుడు నెరవేర్చగలనా అని తొందరపడడం మొదలైంది. శుభస్య శీఘ్రం అని తలపోశాడు.

శ్రీ రాముడిని యువరాజుగా చేసేందుకు పౌరులతో ఆలోచనచేసిన దశరథుడు

(రాజైన వాడు, తన తదుపరి తన కొడుకును తన ఇష్ట ప్రకారం పట్టాభిషేకం చేసే అధికారం లేదు. రాజ్యం ప్రజలది. రాజ్యాన్ని పరిపాలించే శక్తి ఎవరికి కలదో, వానినే, పట్టాభిషిక్తుడిని చేసే అధికారం ప్రజల కుంది. ఆ భారం కూడా వరిదే. ప్రజల నిమిత్తం రాజుంటాడు కాని, రాజు కొరకు ప్రజలుండరు. అన్ని విధాలుగా శ్రీ రామచంద్రుడు రాజ్య భారం వహించడానికి సమర్థుడని దశరథుడు భావించినప్పటికీ, ప్రజానురాగం వుందని ఆయన నమ్మినప్పటికీ, ప్రజల సమ్మతి లేకుండా అయనకు అలా చేసే అధికారం లేదు కాబట్టి, వారిని సంప్రదించే ఆ పని చేయాలనుకుంటాడు దశరథుడు).

ఆలోచన చేసేందుకు, సామంతరాజులను, ముఖ్య రాజులను, వివిధ దేశాలలో దూరంగా వుండేవారిని, గ్రామాలలో వుండేవారిని దశరథుడు పిలిపించాడు. ఫలానా రోజున పట్టాభిషేకం చేస్తే బాగుంటుందని తన మంత్రులతో అంతకుముందే ఆలోచన చేసినందున, మిగతా వారిని కూడా సంప్రదించడానికి, అందరినీ ఒక్క రోజునే రమ్మని కబురు చేశాడు. కాకపోతే, కబురంపిన వారిలో, జనకకేకయ రాజులు మాత్రం లేరు. వారు స్వతంత్రులు కనుక సమయానికి రాలేకపోతే, పట్టాభిషేకం ఆలశ్యమయ్యే ప్రమాదమున్నందున (లేదా వారు వస్తే ఏదైనా అనర్థం జరగవచ్చనే భయం కూడా వుండవచ్చు?) వారికి చెప్పలేదు. కార్యం ముగిసిన తదుపరి వారికి ఆ సంతోష వార్త తెలియ చేద్దామనుకున్నాడు. తన మాట ప్రకారం అయోధ్యకు వచ్చిన వారందరికీ, వారి వారి యోగ్యతల ప్రకారం తగిన వసతి ఏర్పాట్లు చేశాడు దశరథుడు. వారంతా సంతోషపడేట్లు సేవలు చేయించి, బ్రహ్మదేవుడి మాదిరిగా, వారికి–ప్రజలకు దర్శనమిచ్చాడు దశరథుడు. రాజులందరు వచ్చిన తరువాత, వారివారి ఆసనములపై కూర్చుండిన తరువాత, సభ తీరిన దశరథుడు, దేవతలు చుట్టూ వున్నప్పుడు కనిపించే ఇంద్రుడి మాదిరి శోభించాడు.

❖ ❖ ❖

సర్గ-2

దశరథుడి ఉపన్యాసం

సభదీరిన దశరథుడు, అక్కడున్న వారందరినీ కలియ చూశాడు. భేరి ధ్వనిని బోలిన ధ్వనితో, గంభీరంగా, రాజులాంటి వాడు చెప్పే పద్ధతితో, మనోహరంగా, మిక్కిలి తీయగా, అందరికీ వినపడే ట్లుగా, మేఘ ధ్వనిలాంటి ధ్వనితో, అసమానమైన మేలు-సంతోషం కలగడానికి కారణమైన, అమితమైన కీర్తికి ఆలవాలమైన, మాటలను ఇలా చెప్పసాగాడు దశరథుడు. "ఆర్యులారా! మా పూర్వీకులందరు, భూ జనులను, తమ కడుపున పుట్టిన పిల్లలను తండ్రులు ఎలా రక్షించుతారో అలానే దీర్ఘకాలం కాపాడారు. ఇది మీకందరికీ తెలిసిన విషయమే. అలాంటి ఇక్ష్వాకుల వంశంలో పుట్టిన నేను, మా పూర్వీకుల పాలనలో వృద్ధి చెంది, సుఖపడేందుకు వీలుగా, జగత్తులోని ప్రజలకందరకు మిక్కిలి శ్రేయస్కరమైన కార్యాన్ని చేయదల్చుకున్నాను. మా పెద్దలు ఏ ప్రకారం ప్రజలకు మేలైన పనులను చేశారో, అలాగే, ఆ మార్గంలోనే నేను కూడా మిక్కిలి హెచ్చరికతో ప్రమాదం లేకుండా, నా శక్తివంచనలేకుండా ప్రజలను రక్షించాను. ఈ విషయం మీ అందరి మనస్సులకు తెల్సిందే! ఎల్లప్పుడూ ప్రజలకు మేలైన పనులే చేయాలని కోరుకునే నా శరీరం, తెల్ల గొడుగు నీడ కింద మీ అందరికీ కనిపించే రీతిలో, వార్ధక్యానికి గురైంది. నాకు అరవై వేల వయస్సు కొరతలేకుండా గడిచింది. దేహం దుర్బలమైంది. జ్ఞాపకశక్తి క్షీణించకముందే, మతి మరుపు రాక ముందే, కర్తవ్యాన్ని మరిచి ఒకదానికి బదులు ఇంకొక టి చేయడానికి ముందే, అలాంటి స్థితి రాక ముందే, ఈ రాజ్య భారాన్ని వదిలించుకుని సుఖపడాలని కోరుకుంటున్నాను".

"ఏ విధంగా సుఖపడాలని భావిస్తున్నానో చెప్తాను వినండి. మిక్కిలి ధైర్య-శౌర్య-పరాక్రమం కలవాడు, ఇంద్రియ నిగ్రహం కలవాడు, కష్టమైన ఈ భూ భారాన్ని మోయగల దార&ధ్యం కలవాడు, ధర్మ స్వభావం కలవాడు మోయవలసిన ఈ అధిక రాజ్య భారాన్ని దీర్ఘకాలం మోసి-మోసి, ఇక ఈ భారాన్ని తొలగించుకొని సుఖపడాలని ఆశతో వున్నాను. అలా చేయడానికి

మీ అందరి అనుమతి కావాలి. అలాంటప్పుడు ఈ రాజ్యం గతి ఏంటి? ప్రజలందరిని ఏం చేసి పోతావు అని అంటారేమో? నాకు తోచిన రీతిలో దానికి కావాల్సిన ఏర్పాట్లు చేస్తాను. మీ కిష్టమైతే దానికి మీ అంగీకారం తెలపండి. అదేంటని అంటారా? ఇక్కడున్న ద్విజులందరికీ సమ్మతమైతే, మీరందరూ ఒక్క మాటతో, నిండు మనస్సుతో, అంగీకరించి సరైనదే అంటే, నా పెద్ద కుమారుడు–శత్రువుల జయించినవాడు–ఇంద్రుడితో సమానుడు–ధర్మాత్ములందు శ్రేష్టుడు–సదాచార సంపన్నుడు–గొప్ప మహిమకలవాడు–అన్ని గుణాలలో నాకు సమానుడు–విల్లు పట్టేవారిలో శ్రేష్టుడు–పురుష సింహుడు ఐన శ్రీ రాముడిని, పుష్య నక్షత్రం పౌర్ణమితో కూడిన విధంగా మీ అభిప్రాయం తెలుసుకుని, యువరాజుగా చేయాలనుకుంటున్నాను".

"వాస్తవానికి ఈ అల్ప రాజ్యమే కాదు... రాముడు భూమికి తగిన భర్త ఐనందున, మూడు లోకాలను ఏల తగినవాడే. ఇక మీ సమ్మతి తెలపడమే ఆలస్యం. శీఘ్రంగా నేను ఈ భూ భారాన్ని వదిలించుకుని, శ్రీరాముడికి అప్పగించి, భూ ప్రజలకు ఈ మేలును సమకూర్చి, భారం తొలగిపోవడంతో నేను కూడా సుఖపడతాను. నేను చెప్పిన ఈ ఆలోచన సమంజసమని మీకు అనిపించితే, దానికి మీ సమ్మతి తెలపండి. ఒక వేళ నా ఆలోచన మీకు నచ్చకపోతే, ఇంతకంటే మేలైన ఆలోచన తెలపండి. నేను చెప్పిన ఆలోచన కాబట్టి, అంగీకరించకపోతే నేను నొచ్చుకుంటానని భావించవలదు. రాముడు నా కొడుకు కాబట్టి, పుత్ర వాత్సల్యంతో చెప్పాను. కార్యాలోచనలో ఐనవారి ఆలోచన పక్షపాతంతో కూడి వుండవచ్చు. మధ్యవర్తుల ఆలోచన మేలైందిగా వుంటుంది. ఉదాసీన మనుష్యుల ఆలోచన పనికిరాదు. రాముడి రాజ్యంలో సుఖపడవలసిన వారు మీరు. రామ పక్షపాతంతో నేను చెప్పిన ఆలోచనకంటే మధ్యవర్తులైన మీ ఆలోచనే మేలు".

ఇలా దశరథుడు చెప్పడంతో, రాజులందరూ, మేలు–మేలు అని, బాగు–బాగు అని కేకలు వేశారు. దశరథుడిని శ్లాఘించారు.

శ్రీరాముడు యువరాజవడానికి సమ్మతించిన పౌరులు

దశరథుడిలా చెప్పడంతో, వింటున్న బ్రాహ్మణ శ్రేష్టులు, పౌరులు, గ్రామజనులందరు, కలిసి మాట్లాడుకుని, ఏకాభిప్రాయానికి వచ్చారు. దశరథుడు ఎన్నో వేల సంవత్సరాలనుండి రాజ్యాన్ని పాలించుతున్నాడని, ముసలివాడైనాడని అంటూ, రాజ్యపాలనకు శ్రీరామచంద్రుడిని యువరాజుగా చేయమని కోరారు. "రాజా! ఆజాను దీర్ఘబాహుడు, శ్రీమంతమైన రఘువంశంలో పుట్టినవారిలో శ్రేష్టుడు, గొప్ప దేహబలం-మనో బలంలో అసమానుడు శ్రీరాముడు. ఆయన శత్రుంజయమనే పట్టపు ఏనుగును ఎక్కి, శ్వేతచ్ఛత్రమనే నీడలో వస్తుంటే, మేమందరం కళ్లారా చూడాలనుకుంటున్నాం" అని అంటారు. ఇలా సభలో వున్న ప్రముఖులందరూ, ఒకే మాటగా చెప్పడంతో, వారి వుద్దేశం రాముడి మీద ప్రేమా? తన మీద కోపమా? తెలుసుకోవాలని భావించాడు దశరథుడు. "రాజులారా! రాముడిని యువరాజుని చేస్తానని నా నోటి వెంట మాట వచ్చినదే తడవుగా, మీరు పూర్తిగా వినీ-వినకుండానే దానికి సమ్మతించి ఆయనను ప్రభువుగా వుండాలని కోరుతున్నారు. ఇదంతా చూస్తుంటే నాకేదో సందేహంగా వుంది. నా పరిపాలనలో ఏదో లోపం వుందని మీరు భావిస్తున్నట్లు అర్థమవుతోంది. నా పాలన తొలగిపోతే మంచిదని మీరు అనుకుంటున్నట్లుగా వుంది. ఇది వాస్తవమేనా? లేక నిజంగా రాముడి మీద ప్రేమా? నిజం చెప్పండి. వాస్తవంగా మీ అభిప్రాయం వెల్లడించండి". అని వారిని ఒకవైపు ప్రశ్నించినప్పటికీ, లోలోన మాత్రం తన అభిప్రాయాన్ని సర్వజనులు ఆమోదించినందుకు, సంతోషించాడు దశరథుడు. తన ప్రశ్నల పరంపరను కొనసాగిస్తూ: "నేనింకా జీవించి వున్నాను కదా! ధర్మ పద్ధతిగా ప్రజలను పాలించడంలో నాకు మనస్సు లేదా? నేను ప్రజలకు సుఖం కలిగించడం లేదా? మీ అభిప్రాయం ప్రకారం నేను నడుచుకోవడం లేదా? నాకంటే చిన్నవాడైన రాముడిని, రాజ్యపాలనలో అనుభవం లేని నా కుమారుడిని, రాజును చేయాలని ఎందుకు ఆశపడుతున్నారు? నా మీద విశ్వాసం వుంటే, ఎలాగూ నా తర్వాత రాముడే రాజవుతాడు కనుక, అప్పటివరకూ ఆగమని సలహా ఇచ్చి వుండవచ్చుకదా! నన్నే రాజుగా కొనసాగమని చెప్పివుండవచ్చుకదా? నేను మీకు ఏమి ద్రోహం చేశాను?" అని అడుగుతాడు.

శ్రీరాముడి గుణాలను వర్ణించిన పౌరులు

దశరథుడి ప్రశ్నలకు సమాధానంగా, అక్కడున్న వారందరు పండిత–పామర అనే భేదం లేకుండా, ఒకే మాటగా ఇలా చెప్పారు: "రాజా! నీ పాలనలో లోపం వుండిందన్న కారణాన మేము రాముడిని కావాలని అనడం లేదు. భయం వల్ల కాని, లాభం వల్ల కాని, పక్షపాత బుద్ధితో కాని మేం ఆయనను కోరడం లేదు. దేవుడితో సమానుడైన రాముడిలో ఆనందకరమైన అనేక కల్యాణ గుణాలున్నాయి కాని, హేయ గుణం ఒక్కటి కూడా కానరాదు. రాముడు నీ కొడుకైనందున ఆయన మహిమ నీకు తెలిసి వుండకపోవచ్చు. తెలియకపోతే మేం చెప్తాం. చెవుల పండుగగా విను. ఇంతవరకెందుకు చెప్పలేదని నువ్వు అడుగవచ్చు. నువ్వు అడగలేదు–మేం చెప్పలేదు. నువ్వు అడిగినప్పుడు చెప్తుంటేనే ఇంత సందేహించిన వాడివి, అడకముందు చెప్తే ఎలా భావించే వాడివో? శ్రీరాముడికి సత్యమే శౌర్యం. శౌర్యం ద్వారా నెరవేరాల్సిన పనులు కూడా ఆయన విషయంలో శౌర్యంతో సంబంధం లేకుండానే, సత్యం వల్ల కలుగుతాయి. శౌర్యం చూపాల్సి వచ్చినప్పుడు సత్యం తప్పడు. చంద్రుడి కంటే అందగాడు. అప్రాకృత గుణాలలో సాక్షాత్తు నారాయణుడితో సమానుడు. ఇక్ష్వాకుడి వంశంలో పుట్టిన గొప్పవారిలో శ్రేష్టుడు. చక్కని నడవడికి, ధర్మానికి ప్రతీక. లోకంలో ఎంత గొప్పవారైనప్పటికీ, వారిని కొందరే పొగుడుతారు. రాముడిని శత్రువులు, మిత్రులు కూడా పొగుడుతారు. ధర్మానికి, లక్ష్మికి జన స్థానం రాముడు. రాముడే వాటికి ఉనికి పట్టు. రాముడిని ఆశ్రయించి అవి జీవిస్తున్నాయి. రాముడే లేకపోతే లోకంలో ధర్మం లేనే లేదు".

"రాజా! చంద్రుడెలా వీరూ–వారని, చిన్నవారని–పెద్ద వారని, స్త్రీలని–పురుషులని, పండితులని–పామరులని, ధనికులని–దరిద్రులని భేదం లేకుండా లోకులందరినీ సంతోష పెట్టాడో, అలానే నీ కొడుకు కూడా సమస్త ప్రజలను సంతోష పెట్టాడు. నిష్కల్మషమైన ఓర్పులో భూమికి సమానుడు. అసమానమైన బుద్ధిలో దేవతల గురువైన బృహస్పతికి సమానుడు. సామాన్య ధర్మాలు, విశిష్ట ధర్మాలు, సకల ధర్మాలు తెలిసినవాడు. ఆయన ప్రతిజ్ఞ చేస్తే తప్పడు. తారతమ్య బుద్ధి లేనివాడు. అందరితో కలిసిమెలిసి వుంటాడు. అసూయలాంటి చెడ్డ

గుణాలను దరికి చేరనీయడు. తప్పు చేసినవారిని కూడా ఆదరించే గుణం కలవాడు. కాఠిన్యం కనబరచడు. కష్టపడేవారిని చూస్తే వారి మనస్సుకు శాంతికలిగేటట్లు మాట్లాడతాడు. తనపై కోపించినవారిని చల్ల పరుస్తాడు. తనకు చేసిన మేలు కొంచెమైనా మర్చిపోడు. ఇంద్రియాలను జయించి వాటిని లోబర్చుకున్నాడు. వెన్నలాంటి మనసున్న దయామయుడు. తనను ఆశ్రయించినవారిని దగ్గరకు చేరదీస్తాడు. తేనెలాంటి తీయని మాటలు పలుకుతాడు. బ్రాహ్మణులకు సేవలు చేసి వారివలన శాస్త్ర ప్రకారం సమస్త విషయాలను నేర్చుకున్నవాడు".

"శత్రువులతో యుద్ధం చేయడానికి కాని, బీద వారికి దానం చేయడానికి కాని వెనుకా ముందు చూసేవాడు కాదు. అలాంటప్పుడు జంకు-గొంకు లేనివాడు. ఇలాంటి శక్తి-యుక్తులు ఆయనకు స్వభావ సిద్ధంగా వచ్చాయి. అలాగే, దేవతలకు, మనుష్యులకు, రాక్షసులకు తెలియని అనేక శస్త్రాస్త్రాలను సమ ధర్మంగా తెలిసిన పండితుడు. వేద-వేదాంగాలను అర్థ సహితంగా తెలుసుకున్నవారిలో సమర్థుడు. శాస్త్ర పాండిత్యంలో రాముడిని మించినవారు లేరు. కొందరు వేదాధ్యయనం పూర్తిచేసి స్నాతకులవుతారు. కొందరేమో వ్రతాలందు స్నాతకులౌతారు. శ్రీరాముడు రెండింటి లోను స్నాతకుడు. సంగీతాన్ని ఎరిగినవాడు. జ్ఞానులచే స్తోత్రం చేయబడినవాడు. విద్యలతో సమానంగా చక్కటి బుద్ధినీ కలవాడు. ఇలాంటి గొప్ప గుణాలు, గొప్ప బుద్ధి కలగడానికి కారణం, గొప్ప వారైన తల్లిదండ్రుల వంశంలో పుట్టినందువల్లే! బంగారానికి మెరుగుపెట్టినట్లే, రాముడు స్వసద్గుణాలవల్ల మిక్కిలి గొప్పవాడయ్యాడు. సర్వకాలాలోను నిర్మలమైన మనసున్నవాడయ్యాడు. దుష్టులైన శత్రువులు ప్రజలకు కీడు కలిగించితే, వారిని శిక్షించి జనులకు బాధలు తొలగించేందుకు, తమ్ముడు లక్ష్మణుడితో సహా బహిరంగ యుద్ధంలో దుష్టులను జయించికాని వెనుకకు రాడు రాముడు. వారే కనుక శరణు కోరితే వారెంత కీడు చేసినా దయతో రక్షించే గుణం కలవాడు".

"మహారాజా! రాముడి గుణాలను మేం ఏమని వర్ణించగలం? తమ అవసరాలకోసం గొప్ప-గొప్ప వారు, తమంతటి వారిని ఆదరించడం లాంటిది

నీవు కూడా చేస్తూనే వున్నావు. అది గొప్ప విషయం కాదు. ఇక నీ కుమారుడి జనవాత్సల్యమెలాంటిదో మా అనుభవంతో చెప్తాం. ఒకవేళ యుద్ధానికో-మరెందుకో కొంతకాలం అయోధ్యను విడిచి పోయి మరలి వచ్చిన తరువాత నేరుగా తన ఇంటికి పోయి తల్లిని, భార్యను, తండ్రిని చూడడు రాముడు. అంతకు ముందే పురజనులందరినీ తన ఆత్మబంధువులను పిలిచినట్లు చనువుగా, మర్యాదగా సంభోదిస్తూ పలకరిస్తాడు. వారి పిల్లలు సంతోషంతో వున్న విషయాన్నీ, భార్యలు బాగున్న సంగతినీ, సేవకుల-శిష్యుల సుఖాన్నీ, అగ్నిహోత్రుడికి హాని లేని వ్యవహారాన్నీ, అల్లుళ్ల-ఆడబిడ్డల-కోడళ్ల క్షేమాన్నీ, పేరు-పేరున విచారించి తెలుసుకుని, సంతృప్తిపడి, ఆ తరువాతే ఇంటికి వెళ్తాడు. అయోధ్యలోనే కాకుండా లోకమంతా నివసించే వారిలో ఏ ప్రాణికైనా దుఃఖం కలిగితే, వారి తల్లిదండ్రుల కంటే మిన్నగా జగత్ పిత ఐన రామచంద్రుడు పరితపిస్తాడు. భగవంతుడగు రాముడు అత్యంత దయా మూర్తి. దుఃఖించే జనులను చూసి, వారికి జ్ఞానం కలగాలని, బాగుపడాలని రాముడు కోరుకుంటాడు. వక్రమార్గాన పోయే వారిని చూసి, వారినెలా మతి మంతులను చేయగలనా అని దుఃఖిస్తాడు రాముడు. మంచి మార్గంలో నడుచుకుంటూ సుఖపడువారిని చూసి సంతోషిస్తాడు".

(ఇవన్నీ రాముడిలోని అసాధారణ గుణాలు. లోగడ చెప్పినవన్నీ సర్వ సజ్జన సామాన్య లక్షణాలు. భగవంతుడైన రాముడు దుఃఖించవచ్చా? ఆయన తనకు కలిగిన దుఃఖానికి ఎన్నడూ శోకించలేదు. బిడ్డలకు కష్టం కలిగితే దుఃఖపడే తల్లిదండ్రుల లాగా రాముడు తన ప్రజలకు కష్టం కలిగితే దుఃఖ పడేవాడు. అందుకే రాముడిని "కరుణాకాకుత్సుడు" అని బిరుదుంది.)

"ఎన్ని కష్టాలు కలిగినా, సత్యం తప్పితే కష్టాలు తొలగుతాయన్న భావనకు దూరంగా సత్యం తప్పని సమర్థుడు. పగ వారితో యుద్ధంలో రాముడు ధరించిన ఇంద్రధనుస్సు లాంటి పెద్ద విల్లు చూడగానే శత్రువులు భయపడిపోతారు. ఎవరి విషయంలోనైనా సంతోషిస్తే మేలు చేయడం, కోపగిస్తే కీడు చేయడం ఆయన నైజం. రాముడిని ఆశ్రయించినవారికి మేలు తప్పక కలుగుతుంది. ఆయన వున్న చోట జనన-మరణ-శత్రు-దారిద్ర్యాది భయాలు దరికి రావు.

శ్రీమన్నారాయణుడుకి ఎలాంటి చిహ్నాలున్నాయని శాస్త్రాలు చెప్తున్నాయో అలాంటి చిహ్నాలే శ్రీరాముడికి వుండడం వల్ల ఆయనను చూసినవారు సాక్షాత్తు శ్రీమన్నారాయణుడే తమకు ప్రత్యక్షమైనాడని భావించే లాంటి సౌందర్యవంతుడు రాముడు. రామబాణం ఎప్పుడూ గురితప్పలేదు. చమత్కారంగా, యుక్తి-యుక్తంగా, ధర్మం తప్పకుండా మాట్లాడడంలో బృహస్పతిని మించినవాడు. నీతి క్రమాలు తప్పని వాడు. ఇంద్రుడు కూడా రాముడితో సమానం కాడు. ఎక్కు పెట్టబడి, ఒంపుగా వుండే వింటి దబ్బల లాగా, అందమైన కనుబొమ్మలు కలవాడు. రూప-రస-గంధాది విషయాలలో పాతరలాడని స్థిరమైన మనసున్నవాడు. అహంకారం లేనివాడు. మనుష్యులలో కనిపించని గొప్ప మహిమ కలవాడు".

"రాజా! శ్రీరామచంద్రమూర్తి ఈ రాజ్యాన్ని పాలించడానికి యోగ్యుడా? అని మా అభిప్రాయం అడిగావు. తుచ్ఛమైన ఈ లోకాన్నే కాదు. మూడు లోకాలను పాలింప సమర్థుడు. ఎట్లందువా? రాముడు బలవంతుడైనందున అందరిని హింసించి వశపర్చుకుని అలా చేస్తాడనుకుంటున్నావేమో! అలా చేయడెప్పుడు. వధింపతగిన దోషం చేసినవారిని మాత్రమే వధించును కాని అందరినీ కాదు. సత్యం వల్లనే రాముడు ముల్లోకాలను జయించగలడు. ఒకవేళ విల్లు పట్టి యుద్ధం చేయాల్సి వస్తే ధర్మ మార్గంలో చేస్తాడే కాని అధర్మంగా మాత్రం కాదు. శత్రువులకు ఏ మోతాదులో నష్టం చేయాలో అంతవరకే బాధించి జయం పొందుతాడు. తనకు సంతోషం కలిగించిన వారి మనసెరిగి వారు కోరుకున్న దానికంటే కూడ ఎక్కువగా మేలు చేస్తాడు. దుష్ట శిక్షణకు కావాల్సిన ధైర్య-శౌర్య-వీర్య-పరాక్రమాలను, సాధు రక్షణకు అవసరమైన శాంతి-దాంతి లాంటి సద్గుణాలను, ధర్మ సంస్థాపనకు కావాల్సిన సత్య గుణాలను కలిగిన రాముడిని ఇక్కడున్న మేం నలుగురం మాత్రమేకాదు, భూ ప్రజలందరు ఆయననే ఏకగ్రీవంగా తమ పతిగా వరించారు. వారందరి అభిప్రాయమే మేం తెలుపుతున్నాం. ఈ విషయంలో భిన్నాభిప్రాయం లేనే లేదు. రాజా నీవు చాలా పుణ్యవంతుడివి. పుత్ర శబ్దాన్ని సార్థకం చేస్తూ, పున్నామ నరకాన్నుంచి తప్పించడం మాత్రమే కాకుండా, తక్కిన పుణ్యాలను చెడకుండా రక్షించుతూ, రాజులు అవశ్యం పోవాల్సిన నరకానికి నిన్ను పోకుండా రక్షించగల వాడిని-

రాముడిని కొడుకుగా కన్నావు. ఇంకొకరు కొడుకై పుట్టే, కాముకుడవైన నిన్ను, నరకానికి పోకుండా కాపాడగలిగేవాడు కాదు. నువ్వు కూడా యోగ్యుడవైనందునే మరీచికి కశ్యపుడు కొడుకైనట్లు మహర్షి తుల్యుడైన రాముడు నీ కుమారుడైనాడు. ఆయన తండ్రిగా స్వీకరించడానికి నీవే తగినవాడివి".

"రాజా! రాముడికి ఎల్లప్పుడూ సుఖమే కలగాలి. 'రాముడు దీర్ఘకాలం జీవించాలి. రాముడికి వ్యాధులవల్ల బాధలు కలగకుండా వుండాలి. రాముడి దేహబలం వర్ధిల్లాలి'. ఈ విధంగా దేవతలు, గంధర్వులు, ఋషులు, పన్నగులు దేశ-దేశాల్లోనే కాక గ్రామాల నుంచి పట్టణాల దాకా సర్వకాలాలోను కోరుకుంటున్నారు. రామచంద్రుడి విషయంలో వీరూ-వారూ అనే భేదం లేకుండా, సర్వదా అందరూ ఆయనను తప్ప ఇతరులను తలచడం లేదు. (శ్రీరాముడిపై ఇంత ఘాటు ప్రేమ-భక్తి కలిగిన వారందరికీ, శ్రీరాముడి నిర్యాణ కాలంలో ముక్తి లభించింది. రామచంద్రుడి మీద అనురాగం వుండి, ఆయన మీదే మనసు నిలిపిన కోసల నగరంలోని గ్రామాల జనులకు కూడా సాలోక్యముక్తి లభించింది). నల్ల కలువల లాంటి నీలమైన దేహ కాంతి కలవాడిని, పగ వారి పొగరు అణచువాడిని, సర్వజనులు సర్వ వేళల ఉ చ్చరించే నామం కలవాడిని, దయా గుణం కలవాడిని, అందమైన చెక్కిళ్లు కలవాడిని, కొత్త యవ్వనమందుండువాడిని, యశస్సు వల్ల నిండిన లోకం కలవాడిని, సముద్రం లాగానే లోతు తెలియని వాడిని, పర్వతంలాగా చలించని వాడిని, సజ్జనులందు-సాజ్యంలోను అదే శక్తిగల సత్యాన్ని-ధర్మాన్ని కలిగివుండిన వాడిని, ఇంపుగా-మెత్తగా మాట్లాడువాడిని, దోష రహితుడిని, దేవాది దేవుడితో సమానుడైన వాడిని, శ్రీరామచంద్రమూర్తిని యువరాజుగా కళ్లారా చూసి సంతోషించాలని వుంది రాజా! కాబట్టి, మా మేలును కోరి, మా కోరిక నెరవేర్చు".

❖ ❖ ❖

సర్గ-3

పట్టాభిషేక సంబరాలను ఏర్పాటు చేయమని ఆజ్ఞాపించిన దశరథుడు

దశరథుడి కోరిక మేరకు, సభలో వున్న వారందరు, ఒక్క మాటగా చేతులు జోడించి రాముడిని యువరాజు చేయమని ప్రార్థించడంతో, రఘువంశ శేఖరుడైన దశరథుడు మనస్సులో సంతోషించాడు. "అయ్యలారా! నేనెంతో అదృష్టవంతుడిని. మీరందరూ ఒక్క మాటగా నా కుమారుడిని యువరాజు చేయడానికి సమ్మతించారు. నేనెంతో భాగ్యవంతుడిని. తండ్రికి పుత్రుడు కలిగినప్పుడు కలిగే సంతోషం కంటే, ప్రజలెప్పుడు వాడిని కీర్తింతురో అప్పుడు కలిగే సంతోషం నిజమైనది. అలాంటి భాగ్యం నాకు కలిగిందీనాడు". అని ఆ ప్రజలందరినీ తగిన మాటలతో గౌరవించి, తృప్తి పరిచి, ఆ తరువాత వశిష్టుడిని, వామ దేవుడిని, ఇతర పురోహితులను చూసి, "మునీంద్రులారా! శ్రీరామచంద్రుడి పట్టాభిషేకానికి కావాల్సిన పదార్థాలన్నింటినీ సమకూర్చండి" అని కోరాడుదశరథుడు. "ఈ చైత్ర మాసం సమస్త సౌఖ్య సంపత్తులకు ఆధారమైంది. భూమంతా పండ్లతోను, పూలతోను నిండిన చెట్లను కలిగి భారంగా వుంటుందిప్పుడు. పుణ్య కార్యాలు చేయడానికి ఇప్పుడే యోగ్యమైన కాలం. అందుకే ఇప్పుడే నా కొడుకును యువరాజుగా చేయడం సరైంది". అని చెప్పిన వెంటనే శుభం-శుభం అని అక్కడున్న వారందరూ పలికారు. రాముడిని అభిషేకించడానికి అవసరమైన పదార్థాలను సిద్ధం చేయమని దశరథుడు వశిష్ట మునీంద్రుడిని కోరడంతో ఆయన తన సమీపంలో వున్న బుద్ధిమంతులైన మంత్రులకు తగు సూచనలిచ్చాడా విషయంలో.

పట్టాభిషేక సంబరానికి కావాల్సినవేంటో మంత్రులకు వివరించిన వసిష్ఠుడు

ఉదయం కాకముందే రాజు వాకిట్లో వుంచాల్సిన వస్తువుల గురించి, లోపల వుంచాల్సిన వస్తువుల గురించి, అగ్నిహోత్రశాలలో వుంచాల్సిన వస్తువుల

గురించి వసిష్ఠుడు మంత్రులకు వివరించాడు. **ఆ వస్తువులు:** బంగారం, రత్నాలు, బలులు, వన మూలికలు, పేలాలు, తెల్ల పూల దండలు, తేనె, కమ్మని వాసన కలిగిన నేయి, చలువచేయని వస్త్రం, తేరు, ధ్వజం, క్షత్రియులు ధరించే అన్ని రకాల ఆయుధాలు, రథాలు, ఏనుగులు, గుర్రాలు, కాలినడక భటులుగా పిలువబడే నాలుగు రకాల సేనలు, పట్టపు ఏనుగు, తెల్ల వింజామరం, తెల్ల గొడుగు, బంగారు కుండలు, కొమ్ములకు బంగారు తొడుగులున్న వంద ఎద్దులు, అన్ని అవయవాలు సక్రమంగా వున్న ఒక పులి తోలు, శ్రీగంధం. ఇంకా ఇలా చెప్పసాగాడు వశిష్టుడు: "మంత్రులారా! రాజగృహ ద్వారాలను, అంతఃపురాలను, హారాలతో, శ్రీగంధంతో, సున్నపు పూతతో శృంగారించండి. పట్టణంలోని ప్రజలందరు వార్ ఇళ్లకు సున్నం కొట్టించి, తెల్ల పూతలు పూయించమని చెప్పండి. వీధులలో పన్నీరు చల్లండి. పట్టణమంతా సువాసనతో నిండి వుండేటట్లు అగరు-సాంబ్రాణి మొదలైన ధూపాలు వేయించండి. రేపు ఉదయం లక్ష మంది బ్రాహ్మణులకు పాలు-పెరుగుతో అన్నాన్ని కడుపునిండా శ్రద్ధా-భక్తులతో పెట్టించాలి. ఈ పని చేయాల్సి వుంది. ఈ రాత్రి గడవగానే, ఉదయమే, బ్రాహ్మణులకు దక్షిణ సహితంగా పేలాలు, నేయి, పెరుగు, స్నేహభావంతో ఇవ్వాలి. అశ్రద్ధ వుండరాదు. సూర్యోదయం కాగానే స్వస్తివాచనం జరగాలి. ఆ సమయానికల్లా కావాల్సిన ఉత్తమ బ్రాహ్మణులను వచ్చే ఏర్పాట్లు చేయాలి. వారు వచ్చి కూర్చోవడానికి పీటలు వేయించాలి. వాకిళ్లకు పచ్చాకు తోరణాలు, పూల దండలు కట్టించాలి. గోడలన్నింటికీ సున్నం కొట్టించాలి. వాకిళ్లు చిమ్మి, దుమ్ము పోగొట్టి, బురద రాకుండా నీళ్లు చల్లి, ముగ్గులు పెట్టించాలి. అలికి విడిచిన గడప దాట కూడదు. పచ్చాకు తోరణాలను మామిడి ఆకుతోనే కట్టాలి. శుభకార్యం జరిగే ఇంట్లో ఇవన్నీ జరగాలి".

"భోగం స్త్రీలు చక్కగా అలంకరించుకొని. తాళాలతో-ఇతర సాధనాలతో, నర్తకులతో కూడి రాజగృహంలోని రెండవ కక్ష్యలో వుండాలి. దేవాలయంలోని బ్రాహ్మణులు పూజలు చేస్తుండాలి. నాలుగు రహదారులు కలిసే చోట వుండే భజన కూటాలలాంటి చిన్న దేవాలయాలను పూదండలతో అలంకరించాలి. అన్నదానం నిరంతరం కొనసాగాలి. రామ పట్టాభిషేకం జరిగేటప్పుడు, ఖడ్గాలను

ధరించిన యుద్ధ భటులు, మంచి శుభ వస్త్రాలను ధరించి, రాజుండే ప్రదేశానికి సమయానికల్లా రావాలి.” ఈ విధంగా ఎవరెవరు ఏమేం పనిచేయాలో వారికవి అప్ప చెప్పి, తరువాత రాజుకు కూడా ఆయన చేయాల్సిన పనులేంటో వివరించి, మిగతా వాటిని ఆయన అక్కడ నుంచే పూర్తిచేశాడు. ఆ విధంగా వసిష్ట వామదేవులు రాజుతో అన్ని కార్యాలు చేయడం జరిగిందని చెప్పటంతో ఆయన కూడా సంతోషించాడు.

శ్రీరాముడిని సభకు పిలిపించిన దశరథుడు

వసిష్ఠ వామదేవులు అంతా సిద్ధమని చెప్పగానే శ్రీరాముడిని తన దగ్గరకు తీసుకొని రమ్మని సుమంత్రుడితో అనగానే అతడు ఆ పనిమీద వెళ్తాడు. వెళ్లి, రాముడిని, నిర్మలమైన ప్రకాశవంతమైన రథం మీద తీసుకొస్తాడు. అలా వస్తున్న రాముడిని – మనోహరమైన గుణాలకు స్థానమైన వాడిని, మదపుటేనుగు లాగా అందంగా నడిచే వాడిని, కమలాలలాంటి కళ్లు కలవాడిని, మోకాళ్ల వరకూ నిడుపాటి చేతులు కలవాడిని, నల్ల మేఘం కాంతిలాంటి కాంతి కలవాడిని, చంద్రుడిలాంటి ముఖం కలవాడిని, గాంభీర్యానికి నెలవైన వాడిని, గంధర్వ రాజుతో సమానమైన వాడిని, అసమానమైన దయకలవాడిని, సజ్జన స్తుతికి పాత్రుడైన వాడిని, బలం–సత్వగుణం కలవాడిని, ఉదార గుణం కలవాడిని, ధైర్యంలో పర్వతం లాంటి వాడిని, అతిశయించిన సౌందర్య గుణం కలవాడిని – దశరథుడు తానున్న మేడపై నుంచి చూశాడు. శ్రీరామచంద్రమూర్తి ఎక్కిన రథం వాకిటిలోకి వచ్చి నిలిచింది. మంత్రి సుమంత్రుడు చేతులు జోడించుకొని వెంట నడవగా, తానూ రెండు చేతులు జోడించుకొని, తండ్రి దగ్గరకు చేరాడు రాముడు. తన పక్కనున్న బంగారు పీఠం మీద కూర్చోమని రాముడికి చెప్పాడు దశరథుడు. నానా రాజులతో ప్రకాశించే ఆ సభ, శ్రీరామచంద్రుడి రాకతో మరింత శోభించింది. రాముడిలాంటి కుమారుడు తనకున్నందుకు తన అదృష్టాన్ని తానే పొగుడుకున్నాడు దశరథుడప్పుడు. తన గారాబు కొడుకుని చూసి, ఇంద్రుడికి కశ్యపుడు చెప్పిన రీతిలో, ఇలా చెప్పసాగాడు దశరథుడు.

శ్రీరాముడికి తన అభిప్రాయాన్ని తెలిపిన దశరథుడు

"నాయనా కుమారా! నువ్వు గొప్ప గుణాలుకలవాడిగా లోకుల మెప్పు పొందావు. జ్యేష్ట నందనుడవైన నిన్ను రేపు యువరాజుగా చేద్దామని ఆలోచించాను. నీకు పుట్టుకతోనే సజ్జన శ్లాఘ్యమైన గుణాలొచ్చాయి. నీతో సమానమైన వారు మనుష్యులలో లేరని నాకు తెలుసు. నీకు తెలియని నీతి-అవినీతి లేదు. నీకు హితం ఉపదేశించడం ధర్మం కాబట్టి కొన్ని విషయాలు చెప్పదల్చుకున్నాను. నీవు వినయం కలిగి ఇంద్రియాలను జయించు. సదాచార సంపన్నుడవై కామం వల్ల కలిగే వ్యసనాలను దరిచేయనీకు. పనివాళ్లను, అధికారులను, మంత్రులను సంతుష్టులను చేయాలి. ధన శాలలు, ధాన్య శాలలు, ఆయుధ శాలలు కొరత లేకుండా వుండాలి". ఈ విధంగా దశరథుడు, శ్రీరాముడికి రాజనీతి ఉపదేశించే సమయంలో, కొందరు వెళ్లి కౌసల్యా దేవితో శ్రీరాముడికి దశరథుడు యౌవరాజ్య పట్టాభిషేకం జరిపించదలచిన విషయం చెప్పారు. ఆమె కూడా సంతోషించింది. ఆ విషయాన్ని చెప్పినవారికి బహుమతులిచ్చింది.

తండ్రి చెప్పిన మాటలకు తన అంగీకారం తెలిపిన రాముడు రథ మెక్కి తన ఇంటికి వెళ్లాడు. పురజనులూ సంతోషించారు. మరుసటి రోజు పుష్యమీ నక్షత్రం కనుక, శ్రీరాముడికి యౌవరాజ్య పట్టాభిషేకం తప్పక జరుగునని నిశ్చయంగా చెప్పిన దశరథుడు తన ఇంటికి వెళ్లాడు.

❖ ❖ ❖

సర్గ-4

శ్రీరాముడిని తన దగ్గరకు పిలిపించిన దశరథుడు

ఇంటికి వెళ్లిన దశరథుడు సుమంత్రుడిని పిలిచి ఇంకో సారి రాముడిని తన దగ్గరకు తీసుకురమ్మని అంటాడు. తన దగ్గరకు వచ్చిన సుమంత్రుడితో, ఇప్పుడే కదా తండ్రిగారి దగ్గరనుంచి వచ్చానని, ఇంతలో మళ్లా ఎందుకు పిలిచారని ప్రశ్నించాడు రాముడు. తనకా విషయాలేవీ తెలియదని సమాధానం ఇచ్చాడు సుమంత్రుడు. వెంటనే తండ్రిగారిని చూడడానికి వెళ్లాడు రాముడు. తన పక్కన కూర్చోమని చెప్పాడు రాముడికి దశరథుడు. అలా కూర్చున్న రాముడికి ఎందుకు తాను అతడిని యువరాజుగా చేయదల్చుకున్నది వివరించాడు దశరథుడు. "రామచంద్రా! నేను ముసలివాడిని. అనేక సంవత్సరాలు జీవించాను. యధేచ్ఛగా రాజ్యాన్ని పాలించి కోరికలన్నీ సంపూర్ణంగా అనుభవించాను. ఎన్నో యాగాలు చేశాను. శాస్త్ర ప్రకారం విశేషంగా గోభూహిరణ్యాది దానాలిచ్చాను. శాస్త్రాలు అభ్యసించాను. సుఖానుభవంతో ఆత్మ ఋణాన్ని, యజ్ఞాదులతో దేవ ఋణాన్ని, దానాలతో బ్రాహ్మణ ఋణాన్ని, బ్రహ్మచర్యంతో ఋషి ఋణాన్ని, సంతానంతో పితృ ఋణాన్ని తీర్చాను. ఐశ్వర్యాన్ని సంపాదించి సమస్త భోగాలను అనుభవించాను. అసమానుడైన నీలాంటి కొడుకును కన్నాను. నాకు ఏ కొరతా లేదు. నా ఇహపర సౌఖ్యాలకొరకు చేయాల్సిన పనులన్నీ చేశాను. ఒకే ఒక్క కొరత మిగిలింది. గుణాధిక్యుడవైన-ఉత్తమ చరితుడవైన నిన్ను ప్రేమతో యువరాజుగా చేసి భూజనులందరు అనురాగంతో-సంతోషంతో వుండేటట్లు చేయడమే ఆ కోరిక. అది చేస్తే ఇక ఈ లోకంలో నేను జీవించి చేయాల్సిన పని మరొకటి లేదు. నేను జీవించి వుండగా నువ్వు రాజ్య భారం వహించనని అనవద్దు. ప్రజలంతా నిన్ను యువరాజుగా నిండు మనస్సుతో అంగీకరించారు. నువ్వు కూడా అంగీకరించాలి. ఇప్పుడేమి తొందరంటావా?"

"నీ పట్టాభిషేకానికి నేను తొందరపడటానికి కారణముంది. నాకు కలలో నల్ల చీరె కట్టుకున్న స్త్రీ కనిపించి నన్ను కౌగలించుకునే దుశ్శకునం వచ్చింది.

పిడుగులు-కొరవి కట్టెలు ఆకాశం నుండి రాలుతున్నాయి. వాటివలన నాకు కీడు కలిగే అవకాశం వుంది. నా జాతకాన్ని చూసిన జ్యోతిష్య పండితులు రాహువు-అంగారకుడు-సూర్యుడు, నా జన్మ నక్షత్రాన్ని పీడించనున్నారని అంటున్నారు. అంటే, నా మరణ కాలం సమీపించింది. ఈ శకునాల ఫలితాలను ఆలోచించి చూస్తే, రాజైన వాడు మరణించడమో, దానితో సమానమైన ఆపద రావడమో సంభవించే అవకాశం వుంది. కాబట్టి, నేను జీవించి వుండగానే రాజ్యాన్ని తీసుకో. పట్టాభిషేకం చేసుకో. ముఖ్యమైన పనులు ఎప్పటివి అప్పుడే చేయాలి. పుణ్య కార్యాలు వెంటనే చేయాలి. పాప కార్యాలు ఆలస్యం చేయవచ్చు. ఈ రోజు నీ జన్మతారైన పునర్వసువు వచ్చింది. రేపు నీకు సంపత్తారైన పుష్యమి వస్తుంది. అందువల్ల పండితులు రేపే నీకు యౌవరాజ్య పట్టాభిషేకం చేయాలంటున్నారు. ఆలస్యం చేయవద్దు".

"ఈ రోజు, నువ్వు, సీత ఉపవాసం చేయాలి. దర్భలు పరచుకొని దానిపై పడుకోవాలి. రాత్రంతా నీ స్నేహితులు నిన్ను హెచ్చరికగా రక్షించాలి. ఇలాంటి పనులలో విఘ్నాలు జరిగే అవకాశం వుంది. నీకు రాజ్యం లభించకుండా చేసే వారుండవచ్చు. నిన్ను తొందర పెట్టడానికి మరో కారణం కూడా వుంది. నేను నీకు ఇవ్వకపోతే, నా అనంతరం, నీకు రాజ్యం దక్కుతుందో-దక్కదో అని నా సందేహం. భరతుడు మేనమామ ఇంటి నుండి ఇక్కడికి రాక ముందే నీ పట్టాభిషేక కార్యక్రమం పూర్తి కావాలని నా అభిప్రాయం. భరతుడి విషయంలో సందేహించడం ఎందుకని అడుగవద్దు. అతడు నీకు తమ్ముడు. నీ లాంటి సద్గుణాలు కలవాడే. రాజ్యానికి ఆశపడడు. రాజ్యం కొరకు పగ సాధించేవాడు కూడా కాదు. అన్నను తండ్రిలాగా చూసేవాడు. ఐనప్పటికీ, అతడు మనుష్యుడైనందున, మనసు చపల చిత్తం కావచ్చు. కాబట్టి, భరతుడు రాక ముందే నీకు పట్టాభిషేకం జరిగితే, అతడు సత్పురుషుడు-ధర్మజ్ఞుడు కాబట్టి, నీ రాజ్యాన్ని ఇవ్వమని అడగడు. అలా కాకుండా ముందే వస్తే తనకూ కావాలంటాడేమో! అలా అంటే, కుటుంబ కలహాలతో పాటు, దేశ క్షోభ కూడా కలగవచ్చు. అందుకే, అతడు రాక ముందే నువ్వు పట్టాభిషేకం చేసుకోవాలని తొందరపడుతున్నాను".

ఇలా అంటూ దశరథుడు, రాముడిని వెళ్లమంటాడు. రాముడు వెంటనే, అక్కడి నుంచి తల్లి వుండే అంతఃపురానికి వెళ్తాడు. అక్కడ తన రాక కోసమే సీతా సమేతంగా ఎదురు చూస్తున్న తల్లి కౌసల్యను చూశాడు. తల్లిని చూసిన రాముడు, తండ్రి తనతో అన్న మాటలను-యువరాజుగా చేస్తానని చెప్పిన విషయాన్ని తెలియచేశాడు. తనకు, కోడలు సీతకు శుభం కలిగించే పనులను జరిపించమని రాముడు తల్లిని కోరాడు.

శ్రీరాముడిని దీవించిన కౌసల్య

శ్రీరాముడలా చెప్పగానే, ఎప్పటి నుంచో ఆ శుభవార్త కొరకు ఎదురుచూస్తున్న కౌసల్యకు, ఆనంద భాష్యాలు రాలి సంతోషంతో మాటలు రాకపోయినా సన్నగా ఇలా అంది: "తండ్రీ! నాయనా! రామచంద్రా! ఇలాంటి శుభవార్త నాకు చెప్పినందుకు దీర్ఘకాలం జీవించు. ఇన్ని దినాలుగా నేను చేస్తున్న శ్రీమన్నారాయణార్చనం ఫలించింది. శత్రువులిక మనం చెరపకనే చెడుదురు". ఆ మాటలు విన్న రాముడు, లక్ష్మణుడిని చూసి, తనకు సహాయకుడివిగా వుండమని అంటాడు. ఆతడు తన రెండవ ప్రాణమని, లక్ష్మి తనను వరించిందంటే, లక్ష్మణుడిని కూడా వరించినట్లే అంటాడు. సుఖాలను, రాజ్యం వల్ల కలిగే విశేష ఫలాలను తన ఇష్టం వచ్చినట్లు అనుభవించమని లక్ష్మణుడితో అంటాడు. తాను రాజ్యాన్ని కోరినా, జీవించి వున్నా, లక్ష్మణుడి నిమిత్తమే కదా అని కూడా అంటాడు. అలా అంటూ, తల్లులకు భక్తితో నమస్కారం చేసి, సీతతో తన ఇంటికి వెళ్లాడు రాముడు.

❖ ❖ ❖

సర్గ-5

దశరథుడి పక్షాన శ్రీ సీతారాములను ఉపవాసముంచిన వసిష్ఠుడు

యశస్సు, సంపద, రాజ్యం లభించాలంటే, శాస్త్రీయ పద్ధతిలో వ్రతం జరపాలని, వ్రతాలలో ఉత్తమమైంది ఉపవాసమని, తాను ఆ రాత్రి సీతారాములను ఉపవాసం చేయమన్నానని, వాళ్లు పిల్లలై నందువలన ఎలా చేస్తారో-ఏమోనని, కాబట్టి అది శాస్త్ర ప్రకారం దగ్గరుండి జరిపించమని, వసిష్టుడితో చెప్పాడు దశరథుడు. వెంటనే వసిష్టుడు రథ మెక్కి రాముడింటికి వెళ్లాడు. ఆయన వచ్చిన విషయం తెలుసుకున్న రాముడు, ఆయనకు ఎదురెళ్లి స్వాగతం పలికాడు. రాముడు-సీత ఉపవాసం చేయాలని వసిష్టుడు రాముడితో అన్నాడు. రాజాజ్ఞ ప్రకారం వారిరువురిని ఉపవాసం వుండేట్లు చేసి, రాముడి పూజలందుకున్నాడు వసిష్టుడు. ఆ తరువాత శ్రీరాముడి ఇంటి నుంచి బయల్దేరి వెళ్లాడు.

శ్రీ రాముడి పట్టాభిషేకానికి గుంపులు గూడిన జనం

వసిష్ఠుడు వెళ్లగానే, అక్కడున్న ఇతర ప్రియ వాదులను, హితవాదులను కూడా వెళ్లమని చెప్పాడు రాముడు. శ్రీ రాముడి ఇంటినుంచి వసిష్టుడు దశరథుడి ఇంటికి వెళ్తున్నప్పుడు వీధుల్లో జనం గుంపులు-గుంపులుగా కనిపించా రాయనకు. ఇసుక వేస్తే రాలనంత జనం వున్నారు వీధుల్లో. శ్రీ రాముడికి ఎప్పుడు పట్టాభిషేకం జరుగుతుందా? ఎప్పుడు కళ్లారా చూస్తామా? అని ఎదురు చూస్తున్నారు వారందరు. వీధులన్నీ కోలాహలమే! వీధులన్నీ నీళ్లు చల్లి, అరటి స్థంబాలు కట్టి, రకరకాల ముగ్గులు వేసి, సూర్యోదయం కొరకు ఎదురు చూస్తున్నారా జనం. మిద్దెల మీద, మేడల మీద, పౌరులు కట్టిన ధ్వజాలు గాలికి ఎగురుతున్న తీరును చూస్తే, అవి, శ్రీ రామ పట్టాభిషేక వార్తను స్వర్గంలో వుండే దేవతలకు తెలియచేస్తున్నవా అన్నట్లుంది. అలా గుమిగూడిన జనం మధ్య నుండి వసిష్టుడి రథం పోయింది. ప్రజలకు

సీతారాముల పట్ల శ్రద్ధా భక్తులను గమనించిన వసిష్టుడు, ఆ విషయాన్ని దశరథుడికి చెప్పటానికి వెళ్లడం, ఆయనకు దశరథుడు ఎదురుబోవడం జరిగింది. శ్రీ రాముల ఉపవాసాన్ని గురించి ప్రశ్నించాడు వసిష్టుడిని దశరథుడు. శాస్త్ర ప్రకారం కార్యం ఎలా జరిపించాల్నో అలానే చేసానని జవాబిచ్చాడు వసిష్టుడు. ఆ తరువాత సభాసదులందరినీ వెళ్లమని ఆజ్ఞ ఇచ్చాడు దశరథుడు. తానూ తన ఇంటికి వెళ్లాడు.

❖ ❖ ❖

సర్గ-6

నారాయణార్చన చేసిన శ్రీ రాముడు

తన దగ్గరనుంచి వసిష్టుడు వెళ్లిపోయిన తరువాత, శ్రీ రామచంద్రుడు సతీ సమేతంగా స్నానం చేసి, విశాలాక్షి ఐన భార్యతో కూడి ఇక్ష్వాకుల వంశజుల ఇలవేల్పైన శ్రీ మన్నారాయణుడిని ఆరాధించాడు. ఆరాధనలో భాగంగా, హవిస్సున్న పాత్రను, శ్రుతిలో చెప్పిన విధంగా, తల పైకెత్తి, మండుతున్న అగ్నిహోత్రంలో మంత్ర పూరితమైన నేతితో-భక్తితో శ్రీ మన్నారాయణుడిని ధ్యానించుకుంటూ హోమం చేసాడు రాముడు. హోమం చేయగా మిగిలిన దానిని భుజించి శ్రీ మన్నారాయణుడిని హృదయంలో నిలుపుకుని, దర్భలతో తయారుచేసిన పక్కపైన, నారాయణ మందిరంలో నిద్రపోయాడు. దర్భశయ్యపైన తన పక్కనే భార్య వున్నప్పటికీ, ఆమెపై మనసు పోనీయలేదు. ఆమెతో మాట్లాడలేదు. అసిధారావ్రత చర్యా నిష్ఠుడై నిదురించిన రాముడు, నాల్గవ జాములో మేల్కొని, తన ఇల్లంతా స్త్రీలతో అలంకరింప చేశాడు. సూర్య మండల మధ్యవర్తి అయిన నారాయణుడిని గురించి, స్నానం చేసిన అనంతరం, సాష్టాంగంగా నమస్కరించి, నూతన తెల్లటి వస్త్రాలను ధరించి, బ్రాహ్మణ ముఖ్యులను పిలిపించి స్వస్తి వాచనం చేసేందుకు నియమించాడు రాముడు. ఈ విధంగా, ఉపవాస వ్రతాన్ని, శ్రీ రామచంద్రమూర్తి భార్యతో సహా పూర్తి చేసాడు. ఇది వినిన అయోధ్యా జనులు సంతోషంతో ఉదయం నుంచే నగరాన్ని అలంకరించడం మొదలెట్టారు.

శ్రీ రామ పట్టాభిషేకానికి అలంకరించబడిన అయోధ్య

దేవాలయాలలోను, చైత్యాలలోను, నాలుగు వీధులు కలిసే చోటను, వర్తకుల అంగళ్లలోను, జనులు కూడే చోటను, అన్ని ఇళ్లలోను, జండాలు కట్టారు. నటుల, నర్తకుల, గాయకుల పాటలు చెవుల పండుగగా వినిపించసాగాయి. దాదాపు అన్ని స్థలాలలోను అలంకారాలు చేయడం జరిగింది. శ్రీ రామచంద్రుడి అభిషేకం చూడడానికి, నాలుగు వీధులు కలిసే చోట, పెద్ద ఇళ్ల ముంగిట, గుంపులు కూడిన స్త్రీలు-పురుషులు ఆ దృశ్యాన్ని

కనుల పండుగగా చూసేందుకు వేచి వున్నారు. ఆ విషయాన్నే ముచ్చటించుకుంటున్నారు. శ్రీ రాముడి గుణగణాలను ఎరిగిన పెద్దవారితో సహా, ఆటాడుకునే పిల్లలు కూడా, రామ పట్టాభిషేకాన్ని గురించే మాట్లాడుకుంటున్నారు. రాముడి గుణాలను పొగుడుతూ: "మన దశరథుడు ఎంత మంచివాడు! కైక తన ప్రియురాలైనప్పటికీ, ఆమె కొడుకును యువరాజు చేయకుండా, ధర్మాన్ని అనుసరించిపట్టపు రాణి కొడుకు-పెద్దకొడుకు అయిన రాముడినే పట్టాభిషిక్తుడను చేస్తున్నాడు" అని శ్లాఘించారు పురజనులు. దశరథుడు తన ప్రియురాలి కొడుకైన భరతుడికి రాజ్యమిస్తాడేమోనని ప్రజలకు కూడా సందేహం వుండేది. ఆ సందేహం తీరిందిప్పుడు.

పట్టాభిషేకం గురించి ప్రజల సంభాషణ

పట్టాభిషేకం విషయంలో దశరథుడు తీసుకున్న నిర్ణయాన్ని హర్షిస్తూ ప్రజలు ఇలా మాట్లాడుకోసాగారు: "ఆహా! దశరథ మహారాజు ఎంత గొప్ప మనస్సు కలవాడు! తాను ముసలివాడైనందున, ఎవరికో ఒకరికి పట్టాభిషేకం చేయకుండా మరణించితే, తన కొడుకులు వారిలో వారు కలహించుకుందురేమోనని భావించాడు. అలా అనుకుని, పెద్ద భార్య కొడుకు-పెద్ద కొడుకైన శ్రీ రామచంద్రుడిని యువరాజు చేసేందుకు నిశ్చయించుకున్నాడు. ఎవరు రాజైతే మనకేంటి అనుకోరాదు. శ్రీ రాముడు మన రాజైతే మనందరం ధన్యులం. మరెవరో రాజైతే, వారివారు మాత్రమే బాగుపడతారు. రాముడు రాజైతే, వీరు-వారనక, గొప్ప-చిన్నవారనక అందరూ బాగుపడతారు. శ్రీ రాముడు మనుష్యుల ముఖం చూడగానే, ఎవరు గుణవంతులో, ఎవరు దుష్టులో కనిపెట్టగలడు. ఆయనకు ఒకరు చెప్పాల్సిన పని లేదు. ఆయన నిగర్వ శిరోమణి. గర్వమెట్టిదో ఎరుగడు. అందరితో మాట్లాడుతాడు. అందరి సుఖ దుఃఖాలను విచారించే గుణం కలవాడు. ధర్మాత్ములలో శ్రేష్టుడు కాబట్టి ధర్మాన్నే పాలించుతాడు. ధనవంతులైన అ ధర్మాత్ములను పాలించువాడు కాదు. తమ్ములలో ఏ ఒక్కరికో మద్దతివ్వడు. భ్రాతృవత్సలుడు. తమ్ములందరినీ బిడ్డలవలె ఆదరించువాడు. అలానే, సొంత తమ్ములను ఎలా ఆదరించునో, అలానే, మనందరినీ ఆదరించుతాడు. ఇలాంటి వాడు, ఇంతకాలానికి, మన రాజు

దయవల్ల, మనకు రాజవుతున్నాడు. ఇలాంటి శ్రీ రాముడు ఎవరి దయవల్ల భూమికి రాజవుతున్నాడో, ఆ దశరథుడు, దీర్ఘాయుష్మంతుడై జీవించాలి".

ఇలా పురజనులు సంతోషంతో మాట్లాడుకుంటుంటే, వారి మాటల ధ్వని, భూమికి–ఆకాశానికి మధ్య అంతరాళాన్ని నిండిపోయింది. ఆ జనుల ధ్వని పౌర్ణమి నాటి సముద్ర ఘోషను పోలి వుంది.

❖ ❖ ❖

సర్గ-7

అయోధ్య అలంకారాన్ని చూసిన మంథర

ఈ నేపథ్యంలో, ఎక్కడ పుట్టిందో, తల్లితండ్రులెవ్వరో తెలియని, కడుపు కూటికై సేవ చేస్తున్న కైక దాసి మంథర, తటాలున మేడ ఎక్కి చూడసాగింది. ఆమె మేడ ఎక్కి చూస్తున్నప్పుడు అయోధ్య స్థితి ఎలా వుందంటే: దుమ్ము లేవకుండా దండిగా నీళ్లు చల్లడం వలన వీధులు జిమజిమలాడుతున్నాయి. నానా రకాల పూలు వినోదంగా కనిపించే ట్లుగా వెదజల్లారు. జనులందరూ అభ్యంగన స్నానం చేశారు. తోరణాలకు పూల దండలు వ్రేలాడబడి వున్నాయి. ప్రతి ఇంటి మీద ధ్వజ పటాలు ఎగురవేయడం జరిగింది. శ్రీ రామచంద్రుడికి కానుకలిచ్చేందుకు, పురజనులు, పూల సరాలు, లడ్డూలు, ఇతర పిండి వంటలు చేతులో పట్టుకుని పోతున్నారు. దేవాలయాలన్నీ సున్నం వేయబడి, తెల్లగా ప్రకాశిస్తున్నాయి. ఎక్కడ చూసినా మంగళ వాద్యాలు మోగుతున్నాయి. మర్నాడు పట్టాభిషేకమనగా, ఆ సాయంకాలం, ఇదంతా చూసింది మంథర. శ్రీ రామ పట్టాభిషేక వార్త వూరంతా తెలిసినప్పటికీ, కైకకు తానే స్వయంగా చెప్పదల్చిన దశరథుడు, ఆ విషయాన్ని ఆమెకు చేరకుండా జాగ్రత్త పడ్డాడు. ఇతరుల ద్వారా ఆమెకా వార్త తెలిస్తే, ఆమె మనస్సులో వికారం కలిగి, ఏదైనా విఘ్నం చేయవచ్చని ఆయన అనుమానం.

సంతోషంతో కూడిన సమస్త జనులతో వ్యాపించి, బ్రాహ్మణ ఆశీర్వాదాలతో నిండి, సంతోషంతో ధ్వనులు చేస్తున్న గుఱ్ఱాలను-రంకెలు వేస్తున్న ఎద్దులను కలిగి, బాగా అలంకరించుకున్నట్లు కనిపిస్తున్నఅయోధ్యా నగరాన్ని చూసి ఆశ్చర్యపడి, శ్రీ రాముడు పట్టాభిషేకం తన సొంత కొడుకు పెళ్లిలాగా భావించి, పట్టు వస్త్రాలతో అలంకరించుకుని సంతోషంగా తిరుగుతున్న ఒక స్త్రీ మూర్తిని గమనించింది మంథర. విషయం తెలియని మంథర ఆమె దగ్గర సమాచారం కూపీ లాగే ప్రయత్నం చేసింది. శ్రీ రాముడి తల్లి కౌసల్య దగ్గర చాలినంత ధనం లేకపోయినా సంతోషంగా పలువురికి ధనం ఇస్తున్నదని, దానికి కారణమేమై వుండవచ్చని, నగరమంతా పుర జనులతో సంతోషంగా వుండడానికి

కూడా కారణమేంటని, రాజేమన్నా గొప్ప కార్యం చేస్తున్నాడా అనీ, మంథర ఆమెను అడిగింది. కల్లా కపటం కాని, మంథర విషపు బుద్ధి కాని తెలియని ఆ స్త్రీ మూర్తి, సంతోషంతో ఉప్పొంగి పోతూ, మంథరతో వున్న విషయం చెప్పింది. మర్నాడు ఉదయం పుష్యా నక్షత్రంలో, దశరథుడు, జితేంద్రియుడైన శ్రీ రాముడికి యౌవరాజ్య పట్టాభిషేకం చేయనున్నాడని చెప్పింది. కుంటిదైన మంథర ఎక్కడకుతిరగ లేనందున ఈ విషయం తెలియదంతవరకు. శ్రీ రాముడి పట్టాభిషేక వార్త విన్న మంథర, మండిపడుతూ, బిరబిరా పోయి, కైకకు ఆ విషయం తనదైన శైలిలో ఇలాచెప్పసాగింది.

శ్రీ రామ పట్టాభిషేక వార్తను కైకకు తెలిపి దుఃఖించిన మంథర

"ఓసీ బుద్ధిలేనిదానా? లేవవే! కొంప మునిగింది. ఆపత్సముద్రంలో పూర్తిగా మునిగిపోయిన నీవు హాయిగా నిద్రపోతున్నావెందుకు? భర్తకు ఇష్టం లేని దానవయ్యావు కదా. నువ్వు సౌభాగ్యవతిని అని వ్యర్థంగా దండోరా వేసుకున్నావు కదా! అలాంటి నీ సౌభాగ్యమంతా మండే ఎండల్లో నీళ్లు లేని ఏరు వలె అయిపోయింది కదా! రాజు నీ స్వాధీనంలో వున్నాడని, నీవు ఆడించినట్లు ఆడుతాడని విర్రవీగేదానివి. నువ్వో వెర్రిబాగులదానివి" అని కఠిన వాక్యాలంటున్న మంథరను, కైక, తీయటి మాటలతో, ఆమె ఎందుకలా మాట్లాడుతున్నదని, ఏం చేటు కాలం వచ్చిందని ప్రశ్నించింది. సమయానుకూలంగా, చమత్కారంగా మాట్లాడడంలో ఆరితేరిన మంథర, కైక శుభం కోరి, శ్రీ రాముడిని వేరు చేయదల్చి, కైకతో తన మనసులో మాట చెప్ప సాగింది. కైకకు ఏమీ తెలియదని, అందువల్ల ఆమెకు చెడిపోయే కాలం వచ్చిందని, అలా వూరుకుంటే గంటల వ్యవధిలోనే ఆమెకు కీడు కలగవచ్చని అంటుంది. మంథర ఇంకా ఇలా అనసాగింది:

"ఓ కైకా! వయసు పొగరుతో, నీ కేది మేలో, ఏది కీడో నీకే తెలియని పరిస్థితి కదా! ఎవరినైతే 'నా మగడు–నా మగడు' అని నీవు విర్రవీగుతావో, ఆ మగడే, రేపే, శ్రీ రాముడిని యువరాజును చేయడానికి సన్నాహాలు చేస్తున్నాడు.

ఈ వార్త విన్న నాకు భయం వేసి, ఎటూ పాలుపోక, వెంటనే నీ చెవిన వేద్దామని త్వరగా వచ్చాను. శ్రీ రాముడి పట్టాభిషేకం నాకు ఎలా కీడు కలిగిస్తుందని నువ్వు అంటావేమో? నీకు దుఃఖం కలిగించే విషయం కాబట్టే నేనూ దుఃఖ పడుతున్నాను. నువ్వు బాగుంటేనే కదా నేనూ బాగుండేది! నా యోగ క్షేమాలు, నీ యోగ క్షేమాలపై ఆధార పడ్డాయి. దీంట్లో సందేహం లేదు. కాబట్టి నా క్షేమం కొరకు, నేను, నీ క్షేమం కోరాల్సి వచ్చింది. నువ్వు పేరు-ప్రతిష్ఠలున్న రాజ వంశంలో పుట్టావు. ఇచ్చట దశరథ మహారాజుకు పట్టపు దేవివైనావు. ఇలా పుట్టినింట, మెట్టినింట, పూజనీయమైన స్థితిలో వున్న నువ్వు, ఈ మాత్రం తెలుసుకోలేక పోతున్నావు. నీకు చెప్పి ప్రయోజనం లేదు. నువ్వా...నా మాట వినేట్లు లేదు. నువ్వు బాగుపడేట్లు కూడా లేదు. రాజ వంశంలో పుట్టినప్పటికీ, రాజ ధర్మం-రహస్యం ఎంత క్రూరంగా వుంటాయో గమనించ లేకపోతున్నావు. నా లాంటి దాసి ఇలా చులకనగా మాట్లాడవచ్చునా? అని నీకు సందేహం కలగొచ్చు. రాజ ధర్మం అంత క్రూరమైందా అంటే, అవుననే అనాలి. రాజనీతి, వేశ్యా నీతి సమానమైనవి. రాజుల మాటలు ధర్మ శాస్త్రానికి అనుగుణంగానే వున్నప్పటికీ, మనసు మాత్రం మిక్కిలి భయంకరమై, క్రూర కార్యాలు చేయడంలోనే ఆసక్తి కలిగి వుంటుంది. తేనె లాంటి మంచి మాటలు కంఠం పైభాగాన్నుండి వస్తాయే కాని, హృదయాన్నుండి రావు. ఇది తెలుసుకోలేని నువ్వు, దశరథుడు, మనస్సు-వాక్కు ఒకే విధమైన చక్కటి నడవడి కలవాడని నమ్మి మోసపోయావు. ఆ నమ్మిన దోషమే ఇప్పుడు నిన్ను భయంకరమై ముంచుతున్నది".

"రాజుకు హృదయం, వాక్కు ఒకే రీతిగా లేదని నాకెట్లా తెలుసంటావేమో? ఇక్కడేమో నీతో అల్లి-బిల్లి మాటలు చెప్తూ, నీ మీదే ప్రాణాలన్నీ నిలిపినట్లు కనిపిస్తున్నాడు. అక్కడేమో, నీకు కీడు కలిగే విధంగా, నీ సవతి కౌసల్యకు అన్నీ ఇస్తున్నాడు. నీ విషయంలో, మాటల్లో చూపిస్తున్న తియ్యదనం, హృదయం నుండి చూపించడం లేదు. మాటలతో నువ్వు సంతోషిస్తే, సిరితో కౌసల్య సంతోషిస్తున్నది. పెద్ద కొడుకుకు పట్టాభిషేకం చేయడం న్యాయమేనంటావా? ఎంత దురాలోచన-దూరాలోచన చేసి నీ మగడు ఈ పని చేయడానికి సాహసించాడో నీవు ఊహించలేకపోతున్నావు. నీ కొడుకు భరతుడు ఇక్కడుంటే

వానికి రాజ్యం ఇవ్వమని నీవడగవచ్చేమో నని, నిన్ను మోసగించడానికి, నీ కొడుకును దూరంగా పంపాడు. వాడు లేని సమయం చూసి, తన నిక్కపు ప్రియురాలైన పెద్ద పెళ్లాం ముద్దుల కొడుకుకు పట్టాభిషేకం చేసే దురాలోచన చేశాడు. మా అన్న వచ్చి పిలిస్తేనే కదా నా కొడుకును పంపాను-అందులో రాజు దోషమేంటి అంటావా? ఒక వేళ దూరాలోచన-దురాలోచన రాజుకు లేకపోతే, పన్నెండేళ్లు అక్కడ ఎందుకుంచాలి? సంవత్సరమో-ఆర్నెల్లో వుంచి పిలిపించవచ్చు కదా? శ్రీ రాముడిని ఇన్నాళ్లు ఎడబాసి వుండగలడా? భరతుడి మీద ప్రేమ లేదు కనుకనే పోతే పోనీ, అని వూరకున్నాడు. ఆయన ఉపాయం తెలుసుకోలేక నువ్వు వూరుకున్నావు. దురాలోచనే లేకపోతే, అందరు కొడుకులను వుంచుకుని, ఎందుకీ పని చేయకూడదు? బంధువులందరిని ఎందుకు పిలిపించకూడదు? ఇవ్వాళ అనుకుని రేపే ఎందుకు చేయాలి? అంత తొందరేమొచ్చింది? పన్నెండేళ్లయితే భరతుడు తిరిగొస్తాడు...రాముడికి పట్టాభిషేకం చేయడం సాధ్యం కాదని భావించడమే కదా? ఇదంతా ఆలోచిస్తే రాజు దుష్టుడనిపించడం లేదా? మగడనే పేరుగల పగవాడిని ఎరుగక, బుద్ధిలేని దానివై, తొడమీద పామునుంచుకుని, పాలు పోసి పెంచుతున్నావు కదా? నువ్వింకా ఉపేక్షించితే, శత్రువులు, పాములు చేసే విధంగా, దశరథుడు నిన్ను నీ కొడుకుతో సహా అలానే చేస్తాడు".

"చిన్నదానా! అందుకే తెలివిలేని దానా! నువ్వు చిరకాలం సుఖాలను అనుభవించావు. పాపాత్ముడైన దశరథుడు మోసంతో, రాముడికి పట్టాభిషేకం జరిపిస్తే, నువ్వు నీ బంధువులు కూడా చెడిపోరా? ఇన్నాళ్లు భోగాలనుభవించిన దానివి ఇకపైన దుఃఖాన్ని అనుభవించాల్సి వస్తుంది. దేవీ! నువ్వేదో ప్రమాద వశాన ఆలోచించలేక పోతున్నావు కాని, స్వభావ సిద్ధంగా, కాలానుగుణంగా సరైన ఆలోచన చేసే నేర్పుగలదానివే! చేసిన ఆలోచనను కొనసాగించే సామర్థ్యం కూడా నీకుంది. ఇలాంటి పనుల్లో నీ బుద్ధి బలంతోను, సామర్థ్యంతోను పని లేదు. ఎలాంటివారినైన ఆశ్చర్యానికి గురిచేయగల నీ నేత్ర సౌందర్యమే ఏ పనైనా చేయగలదు. నా మాట విను. నీ కొడుకును, నిన్ను, నన్ను రక్షించే ఉపాయం కనిపెట్టు. నీకు మేలైన పని జరగడానికి ఇదే సరైన సమయం. ఇది తప్పిపోతే మరో అవకాశం రాదు. పొరపాటు పడొద్దు" అని మంథర తీరు తీరుగా కైకకు బోధించింది.

సహజ సౌందర్యవతి అయిన కైక మరింత అందంగా కనిపించి, కైక చెప్పిన మాటలకు సంతోషించింది. పడుకున్నదల్లా లేచి కూచుంది. కైక గొప్ప రాజవంశంలో పుట్టినప్పటికీ సాత్వికురాలు కాదు. కైక సహజంగా సాధుమతి అని కూడా కొందరంటారు. శ్రీ రామచంద్రుడు తన గుణగణాలతో ఏ విధంగానైతే దశరథుడి మెప్పు పొందాడో, అదే విధంగా, కైకేయి సదభిప్రాయం కూడా పొందాడు. మంథర చెప్పిన మాటలు విన్న కైకేయి, సంతోషంతో, అత్యద్భుతమైన, తనకు ఇష్టమైన వార్త వినడంతోనే, ఆశ్చర్యపడి, తన దేహం మీదున్న ఆభరణాలలో శ్రేష్టమైన దానిని ఒకటి తీసి అలాంటి సంతోష వార్త తెలిపిన మంథరకు బహుమానంగా ఇచ్చింది. తానిప్పుడిచ్చింది చాలా తక్కువని, ఇంతకంటే ఎక్కువ బహుమానానికి ఆమె అర్హురాలని అంటుంది కైక. సవతి కొడుకు పట్టాభిషేకం తనకు ప్రియమైందనీ, తనకు ఉపచారం చేసే విషయంలో రాముడికి, భరతుడికి బేధాన్ని తానెరుగనని కూడా అంటుంది కైక. రాముడికి పట్టాభిషేకం జరగడం అంటే తన కొడుకుకు అయినట్లేనని, ఇంతకంటే తనకిష్టమైన వార్త లేదని అంటుంది.

❖ ❖ ❖

సర్గ-8

కైకను దూషించిన మంథర

రాముడికి పట్టాభిషేకం జరగడం తన కిష్టమైన వార్త అని అన్న కైక మాటలు మంథరకు రుచించలేదు. తన మాట కైక వినడం లేదని కోపమొచ్చింది. ఆమె తనకు ఇచ్చిన సొమ్మును విసిరి పారవేసింది. తమ కేదో కష్టం జరుగబోతున్నట్లు భావించి కైకతో ఇలా అంటుంది: "నేను ఇంత చెప్పినా తెలుసుకోలేని మూర్ఖురాలా! ఇది నువ్వు సంతోషించాల్సిన సమయం కాదు. శోకానికి, సముద్రానికీ మధ్య మునగబోతున్నప్పటికీ నీ దశ నువ్వు తెలుసుకోలేక పోతున్నావు. భయంకరమైన గొప్ప ఆపద నీకు దాపురించినప్పటికీ, దానినే మేలని భావించే నిన్ను చూసి, నువ్వు రాణివి-నేను దాసిని అన్న సత్యాన్ని కూడా మరిచి పోయి నవ్వాలనిపిస్తోంది. నీ సవతి కొడుకు రాజవుతున్నాడని కాని, నీ కొడుకు కాలేకపోతున్నాడని కాని నాకు బాధ లేదు. రాచ కూతురు వైన నీకు ఇంత మాత్రం తెలివిలేదనేదే నా బాధ. పగ వాడి లాంటి సవతి కొడుకు రాజవుతుంటే, మృత్యు దేవతవలె వచ్చి నీ కుత్తుక పట్టుకుంటుంటే, నువ్వెలా సంతోషిస్తున్నావు? నిజంగా నీకే తెలివి తేటలుంటే రామ పట్టాభిషేకం గురించి నీవేమనుకుంటున్నావో చెప్పు? నీకు తెలియకపోతే నేను చెప్తా విను! రాజ్యం పొత్తుల సొమ్ము. రాముడికి, భరతుడికి ఇందులో భాగముంటుంది. ఒకరి సొత్తు ఇరువురికి పోతుంటే, మరో వ్యక్తిని చంపి ఆ సొమ్మును పూర్తిగా అనుభవించాలను కోవడం సహజం. ఆ కారణంగా రాముడికి భరతుడివలన ప్రాణ భయం వుంది. రాముడు చనిపోతే రాజ్యమంతా భరతుడిదే! కాబట్టి, తనకు అపాయం చేస్తాడని రాముడే భరతుడిని చంపుతాడు. అంటే, భయపడే వాడి వల్లనే, భయపెట్టేవాడికి భయం వుంటుందనేది వాస్తవం".

"ఇలా...ఆలోచించుకుంటూ పోతే, రాముడి వలన భరతుడికి అపాయం కలుగుతుందేమోనని భయమేస్తోంది. ఉదాహరణకు, మనుషులు పాములను, తేళ్లను బాధ పెట్తారు కాబట్టే అవి వారిని బాధించుతాయి. ఇక లక్ష్మణ, శత్రుఘ్నుల విషయమంటావా? లక్ష్మణుడు రాముడిని, శత్రుఘ్నుడు భరతుడిని సేవించుతున్నారు కదా! రాముడి తరువాత రెండవ వాడు భరతుడు. ఆవల

పుట్టినవారు భరత శత్రుఘ్నులు. రాముడి అనంతరం రాజ్యం భరతుడిదే కాని లక్ష్మణుడిది కాదు. అంటే, లక్ష్మణుడి వల్ల రాముడికి భయం లేదు. రాముడు సామాన్యుడు కాదు. కార్యాకార్యములందు పట్టు విడుపులున్న వాడు. తప్పొప్పులు బాగా తెలిసినవాడు. ఎల్ల వేళల క్షమయే దాల్చి వుండేవాడు. రాజనీతిలో సమర్థుడు. కార్య దక్షతలో నేర్పరి. సమయానుకూలంగా ఎప్పటి పని అప్పుడే చేసేవాడు. ఇలాంటి వాడి వల్ల నీ ముద్దుల కుమారుడికి ఏ హాని జరుగునో అని భయం వేస్తోంది. దేహం వణకుతుంది. ఆహా! కౌసల్య ఎంత పుణ్యాత్మురాలో కదా! ఉదయం అవుతూనే, పుష్యా నక్షత్రంలో, తన కుమారుడిని దశరథ మహారాజు యౌవ రాజ్యానికి పట్టాభిషేకం చేస్తుంటే, ఎంతో సంతోషించును కదా! ఏమి, ఆమె అదృష్టం? ఏమి ఆమె కడుపు చలువ? తల్లి అంటే, కౌసల్యే కాని ఇతరులు కాదు కదా! కౌసల్యా దేవి తన కొడుకు రాజ్యమేలుతుంటే, ముసలి రాజును తన చెప్పు చేతల్లో వుంచుకుని, సవతులందరూ తన మహోన్నత పదవిని చూసి దుఃఖిస్తుంటే, విర్రవీగుతుంది కదా! కౌసల్యకు నువ్వు కూడా లొంగి పోయి, చేతులు ముడుచుకుని, మాలో ఒకదాని విగా, నువ్వూ దాస్యం చేయాల్సిందే కదా! అలానే నీ కొడుకు కూడా చేతులు కట్టుకుని, రాముడికి సేవలు చేయాల్సిందే కదా! " అని అంటుంది మంథర కైకతో.

శ్రీ రాముడి గుణగణాలను మంథరకు వర్ణించి చెప్పిన కైక

అలా రాముడిని గురించి, కౌసల్యను గురించి చెడుగా చెపుతున్న మంథర మాటలను వింటున్న కైక, రఘువంశంలో పుట్టిన రాజులందరిలో శ్రేష్ఠుడైన శ్రీ రామచంద్రుడి గుణగణాలను అది గ్రహించ లేకపోయిందే అని అనుకుంటూ, వాటిని ఇలా బోధిస్తూ, వివరించ సాగింది ఆమెకు. "శ్రీ రామచంద్రమూర్తి, తనకు ఇతరులు చేసిన మేలు, మరిచేవాడు కాదు. స్త్రీల విషయంలో, ధనం విషయంలో, పరిశుద్ధమైన మనసు కలవాడు. సత్యాన్ని మరవడు. ఇంద్రియ నిగ్రహం కలవాడు. పెద్దల, ఆచార్యుల, తల్లిదండ్రుల మనసెరిగి నడచుకుంటాడు. ఇవి కల వారందరూ రాజ్యార్హులు కావాలని నేను అనడం లేదు. కాని, రాజు పెద్ద కుమారుడు, జన్మతః, కర్మముతో, గుణంతో, యోగ్యుడైన

వాడు రాజ్యానికి అర్హుడే కదా? రాముడు రాజ్యం ఏలితే, నా కొడుకు గతేంటి అంటావేమో? శ్రీ రామచంద్రుడు తమ్ములను, భృత్యులను, తండ్రిలాగా ప్రేమతో పెంచుతాడు. ఇలాంటి గొప్ప గుణాలున్న శ్రీ రామచంద్రుడికి పట్టాభిషేకం జరుగుతుంటే, కుబ్జా, నువ్వెందుకు ఏడుస్తావు? నీ దేహమంతా వక్రబుద్దేనే! నీ బుద్ధి అంతే కదా! శ్రీ రాముడు వంద సంవత్సరాలు రాజ్యమేలినప్పటికీ, ఆయన తరువాత నా కొడుకే సమస్త ఐశ్వర్యంతో రాజు అవుతాడు. తండ్రి సంపద కొడుకుకు వస్తుంది. ఇప్పుడది శ్రీ రాముడికి వచ్చింది. ఆ తరువాత భరతుడికి వస్తుంది. ఇంత మాత్రానికి నువ్వెందుకు ఏడుస్తావు? న్యాయం నీకు చేదా? నాకు భరతుడెట్లాగో, అంత కంటే ఎక్కువగా శ్రీ రాముడు కూడా. ఎందుకంటే..తన తల్లికి శ్రీ రాముడు ఎంత సేవ చేస్తున్నాడో, అంతకు ఏ మాత్రం తక్కువ లేకుండా నాకూ చేస్తున్నాడు. శ్రీ రాముడు రాజైతే, భరతుడైనట్లే అనుకుంటాను. శ్రీ రాముడిలో భేద బుద్ధి లేదు. తన సుఖమెలాగ చూసుకుంటాడో, అలానే ఇతరుల సుఖం కూడా చూసుకుంటాడు".

ఇలా కైక చెపుతుంటే, వేడి నిట్టూర్పు గాలి విడుచుకుంటూ, కైక మనస్సు చీకాకు పడే మాటలు మళ్లీ చెప్పసాగింది మంథర ఈ విధంగా:

కైకకు దుర్బోధ చేస్తున్న మంథర

"కీడు కలిగే ఆలోచన చేస్తున్నావు కదా కైకా! నేనెంత చెప్పినా తెలుసుకోలేక పోతున్నావు కదా! నువ్వు మూర్ఖురాలవు. వ్యసన సముద్రంలో నిండా మునిగినా నీకు రాబోయే ఆపద గ్రహించ లేకపోతున్నావు. రాముడు రాజైన తరువాత, ఆయన తదనంతరం, ఆయన కొడుకు రాజవుతాడు కాని నీ కొడుకెలా అవుతాడు? రాజు కొడుకులందరూ రాజులు కాలేరు. పెద్దవాడు నీతిమంతుడైనా, కాకపోయినా, వాడికంటే చిన్నవారు నీతిమంతులైనప్పటికీ, పెద్దవాడే రాజవుతాడు. ఈ కారణం వల్ల, నీ ప్రియమైన కొడుకు, రాజు కాలేక, దిక్కులేని వాడివలె అవమానం పడడం చూడలేని నేను, నిన్ను తొందర పెడుతున్నాను. కైకా! సవతి కొడుకుకు సంపద లభించపోతున్నదని, నువ్వు నాకు బహుమానం ఇచ్చావా? వాస్తవం చెప్తా విను. శత్రు రహిత రాజ్యాన్ని పొందనున్న శ్రీ రాముడు నీ కొడుకును అడవుల పాలు చేస్తాడు. లేదా చంపుతాడు. ఇది

సత్యం. నీకు తెలివిలేనందునే, ఒక్కగా ఒక్క నీ కొడుకును, బాలుడిని, వెనుకా ముందు తెలియని వాడిని, మేనమామని చూసే సాకుతో దూరంగా పంపావు. ఇంతకంటే మోసం లేదు. కొడుకు ఎలా కొడుకే కదా! దూరంగా వున్నా దగ్గరగా వున్నా ఒక్కటే అంటావేమో! చెట్లు కూడా ఒకదాని పక్కన మరొకటి వుంటే స్నేహంగా మసలుకుంటాయి. అలానే రాజుకు కూడా. నీ కొడుకు ఇక్కడే వుంటే, దశరథుడికిరాముడి మీద ఎంత ప్రేమ వుండేదో, అంత ప్రేమ భరతుడిపై కూడా వుండేది. అలాంటప్పుడు రాజ్యం ఎవరికివ్వాలా అని ఆలోచనన్నా చేసే వాడు. అలాంటి అవకాశం నువ్వు జారవిడుచుకున్నావు. కనీసం శత్రుఘ్నుడున్నా బాగుండేది. భరతుడి పక్షాన ఆయనన్నా మాట్లాడేవాడు. ఏదీ కాకుండా చేసింది నువ్వే! నీ కొడుకు నోట్లో నువ్వే విషం పోసావు. ఇక లక్ష్మణుడంటావా? శ్రీ రాముడిని ఒక్క గడియ కూడా వదిలి వుండడు. అలానే లక్ష్మణుడిని శ్రీ రాముడు కూడా కాపాడుతుంటాడు. అశ్వినీ దేవతల సోదర భావమెలాంటిదో, రామలక్ష్మణుల సోదర భావమలాంటిది. ఇది లోక ప్రసిద్ధం. లక్ష్మణుడికి రాముడెప్పుడూ కీడు చేయడు. నీ కొడుకుకు చేయక మానడు. ఈ కారణం వల్ల, నీ కొడుకు మేనమామ ఇంటి నుంచి అడవులకు పోవడమే క్షేమం. వస్తే చావడం ఖాయం. రాజ్యం లేకపోయినా కనీసం ప్రాణాలైనా దక్కుతాయి. అలా కాకుండా భరతుడే రాజైతే, మరీ మేలు కదా? భరతుడు పిల్లవాడు. మాయ మర్మాలు తెలియవు. సుఖ పడాలనుకునేవాడు. కష్టజీవి కాడు. రాముడికి భరతుడే కీడు చేయలేదు కాని, నీ కడుపున పుట్టడం వల్ల రాముడికి శత్రువయ్యాడు. ఇలాంటి వాడు సంపద లేకుండా రాముడికి ఎలా వూడిగం చేస్తాడు? అలా చేసినా, సహజ విరోధం పోదు. ఆపద రాక ముందే భరతుడిని రక్షించడం నీ విధి. భరతుడికి రాజ్యమైనా ఇప్పించు...లేదా... అడవుల పాలైనా చేసి రక్షించు. ఉసురుంటే ఉప్పైనా అమ్మి బతకొచ్చు! భరతుడి గతి ఇలా వుంటే, ఇక నీ గతీ అంతే! ఇంతకు ముందు దాకా, దశరథుడు నీ వాడని నువ్వు గర్వ పడేదానివి. కౌసల్యను లెక్క చేయకపోయేదానివి. అలా మిడిసిపడిన నిన్ను, తనను అవమానించిన నిన్ను, చెల్లెలివి కదా అని కౌసల్య నిన్నేమీ కౌగలించుకోదు. ఆడు పాము లాగా కౌసల్య విషమంతా నీ పై కక్కక మానదు. నవ్వుకుంటూ చేసిన దానివి, ఇప్పుడు ఏడ్చుకుంటూ

భరించాల్సిందే! తన తల్లిని కష్టపెట్టిన నిన్ను రాముడు కూడా క్షమించడు. శ్రీ రామచంద్రుడు మంచివాడని, నీపై భక్తి కలవాడని, భరతుడి కంటే ప్రియమైన వాడని, చాలా మాటలు చెప్పావు. కాని, ఇదంతా ఎంతవరకు? రాజ్యం తనకొచ్చే వరకే! దాని కొరకే ఈ నాటకమంతా. ఈ భూ చక్రమంతా తనకు సంక్రమించగానే, నీకు, నీ కడుపున బుట్టిన దోషానికి భరతుడికి కీడు చేస్తాడు. ఇది నిజం. నా మాట నమ్ము. పశ్చాత్తాప పడవద్దు. నీకు దారిద్ర్యం, అవమానం తప్పవు. కాబట్టి, రాముడు రాజై ఐశ్వర్యవంతుడైతే, నీ కొడుకుకు ముప్పు తప్పదు. అందుకే, నీ కొడుకు రాజ్యమేలే విధంగా, రాముడు దేశాంతరం పోయే విధంగా ఆలోచన చేయి. అప్పుడే మీ ఇద్దరూ బాగుపడతారు".

❖ ❖ ❖

సర్గ-9

శ్రీరామ పట్టాభిషేకం విఘ్నం చేసే ఉపాయం చెప్పమని మంథరను అడిగిన కైక

కైక స్వభావసిద్ధంగా సాధు హృదయం కల వ్యక్తి కాదు. కాకపోతే, శ్రీ రాముడి గుణగణాలు ఆమెను మంచి దాన్ని చేశాయి. అయితే, మంథర చేసిన దుర్బోధలను ఆమెలోని సహజమైన దుర్బుద్ధిని బయట పెట్టాయి. తీవ్రంగా ఆలోచించింది. మంథర చెప్పింది సబబుగానే అనిపించింది. తనను సవతి కౌసల్యకు దాసిగా చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని భావించే స్థితికి ఆమె ఆలోచనలు పోయాయి. కోపంతో వేడి నిట్టూర్పులు విడిచింది. కుబ్జ మంథరను చూసి చెప్పసాగింది. ఆమె చూస్తుండగానే, శ్రీ రామచంద్రుడిని ఆ నిమిషంలోనే అడవుల పాలు చేసి, తన కొడుకు భరతుడికి పట్టాభిషేకం జరిపిస్తానంటుంది. "మంథరా! న్యాయమో-అన్యాయమో, ఏదో ఒక విధంగా, శ్రీ రామచంద్రుడు రాజ్య పదవి లేనివాడి గాను, నా కొడుకు రాజు గాను చేయాలి. దీని కొరకు మంచి ఆలోచన చెప్పు" అని అంటుంది. బదులుగా మంథర, "బలే...బలే. కైకా ఇప్పుడు నువ్వు నిజమైన ఆడదానివి. తెలివిగలదానివి. తన మేలు తాను ఆలోచించ లేనిది ఆడది కాదు. నీ కొడుకుకు రాజ్యం వచ్చే ఉపాయం నీకు తెలియదా? నీకు మేలైన ఆ ప్రయోజనం గురించి నేనే చెప్తాను విను. ఐనా, నీకు మాత్రం తెలియదా? తెలిసి మర్చిపోయావా? లేక, నా తెలివితేటలు పరీక్షించాలను కుంటున్నావా? నువ్వే పూర్వం ఎన్నో సార్లు నాకా విషయం చెప్పావు. అది నువ్వు మరిచిపోయావని నేనెలా అనుకుంటాను? ఐనా, నా మాట నీకు రుచిస్తుందా? నీ మాటే నీది కాని...నా నోటితో చెప్పించి నన్ను ఇబ్బంది పెట్టడానికా? అలా కాదు...వాస్తవంగానే అడుగుతున్నానంటే, చెప్తా విను. నేను చెప్పానని నువ్వు ఒప్పుకోవాల్సిన పని లేదు. నాకు తోచింది నేను చెప్తాను. అది సరైందనుకుంటే ఆచరణలో పెట్టు. నీ ఉప్పు తిన్నాను కనుక నీకు మేలు చేయడం నా ధర్మం. ఆ ఉపాయాన్ని కార్యరూపం చేయడమెలాగో ఆలోచన చేయి" అని జవాబిస్తుంది. తన కొడుకుకు రాజ్యం రావాలని, రాముడికి

పట్టాభిషేకం కాకూడదని, దానికి కావాల్సిన ఉపాయం అడుగుతున్నానంటుంది కైక. ఉపాయం చెప్తే తప్పక అమలు చేస్తానంటుంది. భయ పడవద్దని, పని అయ్యే మార్గం చెప్పమని అడుగుతుంది మంథరను కైక. అలా అడిగిన కైకకు పాప బుద్ధి కల మంథర తన రాణికి సంతోషం కలిగించే ఉపాయం చెపుతుందిలా.

"దేవతలు రాక్షసులతో యుద్ధం చేసే సమయంలో, ఇంద్రుడు నీ భర్తను తనకు తోడు రమ్మని అడిగాడు కదా! అప్పుడు దక్షిణ దిక్కున వున్న దండకారణ్యంలో పగవాడైన శంబరుడి పట్టణమైన వైజయంతం మీదకు నీ భర్త దండయాత్రకు పోయేటప్పుడు ఆయన వెంట నువ్వు కూడా వెళ్లావు కదా! ఆ యుద్ధంలో మాయల మారి శంబరుడు ధర్మం తప్పి రాత్రివేళ శత్రువులను చంపుతుండగా, దశరథుడు వారిని ఎదిరించి, రాక్షసుల వల్ల గాయపడి, రథం మీద మూర్ఛపోయిన సంగతి గుర్తుంది కదా! అలా గాయపడి మూర్ఛ పడిపోయిన నీ భర్తను, హత సారధిగల ఆ రథాన్ని, ఆపద నుంచి తొలగించి, యుద్ధ భూమి నుంచి దూరంగా తీసుకుని పోయావు నువ్వు. అక్కడికి కూడా తరుముకుంటూ వచ్చిన రాక్షసుల బారిన పడకుండా వేరొక రహస్య ప్రదేశానికి రథాన్ని తోలుకు పోయావు. అలా రెండు సార్లు ప్రాణాపాయం నుంచి కాపాడిన నీకు దశరథుడు రెండు వరాలిచ్చాడు. నువ్వు ఆ వరాలను అప్పుడు కోరలేదు. అక్కరపడి ఇష్టం వచ్చినప్పుడు అడుగుతానంటే, అలాగే కానిమ్మని దశరథుడు అన్నాడు. ఈ వృత్తాంతమంతా నువ్వే నాకు చెప్పావు. నువ్వు మరిచిపోయినప్పటికీ, నీ మేలు కోరే నేను మరిచిపోలేదింకా" అని ఇంకా ఇలా అంటుంది మంథర.

రాజుపై కోపం వచ్చినట్లు నటించమని కైకకు బోధించిన మంథర

"కమలాక్షీ! నీ భర్త నీకు రెండు వరాలిస్తానన్నాడు కదా! అవెలాగ అడగాలో చెప్తా విను. పట్టాభిషేకం కొరకు ప్రస్తుతం రాముడికి చేస్తున్న కార్యక్రమాలన్నిటినీ రద్దు చేసి, అవి భరతుడికి చేయమని అడగడం ఒకటి. రెండోది...పద్నాలుగు సంవత్సరాలు రాముడు అడవులకు వెళ్లాలని కోరడం. ఈ రెండు వరాలు కోరుకో. (రెండోది లేకుండా మొదటిది అనర్థకం అని కూడా సూచించింది).

భరతుడికి రాజ్యమిస్తే చాలు కదా...శ్రీ రాముడిని అడవులకెందుకు పొమ్మని అడగాలంటావేమో? ప్రజలందరికీ రాముడంటే ప్రీతి. ఎక్కడినుండో భరతుడొచ్చి, నేనే రాజునంటే అతడి మీద ప్రేమ ఎలాకలుగుతుంది? శ్రీ రాముడిక్కడుంటే ప్రజలందరు అతడి పక్షమే వుంటారు. భరతుడిని పదవీచ్యుతుడిని చేస్తారు. రాముడు అరణ్యాలకు పోతే, రాజ్యం నిరాటంకంగా భరతుడిదే. అలా పద్నాలుగు సంవత్సరాలు జరిగితే, భరతుడిపై ప్రజలకు ప్రేమ కలుగుతుంది. లోకులు ఆయనకు వశమవుతారు. అప్పటిదాకా రాముడు బతికుండి తిరిగొచ్చినా భయం లేదు. ఇక పోతే...నువ్విలా పట్టు పానుపు మీద కూర్చుని ఆషామాషీగా వరాలు అడిగితే, నీ తల్లికి ఆమె భర్త వల్ల ఏ గతి పట్టిందో, అదే గతి నీకూ పడుతుంది. అడగాల్సిన పద్ధతి వుంది. అది నేను చెప్తాను. కోపం వచ్చిన దాని వలె నటించుతూ, కోప గృహానికి పోయి, నేలమీద చినిగిన గుడ్డ వేసుకుని పడుకో. నీ భర్త నీ దగ్గరకు వచ్చే సమయానికి వగలమారి ఏడుపు మొదలెట్టు. నీది నిజమైన ఏడుపో, కాదో, దశరథుడు తెలుసుకోలేడు. ఆయన పిలిచినా పలుకవద్దు. జాగ్రత్తగా నాటక మాడు. ముసుగు బిగించి పడుకో! నిన్ను లెక్క చేయకుండా పోతాడేమోనని సందేహించ వద్దు. నీ మగడికి నీ మీద చాలా ప్రేమ. నువ్వు నిప్పుల్లో దూకమన్నా సరేనంటాడు. నీకొరకు ప్రాణాలిమ్మన్నా ఇస్తానంటాడు. ఇక నీ వరాలకు ఢోకా లేనే లేదు. మగవారు స్త్రీల సౌందర్యం చూసి వశ పడతారు. ఆ సౌందర్యం అతడికి నీలో కనిపిస్తుంటుంది. నీవు అందగత్తెవు...మంచి వయసులో వున్నావు. ఆ కాముకుడు నీ సౌందర్య దాసుడే కాని గుణ దాసుడు కాదు. నీ లాంటి రూపవతిని విడిచి ముసలి భార్యల దగ్గరకు ఎలా పోతాడు? సందేహంతో మనస్సు చలించనీయవద్దు. నీ భర్త నీ మాట జవదాటడు. దానికి కారణం నీ సౌందర్య బలమే! నువ్వు వరాలు కోరగానే, అవి కాదనటానికి, ప్రత్యామ్నాయంగా నీకెంతో ధనం ఇస్తానంటాడు. ప్రసిద్ధములైన రత్నాలిస్తానంటాడు. వాటికి లోబడకు. మనస్సు దృఢంగా వుంచుకో. నువ్వు వరాలు కోరగానే, తన ప్రాణాలు కాపాడిన వారు కోరుకున్న వరాలు ఇవ్వడానికి వెనుకాడడు. ప్రాణదానం చేసినవారిని ఎలా కాదంటాడు? దశరథుడు రాగానే, వరాలడగకు. ముందు యుద్ధం నాటి వరాలను గుర్తు

చేయి. అవి ఇస్తానని వాగ్దానం తీసుకో. ప్రమాణం చేయించుకుని అడగాల్సిన రెండు వరాలు అడుగు". ఇంకా ఇలా అంటుంది మంథర.

"చంద్రముఖీ! నీవు హటయోగం చేసి, పట్టుబట్టి కోరాల్సింది, రాముడి అరణ్యవాసమే! శ్రీ రాముడు అరణ్యాలకు పోతే అంతా సవ్యంగా జరుగుతుంది. అతడు పోకపోతే, భరతుడికి రాజ్యం వచ్చినా అనర్థ కరమే! శ్రీ రామచంద్రుడు లేని పక్షంలో, రాజైన భరతుడికి భయంతోనో-భక్తితోనో, ప్రజలందరు వశ పడి వుంటారు. రాముడు అరణ్యాలలోనే మరణిస్తాడు. ఇది నిజం. పద్నాలుగేళ్ల కాలపరిమితి ఎందుకంటావేమో? అలా పరిమితి వుంటేనే, గడువు తీరగానే రాముడొస్తాడన్న నమ్మకంతో ప్రజలు వుంటారు. శాశ్వతంగా రాముడు పోవాలని కోరితే, ప్రజలిప్పుడే తిరగబడతారు. శ్రీ రాముడు కూడా అంగీకరించడు. భరతుడెలాగు ఇక్కడ లేడు. రాజేమో ముసలివాడు. ప్రజలు తిరగబడకుండా చూసుకోవాలి. మన పని ఎలా జరుగుతుందో చూసుకోవాలి కాని, మనకు రాముడు ఎడల శాశ్వత శతృత్వం వుందని కనిపించకూడదు. ఒక వేళ రాముడు బతికుండి తిరిగొచ్చినా నష్టం లేదు. భరతుడప్పటికి ప్రజలకు ఆమోదయోగ్యుడవుతాడు. స్నేహితులను సంపాదించుకుంటాడు. రాజ్యంలో పాతుకు పోతాడు. ఆడదాని సాహసం, నేర్పు చూపాల్సిన సమయమిదే".

ఇలా మంథర చెప్పుడు మాటలు ఆకళింపు చేసుకున్న కైక, రాజ్యమంతా తన కొడుకుకు అయినట్లే భావించింది. సవతులందరూ తన దాసీలే కదా అని సంతోషించింది. కైక తనకు మంథర ఇచ్చిన విషం, రసాయనంగా పని చేసింది. తాను తప్పుడు మార్గంలో పోతున్నానని భావించకుండా, కుబ్జ మంథర తెలివికి ఆశ్చర్యపడి సంతోషంతో ఇలా అంటుంది కైక.

మంథరను మెచ్చుకున్న కైక

"కుబ్జా! ఈ గడియ దాకా, నువ్వింత సమర్థురాలి వని నేననుకోలేదు. లోకంలో ఎంతమంది మరుగుజ్జు స్త్రీలు లేరు? ఏం ప్రయోజనం? పొట్టి వారికి పుట్టెడు బుద్ధులంటారు. కుబ్జలు సాధారణంగా బుద్ధిమంతులే కాని, వాళ్లలో ఒక్కరు కూడా నీ అంత తెలివి గల వారు లేరు. దశరథుడి అభిప్రాయం నాకే ఇంతవరకు తెలియదు. నువ్వు తెలుసుకున్నావు. ఇంతమంది కుబ్జలలో

నువ్వొక్కదానివే కదా నా మేలు కోరేదానవు! వంకర టింకరగా వుండే మరుగుజ్జులు ఎందరు లేరు? వారిని చూడ బుద్ధే కాదు. చూడడానికే వికారమైన దేహాలుంటాయి వాళ్లకు. నువ్వూ అంతే వుంటావు...నీకు వాత రోగం...కొంకిరి బింకిరి శరీరం...నడ్డి నడుం...గూని...కొంకి కాళ్లు...పొట్టి చేతులు. ఐనా, అందంగానే వున్నావు! (కైక దృష్టిలో మంథర సౌందర్యవతిగా కనిపిస్తోంది). అందంగా, నిండుగా బలిసిన మొలతో, ఉబ్బి పైకి పొడుచుకుంటూ వస్తున్న స్తనాలతో, పండు వెన్నెల కాస్తుండే స్వచ్ఛమైన పూర్ణ చంద్రుడి లాంటి మోముతో, సన్నగిల్లిన పిక్కలతో, నిడు పైన కాళ్లతో, ఓ...మంథరా. నువ్వు చాలా అందంగా వున్నావే! తెల్ల చీరె కట్టుకుని, పొడవైన నీ తొడలను అటూ-ఇటూ తిప్పుకుంటూ మెల్లమెల్లగా నువ్వు నడుస్తుంటే, మదించిన రాజ హంసలాగా కనిపిస్తున్నావు. శంబరాసురుడికి వేయి మాయలే వచ్చును. నీకు మాత్రం వేనవేలు....కొల్ల కొల్లలుగా వచ్చు. వాడికి రాని మాయలు కూడా నీకు వస్తాయి. పెద్ద రథం ఇరుసులాగా పొడగాటి నీ రొమ్ములో రాజనీతులు, కుట్ర-కుయుక్తులు స్థిరంగా నాటుకు పోయాయి. లోపల ఇన్ని దాచిపెట్టాలి కనుకనే, నీ రొమ్ము ఇంత పొడవుగా, ఎత్తుగా వుంది. భరతుడికి పట్టాభిషేకం కాగానే, రాముడు అడవులకు పోగానే, నీ రొమ్ము మీద వరస-వరసగా హారాలు చుడుతాను. నీ ముఖంపై నేను తిలకం దిద్దుతాను. దేహం నిండా ఆభరణాలు అలంకరిస్తాను. నువ్వు కట్టుకునేందుకు తెల్లటి చలువ చీరె ఇస్తాను. చంద్రబింబంతో సమానంగా, అసమానమైన నీ ముఖం ప్రకాశిస్తుంటే, నువ్వు దేవతా స్త్రీలా వున్నావు. కుబ్జా! నువ్వెలానైతే ఎల్ల వేళలా నన్ను సేవిస్తున్నావో, అలానే, కుబ్జలందరూ నిన్ను కొలుస్తుంటే మరింత ప్రకాశించేట్లు చేస్తాను. నువ్వు నాకు సేవ చేస్తుంటే, కుబ్జలు నీకు సేవ చేస్తారు" అని అంటుంది కైక. హోమంలో అగ్నిహోత్రంలాగా, తెల్లటి పానుపుపై పడుకుని, తనను పొగుడుతున్న కైకను చూసి, నువ్విలా కబుర్లు చెపుతుంటే సమయం మించి పోతుంది అంటుంది మంథర. తరువాత నీ ప్రయత్నాలు వ్యర్థం కావచ్చు అని హెచ్చరిస్తుంది.

కోప గృహం వెళ్లిన కైక

కైకను "చంద్రముఖీ" అని సంబోధిస్తూ, ఆమె పడుకుంటే జరగాల్సిన పని కూడా పడుకుంటుందని, రాజు వచ్చే సమయంలో ఆమె వుండాల్సింది అలా కాదని, మంథర ఆమెను పురమాయించగా, కైక విలాసంగా లేచి మంథరతో సహా కోప గృహంలో ప్రవేశించింది. ఐశ్వర్యం మీద మోజుకల కైక, తాను అందగత్తెననే మద వికారంతో, చలించే మనసుతో, రాజు తన విషయంలో ఎంతో ద్రోహం చేశాడని భావిస్తూ, కోపంతో పెదవులు బిగబట్టి, తన వంటి మీద వున్న బంగారు ఆభరణాలు-ముత్యాల సరాలు తీసేసి, కుబ్జ మంథరతో ఇలా అన్నది. "ఓసీ మంథరా! నా నియమం, నిశ్చయం చెప్తా విను. శ్రీ రాముడు అరణ్యాలకు పోయి, నా కొడుకు రాజన్నా కావాలి....అలా కాకపోతే, నన్నిలా చేసిన రాజు దగ్గరకు నువ్వు పోయి కైక చచ్చిపోయిందనైనా చెప్పాలి! రెండిటిలో ఒకటి జరిగి తీరాలి. రాజు రాముడికే పట్టాభిషేకం చేస్తే, భూమి మీద నేను బతకడం ఈ రోజుతో సరి. అలాంటప్పుడు, నాకెందుకీ రత్నాలు, సొమ్ములు, చీరెలు, బంగారు నగలు...ఇవన్నీ నాకెందుకు?". సమాధానంగా మంథర, కైక కోపానికి అదే తగిన సమయమని, దానిని వదలొద్దని, రాముడు రాజైతే ఆమె-ఆమె కొడుకు జీవించి వున్నంతవరకు శాశ్వత కష్టాలు అనుభవించాల్సిందే అని అంటుంది. రొమ్ముల మీద చేతులుంచుకుని కైక, తన భర్త తనను ఇలా చేశాడే అని వాపోతుంది. కాసేపు మంథరను పొగుడుతుంది. కాసేపు భర్తను దూషిస్తుంది. తాను అయోధ్య నుండి యమపురికైనా పోతానని, లేదా, రామచంద్రుడు అడవుల్లో వుండగా తానిక్కడ చల్లగానన్నా వుంటానని, రెండిటిలో ఒకటి నిశ్చయం అని అంటుంది. మర్నాడు ఉదయం కల్లా రాముడు అడవులకు పోకపోతే, తాను పానుపు మీద పడుకునే సమస్యే రాదని, హారాలు ధరించనని, కళ్లలో కాటుక పెట్టుకోనని, అన్నం నీళ్లు ముట్టనని, గంధం పూసుకోనని, అసలు ప్రాణాలతోనే వుండనని అంటుంది కైక. ఇలా భయంకరమైన మాటలను పదే పదే అంటూ, తన జడను విప్పి విరబోసుకుంటుంది. కటిక నేలమీద పడుకుంటుంది. ఆభరణాలు తీసేస్తుంది.

❖ ❖ ❖

సర్గ-10

పాపాత్మురాలైన మంథర ప్రేరణతో, విషం పూసిన బాణం నేలపై పడిన రీతిలో, కిన్నర జాతి స్త్రీలాగా, కైక నేలపై పరుండి ఎలా చేయాలో అలానే చేయడానికి సిద్ధమౌతుంది. కుబ్జ మంథర వైపు చూసి తనకు మేలు చేశావని మరీ మరీ మెచ్చుకుంటుంది. ఆడా పాము బుసకొట్టినట్లే, కైక కూడా రోషంతో వేడి నిట్టూర్పులు విడుస్తూ, వేడి గాలి వ్యాపింపచేస్తూ, తన కోరిక కొనసాగే ఉపాయాన్ని ఆలోచిస్తుంది. ధనం మీద, రామ పట్టాభిషేక విఘ్నం పైన, కోరిక వున్న మంథరకు కైక పట్టుదల సంతోషాన్ని కలుగజేస్తుంది. దేహం పులకరిస్తుంది. కైక నేలపై పడుకుని నిట్టూర్పులు విడవడం కొనసాగిస్తుంటుంది. దేహం నుండి తీసిన ఆభరణాలను ఇంటి నిండా వెదజల్లుతుంది కైక. అవన్నీ, నక్షత్రాల వలె కనిపిస్తూ, నేలంతా ఆకాశం లాగా మెరుస్తుంటుంది. కామ దాసి ఐన కైక అలా నేలపై పడుకునే వుంటుంది.

పట్టాభిషేక వార్త తెలియచేయడానికి కైక ఇంటికి వచ్చిన దశరథుడు

అక్కడ దశరథుడు, చెప్పాల్సిన వారికందరికీ, చెప్పవలసిన ప్రతి విషయం చెప్పి, చేయాల్సిన ఏర్పాట్లన్నీ చేసి, అటు పిమ్మట, శ్రీరాముడి పట్టాభిషేకానికి కావల్సిన పనులన్నీ పురమాయించి, గురువుల అనుమతి తీసుకుని, సంతోషంగా తన ఇంటికి వెళ్తాడు. శ్రీ రాముడి పట్టాభిషేక వార్త అప్పుడే లోకానికి తెలిసినందున, ఇంకా కైకకు తెలియకపోవచ్చు కాబట్టి, ఇతరులు పోయి ఆమెకు ఆ వార్త చెప్పే లోపల తానే చెప్పాలనుకుంటాడు దశరథుడు. ఇష్టమైన వార్త, ఇష్టమైన వారే తెలపాలని అనుకున్న దశరథుడు, సుందరమైన కైక ఇంటిలోకి స్వయంగా ప్రవేశించాడు. కైక గృహం రాహువుతో కూడిన ఆకాశం వలెను, చిలుకల–నెమళ్ల–కోకిలల ధ్వనులతో నిండిన దాని గాను, మరుగుజ్జు స్త్రీల రక్షణలో వున్నది గాను, వెండి రేకులు, ఏనుగు దంతాలు, బంగారు రేకులతో చెక్కిన అరుగుల తోను ప్రకాశిస్తూ స్వర్గంలాగా వుంది. కామోద్రేకం కలిగించేలా వుంది కూడా. ఆ ఇంటిలో అంతఃపురం ఇంకా అందంగా వుంది. పర్వతం

లాంటి ధీరుడైన దశరథుడు ఆ అంతఃపురంలోకి ప్రవేశించాడు. పుష్ప బాణుడి బాణాలకు చలించి పోయాడు. పడకటింటిలో కైక కొరకు వెతికితే ఆమె కనబడలేదు. లోగడ ఇలా ఎప్పుడూ జరగలేదు. దశరథుడు వచ్చే సమయానికి ఆమె పడకటింటిలో లేని సందర్భం లేదు. కైక లేని ఇంటికి ఆయన ఎన్నడూ పోలేదు. కామోద్రేకంతో ఒక పక్క, రామ పట్టాభిషేక వార్త తెలపాలన్న కోరిక మరో పక్క, దశరథుడిని కైక లేకపోవడంతో అసంతృప్తికి గురిచేశాయి. మనస్సు చెదరింది.

చిగురాకు లాగా మృదువైన శరీరం కల తన ప్రియురాలు, లోగడ ఎన్నడూ, ఈ సమయంలో ఎక్కడికీ పోలేదని, ఈ రోజు అలా ఎందుకు చేసిందోనని, ఎవరి తోడు లేకుండా ఎక్కడి పోయిందో కదా అని, వ్యాకుల పడ్డాడు దశరథుడు. కైక తన స్వలాభం కొరకు, రాబోయే కీడు తెలుసుకోలేక, మూఢురాలై దుఃఖించడం తెలియని దశరథుడు ఆమెను గురించి మంచే అనుకుంటాడు. అక్కడున్న కావలి కత్తెను, కైక ఎక్కడికి పోయిందని ప్రశ్నించాడు. కోపంతో మండిపడుతూ కైక కోప గృహం చేరిందని ఆమె వినయంగా జవాబిస్తుంది. గోరు చుట్టుపై రోకలి పోటులాగా ఆమె కోప గృహం చేరిందన్న వార్త వినిపించింది దశరథుడికి. ఇవ్వాళే ఆమెకు కోపం రావాలా అని పరితపిస్తూ, పట్టరాని శోకంతో ఆయన కూడా కోప గృహానికి వెళ్ళాడు. కామాంధుడైన దశరథుడికి, కైక కోప కారణం, రామ పట్టాభిషేకం అన్న ఆలోచన రాలేదు. ప్రియురాలికి యోగ్యం కాని విధంగా, కటిక నేల మీద పడుకుని, బాగా దుఃఖ పడుతూ, తెగి పడ్డ తీగలాగా, పుణ్య క్షయం వల్ల భూమి మీద పడ్డ దేవతా స్త్రీలాగా, నేలమీద పడి ఏడిచే అప్సరసలాగా, వలతాడులో చిక్కి తప్పించుకోలేక పోయే జింక లాగా వున్న కైకను తాను తాకితే మరింత కోపగించుకుంటుందేమోనని భయపడుతూనే తాకాడు దశరథుడు. ముసలివాడైన దశరథుడు, ప్రేమలో తన ప్రాణములకంటే మిన్న అయిన కైకను తాకి ఇలా అంటాడు.

కైక దుఃఖానికి కారణమడిగిన దశరథుడు

"సుందరీ! నీ కోపానికి కారణమేంటో నాకు తెలియదు. ఇలా ఎందుకు దుఃఖిస్తున్నావు? ఎవరివల్ల నీ కీ సంతాపం కలిగింది? నువ్విలా అందవిహీనగా

పడివుంటే, నా మనస్సు సంతోషం లేకుండా, సంతాపాగ్నిలో గడ్డి పోచలాగా కాలిపోదా? ఎందుకిలా దయ్యం పట్టినదాని లాగా తల విరబోసుకుని నేలమీద భయం పుట్టేట్లు పడుకున్నావు? ఇలాంటి దుర్దశలో నిన్ను చూస్తుంటే నా మనస్సు పగిలిపోతున్నది కదా! నీకు ఏదైనా అనారోగ్యంగా వుందా? ఎప్పుడూ మాన్యాలు తిని పోషించబడే రాజవైద్యులున్నారుగా? చిటిక వేస్తే వారొచ్చి నిన్ను బాగుచేయరా? కామినీ! నీకు అపరాధం చేసినవారెవరో చెప్పు. వాడిని ఏం చేస్తే బాగుంటుందో అదికూడా చెప్పు. నిన్ను బాధించిన దురాత్ముడికి ఎటువంటి కీడు కలిగించాలో చెప్పు. కీడెవరికి చేయాలి, మేలెవరికి చేయాలి చెప్పు. ఆజ్ఞ ఇవ్వు. ప్రియురాలా! ఎందుకిలా దేహాన్ని పాడు చేసుకుంటావు? నీ కొరకు ఎవర్నైనా చంపాలంటే చంపుతాను. చంపాల్సిన వాడిని విడవమంటే అలానే చేస్తాను. నిరుపేద వాడిని కుబేరుడిని చేయమంటావా? అలానే చేస్తాను. ధనికుడిని నిరుపేద చేయమంటే క్షణంలో చేస్తాను. నేను, నా వారందరు, నీకు సేవకులమే కదా! ఎందుకు నీ కీ చింత? నువ్వు కావాలనుకున్న పనేదైనా వుంటే నేనెలా విఘ్నం చేస్తాను? నేనేదైనా నీ ఎడల అపరాధం చేస్తే, దానికి శిక్షగా, నా ప్రాణాలివ్వమంటే ఇస్తాను. నీకు కోపం వచ్చిన తరువాత నేను జీవించి ప్రయోజనం లేదు. చావడమే మంచిది. నామీద నీకెందుకు అపనమ్మకం? నీపై నాకెంత మోహమో తెలియదా? తూర్పు దేశంలో కాని, సింధు, అంగ, వంగ, మత్స్య, సౌవీర, మగధ, దక్షిణ కాశి, కోసల దేశాలలో కాని, దొరికే ఏ వస్తువైనా కావాలంటే కోరుకో! లేదనకుండా క్షణాల్లో తెచ్చి ఇస్తానని ఇన్నాళ్లుగా నేను సంపాదించుకున్న పుణ్యం సాక్షిగా చెప్తున్నాను. పిరికీ! నువ్వు అడిగింది నేను ఇస్తానో, లేదో, అని భయ పడవద్దు. ఇకనైనా చెప్పు. ఏ భయం వల్ల నీకు ఇలాంటి కలవరం కలిగింది? దానిని, సూర్యుడు మంచును తొలగించినట్లు చెరిచెదను". అని ఇలా దశరథుడు పలుకుతుంటే, వెంటనే తన మనసులో మాట చెప్తే లోకువై పోతానని భావించిన కైక, మంథర చెప్పినట్లే, అతడిని మరింత దుఃఖపడేట్లు చేద్దామనుకుంది.

❖ ❖ ❖

సర్గ-11

కైక కోరిక నెరవేరుస్తానని ప్రమాణం చేసిన దశరథుడు

మన్మథ బాణాలతో పరితపిస్తున్న భర్తను చూసి కుటిలపు మాటలతో, కఠినంగా కైక తాను చెప్పదల్చుకుంది చెప్పింది. "దేవా! నాకు ఏ వ్యాధీ లేదు. నన్ను ఎవ్వరూ అవమానం చేయలేదు. చేస్తే నువ్వే చెయ్యాలి. నా కోరిక నువ్వే సఫలం చేయాలి. నీకు అలా చేయడం ఇష్టమేనని ప్రమాణం చేస్తే చెప్తాను" అంటుంది. ఇన్ని రోజులు తనతో ఇంత ఐకమత్యంగా కలిసిమెలిసి వుండి కూడా, ఆమె పై, తనకు ఎలాంటి భావముందో తెలుసుకోలేక పోయిందే కైక అని అనుకున్న దశరథుడు, తన వల్ల కావాల్సిన పనికా ఇంత శ్రమ పడుతుంది అని, ఆమె ఏది కోరితే అదివ్వడానికి సిద్ధం అంటాడు. దానికి ప్రమాణం ఎందుకు అని చిరునవ్వు నవ్వి, మన్మదాగ్నితో దగ్ధమైన మనస్సుతో వున్నవాడైనందున జరగబోయే మేలు-కీడు గురించి ఆలోచించక కైక ముఖాన్ని తనవైపు తిప్పుకుని, ఆమె తలను తన తొడపై వుంచుకుని, జడను మెల్లగా తాకుతూ ఇలా అంటాడు.

"సౌందర్యంతో మదించిన దానా! ఇన్ని రోజులు నాతో సహవాసం చేసి కూడా నీ విషయంలో నా మనసెట్టిదో తెలియక మాట్లాడుతున్నావు కదా! నీ కోపంలో నా మనసులో ఏముందో నీకెలా తెలుస్తుంది? నన్ను ప్రమాణం చేయమంటున్నావు. నాకు అత్యంత ప్రియమైన దానిపై కదా ప్రమాణం చేయాలి? నాకు మిక్కిలి ఇష్టమైనవి రెండు. ఎంత వెతికినా స్త్రీలలో నీకంటే ప్రియురాలు లేదు. పురుషులలో నరసింహుడైన మన శ్రీ రాముడికంటే ప్రియమైన వాడు లేడు. శత్రువుల చేతిలో ఓటమి పొందని వాడు, రఘువంశంలో పుట్టినవారిలో శ్రేష్ఠుడు, హేయ గుణాలు లేనివాడు, నాకు ప్రాణాధారమై నా ప్రాణాలకంటే ప్రియుడైన వాడైన శ్రీ రాముడిపై ఒట్టు పెట్టుకుని నీవు కోరిన దానిని నెరవేరుస్తానని ప్రమాణం చేస్తున్నాను. ఎవరిని కొంచెం సేపైనా చూడకుండా బతకలేనో అట్టి శ్రీ రాముడిపై ప్రమాణం చేస్తున్నాను. నీ మాట నెరవేరుస్తాను. ఏ శ్రీ రాముడి నిమిత్తమై దేహాన్నైనా వదిలిపెట్తానో, భరత, లక్ష్మణ, శత్రుఘ్నుల నైనా దయ లేకుండా విడిచిపెట్తానో, అలాంటి శ్రీ రాముడిపై ప్రమాణం

చేస్తున్నాను. కమలాక్షీ! నా మనస్సెలాంటిదో తెలుసుకున్నావు కదా! నా మనసు, వాక్కు ఏక రీతిగానే వుంటుంది. నీ కోరికేంటో త్వరగా చెప్పు. నువ్వు ఆలస్యం చేస్తే, మదన తాపం భరించలేను. నన్ను ఉద్ధరించు. నన్ను సందేహించడం మంచిది కాదు. నా పుణ్యం మీద కూడా ప్రమాణం చేస్తున్నాను. నీ మాట నెరవేర్చకపోతే, నా పుణ్యమంతా నాశనమౌకాక! "

దశరథుడిలా అనగానే, కైక సంతోషించింది. ముఖంలో ఆనందం కనిపించింది. రాజు చెపుతున్న మాటలను బట్టి, భరతుడి పట్టాభిషేకం, శ్రీ రాముడి అరణ్యవాసం జరిగినట్లే భావించింది. తాను కోరబోయే కోరిక తప్పని అనే మధ్యవర్తులు కూడా లేకపోవడంతో దశరథుడిని పీడించైనా తన కోరిక నెరవేర్చుకోవాలనుకుంటుంది. ఆకస్మికంగా వచ్చే మృత్యువుతో సమానమైన మాటలను కఠినురాలైన కైక పలక సాగింది. "రాజా! నువ్వు ప్రమాణ పూర్వకంగా నా కోరిక తీరుస్తానంటున్నావు. నీ మాటలను భూమి, సూర్య-చంద్రులు, ఆకాశం, రేయి-పగలు, అగ్నిహోత్రుడు, దేవతలందరూ, భూతాలు, దిక్కులు, నీ ఇలవేలుపులందరు వింటున్నారు. నీ మాటకు వీళ్లందరూ సాక్షులు. మాట తప్పు కూడదు. నీతి మంతుడు, ధర్మం తెలిసినవాడు, సత్య ప్రియుడు, చిత్త భ్రమ లేనివాడు, దశరథ మహారాజు నా కిచ్చిన వరాలను దేవతలారా మీరందరూ దయతో వినండి".

తన పూర్వ వరాల విషయాన్ని దశరథుడికి చెప్పిన కైక

ప్రమాణం నెపంతో దశరథుడిని కట్టి పడేసిన కైక, లోగడ ఆయన తనకు ఇచ్చిన వరాల విషయాన్ని జ్ఞాపకం చేసుకోమంటుంది. పూర్వం ఒకసారి దేవతలు-రాక్షసులు యుద్ధం చేస్తున్న సమయంలో రాత్రి జరిగిన పోరులో దశరథుడు మూర్ఛపోయిన సంగతి, కైక ఆయనను కాపాడిన సంగతి గుర్తు చేస్తుంది. ఆ సందర్భంలో దశరథుడు తనకు ఇచ్చిన రెండు వరాల విషయమూ గుర్తుచేస్తుంది. అవి తనకిప్పుడు కావాలని, మంచితనంగా ఇస్తే సరేసరి, లేకపోతే వెంటనే ప్రాణాలు వదులుతానని హెచ్చరిస్తుంది. ఆ రెండు వరాలను ఒక నిక్షేప నిధిగా రాజు దగ్గర దాచి వుంచుకున్నానని, అవి ఇప్పుడు కావాలని అంటుంది. స్త్రీ వలలో పడ్డ దశరథుడు, వెనుకా-ముందూ ఆలోచించకుండా, వరాలు ఇచ్చిన విషయాన్ని ధృవ పరుస్తూ, కోరుకొమ్మంటాడు. దశరథుడు

ఆనాడు ఇచ్చిన వరాలనే మళ్లీ అడుగుతానని, అవి ఏమిటో చెప్తానని, సత్య ప్రమాణంగా మనసు వుంచి వినమని, విని తీర్చమని అంటుంది కైక.

భరతుడికి పట్టాభిషేకం, శ్రీ రాముడికి వనవాసం వరాలుగా కోరిన కైక

ఇక వరాలను కోరుకోవడం ఆరంభిస్తుంది కైక. మొదటి వరంగా, శ్రీ రాముడికి దశరథుడు చేస్తున్న పట్టాభిషేక ప్రయత్నం నిలిపి, దానికి బదులుగా, తన కొడుకు భరతుడికి పట్టాభిషేకం చేయమని కోరుతుంది. సూర్యవంశం రాజులలో మేటి అని దశరథుడిని సంబోధిస్తూ, రెండో వరం కోరే సమయం కూడా వచ్చింది అంటుంది. "ఎలాంటి ఆపదలో నేను నిన్ను రక్షించానో, అప్పుడెలాంటి ప్రీతితో నువ్వు నాకు వరం ఇచ్చావో, ఎలాంటి గొప్ప వంశంలో పుట్టావో, ఎలాంటి మంచి పేరు తెచ్చుకున్నావో, అవి అన్ని జ్ఞాపకం తెచ్చుకుంటూ, నేను అడగబోయే రెండో వరం కూడా ఇవ్వు" అని అంటుంది కైక. శ్రీ రామచంద్రుడు నార చీరెలు కట్టుకుని, కృష్ణాజినం ధరించి, జడలు వేసుకుని, మునీశ్వరుడై పద్నాలుగు సంవత్సరాలు దండకారణ్యంలో తిరగాలని, ఆ విధంగా పగ వాడి బాధ లేకుండా యౌవ రాజ్యం తన కొడుకుకు తక్షణమే లభించాలని తన మనసులోని కోరికను రెండో వరంగా బయట పెడ్తుంది. రాజు ఇచ్చిన వాటికంటే ఎక్కువగా కాని, కొత్తగా కాని తానేమీ అడగలేదంటుంది. ఆయన ఇచ్చిన రెండు వరాలే ఇప్పుడు అడుగుతున్నాను అంటుంది. శ్రీరాముడు వెంటనే అడవులకు పోతే తాను సంతోషించాలని వుందంటుంది. "యదార్ధ వాదీ! నువ్వు సామాన్యుడవు కావు. రాజులందరిలోకీ రారాజువు. బల పరాక్రమాల వల్లా, దాన ధర్మాల వల్లా, కీర్తి-యశస్సులు సంపాదించావు. ఇప్పటికీ సత్యం-నియమం కల వాడివి. ఇంతవరకు నీ వంశంలోని వారందరికీ సత్యవాదులని, ధర్మాత్ములని పేరుందే కాని, అసత్యవాదులన్న అపకీర్తి రాలేదు. వారంతా సదాచార సంపన్నులు. నీ వల్ల వారెవరికీ అపకీర్తి రానివ్వొద్దు. నీ పుట్టుకా సామాన్యమైంది కాదు. దేవతా స్త్రీకి పుట్టిన వాడివి కాబట్టి, దేవాంశ సంభూతుడవు. అది కూడా జ్ఞప్తికి తెచ్చుకో. రాజా! మునీశ్వరులు, సత్యం వల్లనే ఇహలోక-పరలోక సుఖాలు కలుగుతాయని చెప్తారు కదా! నువ్వు కూడా సత్య సంధుడవే!" అని అంటుంది కైక.

సర్గ-12

కైక కోరిన వరాలను విని పరితపించిన దశరథుడు

తీక్షణంగా, వినడానికి భయంకరంగా, కైకేయి చెప్పిన ములుకుల్లాంటి మాటలను విన్న దశరథుడు, మిక్కిలి బాధపడి, విచారపడి, నోట మాట రాక, తత్తర పడి, తనలో తాను ఇలా అనుకో సాగాడు. "హా! ఏమిటిది? నా మోహమేంటి? నేను చేసిన వాగ్దానమేంటి? కైక అడిగిన వరాలేంటి? ప్రేమించిన దానికి ఇదా ప్రతిఫలం? ఇలాంటి నిజాలు కూడా వుంటాయా? నా ప్రియురాలు, ప్రాణంతో సమానమైన కైక ఇలా అడుగుతుందా? అడిగే అవకాశం లేదు. ఇది కల కావచ్చు! కాని నేను మేల్కొనే వున్నాను కదా! కల ఎలా అవుతుంది? ఇది నామోహం మాత్రమే. అందుకే, ఒకదానికి బదులుగా మరొకటి ఊహించుకుంటున్నాను. అది కూడా కాదే? ఉన్నదున్నట్లు కనిపిస్తున్నదే? మతి మోసపోయి వుండవచ్చు. కావున ఇది వాస్తవమే. ఇలాంటి వాస్తవం జరగడానికి కారణమేమై వుంటుంది? ఈ జన్మలో ఇలాంటి దారుణమైన మాటలు వినేటంత పాపపు పనులేమీ చేయలేదు నేను. బహుశా, పూర్వ జన్మలో చేసింది ఇపుడు అనుభవిస్తున్నానేమో? అది కూడా నమ్మశక్యంగా లేదు. నా మెదడు చెడిపోయేంత పెద్ద వ్యాధి వచ్చి వుండాలి". అలా అనుకుంటూనే, దుఃఖం ముంచుకొచ్చింది దశరథుడికి. తన రాణి కైక మాటలు బాణం పోటుల్లాగా గుచ్చుకుని మూర్ఛపోయాడు కాసేపు. మళ్లీ అతి కష్టం మీద తెలివి తెచ్చుకుని కటిక నేలపై కూచున్నాడు. గుండెలు చెదిరేలా దుఃఖించాడు. ఆడ పులిని చూసే జింకలాగా, కైక వైపు చూడసాగాడు. చూస్తూ...మంత్ర బలంతో కట్టి పడేసిన పాములాగా ఏమీ చేయలేక పోయాడు. కోపం వచ్చింది. హా! ఛీ! అని పలికాడు. శోకం ముంచుకొచ్చింది. మూర్ఛ పోయాడు. కోలుకున్నాడు. నేలమీద పడ్డాడు. లేచి నిలుచున్నాడు. కోపపు చూపులతో కైకను కాల్చుకుని తినే మాటలన్నాడిలా.

కైకను దూషించిన దశరథుడు

“ఓసి దురాత్ములారా! నువ్వెంత గయ్యాళిదానివే! నిర్దయురాలా, సజ్జనులు స్తోత్రం చేసే మా వంశాన్ని నాశనం చేయడానికే మా ఇంటికి వచ్చావా? ఇలాంటి ద్రోహపు బుద్ధి నీకు పుట్టడానికి, నాలో కాని, రాముడిలో కాని కొంచెమైనా దోషముందా? నీకు నేను ద్రోహం చేయలేదు. నిన్ను ఉపేక్షించలేదు కూడా. ఇక శ్రీ రాముడో...తన కన్న తల్లిని ఎలాంటి గౌరవ దృష్టితో చూస్తూ, ఆమెకెలా సేవ చేస్తున్నాడో, అలాంటి గౌరవ దృష్టితో నిన్ను కూడా చూసి మసలుకుంటున్నాడు కదా? నువ్వు సవతి తల్లి వని ఏనాడూ చూడలేదు కదా? ఎందుకిలాంటి చెడ్డ పని తలపెట్టావు? ద్రోహం చేయని వారికి ద్రోహం చేయడం ఆసుర కృత్యం కదా? నిన్ను ఇపుడు ఏమి అని ప్రయోజనం? ఇది నా స్వయంకృతాపరాధం. రాజకన్యవనే భ్రమ వల్ల, పామును ఇంటిలో పెట్టుకున్నాను. కొంపకే నిప్పు పెట్టావు. సర్వకాల సర్వావస్థలలో ప్రాణికోటి అంతా మంచి మనోహర గుణాలు కలవాడని శ్రీరామచంద్రుడిని పొగుడుతుంటే, నేనెలా, ఏ నెపంతో, అసత్య వాదిగా–మోసగాడిగా మారిపోయి, నాకు అత్యంత ప్రియమైన గారాబు కొడుకును శ్రీరామచంద్రుడిని అడవులకు పొమ్మని ఆజ్ఞాపించగలను? కౌసల్యను విడవమంటే విడుస్తాను. సుమిత్రను కూడా వదిలిపెట్తాను. వీరందరికంటె ప్రియమైన, దక్కించుకోవాల్సిన నా ప్రాణాలను విడవమంటే నీకు ప్రీతిగా విడిచిపెట్తాను. ఇంతకంటే ప్రియమైన, సత్ స్వభావం కల శ్రీరామచంద్రుడిని వదలను సుమా! ఇది నమ్ము. శాస్త్ర బలాన్ని, ప్రేమ కలిమిని, ప్రియ పదార్థాలను వదుల్తా. శ్రీరాముడిని, జ్యేష్ట పుత్రుడుని, నిమిషమైన విడవను. జ్యేష్ట పుత్రుడి ముఖం చూడగానే పితృ ఋణం తీరుతుంది. ఈ విధంగా శ్రీరామచంద్రుడు నాకు ఇహ–పరములకు కావల్సిన వాడు. అలాంటివాడిని విడుస్తే నాకు సంతోషం ఎక్కడిది? నాకు మనసులో సంతోషం లేకపోతే, నువ్వు మాత్రం నాకెందుకు? కాబట్టి, ఇటువంటి రాముడిని విడిచి ఒక్క నిమిషం కూడా బతకలేనే దుర్మార్గురాలా! సూర్యుడు లేకపోతే లోకం కొంతకాలం నిలుస్తుంది. నీళ్లు లేకపోతే పైరులు నిలువగలవు. కాని, నా రాముడిని వదిలితినా, నా ప్రాణాలు నా దేహంలో వుండవు. నా ప్రాణాలన్నీ

రాముడిలోనే వున్నాయి. శ్రీరాముడే నా ప్రాణం. శ్రీరాముడిని విడవడం అంటే ప్రాణాలను విడవడమే! ఓసి పాపాత్మురాలా! పాపపు పని చేయమని నన్నెందుకు బలవంత పెడుతున్నావు? నువ్వు నాకు భార్యవు. నీకు నేను మొక్క కూడదు. అయినప్పటికీ, నీ కాళ్ల మీద పడి సాష్టాంగ నమస్కారం చేస్తాను. నన్ను బతకనియ్యి. నిష్కారణంగా ఎందుకు చంపుతావు?"

"ఓసీ ప్రియురాలా! నా విషయంలో, రాముడి విషయంలో, నువ్వింత కఠినంగా, మనసార మాట్లాడావని, నేను నమ్మ లేకపోతున్నాను. అలాంటప్పుడు, ఇలా ఎందుకు మాట్లాడావు? బహుశా, నాకు భరతుడిమీద ప్రేమ వుందో, లేదో, తెలుసుకునేందుకు భరతుడి పట్టాభిషేకం కోరి వుంటావు. అదెలా ఊహించానంటావా? నీకెప్పుడూ శ్రీరాముడంటే ప్రేమే కదా? శ్రీరాముడు నాకు పెద్ద కొడుకు, భరతుడు చిన్న కొడుకు అనే దానివి. రాముడు బుద్ధిమంతుడు, శ్రీమంతుడు, ధర్మ బుద్ధిలో భరతుడికంటే ఆయనే శ్రేష్ఠుడు అని నీవే అన్నావు. ఓహో! ఇవన్నీ నన్ను గౌరవించడానికి, శ్రీరాముడి మీద నాకు ప్రీతి కావున నీకూ అలానే అని నటించావన్న మాట. అవన్నీ ముఖ ప్రీతి మాటలేనా? శ్రీరాముడి పట్టాభిషేక వార్త విని, గగ్గోలున నువ్వు ఏడవడమే కాకుండా, నన్ను కూడా ఏడిపిస్తున్నావు కదా? నీకు నిజంగా దయలేదు. కాకపోతే, నట్టింటిలో కూర్చుని, ఎవరో చెప్పిన మాటలను విని ఇలా చేస్తావా? నువ్వేడుస్తూ, నన్ను ఏడిపిస్తావా? ఇది నీకు పుట్టిన బుద్ధి కాదు. ఎవరో ఇతరులు దుర్బోధ చేసి వుంటారు. ఇది నన్ను పరీక్షించుటకే అనుకుంటే, ఇలాంటి పరీక్ష ఎందుకు? పరీక్ష పేరుతో గొంతు పిసుకుతావా? వనితా! స్వభావ సిద్ధంగా నువ్వు మంచిదానివే. అలాంటి నీకు, నీళ్లలో నిప్పు పుట్టినట్లు, నీతి విరుద్ధమైన ప్రవర్తన వచ్చింది. మనస్సు చాంచల్యం కలిగింది. సజ్జన స్తోత్రమైన ఇక్ష్వాకుల వంశానికి చెడ్డ కాలం ప్రాప్తించింది. నీతీ చెడింది. కాకపోతే, నీకెందుకిలా విపరీత బుద్ధి కలుగుతుంది? గతంలో ఎన్నడూ ఇలాంటి అప్రియమైన మాటలు నువ్వు పలకలేదు. ఇవ్వాళ ఎందుకిలా చేస్తున్నావు? నా విషయంలో భరతుడెలానో, శ్రీరాముడు కూడా అలాంటివాడే. ఇద్దరిలో నాకు భేదం లేదు.... అని నువ్వే ఎన్నో సార్లు అన్నావు. అలాంటి శ్రీరాముడు పద్నాలుగు సంవత్సరాలు అడవుల్లో ఎలా వుంటాడే?" అని దశరథుడు శ్రీరాముడి గుణాలను వర్ణించసాగాడు.

శ్రీరాముడి గుణాలను వర్ణించిన దశరథుడు

శ్రీరాముడు అడవులకు పోదగిన వాడు కాదని తెలపడానికి ఆయన గుణాలను వర్ణించసాగాడు దశరథుడు ఇలా: "అధర్మమైనప్పటికీ, భరతుడు నీ కొడుకైనందున, ధనం మీద ఆశతో, పుత్ర వాత్సల్యంతో, వాడికి రాజ్యం కావాలని కోరావనుకుందాం. శ్రీరాముడు మిక్కిలి కోమలమైన దేహం కలవాడు. నీతికి స్థానమైన వాడు. ప్రజల మేలు కోరే విషయంలో ప్రీతి కలవాడు. ధర్మ స్వరూప స్వభావుడు. ఇవన్నీ ఎలా వున్నప్పటికీ, నీ సేవ చేయడానికి ఆసక్తి కలవాడు. అలాంటి వాడిని ఎందుకు అడవులకు పొమ్మంటున్నావు? అతడు అడవులకు పోవడానికి అర్హుడెలా అవుతాడు? నీకు సేవ చేయడంలో, నీ అభిప్రాయం ప్రకారం కూడా, భరతుడికంటే శ్రీరాముడే గొప్పవాడు కదా! అది నీ అభిప్రాయం కాదంటే, పోనీ నువ్వే చెప్పు...భరతుడు ఏ విషయంలో శ్రీరాముడికంటే గొప్పవాడో? నేను ఎంత ఆలోచించినప్పటికీ, రాముడికంటే భరతుడిలో శ్రేష్ఠత్వం కనిపించడం లేదు. ఒకరు కన్న తల్లి అని, మరొకరు సవతి తల్లి అని భేద బుద్ధి లేకుండా అందరినీ సమానంగా గౌరవిస్తాడు. అలాంటి గొప్ప మనసున్న రాముడినా నువ్వు అడవులకు పొమ్మంటున్నావు? ఓసీ! నువ్వు శ్రీరాముడిని వదిలిపెట్టితే, నిన్ను మనసార గౌరవించే విషయంలో కాని, నీ మీద అమితమైన మాతృ భక్తి కనబర్చే విషయంలో కాని, నీవు చెప్పిన పనులన్నీ నెరవేర్చే విషయంలో కాని, నిన్ను సేవించే విషయంలో కాని, ఇంతకంటే మంచివారెవరైనా దొరుకుతారా? వాడిని వదిలితే నీకు సరైన శుశ్రూష చేసేవారు కూడా వుండరే!"

ఇంకా ఇలా అంటాడు. "నీ విషయంలో శ్రీరాముడు అపరాధం చేయడం-చేయక పోవడం, అలా వుంచితే, మన అంతఃపురంలో వుండే వేల మంది స్త్రీలలో ఒక్కరైనా కాని, శ్రీరాముడిలో ఏదైనా దోషం వుందని ఎప్పుడైనా నీతో అన్నారా? అలా ఎవరైనా అంటే కనీసం ఒక్కటైనా చెప్పు. ఒక్కరు కూడా రాముడిపైన నింద వేయకపోవడానికి కారణ మేమంటావా? ఆయన తన బలంతో ఇతరులను లోబర్చుకోడు. నిర్మలమైన, కలుషితం లేని మనసుతో, తాను కష్టపడ్డప్పటికీ, మంచిమాటలతో వారు కోరిన కోరికలు తీర్చుకుంటూ,

తన త్యాగ గుణం వల్ల ఇతరులను వశపర్చుకుంటాడు. సత్యంతో పద్నాలుగు లోకాలను, దాన బలంతో పేద వారిని, శుశ్రూషతో మెప్పించి, తల్లిదండ్రి, ఆచార్యులను, వింటిని చూపుతూ, యుద్ధంలో శత్రువులను రాముడు వశపరుచుకుంటాడు. శ్రీరాముడిలో ఈ నాలుగు గుణాలే కాదు. నిర్వ్యాజ సత్యం, దానం, గొప్ప తపస్సు, శుచిత్వం, మైత్రి, అర్జవం, గురు శుశ్రూష, జ్ఞానం, త్యాగం అనే గుణాలు సర్వకాలాలలో స్థిరంగా శ్రీరాముడిలోనే నెలకొని కాపురం చేస్తున్నాయి. ఇతరులలో లాగా కాసేపు వుండి పోవడం కాదు. దేవీ! వివేకం లేనిదానా! రుజు గుణమే సంపదగా కలవాడు, దేవతతో సమానుడు, మహర్షుల తేజస్సుతో పోల్చతగిన తేజస్సు కలవాడు, నిగ్రహానుగ్రహ శక్తి కలవాడు, ప్రభుత్వం తన చేతిలో లేకపోయినా ఈ పాటికే విస్తారమైన కీర్తిని సంపాదించిన వాడు అయిన శ్రీరామచంద్రుడు విడవాల్సిన కొడుకా? నా ప్రియ పుత్రుడైన రాముడిని లోకమంతా మెచ్చుకుంటుంటే, నా నోటితో, ఓరీ, అడవులకు పోరా అని నేనెలా చెప్పగలను? అది సాధ్యంకాని పని" అని అంటూ దశరథుడు కైకను వేడుకోవడం మొదలెట్టాడు.

కైకను వేడుకుంటున్న దశరథుడు

"ఒకవేళ నేను దురుసుగా, మనసు నొప్పే విధంగా, మాట్లాడినా, బదులు చెప్పకుండా సహించుకునే గుణం కలవాడు రాముడు. నాలాగా కోపానికి దాసుడు కాదు. నా ధనం ఆశించేవాడు కాదు. నేను ఇవ్వలేదని రోషం తెచ్చుకునేవాడు కాదు. ఇంద్రియాలను జయించిన వాడు, తన సొత్తు ఒకరికి ఇచ్చే వాడే కాని రావాలని కోరుకోని వాడు, ఇతరులు సొత్తు ఇచ్చినా పుచ్చుకొనని వాడు, తాను కష్టపడ్డా కూడా తన సత్యాన్ని-ఇతరుల సత్యాన్ని రక్షించే వాడు, సామాన్య-విశేష ధర్మాలను ఎల్లప్పుడూ విడనాడని వాడు, ఒకరెంత చిన్న ఉపకారం చేసినా మరవకుండా ప్రత్యుపకారం చేసే వాడు, సర్వ భూతముల యందు దయకల వాడు, వారి దుఃఖాలను తన దుఃఖాలుగా చూసుకుని పరిహరించడానికి ఆలోచించేవాడు, అయిన శ్రీరాముడిని నన్ను ఎడబాసి అడవులకు పోయేటట్లు చేస్తే, నేనెలా జీవించగలనే? నా గతి ఏమగునే? నన్ను ఎవరు ఆదరిస్తారు? 'ఇన్నాళ్లు నిన్ను శ్రీరాముడే రక్షించాడా? నువ్వు

నిన్ను రక్షించుకోలేవా' అంటావేమో...నాకు రాగల హాని ఏమిటని అడుగుతావేమో? 'నేను లేనా' అంటావేమో? ఇల్లేమో పొమ్మంటున్నది...శ్మశానం రమ్మంటున్నది. అలాంటి సంశయ స్థితిలో వున్నాను నేను. ముసలివాడిని. మరణం ఆసన్నమైనందున దుర్బలుడను. కృశించిన వాడిని. ధైర్యం లేని వాడిని. నీ వల్ల, నన్ను నేను గతంలో లాగా రక్షించుకోలేని వాడిని. అందుకే, శ్రీరాముడి సహాయం నాకు లేకుండా చేయొద్దని మరీ-మరీ వేడుకుంటున్నాను. సముద్రానికి పొలిమేరలో వున్న ఈ భూమండలంలో, నాకు లభించిన సంపదంతా, ఒక్క గవ్వ కూడా వుంచుకోకుండా, సర్వం నీకే సమర్పించుకుంటాను. తరుణీ! నామీద కోపం తెచ్చుకోవద్దు. నీవేమో వయసు దానివి. కాబట్టి, ముసలివాడినైన నా కష్టం నీకు అర్థం కాదు. నా మీద దయ చూపు. కోప్పడవద్దు. ముదితా! నువ్వు సంతోషిస్తున్నావు. నాకేమో ప్రాణాలు పోతున్నాయి. పిల్లికి చెలగాటం, ఎలుకకు ప్రాణ సంకటం కదా! కాబట్టి, నీకు రెండు చేతులు జోడించి మొక్కుతాను. అది చాలకపోతే, నీ రెండు కాళ్లు పట్టుకుని సాష్టాంగ నమస్కారం చేస్తాను. శ్రీరాముడి మీద కోపం మానుకో. వాడికి నువ్వే దిక్కు అనుకో. అలా చేసి నా విషాదాన్ని తీసెయ్యి. జ్యేష్ఠ కుమారుడికి రాజ్యం ఇస్తానని సభాముఖంగా తెలియచేసి, ఇప్పుడు భరతుడికి ఇస్తాననడం అంటే మాట తప్పడమే! అధర్మం నన్ను బాధిస్తుంది. అలా కాకపోతే, నీకు ప్రమాణం చేసి తప్పానన్న దోషం తగుల్తుంది. నువ్వు అంగీకరిస్తే, క్షమించితే, నన్ను ఏ దోషం అంటుకోదు. అలా కాకపోతే, రెండిటిలో ఏదో ఒకటి నన్ను బాధిస్తుంది." ఇలా మాట్లాడుతూ దశరథుడు శ్రీరామ వియోగం వల్ల తనకు రాగల కష్టాన్ని పదే-పదే తలచుకుంటాడు. నేల మీద సోలి పడతాడు. తెలివితప్పి కొంత సేపు మూర్ఛపోతాడు. మళ్లీ లేస్తాడు. తనను ఏ విధంగానైనా శోక సాగర తీరానికి చేర్చమని కైకను వేడుకుంటాడు. బదులుగా కైక దశరథుడిని దూషిస్తుందిలా.

దశరథుడిని దూషించిన కైక

కోపం అతిశయించగా, భయంకరంగా తయారైన కైక, మరింత భయం కలిగించే మాటలతో రాజుతో ఇలా అనసాగింది. "ఏమోయ్ రాజా! వరాలు

కోరుకో... నేను ఇస్తానని ప్రమాణం చేసి, నన్ను నమ్మించి, నా మగడు-ప్రియుడు-సత్యవాది-ధర్మజ్ఞుడు-క్రుతజ్ఞుడని నేను నమ్మి ఏవో రెండు వరాలు కోరితే, అవి ఇవ్వడానికి ఇలా గోలుగోలున ముఖం మీద గుడ్డ వేసుకుని ఏడుస్తున్నావు? ఇది నీ తగిన పనేనా? ఇట్టి వగలమారి ఏడుపులతో నన్ను మోసగిద్దామనుకుంటున్నావా? అలా చేస్తే, రేపు నలుగురిలో ధర్మాత్ముడవని గద్దె పొంకపు మాటలు చెప్పడానికి, న్యాయం దిద్దడానికి, నీకు నోరెలా వస్తుంది? ఆ అంతఃకరణం నిన్ను చంపదా? నలుగురు నవ్వరా? ఈ రాజు ధర్మాన్ని ఒకరికి చెప్పడమే కాని తాను ఆచరించడని అనరా? ధర్మాత్ములందు శ్రేష్ఠుడా! ఎప్పుడైనా-ఎక్కడైనా, రాజులు, ఋషులు, నువ్వు కలిసినప్పుడు, వారు నిన్ను గొప్ప ధర్మాత్ముడు, సత్యవాది అని అంటే, పొగిడితే నువ్వేం సమాధానం చెప్తావు? వాళ్ళు చెప్పింది నిజమే కాని, కైక ప్రాణాలు రక్షించడం వల్ల ఇంకా జీవించి వున్నాను, ఆమె విషయంలో మాత్రం బొంకితిని అని అంటావా? ఇది ఆడది..ఇది నన్ను ఏం చేయగలదని నాతో అసత్యమాడి వుంటే, నీవలన, రాజులకందరికీ అపకీర్తి వస్తుంది. వారి మీద ప్రజలకు నమ్మకం పోతుంది. రాజుల మాట ఎవరూ నమ్మరు".

"ఇక్ష్వాకు వంశంలో పుట్టి, గొప్ప ధర్మాత్ముడు-సత్య సంధుడని జగమంతా పేరు తెచ్చుకున్న దశరథుడంతటి వాడే ఘోర ప్రమాణం చేసి అల్ప విషయంలో బొంకాడే....ఇక ఇతర రాజుల నెలా నమ్మాలి? అన్న ప్రచారం లోక వ్యాప్తంగా జరుగుతుంది. ఒక నిమిషం ముందే చేసిన ప్రమాణం వ్యర్థ పరిచేందుకు ప్రయత్నిస్తున్న నీకు ఏనాడో చేసిన బాసలెలా గుర్తుంటాయి? వాటి నెలా సార్థక పరుస్తావు? సత్య స్థాపన కొరకు పూర్వపు రాజులెలా ప్రవర్తించారో నీకు తెలియదా? పూర్వం శిబి చక్రవర్తి ఒక అడవిలో కూర్చున్నప్పుడు ఒక డేగ పావురాన్ని తరుముకుంటూ వచ్చింది. శరణంటూ ఆ పావురం శిబి ఒడిలోకి చేరింది. వెంటనే డేగ, పావురం తనకు వేద సమ్మతమైన ఆహారం అంటుంది. తాను ఆకలితో మాడుతున్నానని, తన ఆహారం తనకివ్వకపోతే ఆకలితో చచ్చిపోతానని. ఆ హింసా దోషం శిబిదేనని, కాబట్టి పావురాన్ని తిరిగి ఇవ్వమని అడుగుతుంది. పావురం ప్రాణ భీతితో తన శరణు చొచ్చిందనీ, శరణాగతులను రక్షించడం తన ధర్మమనీ, తాను మాట తప్పననీ, డేగకు

ఆహారం కావాలంటే వేరే మాంసం ఇస్తానని అంటాడు. శిబి దేహం మాంసమే కావాలని డేగ కోరుతుంది. తక్షణమే తన దేహాన్ని కత్తితో కోసి ఇచ్చాడు శిబి. ఒక అడవి పక్షి కొరకు అసత్య మాడని ధర్మాత్ములుండగా, అల్ప విషయంలో క్రుతఘ్నుడవై ఎలా అసత్యమాడుతావు? ఆయన కూడా నీలాంటి రాజే కదా?" అని అడుగుతుంది.

"నేను చేసిన ఉపకారానికి ప్రత్యుపకారంగా నా కోరిక తీరుస్తానని నువ్వు ప్రమాణం చేశావు. మరి, ఇవ్వడానికి ఎందుకు ఏడుస్తున్నావు? ఒక బ్రాహ్మణుడు తనకు కళ్ళు కావాలని నలర్కుడనే రాజును యాచించాడు. నువ్వు అడిగింది ఇస్తానన్న ఆ రాజు, మాట తప్పకుండా, తన కళ్లనే ఇచ్చి అతడి కోరిక తీర్చలేదా? తీర్చి ఉత్తమ లోకాలకు వెళ్ల లేదా? ఇది నీకు తెలియదా? రాజా! చెలియలికట్ట దాటి రానని తాను చేసిన ప్రమాణానికి అనుగుణంగానే కదా సముద్రం పొంగి భూమిని మింగడం లేదు? దానికి శక్తి లేదా? ప్రతివారూ తమ తమ నియమాలందు నిలబడకపోతే లోకం చెడిపోదా? నువ్వే కనుక సత్యానికి కట్టుబడి వుండకపోతే, రాజే అసత్యం ఆడినప్పుడు, మనమెందుకు ఆడకూడదని లోకులందరూ అసత్యమాడరా? కాబట్టి, ఇవన్నీ చక్కగా ఆలోచన చేసి, నీ సత్య నియమం అసత్యం వల్ల చెడకుండా రక్షించుకో. ఎలాంటి ప్రాణావసరములందైనను దశరథుడు అసత్యమాడడు అనే కీర్తి దక్కించుకో. ఓరీ దుష్ట బుద్ధీ! నీ వగలు, నటనలు, బూటకాలు నాకు తెలియవా? తెలుసుకోలేనా? ధర్మం నీకు చేదుగా మారిపోయి, సత్యం ఆలోచించకుండా, శ్రీరాముడిని రాజుగా చేసి, కామదాసుడవై, ఎప్పుడూ ఆ కౌసల్యతో క్రీడించదలచుకున్నావా? నేను చేస్తున్న పని ధర్మమో, అధర్మమో, అసత్యమో, సత్యమో, అనే విషయంతో నాకు సంబంధం లేదు. నువ్వు నాకు చేసిన ప్రమాణం ప్రకారం నడచుకోకుంటే, నిన్ను వూరికే వదలను. వదులుతానను కోవడం భ్రమ మాత్రమే! నువ్వు తప్పించుకొని పోలేవు. నా సవతి నీకు అంత తీపిగా వుందా? నేను చేదై పోయానా? నయానో-భయానో నన్ను మోసగించాలను కుంటున్నావా?"

"శ్రీరాముడినే నేను రాజుని చేస్తాను...నువ్వు నన్నేమి చేయగలవంటావా? నేను నిన్నేమీ చేయలేను కాని, నువ్వు చేసిన మోసానికి, అసత్య వాదికి భార్యగా వుండడం కంటే-అవమాన పడడం కంటే, నువ్వు చూస్తుండగానే ఈ క్షణంలోనే ఇంత విషం తాగి నీ కళ్ల ముందటే చచ్చి పోతాను. నా చావుకు నువ్వే కారణమై, అనృత దోషం, స్త్రీ హత్యా దోషం, విశ్వాస ద్రోహం వల్ల కలిగే పాపాలను అనుభవిస్తూ, నీ పెద్ద భార్యతోనే సుఖ సాగరంలో ఓలలాడు. ఇది నిజం. నేను నీ లాగా అసత్యం ఆడను. నీ కొచ్చే ఆదాయమంతా నాకిస్తానంటున్నావు. నేను లంచగొండిని కాను. నీ ధనంతో నాకు అవసరం లేదు. ధనం కొరకు భరతుడికి పట్టాభిషేకం చేయమనడం లేదు. సవతి సౌభాగ్యం చూడలేను. దానితో అవమానం పొందలేను. పరిచారికలందరు, లోకులందరు, చేతులు జోడించుకుని, గౌరవంతో శ్రీరాముడి తల్లికి నమస్కారం అంటుంటే, ఒక్క రోజైనా భూమిపై బతికి బాధపడడం కంటే, మరణమే మేలు." ఇంకా ఇలా అంటుంది కైక.

కైక నిష్ఠూరాలకు నివ్వెర పోయిన దశరథుడు

"ఓయీ రాజా! నువ్వు నీ మీద, నీ ప్రియ పుత్రుడైన శ్రీరాముడి మీద ప్రమాణం చేశావు కాబట్టి నా మాట విను. నా మీద, నా ఒక్క కొడుకైన భరతుడి మీద ప్రమాణం చేస్తున్నాను. నిష్కారణంగా శ్రీరాముడిని ఎలా అడవులకు పంపాలి-ఎలా కష్ట పెట్టాలి అని నీవనుకుంటే, నువ్వెన్ని చెప్పినా, ఎన్ని ఉపాయాలు చేసినా, నేను తృప్తిపడేదానిని కాదు. ఇది సత్యం." ఇలా అన్న కైక, తన నిశ్చయాన్ని తెలియచేసే చివరి మాట చెప్పి, దుఃఖపడుతున్న దశరథుడితో ఏమీ అనకుండా, అలా కూచుంది. నువ్వేం చేయదల్చుకున్నావో చేయమని అనింది. దశరథుడు కూడా ఏం చేయాలో తోచక, మనసు కలవరపడుతుంటే, కొంత సేపు కోపంగా-దుఃఖంగా పరితపిస్తూ, కైక ముఖాన్ని రెప్ప వాల్చకుండా చూసుకుంటూ అలా వుండిపోయాడు. కైక మాట్లాడిన ప్రతి అప్రియమైన మాట, ఒక్కో పిడుగులాగా, దశరథుడిని తొట్రుపాటుకు గురిచేసింది. ఆమె దుష్ట చింతనకు ఆశ్చర్య పోయాడు. ఆమె ఎంత పాప కార్యానికి పూనుకుందా అని తనలో తానే అనుకో సాగాడు. అయినా ఆమెను

అని ఏమి ప్రయోజనం అని కూడా అనుకున్నాడు. తానే ఆలోచన లేకుండా ఘోర ప్రమాణం చేశాను కదా అని వాపోయాడు. "అయ్యో! రామా! నువ్వెలా అడవిలో కష్ట పడుతావురా!" అని అనుకోసగాడు. నిట్టూర్పులు విడువసాగాడు. ఏం చేయడానికి దశరథుడికి తోచలేదు. తన అవివేకం వల్లనే ఇంత దూరం వచ్చింది కదా! అనుకుంటూ దబాలున చెట్టులాగా మూర్ఛపోయాడు. పిచ్చివాడిలాగా, రోగంతో బాధపడేవాడి లాగా, మంత్రాలకు తన తేజస్సు సదలిపోయిన వాడి లాగా, కదల లేక, కాళ్లుండి కూడా ప్రయోజనం లేని పాములాగాఅయిపోయి, దీన వాక్యాలతో ఇలా అన్నాడు రాజు.

❖ ❖ ❖

సర్గ-13

కైకేయితో న్యాయ నిష్టూరాలు ఆడిన దశరథుడు

"ఇలా చేయడం నీకు మేలు చేస్తుందని చెప్పి, ఎవరే, నీకు హానికరమైన విషయాన్ని బోధించారు? ఎవరైనా చెప్పినప్పటికి, నువ్వెందుకు ఇలా సిగ్గు విడిచి, దయ్యం పట్టిన దాని లాగా, భర్తనైన-రాజునైన నా ఎదుటే అనరాని మాటలంటున్నావు? ఇలాంటిది మనం అడగవచ్చునా? విన్నవారేమనుకుంటారు? అన్న ఆలోచన కూడా రాలేదా? కోమలీ! నీ శరీరం ఎంత కోమలంగా వుంటుందో, మనసు కూడా అంతే కోమలం అని భావించాను. కాని, ఇంత కఠిన హృదయం, విపరీత ప్రవర్తన, సాహసం, నీలో వుందని లోగడ నేనెరిగిన వాడిని కాను. ఇప్పుడు కొత్తగా ఇలాంటి మార్పుకు కారణమేంటి? నీకు భయం కలగడానికి కారణమేంటి? శ్రీరాముడికి పట్టాభిషేకం కాగానే, నిన్నిలా చేస్తాను-అలా చేస్తాను, అని ఎవరైనా బెదిరించారా? చిన్నవాడికి పట్టాభిషేకం చేయాలని, పెద్దవాడైన శ్రీరాముడిని అడవులకు పంపాలనే విపరీతపు కోరిక కోరడంలో న్యాయం లేదు కదా? దీని మూలాన ఎవరెవరికి ఎలాంటి కీడు కలగవచ్చో ఆలోచించిన దానివి కావు. నీ భర్తకు, కొడుకుకు, ప్రజలకు, ఇష్టమైన పని చేయాలన్న కోరికే వుంటే ఇలాంటివి అడగవు. నువ్వు అనుకుంటున్న పని ముగ్గురికీ మంచిది కాదు. ఓసీ దయలేని దానా! పాపంతో పొడైన దుర్మార్గపు ఆలోచన గలదానా! నీచ బుద్ధీ! ఆకారం కొన్న పాపమా! శ్రీరాముడిలో కాని, నాలో కాని ఏ నేరం కనిపెట్టావే? ఏ విషయంలో మావలన నీకు దుఃఖం కలిగింది? చెప్పవే చూద్దాం. నిష్కారణంగా ఇలాంటి మాటలు అనడం భావ్యం కాదు. పతివ్రతలకు అసలే తగదు."

"నీవేమో, శ్రీరామచంద్రుడు నగరం విడిచి పోతే, భరతుడు నిరాటంకంగా రాజ్యమేలుతాడని అనుకుంటున్నావు. కాని నీ కోరిక నెరవేరదు. ఎందుకంటే, శ్రీరాముడు లేకపోతే, భరతుడు భూ భారాన్ని ఒక్క రోజు కూడా భరించడు. అది నాకెలా తెలుసంటావా? ధర్మ విచారంలో శ్రీరాముడికంటే భరతుడికే ఎక్కువ తెలుసు కనుక పెద్దవాడుండగా చిన్నవాడు రాజ్యం ఏలడం ధర్మం

కాదని కొంతకాలం కూడా పాలించడు. శ్రీరాముడుంటే, కొంత భాగం అతడు, కొంత భాగం భరతుడు పంచుకోవడానికి అంగీకరించవచ్చేమో! అలాంటప్పుడు రాజ్యాన్ని రెండు లేక నాలుగు భాగాలు చేయమని అడుగు. కనీసం నగరంలో నన్నా రాముడిని వుండనివ్వు. భరతుడు రాజ్యమేలినా, ఏలకపోయినా, శ్రీరాముడిని అడవులకు పొమ్మంటే ఎలా? రాహువు మింగిన చంద్ర బింబంలాగా తేజో విహీనమైన రాముడి ముఖం నేనెలా చూడగలను?"

"మంత్రులతోను, పురోహితులతోను, సామంతులతోను, ఇతర హితులతోను, ఆలోచించిన తరువాతే శ్రీ రామ పట్టాభిషేకం చేయాలని నిశ్చయించుకున్నాను. అలాంటి నా మనస్సును, శత్రు సేనలు యుద్ధంలో ఓడించినట్లు నువ్వు చేస్తే నేనెలా సుఖపడుతాను? యుద్ధంలో ఓటమి చవిచూసి, పరాజయం పాలైన రాజుకు ఎలాగైతే కీర్తి-సుఖాలుండవో రామ రాజ్యాభిషేకానికి సిద్ధమై, మరలిపోతున్న నాకు కూడా కీర్తి-సుఖాలు లేవు. శ్రీ రామ పట్టాభిషేకం విషయంలో అభిలాష వున్న నానా దేశపు రాజులు మన నగరానికి తెల్లవారేసరికల్లా గుంపులు-గుంపులుగా చేరుకుంటారు. వారందరికీ ఈ వార్త తెలిసి, నన్ను గురించి ఏమనుకుంటారు? ఛీ! దశరథుడు బుద్ధి లేనివాడు...ఇలాంటి వాడు ఇంత రాజ్యాన్ని ఎలా పాలించాడు? అని అనుకుంటారు. వాళ్లంతా నాకు సామంతులు కనుక నా ఎదురుగా ఏమనకపోవచ్చు. కులంలో, గుణంలో పెద్దలైన వారు, సత్పురుషులు, పండితులు వచ్చి దశరథా....రామభద్రుడు ఏడీ? అని అడిగితే ఏమని చెప్పాలి? కైకేయి బాధ పడలేక కొడుకును వదులుకుంటున్నానని అనాలా? ఒక వేళ అలా అంటే, అంతకు ముందు, శ్రీ రామ పట్టాభిషేకం చేస్తానన్న మాట విషయంలో ఏమని జవాబివ్వాలి? అది అసత్యమా? కాదే! ఇంత మాత్రానికి సభ ఎందుకు పెట్టావు? అందరి అభిప్రాయం ఎందుకు తీసుకున్నావు? అని అడుగుతే నా దగ్గర జవాబు లేదే? ఓసీ...కైకేయీ...నీ మాట వింటే నాకు ఇహ-పర సుఖాలు రెండూ లేనట్లే."

(ఇక్కడ ఒక విషయం విచారించాల్సి వుంటుంది. శ్రీ రామచంద్రమూర్తికి పట్టాభిషేకం చేస్తానని సభాముఖంగా దశరథుడు చెప్పాడు. ఆ తరువాత కైక

అతడికి తనకిచ్చిన వరాలను గుర్తు చేసి మాటకు కట్టుబడేలా చేసింది. ఇలా పరస్పర విరుద్ధమైన ప్రస్తావన వచ్చినప్పుడు, మొదలు చెప్పింది కదా చేయాల్సింది! ఒక ధర్మాన్ని బాధించే మరో ధర్మం, ధర్మం అని అనటానికి వీలు లేదు. పరస్పర విరుద్ధం కాని ధర్మమే అసలైన ధర్మం. సభలో చెప్పడానికి ముందే కైకకు వరాలిచ్చినందున, దానికే కట్టుబడి వుండడం ధర్మమనుకున్నాడు దశరథుడు)

దశరథుడు ఇంకా ఇలా నిష్టూరాలు ఆడడం కొనసాగించాడు: "కైకేయిని సంతోష పెట్టడానికి రాముడిని అడవులకు పంపానని కౌసల్యా దేవికి ఎలా చెప్పాలి? ఇలాంటి ద్రోహం చేసిన నాకు నోరెలా వస్తుందే? ఉన్నది చెప్పొచ్చు కదా అంటావేమో? కౌసల్యా దేవి, నా విషయంలో, ఆయా సమయానికి తగినట్లు నడచుకునే వ్యక్తి. ఆటలాడేటప్పుడు చెలికత్తెలాగా, ఊడిగం చేసేటప్పుడు పట్టపురాణి అనే గర్వం లేకుండా దాసిలాగా, ధర్మ కార్యాలు చేసేటప్పుడు సహదర్మచారిణియని గ్రహించి పట్టపు దేవి అనే అభిమానం వదిలి ధర్మపత్నిలాగా, తనను కాకుండా వేరే సవతి భార్యలను నేను ఆదరించినపుడు వారిపై ఈర్ష్య లేకుండా వారికి తల్లిలాగా, భోజనం నాకు సమకూర్చేటప్పుడు నా తల్లిలాగా ప్రవర్తించే గుణం కలదామె. ఎప్పుడూ ప్రియమైన మాటలే పలుకుతుంది కాని నీలాగా అప్రియాలు అనదు. నా మంచినే కోరుతుంది కాని నీలా చెడు కోరుకోదు. నా మంచి కోరే కొడుకును కన్నదికాని నీలాంటిది కాదు. ఇలాంటిది కాబట్టే నా ప్రేమకు తగిన యోగ్యురాలైంది. ఐనప్పటికీ, నీకు భయపడి ఆమెను సరిగ్గా గౌరవించలేక పోతున్నాను. గౌరవించలేక పోయినా ఇబ్బంది లేదు కాని, ఆమెను బాధలు కూడా పెట్టాను. అవన్నీ తలచుకుంటే కడుపులో భగ్గుమని మండుతున్నది. ఇక నీకు నేను చేసిన మేళ్లు తలచుకుంటే, పథ్యం చేయలేని రోగి తినే అపథ్య భోజనం లాగా దుఃఖం కలుగుతోంది. శ్రీరాముడి లాంటి ప్రియ పుత్రుడి విషయంలోనే ఇలా ప్రవర్తించిన నేను, తన కొడుకుల విషయంలో ఎలా వుంటానో నని సుమిత్ర ఎంత బాధపడుతుందో? నన్నెలా నమ్ముతారు ఎవరైనా? నా మరణం విషయం, తన భర్త అడవుల్లోకి వెళ్లాల్సిన విషయం తెలుసుకున్న సీతాదేవి తీవ్ర దుఃఖాన్ని ఎలా తట్టుకోగలదు? అడవుల్లోకి పోబోయే కొడుకును, కన్నీరు కార్చే జనక మహారాజు కూతురు సీతను చూసి భూమి మీద నేను బతక గలనా?"

"శ్రీరాముడిని అడవులకు పంపమన్నాను కాని నిన్ను చావమనలేదు కదా అంటావేమో! విషం తిను కాని చావొద్దు, అన్నట్లుంటుంది నువ్వు చెప్పే మాటలు. శ్రీరాముడిని ఎడబాసి నేను బ్రతకడం అసాధ్యం. ప్రాణం పోవాల్సిందే. శ్రీరాముడే నాకు ప్రాణం. శ్రీరాముడు అడవులకు పోవడం, నా ప్రాణాలు పోవడం ఒకేసారి జరగాల్సిందే. కాబట్టి నేను మరణించడం తప్పనిసరి. నువ్వు విధవ కావడం తథ్యం. విధవగా రాజ్యాన్ని నీ కొడుకుతో సహా నెత్తిమీద కొట్టుకో!నీ సౌందర్యాన్ని చూసి భ్రమపడిన నేను, నీలోని విషాన్ని గ్రహించలేక పోయాను. తలమీద పెట్టుకుని గౌరవించాను. ఆ పాప ఫలాన్ని ఇప్పుడు అనుభవిస్తున్నాను. లోగడ, నా ముఖ ప్రీతి కొరకు, శ్రీరాముడు నీ పెద్ద కొడుకని, భరతుడికంటే శ్రీరాముడే నీకిష్టమని అసత్యాలు చెప్పావు. నన్ను నమ్మించి వశపర్చుకున్నావు. సతి తోడ రతి సుఖం కోసం కొడుకును విక్రయించిన నన్ను చూసి, వివేకవంతులు, కల్లు తాగిన బ్రాహ్మణుడిని నిందించినట్లు నన్ను కూడా నిందించరా? నువ్వు ఇన్ని రకాల కారు కూతలు కూసినా వినుకుంటూ, నీకు తగిన శాస్తి చేయలేకపోయాను కదా? ఇంతకంటే కష్ట కాలం ఇంకేముంటుంది? ఎంత దుఃఖం? ఎంత దుఃఖం? ఇది నా పూర్వ జన్మ పాప ఫలం. అది అనుభవించక తప్పదు. పాపాత్మురాలైన నిన్ను, నా వురితాడువని తెలియక కాపాడుకుంటూ వచ్చాను కదా? చిన్న పిల్లవాడు తాడు అనుకుని పామును తాకినట్లు నీ విషయంలో వ్యవహరించాను కదా? 'ఈ రాజెంత మతి లేనివాడని, కామ దాసుడని, చెడుబుద్ధికలవాడని, ఆడదానిని సంతోష పెట్టడానికి ముద్దుల కొడుకును అడవులకు పంపాడని', సమస్త ప్రాణి కోటులు నన్ను నిందించరా? శ్రీరాముడు గృహస్థాశ్రమ సుఖాలనుభవించే సమయంలో అడవులకు పంతున్నావు కదే?"

"భూమి లాంటి శ్రీరామచంద్రుడు నా లాంటి పాప భూమికి కొడుకుగా ఎందుకు పుట్టాడు? ఓసీ! వక్రదృష్టీ…శ్రీరామచంద్రుడు తండ్రి లేనివాడు కావడానికి నేనే కారణం కదా? అడవులకు పొమ్మని నేను అనగానే పోతానంటాడేకాని, నేనెందుకు పోవాలి అని అనడు కదా! అడవులకు పోయేటంత నేరం తానేం చేశాడని కూడా ప్రశ్నించడే? అలా కాకుండా పితృవాక్య పాలన చేయను అనే నీతి తప్పినా బాగుండేది. అలా అనడే! నేనేం

చేయాలిప్పుడు? శ్రీరాముడి మనసు నిర్మలమైంది కాబట్టి అందరి మనసులుకూడా తన లాగే నిర్మలం అనుకుంటాడు. అడవులకు పొమ్మంటే, అదేదో తన మంచి కొరకే చెపుతున్నాడని అనుకునే మనస్తత్వం. కుటిల బుద్ధితో చెపుతున్నారని అనుకోడు. శ్రీరాముడిని అరణ్యాలకు పంపగానే సమస్త జనులు నన్ను ఛీ! ఛీ! అనడం నిజం. అలాంటి ఘోరపాపినైన నన్ను భూమ్మీద వుండనీయకుండా మృత్యు దేవత యమలోకానికి ఈడ్చుకుని పోతుంది. నేను యమ పురికి పోగానే, శ్రీరాముడు అరణ్యాలకు పోవడంతో, మామీద వున్న కోపంతో, మాకు కావల్సిన వారందరినీ నీ వెలా బాధిస్తావోనని నా హృదయం కలవరపడుతోంది. వారెవరూ ఏ దోషం చేయకపోయినా నిష్కారణంగా నీ వల్ల ఏ బాధలనుభవించనున్నారో కదా? "

"శ్రీరాముడు అరణ్యానికి పోవడంతో నా మరణం సంభవించడం తథ్యం. అది ఎలాగూ తప్పేదికాదు. నా వెంటనే కౌసల్య మరణిస్తుంది. లక్ష్మణుడు అన్నను వదిలి వుండడు. శ్రీరాముడి వెంట అడవులకు పోతాడు. శత్రుఘ్నుడు భరతుడి వెంట మొదలే వెళ్లిపోయాడు. భర్త, ఇద్దరు కొడుకులు తన వెంట లేకపోవడంతో, సుమిత్ర శోక సముద్రంలో మునిగి ఆమే మరణిస్తుంది. పాపాత్మురాలా! నన్ను, కౌసల్యను, సుమిత్రను, న్యాయ వంతులైన రామలక్ష్మణ శత్రుఘ్నులను, దుఃఖంలో ముంచి నువ్వు మాత్రం లోకులందరూ "ఛీ" అంటుంటే సర్వ సుఖాలు అనుభవించు. మా రఘువంశం కీర్తివంతంగా, క్షేమంగా, కొన్నాళ్లుండాలంటే, శ్రీరాముడు వుండడం ముఖ్యం. ఆయన లేక పోతే, నేను బతకను. మేమిద్దరం లేకపోతే, అనాది కాలంగా పుణ్య కార్యాలు చేస్తుండే రఘువంశం పాడై పోగా, నువ్వు మాత్రం రాజ్యాన్ని నెత్తిన పెట్టుకుని ఏలుకో! భరతుడు రఘువంశం వాడు కాదా... అంటావేమో? జ్యేష్టాంశ న్యాయం తప్పించి అన్యాయంగా రాజ్యాన్ని ఆక్రమించడంతో రఘువంశ న్యాయం-ధర్మం తప్పినవాడైపోతాడు. అలాంటప్పుడు, ఉద్యానవనంలో కంప చెట్టులాగా, మా వంశంలో పుట్టినా పుట్టనట్లే! కాబట్టి, శ్రీరాముడిని విడిచి వుండడం నీ కొడుకుకు ఇష్టమైతే, అలాంటి అధర్మ చరిత్రుడు విడిచే తిలోదకాలు, తండ్రికి చెందవు. మరణించిన నాకు అతడు ఊర్ధ్వలోక క్రియలు చేయకూడదు. ఓసీ! దుష్ట బుద్ధీ...శత్రు రూపిణీ....నేను మరణిస్తే, శ్రీరాముడు అడవికి పోతే, నువ్వు విధవవై, నీ ఇష్టం వచ్చినట్లు నీ కొడుకుతో సహా నీవే రాజ్యాన్ని ఏలుకో".

దశరథుడు ఇంకా ఇలా నిష్ఠూరాలు ఆడడం కొనసాగించాడు: "పాపాత్ముల ఇళ్లలో వుండాల్సిన అపకీర్తి, అవమానము, లోకుల తిరస్కారం అనేవి, నీ రూపంలో నా ఇంట్లో వున్నాయి కదే పాప శీలా! గుర్రాల మీద, ఏనుగుల మీద, రథాలపైన, తిరుగుతుండె నా కొడుకు తోడు లేకుండా, ఒంటరిగా, ముళ్లు-రాళ్లు వుండే బాటలలో, దారి సరిగాలేని అడవుల్లో, కాళ్లు బొబ్బలు పెట్టుంటే ఎలా తిరగగలడే? పోటీలు పడి వంటవారు తామొండిన అన్నమే ముందు తినాలని శ్రీరాముడిని కోరుతుంటే భుజించే రాముడు కారడవుల్లో ఏ చెట్టు కాయలు, ఏ గుట్టలోని కందమూలాలు, ఎలా లభిస్తాయా అని వెతికి మరీ తిని పొట్ట నింపుకోవాలికదే? అనాథలాగా సంచరించాలి కదా? విలువైన దుస్తులు మనస్సు సంతోషించే విధంగా ధరించి తిరిగే సుందర-సుకుమార రాముడు, మార్గమధ్యంలో లభించే కావి గుడ్డలు ధరించి. చినిగిన బొంతలతో ఎలా భూమిపైన నివసించగలడే? తింటానికి తిండి లేక, కట్టుకోవడానికి బట్ట లేక ఎన్నాళ్లు జీవించగలడు? చిన్నవాడైన భరతుడు రాజ్యం ఏలాలని, పెద్దవాడైన రాముడు అడవులకు పోవాలని, నీ కుత్సిత బుద్ధికి ఎవరే అలాంటి ఆలోచన ఇచ్చినవారు? దయా హీనులైన స్త్రీలు, న్యాయంగానో-అన్యాయంగానో, ఇతరులకు కీడు కలిగించైనా సరే, తమకు మాత్రమే మేలు కలగాలని సర్వ వేళలా ఆలోచన చేస్తూ, తమకు ప్రతికూలమైన వారికి ఎలాగైనా అన్యాయం చేస్తూ ఎంత కీడైనా చేయడానికి సిద్ధంగా వుంటారు. అలాంటి వారు మనుష్యులు కారు...క్రూర మృగాలు. స్త్రీలంటే అందరూ అలాంటి వారని నా అభిప్రాయం కాదు. భరతుడి తల్లి అయిన నీ లాంటి మృత్యు దేవతలే అలాంటి వారు కాని, కౌసల్య, సుమిత్రల లాంటి ఉత్తమ స్త్రీలకు ఇది అన్వయించదు".

"దయలేని దానా! నీ కోపంతో నన్ను శోకాగ్నిలో వేసేందుకు నిశ్చయించుకున్నావా ? దుర్మార్గురాలా ! హాని కలిగించే పనులు చేయడంలో ఆసక్తి వున్నదానా ! నీ మేలు, నీ వాళ్ల మేలు మాత్రమే కోరుకుంటూ పనులు చేసేదానా! నా విషయంలో కాని, సమస్త లోకాల మేలు కోరే శ్రీరామచంద్రమూర్తి విషయంలో కాని ఎప్పుడైనా చెడు పనులు చేసిన దాఖలాలున్నాయా ? నువ్వు నన్ను బాధపెట్టడం తెలుసుకున్న సాధ్వీమణులు కూడా, కైకే ఇలాంటి పనులు చేస్తుంటే, మనం కూడా ఎందుకు మన భర్తలను బాధపెట్టకూడదు అనే భావనలో

పడతారు. శ్రీరామచంద్రుడిని నేను వదిలిపెట్టడం చూసిన అనేక మంది తండ్రులు కూడా దశరథుడే ఇలా చేస్తే మనం కూడా చేయవచ్చని తమ కొడుకులను ఎడబాటు చేయొచ్చు. 'యథారాజా తథా ప్రజా' అనే సామెత వుండనే వుంది కదా! నీ కారణాన నిష్కారణంగా వ్యసనానికి బానిసైన నేను సీతా పతిని అడవులకు పంపినా, అది నీ లాంటి మోసకత్తె పనే అని లోకులు భావింపరా? నిన్ను ఛీ ఛీ అని తిరస్కరించరా? నిన్ను రాణి అని గౌరవిస్తారా? లోకులు నిన్నేమైనా అననీ..ఛీ కొట్టనీ, ఛా కొట్టనీ. థూ థూ అననీ. నా స్థితి వేరు. మన్మథుడు లాగా సహజ సౌందర్యవంతుడు, సౌందర్యానికి తోడుగా బంగారు ఆభరణాలు ధరించి మరింత ప్రకాశించేవాడు, అతి రూపవతైన-అయోనిజైన సీతకు భర్త, నా సంతోషానికి కారణభూతుడు....ఇలాంటి కుమారుడు, నా వద్దకు వస్తుంటే దూరాన్నించే చూసి సంతోషాతిశయంతో మురిసిపోయే వాడిని. ఎదురుగా వచ్చి నిలబడితే చాలు...వార్ధక్యం పోయి యౌవనం వచ్చేది....జవసత్వాలొచ్చేవి. ఇలాంటి నాకు కీడు తలపెట్టావు కదా !"

"సూర్యుడు లేకపోయినా ప్రపంచం ఆగిపోదు. రాత్రి వేళల్లో సూర్యుడు లేకపోయినా లోక వ్యాపారం నిలిచిపోదు. వర్షం పడేందుకు ఇంద్రుడు పూనుకోక పోయినా ఏం కాదు. ఎంత కరవొచ్చినా లోకాలు నడుస్తూనే వుంటాయి. కాని, అడవులకు పోతున్న శ్రీరామచంద్రుడిని చూసి మనిషన్నవాడు ప్రాణాలతో వుండలేడు. ఒక వేళ జీవించినా అది జీవచ్ఛవం లాగానే ! తెలిసీ-తెలిసీ పాపాత్మురాలైన నిన్ను నా ఇంట్లో నా మృత్యువు లాగా వుండనిచ్చాను. లోక విరుద్ధమైన నడవడి కలిగిన దానవు నీవు. నిన్ను నమ్మి, విషనాగును, ఆడ పామును, నా తొడలపై వుంచుకుని ఇలా నాశనం అవుతున్నాను. శ్రీరామచంద్రుడిని, నన్ను, లక్ష్మణుడిని ధిక్కరించి అయోధ్యలో, కోసల దేశంలో, నా వారినందరినీ సంతోషం లేకుండా చేసి, వారందరినీ చంపి, నీ కొడుకునే యీ రాజ్యమంతా ఏలనీ. ఇక నీవు నా శత్రువుల హృదయాలను సుఖంగా వుంచు. జంతువుల గొంతులు కరకర కోసే దయలేని బోయల లాంటి దానివి నువ్వు. పుండు మీద కారం చల్లినట్లు సూటి-పోటి మాటలతో నువ్వు నన్ను బాధ పెట్ట వచ్చా? భర్తతో మాట్లాడే పద్ధతి ఇదేనా? కఠినోక్తులు పలుకవచ్చా? మోసబుద్ధి కలదానా! ఇలాంటి మాటలు అనే నీ నోటి పళ్లన్నీ వేయి తునకలై రాలిపోవా?"

"నా కొడుకు శ్రీరామచంద్రుడు నీ లాగ ఎవ్వరినీ ఒక్క మాట కూడా అనడు. ఎవరి మనసు నొప్పించడు. పెద్దలు చెప్పిన దానికి ఎదురు చెప్పడు. మంచి గుణాలన్నీ ఆచరిస్తుంటాడు. అందరి మేలు కోరుతాడు. అలాంటి వ్యక్తిని నిందించడానికి నీకు నోరెట్లా వచ్చిందే ! కేకయరాజ వంశ పాంసనీ! నేనైతే నిండు మనసుతో నీ కోరిక తీర్చలేను. చావదల్చుకుంటే చావు. నిప్పుల్లో దూకి కాల్చుకోవాలంటే అలానే చేయి. ఏడ్వదల్చుకుంటే అదీ చేయి. కాదంటే కొండ మీదినుంచి దూకి వేయి తునకలై పో. ఎలా నాశనం కాదల్చుకుంటే అలాగే కానివ్వు. పర్యవసానం ఇంతే ! 'నీ భార్యను కదా…ఎందుకు చావమంటావు..అని అడుగుతావేమో'…కత్తికంటే ఘోరంగా కోసే దానివి. ఎప్పుడూ నీ నోటికి అప్రియమైన మాటలే వస్తుంటాయి. కఠినమైన, దుర్మార్గమైన మనసు నీది. వంచనతో కుల నాశనం చేస్తున్నావు. నా మనసుకు అప్రియమైన దానివి నువ్వు. విరసంతో నా మనసును నొప్పించి సంతోషం లేకుండా చేస్తున్నావు. ఇలాంటి దానివి, భార్య వెలా అవుతావు? నే నెలా భర్తనవుతాను నీకు? నువ్వు బ్రతికుంటే నాకు దుఃఖమే కాని సంతోషం కొంచెమైనా వుండదు. కాబట్టి, నువ్వు చావటమే మేలు".

దశరథుడు ఇలా తనలోని కోపాన్ని అణచుకోలేక, అనదల్చుకున్న మాటలన్నీ అని, తిట్టదల్చుకున్న వన్నీ తిట్టి, ఇట్లా చేయడం వల్ల పని కాదేమోననుకుని, మళ్లీ మెత్తని మాటలు ఈ విధంగా మొదలెట్టాడు. "కమలాక్షీ! నా కొడుకు అడవులకు పోతే నేను జీవించుట అసత్యం. నీతో ఎలాగూ సుఖపడను. బ్రతికినా దుఃఖంతో మునిగిపోయేవాడినే కాని, సంతోషంతో వుండలేను కదా! అలాంటప్పుడు నీతో నాకేం పని ? కాబట్టి నాకు అపకారం చేయొద్దు. నీ కాళ్లకు మొక్కుతాను…మరీ మరీ మొక్కుతాను". ఇలా చెప్తూ దశరథుడు దిక్కులేని వాడి లాగా ఏడుస్తూ, స్మృతి తప్పి పడిపోయాడు. స్వయంకృతాపరాధం కారణాన చేసిన పుణ్యం తగ్గిపోయి, స్వర్గం నుండి భూమిమీద పడిపోయిన యయాతి మహారాజు లాగా శోకంతో మునిగి, దుఃఖంలో వున్న భర్తను చూసి ఏ మాత్రం చలించలేదు కైక. పైగా, భర్త భయం కాని, లోకాపవాద భయం కాని, పాప భయం కాని, ఏ మాత్రం లేకుండా మాట తప్పితే నరకం ప్రాప్తిస్తుందని భర్త దశరథుడితో అంటుంది. అసత్య

వాది అన్న అపకీర్తి వస్తుందని, కృతఘ్నుడు–మోసకాడు అని కూడా అంటారని బెదిరిస్తుంది. తను చనిపోతానని, తన చావుకు దశరథుడు కారణమవుతాడని, స్త్రీ హత్య, భార్య హత్యా దోషం అంటుకుంటుందని, అంటూ, కైక భర్తను గద్దించి మళ్లీ–మళ్లీ తన వరాలను గుర్తు చేస్తుంది. ఇక మీదట దశరథుడు తాను సత్యవాదినని, పట్టిన వ్రతం విడిచే వాడిని కానని చెప్పుకోవద్దని అంటుంది. తన వరాలు తీర్చకుండా ఋణస్తుడుగా చావాలనుకున్నా తను చావనీయనని బెదిరిస్తుంది కైక. అప్పుడు మూర్ఛలోంచి కొంచెం కోలుకున్న దశరథుడు, రోషంతో, తాను మరణించిన తరువాత, శ్రీరాముడు అడవులకు పోయిన తరువాత, కైక కోరిక పరిపూర్ణంగా తీరుతుందని, తనను మాత్రం పర లోకంలో భార్యా దాసుడవని చీత్కరిస్తారని అంటాడు.

దశరథుడు ఇంకా ఇలా అంటాడు కైకతో: "శ్రీరామచంద్రుడిని అడవులకు ఎందుకు పంపావని దేవతలడిగితే, కైకేయికి ఇచ్చిన వరముల కారణాన పంపానని చెప్పాలి కదా అంటావేమో. అది నిజమే ఐనప్పటికీ, నలుగురు వినేట్లుగా సభాముఖంగా శ్రీరాముడిని పట్టాభిషిక్తుడిని చేస్తానని అన్నా కదా! దాని సంగతేంటి? మొదలు చెప్పింది చేయకపోవడం అంటే అసత్యమాడినట్లే కదా? ముందట కైకకు వరములు ఇచ్చానని అంటావేమో? అవి ఇప్పుడు నిర్దిష్టములు కాలేదు. అవి ఎలా పాటించావని దేవతలు అడిగితే ఏం చెప్పాలి? వారు అడగవచ్చు, అడగక పోవచ్చు. అది వేరే సంగతి. ఎన్నో దీర్ఘకాల తపస్సులు చేసి లేక–లేక కన్న కొడుకు, పుణ్యాత్ముడు, శ్రీరామచంద్రమూర్తిని ఎలా వదులుకుంటానే? తపస్సు ధారపోసి, కొడుకు కావాలని మరీ–మరీ కలవరించి కన్న కొడుకును అడవుల పాలు చేయాలా? శ్రీరాముడు సామాన్యుడు కాదు. శూరుడు. గురి తప్పకుండా బాణ ప్రయోగం చేయడంలో సమర్థుడు. అలాంటి వాడిని, నా కంటే కూడా బలవంతుడిని, నేనేమని నిష్కారణంగా అడవులకు పంపాలి? కోపాన్ని జయించిన వాడు రాముడు. ఓర్పులో భూదేవికి సరిపాటి. తామర రేకుల లాంటి కళ్లు, నల్ల కలువల లాంటి ఛాయ కలవాడు. మోకాలి దాకా వున్న బాహువులు కలవాడు. దేవతాకారం కలవాడు. ఇలాంటి శ్రీరాముడిని, విక్రమ ధాముడిని, గుణనిస్సీముడిని, నన్నెవ్వరూ ఏమనరు కదా అని అడవులకు పంపనా? మిక్కిలి సుఖంగా జీవించిన వాడు రాముడు.

శోకమంటే తెలియదు. అలాంటి వాడు ఇలా దుఃఖమనుభవించడం చూసి ఎలా సహించను? నీవే చెప్పు. అది సాధ్యమా? నీ కొడుకుకు ఆ గతి పట్తే నువ్వు సహిస్తావా? వ్యసనాలకు వశపడని యోగ్యుడైన శ్రీరాముడిని ఎటువంటి వ్యసనానికి లోనుకాకుండా నేనుంచగలిగితే, నా దేహము వదిలిన తరువాత కూడా స్వర్గంలో నాకు విశేషమైన సుఖం లభిస్తుంది. అలా కాకపోతే నాకు అక్కడ కూడా సుఖముండదు. పాపాత్మురాలా! దయలేని దానా! నాకు ప్రియమైన కొడుకును, సుకుమారుడుని, యీ విధంగా బాధించి ఈ లోకంలో నాకు శాశ్వతమైన అపకీర్తిని, అవమానాన్ని సంపాదించి పెట్టడానికి పూనుకున్నావు కదే!".

ఇలా దశరథుడు స్థిరచిత్తము లేకుండా విలపిస్తూ, కొంత సేపు ధర్మ పక్షం, కొంత సేపు శ్రీరామ పక్షం మాట్లాడుతూ, కలవరపడుతుండగా సూర్యాస్తమయం అయింది. చీకటి కమ్ముకుంది. చంద్ర మండలం నిర్మలంగా, ఆకాశంలో ప్రకాశించడం మొదలైంది. దుఃఖాతిశయంతో మునిగిన దశరథుడికి, వంట్లో సత్తువ పోయే దాకా ఏడ్చిన దశరథుడికి, మూడు జాముల ఆ రాత్రి దీర్ఘంగా ఎన్నో జాముల రాత్రిగా అనిపించింది. వేడి నిట్టూర్పులు విడుస్తూ, ఆకాశం వైపు చూస్తూ, ఏడుస్తూ దశరథుడు ఇలా అనడం మొదలు పెట్టాడు. "చుక్కల సమూహంతో నిండుగా అలంకరించబడిన ఓ రాత్రీ, నీకు చేతులు జోడించి నమస్కరిస్తున్నాను. నా మీద దయచూపు. తెల్లవారనీయకు. అలా జరుగుతే, నలుగురి ముఖం నేనెలా చూడ గలను? శ్రీరాముడిని ఎలా అడవులకు పొమ్మనగలను? పోనీ, శీఘ్రంగా తెల్లవారు. నన్ను బాధించే కైక ముఖం చూడకుండా ఎటైనా వెళ్లిపోతాను."

కైకను ప్రార్థించిన దశరథుడు

అని తనలోనే అనుకుంటూ, మరో మారు కైక ముఖం చూసి, రెండు చేతులు వినయంగా జోడించి, ఆమెను ప్రసన్నురాలిని చేసుకుందామను కుంటూ, ఇలా అంటాడు దశరథుడు. "నిర్భాగ్యుడను. మంచివాడిని. నీకు స్వాధీన పడినవాడిని. నేడో-రేపో చావడానికి సిద్ధంగా వున్నవాడిని. నీకు భర్తను. భూమికంతా రాజును. ఇలాంటి నేను, అభిమానం వదిలి, రెండు

చేతులు జోడించి నిన్ను ప్రార్థిస్తున్నాను. నన్ను మన్నించు. శ్రీరాముడికి రేపు పట్టాభిషేకం చేస్తాను. భూమి మీదున్న వారి ముందర అలా ప్రతిజ్ఞ చేశాను...నీకు మాత్రం రహస్యంగా వరాలిచ్చాను. అలాంటి ప్రమాణాన్ని నేనెలా కాదంటానిప్పుడు? మాట తప్పుతే ప్రజలేమంటారు? నువ్వు మంచి నడవడి కలదానివైతే నా మాట విను. నన్ను ఇబ్బంది పెట్టవద్దు. దయచేసి శాంతంగా, ప్రసన్నురాలివి అవ్వు. దేవీ! రాజ్యాన్ని శ్రీరాముడికి వదిలేయి. ఆ పని నీవే చేయి. నా పెత్తనం అక్కరలేదు. నీ చేతుల మీద ఇచ్చిందే నిజం కానివ్వు. శ్రీరామచంద్రుడిపై కోపం వదులుకో. అలా చేస్తే, రాముడికే కాకుండా, నాకు మాత్రమే కాకుండా, సమస్త ప్రజలకు, భరతుడికి, కుల గురువులకు, అందరికీ సంతోషం కలుగుతుంది". ఇలా ఆమె మనసు కరిగేట్లు, దశరథుడు దుఃఖపడుతూ, ఆ దుఃఖం వల్ల కళ్లు ఎర్ర బారి, మాట్లాడుతున్న భర్తను చూసి, కైక చెడు బుద్ధితో తాను అతడి మాటలను అంగీకరించను అని స్పష్టంగా చెప్పింది. శ్రీరాముడు వనవాసానికి పోవాల్సిందే...భరతుడు యువరాజు కావాల్సిందే..ఇవి తప్పవు...అని మళ్లీ చెప్పిన కైకను చూసి, ఇక రాముడిని అడవికి పంపక తప్పదన్న నిర్ణయానికి వచ్చిన దశరథుడు, మాట్లాడడం మాని, శోకంతో మూర్ఛపోయాడు. బాధతో క్రుంగి పోయాడు. అలా పడి వున్న దశరథుడిని, ఆనవాయితీ ప్రకారం ఉదయం కాగానే నిద్ర లేపడానికి సుప్రభాత గీతాలు పాడేవారొచ్చారు. వారిని అలా చేయొద్దని వారించి, బయటకు పోలేక, అక్కడే వుండలేక, ఏమీ తోచక అలానే కలవర పడసాగాడు దశరథుడు.

❖ ❖ ❖

సర్గ-14

కైక దశరథుడికి బోధించిన సత్యం

పుత్ర శోకం వల్ల భూమి మీద పడి, మూర్ఛలోకి పోయి తిరిగి తేరుకుంటున్న, తన భర్తను చూసి కైక ఇలా అన్నది. "ఓ రాజా! నాకు వరాలిస్తానని ప్రమాణం చేశావు కదా! ఇలా వగలమారి ఏడుపులతో, కింద పొర్లడం చేయడంతో, దాన్ని తప్పించే ప్రయత్నం ఎందుకు చేస్తున్నావు? పాపాత్ముడిగా చనిపోవాలనుకుంటున్నావా? ఇది నీకు మంచిది కాదు. నేనెందుకు నువ్విచ్చిన వరాలను కాదనాలి? ధృఢమైన మనస్సుతో లేచి మాట్లాడు. నాకిచ్చిన వరాలను నెరవేర్చు. ధర్మమేంటో ఆలోచించు. చేసిన ప్రమాణం తీర్చడం ధర్మమో, తీర్చకుండుట ధర్మమో ఆలోచించు. ధర్మాత్ములందరూ సత్యం పలకడమే శ్రేష్ఠమైన ధర్మమని అంటారు కదా! నిన్ను చేయనలవి కాని అధర్మ కార్యం చేయమని నేను కోరలేదు. నేను నీ సహధర్మచారిణిని కాబట్టి, నీవు ధర్మం చేయడానికి, సత్యం ఆధారంగా నా వరాలు నెరవేర్చమని బలవంత పెట్తున్నాను. ఎందుకు సత్యం తప్పుతావు? సత్యం నిలుపుకుంటానికి ఇంతగా ఏడ్వడం ఎందుకు? ఆడుదానినైన నేను బోధించినప్పటికీ గ్రహించలేని నీవేమి మగవాడివి? ఏ విధమైన రాజువు? తనకు తెలియక, ఇతరులు చెప్పినా వినక పోయే వారిని లోకులేమంటారు? రాజా! తన మాట నిలుపుకొనుటకే కదా పూర్వం శిబి తన దేహాన్ని కోసి డేగకు ఇచ్చి ఉత్తమ గతులు పొందాడు. నేను నిన్నలా చేయమనడం లేదే! శిబి లాగానే ఇచ్చిన మాట నిలుపుకునేందుకు అలర్కుడు తన కళ్లు బ్రాహ్మణులకు దానంగా ఇచ్చి దేవతలను సంతోషపర్చాడు. అంతెందుకు... సముద్రుడు భూమిని తన జలాలతో ముంచి వేస్తే ఎవరైనా అడ్డు పడగలరా? ఐనా ఎందుకు చేయడం లేదంటే, తన హద్దులు తెలిసిన వాడు కనుక, కొంచెమైనా చెలియలికట్ట దాటి రాడు. రాజా! పరబ్రహ్మమంటే ఏంటి? సత్యమేకదా! సత్యం పరబ్రహ్మ! 'సత్యపరంధీమహి" యన వినలేదా? ధర్మాలకన్నిటికీ స్థానం ఏంటి? సత్యమే కదా? అక్షయవేద సమూహాలన్నీ ఏంటి? సత్యమే కదా! శాశ్వత పదం మోక్షస్థానం దేనివల్ల కలుగుతుంది? ఒక సత్యం

వలనే కదా! కాబట్టి, నీకు కొంచెమైనా ధర్మ విచారం వుంటే, సత్యాన్ని అర్థం చేసుకో! తుచ్ఛ పామరత్వం మీద మనస్సు పెట్టుకోవద్దు. ధర్మం తప్ప కూడదనే ఆలోచన నీకు ఏ మాత్రం వున్నా, రాజా, నువ్విచ్చిన రెండు వరాలు నెరవేర్చు. ధర్మంతో నాకు పనిలేదంటే అవి మరచిపో! అంతేకాని, ఉపాయంతో తప్పించుకునే ప్రయత్నం చేస్తే నేను అంగీకరించను. ధర్మం విడుస్తావో, శ్రీరాముడిని విడుస్తావో తేల్చుకో. ధర్మాన్ని విడవడం, హాని కలిగించడం మంచిదికాదని నీ మేలుకోరి నొక్కి నొక్కి మరీ చెప్తున్నాను. శ్రీరాముడిని ఇవ్వాళే అడవికి పంపు. ఇలా అనడం నా మూర్ఖత్వమే ఐనా, ముమ్మాటికి నేను చెప్పేది ఇదే. నాకు నువ్వు చేసిన ప్రమాణం తక్షణమే నెరవేర్చకపోతే ఏం జరుగుతుందో సావధానంగా నేను చెప్పేది విను. ఏదో చెప్పిందే అని అనుకోవద్దు. నీ సాక్షిగా, నీ పాదాల మీద పడి, ప్రాణాలు తీసుకుంటాను". ఇలా అంటూ, కోపంతో, ఏ మాత్రం జంకు–బొంకు లేక తనను బెదిరిస్తున్న కైకను గురించి ఆలోచించసాగాడు దశరథుడు. తన నాశనానికి కారణమైన బ్రాహ్మణుడికి దానం చేసిన బలి చక్రవర్తి లాగా, సత్య పాశ బద్ధుడైన దశరథుడు, పౌరుషం మాని, శ్రీరాముడిని అడవికి పంపనంటే సత్య హాని, పంపుతే తనకు ప్రాణహాని అని ఆలోచిస్తూ, ఏం చేయాలో తోచక, కాడికి–బండి కంటికి మధ్య చిక్కుకున్న ఎద్దు లాగా కలత చెందాడు.

కైకను విడిచిన దశరథుడు

అధర్మంతో జీవించే కంటె, ధర్మంతో ప్రాణం పోవడమే మంచిదని భావించిన దశరథుడు, ఇలాంటి పాపాత్మురాలి ముఖం ఇక చూడ కూడదని తలస్తూ, కైక తన వెనుక వుండే విధంగా అటు తిరిగి ఇలా అంటాడు: "చెడు బుద్ధి గల దానా! అగ్నిహోత్రం సాక్షిగా, మంత్రాల మధ్య, పవిత్రంగా పట్టుకున్న నీ చేతిని, నాకు పుట్టినప్పటికీ కూడా నీ కుమారుడైన భరతుడినీ, విడిచి పెట్టున్నాను".

(ఈ మాటలు దశరథుడు ఆక్రోశంతో చెప్పినవి కాదు. బెదిరించడానికీ కాదు. పరమార్థ బుద్ధితో చెప్పినవే. దశరథుడు వాస్తవానికి శపించాడు

అనుకోవాలి. ధర్మానికి విఘ్నం కలిగించే, మిక్కిలి కోపం కలిగించే, ఎల్లప్పుడూ అప్రియమైన మాటలు పలికే, "అసతి" లాంటి భార్యను ధర్మరక్షణ కొరకు వదిలిపెట్టాలని శాస్త్రం చెపుతుంది. మరి ఈ దోషాలు కైకలో వున్నాయా? వాస్తవానికి ఆమె చేసిన ఉపకారానికి ప్రత్యుపకారంగా రాజు తనంతట తానే రెండు వరాలు ఇచ్చాడు. అవి తన ఇష్టం వచ్చినపుడు అడగవచ్చని కైక భర్త అనుమతి కూడా తీసుకుంది. అవి ఆమె ఇపుడు కోరడం తప్పా? ఆమెను "అసతి" అనడానికి వీలు లేదు. అలానే ఆమెకు అతి కోపం వుందా? ఈ గుణం వున్నదని ఆమెకు దశరథుడు చెప్పలేదు. భర్తపై కోపగించుకునే భార్యను వదిలిపెట్టమని శాస్త్రం చెప్పిందే కాని, సవతుల మీద, సేవకుల మీద కోపపడే దానిని వదిలిపెట్టమని శాస్త్రంలో లేదు. కాబట్టి దశరథుడు చేసింది సరైన పని కాదని ఒక వాదన వుంది. మరో విధంగా ఆలోచిస్తే శాస్త్రం చెప్పిన నాలుగు దోషాలు కైకలో వున్నాయనే అనాలి. కైక స్వధర్మానికి కట్టుబడింది కాదు. స్వధర్మాన్ని పాటించని వారు, పతి సేవయే వ్రతముగా లేని వారు పతివ్రతలనబడరు. ఏ స్త్రీ నడవడి విషయంలో భర్త సంతోషించడో వారిని భార్య అని అనడానికి వీలు లేదంటుంది శాస్త్రం. ఒక వేళ భర్త సంతోషిస్తే దేవతలు కూడా సంతోష పడతారట.

అగ్నిసాక్షిగా జరిగిన వివాహంలో ఎవరైతే తనను స్వీకరించాడో అతడే దైవ సమానుడు. ఏ స్త్రీ విషయంలో భర్త సంతోషించడో, ఆమె, కార్చిచ్చుతో కాలి బూడిదైన కాయలతో కూడిన చెట్టుతో సమానం. ధనం కంటె, సర్వస్వం కంటె, స్త్రీకి భర్తే శరణ్యం. ధనమంతా వదిలి భర్తే శరణ్యంగా ఎంచుకోవాలి. భర్త పరుషం మాటలన్నప్పటికీ, కోపగించుకున్నప్పటికీ, ఏ భార్య అయితే ప్రసన్నురాలిగా వుంటుందో, ఆమే పతివ్రతా స్త్రీ. భర్త మీద ప్రేమకంటే, కామం మీద కాని, భోగం మీద కాని, ఐశ్వర్యం మీద కాని, సుఖం మీద కాని, తక్కువ ప్రేమ వుంటుందో ఆమే ధర్మవంతురాలు. పతి చిత్తమే తనకు చిత్తమని, పతి హితమే తనకు హితమని, భావించే స్త్రీ పతివ్రత అవుతుంది. ఇది స్త్రీ ధర్మం. పతివ్రతా లక్షణం. కామంతో కాని, ద్వేషం తో కాని, మాత్సర్యంతో కాని, ఎవరైతే భర్తను అవమానిస్తారో ఆమె ఏడు జన్మాలు నరకం పాలవుతుంది. తన ప్రాణం పోయినా సరే, భర్తను వంచన చేయకూడదు. అలా చేసిన స్త్రీ నూరు జన్మాలు క్రిమిగా పుట్టును అని శాస్త్రం చెపుతుంది.

ఈ నేపథ్యంలో, కైకేయి స్వధర్మం పాటించ లేదనాలి. పతివ్రత కూడా కాదు. రంకుతనం ఒక్కటి లేనంత మాత్రాన స్త్రీని పతివ్రత అనడానికి వీల్లేదు. అందుకే దశరథుడు కైకను "అసతి" అని దూషించాడు. తన ధర్మాన్ని తాను పాటించక పోవడమే కాకుండా, భర్తకు ధర్మహాని కలిగించింది. జ్యేష్ఠ పుత్రుడైన శ్రీరాముడిని పట్టాభిషిక్తుడు కాకుండా అడ్డుపడింది. పెద్దకొడుకు ధర్మాత్ముడైతే సర్వస్వం పెద్ద కొడుకుదే అని శాస్త్రం చెప్తోంది. తమ్ములందరూ అతడిని తండ్రి సమానుడుగా చూడాలి. ఇలా ఆలోచిస్తే, శాస్త్ర ప్రకారం, లోకాచారం ప్రకారం, వంశాచార ప్రకారం, శ్రీరామచంద్రమూర్తికే రాజ్యం రావడం ధర్మం. అలాంటి ధర్మానికి ఐశ్వర్యం మీద కోరికతో, సవతి మీద కోపంతో, ధన లోభంతో, విఘ్నం కలిగించే ఆలోచన చేసింది కైక. ఐతే, ఆమెకిచ్చిన వరాల విషయమేంటని అడుగవచ్చు. పూర్వ ధర్మానికి విరుద్ధమైన ఉత్తమ ధర్మం, ధర్మం కాదు. ధర్మానికి ధర్మం విరోధం కాకూడదు. ముందు అనుకున్న ధర్మమే నెరవేరాలి. కైకకిచ్చిన వరాలు కులాగత శాస్త్రీయ ధర్మానికి విరోధం. అంతే కాకుండా, నిష్కారణంగా, నిరపరాధి శ్రీరామచంద్రమూర్తిని ఆయన తండ్రి చావు కోరి అడవుల పాలు చేసే ఆలోచన చేసింది. ఇవన్నీ ఆలోచన చేస్తే, భర్త మాటను అతిక్రమించు భార్యను వదిలిపెట్టాలి. అలా చేయడంలో దోషం లేదు. సమస్త లక్షణాలు సరిగ్గా వున్నప్పటికీ, భర్తను అతిక్రమించడం పొరపాటు. ఇది సనాతన ధర్మం. కాబట్టి దశరథుడు కైకను విడిచి పెట్టాననడం సమంజసమే.

ఇలా దశరథుడు కైకతో అన్న కొద్ది సేపటికే రాత్రి ముగిసింది. అప్పుడు మళ్లీ కైకతో ఇలా అంటాడు దశరథుడు: "ఉదయం ప్రారంభం మొదలైంది. శ్రీరాముడి పట్టాభిషేకం జరిపించాలని అనుకుండే మంత్రులు, పురోహితులు, నన్ను రమ్మని అడగడానికి వస్తారు. నేను జీవించి వుండలేను. అలాంటప్పుడు, శ్రీరాముడి పట్టాభిషేకానికి సిద్ధం చేసిన పదార్థాలతో మరణించిన నాకు ఆ శ్రీరాముడే వూర్ధ్వలోక ప్రాప్తికి చేయవలసిన కార్యక్రమాలన్నీ చేయాలి. దుర్మార్గురాలా! నువ్వు యీ విధంగా శ్రీరాముడి అభిషేకానికి విఘ్నం కలిగించావు కాబట్టి, నువ్వు కాని, నీ కొడుకు భరతుడు కాని నాకు తిలోదకాలు ఇవ్వకూడదు. శ్రీరాముడి పట్టాభిషేకం కోసం ఎంతో సంతోషంతో ఎదురుచూస్తుండే ప్రజలు,

ఈ దుర్వార్త విని విచారంతో తలలు వంచుకుని, కన్నీరు కారుస్తుంటే చూడలేను". ఆ సమయంలో కైక వేరే విధంగా ఆలోచించడం మొదలు పెట్టింది. నక్షత్రాలు కనిపించకుండా పోయాయి..చంద్రుడు పశ్చిమానికి పోయాడు..తూర్పు తెల్ల వారింది..ఐనా, దశరథుడు శ్రీరాముడి పట్టాభిషేకం నిలపకుండా పనికిమాలిన మాటలు చెపుతున్నాడు అనుకుంటుంది. ఈ లోగా అక్కడ మంత్రులు, పురోహితులు ఆ కార్యక్రమం కానిస్తారేమోనని భయపడుతుంది. దశరథుడితో "ఏం రాజా! ఏదో సహించలేని సన్నిపాత రోగం వచ్చినవాడిలాగా మాట్లాడుతున్నావు! ఇలాంటి పనికిమాలిన మాటలతో కాలక్షేపం చేయొద్దు. శ్రీరాముడిని పిలిపించి అడవులకు పొమ్మని చెప్పు. నా కొడుకును రాజ్యాభిషిక్తుడిని చేయి. నాకు ఎవరూ శత్రువులు లేకుండా చేసి నన్ను గర్వంగా వుండనివ్వు. అలా నువ్వు కృతకృత్యుడవు కా!" అని అంటుంది.

తన భార్య తనను ఇలా అంటుంటే బాధపడిన దశరథుడు తానెటువంటి ధర్మాన్ని అతిక్రమించలేదని, మాటకు కట్టుబడాల్సి వచ్చింది కదా అని అనుకుంటున్నానని, తన తెలివి తేటలు ఎందుకూ పనికి రాకుండా పోయాయని కైకతో చెప్తూ, శ్రీరామచంద్రుడిని చూడాలని అంటాడు.

(ధర్మ పాశముతో కట్టుబడ్డానని దశరథుడనడం యదార్థమా? కాదా? అన్నది చర్చనీయాంశమే. వాస్తవానికి దశరథుడు ధర్మపాశబద్ధుడు కాదు. ఎందుకంటే...దశరథుడు గృహస్థుడిగా భావించితే, పెద్దకొడుకును విడిచిపెట్టడం ధర్మ సమ్మతం కాదు. భార్య అంగీకారం లేకుండా విడిచిపెట్టడం సమంజసంకాదు. రాజుగా కొడుకును ఆజ్ఞాపించడానికి శ్రీరాముడు ఏ తప్పూ చేయలేదు. దోషి కాని వాడిని దండించడానికి శాస్త్రం అంగీకరించదు. అది హానికరం కూడా. క్రితం రోజు సభలో, తరువాత ఇంటిలో, రాముడికి పట్టాభిషేకం చేస్తున్నానని చెప్పాడు. ఈ కారణాన దశరథుడు ధర్మపాశబద్ధుడు కాదు. సత్యపాశ బద్ధుడగునేమో!

వాస్తవానికి దశరథుడు సత్యపాశబద్ధుడే. కైకకు ఇచ్చిన వరాలు యుద్ధంలో ప్రత్యుపకారంగా కృతజ్ఞతతో ఇచ్చినవే. భార్య కదా అని కామంతో రతి సమయంలో ఇచ్చినవి కాదు. అవి నెరవేర్చకపోతే దశరథుడు కృతఘ్నుడే

అవుతాడు. ప్రజలకు కూడా అసత్యమాడమని చెప్పినట్లే అవుతుంది. రాజాను మతమే ధర్మం. యథారాజా తథాప్రజా అన్న సామెత ప్రకారం ప్రజలు అసత్యవాదులవుతారు. అలాంటప్పుడు ప్రజలలో ఎవరైనా అసత్యమాడితే రాజెలా దండించగలడు? భార్యకు...అదీ..ప్రాణ రక్షణ సమయంలో...కృతజ్ఞతతో ఇచ్చిన మాట తప్పి అసత్యమాడితే...అదీ రాజే చేస్తే...మేం చేస్తే తప్పేంటి? అని ప్రజలడిగితే దశరథుడు ఏం సమాధానం చెప్తాడు? అందుకే, పెద్ద కొడుకును విడవాల్సి వచ్చినా, ప్రాణమే పోతున్నా, లోకం కొరకు సత్యపాశబద్ధుడు కావాల్సి వచ్చింది. కైకతో దశరథుడు, నేనెలా అధర్మ కార్యం చేయాలి అని అడిగితే, అది నీ అభిప్రాయం ప్రకారం అధర్మం కాని, నా అభిప్రాయం ప్రకారం ధర్మమే అని జవాబిచ్చిన ఆమె, నేను నిన్ను సత్యానికి కట్టుబడమని బలాత్కరిస్తున్నాను అంటుంది. "సత్యాన్ని మించిన ధర్మం లేదు...అన్ని ధర్మాలలో సత్యమే శ్రేష్టమైంది....కాబట్టి ఇది అధర్మం ఎలా అవుతుంది" అని వాదించింది కైక. అలాంటప్పుడు సత్యం, ధర్మం ఎందుకు వేర్వేరుగా చెప్పబడ్డాయంటే, సత్యం అనేది విశేష ధర్మం...ధర్మం సామాన్య వాచకం. ధర్మంలో అనేక తేడాలున్నాయి. దేహంలోని అవయవాలలో శిరస్సు ఎలాగో ధర్మంలో సత్యం అలాంటిది. శిరస్సులేని దేహం ఎలాంటిదో, సత్యం లేని ధర్మం అలాంటిది. కాబట్టి దశరథుడు ధర్మ పాశ బద్ధుడైనాను అనడంలో తప్పేమీ లేదు).

ఇంతలో చీకటి పోయి సూర్యోదయం అయింది. ముహూర్తం దగ్గర పడుతోంది. వశిష్ఠుడు సరయూ నదికి స్నానానికి పోయాడు.

పట్టాభిషేక పదార్థాలతో వచ్చిన వసిష్ఠుడు

వసిష్ఠుడు సరయూనదిలో స్నానం చేసి, నిత్య కృత్యాలు తీర్చుకుని, తాను తేవాల్సిన పదార్థాలను శిష్యుల సహాయంతో తీసుకొచ్చి, అయోధ్యా పురంలో ప్రవేశించి, రాజు వుండే అంతఃపురం సమీపానికి వచ్చాడు. వచ్చే దారిలో కసవు చిమ్మి, నీళ్లు చల్లి, నానా విధాలుగా అలంకరించి, సంతోషంతో సంచరిస్తున్న పుర ప్రజలను చూశాడు. వారందరూ సకల పదార్థాలను అంగళ్లలో వుంచి, శ్రీరామ పట్టాభిషేకం...శ్రీరామ పట్టాభిషేకం, అంటూ పదే పదే పొగుడుకుంటూ, కేరింతలు కొడుతూ, శ్రీగంధం, అగరు లాంటి ధూప వాసనలు

విరజిమ్మే వీథుల్లో వుండడం గమనించాడు వశిష్ఠుడు. వారంతా శ్రీరాముడి కారణంగా సంతోషంతో వుండి, తమ ఇళ్లను అలంకరించిన తీరు చూసి దేవతల నగరమైన అమరావతితో సమానంగా అయోధ్య వుందని అనుకున్నాడు వశిష్ఠుడు. ఇవన్నీ దాటుకుంటూ, వశిష్ఠుడు అంతఃపుర సమీపంలోకి వచ్చాడు. ఇక ఆ అంతఃపుర మేమో, కలకల కూస్తున్న పెంపుడు చిలుకలతో, ఇతర పక్షుల ధ్వనులతో, పౌరులతో, నిత్యాగ్నిహోత్రులైన బ్రాహ్మణులతో, తదితర బ్రాహ్మణ క్షత్రియ వైశ్యులతో, సభా యోగ్యులైన సామంత రాజులతో, నిండి పోయింది.

తాను వచ్చిన విషయాన్ని దశరథుడికి చెప్పమని సుమంత్రుడిని పంపిన వశిష్ఠుడు

తానొస్తున్న దారిలో గుంపులు-గుంపులుగా నిలుచున్న జనాన్ని పక్కకు తొలగమని చెప్తూ, తనకు తోవ ఏర్పరచుకుని ముందుకు సాగాడు వశిష్ఠుడు. తన కెదురుగా వస్తున్న మంత్రి, కడు సమర్థుడు, మంచి మనసున్న వాడు, సారథి, సుమంత్రుడిని చూసి, తన రాక విషయాన్ని వెంటనే దశరథుడికి తెలియచేయమని అడిగాడు వసిష్ఠుడు. అలా అడుగుతూనే, తన కార్య నిర్వహణకు సంబంధించి ఎటువంటి లోపము రాలేదని కూడా ఇలా వివరించాడు. "సుమంత్రా, నేను తెప్పించాల్సినవన్నీ తెప్పించాను. ఇవే అవి, చూడు. ఇవేమో గంగా నదీ జలాలున్న బంగారు కుండలు. ఇవి సింధూ నదీ జలాలున్న బంగారు కడవలు. ఇదేమో అభిషేకానికి కావాల్సిన అత్తి చెక్కల పీట. ఇవి నవ ధాన్యాలు. వీటితో పాటు, తేనె, రత్నాలు, గంధం, పెరుగు, నేయి, పేలలు, దర్భలు, ఎనిమిది మంది కన్యలు, ఖడ్గం, మదపుటేనుగు, మనుష్యులతో సహా వారు మోసే పల్లకి, తెల్ల గొడుగు, తెల్ల చామరలు, బంగారు కలశం కూడా తెచ్చాను. ఇవే పశువులను కట్టే పలుపులు. అలానే, పెద్ద మూపురం కల ఆబోతు, నాలుగు కోరల సింహం, ఉత్తమ జాతి గుర్రం, సింహాసనం, పులి తోలు, మండుతున్న అగ్నిహోత్రం, మంగళ వాయిద్యాలు వాయించే వారు, సింగారించుకున్న వేశ్యలు, బ్రాహ్మణులు, ఆచార్యులు, ఆవులు, పుణ్య మృగాలు, పక్షులు, పౌర జనులు, వైశ్యులు, క్షత్రియులు.....ఇలా అందరూ

ఇక్కడకు వచ్చారు. పుణ్య నక్షత్రంలో శ్రీరాముడికి పట్టాభిషేకం జరగాలి. ముహూర్తం మించకూడదు. కాబట్టి నువ్వు పోయి అంతా సిద్ధంగా వుందని దశరథుడికి చెప్పి, రాజును ఆలశ్యం చేయకుండా వేగంగా పిలుచుకుని రా". ఇలా చెప్పగానే మంత్రి సుమంత్రుడు రాజు వద్దకు వెళ్లాడు. రాజుకు అత్యంత నమ్మకస్తుడు, విశ్వాసపాత్రుడు ఐన సుమంత్రుడిని ఎప్పుడైనా అంతఃపురంలోకి రానివ్వ వచ్చని రాజాజ్ఞ కాబట్టి, ద్వారపాలకులెవరు అతడికి అడ్డు చెప్పకుండా లోనికి వెళ్లనిచ్చారు.

దశరథుడిని నిద్ర లేపిన సుమంత్రుడు

సుమంత్రుడికి రాజు పడుతున్న అవస్థలు తెలియవు. లోపలికి పోయిన మంత్రి, చేతులు జోడించి, యోగ్యమైన భక్తితో, ఉదయ సమయంలో మాట్లాడాల్సిన మంచి మాటలతో, రాజు నుద్దేశించి ఇలా అన్నాడు. "దేవా విను. పూర్ణ చంద్రోదయ సమయాన సముద్రం ఉప్పొంగినట్లు శ్రీరామాభ్యుదయంబున సంతోషంతో నువ్వు కూడా ఉప్పొంగు. రాక్షస విరోధి అయిన ఇంద్రుడి సారధి అతడిని హెచ్చరించినట్లు నీకు సారధినైన నేను నిన్ను హెచ్చరిస్తున్నాను. అంగాలతో, ఉపాంగాలతో కూడిన వేదం, సృష్టి విషయంలో బ్రహ్మదేవుడికి బోధించిన విధంగానే, రాచ కార్యాల గురించి నీకు నేను చెప్తున్నాను. మహారాజా! వేగంగా నిదుర లే. మంగళ కార్యాలు జరగాల్సి వున్నాయి. కాబట్టి తగిన రీతిగా అలంకరించుకుని మేరు పర్వతం వదిలి వచ్చే సూర్యుడిలా లోకాన్ని సంతోష పరిచేందుకు బయటకు రా. చంద్రుడు, సూర్యుడు, ఇంద్రుడు, ఈశానుడు, వరుణుడు, అగ్ని...వీరందరూ నీకు జయం కూర్చి రక్షించాలి".

"శ్రీమంతమైన రాత్రి పోయింది. ప్రభాత వేళ ఐంది. ఇంక జరగాల్సిన కార్యక్రమాలు చేయవలసిన సమయం ఆసన్నమైంది. నువ్వు లేవాలి. అయోధ్యా పుర వాసులతో సహా వశిష్ఠుడు నీ రాక కొరకై సభా మందిరంలో నీ కొరకు ఎదురు చూస్తున్నాడు. నువ్వు వచ్చి నీ కొడుకుకు పట్టాభిషేకం చేసేందుకు ఆజ్ఞ ఇవ్వాలి. నేను రాక పోయినా కార్యక్రమం జరిపించవచ్చు కదా అంటావేమో! రక్షకుడు లేని పశువులు, దళాధిపతి లేని సైన్యం, చంద్రుడు లేని

రాత్రి, పెద్ద వృషభం లేని ఆవులు, రాజు లేని నగరం-రాష్ట్రం సమానం. రాజు లేకుండా ఏదీ శోభించదు. కాబట్టి నీవే వచ్చి శ్రీరామ పట్టాభిషేక కార్యం నెరవేర్చు".

ఇలా నాలుగు మంచి మాటలు సుమంత్రుడు చెప్పినంత మాత్రాన శ్రీరామ పట్టాభిషేకం జరుగుతుందని కాదు. అంతకు ముందే రాజు ఏడ్చినందున ఆతడి కళ్లు ఎర్రగా వున్నాయి. నన్నెందుకు కష్టపెడుతున్నావు? అన్నట్లున్నాయా చూపులు. రాజు శోకంతో వుండడం గమనించిన సుమంత్రుడు ఇలా అతడి మనసు చెదిరి వున్న స్థితిలో సమయం తెలియకుండా తానెందుకు వచ్చానా అని భయపడ్డాడు సుమంత్రుడు.

శ్రీరాముడిని తీసుకుని రమ్మని సుమంత్రుడితో చెప్పినకైక

శ్రీరాముడిని పిలుచుకుని రమ్మని తనంతట తాను చెప్పలేని స్థితిలో వున్న దశరథుడిని గమనించిన కైక తన కార్యం సాధించుకుందామనుకుంది. వెంటనే మంత్రి సుమంత్రుడితో...రాత్రంతా రాజుకు నిద్ర లేదని, శ్రీరామ పట్టాభిషేక విషయం గురించి ఆలోచిస్తున్నాడని, సంతోషంతో నిద్ర పట్టి వుండదని, ఇప్పుడే నిద్ర పోయాడని, కాబట్టి ఏం చెప్పలేక పోతున్నాడని అంటుంది. "సారథీ: నువ్వు శీఘ్రంగా పోయి రాజుగారు రమ్మంటున్నారని చెప్పి శ్రీరామచంద్రుడిని ఇక్కడికి పిలుచుకుని రా. నేను చెప్పానని అనుకోవద్దు" అని అంటుంది కైక సుమంత్రుడితో. తనకీ పని అప్ప చెప్పినందుకు సంతోషించాడు సుమంత్రుడు. శ్రీరామ పట్టాభిషేకం విషయంలోనే కైక ఇంత తొందరపడుతున్నదని ఆయన భావించాడు. రాజు కూడా ఆ విషయంలోనే ధర్మా ధర్మ సందేహంలో పడి ఆలోచన చేస్తున్నాడప్పుడు. శ్రీరామచంద్రుడికి ఆ రోజున అభిషేకం జరుగనున్నదన్న సంతోషంతో పొంగిపోయిన సుమంత్రుడు, తక్షణమే అంతఃపురాన్ని వదిలి వెళ్లడానికి సిద్ధమయ్యాడు. ఆ సమయంలో ఆయన పోవాల్సిన దారిలో చేతుల్లో కానుకలతో, క్రిక్కిరిసిన జనసందోహం, ఎందరో రాజులు వున్నారు. వీరందరినీ అయన గమనించాడు.

❖ ❖ ❖

సర్గ-15

పట్టాభిషేక సంబరాల సందడి

ఉదయాన్నే నిదుర లేచి, సాంగ వేదాధ్యయన సంపన్నులైన బ్రాహ్మణులు సభ దీరారు. బహిరంగంగా పౌరులు, సేనానాయకులు, మంత్రులు, ఇతర ముఖ్యులు, ఒక్క చోట చేరి మాట్లాడుకుంటున్నారు. సూర్యోదయం కాబోతున్నదని, శ్రీరాముడి జన్మ లగ్నం కటకం జరుగుతున్నదని, పుష్యం రాబోతున్నదని, అనుకోసాగారు. అభిషేకానికి అమర్చిన వస్తువులన్నీ సిద్ధమయ్యాయి. శుభకరమైన నీటి కుండలు, మనోహరమైన పీఠం, పులి తోలు, చక్కగా పరిచిన సింధు జలాలు, గంగ-యమున సంగం జలాలు కూడా సిద్ధ పరిచారు. తూర్పు ముఖాన పారే గోదావరి-కృష్ణా-కావేరీ జలాలు, అడ్డంగా-దక్షిణంగా పారే నదీ జలాలు, నర్మదా-తపతీ జలాలు, భూమిని ఛేదించుకుని పైకి వచ్చే తీర్థాల తామరలు-కలువలు, ఇవన్నీ వున్న నీళ్లతో నిండిన బంగారు కడవలు, సర్వాలంకారాలున్న వేశ్యలు, చంద్ర కిరణాల లాగా ప్రకాశిస్తూ-బంగారు మణులతో అలంకరించబడిన దండాలున్న చామరాలు, పూల చంద్రబింబంలా వున్న తెల్లని గొడుగు, తెల్లని ఎద్దు, తెల్ల గుర్రం, మదించిన ఏనుగు దర్భలు-పాలు సిద్ధంగా వున్నాయి.మంగళ వాద్య సమూహాలు, అన్ని రకాల శుభకర బంగారు రత్నాలు, వీటితో చేయబడిన ఆభరణాలు, ఎనిమిదిమంది కన్యలు...ఇలా కావలసినవన్నీ అందంగా తీర్చి దిద్దబడినాయక్కడ. రాజులందరూ, ఇక్ష్వాకు వంశానికి చెందిన రాజు పట్టాభిషేకానికి వారివ్వాల్సిన-నియమం ప్రకారం చెల్లించాల్సిన శ్రేష్ఠమైన బహుమానాలను, శ్రీరాముడికివ్వడానికి సభలో సిద్ధంగా వుంచుకున్నారు. సూర్యోదయమైంది. రాజేమో కనిపించడం లేదు. తామొచ్చిన విషయాన్ని రాజుకు చెప్పేవారెవరో వారికి తెలియకుండా వుంది. శ్రీరాముడి కొరకు అన్నీ సిద్ధంగా వున్నాయి. జరుగుతున్న ఆలస్యానికి కారణం వెతుకుతున్నారు వారందరు.

సామంత రాజులతో మాట్లాడిన సుమంత్రుడు

ఈ విధంగా వీరంతా ఆలోచనలో వుంటే, ఆ రాజులను చూసి సుమంత్రుడు, దశరథుడు శ్రీరాముడిని పిలవాలని నన్ను ఆజ్ఞాపిస్తే నేనక్కడకు పోతున్నానని చెప్పాడు. వారంతా దశరథుడి దృష్టిలో చాలా గొప్పవారని, పూజ్యులని, శ్రీరాముడికి అంతకంటే పూజ్యులని, కాబట్టి తొందరపడకుండా ఓపికపట్టండని, తనను క్షమించమని అంటాడు సుమంత్రుడు. శ్రీరాముడి దగ్గరకు పోవాలనుకుని కూడా మళ్లీ ఒకసారి ఆలోచించాడు సుమంత్రుడు. దశరథుడు క్షేమంగా వున్నప్పటికీ కూడా ఎందుకు బయటకు రావడం లేదో శ్రీరాముడికి చెప్పాల్సిన బాధ్యత తనమీద వుందనుకున్నాడు. కారణాన్ని ఒక్క సారి విచారించి వద్దామనుకున్నాడు. తక్షణమే రాజుండే మేడలోకి వెళ్లి, రాజ వంశాన్ని ఆనవాయితీ ప్రకారం పొగిడి, దశరథుడు నిద్రించే ప్రదేశానికి పోయి, ఆయనకు, తనకు మధ్య అడ్డంగా ఒక తెర వుండగా, అక్కడ నిలుచుని ఇలా అంటాడు దశరథుడితో: "మహాత్మా! మీ వంశం దోష రహితమైంది. సూర్యుడు, చంద్రుడు, శివుడు, అగ్ని, కుబేరుడు, వరుణుడు నీకు జయాన్ని సంతోషాన్ని కలిగించాలి. రాత్రి గడిచింది. సూర్యోదయమైంది. ఇక మేలుకో. నువ్వు నెరవేర్చాల్సిన కార్యక్రమాలు తీర్చుకో. సభలో బ్రాహ్మణోత్తములు, క్షత్రియవరులు, వైశ్య రత్నాలు నీ రాక కోసం ఎదురు చూస్తున్నారు.

శ్రీరాముడిని పిలుచుకొని రమ్మని సుమంత్రుడికి చెప్పిన దశరథుడు

సుమంత్రుడి మాటలు విన్న దశరథుడు తెర అడ్డంగా వున్నప్పటికీ స్వరాన్ని బట్టి అతడు తన మంత్రి అని గుర్తించి, తాను నిదుర పోవటంలేదని, మేల్కొనే వున్నానని అంటాడు. కైక చెప్పిన విధంగా శ్రీరాముడిని పిలుచుకుని ఎందుకు రాలేదని ప్రశ్నించాడు. ఇప్పటికైనా సమయం మించి పోలేదని, తక్షణమే శీఘ్రంగా శ్రీరాముడిని పిలుచుకుని రా అని సుమంత్రుడికి చెప్పాడు దశరథుడు. ఆ మాట వింటూనే చిత్తం అనుకుంటూ బయటకు వెళ్లాడు సుమంత్రుడు. మార్గమధ్యంలో, ప్రేమాతిశయంతో గుంపులు-గుంపులుగా గుమిగూడిన ప్రజలను గమనించాడు. వారంతా రామ కథలు చెప్పుకుంటున్నారు. వారి

మాటలు విన్న సుమంత్రుడు ప్రజలందరు రాముడికి అనుకూలంగా వున్నారని సంతోషించాడు. శ్రీరాముడుండే భవనాన్ని దూరంనుంచే చూసి, సమీపిస్తున్న కొద్దీ, అదెలా వుందో తనలో తానే వర్ణించుకుంటాడు మంత్రి సుమంత్రుడు. ఆ భవనం...కైలాస శిఖరంతో సమానంగా, ఇంద్రుడుండే మేడకు ధీటుగా, కుబేరుడి భవనాన్ని తలదన్నేదిగా, మేరు పర్వత శిఖరమంత ఎత్తుగా, అందమైన తలుపులతో, చూడ ముచ్చటైన అరుగులతో, బంగారు బొమ్మలతో చేయబడిన తోరణాలతో కూడి శరత్కాల మేఘంలా వుంది. తోరణాలు కట్టబడిన శ్రేష్ఠమైన రత్నాల దండలతో అలంకరించబడి వుంది. చందనం, అగరు చెక్కల పొగ ధూపంతో సువాసనలు వెదజల్లుతోంది. మంచి ముత్యాల రత్నాలు చల్లడంతో దర్దర పర్వతంలా పరిమళిస్తోంది. బెగ్గురు పక్షుల, నెమళ్ల విన సొంపైన కంఠస్వరాలు అక్కడ అలరారుతున్నాయి. చక్కనైన ద్వారబంధాల స్థంబాలపై చెక్కబడిన తోడేళ్ల బొమ్మలు దగద్ధగాయమైన కాంతులతో మిరుమిట్లు కొలుపుతుంటే చంద్ర-సూర్యుల కాంతితో సమానంగా కనిపించసాగాయి. నానా వర్ణాల పక్షులక్కడ వుండడంతో మేరు గుహతో సమానంగా కనిపిస్తోంది. సేవకులు చేతులు జోడించుకుని అక్కడ నిలుచుని వుంటే, కానుకలు తెచ్చినవారందరూ అక్కడ నిలుచుని తమకు అవకాశం ఎప్పుడొస్తుందా అని ఎదురు చూస్తున్నారు. అక్కడ జరుగబోయే వేడుక చూసేందుకు రామ దర్శనం కొరకు వచ్చిన పల్లెటూళ్ల వారు బారులు కట్టి ఇరువైపులా నిలుచున్నారు.

ఒక పెద్ద మేఘంతో సమానమైనదిగా, అందంగా, అలంకారాలతో అలరారుతున్న ఆ భవనంలో మరుగుజ్జులతో ఆవరించబడినదైన శ్రీరాముడి గృహాన్ని చూసి, అక్కడి జనాన్ని చూసి సుమంత్రుడు సంతోషించాడు. అక్కడ శ్రీరాముడి నమ్మిన బంట్లు అనేకమందిని కూడా చూశాడు. వారంతా శ్రీరాముడి పట్టాభిషేక సుముహూర్తం కోసం ఎదురు చూస్తుండడం గమనించాడు. అక్కడే చేతులు జోడించి నిలుచున్న వారిని, విస్తారంగా కానుకలు తెచ్చిన పలువురిని, మదించి-అంజన పర్వతంతో సమానమైన బలం కలిగి-అంకుశాన్ని కూడా లక్ష్యపెట్టని-బహు పరాక్రమంతో వున్న "శత్రుంజయం" అనే పేరున్న పట్టపు ఏనుగుతో సహా అనేక ఏనుగులను, గుర్రాలను, రథాలను, మంత్రులను, వాకిట్లో నిలుచుని వున్న పలువురిని దాటుకుంటూ లోపలికి ప్రవేశించాడు సుమంత్రుడు.

సర్గ-16

దశరథుడి మాటలు శ్రీరాముడికి చెప్పిన సుమంత్రుడు

ఆ భవనంలోనే నడిమి వయసున్నవారిని, ప్రకాశవంతమైన కుండలాలు ధరించిన వారిని, హెచ్చరికగా వుండేవారిని, నిజమైన ప్రేమ కనబరిచేవారిని, విల్లు లాంటి ఆయుధాలు ధరించినవారిని, చేతి కర్ర సహాయంతో వున్న ముసలి వారిని కూడా చూశాడు సుమంత్రుడు. గంధం పూసుకుని, చొక్కాలు తొడుక్కుని, విరివిగా ఆభరణాలు ధరించి, అక్కడ శ్రీరాముడికి కాపలా వున్న వారిని చూసి, వారి వంశాచారం, పూర్వ చరిత్ర తెలిసిన సుమంత్రుడు వారి వద్దకు వచ్చాడు. అలా ఆయన రాగానే వారందరూ తొట్రుపాటుతో, తటాలున కూర్చున్న ఆసనాల నుండి లేచి, కిందకు దిగి, నిలుచున్నారు. వారందరినీ పేరు-పేరునా ప్రేమగా పలకరించిన సుమంత్రుడు, "అయ్యలారా! మీరు వెళ్లి సుమంత్రుడు బయట వున్నాడని చెప్పండి" అంటాడు. వారు వెళ్లి, సీతాదేవితో కూడి వున్న శ్రీరామచంద్రుడికి, సుమంత్రుడు వచ్చాడని చెప్పారు. తన తండ్రి హృదయాన్ని బాగా తెలిసిన సారథి సుమంత్రుడిని, తన దగ్గరకు పిలిపించుకున్నాడు శ్రీరాముడు.

సుమంత్రుడు వెళ్లిన సమయంలో, ఆయనకు దర్శనమిచ్చిన శ్రీరాముడెలా వున్నాడో వాసు దాస కవి ఇలా వర్ణించాడు: "మనోహరమైన బంగారు పూత పూసిన మంచం మీద అందమైన ముత్యాల సరాలు-ఆభరణాలు ధరించి, ఘుమ-ఘుమల పరిమళంతో ఎర్రటి నెత్తురుకంటే మరింత ఎర్రగా కనిపించే శుచిగల గంధపు పూతతో ప్రకాశిస్తూ, తన చేతి కంకణాలు ఝుణ-ఝుణ అంటుండగా జానకీ దేవి ఆమె చేతితో స్వయంగా చామరం వీస్తుంటే ఆమెనే తదేక ధ్యానంతో చూస్తుండగా, తన సరసన సీతాదేవి నిలబడి వుండగా చైత్ర శుద్ధ పౌర్ణమి నాడు చిత్రా నక్షత్రంతో కూడిన చంద్రుడి పోలికతో కనిపిస్తున్న, సహజమైన దేహ కాంతి నలు వైపులా ప్రవహిస్తుంటే కనిపించే సూర్యుని పోలిన, సమస్త ఐశ్వర్యాలున్న కుబేరుడిలా, ఆసనంలో కూర్చున్న శ్రీరామచంద్రుడు"ని చూశాడు సుమంత్రుడు.

(ఇక్కడ శ్రీరామ వర్ణనలో పర్యంక విద్యలోని భగవత్ స్వరూపంతో పోల్చడం జరిగింది. ఆ వర్ణనకొరకు వాసు దాసుగారు రాసిన పద్యం "రమణీయ కనక పర్యంక భాగంబున.....సకల సౌభాగ్యములనువై శ్రవణరామ" ప్రతి దినం ధ్యానం చేయతగింది. సుమంత్రుడు తన కళ్లతోనే శ్రీరాముడి ఆకారమంతా మింగెదనా అనే భావం వస్తుందిందులో. ఉత్కర్షానికి పరమావధి శ్రీరాముడు. అపకర్షానికి పరమావధి, ముఖ ప్రీతి మాటలు చెప్పి పొట్ట పోసుకునే సూతుడు సుమంత్రుడు. అలాంటి వాడికి సాక్షాత్తు అలాంటి దశలో శ్రీరాముడి దర్శన భాగ్యం కలగడ ఆయన అదృష్టం. శ్రీరాముడి సౌశీల్యం అలాంటిది. సుమంత్రుడు తనకు ప్రియ మంత్రి అయినప్పటికీ, దశరథుడు తన ఎదుటికి రానివ్వలేదు. తన భార్యతో వున్నప్పుడు ఇతరులు చూడకూడదని ఆయన అభిప్రాయం. ఇక సీతారాములు సర్వజన సులభులు. చూడగోరినవానికి, వారెంత నీచులైనప్పటికీ, దర్శనమిస్తారు. ఇచ్చట పుత్ర వాత్సల్యాన్ని, అక్కడ పర పురుష శంకను తెలియచేశాడు కవి.

పద్యం మొదటి పాదంలో హారములు, రెండవ పాదంలో చందనం వర్ణన చేశారు కవి. భగవంతుడు "సర్వగంధుడు" అని శ్రుతి వుంది. అలాంటి వాడికి ఆ గంధం సువాసన కలిగిస్తుంది. ఈ గంధం పూత పాల వారధిలో పడుకున్న వాడికి కౌసల్య పాలిచ్చినట్లు భావించాలి. ఆ గంధానికి అంత పరిమళం రావడానికి కారణం జానకీ దేవి సాన్నిధ్యమే అని మూడో పాదంలో చెప్పడం జరిగింది. సీతా దేవికి యోజనగంధ అని పేరు. అలాంటి సీత దేహ వాసన ప్రసరించడం వల్లనే దానికంత సువాసన కలిగిందని భావన. సూకర రక్తంతో సమానంగా వుందని చెప్పబడింది. అంటే..గంధంలో కుంకుమ పువ్వు ఎక్కువ మోతాదులో చేర్చారని అర్థం. గంధానికి సీత వలన లభించింది వాసన మాత్రమే కాదు...ఆమె ఆ గంధాన్ని పూసేటప్పుడు ఆమె పాణి తలంలో వుండే రక్త వర్ణం అందులో కలిసిందని అర్థం. గంధం శుచి కావడానికి కారణం...సీతా హస్త స్పర్శ వలన అని భావం. కాంతి వర్ణం శుచిత్వాన్ని మాత్రమే కాకుండా, శైత్య గుణం కూడా సీత కర స్పర్శతో వచ్చింది. సీత ముందుగా తాను గంధాన్ని పూసుకుని, అది మృధువుగా వుందా? లేదా? రమ్యంగా వుందా? లేదా? అని సరి చూసుకున్న తరువాతే శ్రీరాముడికి పూసిందని అర్థం చేసుకోవాలి. ఇంకో

భావన... శ్రీరాముడికి అలంకారాల లాంటి ఉపచారాలు సీత స్వయంగా చేస్తుంది కాని పరిచారికలతో కాదనేది. ఆమె కూడా అముక్త మాల్యద లాంటిదే కదా! ఆమె తాను ముందుగా ధరించిన పూల దండలనే రంగనాయకులకు అర్పించింది. "చిత్రా నక్షత్రంతో కూడిన చంద్రుడు...మృగాంకుడు" అంటే...చంద్రుడికున్న జింక రూపపు కళంకం శ్రీరాముడికి లేదని అర్థం. చంద్రుడు కేవలం చంద్రుడే! ఈయన శ్రీరామచంద్రుడు..చంద్రుడిని మించి వున్నాడు. సూర్యుడి తేజస్సు నాల్గు దిక్కుల వ్యాపించిన విధంగానే. శ్రీరాముడి తేజస్సు వ్యాపించింది అనడం అంటే, చంద్రుడి కంటె ఎలా శ్రీరామచంద్రుడు ఎక్కువో, అలానే, సర్వసాక్షి-సూర్యుడి కంటె కూడా ఆయన ఎక్కువని అర్థం. శ్రీరాముడు వాస్తవ సర్వ సాక్షి. సూర్యుడి తేజస్సు శ్రుతి ప్రకారం సూర్యుడికి నైజం కాదని, అది భగవద్దత్తమేనని, స్వభావ తేజం కలవాడు భగవంతుడొక్కడే అని, ఆ భగవంతుడే శ్రీరామచంద్రుడని, ఆయనకున్న కాంతి మరెవ్వరికీ లేదని అర్థం. పద్యంలో "రమణీయ...భాగంబునన్" అనే పదాలను ఉపయోగించాడు కవి. శ్రీరాముడి ఐశ్వర్యానికి తగైన విధంగా, హృదయాకర్షణగా, చిత్ర విచిత్ర ప్రతిమలతో అలంకరించబడిన, మనోహరమైన ఆసనం మీద ఆయన కూర్చున్నప్పుడు, మేరుశిఖరాన వర్షాకాల మేఘంలా మనోరంజకంగా కనిపించిందా సన్నివేశం అనే భావం వస్తుంది. వర్షాకాల మేఘం రైతుకు దర్శనీయమెలా అవుతుందో, అలానే, శ్రీరాముడు భక్తులకు దర్శనీయుడుగా కనిపిస్తున్నాడు. పచ్చని బంగారు మంచం మీద నీలవర్ణుడైన రాముడు బంగారంలో పొదగబడిన నీలమణిలా శోభించాడని భావం. "పర్యంక భాగంబునన్" అనే వాక్యం కూడా వాడాడు కవి. కుసుమ సుకుమారమైన శ్రీరాముడికి తగిన విధంగా, అంతే మృధువుగా వున్న పరుపు మీద ఆయన పవళించేవాడని అర్థం. ఆ పర్యంకం అంత విశేషం కలది కాబట్టే, శ్రీరాముడు అడవికి పోయేటప్పుడు, సకల పదార్థాలను దానం చేశాడు కాని, దీనిని మాత్రం సుయజ్ఞుడనే పురోహితుడి దగ్గర వుంచమన్నాడు).

ఏ కోరికలు కోరినా అనుగ్రహించే శ్రీరాముడిని దర్శించుకున్న సుమంత్రుడు ఆయనకు సాష్టాంగ నమస్కారం చేసి, ఆయన గుణాలను వర్ణించి, వినయంగా చేతులు కట్టుకుని నిలుచున్నాడు. వ్యాయామంలోను,

శయనంలోను, ఆసనంలోను, క్రీడలలోను, శ్రీరాముడికి సంతోషంగా వుంది కదా, అని కుశల ప్రశ్నలు వేశాడు. ఆ తరువాత, "కౌసల్యా నందనా! రామచంద్రా! కైకేయి దగ్గరున్న దశరధ మహారాజు, మిమ్ములను చూడాలనుకుని, తన దగ్గరకు తీసుకు రమ్మని నన్ను పంపాడు. మీరు అక్కడకు రండి" అని అంటాడు.

రాజాజ్ఞను సీతాదేవికి తెలిపిన శ్రీరాముడు

ఇలా తల్లి-తండ్రులు ఇరువురు ఒకే చోట వుండి తనను పిలవడం అంటే తనకు వారి అపూర్వ దర్శనం లభించబోతున్నదన్న సంతోషం వ్యక్త పరిచాడు శ్రీరాముడు. (ఇక్కడ వాల్మీకి సంస్కృతంలో రాసిన శ్లోకాలకు, ఆంధ్ర వాల్మీకంలో వాసు దాసు గారు రాసిన పద్యాలకు రెండు విధాలుగా అన్వయించుకునే అర్థాలు వస్తాయి). సుమంత్రుడిని సత్కరించి సీతతో ఇలా అంటాడు: "దేవీ! రాజు గారు, రాణి గారు ఒకే చోట వుండి, మేలైన యౌవ రాజ్యాన్ని నాకు ఇచ్చే విషయమై ఆలోచిస్తున్నారు. అందులో, పొగడ్తలకు అర్హురాలైన కైక, ఉత్తమ నడవడి గల కైక, నా విషయంలో మరింతగా ఆలోచించి, నాకు త్వరగా పట్టాభిషేకం జరగాలని తండ్రిగారిని తొందర పెట్టున్నది. కైక ఉపాయ శాలి కాబట్టి రాజు తనకు చెప్పక ముందే నా పట్టాభిషేకం విషయంలో తనదైన ఆలోచన చేసి, నాకు మేలు చేయాలన్న తలంపుతో, నా ఐశ్వర్య వృద్ధి కొరకు పట్టాభిషేకం చేయమని దశరథుడిని తొందర పెట్టున్నది. భర్తకు హితమైన కోరిక ప్రకారం ప్రవర్తించేది కాబట్టి నా తల్లి కైక, నా హితం కోరే సుమంత్రుడిని నా దగ్గరకు పంపారు. నా తల్లి-తండ్రులు నా విషయంలో ఎలాంటి మంచి అభిప్రాయంతో వున్నారో, నా వద్దకు పంపిన దూతకు కూడా అలాంటి మంచి అభిప్రాయమే వుంది". సుమంత్రుడి మాటలను మరో అర్థం వచ్చేలా కూడా భావించాడు శ్రీరాముడు. తన అవతారం సార్థకం కాబోతున్నదని కూడా సంతోషించాడు. సీతతో అంటాడు ఇలా: "మనం అవతరించింది పట్టాభిషేకం చేసుకుని ఇంట్లో సుఖాలు అనుభవించడానికి కాదు. దుష్ట శిక్షణకు, శిష్ట రక్షణకు, ధర్మ సంస్థాపనకు, మనం చేయాల్సిందెంతో వుంది. మనం ఆ పనికై పోవాలి. వీటిలో ముఖ్యంగా దుష్టశిక్షణే నాకు ప్రధానం. కాబట్టి, యౌవ రాజ్య

పట్టాభి షేక కార్యక్రమాన్ని ఎలా భగ్నం చేయాలా అని ఇరువురు ఆలోచిస్తున్నారు. అందునా రాణి, త్వరగా నన్ను అడవులకు పంపమని రాజును కోరుతుంది. రాజు నన్ను యువరాజు చేయబోతున్నాడని ఆయన అభిప్రాయంగా ఉ పాయశాలి ఐన కైక ఆయన చెప్పక ముందే తెలిసికొంది. ఆయన కోరిక నెరవేరితే నాకు లోకంలో కీర్తి ప్రతిష్టలు రావని భావించింది. నా మేలు కోరేది కాబట్టి నా అవతార ప్రయోజనం సఫలమయ్యేట్లు నాకు పట్టాభిషేకం జరుపరాదని భర్తను తొందర పెడ్తుంది. కైక నాకు మిక్కిలి హితమైన కోరిక ప్రకారమే నడచుకుంటుంది. నా ప్రయోజనం నెరవేరే కోరిక గలది. నా మంచి కోరే సుమంత్రుడిని నా దగ్గరకు పంపారు. ఆయన తగిన దూతే. వారి ఆలోచన పర్యవసానం నన్నిప్పుడు యువరాజును చేయకుండా వుండడమే". ఇలా చెప్పి, తానిప్పుడే వెళ్లి రాజును చూసి వస్తానని, అంతవరకు సీతను చెలికత్తెలతో సుఖంగా వుండమని అంటాడు.

శ్రీరాముడి సౌందర్య-అలంకారాలను చూసిన సీతాదేవి, ఇంత సొంపైన తన భర్తకు దృష్టి దోషం వల్ల కీడు కలుగుతుందేమో నన్న భయంతో, అతనిని మంగళ ప్రదంగా దీవిస్తూ, కొంత దూరం వెంట బోయింది.

ఆంధ్ర వాల్మీకి రామాయణంలో వాసు దాస కవి వాల్మీకి సంస్కృతంలో రాసిన శ్లోకానికి సరైన అర్థం వచ్చే విధంగా ఇక్కడొక సీస పద్యం రాశారు. " ప్రాణేశ సమ్మాని తాసితేక్షణ సీత.....సర్వ శుభములు నీకు నెసంగు గాత" అనే ఆ పద్యంలోని వివిదార్థాలను, తాత్పర్యాన్ని సవివరంగా తెలియచేశారు కవి. తన ప్రాణాలకు ప్రాణేశుడు ఐన ఈశుడు తనను విడిచి పోతుంటే వియోగ తాపాన్ని సైరింప లేక, ఆయన వెంటనే సీత ప్రాణాలు కూడా పోయే ప్రయత్నం జరుగుతుంది. సీతకు తనపై గల పరమ భక్తి తెలిసిన శ్రీరాముడు అట్టి విపత్తు కలుగకుండా వుండేందుకు సమ్మానితను చేశాడు. అంటే తన మెడలో వున్న కంఠహారాన్ని ఆమె మెడలో వేశాడు. ఇది గాఢాలింగనను సూచిస్తుంది. దాని వలన ఆమె ప్రాణాలు నిబ్బరించుకుని వుండగలిగింది.

అరణ్యంలో సీతా వియోగ సమయంలో, శ్రీరాముడు విలపిస్తుంటే, ఎందుకలా చేస్తున్నావని, రాముడంతటి వాడు కామానికి లోను కావచ్చునా

అని లక్ష్మణుడు అడిగాడు. తాను కామం కొరకు దుఃఖ పడడం లేదని జవాబిచ్చాడు శ్రీరాముడు. సీత విశ్లేష భీరువని, ఆమె లాంటి పరమ ప్రేమకలది తనను విడిచి మరణించిందేమో అని బాధ పడుతున్నానన్నాడు. శ్రీరాముడు సీతను ఇంతగా ప్రేమించడానికి మరేమైనా కారణాలున్నాయా అని ఆలోచన చేయాలి. సీత, రాముడి లాగా తల్లి గర్భం నుండి రాలేదు. నాగటి చాలులో పుట్టింది. కాబట్టి ఆమె అయోనిజ. అభిజాత్యంలో రాముడి కంటె సీతే శ్రేష్టురాలు. సీత అనేది గంగా నదికి వున్న మరో పేరు. గంగ ఒక సారి చూసిన వారిని, స్పృశించిన వారిని పావనులను చేస్తుంది. అలాంటిదే సీత కూడా. అలాంటి సీతతో నిత్య సంయోగం కలవారి మహిమ ఎలాంటిదో చెప్పాల్సిన పని లేదు. ఆ సీత ఎవరిదో, అతడి తేజం అప్రమేయం అని మారీచుడు అన్నాడు. కాబట్టి సీత మహిమే రామ ప్రభావానికి ప్రేరకం.

తన తండ్రిని చూడడానికి పోతున్న శ్రీరాముడి గౌరవానికి పాత్రురాలు సీత. ఆయనను పంపడానికి వాకిలి వరకు వచ్చిన సీత, రాముడి దివ్య మంగళ విగ్రహాన్ని చూసి, దృష్టి దోషం కలుగుతుందేమోనని భయపడి ఆశీర్వదించింది ఇలా: "బ్రాహ్మణ పూజ్యమైన రాజ్యంలో బ్రహ్మ ఇంద్రుడిని అభిషేకించిన విధంగా నిన్ను రాజు అభిషేకించాలి. దీక్ష వహించి, పూర్ణంగా వ్రతాన్ని సాధించిన దివ్యతేజుడిని, కృష్ణాజిన ధరుడిని, శుచి గలవాడిని, జింక కొమ్ము ధరించిన వాడిని చూసి, ఆశ్రయించి సేవించాలని కోరుకుంటున్నాను. సర్వ శుభాలు నీ అభివృద్ధిని కాంక్షించాలి. తూర్పున వజ్రాయుధాన్ని ధరించిన ఇంద్రుడు, దక్షిణాన మీ వంశ కర్తైన సూర్యుడి కొడుకు దండధరుడు, పడమట వరుణుడు, ఉత్తరాన కుబేరుడు నిన్ను సర్వదా రక్షించాలి." ఇలా పట్టాభిషేకం విషయంలో దశరథుడి దగ్గరకు పోతున్న శ్రీరాముడు సీత ఆశీర్వచనాన్ని తీసుకుని, తన వెంట బయట దాకా వచ్చిన సీతను అంతఃపురానికి పొమ్మని చెప్పి, సుమంత్రుడితో సహా ఇల్లు విడిచాడు.

(ఇక్కడ సీతాదేవి శ్రీరాముడిని ఆశీర్వదించినట్లు చెప్పడం జరిగింది. చిన్నవారు పెద్దలను ఆశీర్వదించవచ్చా? అందునా భర్తను ఆశీర్వదించవచ్చా? అన్న ధర్మ సందేహం కలగవచ్చు. హితం కోరడానికి, మేలు కోరడానికి చెప్పే మాటను ఆశీర్వాదం అంటారు. దాన్నే మంగళా శాసనం అని కూడా అంటారు.

గొప్ప పనిమీద పోయేవారికి, సమీపంలో వున్న వారెవరైనా అవశ్యంగా మంగళా శాసనం చేయాలి. పెద్దవారు దగ్గర లేనప్పుడు భార్య కూడా అలా చేయవచ్చు. భగవంతుడిని తమ బిడ్డగా భక్తులు భావిస్తారు. అలాంటి బిడ్డకు పామరుల దృష్టి తగులుతుందేమోనని మంగళా శాసనం చేస్తారు. అలానే సీత కూడా తండ్రిని చూడడానికి పోతున్న శ్రీరామచంద్రమూర్తికి, చూపరుల దృష్టి దోషం తగలకుండా, కీడు కలగకుండా, మంగళా శాసనం చేసింది. ఇలాంటి ఉ దాహరణలు చాలా వున్నాయి).

దశరథుడి ఇంటికి వెళ్లిన శ్రీరాముడు

గుహలోంచి బయటకు వెడలిన సింహంలా తన మందిరాన్ని వదిలి, పిల్ల ఏనుగులను బోలిన గుర్రాలు కట్టిన రథాన్ని ఎక్కాడు శ్రీరాముడు. ఇంద్రుడి రథంలాగా గమన వేగంతో పోయే ఆ రథం పైకి చంద్రుడు తూర్పు కొండను ఎక్కినట్లెక్కాడు రాముడు. ఎక్కే ముందర ఆయన కాంతి నలు దిక్కులా వ్యాపించింది. మొదటి కక్ష్యలో, వాకిటి దగ్గర చేతులు కట్టుకుని నిలుచున్న లక్ష్మణుడిని, మధ్య కక్ష్యలో నిలుచున్న స్నేహితులను ఆదరంగా పలకరించాడు. ఇక ఆ రథం, అగ్నిహోత్రంతో సమానమైన పులి తోలుతో అలంకరించబడి, మేఘ ధ్వని కలిగి, విశాలంగా కనిపించింది. ఆ రథంలో లక్ష్మణ సహితంగా బయల్దేరాడు రాముడు. ఎండ తగులకుండా, ఈగలు రాలకుండా లక్ష్మణుడు ఒక చేత్తో ఛత్రం, మరో చేత్తో చామరం పట్టుకుని నిలుచున్నాడు. ఇక, ఆయన ఎక్కిన రథం, ఆకాశంలో మేఘం ధ్వనించినట్లు గాను, తూర్పున పర్వతాన్ని విడిచి వచ్చే చంద్రుడి లాగాను వుంది. అందులో వున్న రాముడిని చూసేందుకు జనం కోలాహలంగా గుమిగూడారు. చందనం, అగరు పూసుకున్న వారు ఖడ్గాలు, విల్లులు ధరించి ముందు, వెనుకల, పక్కన నడుస్తుంటే వారితో పాటు వేల సంఖ్యలో గుర్రాలు ఏనుగులు కదిలాయి. అలా మంగళ వాద్య ధ్వనుల మధ్య, జయ-జయ ధ్వానాలు మోగుతుండగా, ఏనుగుల ఘీంకారాలు, గుర్రాల హేషలు, శూరుల మహా సింహనాదాలు, ఆ చుట్టుపక్కల వ్యాపిస్తుంటే, ఆ వేడుక చూడడానికి, దారిలోని మేడల్లోంచి కిటికీల దగ్గర చక్కగా సింగారించుకున్న స్త్రీలు తమ దోసిళ్లలో పూలు వుంచుకుని శ్రీరాముడిపై చల్లారు.

మేడలు లేని వారు, పొరుగూళ్ల నుంచి వచ్చిన స్త్రీలు, సమీపంలోని నేలమీద నుంచే, కుసుమ సుకుమారుడైన శ్రీరాముడిని చూసి సంతోషించారు.

వారిలా అనుకుంటున్నారు-అంటున్నారు: "శ్రీరామచంద్రా! తల్లి అంటే కౌసల్యే తల్లి కాని ఇతరులు తక్కువే. నువ్వు వెళ్తున్న ప్రయాణం సఫలమై, నీవు యౌవరాజ్య పట్టాభి షిక్తుడవు కాగానే, ఆమె ఎంతో సంతోషిస్తుంది. ఇక స్త్రీలంటే, నీ మనసును ఆకర్షించిన సీతే నిజమైన స్త్రీ. అలాంటి సీత, వనితామతల్లి, రోహిణి చంద్రుడితో ఎల్లప్పుడూ ఎలా కలిసి వుంటుందో, అలానే నీ ప్రియురాలిగా వుండాలి ఎల్లప్పుడూ. సమర్థురాలైన సీత ఎన్ని తపస్సులు చేసిందో కదా! ఇక ప్రజలంటే అందరూ ప్రజలేనా? నిన్ను రాజుగా పొందుటకు పూర్వ జన్మ పుణ్యం చేసుకున్న వారే నిజమైన ప్రజలు. నిజానికి మేమలా ఎలాంటి పుణ్య వ్రతాలు చేసుకున్నామో? అమ్మలారా! దశరథ రాజు దయతో మనకు శ్రీరామచంద్రమూర్తి రాజుగా రాబోతున్నాడు. ఇక మన కోరికలన్నీ నెరవేరతాయి. ఆయన పాలనలో మనకు కష్టాలంటే ఏంటో మరిచిపోతాం". ఇలా స్త్రీలందరూ తన గురించి ఇలా అనుకుంటుంటే, విని సంతోషించిన రాముడు, ఏనుగులను, గుర్రాలను, జయ జయ అని ఘోషించే వందిమాగధులను, పురజనులను, దారిలోని పుణ్య ప్రదేశాలను, సంతోషంతో నిండిన ఇళ్లను, మేడలను, తన రాజమార్గంలో చూశాడు.

❖ ❖ ❖

సర్గ-17

శ్రీరాముడిని దీవించిన ప్రజలు

అందమైన పేర్లు రాయబడి, అగరు వత్తుల ఘుమ-ఘుమ సువాసనలు వీస్తుంటే, తెల్లటి మబ్బుల వలె నున్న సున్నపు పూతలు పూసిన ఇండ్లతో, అగరు చందనాల సన్నని పట్టు వలువలతో, స్ఫటికాలు-ముత్యాలు పోసిన రాసులతో, వివిధ రకాల పిండి వంటలతో నిండి వున్న అంగళ్ల వరుసలతో కూడి వున్న రాచ మార్గంలో శ్రీరామ చంద్రుడు సంతోషంగా పోతున్నాడు. అలా ఆయన పోతుంటే, అక్షింతలతోను, రాజ యోగ్యమైన దేవ సంబంధమైన చందనంతో కూడిన ధూపములతో, పూదండలతో, ఇతర పూజా ద్రవ్యాలతో, అక్కడ వున్న వారందరు, తనను సంతోషంగా దీవిస్తుంటే, వారందరినీ ఉచిత రీతి గౌరవించాడు శ్రీరాముడు. చిరునవ్వుతో, కనుబొమలాడిస్తూ, మాట్లాడుకుంటూ, చూస్తూ, నమస్కారం చేస్తూ, ముందుకు కదల సాగాడు రాముడు. వారంతా ఆసక్తితో అయననే గమనించసాగారు. "మీ తాతలు, వారి తండ్రులు, ఈ భూమిని ఏ విధంగా ధర్మం చెడకుండా, ప్రజలకు బాధ లేకుండా పాలించారో, నీవు కూడా మమ్మల్ని అలానే ప్రేమతో పాలించి శ్రీరామచంద్రా" అనుకున్నారు. ఇంకా ఇల అనుకుంటున్నారు: "మా తాతలు, తల్లిదండ్రులు, చక్కగా మమ్ములను రక్షించినపుడు అనుభవించిన సుఖం కంటె రామ రాజ్యంలో ఎక్కువ సుఖంగా బ్రతుకుతాం. శ్రీరామచంద్రుడు పట్టాభిషేకం చేసుకోక ముందు, రాజుగా కాక ముందు, మన దగ్గరున్న ధనాదులన్నీ ఎందుకు? అనుత్తమకరమైన శ్రీరామ పట్టాభిషేక దర్శనం కంటే మేలైంది మనకు ఏ జన్మలోనైనా వస్తుందా? ధనాదులు, పుత్ర-పౌత్రులు సుఖాలను ఇవ్వవా? అనవచ్చు. అవన్నీ తుచ్ఛాలు. అశాశ్వతాలు. రామ పట్టాభిషేక మహోత్సవం ఇలా జరుగుతుంటే, దానిపై మనసుంచి ఆనందించాలి కాని, ఇతర క్షుద్ర కామ్యాలపైన మనసు పోనివ్వరాదు. మందార మకరంద మాధుర్యమున దేలు మధుపంబు పోవునే మదనములకు? ఔరా! మనమెంత పుణ్యం చేసుకున్నాం! శ్రీరాముడికి సమకాలీనులం అయినందున పూర్వంలో మన తాత-ముత్తాతలకు,

వారి తాత–ముత్తాతలకు, మన వెనుక రాబోయే మన మనుమలకు చూడడానికి వీలుకాని శ్రీరామచంద్ర యౌవ రాజ్య పట్టాభిషేక మహోత్సవాన్ని మనం కళ్లారా చూసి మన జన్మ సార్థకం చేసుకుంటున్నాం. ఇక మనకు జన్మ లేదు".

ఇలా అనుకుంటూ, తమలో తామే చెప్పుకుంటూ, పక్కవారితో కూడా మాట్లాడుతూ, కదలకుండా వున్నచోటనే వుండి, రాముడెక్కిన రథం దూరంగా పోతుంటే, తమ ఎదురుగా వచ్చినప్పుడు ఆయనపై నిలిపిన చూపులను, మనస్సును, దూరంగా పోయినప్పటికీ, కనిపించక పోయినప్పటికీ, ఆయన మీదనే దృష్టి వుంచారు కాని ఇతర విషయాల మీద మరల్చలేదు అక్కడ గుమిగూడిన ప్రజలు. అదెలా సాధ్యమయిందంటే....తమ ఎదుట వున్నప్పుడు చూసిన ఆయన ఆకారాన్ని మనస్సులో ధృఢంగా పదిలపరచుకున్నారు. అదే రూపాన్ని తమ సంకల్ప బలంతో హృదయంలో నిలిపి, అయన విషయాలను మరచి, అదే రూపాన్ని ఇంకా–ఇంకా చూడాలని కోరికతో వున్నారు వారంతా. దీనర్థం...ముందుగా స్థూల రూపాన్ని చక్కగా చూసి, తమ లక్ష్యం ధృఢ పడిన తరువాత, అదే రూపాన్ని హృదయంలోని చూపుతో చూస్తే ఏదైనా సాధ్యపడుతుందని.

శ్రీరాముడిని ఎవరు చూడరో, ఆ కారణం వల్ల శ్రీరాముడు ఎవరిని చూడడో వాడి బ్రతుకు వ్యర్థం. అలాంటి వాడు పశువులకంటే నికృష్టుడని నిందించ తగినవాడు. మనుష్యులలో అధముడైన ఇలాంటి వాడిని లోకం అసహ్యించుకుంటుంది. వాడి ఆత్మ కూడా వాడిని అసహ్యించుకుంటుంది. ఎవరైతే భగవన్మూర్తిని దర్శించలేడో, ఎవరిపైనైతే భగవత్ కటాక్షం పడదో, వాడు మళ్లీ–మళ్లీ జన్మ ఎత్తాల్సినవాడే. కాబట్టి, శ్రీరామచంద్రమూర్తిని, బాహ్యమందు,అంతరంగమందు, రెండు విధాలుగా ధ్యానించే వాడి జన్మే నిజమైన జన్మ. "రాముడిని కనుగొనడెవ్వడు, రాముడు కనడెవ్వడిని" అనడమంటె, భగవత్ కటాక్షానికి పాత్రుడవడానికి ముందే, పురుషుడు దానికై ప్రయత్నం చేయాలని, కొంచెమన్నా మనుష్య ప్రయత్నం లేకపోతే భగవత్ కటాక్షం జరగదని అర్థం చేసుకోవాలి. శ్రీరాముడిని సేవించడానికి అధికారంలో నియంత్రణ లేదని, ఆయన సర్వసముడని కూడా అర్థం చేసుకోవాలి.

శ్రీరాముడు వర్ణాశ్రమ ధర్మాల పేరుతో పక్షపాత బుద్ధితో వ్యవహరించేవాడు కాదు. నాలుగు వర్ణాల వారిని, వృద్ధులెక్కువని, పిన్న వయస్సు వారు తక్కువని, స్త్రీలు తక్కువని, పురుషులెక్కువని, బ్రాహ్మణులెక్కువని, శూద్రులు తక్కువని, భేద బుద్ధి లేకుండా, వారి-వారి యోగ్యతానుసారంగా అందరినీ ఆదరించే గుణమున్న వాడు. అందుకే, లోకులందరు, ధర్మాత్ముడైన శ్రీరాముడిని ఎప్పుడూ స్మరించుకుంటూ, అనుసరిస్తూ వుంటారు. భగవంతుడు సర్వజన సేవ్యుడు. శ్రీరాముడు నాలుగు త్రోవలు కలిసే చోటైన చదుకాలకు, చైత్యాలకు, ఉత్సవ కాలంలో దేవుడు వూరేగే దేవ పథాలకు, దేవాలయాలకు ప్రదక్షిణ మార్గంలో దశరథ రాజింటికి వెళ్లాడు. (ఇది శ్రీరాముడి శ్రద్ధా భక్తులను, శాస్త్రం మీద ఆయనకున్న విశ్వాసాన్ని, సదాచార సంపత్తిని తెలియచేస్తుంది. ఈ శ్రీరాముడి చర్య వలన, దేవాలయాల లాంటి వాటికి ప్రదక్షిణగా పోవాలని సూచిస్తున్నది. అప్రదక్షిణంగా పోకూడదు). మేఘాల సమూహంతో సమానంగా, మనోహరమైన మేడలతో ప్రకాశిస్తూ, వెండి కొండతో సమానంగా, ఆకాశాన్ని అంటుతున్నదా అనేట్లు, రత్నాలతో అలంకరించినదై, అందమైన వర్ధమాన గృహాలతో మెరుస్తూ, ఇది ఇంద్రుడి ఇల్లా అనే విధంగా, చక్కదనంతో అలరారుతున్న దివ్యమైన తన తండ్రి ఇంటిలోకి ప్రవేశించాడు శ్రీరాముడు. విల్లంబులు ధరించిన వారితోను, భటులతోను, ఎల్లప్పుడూ విడువకుండా రక్షణ చేయబడుతున్న మూడు కక్ష్యలను రథం మీద కూర్చునే స్నేహితులతో సహా దాటి పోయాడు రాముడు. ఆ తరువాత మరో రెండు కక్ష్యలను కాలినడకన పోయాడు. ఐదవ కక్ష్యలో ప్రవేశిస్తూనే తన తోడ వచ్చిన స్నేహితులందరినీ ఆగి పొమ్మన్నాడు. లక్ష్మణుడు తోడు రాగా, తన ఇష్టానుసారం సంచరించే స్వేచ్ఛ వున్న అంతఃపురంలోకి శ్రీరాముడు వెళ్లాడు. లోకులందరూ ఎప్పుడు శ్రీరాముడు అక్కడకు చేరుకుంటాడా అని ఎదురు చూస్తూ, సముద్రం చంద్రుడి రాక కోసం ఎదురు చూసినట్లు వాకిట్లో కాచుకుని వున్నారు.

❖ ❖ ❖

సర్గ-18

దశరథుడి పరిస్థితి చూసి విచారపడిన శ్రీరాముడు

విశాలమైన మంచి పడక మంచం పైన, మిక్కిలి దుఃఖంతో, వాడిపోయిన ముఖంతో, కళ్లల్లో నీళ్లు వస్తుంటే.. అదో రకంగా కనిపించిన దశరథుడికి, అక్కడకు పోయిన శ్రీరాముడు నమస్కరించాడు. అప్పుడు శ్రీరాముడి ముఖం చూస్తే ఆయన కోపగించుకుంటాడో అని భావించిన దశరథుడు కొంచెం ఎడ ముఖం-పెడ ముఖంగా తిరిగి కూర్చున్నాడు. తండ్రికి నమస్కారం చేసిన తరువాత, కైక పాదాలపై పడి నమస్కారం చేసి నిలుచున్నాడు రాముడు. అతి శోకంతో వున్న దశరథుడు, "రామా" అని ఒక్క సారి పిలిచి, ఏం చెప్పలేని పరిస్థితిలో, శ్రీరాముడు వైపు చూడ లేకపోయాడు.

ఇంతకు ముందెన్నడు ఎరుగని విపత్తు దశ నుంచి బాధపడే రాజును, అతని భయం కొలిపే ఆకారాన్ని చూసి శ్రీరామచంద్రుడు కూడా పామును తొక్కిన వాడిలా భయపడ్డాడు. ఎలాంటి కష్టం వచ్చినా భయమనేది తెలియని శ్రీరాముడు, తన తండ్రి స్థితిని చూసి, దానికి తన బాధ్యతేమన్నా వుందేమో నని, తన వల్ల ఏదైనా అపచారం జరిగిందేమో నని, కలవర పడ్డాడు. అసమానమైన శోకంతో, బాధతో, సంతోషం లేకుండా, గుండె చెదరినవాడిలా, నిట్టూర్పులు విడుస్తూ, అతి కష్టంలో వున్న వాడిలా, రాహువు పాల్పడిన సూర్యుడిలాగా, పెనుగాలికి కలవరపడిన సముద్రంలాగా, అసత్యం పలికిన ముని లాగా, వున్న తన తండ్రిని చూసి, తడబడుతూ, తన వలన తండ్రికింత వ్యధ కలిగిందేమో నని భావించాడు రాముడు. (అంటే, దీర్ఘ నిశ్వసనుడు, హర్ష విహీనుడు, నష్ట చేతనుడు, కష్ట దశావశుడు అయ్యాడని అర్థం). "నన్ను చూసినా ఎందుకు మనసులో సంతోషించడు? నా విషయంలో కాకపోయినా, ఇతరుల విషయంలో నైనా, మరే కారణానైనా, కోపం వస్తే, నన్ను చూడగానే ఆ కోపమంతా పోయి, శాంతంతో నన్ను పలకరిస్తాడే తన తండ్రి. ఇప్పుడెందుకు అలా జరగడం లేదు? ఎందుకు నా వైపు చూసి కూడా ఇంకా బాధలో కొనసాగుతున్నాడు? దీనికి కారణమేమై వుంటుంది?" అని తనలో తానే

ఆలోచన చేస్తూ, శోకంతో వికల మనస్కుడై, ముఖమంతా తెల్లబోయి, నిర్దోషి అయినప్పటికీ, భయపడిన శ్రీరాముడు కైక వైపు తిరిగి నమస్కరించాడు.

దశరథుడి దుఃఖ కారణాన్ని కైకనడిగిన శ్రీరాముడు

కైకకు నమస్కరించిన రాముడు, మనస్సు తల్లడిల్లగా..."తల్లీ! తండ్రి గారి విషయంలో నేనే పొరపాటు చేయలేదు. అయినప్పటికీ, నన్ను చూడడానికి ఇష్టం లేనివాడిలా వున్నాడాయన. నాతో మాట్లాడడానికి ముఖం చెల్లడం లేదు. మనస్సు శాంతంగా లేదు. నేనేం చేయాలమ్మా? దీనికి కారణం ఏమిటమ్మా? నువ్వైనా చెప్పు. శ్రీరాముడు బాలుడు...మీ కుమారుడు...తెలిసో, తెలియకో ఏదైనా తప్పు చేస్తే నన్ను క్షమించమని నాకు బదులుగా నీవైనా ప్రార్థించు. తల్లీ! ఎప్పుడూ నా మీద ఎంతో దయగా వుంటాడు. అలాంటి వాడిప్పుడు నాతో మాట్లాడడానికి ఇష్టపడడం లేదు. ఇదేమన్నా వ్యాధా? మనో వేదనా? భూమి మీద జన్మించిన అందరికీ శాశ్వత సుఖం వుండదు కదా? ఏదైనా వ్యాధి రావచ్చు కదా? ఇప్పుడలాంటిదేమన్నా వచ్చిందా? చెప్పు. భరతుడి విషయంలో కాని, శత్రుఘ్నుడి విషయంలో కాని, ఏదైనా అశుభ వార్త వచ్చిందా? సంతోషానికి విరుద్ధంగా ఏదైనా కీడు నా తల్లులకు కలిగిందా? తండ్రి గారు నాకే విషయాన్ని చెప్పినా, దానిని నెరవేర్చకుండా, ఆయన మనస్సును నొప్పించితే, ఒక్క క్షణం కూడా నేను బ్రతక లేను. అలాంటి నేను, తండ్రి నాపై కోపగిస్తే ఎలా బ్రతికి వుంటాను? జనన మరణ కారణమైన ఈ సంసార మనే సముద్రాన్ని దాటి పోయేందుకు, కావాల్సిన దేహాన్నిచ్చి, దానిని రక్షించిన, మహోపకారుడైన ప్రత్యక్ష దైవం తండ్రికి ఎవరు కూడా విశ్వాస హీనుడై, కృతఘ్నుడై వుండలేడు".

(**ఈ మాటలకర్థం:** తండ్రి మాట వినని కొడుకు కృతఘ్నుడని, తండ్రి మనస్సు కొడుకు నొప్పించ కూడదని, ప్రత్యక్ష దైవమైన తండ్రికి ఎదురు చెప్పకూడదని తెలుస్తోంది. ప్రత్యక్ష దైవం తండ్రి అనడమంటే, ఇంద్రియ గోచరులు కాని దేవతలను పూజించడం కంటే, ఇంద్రియ గోచరడగు తండ్రిని పూజించడం ఉత్తమం. "పితృదేవోభవ" అనేది అందుకే వచ్చింది. తండ్రి దైవం అనే అది చెపుతున్నది. ఇంట గెలవ లేనివాడు రచ్చ గెలవ లేడు కదా! అలానే,

ప్రత్యక్ష దైవాన్ని కొలువ లేని వాడు దేవతల నెలా కొలువ గలడు? "అవ్యక్తోపాసనం కంటే, వ్యక్త మూర్తి ఉపాసనం మేలు" అని దీనర్థం. తల్లి, తండ్రి జీవించినంత కాలం వేరే ధర్మం వారి అనుమతి లేకుండా చేయకూడదు. ప్రతి రోజు వారికి శుశ్రూష , ప్రియమైన హిత కార్య క్రమాలనే చేసుకుంటూ వుండాలి. కన్న తల్లిదండ్రులు, విద్య నేర్పిన వాడు, అన్న, స్త్రీకి భర్త....ఈ ఐదుగురు గురువులవుతారు. బాగు పడాలనుకునే ప్రతి వారు, ఈ ఐదుగురిని సర్వ ప్రయత్నాలు చేసైనా సరే, అవసరమైతే తన ప్రాణాలిచ్చైనా సరే పూజించాలి. తల్లిదండ్రులు ఇరువురు తన జన్మ కారకులు. కాబట్టి సర్వం వదిలిపెట్టి, వారే గతియని భావించి, కొడుకు వారి కార్యాలు నెరవేర్చాలి).

ఇంకా ఇలా అంటాడు శ్రీరాముడు: "ఇలా తండ్రి వగచే విధంగా నువ్వు దురభిమానంతో తప్పులు పట్టొ కోపంతో ఏమైనా నిష్ఠూరాలాడావా? తల్లీ చెప్పమ్మా?" ఎన్నడూ లేని వ్యధ రాజుకిప్పుడు రావాల్సిన కారణమేంటి? నిజం చెప్పు. ఎందుకిలా తపిస్తున్నాడు?

శ్రీరాముడి మాటలు విన్న కైక భర్త ఎదుటనే, ఆయనకు అప్రియమైన విషయాలు చెప్పవచ్చునా? లేదా? అన్న ఆలోచన కూడా లేకుండా, ధర్మాదర్మం గురించి వివేకం కోల్పోయి ఇలా అంది:

"నాయనా రామచంద్రా! రాజుకు నీపై కోపం ఏ మాత్రం లేదు. వ్యాధి కూడా లేదు. తన మనసులో ఒక కోరిక వుంది. అది చెపితే నీకు కోపం వస్తుందేమో నని భయపడి, చెప్పలేక, చెప్పకుండా వుండలేక బాధపడుతున్నాడు. ఆయన కోరిక నువ్వు నెరవేరిస్తే ఆయన మనసు కుదుట పడుతుంది. నాయనా రామచంద్రా! నువ్వు నీ తండ్రికి ఎంతో ప్రియమైన వాడివి. అలాంటి నీతో అప్రియమైన వార్త చెప్పడానికి భయపడి వున్నందునే నీతో చనువుగా మాట్లాడ లేక పోతున్నాడు. నన్ను చెప్పమంటే ఆ వార్త చెప్తాను. అన్నా! రామచంద్రా! మీ తండ్రి కృతజ్ఞుడై నన్ను పూర్వం ఎంతో గౌరవించి రెండు వరాలిచ్చాడు. వాటిని ఇప్పుడివ్వమని నేను కోరాను. అవి ఇవ్వలేక, మహాత్ముడైనప్పటికీ బావురుమని ఏడుస్తున్నాడు. నీరు పోయిన తరువాత గట్టు వేసిన చందాన, ముందు మాట ఇచ్చి, దాన్ని తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నాడు. దీని వలన

ఆయనకు అవమానమేకాని లాభం లేదు. నువ్వే చెప్పు. అలా చేయవచ్చా? ముందు మాట ఇచ్చి తప్పవచ్చా? అది న్యాయమా? నాయనా! పండితులందరు ధర్మమే అన్నింటికీ మూలం అంటారు. అలాంటి ధర్మాన్ని నీ మీద ప్రేమతోనో, నా మీద కోపంతోనో, రాజు భంగం చేస్తున్నాడు. మనం చెప్పిన మాట మనమే సార్థకపరచక పోతే ఎవరు అలా చేస్తారు అని, ఆ విషయం మేలు చేసినా, కీడు చేసినా, తండ్రికి నచ్చ చెపుతానంటే అదేంటో తెలియచేస్తాను. నా మాట నువ్వు వ్యర్థం చేయనంటె చెప్తాను. విన్న తరువాత చేయకపోతే చెప్పి కూడా ప్రయోజనం లేదు కదా! ఆ పైన నీ తండ్రి ఇష్టం, నీ ఇష్టం. నేను బయట పెట్టి అది అవలక్షణం అని ఎందుకు అనిపించుకోవాలి? ఆయనెందుకు చెప్ప కూడదు? నేనెందుకు చెప్పాలి అంటే, నీ పైన ప్రేమతో, నువ్వు దానిని అప్రియంగా భావిస్తావేమోనని భయపడి చెప్పలేక పోతున్నాడు".

కైక ఇలా పలుకుతుంటే, శ్రీరాముడు ఆమె చిత్త వృత్తిని గురించి ఆలోచించసాగాడు. తండ్రి కోరికను తను నెరవేరుస్తానో, లేదో అన్న సందేహం ఆమెకు కలగడం శ్రీరాముడిని బాధ పడేట్లు చేసింది. రాజు వినేట్లుగా తన అభిప్రాయాన్ని శ్రీరాముడు స్పష్టంగా చెప్పాడు. "ఛీ..ఏం మాట్లాడావమ్మా? నన్ను...రాముడిని...ఇలా నువ్వు, పితృ వాక్యాన్ని పాలిస్తాడో? లేదో? అని సందేహించడం న్యాయమా? నువ్వు అన్నది మంచిగా లేదు. రాజాజ్ఞ అయితే మండే ఎండలో దూకమంటే దూకుతా...విషం త్రాగమంటే తాగుతా... సముద్రంలో పడమంటే పడతా. నువ్వెందుకు సందేహిస్తున్నావు? ఎందుకు భయపడుతున్నావు? దశరథుడు రాజు. ఆయన ఆజ్ఞ పాటించాల్సిన విధి వుంది. అందు ఆయన గురువు. హితా హితాన్ని బోధ చేసేవాడు..పెద్దవాడు. అందు తండ్రి. అదీ కాకుండా, ఎల్లప్పుడూ నా మేలు కోరేవాడు. రాజాజ్ఞ మీర కూడదు. గురువాజ్ఞ కూడా మీర కూడదు. తండ్రి ఆజ్ఞ కూడా మీర కూడదు. నా మేలు కోరేవాడి ఆజ్ఞ మాట మీరకూడదు. ఇలాంటి నాలుగు గుణాలు ఒక్కరి లోనే వున్నప్పుడు అలాంటి వ్యక్తి ఆజ్ఞ నేనెలా వ్యర్థం చేస్తాను? కాబట్టి తల్లీ! తండ్రి కోరిక తప్పక నెరవేరుస్తాను. రాముడు రెండు మాటలు చెప్పేవాడు కాదు. ముందొక మాట, వెనుక మరో మాట మాట్లాడడు. ఇది నువ్వు తెలుసుకో" అని అంటాడు.

(శ్రీరామచంద్రుడి సద్గుణాతిశయం ఇక్కడ కనబడుతుంది. తండ్రి ఆజ్ఞ చేస్తే ప్రీతితో మంటలో దూకుతానంటాడు. సముద్రంలో మునుగుతానంటాడు. విషం తినమంటే తింటానంటాడు. కాని...ఫలానా వాడిని చంపమంటే చంపుతానని కాని, దండించమంటే దండించుతానని కాని అనడు. దశరథుడు కైక ప్రీతికై ఇవన్నీ అంటాడు లోగడ. శ్రీరాముడికి దశరథుడికి తేడా ఇక్కడ కనిపిస్తుంది. ఒకరు స్త్రీ దాసులని ఏర్పడుతోంది. శ్రీరాముడేమో తండ్రి కొరకు ఏదైనా చేస్తానన్నాడు కాని పరులను బాధించుతానని మాత్రం అనలేదు).

తన వరాల వృత్తాంతాన్ని శ్రీరాముడికి చెప్పిన కైక

లోక స్తోత్ర పాత్రుడైన శ్రీరామచంద్రుడిని, వున్నదున్నట్లు చెప్పిన రాముడిని, మోసకత్తె ఐన దుష్ట స్త్రీ కైక, ఉక్కును కరిగించి చెవుల్లో పోసిన చందాన తన వరాల సంగతిని చెప్పింది. "పూర్వం దేవతలకు, రాక్షసులకు యుద్ధం జరిగింది. రాక్షసుల బాణాలు తగిలి దశరథుడు మూర్ఛ పోయాడు. రాక్షసులప్పుడు రాజును చంపడానికి వచ్చారు. రాజును వారికి చిక్కకుండా రథాన్ని దూరంగా తీసుకుపోయి ఆయన ప్రాణాలను రక్షించాను నేను. ఆ మేలుకు ప్రతిఫలంగా, నాకు రెండు వరాలిచ్చాడు రాజు. ఆ రెండు వరాలను ఇప్పుడిమ్మని నేనడిగాను. ఆ రెండేమిటని అడగవచ్చు నువ్వు. ఒకటి నీ తమ్ముడు భరతుడికి పట్టాభిషేకం, రెండోది నీవిప్పుడే దండకారణ్యాలకు పోవడం. నీ తండ్రి నాకు ఈ వరాలిచ్చాడు. నా మాట , తండ్రి మాట పాలించదల్చుకుంటే, నీకు అసత్య దోషం రాకుండా వుండాలంటే, నీవు ఈ రాజకుమారుడివే ఐతే, నా మాటలను చివరిదాకా విని ఆచరణలో పెట్టు. వాటిని నెరవేర్చు. నువ్వు చేయాల్సిందల్లా తండ్రి ఇచ్చిన వరాలను మాట తప్పకుండా అమలయ్యేట్లు చూడడం. పద్నాలుగేండ్లు అరణ్యాలలో సంచరించడానికి తక్షణమే బయల్దేరాలి. నీ అభిషేకానికై తయారు చేయబడిన సామాగ్రి అంతా భరతుడికి ఇవ్వాలి. నీ పట్టాభిషేక ప్రయత్నాలన్నీ మానుకుని, జడలు, జింక తోలు ధరించి అడవులకు పోవాలి. నా రకాలైన రత్నాలతో కూడిన సంపద మొత్తం, రథాలు, ఏనుగులు, గుర్రాలతో సహా ఈ అయోధ్యను నా కొడుకు భరతుడు పాలించాలి. నా మీద దయతో ఈ రెండు వరాలిచ్చిన రాజు, ముందిచ్చిన వాగ్ధానాన్ని మరిచి, మతి పోయినవాడిలా,

దుఃఖ పడుతూ, ముఖం వెలవెల పోగా, నిన్ను చూడడానికి కూడా జంకుతున్నాడు. నువ్వు దోషరహితుడవైన మనిషివి కాబట్టి, నీకు వ్రత భంగం కలగకుండా చేసుకోవాలనుకుంటే, రాజు ఇచ్చిన మాట నెరవేర్చి, శ్రీరాముడి తండ్రి సత్యవాది అన్న పేరును, కీర్తిని నిలిపి తరించేట్లు చేయి."

"రామచంద్రా! నీ తండ్రి గురించి నీకు తెలియదా? ప్రతిష్ఠకు పోయి, నువ్వేమడిగినా ఇస్తానని ప్రమాణం చేసి ఎందుకు చెప్పాలి? అడిగిన తరువాత, ఇవ్వాల్సి వచ్చేసరికి ఎలా అనుకుంటూ, ముఖం మీద గుడ్డ వేసుకుని గోలుగోలున ఏడవడం ఎందుకు? ముందు నేను వరాలివ్వమని అడిగానా? బలవంత పెట్టానా? ఆయనే కదా...నాకు కృతజ్ఞత తెలుపుకుంటూ వరాలిచ్చింది? అవేమన్నా నాకు వూరికే ఇచ్చాడా? ఆయన ప్రాణాన్ని రెండు సార్లు కాపాడాను కదా? అదైనా ఆలోచించకూడదా? విశ్వామిత్రుడు వచ్చి అడిగినప్పుడు కూడా ఏదైనా అడుగు ఇస్తానన్నాడు. నిన్ను తనతోడుగా పంపమనగానే ఏడవడం మొదలుపెట్టాడు. ఆయన మగవాడు. మహాత్ముడు. కాబట్టి, కోప్పడతాననో, శపిస్తాననో అని భయపెట్టి నిన్ను పిలుచుకుని పోగలిగాడు. నేనా ఆడదానిని...నేనేమి చేయలేనని ఇలా దొంగ ఏడుపు లేడుస్తున్నాడు".

ఇలా కైక ఎన్నో విధాలుగా నిష్టురాలాడింది. శ్రీరామచంద్రుడు ధీరబుద్ధి కలవాడు కావడంతో ఇవన్నీ ఓపికగా విన్నాడు. ఐశ్వర్యాన్ని పోగొట్టుకోవడమే కాకుండా, అడవులకు పోవాల్సి వచ్చిందికదా అని ఏ మాత్రం కలత చెందలేదు. మరో పక్క కైక చెప్పిన మాటలన్నీ విన్న దశరథుడు, శ్రీరాముడు ఇక అడవులకు పోక తప్పదని భావించి, ఎలా కొడుకును విడిచి బతక గలనని మంటల్లో పడ్డ వాడిలా పొరలి పొరలి ఏడ్చి, పుత్రశోకంతో తల్లడిల్లి పోయాడు.

❖ ❖ ❖

సర్గ-19

అరణ్యానికి పోవడానికి అంగీకరించిన శ్రీరాముడు

ఎలాంటి వారికైనా మరణించేటప్పుడు కలిగే బాధ లాంటి అప్రియమైన మాటలను కైక నోటి నుంచి విన్నప్పటికీ, శత్రు సంహార దక్షుడైన శ్రీరాముడు, మనసులో కొంచెమైనా కలతపడకుండా, తనపై కోపం పెట్టుకున్న కైకను చూసి, దీనికేనా నా తండ్రి నన్ను చూసినా పలకకుండా వున్నాడని అంటాడు. "తల్లీ ఇప్పుడే జడలు ధరించి, నార వస్త్రాలు కట్టుకుని, భయంకరమైన అడవులకు పోయి, నా తండ్రి మాటలు యథార్థం చేస్తాను. ఆ విషయం గురించి నువ్వు ఆలోచించాల్సిన పనిలేదు.....కాని...నా కొక్క విషయం మాత్రం చెప్పాలి. రాజు, ఎందుకు నేను వచ్చి నిలబడినప్పటికీ, ఇదివరకు లాగా పలకరించడం లేదు? ఎందుకు దుఃఖపడుతున్నాడు? నువ్వు చెప్పేది చాలా చిన్న విషయం. దాని కొరకు ఆయన దుఃఖ పడాల్సిన పని లేదు. అలాంటప్పుడు దుఃఖ పడడానికి వాస్తవ కారణమేంటి? నేను ఆయన మాట వినకుండా, అడవికి పోకుండా తిరుగుబాటు చేస్తాడనుకుంటున్నాడా? అలాగైతే, నేను వున్నదున్నట్లు చెప్తా విను. ఇప్పుడే, ఈ క్షణం నుంచే జడలు, నార చీరెలు, ధరించి నీకు సంతోషం కలిగిస్తాను. మనస్సులో ఆనందంగా వుండు. నిష్కారణంగా నా మీద కాని, తండ్రి గారి మీద కాని కోప్పడ వద్దు".

"రాజ్యాభిషేకం చేసుకో..రాజ భోగాలు అనుభవించు...అని ప్రియమైన మాటలు చెప్తే సరే అంటావు కాని, అడవికి పొమ్మని అప్రియమైన మాటలు అంటే నేను చేస్తానని నువ్వు నమ్మడం ఎలా అంటావా? అలా నన్ను రెండు విధాలుగా ఆజ్ఞాపించినవారెవరు? మా తండ్రి గారే కదా? ఆయన నా మేలు కోరేవాడు...నన్ను కన్న తండ్రి...కృతజ్ఞుడు...గురువు...రాజు. నా మీద అన్ని విధాలా వాలభ్యం కలిగి, నువ్వీ పని చేయాలని అన్నప్పుడు, నేనెలా చేయకుండా వుంటాను? పట్టాభిషేకం అనేది, తండ్రి, రాజు, గురువు, హితుడు ఇచ్చిన ఆజ్ఞ కాబట్టి శిరసావహిస్తాను. తండ్రి ఆజ్ఞ నెరవేర్చడం నా విధి...అది నాకు ప్రియమా? అప్రియమా? అని ఆలోచించే అధికారం నాకు లేదు. 'కడి' అనగానే

నోరు తెరిచి, 'కళ్లె' మనగానే నోరు మూసే గుర్రాన్ని ఏమంటారు? కాబట్టి తండ్రి కోరిన దానిని నా దేహంలో ఊపిరి వున్నంతవరకు చేయకుండా వుంటానా?".

"పట్టాభిషేకం చేసుకోమనమని చెప్పినప్పుడు నేను పొంగి పోలేదు. ఇప్పుడు క్రుంగనూ లేదు. కాకపోతే ఒక్క విషయంలో మాత్రం నాకు బాధగా వుంది. అదేంటంటే...ఇలా మధ్యవర్తులతో కాకుండా, తనకు తానుగా నన్ను పిలిచి, నాయనా భరతుడికి పట్టాభిషేకం చేయాలని కోరికగా వుంది, అని ఒక్క మాట అంటే బాగుండేది కదా! నా మీద ఆ మాత్రం నమ్మకం లేకపోయింది కదా అనేదే నా బాధ. ఇలా నన్ను నమ్మకుండా వుండడానికి నేను చేసిన తప్పేంటి?".

"ఎందుకమ్మా! అనవసరంగా అతిగా మాట్లాడడం? దీనికోసం ఇన్నాళ్లు ఎందుకు ఆలశ్యం చేసారు? వివాహం జరిగిన నాడే, సీతను, భూమిని, ప్రాణాన్ని, సంపదను, అన్నీ భరతుడికి ఇవ్వు రామా! అని రాజంటే, సంతోషంగా ఇచ్చేవాడిని కదా! దీనికింత వ్యవహారం కావాల్నా? దశరథుడు రాజే కాదు...నాకు తండ్రి కూడా. అలాంటి వాడు కోరితే, తల్లయిన నీకు సంతోషం కలిగేట్లు, నా ప్రతిజ్ఞ నేనే తీర్చకుండేవాడినా? తల్లీ! నీ భర్తను నువ్వు సమాధాన పరుచుకో. కన్నీరు కార్చాల్సిన పనిలేదు. రాజాజ్ఞ తీసుకుని, మేనమామ ఇంటిలో వున్న భరతుడిని పిలుచుకుని రమ్మని దూతలను పంపు. నేను అడవులకు పోతాను. నాకు నా తండ్రి చెప్పలేదని కాని, నువ్వెవరు నాకు చెప్పాలని కాని, నువ్వు చెప్పేది నిజమా? అబద్ధమా? అని కాని అనను. నీకు అడ్డు చెప్పను. ఇది తప్పని కాని, ఒప్పని కాని ధర్మా ధర్మ విచక్షణ చేయను".

ఇలా శ్రీరాముడు చెప్పడంతోనే కైక సంతోషించింది. ఆ సంతోషంలోనే శ్రీరాముడితో అందిలా: "నువ్వు చెప్పింది బాగుంది. భరతుడిని పిలుచుకొని వచ్చేందుకు దూతలను పంపుతాను....కాని...నువ్విక్కడ కబుర్లాడుతూ కాలం గడపడం నాకిష్టం లేదు. నా కొడుకు ముచ్చట నీకెందుకు? నీ తోవలో నువ్వు పో. నా కొడుకొస్తే నీకెందుకు? రాకపోతే నీకెందుకు? పిలిపిస్తానో, లేదో, నా ఇష్టం. నీకా ప్రస్తావన అనవసరం. ఆ నెపంతో మరి కొద్ది రోజులు ఇక్కడ వుండ దల్చుకున్నావా? భరతుడు వస్తే అతడికి ఇబ్బందులు కలిగించాలను

కుంటున్నావా? నువ్వంత కాలం ఇక్కడ వుండడానికి వీల్లేదు. ఎదురు చెప్పకుండా ఇప్పుడే అడవులకు వెళ్లిపో. వెళ్లడానికి కావాల్సిన ప్రయత్నాలు చేసుకో. నీ తండ్రి నీతో ఈ విషయాన్ని చెప్పకపోవడానికి కారణం, అది నీతో చెప్పడానికి సిగ్గుపడే కాని మరేమీ కాదు. ఆ కారణం వల్ల, కడు దీనంగా, చెప్పదల్చుకున్నది చెప్పలేక, చెప్పకుండా వుండలేక, తన బరువు నామీద పడేసి, నేను నీకు చెప్పిన తరువాత నువ్వు కోపగించుకుంటే అది నా మీదేలే అను సర్ది చెప్పుకున్నాడు. ప్రజలు నన్నే తిట్టనీయమని భావించాడు. అదేదో ఆయన తప్పుగా భావించి, ఆయనే చెప్పాలి...నేనే వినాలి అనుకోవద్దు. అడవికి నువ్వు వెళ్లే దాకా ఆయన అన్నం-నీళ్లు ముట్టరు. ఇలానే బిగించుకుని వుంటారు. నువ్వు పోయిన తరువాత మళ్లీ యథాప్రకారం నవ్వుతూ తిరుగుతాడు".

కైక మాటలు వింటున్న దశరథుడు, తన అభిప్రాయానికి, అమె చెప్పే విధానానికి చాలా తేడా వుందని గమనించాడు. ఆమె చెపుతున్నది తప్పని అనలేకపోయాడు. అనలేని తన దుర్దశకు బాధపడ్డాడు. అలా అంటానికి తనకు నోరు రాలేదేంటని, తన కష్టానికి చింతించాడు. తన కెంత కష్టం వచ్చిందిరా దేవుడా అని బాధ పడ్డాడు. బయటకు చెప్పలేక, లోపల దాచుకోలేక, మంచం మీద మూర్ఛపోయాడు. అప్పుడు బలశాలి అయిన శ్రీరాముడు ఆయనను లేపి, కూర్చుండబెట్టి, కైక నిష్టూరాలను అర్థం చేసుకుని, తక్షణమే అడవులకు పోవాలని, ఒక్క నిమిషం కూడా అయోధ్యలో వుండరాదని నిశ్చయించుకున్నాడు.

భరతుడు ఇంకా రాలేదన్న నెపంతో, కాల హరణం చేసి, తానిక్కడే వుండి పోతాడేమోనని కైక కుచ్చితపు మాటల ద్వారా శ్రీరాముడు అర్థం చేసుకున్నాడు. ఇది ఆమె స్వభావ గుణమని అనుకున్నాడు. ఇందులో లోక విరుద్ధం, శాస్త్ర విరుద్ధం ఏమీ లేదని సమాధాన పడ్డాడు. ఆ తరువాత తన భావాలను కైకకు ఇలా తెలియ పర్చాడు.

"తల్లీ ! నేను ధన కాంక్ష వల్ల రాజ్యాన్ని విడిచి పోవడానికి ఇష్టం లేక ఆలశ్యం చేస్తున్నానని నువ్వు అభిప్రాయ పడుతున్నావు. ధనం సంపాదించడం ఉత్తమ పురుషార్థం కాదు. ఇక్కడ వుండడానికీ నాకిష్టం లేదు. ఇది సత్యమనే విషయం నువ్వు తెలుసుకో. అలా అయితే ఏది పరమార్థమని నేననుకుంటానని

నువ్వు అడగవచ్చు. సత్య-ధర్మ నియమాలందే అభిలాష గల ఋషులతో సమానంగా నేను ఆలోచిస్తాను. వ్యర్థ విషయాలతో సందేహించ వద్దు.

(ఇక్కడ శ్రీరామచంద్రమూర్తి మాటలను నిరసన తెలియచేసేవిగా వున్నాయని కొందరు అర్థం చెప్పుకుంటారు. అది సరికాదు. శ్రీరాముడు సన్యాసి కాడు. ధర్మానికి, అర్థానికి విరోధం వచ్చినపుడు, ధర్మాన్ని అనుసరించాలి కాని అర్థాన్ని కాదనేది దీనర్థం. ధర్మం వల్లే అర్థం వస్తుంది. కామం కూడా కలుగుతుంది. వీటి కొరకు ప్రత్యేకంగా ప్రయత్నం చేయాల్సిన పని లేదు. ఇది రామచంద్రమూర్తి అభిప్రాయం. దానినే వ్యాసులు కూడా చెప్పారు. అర్థ కామాల కంటే ధర్మమే ముఖ్యమనడానికి ఇది నిదర్శనం. తండ్రిని సత్యవాదిగా చేసి రాజ్యాన్ని వదలాలా? అన్న ప్రశ్న వచ్చినప్పుడు శ్రీరాముడు పితృవాక్య పాలన అనే ధర్మానికొరకై రాజ్యాన్ని వదలడమే సరైన పని అని తలచాడు).

శ్రీరాముడు కైకతో ఇలా అంటాడు: "అడవులకు పోవడం నాకొక కష్ట కార్యమని నువ్వు అనుకుంటున్నావు కదా? అదెంతటి పని? అది నాకొక లక్ష్యమా? తండ్రి ఇష్టమైన పని చేయాల్సి వస్తే, అది నా ప్రాణాన్నిచ్చైనా చేస్తాను. అంత పట్టుదల ఎందుకంటావా? అది ఆయనను ఉద్ధరించడానికి కాదు. తండ్రి మాట కంటే, తండ్రి సేవ కంటే, తండ్రి చెప్పినట్లు నడుచుకోవడం కంటే, శ్రేష్ఠమైన ధర్మం మరొకటి లేదు. అది చేయకుండా మిగిలినవెన్ని చేసినా, వ్యర్థమే. కాబట్టి నన్ను ఉద్ధరించు కోవడానికే నేను అడవులకు పోతాను. భరతుడు వచ్చే దాకా నేనిక్కడ వుంటానని అనుకోవద్దు. మరో విషయం కూడా వుంది. నాకు తండ్రి ఆజ్ఞ ఎలాంటిదో తల్లి ఆజ్ఞ కూడా అలాంటిదే. నువ్వు చెప్పినట్లే పద్నాలుగేండ్లు అడవులకు పోతాను. నీ కోరిక నెరవేరుస్తాను. అనవసరంగా రాజును బలవంత పెట్టి ఆయనతోనే నాకు చెప్పించాలని ప్రయత్నించావు. రామా...ఇది నా అభిప్రాయమని ఒక్క మాట నాతో అని వుండాల్సింది. రాజు నాకు ఈశ్వరుడు...శాసించాల్సిన వాడు...నీవు ఈశ్వరతరవు. నేనెలాంటి వాడినో, ఎలాంటి అభిప్రాయాలు నాకున్నాయో, నా ఔదార్యం లాంటి గుణాలేంటో, ఇన్నాళ్లు నన్ను చూసి కూడా అర్థం చేసుకోలేక పోయావు. సందేహించ వద్దు. భయపడవద్దు. నా తల్లికి ఈ విషయం చెప్పి,

ఆమె ఆజ్ఞ తీసుకుని, నా భార్యకు చెప్పేంతవరకు ఓపిక పట్టు. నువ్వు సంతోషించే విధంగా అడవులకు పోతాను. భరతుడు రాజై, తండ్రి గురువు అనే భావనతో, సేవ చేసే విధంగా మంచి బుద్ధులు నేర్పు. ముసలివాడు కదా..ఆయనతో పనేంటి? అని అనకు. పెట్టిందేదో తిని పడి వుండాలి అని నేర్పకు. సనాతన ధర్మం ప్రకారం, తండ్రి సంపాదించినా, లేకపోయినా, వయసులో వున్నా, ముసలి వాడైనా ఆయన తండ్రే అని అర్థం చేసుకో". ఇలా శ్రీరాముడు చెప్పిన ధర్మ వాక్యాలను విని సహించలేక పోయింది కైక. ఏడుపు వస్తుంటే ఆపుకోలేక పోయింది. పెద్ద గొంతుతో కేకలేసింది.

కౌసల్య ఇంటికి పోయిన శ్రీరాముడు

కైక ఇలా చేస్తుండగానే.... శ్రీరాముడు తండ్రికి ప్రదక్షిణ నమస్కారాలు చేశాడు. గయ్యాళి కైకకూ నమస్కారం చేశాడు. కోపంతో వూగిపోతూ, కళ్లలో నీళ్లు కారుతుండగా, తమ్ముడు లక్ష్మణుడు వెంట నడుస్తుంటే, అంతఃపురాన్ని వదిలి బయటకొచ్చాడు. తన కొరకై అభిషేకానికి ఏర్పాటు చేసిన భాండాలకు ప్రదక్షిణ చేశాడు. ఇవన్నీ భరతుడి పట్టాభిషేకానికి ఉపయోగపడాలని కోరుకున్నాడు. వాటి మీద దృష్టి మరల్చడం కాని, మనసుంచడం కాని, అనురాగం చూపడం కాని చేయలేదు. గొడుగును, చామరాన్ని, రథాన్ని వదిలి, ఇంద్రియ నిగ్రహంతో, తన వల్ల ప్రజలకు ఇంత దుఃఖం వచ్చె కదా అని బాధ పడ్డాడు. తల్లి ఇంటికి బయల్దేరి పోయాడు రాముడు.

ఇలా శ్రీరాముడికి సర్వ సుఖాలు పోతున్నప్పటికీ, రాజ్య భోగాలకు దూరమవుతున్నప్పటికీ, అయన ముఖంలో కాంతి చెదిరిపోలేదు. చీకట్లో చంద్రుడి కాంతి పెరుగుతుందే కాని తగ్గదు కదా! అలానే రాముడి చుట్టూ చీకట్ల లాంటి కష్టాలు వచ్చినప్పటికీ, ఆయన కీర్తి పెరిగిందే కాని తగ్గలేదు. ఆయనకు ఏ లోటూ రాలేదు. ఈ కీడు వార్తను తల్లి కౌసల్యకు చెప్పడానికి, ఆమె ఇంటికి పోతున్న శ్రీరామచంద్రుడి ముఖం ఎప్పటి మాదిరిగానే తేజస్సు ఉట్టిపడుతుంది. వాస్తవానికి, శరత్కాలం లోని చంద్రుడి వలె, మరింత మిక్కిలి తేజస్సుతో వెలిగిపోయాడు. సంతోషాన్ని వదల లేదు. ఇక లక్ష్మణుడు పెల్లుబుకుతున్న కోపాన్ని, దుఃఖాన్ని తన మనసులోనే అణచిపెట్టుకున్నాడు.

పరాక్రమించి రాముడికి రాజ్యాన్ని లభించేట్లు చేస్తే ఎలా వుంటుందన్న ఆలోచన కూడా చేశాడు మనసులోనే. అవన్నీ తనలోనే దాచుకుని, ఏమీ ఎరుగనివాడి వలె అన్న వెంట కదిలాడు. శ్రీరాముడు తనకు కనిపించిన ప్రజలందరికీ అభివాదం చేసుకుంటూ, తనకు వాటిల్లిన కష్టాన్ని వారికి తెలియచేస్తే ప్రాణాలు విడిచే ప్రమాదముందని సందేహించి, ఎవరికీ చెప్పకుండా తన తల్లి ఇంటిలోకి వెళ్లాడు.

❖ ❖ ❖

సర్గ-20

శ్రీరాముడు అంతఃపురం నుండి వెళ్లిపోగానే, అంతవరకు ఆయనకు కైకకు మధ్య సంభాషణను చాటునుంచి వింటున్నఅంతఃపుర స్త్రీలు, రాజు భార్యలు, ఇక త్వరలోనే శ్రీరాముడు అడవులకు పోవడం ఖాయమని నిశ్చయించుకుని, అందరూ ఒక్కసారిగా ఆకాశాన్నంటే ధ్వనితో, ఏడ్వడం ప్రారంభించారు. అయ్యో! మన రాముడు కారడవులకు పోవడమంటే ఎంత విపరీతం? ఇక మన గతి ఏంటి? శ్రీరాముడిని విడిచి వుండడం ఎట్లా? ఇక ఏం చేయాలి? శ్రీరాముడితో మనం కూడా పోదామా? ఇక్కడే వుందామా? అని అనుకోసాగారు. తన తండ్రి అంతఃపురంలో తమకు ఫలానా పని చేయాలని రాముడేనాడు చెప్పలేదని అనుకున్నారు వాళ్లు. మంచి మాటలతో వారందరినీ ఆదరించేవాడాయన. ఎవరినీ ఎప్పుడూ నొప్పించలేదు రాముడు. మనక్ ఆయన రక్షకుడని వారనుకున్నారు. అలాంటి గుణపూజ్యుడు, అనురాగవంతుడు, కానలకేగుట వాళ్లు సహించలేకపోతున్నారు.

దీనివల్ల, శ్రీరాముడు, తన తల్లి కౌసల్యను గౌరవించినట్లే, అందరు సవతి తల్లులను గౌరవించేవాడని అర్థమవుతుంది. తన విషయంలో ఎవరైనా అపరాధం చేసినా, పరుషంగా మాట్లాడినా, రాముడు కోపగించుకోడు. కోపాకారణాలైన వాటిని వదిలేస్తాడు. తన మీద ఎవరైనా కోపగించుకున్నా, వారిపైన పగ సాధించడు. వారిమీద దయతోనే వుంటాడు. అలాంటి శ్రీరాముడు అడవులకు పోతాడా? అని అంతఃపుర కాంతలు బాధపడ్డారు. సమస్త ప్రాణికోటికి గతియైన పుణ్యాత్ముడు రామచంద్రుడిని బుద్ధిలేక అడవులకు పంపే దశరథుడు జీవులందరినీ హింసించినట్లే కదా! అని అనుకున్నారు వారు. ఇలా అనుకుంటూ అక్కడున్న రాణులందరూ బిగ్గరగా ఏడ్వడంతో, దశరథుడు సిగ్గుతో తాను వున్న పక్క మీదనే పడిపోయాడు.

లక్ష్మణుడితో సహా రాముడు ఆ ఏడు ధ్వని విన్నాడు. తన వల్లనే కదా వారికింత దుఃఖం కలిగిందని బాధపడ్డాడు. ఆ బాధను మనసులోనే అణచుకున్నాడు. ఏనుగులాగా నిట్టూర్పు విడుస్తూ, తల్లి వుండే అంతఃపురం దగ్గరకు వచ్చాడు. అక్కడ వున్న పూజ్యుడైన ముసలి ద్వారపాలకుడిని చూశాడు.

అలానే అక్కడ గుమిగూడిన జనాలను చూశాడు. వారంతా.... జయ-జయ-రాఘవా-రామా అంటూ రాముడికి స్వాగతం చెప్పారు. వారిని దాటి పోయిన రాముడు మొదటి ప్రవేశం దాటి, రెండవ దానిలో ప్రవేశించి, అక్కడ రాజపూజ్యులైన వృద్ధ బ్రాహ్మణులను, వేద సంపన్నులైన బ్రాహ్మణ శ్రేష్టులను చూసి నమస్కరించాడు. మూదవ కక్ష్యలోకి ప్రవేశించాడు ఆ తరువాత. అక్కడ కావలి వున్న ముసలి వాళ్లను, ఆడుపిల్లలను సమీపిస్తుంటే వారు కూడా జయ-జయ ధ్వానాలు చేశారు. లోపలికి వెళ్లి కౌసల్యతో రాముడు వచ్చాడని చెప్పారు. ఆ సమయంలో రాత్రి అంతా వ్రతం చెసి వున్న కౌసల్య విష్ణు పాదాలను తన హృదయంలో వుంచుకుని ధ్యానిస్తున్నది.

కౌసల్యను చూసిన శ్రీరాముడు

తన కుమారుడికి మేలుకలగాలని ఎంతో భక్తి శ్రద్ధలతో విష్ణు పూజ చేసిన పుణ్య స్వభావురాలు కౌసల్య. తెల్లటి పట్టు వస్త్రాలను కట్టి, శాస్త్రోక్తంగా వ్రతాన్ని ఆచరించిన ఉత్తమ పతివ్రత కౌసల్య. మంత్రాలతో, పవిత్రమైన శు భపధార్థాలతో హోమం చేయిస్తున్న స్త్రీ రత్నం, తన తల్లి, కౌసల్యను చూశాడు రాముడు. పూజ చేస్తున్న ఆమె సమీపంలో, దేవపూజకు కావాల్సిన పెరుగు, నెయ్యి, హవిస్సు, పేలాలు, పూల దండలు, నీళ్లతో నిండిన కడవలు, రావి మొదలైన కట్టెపుల్లలు, పరిశుద్ధంగా సిద్ధం చేయబడిన నువ్వుల అన్నం చూసిన రాముడు తల్లికి నమస్కారం చేశాడు.

వస్తున్న కుమారుడిని చూసింది కౌసల్య. ఎదురుగా వచ్చి నిండారు ప్రేమతో కౌగలించుకుంది. ఇతరులెవరికీ లేనటువంటి తేజస్సు కలిగి, రఘువంశ రాజులలో గుణాలలో మొదటివాడై, తన సంతోషానికి కారకుడైన తన కుమారుడు శ్రీరామచంద్రుడిని ప్రియంగా, హితంగా దీవించింది కౌసల్యాదేవి. దీవిస్తూ...."రఘువంశంలో పుట్టి, దీర్ఘకాలం జీవించి, పూజ్యమైన మనస్సు గలవారై, ధర్మాన్ని తెలిసినవారై, రాజర్షులనిపించుకున్న రాజుల కీర్తి, ఆయుస్సు, నీకు కలుగుగాక! కుమారా మన వంశంలో జ్యేష్టుడు రాజ్యానికి అర్హుడనే ధర్మం మొదటినుంచీ వుంది. రామా, నువ్వు పోయి తండ్రిని చూడు. ఆయన సత్య ప్రతిజ్ఞుడు. ఆడిన మాట తప్పడు. నీకు ఆయన యౌవరాజ్యం ఇస్తే

తీసుకో. చిరంజీవిగా జీవించు". అని అంటుంది కౌసల్య. రాత్రంతా ఉపవాసం వుండి, ఐనా కొడుకు వచ్చాడు కాదా అని భోజనానికి పీట వేసిన తల్లిని మెల్లగా తాకిన రాముడు, ఇంత ప్రేమగల ఈమెకు, ఇలాంటి అయిష్టమైన వార్త ఎలా చెప్పాలి అని సిగ్గుతో తలవంచుకున్నాడు. చేతులు జోడించి ఇలా చెప్ప సాగాడు. శ్రీరాముడికి మిక్కిలి వినయ గుణం వుంది. అది ఆయన స్వభావం. తనను తన గుణాలతో పలకరించిన తల్లికి అవినయంగా ఏం చెప్తానో అని భయ పడ్డాడు రాముడు. భయంతో కాడిన భక్తితో తల్లికి నమస్కారం చేసి, తన ప్రయాణం గురించి ఇలా చెప్ప సాగాడు.

తల్లితో తాను అరణ్యానికి పోతున్నానని చెప్పిన శ్రీరాముడు

"అమ్మా! నీకు, మృదుగాత్ర అయిన సీతకు, మనోహర గుణాలతో కూడిన లక్ష్మణునకు, గుండెలు పగిలే భయంకరమైన దుఃఖం కలగబోతున్నదని నీకు తెలియదు కదా? (ఇది శ్రీరాముడి మనోధారుధ్యం, జితేంద్రియత్వం తెలియ చేస్తున్నది). అమ్మా! నా కెందుకు ఈ సుఖాసనం? దండకారణ్యంలో దర్భాసనం మీద కూర్చునే సమయం దగ్గర పడుతున్నది. అదే కాదమ్మా! రుచికరమైన ఈ భోజనం వదిలి పెట్టి, పండిన పడ్లు, తేనె, వేళ్లు తినుకుంటూ ముని లాగా పద్నాలుగు సంవత్సరాలు అడవుల్లో వుందాలమ్మా! రాజు గారు భరతుడికి యౌవరాజ్యాన్ని ఇచ్చాడు. నన్ను పద్నాలుగేండ్లు దండకారణ్యంలో ముని వేషంలో తిరగమని ఆదేశించాడు. అడవుల్లో పద్నాలుగేండ్లు మనుష్య సంచారం లేని చోట తిరుగుతూ, కాయగూరలు, వేర్లు, తింటూ మునిలాగా, కాలం వెళ్లబుచ్చాలి" అని రాముడు చెప్పగానే గొడ్డలితో నరికిన చెట్టులాగా పడిపోయింది కౌసల్య. పుణ్యం కోల్పోయి, స్వర్గంలోంచి భూమిపై పడిన దేవతా స్త్రీలాగా, కౌసల్య నేలపై మూర్ఛిల్లి పడిపోయింది. ఇలా నరికిన అరటి చెట్టులాగా పడిన తల్లిని వెంటనే శ్రీరాముడు లేపి ఆమె పై పడిన దుమ్ము తుడిచాడు. తన దగ్గరే కూర్చున్న కొడుకును చూసి కౌసల్య పక్కనే వున్న లక్ష్మణుడు వినేట్లు ఇలా అంది.

(కైక చెప్పిందంటే, కౌసల్యకు మరింత బాధ కలిగే అవకాశమున్నందున, రాజు కాదనలేదు కాబట్టి అంగీకరించినట్లే అని భావించిన శ్రీరాముడు,

దశరథుడు తాను అడవులకు పోవడం అంగీకరించినట్లే అనే అభిప్రాయంతో రాజు ఆజ్ఞాపించాడని తల్లితో చెప్పాడు. అలా చెప్పకుంటే, తన తల్లి చెప్పబోయే మాట సవతి తల్లి మాట కంటే ఎక్కువ ఆదరణీయమవుతుందని రాముడనుకున్నాడు).

శ్రీరాముడు అరణ్యాలకు పోతున్నాడని విన్న కౌసల్య దుఃఖపడుట

కౌసల్య రాముడితో ఇలా అంటుంది: "నాయనా! రామా! నువ్వు నా కడుపున పుట్టకపోతే ఇలాంటి అపారమైన దుఃఖం కలగదు కదా! నా కడుపున పుట్టడం వల్లనే నీకు ఈ పెను దుఃఖం కలిగింది. అలానే నా కడుపున నువ్వు పుట్టకపోతే, నాకు కూడా ఈ దుఃఖం వుండేది కాదు కదా! ఒకరి కొరకు మరొకరం–ఇరువురం, నా నుండి నువ్వు, నీ నుండి నేను ఏడ్వాల్సి వచ్చింది. మరో భాగ్యవతి కడుపున నువ్వు పుట్టినట్లయితే, నువ్వు సుఖ పడేవాడివి. ఆ తల్లి కూడా సుఖపడేది. పుత్ర శోకం లేకుండా నేను సుఖ పడేదాన్ని. ఇలాంటి కడు దుఃఖంతో ఏడ్వడం కంటే, చావడం కంటే, గొడ్రాలయినా బాగుండేది. అప్పుడు కూడా, బిడ్డలు లేరని విచారించేదానివి కదా? అని అంటావేమో! నాయనా...బిడ్డలు లేరని విచారమొక్కటే గొడ్రాళ్లకు...బిడ్డలున్న వారికి వాళ్లు పెరిగి పెద్దవారై గొప్పగా జీవించాలని కోరుకుంటారు కాని ఇలా నక్కలపాలు చేయరు. దేనికొరకు నేను బాధ పొడాలి? మగడి నడవడి కొరకా? కన్న బిడ్డ కానలకు పోతున్నాడనా? మహారాజు ఒక్క రోజు కూడా, నేను మహారాణినైనప్పటికీ, దగ్గరకు తీసుకుని ప్రేమగా మాట్లాడలేదు. ఒక సంతోషం కాని, ఒక సుఖం కాని నేనెరుగను. ఒక్క మేలు కూడా చేయలేదు. కొడుకు పుట్టిన తరువాత కూడా సుఖం ఎరుగను".

"అయిందేదో అయిపోయింది. గడిచిన దానికి వగచిన ప్రయోజనం లేదు. ఇక జరగాల్సిందేంటో చెప్పు. కులం, వయస్సు, గుణం లలో నాకంటె తక్కువ వారైన సవతులు కర్ణకఠోరమైన సహించలేని మాటలు మనసు గాయపడేట్లు అంటుంటే నేనెలా వినాలిరా? ఆడదానికి ఇంతకంటే గొప్ప కష్టం ఇంకోటి వుంటుందా? సవతుల మాటలకు ఏడ్వాలా? మగడి

అవిశ్వాసానికి ఏడ్వాలా? నువ్వు అడవులకు పోయావని సహించలేని కడుపు దుఃఖానికి ఏడ్వాలా? నీచమైన సవతులు నోటికి వచ్చినట్లు దుర్భాషణములు అంటుంటే, ఉత్తమ స్త్రీ ఎలా వినగలదు? వినలేని, సహించలేని, బదులు పలుకలేని, నా గతి ఏంటి? నా దుఃఖానికి, దైన్యానికి అంతు ఎప్పుడో తెలియదు కదా? నా దగ్గర నువ్వు వున్నప్పుడే నాకు ఇలాంటి కష్టాలు వచ్చాయి. ఇక నువ్వు కూడా అడవులకు పోతే, నాకు మరణించడం తప్ప వేరే మార్గం లేదు కదా! నా భర్త నీ కోసమైనా నన్ను లక్ష్య పెట్టుతాడేమోనని భ్రమించాను. కన్న కొడుకును, కులాన్ని ఉద్ధరించే వాడిని, పెద్ద కొడుకును, నిన్నే ఈ గతి పట్టిస్తే ఇక నన్నే గతి పట్టిస్తాడో? కాబట్టి అతడికి నా మీద దయలేదనేది నిస్సందేహం. భర్తే దయ చూపకుండా నిరాదరిస్తే, సవతుల సంగతి చెప్పనక్కరలేదు కదా? ఐన వారు వేలు చూపితే కాని వారు కాలు చూపరా? ముందు–ముందు నేను కైకకు పరిచారికురాలు కావాల్సిందే. అదే కాకుండా, కైక తొత్తులకు నేనెలా సమానమవుతాను? వాళ్లు కూడా నన్ను లక్ష్య పెట్టరు. అంటే...వాళ్ల కంటె కూడా తక్కువదాన్నై వాళ్ల పరిచారికనవుతాను. ఇలాంటి పరిస్థితిలో, ఎలా బతికుండాలి రామా? నా దుఃఖానికి అంతమెప్పుడో నువ్వే చెప్పు”.

“ఇంతవరకు నా నోటి మంచితనం వల్ల, అందరినీ అమ్మా, అక్కా అని పిలవడం వల్ల, పలికే వారందరూ, ఏమిటీ అని కూడా అని అనరు. పిలుస్తే పిలవనీయమని మూతి తిప్పికుని పోతారు. కనిపిస్తే పని చెప్తానేమోనని సమీపానికి కూడా రారు. ఇది కేవలం వాళ్ల స్వభావ గుణం మాత్రమే కాదు. కైక్ కొడుకంటె భయంతో, ఆయన దండిస్తారేమోనన్న అనుమానంతో అలా చేస్తారు. దేనికని ఏడ్వాలి? కోపంతో మటమటలాడుతూ, చిటచిట చీదరించుకుంటూ, కసురుకుంటూ, చీదర మాటలాడుతుండే కుచ్ఛిత గుణం కల ఆ మాయలారి కైక ముఖం నేనెలా చూడాలి? ఇక నుంచి పెత్తనం దానిదే కాబట్టి దాన్ని చూడకుండా ఎలా తప్పుతుంది? రామా! నీకు ఉపనయనం జరిగినప్పటి నుంచి, అంటే పదిహేడేండ్ల నుంచి, నా కొడుకు ఎప్పుడు పెద్దవాడవుతాడా, నోరు కలవాడవుతాడా, వాడి వల్ల నా అవమానం, దుఃఖం పోతుంది కదా, సుఖపడుతాను కదా, అని ఎదురు చూసి సంతోష పడే సమయంలో, చివరకు ఇలా అయింది కాదా! సవతుల నిష్టూరాలు వింటూ ఇంకెన్నాళ్లు మౌనంగా, మనసులోనే కుళ్లుతూ బతకాలిరా?”

(ఇక్కడ పదిహేడేండ్లు అంటే జన్మించిన నాటి నుంచి కాదు. అది మొదటి జన్మ. రెండవ జన్మ ద్విజత్వం ప్రాప్తించినది మొదలు అని అర్థం. అంటె ఉ పయనయనం జరిగిన నాటి నుంచి అని భావించాలి. శ్రీరాముడికి ఉపనయనం తొమ్మిదో ఏట జరిగింది. అప్పటి నుంచి పదిహేడు సంవత్సరాలయింది. ఇప్పుడు శ్రీరాముడికి 25 సంవత్సరాల వయస్సు).

"నాకు సవతి పోరు వల్ల కలిగే దుఃఖం ఎప్పటికి తీరుతుంది నాయనా రామా! అది ఎప్పటికీ తప్పదా? ఒక వేళ ఈ దుఃఖాన్ని మరిచిపోయాననుకో... సవతి పలికే దుర్భాషణములను ఎలా సహించాలి? ఏదో ఒక విధంగా సవతి పోరు సహించినప్పటికీ, నిన్ను ఒక్క క్షణమైనా చూడకుండా వుండలేను. అందంలో పూర్ణ చంద్రుడిలా వుండే నీ ముఖాన్ని ఒక్క నిమిషమైనా చూడకపోతే ప్రాణాలుండవు. చిన్ని నాయనా! అలాంటప్పుడు పద్నాలుగేండ్లు నిన్ను చూడకుండా ఎలా ప్రాణాలు బిగపట్టుకుని వుందగలను? ఈ నిర్భాగ్యురాలికి అది సాధ్యమా? కుమార రత్నమా! నిర్భాగ్యురాండ్లలో అసమానురాలను నేను. వ్రతాలు చేసి, ఉపవాసాలు చేసి, ఇతర రకాల కష్టాలను అనుభవించి, నిన్ను పెంచాను. అదృష్టవంతులకు సుఖాలనిచ్చే ఉపవాసాలు, వ్రతాలు, నేను నిర్భాగ్యురాలను కాబట్టి, నాకు దుఃఖాన్నిస్తున్నాయి. అందుకే నిన్ను కుమారుడిగా ఇచ్చాడు భగవంతుడు. నిన్ను పెంచుకుంటూ నా దుఃఖాన్ని కూడా పెంచుకున్నాను". ఇలా ఏడుస్తున్న కౌసల్యను చూసి వెలవెల బోయే ముఖంతో లక్ష్మణుడు, అప్పటి పరిస్థితులకు అనుగుణంగా ఇలా అన్నాడు.

"ఎవతో, ఒక ఆడుది, నోటికొచ్చినట్లు వదరుతే, దానికి విలువ ఇచ్చి, ఏ సుఖాలకు నోచుకోకుండా, రాజ భోగాలన్నీ వదిలిపెట్టి, పౌరుషం విడిచి, అడవికి పోవడం అనేది, నాకు ఏ మాత్రం సమ్మతం కాదు. అవి ఆడుదాని మాటలు కాదు తండ్రి మాటలు......రాజాజ్ఞ అని మీరనవచ్చేమో! స్థిరచిత్తం లేని రాజు ఆజ్ఞ పాటించాల్సిన పని లేదు. దశరథుడు వార్ధక్యం వల్ల మతి చెడిన చపల చిత్తుడు. విషయ సుఖాలంటే ఆయనకు ఎంతో మోజు. అలా కాకపోతే మరణానికి సమీపంలో వున్న వాడికి ఇలాంటి కామంతో కూడిన కోరికలెలా వుంటాయి? విషయ సుఖమే పరమార్థం అనుకునే వాడికి విపరీత బుద్ధులు

కలగడంలో ఆశ్చర్యం లేదు. 'వినాశకాలే విపరీత బుద్ధి' అంటారు కదా! అందునా, మన్మథ ప్రేరితుడైతే ఏదైనా మాట్లాడుతాడు. కామదాసుడు బుద్ధిహీనుడితో సమానుడు. అలా కాదు...రాజు స్వస్థ చిత్తుడే... మనఃపూర్వకంగానే చెప్పాడనుకుందామా? స్వస్థచిత్తుడైన రాజు ఎవరినైనా దండించాలనుకున్నప్పుడు, ముందుగా వాడు చేసిన నేరమేంటో తెలియచేసి, ఆ నేరం చేశాడు కాబట్టి ఫలానా శిక్ష విధిస్తున్నానని చెప్పాలి. అలాంటప్పుడు, రాజు ఏ నేరాన్ని మోపి శ్రీరాముడిని దండకారణ్యాలకు పొమ్మన్నాడు? శ్రీరాముడు అడవులకు పోయేంత నేరమేం చేశాడో నాకు తెలియదు. నేరం చేయనివాడిని అడవులకు పొమ్మనడం న్యాయమా? ఇంత పాపకార్యం ఇంకేదైనా వుందా? విరోధి కాని, నేరం చేసిన వాడు కాని, శిక్షించడాని అర్హుడైన వాడు కాని, శ్రీరాముదిని ఎదురుగా కాని, చాటుగా కాని దూషించడం నాకు తెలియదు. ఎప్పుడూ శ్రీరాముడితో వున్న నాకే ఆయన తప్పు చేయలేదని తెలిసినప్పుడు, ఎక్కడో మూల ఒక ఇంట్లో వుండి ఆడువారితో ముచ్చటలాడు ముసలి రాజుకెలా తెలుస్తుంది? ఒక వేళ తెలిస్తే చెప్పొచ్చుకదా?"

"పర దైవంతో సమానమై, చక్కటి నడవడి, ఇంద్రియ నిగ్రహం కలిగి, శత్రువులను కూడా మంచి అభిప్రాయంతో-దయతో చూసే గుణం వున్న, మిక్కి పుణ్యవంతుడిని, అందరూ పూజించే యోగ్యత వున్న వాడిని, తన జ్యేష్ఠ పుత్రుడిని, ఒక్క తప్పైన చేయని రాముడిని, ఏ ధర్మంతో రాజు నగరం విడిచి పెట్టమని పొమ్మంటున్నాడు? వివేకవంతులు దీనిని ఎలా మెచ్చుకుంటారు? మూర్ఖుడై, రాజు ధర్మానికి విరుద్ధంగా, అన్న మాటలకు రాజనీతి తెలిసిన ఏ రాజకుమారుడు కూడా ఆ మాటలకు విలువ ఇస్తాడా?" అని కౌసల్యతో కోపంగా మాట్లాడిన లక్ష్మణుడు, ఓర్పు నశించి, శ్రీరాముడితో ఇలా అన్నాడు.

❖ ❖ ❖

సర్గ-21

శ్రీరాముడిని అరణ్యాలకు పోవద్దని చెప్పిన లక్ష్మణుడు

లక్ష్మణుడు రాముడితో ఇలా అంటాడు: “ఈ విషయాలన్నీ రెండోవాడి చెవిన పడక ముందే, ఈ భూమినంతా నీ మహా శాసనానికి లోబడేట్లు, నా సహాయంతో శీఘ్రంగా చెయ్యి. యముడితో సమానుడవైన నీవు, ఎవర్నైనా జయించగలుగుతావు. కోదండాన్ని ధరించి యుద్ధంలో నిలిచి వున్న నీకు నేను అండగా వుంటాను. నీకెవరు అడ్డం వస్తారో చూద్దాం. సూర్య తేజా! రామా! తీక్షణమైన నీ బాణాలకు ఎవరైనా అడ్డం వస్తే అయోధ్యలో ఎవరూ లేకుండా చేస్తాను. ఒకవేళ భరతుడి పక్షం వారెవరైనా అడ్డం వస్తే నా పరాక్రమంతో వాళ్లను చీల్చి చెండాడుతాను. మెత్తగా వుంటే ఏ కీర్తి రాదు. పైగా శత్రువులు అవమాన పరుస్తారు. ఇతరులనే అలా చేస్తావు...అందరినీ కాదు. మరి, తండ్రే విరోధి కదా? ఆయన వస్తే ఎం చేయాలంటావేమో? తన భార్యకు వశుడై, ఆమె పక్షంలో వుండి, మనకు విరోధిలాగా దశరథుడు ప్రవర్తిస్తే, తండ్రి కదా అని దయచూపకుండా చంపాసిందే! లేదా, ఊపిరితో పట్టుకుని చెరసాలలో వేయాలి. (దీనర్థం...కొడుకైనా, సఖుడైనా, తోడ బుట్టిన వాడైనా, తండ్రైనా, గురువైనా, శత్రువులాగా వ్యవహరిస్తే, వారిని దండించాల్సిందేనని). ధర్మైక నిరతా! ఇది చేయొచ్చు..ఇది చేయకూడదు...అని తెలుసుకోకుండా... అజ్ఞానంతో ఐనప్పటికీ, తెలిసి-తెలిసి నా కెవ్వరూ ఎదురు చెప్పరని తప్పు చేసినవారిని త్రండ్రైనా, ఆచార్యుడైనా దండించాల్సిందే. ఇది ధర్మ శాస్త్రం. ఎవరి సలహాతో, వారి మాటలను నమ్మి, ఏ నెపంతో ఈ రాజ్య భారాన్ని నీపైన మోపకుండా, కైకకు ఇవ్వాలనుకున్నాడు? ఆయనకున్న ప్రధాన బలం మనమిద్దరం. భరత-శత్రుఘ్నులు ఇక్కడ ఎలాగూలేరు. ఇలాంటప్పుడు మనతో విభేధించి, మనల్ని కాదనుకుని, కైక కుమారుడిని ఎలా రాజు చేయగలడు? అది సాధ్యమా?”

ఇలా శ్రీరాముడితో చెప్పిన లక్ష్మణుడు కౌసల్య వైపు తిరిగి మళ్లీ చెప్పసాగాడీవిధంగా....” నా కన్నతల్లి నాకెలాగో, నువ్వు నాకు అలాగే. కాబట్టి

నా కన్న తల్లిగా నీకు చెప్తున్నాను కాని సవతి తల్లిగా నీకు చెప్పడానికి రాలేదు. నా మనసులో వున్నదేదో స్పష్టంగా చెప్తాను...విను. నీ కొడుకు నాకు అన్న అనే మమకారంతో, నాకు ఆయన మీద అనురాగం వుంది....ఇతర ఆలోచనలు కాని ఇతర విధాలైన లాభాలు కాని నా మనసులో లేవు. శ్రీరాముడికి భరతుడెలాగో నేను కూడా అలానే అని, నేనూ సవతి తల్లి కొడుకే కదా అని, చాటుగా వాడింత చేస్తే ఎదురుగా వుండి నేనూ అంతే కదా అని భావించవద్దు. నేనేం చేస్తానని అనుకుంటావేమో. సత్యం మీద, ఇష్ట దేవతల మీద, నా బాణాల మీద ప్రమాణం చేసి చెప్తున్నాను...శ్రీరాముడు మండే మంటలో దూకడానికి సిద్ధపడితే, అడవిలోకి పోవడానికి సిద్ధపడితే, నేను ఆయనకంటే ముందే నడిచేవాడిని. నువ్వింతగా బాధపడుతున్నావు కదా! నీ బాధను సూర్యుడు చీకటిని పారదోలినట్లు రూపుమాపుతాను. ఇదే ఇప్పుడు మనం చేయాల్సిన పని. ముమ్ముందు నేనేమి చేయబోతున్నానో నువ్వు శ్రీరాముడు అలా చూస్తూ వుండండి. చేయడానికి ఆజ్ఞ మాత్రం కావాలి".

అన్న మీద భ్రాతృ భక్తితో లక్ష్మణుడు చెప్పిన మాటలు విన్న కౌసల్య ఎంత కష్ట కాలం వచ్చె దైవమా అని అనుకుంటుంది. ఒక పక్క కన్న కొడుకు అడవికి పోతుంటె చూడాలి...మరో పక్క కొడుకులే తండ్రిని వధిస్తామంటే చూడాలి. ఒక పక్క కొడుకు...మరొ పక్క మగడు. ఇద్దరూ రెండు కళ్లు. ఏ కన్ను పోగొట్టుకోవలనే మీమాంస. ఏ సమాధానం చెప్పలేని కౌసల్య కొడుకు వైపు చూసి, తమ్ముడేం చెప్తున్నాడొ విన్నావు కదా అంటుంది. తానేం చెప్పలేనని, శ్రీరాముడికి ఏది ధర్మమని అనిపిస్తే అదే చేయమని, అడవులకు పోవాలనుకుంటే అలానే చేయమని, పరాక్రమంతో రాజ్యం పొందాలనుకుంటే అట్లానే కానిమ్మని అంటుంది.

(ఇలాంటి మాటలు ధర్మాత్ముడి తల్లి, స్వయంగా ధర్మాత్మురాలైన కౌసల్య చెప్పింది కాని, అదే కైక లాంటి అర్థ దాసి అయివుంటే, తండ్రిని వధించైనా రాజ్యం తీసుకొమ్మని చెప్పి వుండేది. ధుర్యోధనుడు కురుక్షేత్ర యుద్ధానికి ముందు తల్లి గాంధారిని కలిసి తనకు జయం కలగాలని దీవించమని అడిగినప్పుడు, కొడుకు అధర్మం వైపున్నాడని నమ్మిన గాంధారి, పుత్రాభిమానంతో కొడుకే గెలవాలని చెప్పక, ధర్మం జయించాలి అని దీవించింది. ఎలాంటి కష్టాలు వచ్చినా ధర్మాత్ములు ధర్మం తప్పరని దీనర్థం).

ఇలా కన్నీళ్లు చెంపలపై పడుతుంటూ ఏడుస్తున్న తల్లి కౌసల్యకు ధర్మ మార్గం గురించి చెప్పసాగాడు శ్రీరాముడు.

కౌసల్యా లక్ష్మణులను ఓదార్చిన శ్రీరాముడు

శ్రీరాముడు తల్లి కౌసల్యతో ఇలా అన్నాడు: "తల్లీ! కుమారుడికి తల్లి, తండ్రి ఇరువురు సమానులే. ముందుగా ఆజ్ఞాపించిన వాడు తండ్రి. ఆ తరువాత దానికి విరుద్ధంగా ఆజ్ఞాపించే దానివి నువ్వు. ముందుగా ఆజ్ఞాపించిన తండ్రి మాట జవదాటగల శక్తి నాకు, ఆ మాటకొస్తే నీకూ వుందా? నువ్వే ఆలోచించు. కాబట్టి నేను నీ మాట వినలేదని కోపగించుకోవద్దు. నా క్షేమం కోరి చల్లటి చూపులనే చూడు. సాష్టాంగపడి నమస్కారం చేస్తాను. తండ్రి ఆజ్ఞ పరమ ధర్మం. తండ్రి మాటను బట్టి ఇతరులకు బాధ కలిగించవచ్చునా అని అడిగావు. నీకు తెలిసిందే...తండ్రి మాట ప్రకారమే కదా కండు ముని గోవధ చేశాడు. పితృవాక్య పరిపాలన చేసినవారికి గోవధ పాపం కాదని ధర్మశాస్త్రం చెప్పిందని కదా అతడలా చేసింది. గోవధ తప్పని భావించి, పితృవాక్యాన్ని వుల్లంఘించినట్లయితే నరకానికి పోయేవాడుకదా ఆ ముని? వేరే వాళ్ల విషయమెందుకు? పూర్వం, సగర చక్రవర్తి కొడుకులు తండ్రి ఆనతి ప్రకారం, సముద్రం తవ్వే చోట, తమ ప్రాణాలకు రాబోయే ముప్పును కూడా లక్ష్యపెట్టక, అనే జీవరాశులను హింసించారు. తండ్రి ఆజ్ఞాపించాడనే కదా...పరశురాముడు తన పదునైన గండ్రగొడ్డలితో తల్లి తల నరికాడు. ఇవన్నీ మనం విన్నవే కదా! అలాంటప్పుడు, తల్లికి దుఃఖం కలిగిందని తండ్రి మాట జవదాటవచ్చా? తల్లీ! దేవతలతో సమానమైన వారెందరో మహానుభావులు, తండ్రి వాక్యాన్ని పాలించి, కీర్తి సంపాదించుకున్నారు. ధర్మ శాస్త్రం ఇలా చెప్తుంటే, తండ్రి ఆజ్ఞ నెరవేరచకుండా ఎలా వుంటాను?"

"అభ్యుదయం కోరి పూర్వులు చేసినవన్నీ మనం చేయవచ్చునా అని అడుగుతావేమో? చంద్రుడి లాగా గురు ద్రోహం చేయవచ్చా? అని అదుగుతావేమో. చంద్రుడు అభ్యుదయం కోరి కాని, తండ్రి ఆజ్ఞ వల్ల కాని అలా చేయలేదు. తల్లీ! పితృవాక్య పాలన ఉత్తమ ధర్మమని అనుకునేవాడిని నేనొక్కడినే కాదు. అది మంచిదని తలచిన వారు ఎందరో వున్నారు. ఇంతవరకు

ఆచారంలో లేని కొత్త ధర్మాన్ని నేను అవలంభించి నిన్ను ఎదిరించడం లేదు. పూర్వీకులు నడిచిన మార్గాన్నే నేను ఎంచుకున్నాను. వేరే తోవలో పోవడం లేదు. తండ్రి ఆజ్ఞా పాలించడమే తగిన పని. తండ్రి మాట వినకుంటె పాపం కలుగుతుంది. కాబట్టి నిశ్చయంగా అడవులకే పోతాను. నువ్వు పుణ్యాత్మురాలవు...నాకు పాపం కలిగే మాట చెప్పొద్దు. వనవాస దీక్షకొరకు స్నానం చేయాలి. అందుకోసమై, నీ దాయ దృష్టితో, దాన్నే పవిత్ర తీర్థంగా మలచి, నాతో స్నానం చేయించు. అడవికి పోవడానికి ఆజ్ఞ ఇవ్వు. నా మీద దయ చూపు".

నిర్మలమైన మనస్సుతో, తల్లితో క్షేమకరమైన మాటలు చెప్పి, ఆమె సందేహాలను తీర్చి, సనాతన ధర్మంలోను, విలువిద్య లోను నైపుణ్యం కల లక్ష్మణుడితో, అతడినీ సముదాయిస్తూ రాముడింకా ఇలా అన్నాడు.

(ఐతే..... ఇక్కడో విషయం గుర్తుంచుకోవాలి. లక్ష్మణుడి మాటలు రాజ ధర్మాన్ని అనుసరించి చెప్పడం జరిగింది. అవి అధర్మాలు కావు. కాకపోతే రాజనీతి అంతా ధర్మం కాదు కాని, ధర్మమంతా రాజనీతి అవుతుంది. ధర్మంతో పని కాకపోతే రాజనీతిని నమ్ముకోవాలి. ధర్మైక నిష్ఠులు రాజనీతిని అనుసరించరు. కేవలం ధర్మమే వారు అనుసరిస్తారు. ఇలాంటి వాడే శ్రీరాముడు. ఆయన అభిప్రాయం ప్రకారమే వాదించేవాడు లక్ష్మణుడు. రామ-లక్ష్మణ సంవాదంలో ఈ విషయాలు జ్ఞాపకం పెట్టుకోవాలి. లక్ష్మణుడు అన్న గారి దుఃఖాన్ని సహించలేక ఇలా వాదించాడే కాని, ధర్మ ద్వేషంతో కాదు).

"తమ్ముడా! లక్ష్మణా! నీకు నా మీద అమితమైన, స్థిరమైన స్నేహం, అనురాగం, అమోఘమైన బల పరాక్రమ తేజస్సు వుందని, అజ్ఞానంతో, పుత్ర వ్యామోహంతో తల్లి దుఃఖిస్తున్నదని నాకు తెలియదా? ఆమె స్త్రీ. కేవలం నా మీద వాత్సల్య దృష్టితోనే చూస్తున్నది. నీకు సత్యం, ధర్మం తెలుసు. నువ్వు కూడా ఆమె లాగా మాట్లాడ వచ్చా?నువ్విలా మాట్లాడితే, నీ అభిప్రాయమే సరైనదనీ, నా అభిప్రాయం తప్పనీ, నేను తెలిసో-తెలియకో మూర్ఖత్వంతో ఈ విధంగా చేస్తున్నానని అమె అనుకుని మరింత బాధపడుతుంది. నా మేలు కోరేవాడివైతే ఇలా మాట్లాడవద్దు. నాయనా! ధర్మ, అర్థ, కామ,

మోక్షాలలోమొదటితే ముఖ్యమైంది. అది వదిలితే మిగిలిన మూడు లేనట్లే. సత్యానికి ధర్మమే స్థానం. ఏ ధర్మమైనా సత్యంతోనే ముడిపడి వుంది. సత్యం లేకపోతే ధర్మం లేదు. కాబట్టి, ఈ రెంటికీ అవినాభావ సంబంధం వుంది. అందుకే ధర్మంతో కూడిన తండ్రి మాటను తప్పు పట్టడం జ్ఞానులకు తగదు. అది ఎవరైనా పామరులు మాత్రమే చేస్తారు. లక్ష్మణా! తండ్రి మాట కాని, తల్లి మాట కాని, బ్రాహ్మణ వాక్యం కాని, ముందు చేస్తానని చెప్పి, మాట తప్పడం ధర్మాత్ముల లక్షణం కాదు. సౌమిత్రీ! తండ్రి మాటకు అనుగుణంగానే పిన తల్లి చెప్పింది కాని ఆయన మాటను అతిక్రమించి చెప్పలేదు కదా? చెప్పిందెవరు? ఎక్కడో ఏదో దేశంలో వుండే మనిషి కాదు. మన పిన తల్లి. వాళ్లు చెప్పడంతో ఆగలేదు....నేను వారి ఇష్ట ప్రకారం చేస్తానని మాట కూడా ఇచ్చాను. ప్రతిజ్ఞ కూడా చేసాను. అది తప్పను కదా? నువ్వు క్షత్రియ నీతి గురించి అంటున్నావు. అది దయాహీనమైన మార్గం. ధర్మార్థాలలో, అర్థం కొరకు, అది ఎంత ఘోర కార్యాన్నైనా సమ్మతిస్తుంది. దాన్ని నువ్వు గొప్పగా చెప్ప కూడదు. చూడనూ కూడదు. కేవలం సత్యమే ఆధారంగా కల నా ధర్మ మార్గాన్నే నువ్వు కూడా అవలంభించు".

ఇలా తమ్ముడు లక్ష్మణుడికి చెప్పిన శ్రీరామచంద్రమూర్తి, తల్లి కౌసల్య వైపు చూసి, ఆమె రెండు పాదాలపై అణకువతో శిరస్సు వుంచి, నిండు భక్తితో ఇలా అంటాడు. "అమ్మా! నేను అడవులకు పోవడానికి, అక్కడే వుండడానికి వెంటనే అనుమతించు. ఇందుకు విరుద్ధమైన మాటలు చెప్పడానికి ఆలోచన చేయవద్దు. అలా చేస్తే నా ప్రాణాల మీద ఒట్టు పెట్టుకుంటాను. నీ దయగల చూపులతో నన్ను దీవించి, ప్రయాణానికి పోయ్యేవారికి చెప్పాల్సిన వీడ్కోలు మాటలు చెప్పు. ఉత్సాహంగా నన్ను అడవులకు పంపు. తల్లీ! పూర్వం యయాతి అనే మహారాజు, స్వర్గం నుండి భ్రష్టుడై, భూలోకానికి వచ్చి, సాధుసాంగత్య బలం వల్ల మళ్లీ స్వర్గానికి పోయినట్లే, నేను కూడా పద్నాలుగేండ్లు అడవుల్లో వుండి, మునుల సాంగత్యంతో ప్రతిజ్ఞ తీర్చి తిరిగి నగరానికి వస్తాను. అమ్మా! ఇలా గోల చేస్తూ ఏడ్వ వద్దు. అలా చేస్తే నాకు అపశకునమవుతుంది. లోపలే దిగమింగుకో. తండ్రి మాటను పాలించి త్వరగా తిరిగొస్తాను. దీనికి ఏడ్వడమెందుకు? కన్న తండ్రి, రాజు మాటను నేనే కాదు...నువ్వు, లక్ష్మణుడు,

సుమిత్ర నడుచుకోవాల్సిన వారే కదా! గొప్పదైన సనాతన ధర్మమిదేకదా! నన్ను పొమ్మన్నట్లే మీలో ఎవరినైనా పొమ్మంటే పోయే వారేకదా? జననీ! నా పట్టాభిషేకానికి చేసిన ప్రయత్నాల విషయం వదిలిపెట్టి, మనస్సులో దుఃఖాన్ని అణచుకుని, నేను అడవుల్లో నివసించడానికి శెలవిచ్చి, ధర్మాన్ని నాలో నిలుపు".

"ఉత్తమ ధర్మాన్ని అందరూ శ్లాఘించాలనీ, కొంత ధర్మం–కొంత అధర్మం కలిపి సంకీర్ణంగా వుండ కూడదనీ, ఒక పని చేయాల్నా–వద్దా అనే సందేహాలుండ రాదనీ, నజగుజలు లేకుండా ధృఢ నిశ్చయంతో వుండాలనీ, భావం వచ్చేలా చెప్పిన శ్రీరాముడి మాటలు విన్న కౌసల్య మూర్ఛపోయి, మళ్లీ తెలివి తెచ్చుకుని దుఃఖంతో, భయంతో కొడుకును చూసి ఇలా అంది:

"ధర్మం కోణంలోంచి చూసినా, స్నేహం దృష్ట్యా ఆలోచించినా, తండ్రికి తల్లి సమానురాలు. అలాంటప్పుడు, నేను దుఃఖిస్తుంటే నువ్వెలా అడవులకు పోతావు? నేను ఒప్పుకోను. తల్లి, తండ్రి, గురువుల ఆజ్ఞ ప్రకారం నువ్వు నడుచుకోవాల్సిందే. అది సబబా? కాదా? అని విచారించకూడదు. అన్నా! నువ్వు వదిలిపెట్టి పోతే, నేను ప్రాణాలతో వున్నా ఏం ప్రయోజనం? జీవించి వుండడం వ్యర్థం. అలా కాకపోయినా పరలోకానికి పోయినా ఏం ప్రయోజనం? పితృ లోకానికి పోయినా ఏం లాభం? స్వర్గం పోయినప్పటికీ అదీ లాభం లేదు. అంతకు పైబడిన బ్రహ్మలోకానికి పోయినా అంతే. వీటన్నింటి కంటే నువ్వొక్కడివి నా దగ్గర వుంటే శ్రేయస్కరం".

(ఇలా ధర్మ–స్నేహాల వల్ల తల్లి, తండ్రి సమానమే ఐనప్పుడు, శ్రీరాముడు తనకు అడవులకు పోవడానికి ఆజ్ఞ ఇవ్వకపోతే తన్ను చంపినట్లే అని కఠినంగా నిర్భందించి మాట్లాడవచ్చా? తల్లిని, తండ్రిని, గురువును నిర్భందించ కూడదు కదా? కాబట్టి శ్రీరామచంద్రమూర్తి చేసిన పని సరైంది కాదని ఆక్షేపణ చేసే వారున్నారు. తల్లి, తండ్రి, గురువు ఆజ్ఞ ప్రకారం నడుచుకోవాల్సిందే. అందులో తప్పొప్పులు ఎంచకూడదు. పది మంది ఉపాధ్యాయులకంటే ఒక ఆచార్యుడు, నూర్గురు ఆచార్యులకంటే తండ్రి, వేయి మంది తండ్రులకంటే తల్లి ఎక్కువ అని శాస్త్రం కూడా చెప్తోంది. పురుషుడికి ఇద్దరు గురువులు. తండ్రి "గురుతరుడు" కాగా, తల్లి "గురుతమ". కాబట్టి తండ్రి కంటే తల్లే ఎక్కువ అని కూడా శాస్త్రం

చెప్తుంది. తల్లితో సమానమైన గురువు లేదని, తండ్రి కంటే తల్లే పదింతలు శ్రేష్ఠయని ఎన్నో వ్యాఖ్యానాలున్నాయి. గురువును కూడా కాని పని చేస్తే దండించవచ్చని చెప్పారు కాని, తల్లిని దండించమని ఎవరూ అనలేదింతవరకు. పతితుడైన తండ్రిని, ఆచార్యుడిని వదలవచ్చేమో కాని, పతిత ఐన తల్లిని వదల కూడదంటారు. గర్భంలో ధరించి జన్మనివ్వడమే తల్లి గొప్పదనం. ఇలాంటి తల్లి మాట అనాదరణ చేయరాదంటారు. ఐనప్పటికీ, బాల్యంలో తండ్రి, యౌవనంలో మగడు, వార్ధక్యంలో కొడుకు స్త్రీలకు రక్షకులని చెప్పబడినందున, స్త్రీలకు స్వాతంత్ర్యం లేదని స్మృతి చెప్పినందువల్ల, తల్లికి తండ్రిని కాదని ఆయన ఆజ్ఞకు విరుద్ధంగా ఆజ్ఞాపించే అధికారం లేదని శాస్త్రం చెప్తున్నది. శ్రీరామచంద్రమూర్తి అభిప్రాయం కూడా అదే అనుకోవాలి. తండ్రి ఆజ్ఞ నెరవేర్చడం, తల్లిని రక్షించడం, ప్రతి కొడుకునకు స్వధర్మం. తండ్రి కంటె తల్లికే ఎక్కువ శుశ్రూష చేయాలి. ఆమెను గౌరవించాలి. పోషించాలి. ఆజ్ఞ విషయంలో తండ్రి మాటే వినాలి. అలానే, భర్త ఆజ్ఞకు విరుద్ధంగా భార్య ఆజ్ఞాపించకూడదు. కొడుకుకు తల్లి ఎలా గురువో, తల్లి ఐన కౌసల్యకు భర్త దశరథుడు గురువే కదా! తన గురువాజ్ఞకు విరుద్ధంగా ఆమె ఆజ్ఞాపించలేదు. కాబట్టి, కౌసల్య మాట అనాదరించుట శ్రీరాముడికి భావ్యం కాదు. ఏడేడు లోకాలలో కలిగే సుఖాల కన్నా భగవంతుడిని ఒక్కడినే ఆశ్రయించడం శ్రేయస్కరం. భగవంతుడైన శ్రీరాముడిని ఆయన వద్ద తనున్నానని అనకుండా తన వద్ద భగవంతుడుండాలనే అర్థం వచ్చేట్లు మాట్లాడింది కౌసల్య. అలా అనడం వల్ల భగవత్ ప్రాప్తి దుర్లభం అయినట్లే. తనను వదిలి పోవద్దని అంటున్నది రాముడితో).

తనను పట్టుకునేందుకు చాలా మంది మనుషులు నాలుగు పక్కల గొలుసులు తీసుకుని బెదిరించినప్పటికీ దాన్ని లక్ష్యపెట్టక తన ఇష్టం వచ్చినట్లు సాగిపోయే మదపుటేనుగువలె కౌసల్య దీనాలాపాలకు చెదరక తన ధృఢ ధైర్యంతో తాననుకున్న ఉత్తమ మార్గం వదిలిపెట్టదల్చుకోలేదు. శ్రీరామచంద్రుడి ధర్మనిష్ఠ ధైర్యం ఎంత కొనియాడినా సరిపోనటువంటిది. శ్రీరాముడికి తప్ప ఇతరులెవరికైనా ఇది అసాధ్య కార్యమే! దేహం పరవశమై, మూర్ఛపోయి, తెప్పరిల్లుకొన్న తల్లిని, కడివెడు కన్నీళ్లు కారుస్తున్న తమ్ముడిని చూసి,

ధర్మసంకటంలో పడ్డప్పటికీ, ధైర్యంతో ధర్మాన్నే పాటించదల్చుకున్న శ్రీరాముడితో సమానమైన వారెవరైనా వున్నారా?

లక్ష్మణుడికి ధర్మోపదేశం చేసిన శ్రీరాముడు

తల్లికి చెప్పడం చాలించి, తల్లికంటె ఎక్కువగా ఏడుస్తున్న తమ్ముడు లక్ష్మణుడిని సమాధాన పరిచేందుకు శ్రీరాముడిలా అంటున్నాడు: "తమ్ముడా! నీకు నా మీద వున్న స్నేహం, నీ పరాక్రమం, నాకేమీ కొత్తవి కావు. తాల్లితో సమానంగా నువ్వు కూడా ఏడుస్తూ నాకు దుఃఖం కలిగిస్తున్నావు. ఇది నీకు న్యాయమా? ఇది స్నేహితుడి లక్షణమా? శూరిడి లక్షణమా? నా మీద ప్రేమ వున్నవాడు నాకు శ్రేయస్కరమైన మాటలు చెప్పాలి కాని ధర్మ విరుద్ధంగా, నా అభిప్రాయానికి విరుద్ధంగా చెప్పవచ్చా? ఇన్నాళ్లు నాతో వుండి కూడా నా మనస్సేంటో నీకు తెలియకపోయె! ఇప్పుడు నేనే చెప్తా విను. ధర్మాన్ని విడిచి కొంచెమైనా పక్కకు పోవడానికి నా మనసు అంగీకరించదు.

(ధర్మార్థకామాలనే మూడింటిలో ధర్మం మాత్రమే తనను ఎప్పుడూ సేవించేవారికి, మిగిలిన రెంటినీ కూడా కలిగిస్తుంది. పతివ్రత అయిన భార్య సహధర్మచారిణై ధర్మాభివృద్ధి కలిగిస్తుంది. ప్రేమతో కామ సంబంధమైన సుఖాన్ని కలిగిస్తుంది. కొడుకును కని అర్థాన్ని కలిగిస్తుంది. ధర్మం వల్ల అర్థం, కామం కలుగుతుందని వ్యాసమహాముని కూడా తేల్చి చెప్పాడు. అందుకే అర్థం, కామం కొరకు కష్టపడకుండా, ధర్మం కొరకు పాటుపడితే చాలు. ధర్మమే తనను చంపిన వాడిని చంపుతుంది. రక్షించిన వాడిని రక్షిస్తుంది. అర్థ, కామాలు అలాచేయలేవు).

"లక్ష్మణా! ధర్మం, అర్థం, కామం...ఈ మూడు దేనివల్ల కలగదో, దానిని ఎవరుకూడా చేయకూడదు. దేంట్లోనైతే ప్రశస్తమైన ధర్మం వుందో దాన్నే చేయాలి. ధర్మాన్ని వదిలి, ధనం మీద ఆశ (కామం) వుంటే లోకులకు పగవాడవుతాడు. అలానే ధర్మాన్ని వదిలి కామాసక్తుడైనవాడు పశువుతో సమానమని నిందించాలి. తమ్ముడా! గురుడు, రాజు, తండ్రి, వృద్ధుడు...వీరిలో ఒక గుణం కలవాడైనప్పటికీ వారు చెప్పిన మాట దాట రాదు. అలాంటిది, ఈ నాలుగు గుణాలు ఒకడిలోనే వుంటే, అతడు, కోపంతో కాని, వేడుకకే కాని, కామంతో కాని, మరే విధమైన

కారణంతో కాని, ఒక పని చేయమని అంటే చేయనివాడు క్రూరుడు. అపకీర్తిపరుడు, పాపి అవుతాడు. రాజెలాంటివాడైనప్పటికీ, అతడి ఆజ్ఞ ఎలా పాలించాలో అలాగే, గురువాజ్ఞ, తండ్రి ఆజ్ఞ పాలించడం మన విధి. వారి ఆజ్ఞ ముఖ్యం కాని, వారి గుణాలు కాదు. వారి గుణాల ఫలితం వారే అనుభవిస్తారు".

(గురువులను ఎప్పుడు కూడా నిందించ కూడదు. తప్పుచేసిన గురువును కూడా బహుకరించి ఆయన అనుగ్రహాన్ని పొందాలి అని అంటారు. ఇక్కడొక చిన్న సందేహం కలగవచ్చు. తప్పు చేసిన గురువును దండించాలనేది లక్ష్మణుడి ఆలోచన.....దండిచ కూడదు, నిందించకూదదు అనేది రాముడి అభిప్రాయం. ఇందేది అనుసరించాలి. గురువు కత్తి కట్టితే భీష్ముడిపై దండెత్తినట్లు చేయాలి. ఇలా కాకుండా వాడంతట వాడు చెడు ప్రవర్తనతో వుంటే, హితం మంచి మాటలతో రహస్యంగా బోధించాలి. నలుగురిలో అవమానించకూడదు. వాడు అప్పటికీ వినకపోతే వాడితో సంబంధం వదులుకొని తనదారి తాను చూసుకోవాలి. అవసరం లేనప్పుడు ఎవరినీ దండించకూడదన్నది శ్రీరాముడి అభిప్రాయం. ప్రాణాపాయ స్థితిలో ఆత్మార్పణంగా తప్ప ఎవరినీ దండించే అధికారం రాజుకు తప్ప మరెవరికీ లేదు. లక్ష్మణుడి విధానం రాజనీతిని అనుసరించినది.....శ్రీరాముడి విధానం ధర్మాన్ని అనుసరించినది. ధర్మమంతా రాజనీతి అవుతుంది కాని, రాజనీతి అంతా సర్వదా-సర్వత్రా ధర్మం కాదు. అందుకే రామచంద్రమూర్తి లక్ష్మణుడితో.....'అనార్య మౌనదయ మార్గము క్షత్రియధర్మమిద్ది సమ్మతి గనబోకు' అని భోధించాడు. శ్రీరాముడు అరణ్యానికి పోదల్చుకుంది రాజాజ్ఞ అని కాదు. తల్లిదండ్రుల కోరిక అని మాత్రమే. తల్లిదండ్రులు ఏ గుణం కలవారైనప్పటికీ, ఏ వుద్దేశంతో చెప్పినప్పటికీ, కొడుకు తప్పకుండా విని ఆచరించాలి. ఇది శ్రీరామ మతం. అలా కాకపోతే కొడుకే కాదని అతడి భావన".

శ్రీరాముడు ఇంకా ఇలా అంటాడు..."రాజు తన ఇష్ట ప్రకారం ఆజ్ఞాపించుతే నేను చేయకుండా ఎలా వుండగలను? నేను రేపు రాజైనప్పుడు నా ఆజ్ఞను ఎవరైనా ఉల్లంఘించితే నేను వూరకే వుండాలికదా? నేను వాడిని దండించాలి అనుకుంటే...రాజైన నీ తండ్రి మాట నువ్వు పాలించావా? అని ప్రశ్నించితే ఏమి జవాబివ్వగలను? నువ్వు చేస్తే దోషం కాదు...నేను చేస్తే

దోషమా అంటే ఏమనగలను? రాజు పట్టాభిషేకం చేసుకొమ్మని భరతుడిని, అడవులకు పొమ్మని నన్ను ఆజ్ఞాపించడానికి ఎలా అధికారం వుందో, తల్లికి కూడా అలానే వుంది. ఆమెకు ఒక రాజు....నా కొక రాజు వుండడు! రాజీమెకు భర్త కూడా. భార్యకు ఉత్తమ పురుషార్థం, ధర్మం, రక్షకుడు...అన్నీ భర్తే! తమ్ముడా! లక్ష్మణా! పుణ్యమార్గం అలంకారంగా వున్న రాజు జీవించి వుండగా, ఈమె విధవరాలుగా నా వెంట ఎలా వస్తుంది? ఎలాంటి సమయంలో కూడా భార్యకు భర్తను విడిచి వుండకూడదు. పతివ్రతకు కొడుకుకంటే భర్తే ఎక్కువ గౌరవ పాత్రుడు. ఇరువురిలో ఒకరిని విడిచి వుండాల్సి వస్తే, పతివ్రత కొడుకును విడవాలి కాని భర్తను విడువకూడదు". ఇలా అని మళ్లీ తల్లిని చూసి చెప్పడం మొదలెట్టాడు.

"తల్లీ! నేను అడవులకు పోతున్నాను. నాకు క్షేమం కలిగే విధంగా తల్లివైన నువ్వు దైవ ప్రార్థన, ఆశీర్వాదం చేయి. నీ కడుపు చలవే నాకు శ్రేయస్కరం. నీ మాట వినలేదని నా మీద కోప్పడకు. అనుగ్రహ దృష్టితో చూడు. తండ్రి పెట్టిన గడువు పూర్తి కాగానే తిరిగొస్తాను. సత్యం...మాట తప్పను. యయాతి స్వర్గానికి వచ్చినట్లు తిరిగొస్తాను. నా మీద దయ వుంచు. నేను సత్యాన్ని పరిపాలించే వాడిగా వుండేట్లు చేయి. అసత్యవాదిని చేయొద్దు. అది నీకు కీర్తికరం కాదు....నాకూ కాదు. అమ్మా! భోగాలందున్న ఆత్యాశ వల్ల ధర్మాన్ని నాశనం చేసి, రాబోయే గొప్ప కీర్తిని రాకుండా చేసుకోలేను. ఆయువు అత్యల్పకాలం వుంటుంది. అందుకే..ధర్మాన్ని పాటింపక తుచ్ఛమైన సంపదలను కోరుకో లేను". కన్న తల్లికి ఇలా సమాధానం చెప్పి, తమ్ముడికి కూడా హితోపదేశం చేసి, దండకారణ్యానికి పోయేందుకు భక్తితో తల్లికి ప్రదక్షిణం చేద్దామనుకున్నాడు శ్రీరామచంద్రుడు. తన మనసులో ఇలా అనుకుంటాడప్పుడు.

❖ ❖ ❖

సర్గ-22

లోలోన శోకాగ్ని మండుతుంటే, దీనత్వం అతిశయించగా కోపం కలుగుతుంటే, ఈ మూడు కలిసి శరీరాన్నిఉడికిస్తుంటే, కలిగిన కోపం వల్ల బుసలు కొటుతున్న పాము లాగా ముఖమంతా కందిపోయి, మంచి మనసున్న తమ్ముడు లక్ష్మణుడి దగ్గరకు పోయి, ధైర్యాతిశయంతో రాముడిలా అన్నాడు. "లక్ష్మణా! కైక మీద, దశరథుడి మీద, నీ మాట వినలేదని నామీద, వచ్చిన కోపాన్ని వదిలిపెట్టు. అడవికి పోతే మనకొచ్చిన భయం లేదని ధైర్యంగా వుండు. మానం పోయిందికదా...అవమానం జరిగింది కదా అని అనుకోవద్దు. మానావమానాలు వచ్చి పోతుంతాయి....ఇవి శాశ్వతం కావు. వాటిని సహించాలి. మానావమానాలకు నిష్కర్షలేదు. ఒకరికి మానంగా తోచించి మరొకరికి అవమానంగా కనిపించవచ్చు. అది కేవలం మనోవ్యాపారం. పట్టాభిషేక భంగం నీకు అవమానంగా కనిపిస్తున్నదేమో! కాని అది గౌరవ కారణం. ఎందుకంటావేమో....ఇంతటి ఐశ్వర్యాన్ని, చేతికి వచ్చినదాన్ని, వదిలి, తండ్రి మాట పాటించాలని అడవికి పోయిన మనం గొప్ప పితృ భక్తులం అని అంటారందరు. కైక ఏదైతే గౌరవం అనుకుంటున్నదో అది అగౌరవ కారణం అవుతుంది. కాబట్టి, మానావమానాల విచారాన్ని వదిలిపెట్టు. ఇంతటి కీర్తి, గౌరవం సంపాదించుకునే సమయం ఆసన్నమైందని సంతోషించు. ఇలాంటి పరీక్షాకాలం అందరికీ అన్నివేళలా లభించదు. వచ్చినప్పుడు, వచ్చిన వాళ్లు దానిని వదలకూడదు. దానిని సాధించి కృతకృత్యులం కావాలి. అధి ధీరులైన బుద్ధిమంతుల లక్షణం. కష్టాలు కలకాలం కాపురం చేయవు. కీర్తి శాశ్వతం. కాబట్టి పట్టాభిషేకం కొరకు నువ్వు ధరించిన వేషాన్ని, దొరికిన వస్తువులను వదిలిపెట్టు. వనవాసానికి యోగ్యమైన వాటిని సంపాదించుకో. ఏ వైభవంతో, ఉత్సాహంతో, అభిషేకానికి కావాల్సినవన్నీ సమకూర్చబడెనో, అదే వైభవంతో, ఉత్సాహంతో అభిషేకాన్ని నిలిపివేసేందుకు కావాల్సిన సకల పదార్థాలను మార్చి వేసేయి".

"లక్ష్మణా! రాముడు అడవులకు పోతానన్నాడు కాని, ఆయన ప్రియమైన తమ్ముడు, అన్నకు కుడి భుజం, లక్ష్మణుడు వద్దని వారిస్తే రాముడు పోవడం

మానుకుంటాడేమో అనే అనుమానం కలగొద్దు. శ్రీరాముడు అడవులకు పోతాడో..పోడో..అనే ఊగిసలాటకు తావివ్వవద్దు. కైక మనస్సులో శంక కలగొద్దు. శ్రీరాముడు సత్యాత్ముడు...లక్ష్మణుడు కాడు అన్న పేరు నీకెందుకు? మన తల్లి కైకను ఈ విషయంలో భయపడేట్లు చేయడం అంటే, హింసించినట్లే..... కాబట్టి అలాంటి స్థితి నేను అంగీకరించను. కన్న తల్లి గగ్గోలు పెట్టి ఏడుస్తుంటే సహించి, సవతి తల్లి బాధపడడం సహించలేననడం సబబా? అని అడగవచ్చు. ఎందుకు కైక మీద నాకింత అభిమానం అని కూడా అడగవచ్చు. ఇంతవరకు నేను తెలిసి కాని, తెలియక కాని, కన్న తల్లికైనా, సవతి తల్లులకైనా, తండ్రికైనా, వారి మనసుకు అప్రియమైన పని చేసినట్లు జ్ఞాపకం లేదు. ఇప్పుడీ చిన్న విషయానికి నేనెందుకు అలా చేయాలి? తల్లి మాట అలా వుండనీ. యుద్ధమందు నిజమైన పరాక్రమంతో పోరాడేవాడు, ప్రతిజ్ఞ చేసి తప్పని వాడు, స్వర్గలోకం తనకు లభించదేమో అని భయపడేవాడు....ఇక నుంచి భయం లేకుండా వుండనీ. ఈ అభిషేక ప్రయత్నాలను ఇప్పుడు నేను వదలకుంటే, రాజ చిహ్నాలను విడవకుంటే, నేను అడవులకు పోనేమోనని అనుమాన పడతారు. తన సత్యం వ్యర్థమయిందికదా అని రాజు బాధ పడుతాడు. తండ్రి బాధపడుతుంటే నా మనసు ఎలా వూరట చెందుతుంది? తండ్రిని ఇలా చేశాకదా అని ఎప్పుడూ బాధపడాల్సిందే కదా! నువ్వే చెప్పు".

"ఈ కారణం వల్ల, అభిషేక ప్రయత్నాలు మాని, ఇప్పుడే అడవికి పోయే మార్గం చూసుకుంటే, కైక భరతుడికి రాజ్యలక్ష్మి పరిపూర్ణంగా లభిస్తుందని సంతోషించాలి. ఇది తెలుసుకున్న తండ్రి తన మాట సత్యమయింది కదా అని తానూ సంతోషించాలి. తల్లిదండ్రులను సంతోషపెట్టడం కంటే మనం చేయగల గొప్ప పనేముంటుంది? అంతకంటే గొప్ప పుణ్య కార్యమేముంటుంది? తల్లిదండ్రులు సంతోషపడితే పరలోకంలో దీర్ఘమైన సుఖం కలుగుతుంది. తుచ్ఛమైన, క్షణికమైన, ఇహలోక సుఖం కొరకు శాశ్వతమైన పరలోక సుఖాన్ని కోలుపోవచ్చునా? నువ్వే చెప్పు లక్ష్మణా! నార చీరెలు కట్టి, కృష్ణాజినం ధరించి, జడల గుంపులు చుట్టగా చుట్టి, అరణ్యాలకు పోతుండే నన్ను చూసి నిర్విచారంగా కైక రొమ్ముపై చేయి పెట్టుకుని నిద్రపోవాలి. కైక కోరిక ప్రకారం వనవాసం

చేయడమే న్యాయమని మనసులో నిర్ణయించుకున్నాను. ఇప్పుడు దానికి విరుద్ధంగా, ఇతరుల బలవంతం మీద, నా మనసు నొచ్చుకునే విధంగా చేయలేను. ఎవరు బుద్ధి నేర్పడం వల్ల ఇది ఇలా కావాలని నిర్ణయం జరిగిందో, వారి మనసు నొచ్చుకునేట్లు నేను చేయలేను. ఇప్పుడే నేను అడవికి పోతాను".

మంచిచెడులకు దైవమే కారణమని లక్ష్మణుడికి చెప్పిన శ్రీరాముడు

ఇంతవరకు ధర్మం సకల విధాలైన ఫలం ఇస్తుందని చెప్పిన శ్రీరాముడు, ధర్మం, కర్మం అచేతనాలంటాడు. అలాగే, ధర్మాన్ని మించిన దైవం వున్నాడని అంటూ, ఆ వివరాలను చెప్తున్నాడిలా: "కైక మోసం చేసిందని ఆమె మీద ఎందుకు కోప్పడాలి నువ్వు? కైక చేయగలిందేమీ లేదు. నాకు పట్టాభిషేకం చేయాలని ప్రయత్నం చేసిన వాడు దశరథుడు కాదు. దానికి విఘ్నం కలిగించింది కైక కాదు. కొత్త నీళ్లు వచ్చి పాత నీళ్లు పోయిన విధంగా ముందున్న సుఖమంతా పోయి నేను అడవుల పాలవడానికి నా దోషం ఏదీ లేదు. ఇవన్నీ కేవలం దైవ కృత్యాలే! మరెవరి పనీ కాదు. కాబట్టి ఎందుకు బాధ పడ్తావు? ఎవరిమీద కోపం నీకు లక్ష్మణా? (ఈ దైవం అంటే అదృష్టమని కొందరనుకుంటారు. పూర్వం చేసిన పాపపుణ్యాల ఫలితమే ఈశ్వరానుగ్రహమని వేదాంతుల అభిప్రాయం). ఇంత దూరాలోచన దైవ ప్రేరణ వల్లనే కలిగింది. అలా కాకపోతే తనకు ఏ అపరాధం చేయని నన్ను నిష్కారణంగా కష్టపెట్టాలని కైక మనసుకు కలగడం సాధ్యమా? మన ముగ్గురు తల్లులలో, నా మీద ఒకరికి ఎక్కువ, మరొకరికి తక్కువ ప్రేమ అని చెప్పడానికి, వారిలో కొంచెమైనా తారతమ్యం కనిపించడం నేను చూడలేదు. ఇదే కైకకు నిన్నటి దాకా తన కొడుకుపై ఎక్కువ ప్రేమ కాని, నామీద తక్కువ ప్రేమ కానీ, విరోధ భావం కానీ లేదు. ఇదంతా ఇవ్వాళే కలగడానికి కారణం చెప్పగలవా తమ్ముడూ? ఉన్నట్లుండి ఇంతటి ప్రేమ, విరోధంగా మారడానికి కారణం దైవం కాకుండా మరెవరో చెప్పు? తన కన్న కొడుకు కంటే నాపై ఎక్కువ ప్రేమగల కైక, ఏ అపరాధం చేయని నన్ను, నిష్కారణంగా కఠినోక్తులు మాట్లాడి, ఊళ్లో కూడా వుండనీయకుండా, అడవులకు పొమ్మని అనడం అంటే, ఇదంతా విధి

చేష్టకాకుండా ఇతరుల చేష్ట ఎలా అవుతుంది? ఇతరులకు ఇది సాధ్యం కూడా కాదు".

రాముడు ఇంకా ఇలా అంటాడు: "ఆమె స్వభావ రీత్యా దుష్టురాలు. ఆ దుష్ట స్వభావమే ఇప్పుడామెను ప్రేరేపించింది. ఇక దైవం ఏమి చేసిందంటావా? సహజంగా ఆమె దుష్టురాలు కాదు. ఆమె పుట్టడం తోనే ఆమెతో గుణాలకు తోడు గౌరవం కూడా పుట్టింది. కులం కొలది గుణం అంటారు. ఆమె గొప్ప వంశంలో రాజకుమారిగా పుట్టింది. గొప్ప జాతిలో, గొప్ప వంశంలో పుట్టి, గొప్పవారి సాంగత్యంలో పెరిగిన దానికి నీచగుణం సహజమని ఎలా చెప్పగలం? సాలగ్రామాల గనుల్లో గులకరాళ్లు కూడా వుంటాయికదా? సముద్రంలో విషం పుట్టలేదా? అలా ఐతే బాల్యం నుంచే ఆమె నీచురాలై వుండాలి. అలా కాకుండా, దానానికి, దయకు స్థానంగా కీర్తి సంపాదించింది. సహజంగా నీచురాలైతే ఆమెకు ఈ కీర్తి కలిగేదా? తనతో సమానమైన సవతుల మీద ద్వేషం పెంచుకుంది. అది నీచమే కదా అంటావేమో? ఆమె ద్వేషించింది సపత్నీత్వాన్ని కాని సవతులను కాదు. వారు సవతులు కాకపోతే వారిని ద్వేషించేది కాదు. అందరు ఆడవారిని ద్వేషించలేదే? తమ యోగ క్షేమాలకు హాని కలిగిస్తారేమోనని అనుమానం కలిగిన తోటి రాజులను అణచివేసే ప్రయత్నాన్ని పట్టాభిషిక్తులైన రాజులు కూడా చేయడం లేదా? ఒకరికె ఎంతైనా దానం చేయగల కైక పరుల సొత్తును ఎందుకు ఆశించింది? ఎంతో దయా గుణం కల ఆమె ఇలాంటి క్రూరమైన పనికి ఎందుకు సాహసించింది? ఎందుకు భర్తను ఎదిరించింది? ప్రీతిపాత్రుడనైన నన్ను ఎందుకు పనికిమాలిన, బాధాకరమైన మాటలను అనగలిగింది? దైవం ఆవేశించకున్న ఇలా చేయగలిగేదా? సహజమైతే ఇన్నాళ్లు ఎందుకు చేయలేదు? కాబట్టి తమ్ముడా లక్ష్మణా! ఇంత మహిమగలది, ఊహించలేనిది, అసాధ్యమైన ప్రభావం కలదైన దైవం నీకు, నాకే కాదు, ఎలాంటివారికైనా అందలేనిదే. దానికి ఎదురులేదు. ఆమెకు ఆ దుర్బుద్ధి పుట్టడానికి, నాకు దారిద్ర్యం రావడానికి దైవమే కారణం. ఆ దైవమే ఇంత పని చేసింది".

"నాయనా లక్ష్మణా! దైవం వుందనడానికి ప్రమాణం ఏంటి? దైవాన్ని ఎదిరించి ఇలాంటివి జరగకుండా మనం పురుషకారం చేయలేమా? అని

అంటావేమో! ఒక పని మనం చేస్తున్నప్పుడు దైవం అనేదొకటున్నదని, అదేంటో చేస్తున్నదని, మనకు తెలియదు. ఫలితం కలిగేటప్పుడు మాత్రం ఆ దైవం కనపడి అదెలా చేయదల్చుకున్నదో, అలానే చేస్తుంది. ఫలితంలో మాత్రం కనిపించి, వేరే విధంగా కనిపించక, ఆ కారణం వల్ల దానిని జయించలేక సతమతమయ్యే మనం దైవంతో పోరాడగలమా? అది ఏ రూపంలో, ఎలా, ఏం చేస్తున్నదో మనకు తెలియనప్పుడు దానితో పోరాటం చేయగలమా? ఎలా చేస్తాం? ఫలానా సమయంలో, ఫలానా కార్యం సాధించేందుకు, ఫలానా సాధనాలను (దైవం) సిద్ధం చేసుకుని వుందని మనకు ముందే తెలుస్తే కదా, మనం ప్రతీకారం చేయగలం? కార్యస్వరూపంలో కనిపించకుండా, ఫలితం స్వరూపంలో కనిపించేదే దైవం. కాబట్టి దైవం వుందనడానికి అనుమానమే ప్రమాణం...బుద్ధి బలంతో మాత్రమే దానిని ఊహించగలం. లక్ష్మణా! కారణం లేకుండా కార్యం జరగదు. నిష్కారణం అంటే...కారణం మనకు తెలియదని అర్థమే కాని, కారణం లేదని అర్థం కాదు. కాబట్టి, మన సంతోషానికి, సౌఖ్యానికి, వ్యసనానికి, శాంతికి, రోషానికి, లాభనష్టాలకు, జననమరణాలకు, మరెన్నో ఇతర ఫలితాలకు....వేటినైతే కారణం లేకుండా కలుగుతున్నాయని అనుకుంటామో, వాటన్నిటికీ మూలకారణం దైవమే సుమా! ఇది తప్పదయ్యా తప్పదు!”.

“లక్ష్మణా! పామరులమైన మన సంగతలా వుంచు. ఘోరమైన తపస్సు చేసి, ఎంతో జ్ఞానాన్ని-మహిమను సంపాదించి, నిత్యనియమవ్రతులై, శాంతులై, నిష్కాములై, అడవిలో ఒక మూల నివసించే మునులు కూడా దైవాన్ని ఎదిరించి ఏమీ చేయలేరు. ఇలాంటి వారిలో కొందరు హటాత్తుగా కామానికి, కోపానికి లోబడి, దీర్ఘకాలంగా అభ్యసిస్తున్న నియమనిష్ఠలను నీటిపాలుచేసి, మర్యాద తప్పి, భ్రష్టులై పోవడం దైవ చేష్ట కాదా? పురుష ప్రయత్నంలో ఏ లోపం వుంది? మన గురువు విశ్వామిత్రుడంతటి వాడే నిమిషంలో కామానికి, క్రోధానికి వశుడై చెడి పోయాడో విన్నాం కదా? శివుడు కూడా అలానే అయ్యాడు కదా? ఎప్పుడు కూడా ఇదిలా జరుగవచ్చని ఊహించని పనులు తటాలున వున్నట్లుండి అయిపోవడం, అందరూ తప్పక అవుతుందనుకున్న కార్యం విఘ్నం కావడం లాంటివన్నీ దైవ చేష్టలే! ఇది సత్యం. ఈ విధంగా సప్రమాణంగా, నిస్సందేహంగా

నిశ్చయించుకుని, ఇతరుల ఉపదేశాల వలనే కాకుండా, నాలో నేనే కార్యాచరణ ఆలోచించాను. ఇది దైవ కృత్యమని, దీనిలో మన దోషం లేదని, కైక నిమిత్త మాత్రమేనని, ఆమె దైవానికి సాధనం అయిందని, సాధించేది దైవం మాత్రమేనని, నాకు అర్థమైంది. దానివల్ల నాకు వ్యసనం, బాధ కలగలేదు. ఇది తెలియని నువ్వు, ఇదేదో వారు-వీరు చేసారని ఇతరులపై కోపగించుకుంటున్నావు. కాబట్టి, నువ్వు కూడా బాధపడకుండా, నా మార్గాన్ని అనుసరించి, దైవకృతము అనుభవించక తప్పదని నిశ్చయించుకుని, పట్టాభిషేకానికి కావాల్సిన పనులన్నీ వదిలిపెట్టు. చింత పడవద్దు. చింతించి ప్రయోజనం లేదు".

"ఇక పట్టాభిషేక పదార్థాల విషయానికొద్దాం. గంగాది నదుల నుంచి తెచ్చిన దివ్యతీర్థాలను ఏం చేయాలని అంటావేమో? ఊరకే పారపోయాలంటా వేమో? అలా చేయాల్సిన పని లేదు. పట్టాభిషేకానికి ఏర్పాటు చేసిన తీర్థాలు, తాపసుల వ్రతానికి సిద్ధపడుతున్న నాకు వ్రతారంభంలో చేయాల్సిన స్నానానికి ఉపయోగపడుతాయి. లక్ష్మణా! పొరపాటున అన్నాను. ఈ నీళ్లు నేను ఉ పయోగించుకుంటానని అన్నాను కదా? ఇది ఆలోచించకుండా అన్న మాట. ఇది కూడా రాజ ద్రవ్యమే కదా! మునులకు రాజ ద్రవ్యం నిషిద్ధం కదా! కాబట్టి ఈ నీళ్లతో నాకు అవసరం లేదు. రాజద్రవ్యం మాత్రమే కాకుండా...ఈ నీళ్లతో నేను స్నానం చేస్తే...పట్టాభిషేకానికి నేను సిద్ధమౌతున్నానని కైక సందేహపడవచ్చు. నిష్కారణంగా ఆమెకు నేను ఎందుకు బాధ కలిగించాలి? నేనే నాక్కావాల్సిన నీళ్లు తెచ్చుకుని స్నానం చేస్తాను. చేసి, వ్రతం ఆరంభిస్తాను. తపస్వులు స్వయందాసులు కదా!"

"అన్నా! లక్ష్మణా! ఎంత చెప్పినా నువ్వు దుఃఖాన్ని ఆపడం లేదుకదా? లక్ష్మి పోయింది...దారిద్ర్యం వచ్చింది అని దుఃఖించవద్దు. నా అభిప్రాయంలో, లెక్కింపనలవి కాని ఈ రాజ భోగాలు, అరణ్యవాసం, రెండూ ధర్మ కార్యాలే. రెండూ ఒకటిగానే అనిపిస్తున్నది. ఒక విధంగా ఆలోచిస్తే, వనవాసమే సుఖమనిపిస్తున్నది. ఎందుకంటే...రాజభోగం సుఖరూపక దుఃఖం; వనవాసం దుఃఖరూపక సుఖం. రాజభోగం ఇప్పటికి సుఖంగా కనిపించినప్పటికీ, నిర్వహణలో దుఃఖంతో కూడుకున్నదవుతుంది. వనవాసం నిశ్చింతం.

నిరుపద్రవం. పుణ్యఫలదం. కాబట్టి, తాత్కాలికంగా దుఃఖంగా తోచినప్పటికీ, పోనుపోను సుఖమిస్తుంది. ఈ రెండింటిలో ఏది మేలు? కాబట్టి ఎందుకు వృధాగా మనస్సు పాడుచేసుకుంటావు? లక్ష్మణా! చేతికి వచ్చిన పండు నోటికి రాకుండా జారిపడిపోయిన విధంగా కైక అడ్డుపడిందని బాధపడవద్దు. ఆమె మీద ప్రేమ పోగొట్టుకోవద్దు. ఆమెను దూషించవద్దు. ఆమె మనకు తల్లి. సుఖాన్ని, దుఃఖాన్ని ఇచ్చేవారెవరూ లేరు. ఎవరో ఇతరులు అవి కలిగిస్తారని మనం అనుకుంటాం. నేనే ఈ పని చేశాననడం వృధాభిమానం. ప్రతి మనిషి తాని చేసిన కర్మకు కట్టుబడి వున్నాడు. కైకలో స్వతస్సిద్ధమైన దోషం లేదు. పిశాచం పట్టిన వారు, సన్నిపాత జ్వరంతో బాధ పడేవారు, దూషించినప్పుడు, అది రోగబలమంటామే కాని వ్యక్తిని తప్పు పట్టం కదా? అలానే, దైవం కైక నోటి నుండి ఇలాంటి కీడు మాటలు పలికించింది. కైక మీద కోప్పడి ప్రయోజనం లేదు. సజ్జన స్తోత్రపాత్రమైన మనసుగల లక్ష్మణా! దైవం ఇలా చేయగలదని నీకు తెలియదా?".

❖ ❖ ❖

సర్గ-23

దైవం కంటె పౌరుషమే శ్రేష్ఠమని శ్రీరాముడికి చెప్పిన లక్ష్మణుడు

చే దొరికిన రాజ్యం తప్పిపోవడానికి ప్రబలమైన దైవమే కారణమని, వేరేది కాదని, అందువల్ల లక్ష్మణుడు పరితపించాల్సిన పని లేదని, ఐనా సకల శ్రేయోస్సాధనమైన ధర్మాన్ని కూడా విడువరాదని, పితృవాక్యపాలన పుత్ర ధర్మమని, అది మొదటిది కాబట్టి దానిని నెరవేర్చాలని, మాతృవాక్య పాలన ధర్మమైనప్పటికీ అది పితృవాక్యానంతరం జరిగినందున దానిని వెనుక చేయాలని, శ్రీరామచంద్రుడు వివరంగా చెప్పాడు. ఐనప్పటికీ లక్ష్మణుడు దానిని అంగీకరించలేదు. దైవాన్ని పురుషకారం మరల్చి, దైవం విఘ్నం చేసిన పట్టాభిషేకాన్ని పురుషకారంతో తాను ప్రతిఘటించేట్లు చేస్తానని అంటాడు. ప్రతిగా రాముడు దైవ లక్షణాన్ని, దాని బలాన్ని మళ్లీ చెప్పాడు. ఆ పైన లక్ష్మణుడు తన వాదనను వినిపించడానికి సిద్ధమైనాడు. అంతవరకు వినడానికి ఇష్టం లేకపోయినా అన్న చెప్పిన మాటలన్నీ వినయంగా తలవంచుకుని మళ్లీ-మళ్లీ విని, అయ్యో! ఇలాంటి ధర్మాత్ముడు, సుకుమారుడు అడవుల పడనున్నాడే అని బాధపడ్డాడు-దుఃఖించాడు. మరో పక్క, ఆహా! మా అన్న ఇంత కష్టకాలంలో కూడా ఇంత ధర్మ నిష్టతో వున్నాడే అని సంతోషించాడు. ఈ రెండింటి మధ్య సందిగ్ధంలో పడిపోయాడు. అన్న చెప్పింది ఒప్పుకుంటే ఆయన కష్టాలకు అంగీకరించినవాడినవుతాను....ఒప్పుకోకపోతే, ధర్మహాని కలిగించిన వాడినవుతాను అనుకున్నాడు. ఏం చేయాలో అని ఆలోచించగా, కైక చేసిన దుశ్చేష్ట, దురాలోచన మనసుకు తగలగా, కోపంతో, అన్నను సుఖపెట్టాలన్న తలంపుతో అన్న మనసు మార్చే ప్రయత్నం చేద్దామనుకున్నాడు. విస్తారమైన కోపంతో, దెబ్బతిని తప్పించుకుని పుట్టలోకి పోయిన పాములాగా బుసకొట్టాడు. కనుబొమలు, లలాటం కదులుతుంటే సింహం ముఖంలాగా ఆయన ముఖం ఎర్రబారింది. ఏనుగు తొండంలాగా తన కొనచేతిని విదిల్చాడు. దృష్టి నేలమీదనుంచి మరల్చాడు. ఇరు పక్కలా దృష్టి సారించాడు. అటు-ఇటు

కదిలాడు. శ్రీరాముడి ముఖాన్ని అడ్డ చూపులతో చూశాడు. పెదవులు ఎగిరి పడ్డాయి. కళ్ళు ఎర్రబారాయి. కోపంతో ఇలా అన్నాడు అన్నతో:

"అన్నా! రామచంద్రా! తండ్రి మాట జవదాటితే పాపం కలుగుతుందన్న భయంతోను, మహాత్ముడు-ధర్మాత్ముడు శ్రీరాముడే తండ్రి మాట వినకపోతే మనమెందుకు వినాలి అని లోకులనుకుంటారన్న భీతితోను, అవివేకుల గుంపు ధర్మం అనే ఆనకట్టను తెంచి తాము చెడి లోకలను చెరుస్తారేమో అన్న సందేహంతోను, ఏదో మునిగిపోయినట్లుఅడవులకు ఆదరబాదరాగా పోవడానికి సిద్ధమౌతున్నావు కాని, నువ్వు చెప్పినవన్నీ ప్రస్తావించడానికి ఇది సమయం-సందర్భం కాదు. అన్నా! నువ్వేదో దైవాన్ని గొప్పదిగా భ్రమపడుతున్నావు. నువ్వే చెయ్యాలనుకుంటే, చేయదల్చుకుంటే, నీకు అసాధ్యమైన పని ఏదన్నా వుందా? అన్నింటిలో సమర్థుడవైనప్పటికీ, ఏ సామర్థ్యం లేని దైవాన్ని ఎంతో పెద్ద చేసి చెప్పావు. ఆ విషయాన్ని నువ్వు నిజంగా నమ్మి చెప్పావో...లేక...వేరే వుద్దేశం మనసులో వుంచుకుని అన్నావో తెలియదు. నిజానికి దైవం దుర్బలం లాంటిది. ఎందుకంటే...అది తన పనిని సాధించేందుకు తనకు సమర్థత లేక, ఇతరుల సహాయం కోరుతుంది. ఇది సమర్థుడి లక్షణమా? తాను ముందుండి దైవం ఏ పనీ చేయలేదు. ఇది ధీర లక్షణమా? ఇలా దేనికీ కొరగాని దైవాన్ని ధీరుడవు, సమర్థుడవు, చిత్త విభ్రాంతి లేని వాడివైన నువ్వు పామరుడిలాగా పొగుడుతున్నావు. ఇది నీకు తగునా?"

"తల్లిదండ్రుల మాట మీరితే పాపం-పాపం అని పది సార్లంటున్నావు కాని, పుణ్యాత్ములు-ధర్మాత్ములు చెప్పిన మాట మీరితే పాపం వస్తుందేమో కాని, పాప బుద్ధి కల దంపతుల మాట మీరితే, పాపం ఎలా వస్తుంది? ఎందుకంటే, వాళ్లు పాపాన్ని పట్టుకుని వేళ్లాడుతారు. వాళ్ల విషయంలో పాపం చేస్తే దోషం రాదు. అలాంటప్పుడు వాళ్ల మాట వినకపోతే దోషం ఎలా వస్తుంది? వసనాభిలో వుండే పురుగుకు వసనాభి పెట్టే తప్పా? మన తల్లిదండ్రులెలా పాపాత్ములంటావా? నీకు రావాల్సిన రాజ్యలక్ష్మిని, మోసం చేసి, నీకు కాకుండా చేసిన సంగతి నువ్వు తెలుసుకోలేక పోతున్నావు. నీకేమో నల్లని వన్నీ నీళ్లు, తెల్లనివన్నీ పాలలాగా కనపడతాయి. లోకంలో ధర్మాన్ని అడ్డం పెట్టుకుని, ఆ నెపం మీద, వాళ్లు చేసే దుష్కార్యాలను ధర్మవాక్యోపన్యాసాలతో కప్పి పెట్టే

శిశ్నోదరపరాయణులు ఎంతమంది లేరు? నిర్వంచనమైన ధర్మం, ధర్మం అవుతుందికాని, వంచనతో కూడిన ధర్మం, ధర్మమా? దీంట్లో మన తల్లిదండ్రులు చేసిన మోసమేంటి అంటావా? తన మీద తన భర్తకున్న మోహాన్ని, తనకు అనుకూలంగా మలచుకుని, తన కొడుకుకు రాజ్యం ఇవ్వమని కోరగా కామదాసుడైన ఆమె భర్త ఒప్పుకున్నాడు. ఇది తప్పుకాదా? మరో పక్క, లోకమంతా మెచ్చుకునేలా, తాను శ్రీరాముడికి పట్టాభిషేకం చేస్తానని సభాముఖంగా చెప్పాడు మన తండ్రి. ఓ వయసు పిల్లా! నువ్వు వరాలు కోరుకో ఇస్తానని ఇంట్లో చెప్పాడు....ఆమెకా యుక్తి నేర్పాడు....సభలోనేమో అందరూ వినేట్లు శ్రీరాముడిని యువరాజు చేస్తానని కంటితుడుపుగా అన్నాడు...కైక దగ్గరకు పోయి మోసం చేసి ఏం తెలియని వాడిలా వగలాడి ఏడుపులేడుస్తున్నాడు. అసలింతకూ, వరాలిచ్చిందెప్పుడు? కోరిందేనాడు? ఇన్నాళ్లు కైక ఏం చేసింది? రాజెందుకు తీర్చలేదు? ఇదంతా కలా? నిజమా? ఒక వేళ నిజమే అనుకుందాం. ఉదయం సభలో ఒకటి చెప్పి, రాత్రి ఇంట్లో మరోటి అనవచ్చా? ముందు చెప్పింది ముందు చేయాలా? వద్దా? ఆమె కోరిక కోరడానికి ఇదే సమయమా? ఇదంతా టక్కు కాదా? నిజమని ఎవరైనా నమ్ముతారా?"

"పెద్దవాడుండగా చిన్నవాడికి రాజ్యమిచ్చి వంశ ధర్మాన్ని నాశనం చేశాడు. నిష్కారణంగా పెద్ద కొడుకును అడవులకు పంపుతున్నాడు. ఇలాంటివాడు రాజు...మనం ప్రజలం! ఇతడి ప్రభుత్వాన్ని మనం అంగీకరించకూడదని లోకులందరు అనుకోగా, మాయోపాయాలతో న్యాయంగా నీకు రావలిసిన రాజ్యశ్రీని ఇతరులకు దశరథుడు ఇస్తుంటే, నేనంగీకరించను. కాబట్టి నా అనంగీకారానికి క్షమించు. రామచంద్రా! నువ్వు జ్ఞానవంతులైన పండితులకే పండితుడవు. నీకు తెలియని విషయం లేదు. నువ్వు ధర్మమనుకునే పితృవాక్య పాలన చింతపట్టింది నీకు. ఐతే అదే ధర్మం, బుద్ధి మోహంతో కొంతసేపు రాజ్యం కావలెనని, కొంతసేపు అరణ్యానికి పోవలెనని రెండుగా చీలింది. ఇలాంటి బుద్ధిభేదం కలిగించే ధర్మం అంటే నాకు రోతగా వుంది. ధర్మం ఒకే విధంగా నిశ్చితమై వుండాలి కాని పరస్పర విరుద్ధమైన రెండు మార్గాలలో పోవడం జరుగుతే, ఆ ధర్మం ధర్మమేనా? నిశ్చయ బుద్ధి ఒకే విధంగా వుంటుంది.

ముందొకటి నిశ్చయించి, కొంతసేపటికి దానికి భిన్నంగా ప్రవర్తించేవాడు చపలచిత్తుడు కాడా? మొదలే రాజ్యం నాకొద్దు అంటే నేను బాధపడేవాడిని కాదు. నువ్వెంతటి పనికైనా సమర్థుడవు. ఇలాంటి నువ్వు, మోహంతో బుద్ధి నాశనం చేసుకుని, కైకకు వశుడవై, నిందించాల్సిన, అధర్మమైనదశరథుడి మాటలను సమర్థించడం తగునా? నీకు న్యాయ మార్గంలో రాజ్యం దక్కకపోతే నేను దుఃఖపడేవాడిని కాదు. ఇప్పుడలా జరగలేదు. లోకులను, నిన్ను, మోసం చేయాలని తలంచి, వరాల లాంటివి కల్పించగా, వాటిని నువ్వు గొప్పగా భావించి, అందరూ నీ లాంటివారేనని అనుకుని, వాటిని తిరస్కరించలేక పోతున్నావు. ఈ మోసాన్ని నువ్వు కనిపెట్టలేకపోయావే అని నా బాధ కాని, నీకు రాజ్యం పోయిందని కాదు. ఇలాంటి సందర్భంలో, ఫలానా వారికి మోసం కనిపెట్టగలిగే బుద్ధి లేకపోయిందికదా అన్న అపకీర్తిని, అప్రతిష్టను అంగీకరించను. అలాంటివి తెచ్చే ధర్మ మార్గాన్ని అనుసరించడం నాకే కాదు...ఎవరికైనా తప్పే".

"కైకేయీ దశరథులు తల్లిదండ్రులు నడవాల్సిన రీతిలో నడవలేదు. కాబట్టి వాళ్లను తల్లిదండ్లనడం తప్పు. ఆ పేర్లకు వాళ్లు తగరు. ఆ పేర్లకు తగని నడవడి గలవారు ఆ గౌరవానికి ఎలా తగుదురు? అలాంటి పేర్లు పెట్టుకుని, కామ బలంతో ఇష్టం వచ్చినట్లు వ్యవహరించే పగవారు చెప్పినట్లు నువ్వు చేయతగునా? చేయొచ్చునని మనసులో కూడా నువ్వు భావించవచ్చా? కైకేయీ దశరథుల ఆలోచనను నువ్వు దైవ తంత్రంగా పోల్చావు. దైవం ఇలాంటి దురాలోచన కలిగిస్తే, నువ్వు ఉపేక్షించడమే తగిన పని. అలాంటి దైవం నాకిష్టం లేదు. కుట్రలు ప్రేరేపించు దైవం ఎలా దైవం అవుతుంది? ఎలా పూజ్యనీయమవుతుంది? బలం లేనివారు, అల్ప తేజస్సు కలవారు దైవ బలం అంటారు. ఎందుకు? వాళ్లకు కార్యసాధనకు కావాల్సిన బలం, తెలివితేటలు లేకపోవడం వల్ల, నింద తమ మీద వేసుకోకుండా దైవం మీద పెట్తారు. ఇక బలవంతులు, కీర్తిని కోరేవారు, దైవ అనేదొకటున్నదని కలలో కూడా అనుకోరు. పురుషకారంతో స్వకార్యాన్ని సాధించి కీర్తిని పొందుతారు. అలాంటివారిని దైవం ఏం చేస్తుంది? బలం గల గొప్పవాడు పౌరుష బలంతో దైవాన్ని దగ్గరకు రాకుండా తరిమికొట్టి, చివరకు, దైవం వల్ల ఏ బాధ పడకుండా, సమర్థతతో

తన పని తాను చేసుకుంటాడు. అన్నయ్యా! నువ్వు దైవ బలం ఎక్కువ అంటున్నావు. నేను పురుష బలం ఎక్కువ అంటున్నాను. దైవం చేయాలనుకుంది చేసింది. ఇక పురుష బలంతో సాధ్యమైంది చేస్తాను. అప్పుడు దైవ బలం ఎక్కువా? పురుష బలం ఎక్కువా లోకులే చూస్తారు".

"దైవం వల్ల చెడిన నీ పట్టాభిషేక మహోత్సవం, నా పురుషకార బలంతో సరిద్దిద్దగా, లోకులందరూ, పురుషకారంతో దైవతంత్రం బలహీనమై, చెడిపోవుట చూసి, దైవం కంటే పురుషకారమే బలమైందని అనుకునేట్లు చేస్తాను. మదించిన మదపుటేనుగు అంకుశాల దెబ్బలను లక్ష్యపెట్టకుండా, సంకెళ్లు తెంచుకుని, మీదమీదకు పరుగెత్తి వస్తుంటే, దాన్ని మరలించిన విధంగా, బలవంతమైన పౌరుషం సహాయంగా దైవాన్ని మరలిస్తాను. ఓపిగ్గా చూడు. నా అభిప్రాయాన్ని అంగీకరించు. ఉన్నదున్నట్లుగా చూడు. అన్నా! నీ పట్టాభిషేకాన్ని చెడగొట్టేందుకు అష్ట దిక్పాలకులు సైన్యంతో ఎదిరించి నిల్చినా వారు నాకొక లెక్క కాదు. అన్ని లోకాలలోని వారంతా ఏకమైనా నన్నుఢీ కొన్నా వారి వలనా కాదు. ఇక తండ్రి ఎదిరిస్తే అదొక లెక్కా? ఆయనే కనుక యుద్ధానికి వస్తే....నీ బదులు ఆయనను పద్నాలుగేండ్లు అడవిలో వుండడానికి పంపిస్తాను. అభిషేకం నీకు చేయకుండా వారి కొడుకుకు రాజ్యమీయడానికి చూస్తున్న దశరథుడికి, కైకేయికి, వారి ఆశలు నాశనం చేసి, పడరాని పాట్లు పడేట్లు చేస్తాను. కమలనయనా! శత్రువులకు నా భయంకర పౌరుషం ఎలా దుఃఖం కలిగిస్తుందో, అలా వారికి దైవం సుఖం కలిగించలేదు. అన్నా! భరతుడికి రాజ్యం ఎప్పుడైనా ఎలా వస్తుంది? నువ్వు అరణ్యానికి పోవాల్సిన సమయమా ఇది? నువ్వు వేలాది సంవత్సరాలు పాలించి అడవికి పోతే, అప్పుడు కూడా నీ కొడుకులు కదా పాలించాల్సింది? పూర్వం రాజులిలానే చేశారు కదా? కొడుకులను రాజ్యం ఏలుకొమ్మని చెప్పి కదా వారు అడవులకు పోయింది? వానప్రస్థులైంది? ఇవేవీ లేకుండా నువ్వెలా అడవులకు పోతావు? అన్నా! నీకు మరో సందేహం రావచ్చు. నువ్వు పట్టాభిషేకం చేసుకుంటే స్థిర బుద్ధి లేని రాజు, తనవారికి రాజ్యం దక్కలేకపోయింది కదా అని, రాజ్యాన్ని అల్లకల్లోలం చేస్తాడేమోనని! ఆ సందేహంతో రాజ్యభారం పూనడానికి ఇష్ట పడకపోతే....నేను ప్రమాణం చేసి చెప్తున్నాను....రాజ్యం ఏ మాత్రం చెడకుండా, సముద్రాన్ని చెలియలికట్ట నిలిపినట్లు నేను నిలుపుతాను.

అలా చేయలేకపోతే, నా వీర లోకాలు నశించి పోతాయి. రామచంద్రా! శుభకరంగా అభిషేకానికి అంగీకరించు. దాని మీద మనసు పోనియ్యి. మనలను విరోధించే రాజులందరినీ, నా బలంతో, నేనొక్కడినే నిరోధిస్తాను. నువ్వు పూరికే చూస్తుండు".

"అన్నా! నా రెండు భుజాలు దేహానికి అందమివ్వడానికి కాదు. విల్లు నాకు అలంకారం కోసం కాదు. ఖడ్గం వీరాలంకారంగా నడుంలో దోపుకోడానికి కాదు. ఇవెందుకంటే...యుద్ధంలో శత్రు సమూహాలను ఛిన్నాభిన్నం చేసి, కండకండలుగా-తునాతునకలుగా నరికేందుకు తెలుసా? నా విరోధెవరైనా సరే...వాడు ప్రాణాలతో వుండడం సహించలేను. అలాంటివాడు ఇంద్రుడైనా సరే...అమితమైన కాంతిగల, మెరుపులా కదిలే కాంతివంతమైన నా ఖడ్గంతో ఖండిస్తాను. అంతే కాని ఏదో దూరం నుండి బాణాలు వేసి కాదు. ఏనుగులను, మనుష్యులను, గుర్రాలను....వాటి తొండాలను, చేతులను, శిరాలను కుప్పకుప్పలుగా భూమంతా వ్యాపించేట్లు, మనుష్యులెవరూ లోపటికి చొరబడడానికి సాధ్యపడని విధంగా శత్రువులను నాశనం చేస్తాను. పదునైన నా కత్తి చీల్చడం వల్ల ఏనుగులు కొండల్లాగా, మేఘాల్లాగా కూలిపోతాయి. నా వేళ్లకు రక్షణకవచంగా ఉడుం తోలుతో చేయబడిన వాటిని తొడుక్కొని, పెద్ద విల్లు ధరించి, యుద్ధ భూమిలో నిలుస్తే, తాను శూరుడనని నన్నెదిరించి, నా ఎదుట నిల్వబడగల ధైర్యం కలవాడు భూమండలలో ఎవరైనా వున్నాడా? కొందరిని ఎక్కువ బాణాలతో, మరికొందరినెందరినో ఒక్క బాణంతో, కొట్టి, పగవారిని పీనుగుపెంటల్లాగా చేయనా? వారి గుర్రాలను, ఏనుగులను, రథాలను చెక్కలు-ముక్కలు చేయనా? అన్నా! పరిమితులెరుగని నా అస్త్ర బలాన్ని చూడు. ఇప్పుడే...ఈ క్షణంలోనే...దశరథుడి ప్రభుత్వాన్ని తప్పించి నీకే అర్పించగలను. గంధం పూతతో అందంగా, చక్కటి భుజకీర్తులు కలవై, దానాలు చేయడం వల్ల ఐశ్వర్యం కలవై, స్నేహితులను రక్షించే సంతోష గుణం కలవైన, నా భుజదండాలు, నీ పట్టాభిషేకం జరక్కుండా అడ్డం తగిలేవారిని చెదరగొట్టి కలవరపడేట్లు చేస్తాయి. ఏదేమైనా...రామచంద్రా! నేను నీ సేవకుడను. నీ ఆజ్ఞ ప్రకారం నడుచుకోవాల్సిన వాడినే కాని, స్వతంత్రించి ఏ కార్యం చేసే యోగ్యత నాకు లేదు. నువ్వు ఆజ్ఞాపించినది చేయడమే నా కర్తవ్యం. కాబట్టి,

ఏ విధంగా రాజ్యం లభిస్తుందో నువ్వే చెప్పు. నీ ఇష్ట ప్రకారం ప్రవర్తిస్తున్నప్పుడు ఎవడు దానికి అడ్డం వస్తాడో, ఆ విరోధిని ప్రాణాలతో బతకనీయను. నీ ఆజ్ఞ కొరకు వేచి వున్నాను".

కైకేయీ దశరథుల ఇష్టానుసారం తాను అరణ్యానికి పోతానని, శ్రీరామచంద్రమూర్తి కౌసల్యతో అన్నప్పుడు లక్ష్మణుడు ఆయన అలా చేయడం సరైంది కాదన్నాడు. రాముడికి రాజ్యం రాకుండా చేయడానికి వారు కుట్ర పన్నారని, వంచకుల వంచన ఫలించకుండా చేయాలని, ఆయన అడవులకు పోరాదని లక్ష్మణుడు చెప్పాడు. కైకేయిని దూషించవద్దని లక్ష్మణుడితో రాముడంటాడు. రాజ్యాభిషేక విఘ్నం ఆమె చేసింది కాదని, దైవకృతం అని, ఆమె నిమిత్త మాత్రమే అని, ఆమె మీద కోప పడవద్దని, దైవమే మేలు-కీలుకు కారణం అని, ఆమెకు ఆ బుద్ధి కలిగించింది దైవమే అని, అలా కాకుంటే తన మీద ఎంతో ప్రేమ కలిగిన ఆమెకు నిమిషాల్లో విషమ బుద్ధి ఎందుకు కలిగిందని, దైవం అప్రతిహతమని, అలాంటి దైవంతో ఎవరు పోరగలరని, రాముడు సమాధానం చెప్పాడు. బదులుగా లక్ష్మణుడు...రాముడు చెప్పింది సరైంది కాదని, దైవం పరాధీనమైందని, అది స్వతంత్రించి ఏ పనీ చేయలేదని, అలాంటి దాన్ని నమ్ముకుని, దైవం ఇస్తుందని పురుష ప్రయత్నం చేయకుండా వుండడం సరికాదని అంటాడు. దైవం కంటే పౌరుషమే శ్రేష్టమని లక్ష్మణుడు వాదించాడు. మహాభారతంలో చెప్పినట్లు, లోకం దైవాన్ని ఆలంబనంగా తీసుకుని పురుషకారంలో ఉదాసీనులు కాకూడదు. మనుష్యుడు చేయాల్సిన కర్మం చేయకుండా దైవమే ఇస్తాడని భావించకూడదు. ఇలాంటి మాటలు చూస్తుంటే, దైవం కంటే పౌరుషం బలమని అనిపిస్తుంది. రాముడు దైవమే బలిష్టమని అన్నాడు. దైవ-పౌరుషాలకు పరస్పర విరోధం కనిపిస్తున్నది. ఇదెలా అంటే....పురుషకారం లేకుండా దైవం ఏ కార్యం చేయలేదు...అలానే, దైవ సహాయం లేకుండా ఏ కార్యం ఫలించదు. కాబట్టి ఏదైనా ఫలితం కావాలంటే రెండూ అవసరమే! ఇదిలా వుంటే...రామచంద్రమూర్తి ఎందుకు పురుషకారానికి అనమతి ఇవ్వలేదు? ఆయన అభిప్రాయం ప్రకారం...పురుష ప్రయత్నం వ్యర్థం...దైవమే కార్యసాదకం. నిజంగా అలాంటి అభిప్రాయమే ఆయనకుంటే, సీతకొరకై పురుషకారం చేసి వుండేవాడు కాదు. దైవమే సీతను తెచ్చి ఇస్తుందని

వూరకే వుండేవాడు. ధర్మ విరుద్ధ పురుషకారం శ్రీరాముడికి సమ్మతం కాదు. లక్ష్మణుడి పురుషకారానికి ప్రథమ కబళం దశరథుడు. రాజ్యం కోసం తండ్రిని పీడించిన వాడవుతాడు. అందుకే రాముడొప్పుకోలేదు. రాముడు పురుషకార విరోధి కాదు. అలానే, అన్న అరణ్యాలకు పోయి కష్టపడడం ఇష్టం లేక, ఎలాగైనా అయోధ్యలోనే ఆయన వుండేట్లు చేయడానికి సద్భావంతో లక్ష్మణుడు రాముడితో వాదించాడే కాని ఆయన దైవ విరోధి కాదు. అలాంటప్పుడు లక్ష్మణ వాదన సాధువాదమా? దుర్వాదమా? అని విచారించాలి).

(వంశ సంప్రదాయాన్ని బట్టి, శాస్త్ర మర్యాదను బట్టి, శ్రీరామచంద్రమూర్తి జ్యేష్ఠుడైనందున రాజ్యం ఆయనకే దక్కాలి. అలా కాదనే అధికారం దశరథుడికి లేదు. రాజ్యం దశరథుడి స్వార్జితం కాదు....పిత్రార్జితం. తన ఇష్టప్రకారం ఉ పయోగించుకోవడం అంటే వంశ మర్యాద ఉల్లంఘించడమే! ఇంట్లోని వస్త్రాభరణాల లాగా రాజ్యం దశరథుడి సొంత ఆస్తి కాదు. రాజ్యపాలన కొరకు రాజులేర్పడ్డారు కాని, రాజుల కొరకు రాజ్యాలు పుట్ట లేదు. కాబట్టి కొత్త రాజు ఎంపికకు ప్రజల సమ్మతి ఆవశ్యం. అది శ్రీరాముడికే అనుకూలంగా వుందనేది నిరూపితమైంది. ప్రజలు సమ్మతించినవాడే రాజు. దానికి విరుద్ధంగా చేసే అధికారం దశరథుడికి లేదు. శ్రీరాముడికి రాజ్యం దక్కకుండా చేయడం అంటే, లేని అధికారాన్ని నెత్తిమీద పెట్టుకోవడమే. న్యాయంగా రావాల్సిన రాజ్యం రానప్పుడు పరాక్రమంతో దాన్నిని రాబట్టుకునే ప్రయత్నం చేద్దామని లక్ష్మణుడు అనడం ధర్మ విరుద్ధం కాదు. యుద్ధం చేసినా, అది, దర్మ యుద్ధం అవుతుంది కాని అధర్మ యుద్ధం కాదు. దశరథుడు కైకను పెళ్లి చేసుకునేటప్పుడు రాజ్యాన్నిస్తానని మాట ఇచ్చాడు కదా అనవచ్చు. నూరు అబద్ధాలాడి ఒక పెళ్లి చేయాలి అన్న సామెత ఇక్కడ గుర్తుచేసుకోవాలి. శాస్త్ర ప్రకారం జ్యేష్ఠుడైన రాముడికి రాజ్యం రావాలి కాబట్టి, శాస్త్ర విరుద్ధమైన దానం దానం కాదు. కౌసల్యకు పుత్రులు కలగరని నమ్మి కైకను పెళ్లి చేసుకున్నాడు...రాజ్యం ఇస్తానన్నాడు. అలానే యుద్ధకాలంనాటి కైకకు ఇచ్చిన వరాలు. ఇది గ్రాహ్యం కాదు. మగడిని బతికించుకోవడం సతి ధర్మం. కైక తన మాంగల్యానికై చేసింది కాని లోకోపకారానికి చేయలేదు. తనది కానిది వరాలుగా దశరథుడు ఎలా

ఇస్తాడు? తన సొంత సొత్తులాగా రాజ్యాన్ని యదేచ్ఛగా భరతుడికి ఇచ్చే అధికారం దశరథుడికి లేదు. ఏ విధంగా చూసినా దశరథుడు చేసింది సరైంది కాదు).

(అలా ఐతే స్వధర్మ నిర్వహణ దీక్ష పూనిన శ్రీరామచంద్రమూర్తి శాస్త్ర ప్రకారం తనకు రావాల్సిన రాజ్యాన్ని రాబట్టుకుని క్షాత్ర ధర్మన్ని పాటించాలి కాని, స్వధర్మాన్ని విడిచి పర ధర్మమైన వాన ప్రస్తాశ్రమానికి ఎందుకు అంగీకరించాడు? శ్రీరాముడి దృష్టిపథం వేరు. ఆయన వాదం వేరు. ఆయనకు రాజ్యం కావాలని కాని, వద్దని కాని, అభినివేశం కలవాడు కాదు. రాజ్యతంత్ర దృష్టితో లక్ష్మణుడు చూశాడు. గృహధర్మ దృష్టితో శ్రీరాముడు చూశాడు. కాబట్టి ఇరువురికి దృష్టి భేదం వుంది. తండ్రి జీవించి వున్నప్పుడు ఆయన ఆజ్ఞ పాటించడం కుమారుడి విధి. ఆయన ఆజ్ఞ అనుల్లంఘనీయం. అందుకే...రామా పట్టాభిషేకం చేసుకో అంటే సరే అన్నాడు...అడవులకు పొమ్మంటే దానికీ ఒప్పుకున్నాడు. ఇదే కొడుకు అనుసరించాల్సిన స్వధర్మం. తండ్రి ఇచ్చినది తీసుకోవడం పుత్ర ధర్మం కాని ధనదాసుడై తండ్రితో, తమ్ములతో కలహించడం పుత్ర ధర్మం కాదు. శ్రీరాముడి నిశ్చయం పితృవాక్య పాలన మాత్రమే).

ఈ విధంగా చెప్తున్న తమ్ముడు లక్ష్మణుడిని చూసి, ఆయన కళ్ల నుండి కారుతున్న కన్నీళ్లను తన చేత్తో మెల్లగా తుడిచాడు రాముడు. ఊరడించాడు ఆయనను. ప్రేమతో ఇలా అన్నాడు: "నాయనా! జనకుడి ఆజ్ఞ ప్రకారం నడుచుకోవడమే ఉత్తమం. అదే మంచి మార్గం. తండ్రి జీవించి వుండగా ఆయన చెప్పినట్లు చేయాలి. మరణించిన తరువాత ప్రతి సంవత్సరం చనిపోయిన రోజున విస్తారంగా అన్న దానం చేసి, గయలో పిండం పెట్టాలి. అప్పుడే కొడుకు నిజమైన కొడుకవుతాడు. అలాంటి వాడిలో పుత్ర శబ్దం సార్థకం. కాబట్టి అలాంటి మంచి మార్గం నుండి తొలగలేను. మంచి నీతిమార్గాన్ని అనుసరించడమే నాకు సంతోషకరమైన కార్యం. ఇదే నా అభిప్రాయం".

❖ ❖ ❖

సర్గ-24

శ్రీరాముడి నిశ్చయం తెలుసుకుని బాధపడ్డ కౌసల్య

తండ్రి ఆజ్ఞ పాలించాలని నిశ్చయించుకున్న కొడుకు శ్రీరాముడిని చూసి, సాధ్వి చరిత్ర కలిగిన కౌసల్యాదేవి కన్నీళ్లు కారుతుండగా, చక్కని ధర్మ మార్గంలో నడవాలనుకున్న శ్రీరామచంద్రమూర్తి ముఖకమలాలను పుత్ర వ్యామోఃఅంతో చూసి ఇలా అంది:

"ఈ రామచంద్రుడికి ఇంతవరకు కష్టమంటే ఏంటో తెలియదు. ధర్మమే తన సంపదని భావిస్తున్నాడు. సమస్త భూతాలకు ఎప్పుడెప్పుడు ఏం మేలు చేయాలన్న ఆలోచనతోనే వుంటాడు. ఉత్తమ స్త్రీ ఐన నాకు, దశరథుడు లాంటి చక్రవర్తికి కొడుకైనాడు. పరాక్రమవంతులలో గొప్పవాడు. గొప్ప కీర్తిని సంపాదించాడు. ఇలాంటివాడు కారడవులకు పోయి ఆకలి తీర్చుకోవడానికి, తెచ్చిచ్చేవారెవరూ లేకపోతే తానే ఒక్కొక్క వరిగింజ ఏరుకుని, ఎలా తినగలడు? కష్టాలనెలా సహించగలడు? తన పరిచారకులు, దాసులు, ఇక్కడ ఇళ్లల్లో వుండి తమకు ఇష్టమైన, రుచికరమైన పదార్థాలు, పిండివంటలు, అన్నం హాయిగా తింటుంటే, స్వామైన రాముడు అడవులలో కందమూలాలు తిని కడుపు నింపుకోవాల్సిందేనా? దయాపాత్రుడై, అందరిపైనా దయ చూపించడం వల్ల ఇతరులకు దయనీయుడై, సుగుణాలే ఆభరణాలుగా కలవాడై, ఆ సంపదతో రమించువాడై, త్రిలోక సుందరుడై, కాంతి సంపన్నుడైన శ్రీరాముడిని అడవులకు పంపుతున్న దశరథ రాజు చరిత్ర వినిన నరుడెవ్వడు కూడా రాజువలన భయపడడా? నిష్కారణంగా నిరపరాధిని, కన్న కొడుకును, దేశం వెడలగొట్టి, అడవులపాలు చేసిన వాడు మనల్ని కూడా ఎప్పుడేమి చేస్తాడో అని జనులు భయపడరా? రామా! లోకాభిరాముడవైన నిన్నే ఈ విధంగా అడవికి పోయేట్లు చేయడమంటే, లోకంలో దైవమే దేనికైనా ఘటించే ప్రబల శక్తి అనుకోవాలి".

(రామాయణంలో సీతారామలక్ష్మణుల చరిత్ర వల్ల, వారి మాటల వల్ల, బోధ పడేదేంటంటే...పౌరుషం కంటే దైవమే ప్రబలం కాబట్టి, దైవాన్నే సేవించాలనే విషయం. భారతంలో కూడా ఇదే చెప్పబడింది. కాబట్టి మనుష్యులు

దైవాన్ని ధిక్కరించి పౌరుషాన్నే ఆశ్రయించక దైవాన్ని ఆశ్రయించి, యథాశక్తి, యథాశాస్త్రం ప్రకారం, నిష్కాములై స్వకర్మలు చేయాలి. రామాయణంలో మనం నేర్చుకోవాల్సిన ముఖ్య విషయం ఇదే. భగవద్గీతోపదేశం కూడా ఇదే. సన్యాసులై పరపిండ నిరతులు కమ్మని కాదు).

శ్రీరాముడు వనవాసం చేయడానికి నిశ్చయించుకున్నాడని తెలిసి, ఆయనను పోవద్దని చెప్పడం వృధా అని భావించి, తనను కూడా అడవికి తీసుకొని పొమ్మని కౌసల్య అడుగుతుంది రాముడినిలా: "నాయనా! శోకమనే అగ్ని, నా ఉదరంలో, ఛాతీలో పుట్టి, నువ్వు కనబడవనే గాలివల్ల విజృంభించి, దుఃఖమనే కట్టెల వల్ల పెరిగిపోయి, కన్నీళ్లనే ఆజ్యాహుతలతో వ్యాపించి, వ్యసనమనే పొగతో కూడి, నిట్టూర్పులనే పురుష ప్రయత్నం వల్ల మరింత అభివృద్ధి చెంది, నిప్పును నీళ్లతో చల్లార్చగలిగే నా ఈ శోకాగ్నిని చల్లార్చే శక్తిగల నువ్వు లేని కారణాన, ఎండాకాలంలో ఎండిన పొదల గుంపులను కాల్చే కార్చిచ్చులాగా నన్ను భస్మం చేయదా? కాబట్టి దూడ వెంట పొయ్యే ఆవులాగా నేను నీ వెంటనే వస్తాను. తండ్రీ నన్ను వెంటపెట్టుకుని వెళ్లు." ఇలా అంటున్న తల్లితో రాముడు భర్తను విడిచి తన వెంట రావడం సరైంది కాదని చెప్పాడిలా.

భార్యలు భర్తలను విడిచి పోగూడదని కౌసల్యకు చెప్పిన శ్రీరాముడు

"తల్లీ! నువ్వు నా వెంట వస్తానంటున్నావు కదా? అలాంటప్పుడు దశరథుడి సంగతేంటి? ఆయన్ను కైక మోసం చేసి దుఃఖ పెట్టున్నది. ఇంకేం చేస్తుందో చెప్పలేం. ఆయన ముఖ్యంగా సహాయపడేది మన ఇద్దరమే. నేనేమో అడవికి పోతున్నాను. నువ్వొక్కదానివైనా దగ్గర లేకపోతే, తండ్రి ఎలా బతుకుతాడు? ఆయనను చూసుకునేవారెవరు? నేనొక్కదాన్ని లేకపోతే ఏంటి? ఆయనకు వందలాది మంది భార్యలున్నారు కదా...వారందరూ ఆయన్ను చూసుకోరా? అంటావేమో! చూసే వారున్నా, లేకపోయినా, నీ కర్తవ్యం నువ్వు నెరవేర్చాలికదా? భర్తను విడిచి పోయ్యే స్త్రీలు భ్రష్టులే కదా! దుష్ట స్త్రీల నడవడి పతివ్రతైన నువ్వు

మనసులో కూడా అనుకోకూడదు కదా! అనుకోనప్పుడు చేయడం ఎలా సాధ్యమవుతుంది? నా తల్లివైన నువ్వు అలా చేయకూడదు. నీ వల్ల నాకు అపకీర్తి వస్తుంది. మా తండ్రి ఎంతవరకు జీవించి వుంటాడో అంతవరకు నువ్వు ఆయనకు శుశ్రూష చేస్తూ, అందులో ఏ లోపం లేకుండా చూసుకోవాలి. ఇంకా చేసే వారున్నప్పటికీ నీకు ఆ భారం తప్పదు. ఇది సనాతన ధర్మం" అన్న రాముడి మాటలు విన్న కౌసల్య, పుణ్యకార్యాలను స్వభావసిద్ధంగా చేసే గుణం కలిగినందున, తాను చెప్పింది సరైంది కాదని, తన కొడుకు చెప్పిన మాటలే ధర్మమని అనుకుంటూ, ఆయన ధర్మ బుద్ధికి సంతోషపడింది. ఇంత చెప్పినా, ఇంకా దుఃఖాన్ని ఆపుకోకుండా బాధపడే తల్లిని అనునయిస్తూ, వినయంగా-నయంగా శ్రీరామచంద్రమూర్తి ఇంతవరకు చెప్పినదాన్నే మళ్లీ వివరంగా చెప్పడం ప్రారంభించాడిలా.

"అమ్మా! మా తండ్రి ప్రజలందరికీ గురువు, భర్త, అధిపతి అవుతాడు కదా! అలాంటి వాని ఆజ్ఞ ప్రకారం నడుచుకోవడం నీకూ అవసరమే కదా! నేను దండకారణ్యానికి పోయి, అక్కడ పద్నాలుగేళ్లు వుండి వచ్చిన తరువాత నీ ఆజ్ఞ ప్రకారం నడుచుకుంటాను". అని చెప్పిన రాముడి మాటలువిన్న కౌసల్య, కన్నీళ్లు ముఖమంతా కారుతుంటే, తన ముద్దుల కొడుకును చూసి, పుత్ర మోహంతో, శోకంతో మాటలు తడబడుతుంటే దీనంగా ఇలా అన్నది రాముడితో. "తండ్రి మాట ప్రకారం నువ్వు అడవులకు పోవడానికి అంగీకరిస్తే, సవతుల మధ్య, తలా ఒక మాట అంటుంటే, ఎలా వుండాలి? కాబట్టి దయచేసి నన్ను నీ వెంట తీసుకుని పో. జన సంచారం లేని అడవుల్లో ఆడ జింక లాగా తిరుగుతాను".

(భర్తను వదిలి అడవులకు పోవడం సరైంది కాదనే విషయం తెలిసికూడా పుత్ర మోహంతో బాధపడే తల్లిని చూసి, ఆమెకు కలిగిన దుఃఖానికి ఒకవైపు తానూ బాధపడుతూనే, మరో వైపు కన్న తల్లికి ధర్మం సంపూర్ణంగా చెప్పాలనుకుంటాడు రాముడు. ఇంతవరకు రాముడు, తాను కూడా దుఃఖపడితే, వ్రత భంగం అవుతుందని నిబ్బరించుకున్నాడు. తన వనవాసానికి ఇప్పుడు తల్లి అంగీకరించిందన్న నమ్మకం కుదిరింది. కాబట్టి ఆమె దుఃఖం చూసి

అతడు కూడా దుఃఖపడ్డాడు. శ్రీరాముడి దుఃఖానికి కరుణ కారణం...కౌసల్య దుఃఖానికి మోహం కారణం. రెండూ చూడడానికి ఒకే విధంగా వున్నప్పటికీ, భావంలో తేడా వుంది).

రాముడు తల్లితో ఇలా అంటాడు: "స్త్రీలకు ప్రాణం వున్నంతవరకు భర్తే ప్రభువు. భర్తే దైవం. నిన్ను శాసించేవాడు రాజే. ఆయన జీవించి వుండగా నువ్వు అనాధవు ఎలా అవుతావు? భయం వదిలిపెట్టి శాంతించు. బాల్యంలో స్త్రీ తండ్రి ఆజ్ఞలో, యౌవనంలో పెళ్ళి చేసుకున్న తరువాత భర్త ఆజ్ఞలో, అతడు మరణించిన తరువాత కొడుకు వశంలో వుండాలి. స్వతంత్రంగా ఎప్పుడూ వుండ కూడదు. కైక పగబట్టింది కదా? ఆమె కొడుకు రాజై నిన్ను బాధించుతాడని కదా నీ భయం? నీ భయానికి కారణం లేదు. ఎందుకంటే, భరతుడు ధర్మాత్ముడు. దయగలవాడు. ఎవరినీ చెడు మాటలనడు. అలాంటప్పుడు నిన్నూ ఏమనడు. నువ్వు తల్లివని నీ మీద ఎక్కువ భక్తితో వుంటాడు. గురువాక్యం మీర కూడదని అనుకుంటాడు. నువ్వు సందేహపడాల్సిన పని లేదు. నువ్వు సదాచార సంపన్నవని లోకులందరూ నిన్ను స్తోత్రం చేస్తుంటే, దానికి నువ్వు భగం కలిగించకూడదు. నేను అడవికి పోగానే పుత్ర శోకంతో, బలం లేని ముసలి రాజు, దుఃఖంతో ప్రాణాలు పోగొట్టుకుంటాడేమోనని భయపడుతున్నాను. అందుకే, తండ్రి మనస్సు కష్టపడకుండా, ఆయన ప్రమాదంలో పడకుండా, ప్రేమతో ఆయనను సేవించు. నన్ను అడవులకు పంపాడని ఆయనపై కోప్పడవద్దు. ఆయనకు ప్రమాదం తేవద్దు. కాముకుడై, సవతి మాటలకు మోసపోయి, నిన్ను దుఃఖపెట్టాడని, నీ కొడుకును అడవుల పాలు చేశాడని. అలాంటి వాడిని భర్తైనా సరే ఎందుకు సేవించాలని అనకూడదు. పెద్దవారికి నమస్కరించక పోయినా, దేవతలను పూజించకపోయినా పరవాలేదు కాని భార్య పతిసేవ మానకూడదు. అదొక్కటే సద్గతులు కలిగిస్తుంది. ఎన్ని వ్రతాలు ఎంత నియమనిష్టలతో చేసినా, పతిని సేవించని భార్య నరకానికి పోతుంది. పతిసేవకు అదనంగా దేవతా పూజలుండవచ్చు కాని, అది లేకుండా కేవలం దేవతా పూజ నిష్ప్రయోజనమే. అలాంటి భార్యను ఏ దేవతలు కూడా కాపాడలేరు. సతులకు పతి సేవ, పతి ఆజ్ఞతో దైవ సేవ శ్రేయస్కరం. రెండు చేయడానికి వీలు కాకపోతే దైవ సేవ వదిలి పతి సేవ చేయాలి. పతి లేని స్త్రీకి మాత్రం దైవ సేవ,

బ్రహ్మచర్యం, వ్రతనిష్ట అనివార్యాలు. స్త్రీల గురించి నాకేం తెలుసని అంటావేమో? ఇవన్నీ నేను కల్పించి చెప్పడం లేదు. వేదాలలో, వేదార్థాలు వివరించే స్మృతులలో, పూర్వాచారాలలో, భార్య భర్తకు హితమైన నడవడికలదానిగా వుండాలని, సేవించాలని చెప్పడం జరిగింది. భర్త పోయి సవతి ఇంటిలో కూర్చుని వుంటే, ఏం చేయాలంటావా? పతి సేవ లభించలేదని ఆయనను వదిలి దేశం మీద పోరాదు. పతి దేశాలు వదిలి పోయినప్పటికీ, లోకమే వదిలి పెట్టినప్పటికీ, సతి తన ధర్మాన్ని వదిలిపెట్ట కూడదు. ఇంట్లోనే వుండి ఆయనకు యశస్కరం, శ్రేయస్కరం ఐన పనులను చేయాలి. కాబట్టి నువ్విక్కడే వుండి, నా మేలు కోరి, భక్తితో హోమాలు చేయించు. దేవతలను ధ్యానించు. బ్రాహ్మణ పూజలు చేయి. దానివల్ల నాకూ మంచి జరుగుతుంది. నేను వనవాసం పూర్తి చేసుకుని తిరిగొచ్చేసరికి తండ్రి సుఖంగా బతికుంటే, నీ మనస్సుకు ఇప్పటికంటే, నా పట్టాభిషేకాని కంటే ఎక్కువ సంతోషం కలుగుతుంది".

(కౌసల్యతో చెప్పినప్పుడల్లా మళ్లీ వచ్చి ఆమెను చూస్తానంటాడు శ్రీరాముడు. తండ్రి దశరథుడితో మళ్ళీ చూస్తానని అనడు. ఆయన అంత వరకు బతకడని రాముడి నమ్మకం. సాధారణంగా బిడ్డలపై తండ్రికంటే తల్లికే ఎక్కువ ప్రేమ. అలాంటప్పుడు పుత్ర శోకంతో దశరథుడు ఎందుకు చనిపోయాడు? కౌసల్య ఎలా సహించి జీవించి వుంది? ఇది సామాన్య విషయమే ఐనప్పటికీ, దశరథుడి చావుకు బలమైన కారణం వానప్రస్థ శాపం అనుకోవాలి).

వనవాసానికి శ్రీరాముడు పోవడానికి ఇష్టపడ్డ కౌసల్య

ఇలా చెపుతున్న కొడుకును చూసి కౌసల్య..."నాయనా! నీ మనసును మార్చలేకపోతున్నాను. కాలాన్ని జయించడం ఎవరి వశం" అంటుంది. (ఇక్కడ చెప్పిన "కాలం", లోగడ రాముడు చెప్పిన "దైవం" పర్యాయ పదాలే. ఈ అర్థంతోనే "విధి" అనే పదాన్ని కూడా రామాయణంలో ఉపయోగించడం జరిగింది). ఇంకా ఇలా అంటుంది...."తండ్రీ! నీ మనసు నేను మార్చలేక పోయాను. కాబట్టి జాగ్రత్తగా పోయి రా. నీకు అన్నివేళలా శుభం కలగాలి. నువ్వు తిరిగొచ్చిన తరువాత నా దుఃఖం పోయి సంతోషిస్తాను. అంతవరకు

ఇలా ఏడుస్తూ ఉండాల్సిందే. తండ్రి కొరకు నువ్వు పూనిన వ్రతం పూర్తి చేసి, కృతకృత్యుడవై, తిరిగి రాగానే నిన్ను చూసి ఓ మహానుభావా! సుఖపడతాను. అప్పటి దాకా ఎలాగో అలాగ ప్రాణాలు పోకుండా బిగబట్టుకుంటాను. నా మీద నీకెంతో భక్తి-విశ్వాసాలున్నాయి. ఎప్పుడూ నేను చెప్పినదాన్ని నువ్వు కాదనలేదు. అలాంటి నువ్వు నా మాట కాదనేట్లు ఆ మాయల మారి దైవం నీ మనసును కఠినం చేశాడు కదా! దైవం అద్భుత శక్తిని ఎవరు తెలుసుకోగలరు? కుమారా! పోయి రా. ఇలా పోయి అలా వచ్చే లోపున పద్నాలుగేళ్లు తొందరగా గడిచి పోయేట్లు సుఖంగా తిరిగి రా. వచ్చిన తరువాత, నువ్వు వనవాసానికి పోయి వచ్చిన శుభవార్త సంగతులన్నీ, తియ్యని మాటలతో చెప్పి నన్ను సంతోషపడేట్లు చేయి. జడలు ధరించి, నార చీరెలు కట్టి, శుభంగా అడవికి పోయి రా. నీకు శుభం కలగాలి".

❖ ❖ ❖

సర్గ-25

శ్రీరాముడిని ఆశీర్వదించిన కౌసల్య

కన్నీళ్లు కార్చడం, కారిన కన్నీళ్లను తాకడం, తుడవడం అపరిశుద్ధం కాబట్టి, ఇంతవరకు దుఃఖంతో కన్నీళ్లు కార్చిన కౌసల్య, పరిశుద్ధం కావడానికి ఆచమనం చేసింది. పతివ్రతా శిరోమణి ఐన కౌసల్య ఆ తరువాత రాముడుకి శుభకరమైన దీవెనలివ్వడం ప్రారంభించింది. దీవెనలిస్తూ....."నాయనా! నిన్ను అరణ్యాని పోకుండా ఆపడం సాధ్యం కాదు. రఘువంశ రత్నమా! పోయి కీర్తి సంపాదించి సంతోషంగా వుండు. నువ్వు మహాధైర్యంతో, స్థిర బుద్ధితో, నియమంతో, ఏ ధర్మాన్నైతే రక్షిస్తున్నావో, 'ధర్మో రక్షతి రక్షిత' అన్న సామెత ప్రకారం, అదే ధర్మం నిన్ను ఎల్ల వేళల రక్షించాలి. దేవాలయాల్లో, నాలు బాటలు కలిసే ప్రదేశాల్లో, నీతో మొక్కులు పొందుతున్న ఆ మహాదేవతలందరూ, ఋషులతో సహా, అడవిలో తిరిగే నిన్ను వేయి విధాల రక్షించాలి. (దేవాలయాల్లో వుండే దేవతలనే కాకుండా వీధుల్లో, భజన మందిరాలలో, వుండే దేవతలకు కూడా శ్రీరాముడు నమస్కరించేవాడని దీనర్థం). నీ భక్తికి సంతోషించి, విశ్వామిత్రుడు నీకిచ్చిన అస్త్ర-శస్త్రాలు, మంచి గుణాలతో పవిత్రంగా వున్న నిన్ను రక్షించాలి. నువ్వు పుణ్య చరిత్ర కలవాడివైనందున ఏ మాత్రం ఇబ్బంది పడకుండా అవి నిన్ను సంతోషంగా కాపాడుతాయి. తండ్రికి సేవ చేయడం వల్ల కలిగిన ఫలం, తల్లికి సేవ చేయడం వల్ల కలిగిన ఫలం, సత్యాన్ని రక్షించడం వల్ల కలిగిన ఫలం, నీ వనవాసంలో నీకు ఆయాసం కలగకుండా రక్షించాలి. హోమానికి వాడే కట్టె పుల్లలు, దర్భలు, అగ్నిహోత్ర స్థానాలు, దేవాలయాలు, నానా రకాల పూజనీయ స్థలాలు, కొండలు, చిన్నా-పెద్దా చెట్లు, సింహాలు, పక్షులు, పాములు, మడుగులు, వీటి అధిష్ఠాన దేవతలు...అందరూ, అన్నీ నిన్ను నిర్మలమైన మనసుతో ఎల్ల వేళలా దయతో రక్షించాలి". అంటుంది కౌసల్య.

ఇంకా ఇలా అంటుంది కౌసల్య: "ప్రీతితో ఋషులు, సాధువులు, మరుద్గణాలు, విశ్వదేవతలు, విధాత ధాత యమదేవతలు, భగుడు, ఆర్యముడు,

అర్కుడు అనుసూర్యులు, ఇంద్రాది దిక్పాలకులు, ఋతువులు, పక్షాలు, మాసాలు, వీటి అధిష్ఠాన దేవతలు, రాత్రి, సంవత్సరం, పగలు, వీటి దేవతలు, మంచి ముహూర్తాలు, నీకు శుభం కలిగించాలి. స్మృతి, ధృతి, ధర్మం నీకు సుఖకరాలై రక్షించాలి. చంద్రబృహస్పతి, కుమారస్వామి, నారద సప్తర్షులు నీకు ఎల్ల వేళల సుఖాలివ్వాలి. దిక్పాలకులతో సహా దిక్కులన్నీ, నా మొక్కులను అంగీకరించి, దిక్కులేక అడవుల్లో తిరిగే నీకు దిక్కవ్వాలి. కులగిరులు, సింధునది, నధులకు అధిపతైన వరుణుడు, స్వర్గం, ఆకాశం, భూమి, తక్కిన నదులు, ఇరవై ఏడు నక్షత్రాలు, నవగ్రహాలు, రాత్రుళ్లు, పగళ్లు, రెండు సంధ్యలు, అడవిలో తిరిగే నిన్ను రక్షించాలి. ఆరు ఋతువులు, నెలలు, సంవత్స్రరాలు, కాష్ఠలు, కలలు, దేవతలు, దైత్యులు, అడవిలో ముని వేషంలో తిరిగే నిన్ను రక్షించాలి. హింసాది క్రూర కార్యాలు చేసే భయంకర పిశాచాల వల్ల, క్రూర మృగాలైన సింహ వ్యాఘ్రాల వల్ల నీకు ఏ విధమైన భయం కలగకుండా వుండాలి. కోతి, తేలు, అడవి ఈగలు, వుత్త ఈగలు, పాములు, విష పురుగులు అడవిలో తిరిగే నిన్ను ఎప్పుడూ తాకకుండా వుండాలి. సింహాలు, ఎలుగుబంట్లు, ఏనుగులు, కోరల మృగాలు, కొమ్ముల మృగాలు, ఇతర దుష్ట మృగాలు నీ దగ్గరకు రాకుండా వుండాలి. మనిషి మాంసం తినే మృగాలు కూడా నా ప్రార్థన వల్ల నీ సమీపానికి రాకుండా వుండాలి. అడవి మార్గాన నువ్వు పోతున్నప్పుడు దారులన్నీ నీకు సుఖాన్నిస్తాయి. కంటక పాషాణాదులు నీ కాలికి అడ్డం రావు. వచ్చినా బాధించవు. నీ పరాక్రమం ఫలిస్తుంది. నాయనా! రామచంద్రా! నీకు మేలు కలగాలి. నువ్వు పోయి రా!”

తన దీవెనలను కొనసాగిస్తూ కౌసల్య....”ఆకాశం, దేవతల సమూహాలు, నీ విరోధులైనా ఇప్పుడు విరోధం మానిన వారు, చంద్ర బృహస్పతులు, కుబేరుడు, సూర్యుడు, నీకు శుభం కలిగిస్తారు. అగ్ని, వాయువు, హోమ ధూమం, నువ్వు నేర్చుకున్న మంత్రాలు, భయంకరమైన అడవుల్లో నువ్వు స్నానం చేసేటప్పుడు నీకు మేలుకలించాలి. సమస్త లోకాల సంగతులు తెలిసిన వాడు, తటస్థంగా అంతా చూసేవాడు, బ్రహ్మాన్నీ, భూతాలన్నింటినీ తానొక్కడే భరించే వాడు ఐన విష్ణుమూర్తి, బ్రహ్మ ఋషులు, ఇతర దేవతలు అడవుల్లో తిరిగే నిన్ను ఎల్లప్పుడూ రక్షించాలి”....అని అంటుంది. ఈ విధంగా,

దేవతలందరినీ ఆ పుణ్యాత్మురాలు కౌసల్య, పతివ్రతా శిరోమణి, నిర్మలమైన, దోషరహితమైన పూల దండలతో, అసమానమైన చందనాదులతో, తగు విధమైన నమస్కారాలతో, పూజించింది. హోమాధికారం లేనందున, తన కుమారుడికి క్షేమం కలగాలని కోరుకుంటూ, బ్రాహ్మణుడితో, తెల్లని పూల దండలను, నేయిని, సమిధలను, తెల్ల ఆవాలను హోమంలో వేయించి, చక్కగా హోమం చేయించింది కౌసల్య. ఉపాధ్యాయుడు రోగ బాధ కలగకుండా శాస్త్రాన్ని చెప్పినట్లు, శాంతికొరకు హోమం చేసి, హోమ ప్రదేశానికి బయట, తేనె, పెరుగు, నేయి వేసి బలి ఇచ్చి, పండితులు స్వస్తి వాచనంతో శ్రీరాముడుకి అడవుల్లో మేలు కలగాలని దీవించారు. బ్రాహ్మణ శ్రేష్ఠులందరికీ, వారి వారి యోగ్యతలను బట్టి తగు రీతిలో దానాలిచ్చి, సత్కీర్తి వల్ల పవిత్రురాలైన శ్రీరాముడి తల్లి, ఇంతవరకు చేసిన మంత్రాశీర్వచనం కాకుండా, స్వయంగా దీవించడం ప్రారంభించింది.

శ్రీరాముడికి మంగళాశాసనం చేసి రక్ష కట్టిన కౌసల్య

"అన్నా! రామచంద్రా! తల్లి కష్టాన్ని పోగొట్టేందుకు గరుత్మంతుడు అమృతాన్ని తేవడానికి పోయే ముందర, ఆతడి తల్లి ఏ మంగళాశాసనాలు చేసిందో, ఆ మంగళ వాక్యాల వల్ల కలిగిన మేలే నీకూ కలగాలి. (ఇది శ్రీరాముడు కష్ట కార్యాన్ని సాధించి మళ్లీ తల్లిని సంతోషపెట్టబోతున్నాడనేందుకు సూచన). అమృతం కొరకు పాల సముద్రాన్ని దేవతలు, రాక్షసులు మథించినప్పుడు, ఇంద్రుడికి అమృతం దొరికే విధంగా, శత్రువులు నాశనమయ్యే రీతిలో అదితి ఏమని దీవించిందో, ఆ దీవెన వల్ల కలిన శుభం లాంటిదే నీకూ కలగాలి. (రాక్షస వంశ నాశనం, ఇంద్రుడికి సుధ లాగా శ్రీరాముడికి సీత లభించడం ఇక్కడ సూచించడం జరిగింది). విష్ణువు వామనావతారంలో బలిని మూడడుగుల నేల కావాలని అడిగి, ఆయన ఇవ్వగా, మూడడుగులతో లోకమంతా కొలిచి ఆక్రమించినపుడు ఏ శుభం కలిగిందో ఆ శుభమే నీకూ కలగాలి. (దీనివల్ల శ్రీరాముడు తిరిగొచ్చి సార్వభౌముడవుతాడని అర్థం). ఋతువులు, సముద్రాలు, ద్వీపాలు, వేదాలు, లోకాలు, దిక్కులు....ఇలా శుభకరాలైనవన్నీ నిన్ను శుభవంతుడిగా చేయాలి."

ఇలా దీవించి మిగిలిన అక్షింతలను శ్రీరాముడి తలపై వుంచి, మిగిలన గంధాన్ని పూసి, ఫలం ఇచ్చే మూలికలతో–విశల్యకరణితో రక్షగా కట్టి, మంత్రాలు చదివి, లోపల దుఃఖం వున్నా పైకి కనిపించకుండా సంతోషంగా, శ్రీరాముడి శిరస్సు వాసన చూసింది కౌసల్య. ప్రేమతో కౌగలించుకుంది. మాట తడబడుతుంటే... "పోయిరా! కుమారా!" అంది. "వనవాసం పూర్తి చేసుకుని, ఋణవిముక్తుడవై, చేయాల్సిన పనులన్నీ (రావణ వధ లాంటివి) చేసి, తిరిగి అయోధ్యకు వచ్చి రాజ్యమేలే నిన్ను కళ్లారా చూస్తాను" అంది.

ఇంకా ఇలా అంటుంది: "దుఃఖాలు సమసిపోగా, ఇష్టం కలుగగా, ముఖం ఆనందంతో వికసించగా, అడవులలోని కష్టాలు తొలగిపోయి వస్తున్న నిన్ను ఉదయించే చంద్రుడిని చూసినట్లు చూస్తాను. వనవాసం ముగించుకుని, రాజాజ్ఞ నెరవేర్చుకుని, శత్రువులు కూడా నమస్కరిస్తుంటే, సింహాసనం మీద కూర్చున్న నిన్ను నేను చూడాలి. నీవలా వచ్చి, శుభకరుడవై, నా కోరికలను, కోడలి కోరికలను పరిపూర్ణంగా నెరవేర్చాలి. నేను పూజించే దేవమునులు, నారదాదులు, శివుడు, భూతాలు, గొప్ప అసురులు, సర్పాలు, నువ్వు పోయ్యే అడవుల్లో నిన్ను ఎంతో దయతో రక్షించాలి." ఇలా చెప్పి కౌసల్య, కళ్లంతా నీళ్లతో నిండగా, ఆశీర్వచనాలు పూర్తిచేసి, శాస్త్రప్రకారం, కొడుకుకు మేలుకలగాలని కోరుతూ, ప్రేమ అతిశయించగా, మంత్రించబడిన మూలికను రాముడి చేతికి రక్షగా కట్టింది. అష్ట దిగ్బంధం చేసినట్లు రక్షార్థం చుట్టూ తిరిగి కొడుకును కౌగలించుకుని సంతోషించింది. శ్రీరాముడు కూడా శ్రద్ధగా తల్లికి ప్రదక్షిణ చేశాడు. ఆమె పాదాల మీద పడి, మళ్లీ–మళ్ళీ, ఆధ్యాత్మిక, ఆధి భౌతిక, ఆధి దైవికములనే మూడు తాపాలు పోయేందుకు మూడు సార్లు నమస్కారం చేసాడు. ఆ తరువాత లేచి నిలుచుని, పితృ వాక్య పాలన కొరకై అడవులకు పోయేందుకు తయారైన రాముడు సీతా గృహానికి బయల్దేరాడు.

❖ ❖ ❖

సర్గ-26

సీతను చూడడానికి పోయిన శ్రీరాముడు

పైన చెప్పిన విధంగా తల్లి కౌసల్య కొడుకు రాముడిని దీవించింది. పితృవాక్య పరిపాలన అంటే ధర్మం అని భావించిన రాముడు సీతను చూడబోయెను. వెళ్లే ముందర దీవించిన తల్లికి ప్రదక్షిణా నమస్కారాలు చేశాడు రాముడు. ప్రియవాదిత్వం, పూర్వభాషితం లాంటి కళ్యాణ గుణాలను కలిగిన రాముడు, గొప్ప మనస్సుతో, జనులందరూ ఆయనవల్ల ఆకర్షితులవుతుంటే, వాళ్లందరూ చూస్తుండగా సీతను చూడడానికి పోయాడు. (రాముడి కళ్యాణ గుణాలకంటే సీతలో ఎక్కువ కళ్యాణ గుణాలన్నాయనే భావన కలుగేట్లుగా, వాటివల్ల శ్రీరాముడు ఆకర్షించబడ్డాడని అర్థం కలుగుతోంది). ఇక సీతాదేవి విషయానికొస్తే....అంతఃపురంలో వున్న సీతకు శ్రీరాముడి వనవాస వార్త తెలియదింకా అప్పటికి. తన భర్త యౌవరాజ్య పదవిని అలంకరించాలని, ఆమె, తన ఇష్టదేవతకు నమస్కారం చేసుకుంటూ, అంతే ప్రేమతో-భక్తితో ఇతర దేవతలకు పూజలు చేస్తూ, భర్త పట్టాభిషేకం చేసుకుని ఉత్సాహంతోవచ్చిన తరువాత తాను ఏం చేయాలో తెలుసు కాబట్టి, ఆ విధంగానే భర్తను పూజించేందుకు పూలు, గంధం లాంటివి సేకరించి తనవద్ద వుంచుకుంది. పట్టాభిషిక్తుడైన రాకుమారుడు, తన భర్త, ఇంటికి ఏ వేషంతో, ఏ చిహ్నంతో, ఏ పరివారంతో ఎలా వస్తాడో, ఆ రాజనీతి అంతా తెలిసిన వ్యక్తి సీత. "విపులాయత చారులోచన" ఐన సీత, తన పతిదేవుడు, తెల్లటి గొడుగు, వింజారాలు, భటవర్గ పరివారంతో ఎప్పుడెప్పుడు వస్తాడా అని, ఆయన వచ్చే దారివైపు ఎదురుచూస్తూ వేచి చూస్తోంది. మనోహరంగా అలంకరించుకుని, ఎంతో సంతోషంతో, ఎంతో మంది పరివారంతో కూడి వున్న తన ఇంటి లోకి ప్రవేశించిన శ్రీరాముడు సీత ముఖం చూడగానే సిగ్గుతో తలవంచుకున్నాడు. అప్పుడాయన ఆకారం చూసిన సీత భయంతో దేహం వణకుతుంటే, కూర్చుండిన ఆసనం నుండి తటాలున లేచి నిల్చోగానే దుఃఖాన్ని ఆపుకోలేని రాముడు బహిరంగంగానే శోకించాడు.

(కౌసల్య ఎంతగా దుఃఖించినా కన్నీరు కార్చని రాముడు సీతాదేవిని చూడగానే ఎందుకు ఏడ్చాడు? మాతృ వియోగ దుఃఖం కంటే భార్యా వియోగ దుఃఖం ఎక్కువా? దీనికి సమాధానం వుంది. అయోనిజ కాబట్టి దేవతా స్త్రీగా కాగలిగి, జనక మహారాజంతటి వాడు పెంచగా పెరిగి, సుకుమారిగా ఎదిగి, తన భర్త పట్టాభిషిక్తుడవుతాడని, తాను పట్టపురాణి అవుతానని, కొండంత ఆశతో సీత వుందని అనుకున్న రాముడు ఆమెను చూడగానే బాధ పడ్డాడు. అటువంటి సీతను, శత్రువుల మధ్య అయోధ్యలోనే వుంచాలా? తనతో అడవులకి తీసుకుపోవాలా? ఆ కష్టాలు ఈ కోమలాంగి ఎలా పడుతుంది? పోనీ...పుట్టింటికి పంపుతే అది అవమానం కాదా? ఇలా లోలోన అనుకుంటున్నాడు రాముడు. అయ్యో! తన కొరకు ఇంత చిన్న వయసులోనే, ఈ కోమలాంగికి ఇంత దుఃఖం కలిగింది కదా! అని అనుకున్న రాముడు సీతను చూడగానే బహిరంగం గానే ఏడ్చాడు. మరో విషయం....మాతృ వియోగ దుఃఖం కంటే భార్యా వియోగ దుఃఖం ఎక్కువ కాబట్టి కామంతో రాముడు దుఃఖించలేదు. తన వల్ల తల్లికి పుత్రవియోగ దుఃఖం, సీతాదేవికి భర్త వియోగ దుఃఖం కలిగిందికదా అని సంతాపం చెందాడు. తల్లి వద్ద బహిరంగంగా దుఃఖిస్తే వనవాసానికి పోవడానికి దుఃఖిస్తున్నాడని, తండ్రి ఆజ్ఞ పాలించడం ఇష్టం లేదని కౌసల్య గ్రహించి అడవికి పోవద్దని మరింత పట్టుపడుతుందని రాముడికి తెలుసు. తన వియోగం వల్ల తల్లికి స్థితిహాని కాని, గౌరవహాని కాని లేదు. ఇక సీత విషయానికొస్తే...భర్త వియోగం వల్ల భార్యకు కేవలం వియోగ దుఃఖమే కాకుండా, స్థితిహాని, గౌరవహాని కలుగుతుంది. పుట్టింట్లో వున్నా, అత్తింట్లో వున్నా, తోడు భర్త లేకపోతే బానిసగా భావిస్తారు. తనను భర్తగా పొందిన మహారాజ పుత్రిక సీతకు, బాలికకు, ఇలాంటి దుఃఖం కలిగింది కదా, ఇదంతా తనవల్లే కదా అని దుఃఖించాడు రాముడు).

సుందరమైన శ్రీరాముడి ముఖం తెల్లబారి వుండడం, వళ్లంతా చెమటతో తడిసి వుండడం, దుఃఖ పడుతూ వుండడం చూసిన సీతకు శోకంతో గుండె చెదిరిపోయింది. ఎంతో సంతోషంతో వుండాల్సిన ఈ సమయంలో దుఃఖపడడానికి కారణమేంటో చెప్పు ప్రాణేశ్వరా అంటుంది. తన మీద ప్రేమ వుంటే వివరంగా చెప్పమంటుంది. పట్టాభిషేక చిహ్నాలు ఎలా వుంటాయో

తెల్సిన సీత అవెందుకు లేవని ప్రశ్నించింది. "నాథా! ప్రసిద్ధ శుభ గ్రహం గురుడిని దేవతగా కలిగిన సంపత్కరమైన పుష్య నక్షత్రం ఇవ్వాళే అని బ్రాహ్మణులు చెప్పారు. ఇలాంటి శుభ సమయంలో నువ్వెందుకు కాంతి హీనుడవై శోకంతో కూడిన మనసుతో కనిపిస్తున్నావు? అందంగా, వెడల్పుగా, నూరాకుల నీటి బుగ్గలాగా నువ్వు కూడా శ్వేతచ్ఛత్ర నీడకు ఎందుకు రావడం లేదో చెప్పు. చంద్రమండలం లాగా గుండ్రంగా, తెల్లగా, హంసలా స్వచ్ఛంగా ప్రకాశించే చామరాలు నీ ముఖం మీద ఎందుకు విసరడం లేదు? వాగ్మిలు, వందిమాగధులు, సంతోషంగా జయజయ ధ్వనులతో నిన్ను పొగడుకుంటూ ఎందుకు రారు పుణ్యచరిత్రా? సుతమాగధులు, శుభకరమైన మంగళ గీతాలు పాడుకుంటూ నీవెంట రారెందుకు? వేదాధ్యయన సంపన్నులైన బ్రాహ్మణులు అభిషేక జలాలతో తడిసిన నీ శిరస్సు మీద పెరుగు, తేనె ఎందుకు పెట్టలేదు? నీ వెంట నీ మంత్రులు రాని కారణం ఏంటి? పౌరులు, పల్లెటూరు జనులు వేడుక చూసేందుకు నీ వెంట రాని కారణం ఏంటి? ఎందుకు నీ ముందు బంగారు సొమ్ములతో అలంకరించబడిన అసమాన వేగంగల నాలుగు గుర్రాల పుష్య రథం పోదు? నల్లని మబ్బు లాగా నీల వర్ణంతో వుండే కొండ మాదిరి ఎత్తైన మంచి సుళ్లుగల ఏనుగు నీ ముందు ఎందుకు పోవడం లేదు? బంగారు కమ్మలతో, రేకులతో, చిత్రపు పనితో కూడిన సింహాసనం నీ కంటే ముందే ఎందుకు పోవడం లేదు? ఎప్పుడూ వన్నె తరగని నీ ముఖం సంతోషంగా ఎందుకు లేదు? అభిషేక సమయం సమీపించినప్పటికీ నువ్విలా వుండడానికి కారణం ఏంటి?" అని అడిగింది సీత రాముడిని.

తాను అరణ్యానికి పోయే వార్త సీతకు చెప్పిన శ్రీరాముడు

శోకంతో, తనను గుచ్చి-గుచ్చి ప్రశ్నిస్తూ, ఏడుస్తున్న సీతతో శ్రీరాముడు, తనను అడవులకు పొమ్మని తండ్రిగారు ఆజ్ఞాపించారని చెప్పాడు. ఇంకా ఇలా చెప్పాడు: "సీతా! నువ్వు గొప్ప కులంలో పుట్టావు. కులం కొద్దీ బుద్ధి అంటారు. గొప్ప కులంలో పుట్టావు కాబట్టి నీకు గొప్ప బుద్ధి వుంటుంది. నువ్వు గౌరవం, తెలివి మాత్రమే కాకుండా ధర్మం కూడా నేర్చుకున్నావు. (కౌసల్య లాగా సీత సులభంగా లొంగే మనిషి కాదు. తాను అడవికి పోతానని రాముడు చెప్పగానే

కౌసల్య గుండె చెదరి పుత్ర శోకంతో ఏడ్వ సాగింది కాని నిబ్బరంగా ఆలోచించే శక్తి చూపలేకపోయింది. ఆ కారణంగా ఆమెను రాముడు సులభంగా అంగీకరించేట్లు చేయగలిగాడు. సీత దగ్గర ఈ ఆటలు సాగవని రాముడికి తెలుసు. అందుకే శ్రీరాముడు ఆమె ముందరి కాళ్లకు బంధం వేస్తున్నాడు. ముందరి కాళ్లకు బందాలు వేయడంలో శ్రీరామచంద్రమూర్తికి అగ్ర తాంబూలం ఇవ్వాలి. సీత తన వెంట వస్తానని అంటుందని ఆయనకు తెలుసు. అందుకే దానికి విరుగుడు ముందుగానే చెప్పాడు. ఇలాంటి చమత్కారాలు మున్ముందు లక్ష్మణ భరతాదులతో మాట్లాడేటప్పుడు కూడా గమనించవచ్చు. కాకపోతే ఈ చమత్కారాలు నిశ్చయమైన మనసున్న వారి దగ్గర పనికి రాలేదు.) జానకీ! నా కన్న తండ్రి, సత్యవాది, మహారాజైన దశరథుడు నా తల్లి కైకకు పూర్వం రెండు వరాలు మంచి మనసుతో, సంతోషంగా ఇచ్చాడు. ఆ కైక వాటిని మనసులో వుంచుకుని, ఇప్పుడు, నాకు అభిషేక ప్రయత్నాలు జరుగుతుంటే చూసి, ఆ వరాలను ధర్మ మార్గంలో నెరవేర్చమని రాజును కోరింది. అవేంటంటే...ఒకటి నేను రెండేడేళ్లు (పద్నాలుగేళ్లు) దండకారణ్యాలలో తిరగడం, రెండవది భరతుడు రాజై భూభారాన్ని చేపట్టడం. ఈ రెండు వరాలు కోరడమంటే కైకకు భరతుడి మీదకంటే నా పైనే ఎక్కువ ప్రేమ అని అర్థం చేసుకోవాలి. నేను భూభారం మోస్తుంటే భరతుడు సుఖ సంచారం చేయాల్సిన వాడు. ఇప్పుడా భారాన్ని వాడి మీద వేసి నన్ను హాయిగా, నిశ్చింతగా ఏ జంజాటం లేకుండా తిరిగేట్లు చేసింది. కాబట్టి నేను ఫల వృక్షాల, పూ తీగల, వింత పక్షులున్న సారవంతమైన అడవుల మధ్య సుఖంగా విహారం చేయబోయే ముందర నీకు చెప్పి నీ సమ్మతి తీసుకుని పోతే క్షేమం అని అనుకుని వచ్చాను".

సీతకు నీతులు చెప్పిన శ్రీరాముడు

శ్రీరాముడు సీతకు కొన్ని ధర్మ సూత్రాలు, నీతులు చెప్ప సాగాడిలా: "నీకు కొన్ని విషయాలు చెప్పాల్సి వుంది. చెప్తా విను సీతా! భరతుడి దగ్గర నన్నెప్పుడూ పొగడుకుంటూ మాట్లాడ వద్దు. ఎందుకంటే...ఐశ్వర్యంతో, అధికారంతో వున్న వారెవరైనా కాని, ఇతరులను తమ ఎదురుగా పొగడితే, తమను దూషించినట్లు భావించి కోపగించుకుంటారు. కాబట్టి భరతుడు నీకు

నమస్కరించడానికి ఇక్కడకు వచ్చినపుడు వాడితో, పెద్ద వయసున్న నువ్వు, మంచి చెడులు మరచి నా గుణాలను ప్రశంసించవద్దు. లోక న్యాయాన్ని అనుసరించి పదిమందిలో నువ్వు పదకొండవ దానివిగా వుండాలి. అంతే కాని, నేను ఈ ఇంటికి పెద్ద కోడలిని, జనకరాజు కూతురుని, న్యాయంగా రాజ్యం మాదే అనే అభిప్రాయం పెట్టుకుని విర్రవీగవద్దు. నువ్వు అందరికీ అనుకూలంగా తిరగాలి కాని, ఎవరితో కూడా ప్రతికూలంగా వుండ కూడదు. మన మహారాజు, భరతుడిని యువరాజుగా చేద్దామని అనుకున్నాడు కాబట్టి, నీకు అతడు అనుగ్రహించ తగినవాడే కాని, నిగ్రహించ తగిన వాడు కాదు. అతడిపైన కోపం తెచ్చుకోవద్దు. వాస్తవానికి అతడే రాజు. చక్కగా ఆలోచించి చేయి. నేను స్థిర బుద్ధితో నా తండ్రి ఆజ్ఞ తీర్చడానికి పోతున్నాను. నువ్వు కూడా స్థిర బుద్ధితో వుండాలి. అడవుల్లో నేనున్నంత కాలం, నువ్విక్కడ, ప్రోషిత బర్తృక ఐన పతివ్రత ఏఏ నియమాలను పాటించాలని శాస్త్రాలు చెపుతున్నాయో అవన్నీ అనుసరించు".

"శాస్త్ర ప్రకారం నువ్వేం చేయాలో నీకు బాగా తెలుసు. నేను నీకు చెప్పాల్సిన పని లేదు. కాని...కొన్ని చెప్తాను. విను. ఉదయాన్నే నిద్ర లేచి, దేవతలకు నమస్కరించి, శాస్త్ర ప్రకారం పూజ చేసి, ఆ తరువాత నా తండ్రికి నమస్కరించి నా తల్లి కౌసల్య దగ్గరకు పో. ఆమె ముసలిది. దుఃఖంతో బాధపడుతున్నది. ఆమెకు తన ధర్మం తప్ప మరేదీ తెలియదు. నువ్వు కూడా ధర్మాన్నే అనుసరిస్తూ, ఆమెకు అనుకూలవతివై, ఆమెను భక్తితో పూజించు. నువ్వు సదాచార సంపన్నవని పేరు తెచ్చుకున్నావు. అందువల్ల, నా తల్లిలాగే సవతి తల్లులు కూడా నీ నమస్కారానికి యోగ్యురాళ్లు. వారందరితో నాకేం పని అనవద్దు. ఎందుకంటే, నాకు నా తల్లులందరూ, ప్రీతివల్ల, స్నేహభావం వల్ల సమానులు. కన్న తల్లి ఎక్కువని కాని, సవతి తల్లి తక్కువని కాని నాకు భేద భావం లేదు. నువ్వు కూడా వారందరినీ సొంత అత్తల్లాగే గౌరవించు. కైక కొడుకును నీ సోదరుడిలా చూసుకో. చిన్నవాడైన శత్రుఘ్నుడిని కొడుకు లాగా చూసుకో. వీళ్లంతా నాకు ప్రాణంతో సమానం. (ఇక్కడ లక్ష్మణుడి పేరు చెప్పక పోవడం బహుశా అతడిని తన వెంట తీసుకుపోయే ఆలోచన వుండడమే కావచ్చు). మన వంశానికి, దేశానికి రాజు-ప్రభువు భరతుడే

కాబట్టి నువ్వు అతడి మీద కోప్పడి అతడికి అప్రియమైన మాటలు అనవద్దు. రాజులు ప్రజలకు అనుకూలమైన నడవడి కలిగి వారితో ఆరాధించబడి సంతోషిస్తారు. వాళ్ళు సంతోషంగా వుంటేనే సౌఖ్య సంతోషాలుంటాయి. అలా కాకపోతే విరుద్ధ గుణాలు వున్న వారిమీద కోపంతో వుంటారు. కోపం వస్తే కీడు కూడా చేస్తారు. 'నేను వదినను...తల్లితో సమానం...నా మీద కూడా భరతుడికి కోపం వస్తుందా' అని అంటావేమో? రాజ ధర్మం నీకు తెలుసు. తమకు ఇష్టం లేని పని చేసేవారిని, కడుపున పుట్టిన కన్న బిడ్డలైనప్పటికీ, రాజులు వాళ్లను దూరంగా వుంచుతారు. తమ పని చేసే సమర్థత వున్న వారిని వేరేవారైనప్పటికీ దగ్గర చేర్చుకుంటారు. (శాస్త్రీయమైన మన స్వధర్మంలో మనం వుంటే భగవంతుడు తనంతట తానే సంతోషిస్తాడు. భక్తులం కదా అని...స్వధర్మాన్ని విడనాడితే...వారి విషయంలో భగవంతుడు సంతోషించడు. తన ఆజ్ఞ మీరి ప్రవర్తించే స్వజనుల విషయంలో ప్రభువు సంతోషించడు అని అర్థం). కాబట్టి ఇక్కడే అయోధ్యలోనే వుండు సీతా! రాజు అభిప్రాయానికి అనుకూలమైన సదభిప్రాయాన్నే కలిగుండు. నీ స్వధర్మాన్ని వదలొద్దు. నువ్వు నాకు ప్రేమ పాత్రురాలివి కాబట్టి, నాకు ఇష్టమైన పనులే, ఇంతవరకు నేను చెప్పినట్లు చేయి. ఇతరులు మనసు నొచ్చుకునే పనులు చేయవద్దు. నా మాటపైన ఆదరం వుంచి గౌరవించు. కోప పడవద్దు. నేను అడవులకు పోతున్నాను".

❖ ❖ ❖

సర్గ-27

అరణ్యానికి తాను వస్తానని శ్రీరాముడితో చెప్పిన సీత

(సన్నని నడుము, ప్రియమైన మాటలు వినడానికి మాత్రమే యోగ్యురాలు, మంచి గుణాలు, ప్రియమైన మాటలు మాట్లాడే పతివ్రత సీతకు, శ్రీరాముడింతవరకు పలికిన మాటలు ఆమె ఆలోచనలకు విరుద్ధంగా, అప్రియంగా అనిపించాయి. శ్రీరాముడెలా పురుషులకు స్వధర్మ నిర్వహణ పరమ సాధనమని చెప్పడానికి అవతరించాడో, అలానే, సీత కూడా స్వధర్మ నిర్వహణే స్త్రీలకు పరమ సాధనమని చెప్పడానికి అవతరించింది. ఇంతవరకు శ్రీరాముడి పుత్ర ధర్మ నిర్వహణ విధానం చెప్పడం జరిగింది. ఇక నుండి సీతాదేవి యొక్క స్వధర్మ నిర్వహణ విధానం చెప్పడం జరుతుంది. శ్రీరాముడు చెప్పిన మాటలు స్వధర్మ నిర్వహణకు విరుద్ధమని ఆమె భావించి కోపగించుకుంది. ఈ కోపం స్నేహ కారణంతో వచ్చిందే కాని కోపం వల్ల కలిగింది కాదని అర్థం చేసుకోవాలి. ఇక నుండి సీతా వైశిష్ట్యం వివరించడం జరుగుతుంది. కౌసల్య మాదిరిగా రాముడిని అడవులకు పోవద్దని సీత తన వాదన మొదలుపెట్టలేదు. అది న్యాయమా? అన్యాయమా? అని ఆమె విచారించలేదు. ఇవన్నీ తన ధర్మం కాదనే ఆమె అభిప్రాయం. కాబట్టి తనకు సంబంధించిన తన స్వధర్మమేంటో దానినే స్థాపించడానికి సర్వవిధాల ప్రయత్నం చేసింది).

భర్త మీద వున్న చనువు వల్ల కలిగిన కోపంతో పతికి ఇలా జవాబిచ్చింది సీత. "ఇదేమి ఆశ్చర్యం నాథా! నువ్వెప్పుడిట్లా పలకలేదే? ఈ పిరికిపంద మాటలు ఇప్పుడెందుకు చెపుతున్నావు? నువ్వు స్వభావ రీత్యా ఎలాంటి వారినైనా, ఎవరినైనా, సంతోషించేట్లు అంటావని, అందువల్ల రాముడని పేరు పెట్టుకున్నావు కదా! నువ్వు లోన సారం లేని, పైపై వన్నెల వల్ల ప్రకాశించే పేడ బొమ్మ లాంటి సౌందర్యం కలవాడివి కాదని అనుకుంటున్నాను. లోపల సారమున్నట్లు ఎందుకో కనబడుట లేదు. అలా అంటావేమి అని అడుగుతావేమో! నేను రాకుమారుడను కాదా? అని అంటావేమో! నువ్వు రాజు కొడుకు కావడం వల్లనే, పండిత

పుత్రుడిలాగా, రాజ కుమారుడివైనావు కాని, రాజ కుమారుడిలో వుండాల్సిన స్థైర్య, ధైర్య, శౌర్య, సాహస గుణాల వల్ల కాదు. అవి గల నిజమైన రాకుమారిడివే అయితే, ఇలా మాట్లాడవు. నీ మాటలలో ఏం లోపం వుందని నేనిలా అంటున్నానని అడుగుతావేమో? నీ పేద పలుకులు విన్న నాకు, నా లాంటి ఆడుదానికి, అందునా బాలికకు, ఆపుకోలేని నవ్వు వచ్చింది. ఇక మగవాళ్లు, రాచరికం వాళ్లు వింటే ఏమంటారో కదా? నేనేం తెలివితక్కువగా మాట్లాడానని అందరూ నవ్వుతారు? అని అడుగుతావేమో? తోడబుట్టిన వారు, తల్లి, తండ్రి, కోడలు, కొడుకు…వీళ్లందరూ వాళ్లు చేసిన పాపపుణ్యాల ఫలితాన్ని వాళ్లే అనుభవిస్తారు తప్ప, ఒకరి పాపపుణ్యం ఇతరులకు సంక్రమించదు. పురుషుడి భాగ్యం, పుణ్యం అతడితో సమానాధికారం వున్న భార్య ఒక్కతే పంచుకుంటుంది. కాబట్టి రాజు నిన్ను అడవికి పొమ్మంటే నన్ను కూడా పొమ్మనే అర్థం. నీలో నేను సగం. నీ సగం దేహం ఇంట్లో పెట్టి, మిగిలిన సగం దేహంతో అడవికి పొమ్మని నీకు రాజు చెప్పాడా? నన్ను నీ వెంట తీసుకుని పోకపోతే, నీ తండ్రి ఆజ్ఞ, రాజాజ్ఞ, పూర్తిగా నెరవేర్చిన వాడివి కాదు. అరకొరగా చేసినట్లే లెక్క. నువ్వేదో గొప్ప ధర్మం చేయబోతున్నావు కదా! అలాంటి ధర్మం నేను లేకుండా నువ్వెలా చేస్తావు? వివాహం నాటి వాగ్దానం మరిచిపోయావా? నువ్వు చేసే ధర్మంలో సగ భాగం నాకుంది కదా? అది నేను నీ వెంట వుండి శుశ్రూష చేస్తే వస్తుందా? లేక ఇంట్లో వుంటే వస్తుందా? ఇలా నాకు న్యాయంగా, ధర్మ శాస్త్రం ప్రకారం, రావాల్సిన పుణ్యం రాకుండా మీరెలా చేయగలరు? అలాంటి అధికారం మీకుందా? ప్రాణేశ్వరా! వినండి. స్త్రీకి ఇహలోకంలో కాని, పరలోకంలో కాని, ఒకరు ఆ లోకంలో కాని, మరొకరు ఈ లోకంలో కాని వున్నప్పటికీ, శాశ్వతంగా భర్త ఒక్కడే గతి కాని తండ్రి కాని, తల్లి కాని కానేకాదు. కన్న కొడుకు కూడా కాదు. స్నేహితురాండ్రు కాదు. ఎందుకంటే, సతి ప్రాణానికి ఈశ్వరుడు భర్త తప్ప ఇతరులు కాదు. అందుకే ఆయనకు ప్రాణేశ్వరుడు, జీవితేశ్వరుడు అన్న పేరొచ్చింది".

"నేనేమైనా పెళ్లికి పోతున్నానా? ఉద్యానవన క్రీడకు పోతున్నానా? అడవికి నువ్వు వచ్చి ఏం చేస్తావు? అంటావేమో! ఇక్కడ నేనేం చేస్తున్నానో, అక్కడ కూడా అదే చేస్తాను. ఇక్కడ నువ్వు కూర్చుండే ఆసనం పైన వున్న కసవు

లేకుండా శుభ్రం చేసినట్లే, అక్కడ అడవుల్లో కూడా నీ కంటే ముందు నడచుకుంటూ పోయి, దారిలో తగిలే దర్భలు, ముళ్లు తొలగించి మృధువుగా చేస్తాను. ఇదేం నాకు కొత్త కాదు. కష్టమంతకంటే కాదు. కాబట్టి, ఇతరుల తాగిన నీళ్లను వదిలినట్లు, నన్నింట్లో వుండమంటే వుండనని తిరస్కరించి మాట్లాడుతున్నానని కోపం వద్దు. నీతో అడవికి వచ్చి నువ్వు చేసే పుణ్యంలో నేను సగం పంచుకుంటానేమోనన్న అసూయ అసలే వద్దు. ఇవన్నీ నా మీద ప్రేమతో వదిలెయ్యి. మానధనాఢ్య! వీరవర్యా! ఇది ఆడుపిల్ల...దీనిని నేనెలా అడవులకు తీసుకుని పోతాను? అన్న సందేహం వదిలిపెట్టు. అది నీకు కీర్తికరం కాదు. కాబట్టి నన్ను తప్పక నీ వెంట తీసుకుని పో. వల్లభుడవైన నిన్ను ఎడబాసి ప్రాణాలతో వుండాల్సిన పాపం నేనేం చేయలేదు. పాపాత్మురాలికి మాత్రమే భర్తృ వియోగం కలుగుతుంది. సీతా! ఇంతవరకు నీకు తెలివి వుందనుకున్నాను...అది పొరపాటనిపిస్తున్నది...ఎందుకంటావా?...ఇలాంటి సార్వభౌమవాసాన్ని, సుఖాన్ని, యోగ్యమైన ఇళ్లను, వదలుకుని, తెలివిగల దానివైతే అడవికి వస్తావా? అని అంటావేమో! అలాగైతే పతివ్రతల స్వధర్మం నీకు తెలియదనే అనాల్సి వస్తుంది. వారి ధర్మం ఎలాంటిదంటే...అసమానమైన, సార్వభౌములైన వారికి యోగ్యమైన మేడల్లో వుండి, భూలోక సుఖం అనుభవించుట కన్నా, చనిపోయి దేవతల విమానంపై కూర్చుని సుఖ విహారం చేయడం కన్నా, అణిమాది యోగసిద్ధులు సాధించి ఆకాశ గమనం చేయడం కన్నా, పతివ్రతైన స్త్రీకి, గుడిసెలో వున్నా, ఎలాంటి కష్ట దశలో వున్నా, భర్త పాద సేవ చేస్తూ అతడి వెంట వుండడమే శ్రేష్ఠం. ఈ విషయం, ఆర్యులలో, పండితులలో అందరికంటే గొప్పవాడవైన నీకు తెలియదా?"

"నువ్వు చిన్నదానివి...ఈ ధర్మాలను నువ్వింకా పెద్దల దగ్గరుండి నేర్చుకోమని అంటావేమో? ఏ ఏ దశల్లో ఏఏ విధంగా భర్తృ సేవ ఎలా చేయాల్నో, ఆ పద్ధతులేంటో, చిన్న తనంలోనే నా తల్లిదండ్రులు నాకు నేర్పారు. ఇప్పుడింకా కొత్తగా నేర్చుకోవాల్సింది లేదు. కాబట్టి నేనేం చేయాలో నాకు తెల్సు. కాబట్టి సంతోషంగా నీవెంట వస్తాను. అడవికి పోవాలే అని ఏడిచే దాన్ని కాదు. అడవుల్లో ఏముంటుందో నాకు తెలియక కాదు. కాబట్టి ప్రాణ నాథా! మానుష్యులులేని, పాములు, ఎలుగులు, చిరుతపులులు వుండే, నడవడానికి

దారి లేని అడవులకు వస్తాను. నాథా! అత్తలకు, ఆడుబిడ్డలకు భయపడుతూ, ఏం చేస్తే తప్పో, చేయకపోతే తప్పో, ఏం అంటే తప్పో, అనకపోతే తప్పో, అని భయపడుతూ అత్తగారింట్లో వుండలేను. నా మనసు వారికి, వారి మనసు నాకు తెలిసిన పుట్టింట్లో కూడా వుండలేను. ముల్లోకాలు తలకిందైనా, ప్రళయం వచ్చినా, లోకాలన్నీ నాశనమైనా, ముక్తుడై భగవత్ ప్రాప్తి లభించినవాడిలాగా, నేను నా భర్తకు సేవ చేసుకుంటూ, వుండాలనే తలంపు తప్ప ఇతర ఆలోచన లేదు నాకు. అడవుల్లో పులులు, సింహాలు వుంటాయని తెలిసి కూడా వస్తానంటున్నావు...ఇదేం పిచ్చి అంటావా? అవన్నీ అడవుల్లో ఎక్కడో వుంటాయి. అంతటా వుండవు. పూ తేనెల కమ్మని వాసన సర్వత్రా వ్యాపిస్తుంటే, ఆ అరణ్యాలలో, సంతోషంగా, నిండు మనసుతో, బ్రహ్మచర్య వ్రతాన్ని పాటిస్తూ, నీ పాద కమలాల సేవ చేస్తాను. నీతో సంతోష సాగరంలో ఆడుకుంటాను. దీనికెందుకు అంగీకరించవు? నేనేమన్నా ఆభరణాలడిగానా? వస్త్రాలు కావాలన్నానా? సంతోషకరమైన పదార్థాలు తెమ్మన్నానా? నాకు రథాలు కావాలన్నానా? నిన్నేమన్నా మోసుకుని పొమ్మన్నానా? నీతో నేను కూడా నడిచి వస్తానని అన్నాను".

"నువ్వు శూరుడవు. నీకు శౌర్యమే ధనం. భర్త ద్రవ్యాన్ని భార్య అనుభవించాల్సిందే కదా! దాన్నే నేను అడుగుతున్నాను. మనుషులెవర్నైనా, నువ్వు అడవుల్లో, నీ శౌర్యంతో పొరపడకుండా కాపాడగలవు. ఇక నన్ను కాపాడలేవా? నిండు దయ నామీద వుంచు. నేను కోరేది అదొక్కటే. భగవదనుగ్రహం వుంటే ఎక్కడున్నా భయం లేదు. సర్వభూత రక్షకుడు తనను రక్షిస్తాడన్న మహా విశ్వాసం వుండాలి. ఈ విశ్వాసం లేనివారిని భగవంతుడు దగ్గరకు రానివ్వడు. అది కలదా? లేదా? అనేదే పరీక్ష. రాజ శ్రేష్ఠా! నీ వెంట నేను వస్తాను. ఇందులో సందేహం లేదు. ఇదే నా మనో నిశ్చయం. దీన్ని మరలించడం నీకు సాధ్యం కాదు. నేను నీ కెలాంటి కష్టం కలిగించను. ఏం ఆహారం తింటావంటావా? కందమూలాలు, పళ్ళు తింటాను. లోపల బాధ పడను. నీ వెంట వుండడమే నాకు సంతోషం. అపార వస్త్రాభరణాల వల్ల కలిగే సంతోషం నిజమైన సంతోషం కాదు. అది క్షుద్ర స్త్రీలు కోరుకునే సంతోషం. ప్రాణేశ్వరా! అడవుల్లో, నదుల్లో, కొండల్లో–కోనల్లో, నదీ తీరాల్లో, గుహల్లో

నీతో పాటే తిరుగుతాను. హంసలు, ఇతర పక్షులు కలకల నాదాలు చేస్తుండే తామర కొలనుల తియ్యని ఇంపైన నీళ్లలో నీతో జలక్రీడలాడుతాను. ఇదే నా కోరిక...ఇంత మాత్రం తీర్చలేవా?నీతో సంతోషంగా లక్ష ఏళ్లైనా ఏ బాధ లేకుండా అడవిలో వుంటాను. పద్నాలుగేళ్ళు ఒక లెక్కా? నీతో నేనుండ లేక పోతే వైకుంఠమైనా నాకు సంతోష ఇవ్వదు. కాబట్టి, కోతులు, సింహాలు, ఏనుగులుండే అడవులకు నేనొస్తాను. నా తండ్రి ఇంట్లో వున్నట్లే సుఖంగా అడవుల్లో వుంతాను. నీకు సేవ చేస్తాను. నీ మనస్సే నా మనస్సు. నా మనస్సే నీ మనస్సు. నిన్ను తప్ప వేరే లాభం కోరను. ఈ ప్రాప్తికి నిన్ను తప్ప వేరే సాధనం కోరను. భయంతో కూడిన మనస్సు కాదు. నిశ్చల భక్తితో కూడిన మనస్సు నాది. నువ్వు నన్ను వదిలితే, నేను ప్రాణం వదులుతాను. ఇది సత్యం. తీసుకుని పో. ఈ నా కోరిక నెరవేర్చు. నీ అంతటి సర్వ సమర్థుడికి ఇది తెలియదా? ఇదొక బరువా?"

❖ ❖ ❖

సర్గ-28

అరణ్యాలలోని కష్టాలను సీతకు వివరించిన శ్రీరాముడు

ఇలా తనను వివిధ రకాలుగా ప్రశ్నిస్తున్న భార్య సీతకు తన ధర్మమందు తానుండే విషయంలో రాముడు సంతోషించినప్పటికీ, ఆమెను అడవులకు తీసుకుపోయేందుకు మాత్రం అంగీకరించలేదు. పైగా, ఆమెకు అడవుల్లో వుండే కష్టాలను చెప్పాలనుకున్నాడు. వనవాసంలో ఎదురయ్యే కష్టాలు తెలియక ఇలా మాట్లాడుతున్నదని భావించి, అవి వివరంగా చెప్తే, వస్తానని అనదేమో అనుకుని, ఆమెను పరీక్షించాలని తలచాడు. గొప్ప బుద్ధిగల శ్రీరాముడు సీతను తన వెంట తీసుకుపోవడానికి మనసులో ఇష్టం వున్నప్పటికీ, వనవాసంలో ఎదురయ్యే కష్టాలను ఆలోచించి, సీత ఆ కష్టాలను సహించలేదని అనుకుని, కన్నీళ్లు కారుస్తున్న ఆమెను ఊరడిస్తూ, వనవాస ప్రయత్నాన్ని మానుకోవడానికి, ఆ కష్టాలను ఇలా చెప్పాడు. "సీతా! నువ్వు గొప్ప వంశంలో పుట్టావు. నువ్వు ధర్మాన్ని నిష్టగా పాటిస్తావు. కాబట్టి ఆ రెండింటికి అపకీర్తి కలిగేలా, మనసుకు తోచినట్లు, సుఖమని తోచినట్లు, స్వచ్ఛందంగా వ్యవహరించవద్దు. నేను చెప్పినట్లు ఇక్కడే వుండు. ఇక్కడే నీ ధర్మాన్ని ఆచరించు. నేను నీకు భర్తను. నా ఆజ్ఞ నువ్వు జవదాట కూడదు. నేను చెప్పినట్లు వినడమే సరైన పని. ధిక్కరించి, నా మాట వినకుండా వ్యవహరించడం నీకు తగిన పని కాదు. అడవులకు పోవాలన్న కోరిక వదలుకో. అడవి మిక్కిలి దుఃఖం కలిగిస్తుంది. నీ మీద ప్రేమతో, నువ్వు కష్ట పడుతుంటే చూడలేక ఇలా చెప్తున్నాను".

"వనవాసంలో సుఖమెలా వుంటుందో నాకైతే తెలియదు. అబలా! అడవి అంటే ఏమనుకుంటున్నావు? నేను వస్తానంటున్నావు....ఎన్నో కష్టాలకు నిలయం కాబట్టే దాన్ని వనమంటున్నారు. వనంలో సుఖం కూడా వుంటుందా? కొండ గుహల్లో వుండే పెద్ద-పెద్ద శరభాలు, సింహాలు చేసే ధ్వనులు, సెలయేళ్ల చప్పుళ్లు, నువ్వు వినడానికి అలవాటుపడిన వీణానాదాలు కావు. చెవులు అదిరిపోయేట్లు దిగులు పుట్టిస్తాయి. కాబట్టే అరణ్యం దుఃఖకరం. మానవ సంచారం లేని అటవీ ప్రాంతంలో నిర్భయంగా, నిశ్చలంగా ఆడుకునే మృగాలు,

మనుష్యులను చూడగానే పరుగెత్తుకుంటూ వచ్చి మీదపడతాయి. హాయిగా నీళ్లల్లో జలక్రీడలాడుతానంటున్నావు కాని వాటిలో ఏముంటాయో తెలుసా? కాలు పెట్టగానే బురద తగులుతుంది. దిగబడతావు. ఐనప్పటికీ స్నానం చేద్దామని నీళ్లలోకి పోతే అక్కడ పెద్ద-పెద్ద మొసళ్లు కనిపిస్తాయి. నిన్ను పట్టుకుంటాయి. వాటిని చూస్తేనే భయం కలుగుతుంది. మదించిన ఏనుగులు నీళ్లలో దిగి ఈదుకుంటూ స్నానం చేస్తాయి. నువ్వు కనిపించగానే ఆడుకుందామని దగ్గరకు వస్తాయి. ఏటి స్నానమంటే ఇన్ని గండాలుంటాయి".

"సీతా! నీళ్లలో పోకుండా భూమ్మీద పోవచ్చు కదా! అక్కడి చెట్ల పూలు గుమగుమ పరిమళిస్తుంటే ఆస్వాదించవచ్చుకదా! అంటావేమో? అడవంటే ఉ ద్యానవనం కాదు. ముళ్ల కొమ్మలతో కూడిన చెట్లుంటాయి. వాటి ముందునుంచి తల ఎత్తుకుని పోతే ఎత్తు కొమ్మలు వెంట్రుకలకు చుట్టుకుంటాయి.....కిందికి చూస్తే నేల కొమ్మలు కాళ్లకు చుట్టుకుంటాయి. అడవి కోళ్లు చెవులదిరి పోయేలా కూస్తుంటాయి. నీళ్లుండవు. పోవడానికి దారి వుండదు. హాయిగా రాత్రి వేళ ఎక్కడైనా పడుకుందామని అనుకుంటున్నావేమో? పగలంతా కష్టపడ్డ మనం ఆకులు కోయకూడదు. వాటంతటవే రాలిన వాటిమీద రాత్రి పూట శరీరాన్ని పడవేయాలి. కాబట్టి వనవాసం దుఃఖకరం. ఆకులు కోయడం కూడా హింస అని శాస్త్రం చెప్తున్నది కదా! చెట్ల మీద దండిగా పండ్లుంటాయి... తినవచ్చును కుంటావేమో? వానప్రస్థాశ్రమంలో వుండేవారు, సన్యాసులు, జీవహింస చేస్తున్నామనే భయంతో చెట్లమీదున్న పండ్లను కోయకుండా తొడిమ వాడి వాటంతటవే నేలపై పడిన పండ్లను, రాత్రిపూట కాని, పగటి పూట కాని తింటారు. కాబట్టి వనవాసం దుఃఖకరం. వానప్రస్థాశ్రమంలో వుండేవారు జడలు ధరించాలి. నారచీరెలే కట్టాలి. శక్తి వున్నంతదాకా పస్తులుండాలి. ఇలా వుండి కూడా అతిథులొస్తే సేవ చేసి వారిని సంతృప్తి పరచాలి. శాస్త్ర ప్రకారం దైవ పూజలు చేయాలి".

"ప్రియురాలా! ప్రతి రోజు సూర్య ఉదయాస్తమానం లోపల మూడు సార్లు స్నానం చేయాలి. నియమం ప్రకారం వ్రతాలు చేయాలి. కాబట్టి వనవాసం దుఃఖకరం. సర్వసమ్మతమైన శాస్త్రాన్ననుసరించి ఎవరికి వారే పూలను

సంపాదించి తెచ్చి, వేదిని శ్రద్ధతో నమస్కారం చేసి బలి ఇవ్వాలి. పరులు తెచ్చి ఇచ్చిన పూలతో వ్రతం చేస్తే సగం ఫలమే దక్కుతుంది. మిగిలిన సగం తెచ్చిన వారికి దక్కుతుంది. శాస్త్రం ప్రకారం పూలు తేవడమంటే, వాటిని హటాత్తుగా కోయకుండా, మంత్రయుక్తంగా తెంపాలి. ఏ రోజు ఎంత దొరుకుతుందో అంతే తిని తృప్తి చెందాలి కాని, కొంచెమే దొరికిందికదా అని అనుకోకూడదు. ఎక్కువగా దొరికితే మర్నాటికి దాచుకోకూడదు. అడవుల్లో వుండే వారికి ఆకలెక్కువ. ఒక్కరోజు కూడా కడుపు నిండా ఆహారం దొరకదు. వదిలి పెట్టకుండా హోరున గాలి వీస్తుంటుంది. చిమ్మ చీకటి వుంటుంది. ఏ రాక్షసుడు ఎప్పుడు వచ్చి చంపుతాడో అని భయంగా వుంటుంది. ఏ మృగం వచ్చి తింటుందో తెలియదు. ఇది రోజూ వుండే సంగతే. కాబట్టి వనవాసం దుఃఖకరం. అనేక రకాలైన కొండ పాములు బుస కొట్టుకుంటూ, ఇష్టం వచ్చినట్లు అరణ్యాలలో తిరుగుతుంటాయి. కాబట్టి వనవాసం దుఃఖకరం. సీతా! నదుల లాగా వంకరగా పొయ్యే పాములు, పెద్ద-పెద్ద నదుల్లో వుండే పాములు, మనం నడుస్తున్నప్పుడు మనకడ్డంగా వస్తాయి. ఈగలు, దోమలు, చూస్తేనే భయం కలిగించే తేళ్లు, మండ్రగబ్బలు, పురుగులు, శరీరం మీదికి వచ్చి కరుస్తుంటాయి. అడవిలో ఎక్కడ చూసినా ముళ్ల చెట్లు కనిపిస్తుంటాయి. వీటిలో వుండే దర్భ రెల్లు, వేలాడుతుండే కొమ్మల కొసల్లో కదులుతుంటాయి. మనం వాటిని తొలగించుకుని పోయినా అవి గాలికి కదిలి మనకి బాధ కలిగిస్తాయి. కాబట్టి వనవాసం దుఃఖకరం. అడవుల్లో వుండేవారికి ఎన్నో రకాలైన శారీరిక కష్టాలు, అమితమైన బాధలు, మనో వ్యధలు నిరంతరం వుంటాయి. మనసును కోపానికి, లోభానికి లోను కానీయ కూడదు. నువ్వు దుర్బల కాబట్టి వనవాస దుఃఖం సహించలేవు. కాబట్టి ప్రయాణం మానుకో. ఇప్పుడు నేను చెప్పిన ఈ కొన్ని సంగతుల వల్లే ఎన్నో దోషాలు అడవుల్లో వున్నాయనిపించాయి కదా! చెప్పనివి ఇంకా ఎన్నో వున్నాయి. కాబట్టి వనవాసం దుఃఖకరం”.

❖ ❖ ❖

సర్గ-29

శ్రీరాముడితో తాను అడవికి రావడానికి కారణాలు చెప్పిన సీత

తనను అడవులకు తీసుకొని పోవడం ఇష్టం లేకపోవడం వల్ల అన్ని అడ్డంకులు కలిగిస్తున్నాడని సీత తెలుసుకుంది. కన్నీళ్లొచ్చాయి ఆమెకు. అదే పనిగా ఏడిస్తే మూర్ఖత్వం అనిపించుకుంటుందని భావించి, తనకు తానే సమాధానం చెప్పుకుంది. ఆ తరువాత శ్రీరాముడితో ఇలా అంటున్నది: "ఓ గొప్ప తేజస్సుకలవాడా! రామా! వనవాసంలో వున్న దుఃఖాలన్నీ నువ్వు చెప్పావు కాని, అవన్నీ నాకు మంచి గుణాలుగా కనిపిస్తున్నాయి. నువ్వు వివరించినట్లు అవేవీ దోష గుణాలు కావు. అవన్నీ నీకు నా మీద వున్న ప్రీత్యతిశయంతో చెప్పిన మాటలు. నా మీద నీకు ప్రేమ వుంటే అవన్నీ సద్గుణాలే. నీకు ప్రేమ లేకపోతే నేనిక్కడ అనుభవిస్తానని నువ్వు అంటున్న సుఖాలన్నీ నాకు దుఃఖాలే. అడవి మృగాలు భయంకరమైనవని అంటున్నావు. నువ్వంటున్న జింకలు, శరభాలు, ఇలాంటి మరెన్నో అంతకు ముందు ఎప్పుడూ చూడని నిన్ను చూడగానే, భయంతో ముఖం మళ్లించుకుని పారిపోతాయే కాని మనమీదికెందుకు వస్తాయి? భయకారణం కలిగితే భయపడతాయి కదా? ఈ మాటలతో నాకు పని లేదు. నాకు రెండే మార్గాలు. కరుణాశీలా! పెద్దవారి ఆజ్ఞానుసారం నేను నీతో అరణ్యానికి వస్తాను. నా వెంట రావద్దంటవా...ఇక్కడే నీ ఎదుటే మరణిస్తాను. ఈ రెండు మార్గాలు కాకుండా నాకింకేమీ లేవు. ఏం చెయ్యమంటావో నువ్వే చెప్పు. సత్కీర్తి కలవాడా! పిల్లలను బూచి అని భయపెట్టినట్లు మృగాల పేరుతో నన్ను బెదిరిస్తున్నావే? మృగాల సంగతి అలా వుంచు. నీ దగ్గర నేనుండగా, ఇంద్రుడైనా సరే నా వైపు కన్నెత్తి చూడగలడా? ఇంత మాత్రం నాకు తెలియదనుకుంటున్నావా? ఎలాంటి శత్రువైనా నీ చేతిలో ఓడాల్సిందే కాని గెలవగలడా? నేను నీ తో రావడం అధర్మమని నువ్వనడం లేదు. నన్ను భయపెట్టి నా నోటితోనే నేను రానని అనిపించాలని నీ ఆలోచన. అది జరిగేది కాదు. ఎందుకంటే, పతిని విడిచి వుండే పతివ్రత బతకలేదని,

నువ్వే చెప్పావు. నన్ను పతివ్రత అని అన్నారు కదా? అట్లయిన నేనెలా బతుకుతాను? నేను జీవించకూడదనే ఆలోచనతో నన్ను విడిచిపోతానంటున్నావా? అలా కాకపోతే నా మంచి తోవలో ఈ వైపరీత్యం ఎందుకు వచ్చింది?"

"నేను వనవాసం చేయాల్సి వస్తుందని ఇప్పుడు నువ్వు నాకు చెప్పి బెదిరించాల్సిన అవసరం లేదు. ఈ విషయం నాకింతకు ముందే తెలుసు. నేను మా తండ్రి గారింట్లో వున్నప్పుడు కొందరు సిద్ధాంతులు నా జాతకాన్ని చూశారు. ఓ బుద్ధిమంతుడా విను! నాకు వనవాసం వుందని వాళ్లప్పుడే అన్నారు. జ్యోతిష్య శాస్త్రం తెలిసిన వారు కూడా ఈ మాటే చెప్పారు. పూజ్యులు చెప్పిన మాటలు ఎలా అబద్ధమవుతాయి? జ్యోతిష్య శాస్త్రజ్ఞులు మాత్రమే కాకుండా సాముద్రిక శాస్త్రజ్ఞులు కూడా నా చేయి చూసి నేను అడవుల్లో సంచరించడానికి పోవాల్సి వస్తుందని చెప్పారు. ఇక అప్పటి నుండి ఎప్పుడెప్పుడు అడవులకు పోతానా అని ఎదురు చూస్తున్నాను. వాళ్లన్నట్లే నాకు వనవాస భాగ్యం లభించింది. బ్రాహ్మణుల ఆజ్ఞ ప్రకారం నడచుకోవాలి కదా? వాళ్ల మాట ప్రకారమే నీ వెంట వస్తాను. మరో ఆలోచన లేదు. దీనికిదే సరైన సమయం. ధీరుడా! బ్రాహ్మణులను అసత్యమాడిన వారిగా చేయొద్దు. చిన్న తనంలో పెళ్లి కాక ముందు, కన్యగానే వున్నప్పుడు, సదాచార సంపన్నుడైన ఒక తపస్వి, నా భవిష్యత్ చెప్తూ, నేను భర్తతో అరణ్యాలకు పోవడానికి ఆశపడుతానని, నా భర్త అలానే నన్ను తీసుకొని పోతాడని చెప్పింది. వారు-వీరు చెప్పారన్న విషయం పక్కన పెడ్దాం. ఎన్నో సార్లు అడవులకు పోదామని నిన్ను ప్రార్థించ లేదా? నీతో అడవులకు వస్తే ఏదో ధనలాభం వుంటుందని నేను ఆశ పడడం లేదు. నేను కోరే లాభం నీ సేవే. ఇక్కడుంటున్నప్పుడు, ఇంతవరకు, నువ్వు పనులమీద బయటకు పోయినా, మంత్రులు-ఇతరులతో మాట్లాడుతున్నా, నేను ఒక మేడలో-నువ్వు ఒక మేడలో వున్నా, నిర్విఘ్నంగా నీ సేవ చేయలేక పోయాను. వనంలో వుంటే ఇలాంటి విఘ్నాలు రావు. సర్వకాల సర్వావస్థలయందు నీ సేవ చేసే పుణ్యం కలుగుతుంది. నా మనవి మన్నించి నా ప్రార్థన అంగీకరించు. (భక్తుడు భగవంతుడిని కోరేది ఇలాంటి ఏకాంత సేవే!)"

"నిర్మలచరిత్రా! కరుణ వల్ల బంధించబడిన నిన్ను, భర్తను, కొలిచిన నేను పవిత్రురాలవుతాను. ఇది సత్యం. వేయి మాటలెందుకు? నా అభిప్రాయంలో దైవమంటే భర్తే. ఆయనను విడిచి నాకు మరొక దైవం లేదు. అలాంటప్పుడు ప్రతి రోజు దైవ పూజ లేకుండా నేనేదైనా ఎలా తింటాను? (అందుకే సీత లంకలో ఉపవాసం చేసింది). రామా! ఎందుకిన్ని మాటలు? ఒక్క విషయం చెప్తా విను. ఈ లోకంలో, ఆ లోకంలో, నీ తో సుఖంగా వుండడమే నాకు శుభకరం. సుమతీ! తండ్రి, తాతలు, మొదలైన వారు నీటి ధారతో ఎవరికైతే కన్యను దానం చేస్తారో, ఆ దానాన్ని స్వీకరించిన వాడే ఇహ–పర లోకాలలో ఆమెకు భర్త. ఇలా అని వేదాలు మొరపెట్టుకుంటున్నాయి. ఇవన్నీ నీకు తెలియని విషయాలు కావు. నీకు తెలియని సంగతి బోధించే ప్రయత్నం నేను చేయడం లేదు. నువ్వు నాకు చెప్పే విషయం శాస్త్ర సమ్మతమైంది కాదు. నీ అంతఃకరణ కూడా అంగీకరించదు. ప్రబలమైన వేద ప్రమాణాలు ఇలా వుంటే, నీ గృహిణిని, మంచి నడవడికల దానిని, స్వభావరీత్యా సదాచార సంపన్నను, భర్త తప్ప వేరే దైవం తెలియని దానిని, వినయ సంపద కలదానను, నీ భక్తురాలను, నిన్ను వదల లేక దీనురాలిగా వున్న దానిని, సుఖ దుఃఖాలలో నీతో సమానురాలను, నన్ను, నా ప్రాణేశ్వరుడవైన నువ్వు ఎందుకు వెంట తీసుకొని పోవు? నీ లాంటి వాడికిది తగిన పనా?"

"రామా! నన్నిక్కడ దుఃఖ సముద్రంలో పడేసి, నువ్వు అడవులకు పోవడానికి ప్రయత్నం చేస్తే నేను అగ్నిలో దూకుతాను. విషం తింటాను. నీళ్లలో మునుగుతాను. నీకు పనికిరాని నా శరీరం, ఈ ప్రాణం నాకు మాత్రం ఎందుకు? (ఇలా బలాత్కారం చేయడం పాపం కాదా? పతివ్రతల దేహం పతి సేవ కోసమే కాని స్వప్రయోజనం కొరకు కాదు. భక్తుడు, పతివ్రత సమాన ధర్మం కలవారే. ఇతరుల సేవకు వారి శరీరాన్ని ఉపయోగించ కూడదు. సతికి భర్త సేవకుపయోగపడని దేహం వున్న ప్రయోజనం లేదు. కాబట్టి అలాంటి దేహాన్ని వదలాలి. పతి మరణానంతరం సతీ సహగమనం బలాత్కార మరణం కాదు. దానికి భక్తే కారణం. మగడు దుఃఖిస్తే దుఃఖపడేది, సంతోషిస్తే సంతోషించేది, మరణించినపుడు మరణించేది పతివ్రత. మగడు మరణిస్తే బ్రహ్మచారిగానైనా వుండాలి లేదా సహగమనమైనా చేయాలి. పతి వియోగం పతివ్రత సహించదు.

ఇది పోషిత భర్తృక విషయం కాదు. భగవత్ ప్రీతికై భక్తుడు ప్రాణం వదలడం ఎలాంటిదో భర్త కొరకు భార్య ప్రాణం వదలడం అలాంటిదే. భరతుడు పదిహేనో సంవత్సరం మొదటి రోజున రాముడు అయోధ్యకు తిరిగిరాకపోతే అగ్నిప్రవేశం చేస్తాననడం అలాంటిదే. ఇక్కడ భక్తి ప్రధానం కాబట్టి దోషం లేదు)."

ఇన్ని విషయాలు చెప్పినా తన వనవాసానికి శ్రీరాముడు అంగీకరించక పోవడంతో సీత కన్నీటి వరదల్లో స్నానం చేస్తుంటే, రామచంద్రుడు ఆమె సంతాపాన్ని తగ్గించాడు.

❖ ❖ ❖

సర్గ-30

శ్రీరాముడిని నిష్ఠూరాలు ఆడిన సీత

కార్య భాగాన్ని నిర్వీర్యం చేసి, శుష్కోపచారాలను వల్లిస్తున్న పురుష శ్రేష్ఠుడైన శ్రీరాముడిని చూసి, తాను అడవుల్లో తిరగాలన్న కోరికున్నదైనందున, మెత్తటి మాటలతో లాభం లేదని, పని కాదని భావించింది సీత. తనను వదిలిపెట్టి పోతాడనే భయంతో గుండెలు కొట్టుకుంటుంటే, గడగడ వణకుతూ, చాలా కోపంగా, అమిత పరాక్రమవంతుడైన తన భర్తను రెప్పవాల్చకుండా చూస్తూ స్నేహభావంతో పరుష వాక్యాలను, ఇలా అన్నది. "రామా! ఇప్పుడిలాగే, ఇక్కడే, నువ్వు నన్ను అడవులకు తీసుకొని పోకుండా, ఇంట్లోనే విడిచి పోయిన వార్త విదేహనగర రాజు, మిథిలా దేశాధిపతి, జనకుడు వింటే నీ గురించి ఏమనుకుంటాడు? తన అల్లుడు స్త్రీ అని, మగ వేషంతో వచ్చి తన కూతురును పెళ్లి చేసుకుని పోయెనని అనుకోడా? అవశ్యం అనుకుంటాడు. అగ్ని సాక్షిగా పెద్దల ఎదుట నన్ను పెళ్లి చేసుకున్న నువ్వు, కట్టుకున్న భార్యను, శాస్త్ర దృష్టిలో నన్ను భరించవలసిన నువ్వు, విడిచిపోతానంటున్నావు. అది సరైంది కాదు. కోపంలో ప్రళయాగ్నితో సమానమైన నువ్వు, నన్ను తీసుకుని పోవడానికి, ఏదో చెడ్డ పని చేస్తున్నట్లు బాధపడతావెందుకు? నేను భార్యను-భర్తవ్యను. నువ్వు భర్తవు కాబట్టి చేయాల్సిన పని చేయడానికి ఇంత దుఃఖమా? నువ్వే కారణంతో భయపడుతున్నావు? నువ్వు తప్ప వేరే గతి లేని దాన్ని. పతివ్రతను. నిన్నొక్కరిని తప్ప రంకుటాలివలె ఎవరినీ మనసులోనైనా తలచుకోను. నమ్ము".

"నీకు స్వాధీనపడి, నీకు మేలైన మార్గాన్నే నడచే నన్ను, సత్యవంతుడికి సావిత్రి ఎలాగో నేనూ అలానే అని నమ్ము. సత్యవంతుడి వెంట సావిత్రి అడవులకు పోవడం ఆమె సుఖసంతోషాల కొరకు కాదు…అయనను రక్షించేందుకే! అలానే, నేను కూడా అరణ్యాలకు వస్తాననడం నీ క్షేమం కోసం, నీ కోసం, నీ సౌఖ్యానికోసం, నీ పనిలో సహాయ పడడం కోసమే. (ఆర్తుడైన వాడికి భార్యతో సమానమైన ఔషధం లేదు). నీ గృహిణిని నేను. నన్ను విడిచి నువ్వే దర్మం చేయలేవు. అందునా, లేత వయసులో, యౌవనారంభంలో వున్న అందకత్తెను.

ముట్లుడిగిన ముసలిదానిని కాని, కురూపిని కాని కాదు. అంతే కాకుండా పతివ్రతను. నా తండ్రి నన్ను నీకు దానం చేసేటప్పుడు, సహధర్మచరి అని చెప్పలేదా? నీతో కలిసి నేను ధర్మం చేయాల్సిన దాన్నే కదా? నీ తండ్రి నీ కెలాగో, నా తండ్రి కూడా నాకు అలాగే కదా? నీవెలా పితృవాక్య పాలన చేయాలనుకుంటున్నావో, నేను కూడా ఆ విధంగానే, నా తండ్రి సత్యాన్ని కాపాడాలి కదా? నా స్వధర్మానికి నీవెందుకు అడ్డుపడతావు? రాజులు వారి స్వధర్మంలో నడచుకుంటూ, ఇతరులు కూడా అలానే ప్రవర్తించేట్లు చేయాలి కదా? బోయవాడు కూడా తన స్వధర్మంలో తానుండక పోతే తండ్రి దండిస్తాడని భయపడతాడు కదా? నువ్వేమో, నన్ను, నా స్వధర్మంలో నడవకుండా, పాతివ్రత్యం పాటించకుండా ఆపుతున్నావు".

"ఈ కారణం వల్ల, నన్ను విడిచి నువ్వు అడవులకు వెళ్లడం మర్యాద కాదు. నువ్వు అడవుల్లో వున్నా, స్వర్గలోకంలో వున్నా, తపస్సు చేసినా, అదే నా లోకం. భార్యకు పతి సాలోక్యమని తెలియదా? నువ్వు ఒక చోట వుంటే నేను మరొక చోట ఎలా వుంటాను? అడవుల్లో నడుస్తుంటే నాకు అలసట రాదు. ఉద్యానవనంలో లాగా విహరిస్తూ ఎంతో సంతోషపడతాను. మార్గంలో దర్భలు, రెల్లు, పల్లేరు కాయలుంటాయని చెప్పావు. అవన్నీ నా దృష్టిలో జింక చర్మాలుగా, దూదేకులుగా భావిస్తాను. ఆ తరువాత ఇంకేం కష్టం? సుఖ దుఃఖాలు మనోగతాలు కాని, వస్తుగతాలు కావు. కాబట్టి పూర్ణానందంతో వుండే నన్ను అవి బాధ పెట్టవు. కష్టపడకుండా ఏ పనీ జరగదు. అలా అని చెప్పి ఎవరైనా, ఏదైనా పని మానుకున్నారా? నీకు పల్లేరు కాయలుగా కనిపించేవి నాకు దూదేకులుగా కనిపిస్తాయి. అడవిలో హోరుగా గాలి వీస్తుంది అన్నావు. అడవిలో వీచే ఆ సుడిగాలి ద్వారా రేగిన దుమ్ము నాకంటుకుంటే, దాన్ని నేను, వంటికి గందం పూసుకున్నట్లుగా తలుస్తాను. పల్లేరుకాయలు, సుడిగాలి దూళి....ఇవన్నీ కష్టమని తెలిసి కూడా సహించుదామని నువ్వు పోతున్నావు కదా?వాటిని నేను గంధం పొడిగా, దూదేకులుగా అనుకుంటుంటే రావడానికి ఎందుకు భయం? లేత నును పచ్చిక బయళ్ల మీద నీ తో కలిసి పండుకోవాలని అనుకుంటున్న నాకు, రత్న కంబళాల మీద పండుకోవాలనే ఆశ

ఎందుకుంటుంది? నును పచ్చిక కంటే కంబళి నున్నగా–మెత్తగా వుంటుందా? చల్లగా వుంటుందా? చెట్ల ఆకులు, పండ్లు, కోయకూడదని అన్నావు. సంతోషం. వాటితో నాకసలేంపని? ఆకులో–అలములో, పండ్లో–కాయలో, కొద్దో–గొప్పో, నువ్వు సంపాదించి, వాటిలో కొన్ని నా చేతిలో ప్రీతితో పెట్టి తినమంటే తింటాను.... పెట్టకుంటే తినను. నువ్వేది ఇస్తే అదే నాకు అమృతం. ఆహార పదార్థాలు సేకరించడం నా పని కాదు. నువ్వు తెచ్చినవాటిని భుజించేట్లు అమర్చడం, నువ్వు తినగా మిగిలింది తినడం, అదే అమృతంగా భావించడం మాత్రమే నా పని".

"అడవిలో ఒంటరిగా వుండాలంటున్నావు. నేను కోరేదీ అదే! నేను తండ్రిని కాని, తల్లిని కాని, తోడబుట్టిన వాళ్లను కాని, చూడాలనుకోను. వాళ్లను తలచను. ఇల్లు–వాకిలి గురించి అనుకోను. నీకిష్టమైతే, ప్రేమగా నా చేతిలో ఓ కాయో–పండో పెడితే వాటినే తింటాను. లేకపోతే లేదు. నీకు తినడానికి ఇష్టమైందేదైనా అది నాకూ ఇష్టమే. ఏ విషయంలో కూడా నీకు నేను కష్టం కలిగించను. తెలియకుండా కూడా అలా జరగదు. నమ్ము. నీతో నేనెక్కడ వుంటే అదే నాకు వైకుంఠం. లేకపోతే అదే నాకు నరకం. ఇది నా నిశ్చయం. తెలుసుకో. కాబట్టి, ఇక్కడ వుండి నరకబాధ పడకుండా నీతో వచ్చి సుఖపడతా. ప్రాణేశ్వరా! అడ్డుపడవద్దు. ఇది సరైందే...పిలుచుకుని పోవాలని అనుకోకుండా... ఇక్కడే వుండి ఏడ్వమని అంటే...నేను తెగబడి విషం తాగుతా కాని, విరోధులకు చిక్కి కష్టపడను. అలా కాకుండా నువ్వు ఒంటరిగా పోదామనుకుంటే, నన్ను విడిచి నువ్వు కూడా బతక లేవు. నిన్ను విడిచి నేనూ బతక లేను. చేపను వదిలి నీళ్లుండగలవేమో కాని, నీళ్లను విడిచి చేప వుండలేదు కాబట్టి, నా దేహం ఇక్కడ వున్నప్పటికీ, ప్రాణాలు నీ వెంటే వస్తాయి. నువ్వు ఎదురుగా లేకుండా చావడం కంటే, నీ పాదాల మీద పడి నీ కళ్లెదురుగా మరణించడం మేలు. పరుష వాక్యాలు పలికే పగవారిని నేను ఎలా ప్రేమిస్తాను? నీ వియోగమే నాకు శత్రువు. ఓసీ పాపాత్మురాలా! విషం తిని చస్తే ఆత్మహత్య అవుతుందికదా! అంటావేమో? నరకానికి పోతానంటావేమో? పద్నాలుగేళ్ల వియోగంతో వచ్చే దుఃఖాన్ని సముద్రంలో దాచి నేను బాధ పడాలా? అది నాకు సాధ్యమా? వెంటనే ప్రాణాలు పోయేట్లు విషం తినడం మంచిది.

అల్పకాలం నువ్వు కనబడకపోతేనే ప్రాణాలు నిలుపుకునే ధైర్యం లేని దానిని. అన్నేళ్లు ఎలా సహించాలి?" అంటూ దుఃఖాతిశయంతో శ్రీరాముడిని పట్టుకుని ఏడ్చింది.

సీత భర్త మాటలను మరీ-మరీ తలచుకుని ఏడిచింది. తామర పూలనుండి నిర్మలమైన నీళ్లు కారిన విధంగా, కన్నీళ్లు కారుస్తూ, సీత ఏడుస్తుంటే, ఆ నీటితో ఆమె కాటుక కరిగి పోయి, స్ఫటికం లాంటి తెల్లటి కాంతితో ఆమె నేత్ర కమలాల నుండి భాష్పాలు రాలాయి. శ్రీరాముడి వెంటబోవడానికి ఎంతో పుణ్యం చేసుకున్న సీత నిర్మలమైన చంద్రబింబ సమానమైన ముఖ కమలాలు నుండి విడువకుండా కారుతున్న కన్నీళ్ల వేడితో ఆమె బాగా వాడిపోయింది. ఆమె ముఖం సూర్యకాంతితో వాడిన కమలాల లాగా వుంది. సీతాదేవి చెప్పిన మాటలన్నీ పరమ భక్తి-ఆచారం కలవారి భావాలే. ఇంత భక్తి, విరక్తి కలిగి భవద్విశ్లేషం కొంచేం కూడా సహించ లేక, అది కలుగుతుందేమోనని ఏడుస్తూ, కన్నీళ్లు వచ్చి, ప్రాణం పోయేంతవరకు కలిగే పరిస్థితి వస్తే తప్ప భగవదనుగ్రహం కలగదు. ఇది పరమ భక్తుడి, ఆర్త ప్రపన్నుడి లక్షణం. పరమ భక్తుడు భగవద్వియోగం సహించలేడు. ఆర్త ప్రపన్నుడు శరీరాన్ని సైపడు.

సీత అడవులకు రావడానికి ఒప్పుకున్నశ్రీరాముడు

ఇలా శరీరం ఆమె స్వాధీనం తప్పి, పడిపోవడానికి సిద్ధమైన స్థితిలో వున్న సీతను ఓదార్చుతూ, మిక్కిలి ప్రేమతోకౌగలించుకుని, ఆమెను బాధపడవద్దని, తనతో తీసుకొని పోతానని చెప్పాడు శ్రీరాముడు. నిజంగానే తీసుకొని పోతానని చేతిలో చేయి వేసి ప్రమాణం చేసి మరీ ఆమెను నమ్మించి ఇలా అన్నాడామెతో: "భామినీ! నీకెంత కోపం వుందే! సీత చిలుకలాంటిదే కాని, రేగితే, రేచుకుక్క లాంటిదనే సామెతను నిజం చేశావు. నీ మనసు తెలుసుకోవాలనుకొని రావద్దనగానే ఎన్ని కఠినమైన మాటలన్నావు? నీకు దుఃఖం కలిగితే, దానివల్ల నాకు స్వర్గం లభించినా, అక్కడ నేనుండడానికి అంగీకరిస్తానా? ఈ మాత్రం తెల్సుకోలేక పోయావు కదా? సీతా! నిన్ను నేను అడవుల్లో కాపాడలేక భయంతో నువ్వు రావద్దని అనలేదు. బ్రహ్మం లాగా నాకెవరివల్లా భయం లేదు. నేనే ఆ

బ్రహ్మం కదా? భయం వదిలిపెట్టు. నీ కళ్ళు చూడగానే నువ్వెంత భయపడ్డది, నీ గుండె ఎంత చెదిరింది, నాకు అర్థమైంది. నీ ఉపచారానికే చెప్తున్నావో, పరమార్థ బుద్ధితో అంటున్నావో, మరెందుకో అని నీ మనసులోని ఆలోచన నాకు తెలియక, నీ కళ్ల లాగే మనసు కూడా చంచలం అని భావించాను. ఆ విషయం తెలుసుకోవడానికి, అడవుల్లో నిన్ను రక్షించే శక్తి కావలిసినంత వున్నప్పటికీ, నీ విరహాన్ని భరించే శక్తి లేకపోయినప్పటికీ, ఏ విధమైన భయం లేకపోయినప్పటికీ, నిన్ను తీసుకోపోవడానికి కొన్ని అడ్డంకులు చెప్పాను. క్షమించు. కోపగించుకోవద్దు. ప్రాణేశ్వరీ! నాతో నువ్వు వనవాసం చేయడానికే బ్రహ్మ దేవుడు నిన్ను పుట్టించాడు. ఆత్మజ్ఞానం కలవాడు ఎన్ని కష్టాలు వచ్చినా శాంతాన్ని వదల కూడదన్నట్లు, నిన్ను ఎడబాసి నేను బతకగలనా? నువ్వెందుకు నవ్వులాటకన్న మాటలకు విచారపడతావు? నేను నిన్ను అడవులకు పిల్చుకొని పోవడం శిష్టాచారమే కాని నీ మీద మోహంతో కాదు. పూర్వం గృహస్థ ధర్మం నుండి గొప్పవారు తాము అరణ్యానికి పోయేటప్పుడు, భార్యలను కూడా తమ వెంట తీసుకొని పోయేవారు. కాబట్టి భార్య చిన్నదైనా, తరుణైనా, తనతో తీసుకొని పోవడం ఉత్తమ ధర్మం. ఆ ధర్మ మార్గంలోనే నేను నడచుకుంటాను. సూర్యుడి వెంట భార్య సువర్చల వచ్చినట్లు నువ్వు నా వెంట సంతోషంగా అడవులకు రా".

నరుడికి పితృపూజ అవశ్య కర్తవ్యమని సీతకు చెప్పిన శ్రీరాముడు

నువ్వెందుకు అడవికి పోవాల్సి వచ్చిందని సీతాదేవి శ్రీరాముడిని అడగలేదు. ఐనప్పటికీ, లక్ష్మణుడి లాగా ఆమెకు కూడా ఏదైనా సందేహం వుందేమోనన్న భావనతో, తనంతట తానే కారణం చెప్పాడు శ్రీరాముడు సీతకు. "నా వల్ల నీకు, కౌసల్యకు, లక్ష్మణుడికి ఎంతో బాధ కలిగిందని నాకు తెలుసు. ఇతరులను కష్టపెట్టే పని నేనెందుకు చేయాలని నువ్వు అడగవచ్చు. ఏం చేయమంటావు? అడవికి నేనిప్పుడు పోనని చెప్పడానికి వీల్లేదు. ఎందుకంటావేమో? నా తండ్రి కైకకు ఇచ్చిన వరాలు నన్ను అడవికి పోయేలా చేసాయి. ఇక్కడుండడానికి వీల్లేదు. వుంటే, నా తండ్రి మాట అసత్యం చేసినవాడినవుతాను. ఆయన

సత్యవ్రతం తప్పుతుంది. అదికాకుండా, కొడుకులకు తండ్రి మాట ప్రకారం నడచుకోవడం మానలేని ధర్మం. దానికి తిరుగులేదు. కాబట్టి నేనెలా ధర్మ మార్గాన్ని వదలి జీవించగలను? ఇక్కడుంటే నా ప్రాణం పోతుంది. తల్లిదండ్రుల మాటను కాదని, ఇంట్లోనే వుండి, దేవతార్చనలు చేస్తుంటే నా పాపం పోదా అని అంటావేమో? పూజలు చేసే వాడికి ఎదుటనే వుండి, మంచిచెడులు బోధించి, అతడి ఇష్ట ప్రకారం వుండే దేవతలు సాక్షాత్ తల్లిదండ్రులు, ఆచార్యుడు. ఇలా తన అందుబాటులో వుండే దేవతల మాట తిరస్కరించి, కానరాని దేవతలను పూజించడ మెందుకు? ఎవరి వల్ల మనం ప్రత్యక్షంగా ఫలితం పొందుతున్నామో, వారి మీద భక్తి లేకుండా, తనకు అందుబాటులో లేని పరోక్ష దేవతలను పూజించడం కంటే, ప్రత్యక్ష దేవతలను పూజించడమే మేలైన విషయం. తల్లిని, తండ్రిని, ఆచార్యుడిని, సేవచేసే మనుష్యుడు స్వర్గ, మర్త్య, పాతాళ మనే ముల్లోకాలను జయించగలడు. అలాంటి పితృ సేవతో సమానమైన, ఎంతో పవిత్రమైన, సంసార భయం లేని సేవ ఇంకోటి భూమ్మీద లేదు. దానం కాని, మానం కాని, అన్ని ధర్మాలు సత్యం చెప్పడంలోనే వున్నాయని చెప్పే సత్యం కాని, యజ్ఞం కాని, మరింకేదైనా కాని పితృ సేవ వల్ల కలిగే ఫలితాన్ని పరలోకంలో కూడా ఇవ్వలేవు. స్వర్గమో, ధాన్యమో, అధిక సుఖమో, ధనమో, సుతులో, భాగ్యమో, చదువో, వీటిలో ఏదైనా గురువుల సేవవలన కలిగే బలంతో సాధించడం ఏ మాత్రం కష్టం కాదు. మాతపితృ సుపరాయణులు, తల్లిదండ్రులే పరమగతి అని సేవించువారు, గోలోకం కాని, బ్రహ్మలోకం కాని, దేవలోకం కాని, గంధర్వ లోకం కాని, విస్తారాలైన మరే ఇతర లోకాలు కాని పొందేందుకు శక్తికలవారై వుంటారు. సత్యమనే ధర్మంతో కూడిన మనసుతో మా తండ్రి ఏం చెప్పాడో, ఆ వనవాసం చేయడానికి నేను నిశ్చయించుకున్నాను. ఇది ముఖ్యమైన సనాతన ధర్మం. నీ అభిప్రాయం తెలియకపోవడం వల్ల నా తో రావద్దని అన్నాను. అలాకాదు...నిశ్చయంగా వస్తానని, నీ ధృఢాభిప్రాయంగా చెప్పావు. అలాంటి అభిప్రాయం నీకుంటే, నిన్ను విడిచి నేనెలా పోతాను? నువ్వు రానంటే నేనే పోదామనుకున్నాను. ఏ దోషం వల్ల వనవాస కష్టం వస్తుందో, అలాంటి దోషాలు నీకు లేవు. ఐనా, వనవాసం చేయడానికి నువ్వు పుట్టావు. ఇది కర్మ వశం వల్ల వచ్చింది కాదు. స్వేఛ్చాలబ్దం కాబట్టి దీనికొరకు

నువ్వు దుఃఖించాల్సిన పని లేదు. పోదాం..రా..ప్రయాణానికి సిద్ధం కా. ఇక నువ్విలా వుండాల్సిన పని లేదు. లే..లెమ్ము. కొంచెం కూడా సందేహం వద్దు. నా వెంట, నా సహధర్మచారిణివై, నేను చేసే ధర్మంలో తోడై రా. నీ వంశ, నా వంశ కీర్తికి తగిన విధంగా నువ్వు నిశ్చయించుకున్నావు. ఇది శ్లాఘించాల్సిన విషయమే తప్ప దోషం లేదు".

దానం చేసేందుకు సీతను పురమాయించిన శ్రీరాముడు

ఇంకా రాముడిలా చెప్పాడు: "జాయా! అరణ్య యాత్రకు యోగ్యమైన పనులన్నీ చేయి. మనలో మనం ఒకరినొకరు విడిచి వుండాల్సి వస్తే, అలాంటి వియోగం వల్ల నాకు స్వర్గ ప్రాప్తి కలిగినా నేను అంగీకరించను. బ్రాహ్మణులకు ధనం ఇవ్వు....బిచ్చగాళ్లకు అన్నం కడుపు నిండా పెట్టు. ప్రయాణానికి సిద్ధపడు. ఇక ఆలస్యం చేయొద్దు". తాను కట్టు వస్త్రాలతో భర్త వెంట రావడానికి సిద్ధంగా వున్నానని, తన ఆలస్యం ఏ మాత్రం లేదని, తాను చేయాల్సినదేమైనా వుంటే చేస్తానని అన్న సీతతో శ్రీరాముడిలా అన్నాడు. "బ్రాహ్మణులకు దనం ఇచ్చిన తరువాత వస్త్రాలు, ఆభరణాలు, పాన్పులు, వాహనాలు, బంగారుబొమ్మలు లాంటి వినోద పదార్థాలన్నీ మనలను ఆశ్రయించి జీవిస్తున్న సేవకులకు ఇవ్వు". ఇలా సంతోషంగా తాను అడవులకు రావడానికి అంగీకరించిన భర్త చేయమన్న పనులన్నీ చేయడానికి, ఆయన ఆజ్ఞానుసారం, దానాలు ఇవ్వడానికి ఆనందంగా సిద్ధమైంది సీత.

❖ ❖ ❖

సర్గ-31

తాను అడవులకు వస్తానని శ్రీరాముడిని ప్రార్థించిన లక్ష్మణుడు

శ్రీ సీతారాముల మధ్య జరిగిన సంభాషణను, శ్రీరాముడి వెంట వచ్చి సమీపంలోనే వున్న లక్ష్మణుడు ఆసాంతం విన్నాడు. కట్టుకున్న భార్య, అర్థాంగ లక్ష్మి, నిత్యానపాయిని, సీతనే వనవాసానికి, ఇంత కష్టం మీద, చివరకు ఆమె కన్నీరు కార్చే స్థితికి పోయిన తరువాత, శ్రీరాముడు అంగీకరించడాన్ని అర్థం చేసుకున్నాడు. ఆమెకే ఇంత ఇబ్బంది కలిగితే, సవతి తల్లి కొడుకైన తనను అడవులకు తీసుకుపోవడానికి ఏ విధంగా అనుగ్రహిస్తాడని సంశయించాడు లక్ష్మణుడు. ఒక వేళ అంగీకరించకపోతే తన గతేంటి అనుకున్నాడు. ఈ కారణాన బాధపడుతూ కన్నీళ్లు కార్చడం మొదలెట్టాడు. లక్షణుడు అన్న వెంట పోవాలా? వద్దా? ఏది ధర్మం? ఏది కాదు? అనే విషయంలో భిన్నమైన వాదనలున్నాయి. 'పితృ సమో జ్యేష్ఠ' అనే న్యాయాన్ననుసరించి, అన్న తండ్రితో సమానుడు కాబట్టి, శ్రీరాముడి వెంట లక్ష్మణుడు పోవచ్చని ఒక వాదన. ఐతే, ఇది సామాన్య ధర్మం. అది కూడా తండ్రి మరణానంతరమే కాని బతికుండగా కాదు. అందుకే, శ్రీరాముడి కైంకర్యాభిలాషతోనే లక్ష్మణుడు ఆయన వెంట పోయాడనుకోవాలి. మరో పక్క, తల్లి, తండ్రి జీవించి వుండగా, వాళ్ల సేవ వదలి, వారి ఆజ్ఞ లేకుండా అన్న వెంట పోవడం సందిగ్ధ ధర్మం. కాకపోతే, ప్రయాణానికి సిద్ధపడి, సర్వం వదలి, సీతారాముల వెంట పోవడానికి బయల్దేరుతుంటే, అప్పుడాయనకు తల్లిదండ్రుల అనుమతి లభించింది.

శ్రీరామ శుశ్రూష అనే ప్రయోజనం కోరి, వేరే ఉపాయానికి ఇష్టపడని లక్ష్మణుడు, అన్న వెంట పోవాలని నిశ్చయించుకున్నాడు. లక్ష్మణుడు ప్రకృతి ఫలాన్ని పొందేందుకు ఏ విధంగానైతే వేరే ఉపాయాన్ని వద్దనుకున్నాడో, అలానే, తనకు శ్రీరామ కైంకర్యం తప్ప వేరే ఫలం అక్కరలేదనుకున్నాడు. వేరే దైవం, వేరే ఉపాయం, వేరే ఫలం ఆశ్రయించకుండా, ఆశించకుండా వుండడాన్నే

ఏక భక్తి అని, అనన్య భక్తి అని, అవ్యభిచార భక్తి అని అంటారు. తన అభిప్రాయాన్ని లక్ష్మణుడు ఇలా చెప్పాడు శ్రీరాముడికి: "చేతిలో విల్లు ధరించి, గొప్ప మృగాలతో నిండిన అడవుల్లో అపాయం లేని తోవల గుండా, నేను ముందు పోతుంటే, నా వెనుక మీరిరువురూ, ఎటువంటి ప్రయాస లేకుండా వన వినోదం చూసుకుంటూ రావచ్చు. సంచరించవచ్చు. నేను మీ వెంట వుంటే, పెద్ద పులులు వచ్చినా, జింకలు తగిలినా, ఇతర మృగాలు అడ్డు పడ్డా, పెద్ద అడవులు వచ్చినా...ఇలా ఎక్కడైనా హాయిగా సంచారం చేయొచ్చు. నేను రాకపోతే మీ సుఖ ప్రయాణం సాగదు. దేవా! మహానుభావా! నువ్వు లేని స్థలం వైకుంఠమైనా నాకు వద్దు. వైకుంఠమే వద్దనుకునే నాకు కైవల్యం కాని, అంతకంటే తక్కువైన బ్రహ్మ పదవిని కాని కోరుకుంటానా? కేవలం ఆత్మోపాసనల గమ్య స్థానం మాత్రమే కైవల్యం".

లక్ష్మణుడిలా అనగా, శ్రీరాముడు విఘ్నకరమైన, ప్రతికూలమైన మాటలనేకం చెప్పి, వూరడించాడు. మరల లక్ష్మణుడిలా అన్నాడు: "ఇంతకు ముందు నేను రావడానికి అంగీకరించావు. ఇప్పుడేమో వద్దంటున్నావు. దీనికి కారణం ఏంటి? ఎందుకు నా సాంగత్యం వద్దనుకున్నావు? పుట్టినప్పటి నుండి, నా సేవలను ఇంతకాలం అంగీకరించి, ఇప్పుడేదో నాలో లోపం వున్నట్లు నన్ను రావద్దని అంటున్న విధంగా వుంది. ఆ సవతి కొడుకలా చేశాడు...ఈ సవతి కొడుకేం చేస్తాడో అని సందేహమా? అర్థం అయ్యేట్లు చెప్పు".

లక్ష్మణుడిని అయోధ్యలో వుండమని చెప్పిన శ్రీరాముడు

తనకంటే ముందుగా అరణ్యాలకు పోవడానికి సన్నాహమవుతు, తన అనుమతికై ఎదురుచూస్తున్న కీర్తికరమైన, ద్రోహబుద్ధి లేని లక్ష్మణుడు, రెండు చేతులు జోడించి చేస్తున్న ప్రార్థనను అర్థం చేసుకున్న శ్రీరాముడు, తమ్ముడితో తన మాటలుగా ఇలా చెప్పాడు. "లక్ష్మణా! నువ్వు నాకు పుట్టుకతోనే తమ్ముడివి. అంతే కాకుండా ప్రేమ ఇవ్వడంలో నా ప్రాణంతో సమానమైన వాడివి. నాకు వశపడి నేను చెప్పినట్లే వినయంతో చేసేవాడివి. గొప్ప ధర్మంతో ప్రకాశించే గుణం కలవాడివి. పవిత్రమైన కళ్యాణ గుణాలున్నవాడివి. నా చెలికాడివి. బలవంతుడవు. స్నేహితుడివి. వీటిల్లో ఒక్క గుణం మాత్రమే వున్నా

చాలనుకుంటే, నీ కేమో అన్ని గుణాలున్నాయి. ఇన్ని గుణాలున్న నిన్ను నిష్కారణంగా ఇక్కడ వదలి పోతానా? నీలో ఏదో దోషముందని నిన్నిక్కడ వదలి పోవడం లేదు. నా ఆలోచనా విధానం చెప్తా విను. నా వెంట నువ్వు వచ్చావనుకో! ఆ తరువాత నీ తల్లిని, నా తల్లిని ఏ లోపం లేకుండా భరించేవారెవరు? మన తండ్రి రాజున్నాడు కదా! అంటావేమో? ఉన్నాడు…కాని ఏం ప్రయోజనం? జడివాన గొప్పగా దేశమంతా కురిసినట్లుగా, అందరికీ సుఖం కలిగించాల్సిన తండ్రి–మన తల్లుల భర్త, కామపాశ సమూహాలతో బంధించబడి వుండడం నీకు తెలుసుగా? భర్త అలా, కొడుకులిలా అవుతే, మన తల్లుల గతేంటి".

"భరతుడు లేడా? కైక లేదా? వాళ్లా మాత్రం చూడరా? అని అంటావేమో? రాజ్యమంతా తన స్వాధీనంలోకి తెచ్చుకున్న కైక, మనకెవరితో ఏం పని అనుకొని, తన సవతులను, అందునా దుఃఖించేవారిని, అసలే పట్టించుకోదు. ఏ మాత్రం మేలు చేయదు. వాళ్ల కొడుకులు అరణ్యాలకు పోయారు కాబట్టి వాళ్లేడుస్తున్నారని అన్న భావన ఆమెకు రాదు. తన కొడుకు రాజైనాడు కాబట్టి వాళ్లేడుస్తున్నారని, వాళ్ల మీద నింద మోపే ప్రయత్నం చేసి వాళ్లను అనాదరిస్తుంది. ఇక భరతుడి సంగతి ఏంటంటే…వాడు తల్లి లాలనకు లోపడి కౌసల్యా సుమిత్రలను మనసులోనైనా అనుకోడు. కాబట్టి నువ్వైనా ఇక్కడ వుండి వాళ్లను వూరడింపు, బాధలు తీర్చు. సుమిత్రానందనా! నువ్వు ఇతరుల సహాయం తీసుకొనైనా, లేదా తీసుకోకుండా ఐనా, ఇక్కడే వుండి తల్లిని చూసుకో. నా మాట మీద గౌరవం వుంచి, నీతిగా అన్న మాట మీర కూడదని అనుకో. నేను వదలిపెట్టి పోతున్న నా తల్లి, నువ్వున్నావు కదా అని, నిన్ను చూసుకుంటూ, నేనున్నట్లే భావించి సంతోషపడుతుంది. అంతే కాదు. నా మీద నీకున్న ఉత్తమోత్తమ భక్తి కారణాన, నాకు నువ్వు సేవచేయడం కంటే నాకిష్టమైన వారికి సేవ చేయడం నాకెక్కువ సంతోషం కలిగిస్తుంది కదా? పెద్ద వారిని భక్తితో సేవిస్తే పుణ్యం పెరుగుతుంది. పాపం పోతుంది. ఏ దోషం లేని నువ్వు ఇలా చేయడమే నాకు సమ్మతమైన పని. అన్నా! లక్ష్మణా! రఘువంశమనే పాల సముద్రానికి నువ్వు పూర్ణచంద్రుడి లాంటివాడివి. నా కోసం నా మాట విను. నువ్వు, నేను, ఇద్దరం లేకపోతే, మన తల్లులు ఈ శత్రువుల మధ్యలో వారిని ఆదుకునేవారు లేక ఎలా సుఖపడతారు?"

ఇలా శ్రీరాముడు మంచిగానే చెప్పిన కష్టమైన మాటలు వినివిని లక్ష్మణుడు జవబిచ్చాడిలా: "వివేక సంపన్నా! భరతుడు నీ తల్లిని వినయంగా, నిర్మల మనసుతో భరిస్తాడు. స్త్రీలను, అందునా తల్లులను ఎందుకు బాధిస్తాడు? ఒక వేళ భక్తితో చేయకపోయినా, పోషించకపోయినా, వారిని అనాదరణకు గురిచేస్తే, అసమాన తేజస్సుగల నీకు కోపమొస్తుందని అతడికి తెలియదా? వాళ్ల విషయంలో అతడెప్పటికీ అలా చేయడు. భక్తి లేకపోయినా భయంతోనైనా వాళ్లను ఆదరిస్తాడు. అన్నా! నన్ను తీసుకోపోవద్దనుకొని ఈ కారణాలు చెప్తున్నావో? లేక నన్ను పరీక్షించడానికి ఇలా అంటున్నావో? నాకు అర్థం కావడం లేదు. అలా కాకపోతే ఆర్య స్త్రీరత్నమైన కౌసల్యా దేవిని నా లాంటివారా భరించాల్సింది? ఆమే నా లాంటి వేలమందిని తన దానాలతో, గౌరవాలతో భరించగల శక్తికలది కదా? ఎందుకంటే, కేవలం తన సేవచేసే వారికే, తన దాన గుణానికి అనుగుణంగా వేయి వూళ్లిచ్చింది కదా? వాస్తవం ఇదైతే, వారు–వీరు అవసరమా? ఆమెను నేను భరించాల్సిన అవసరం లేదు. కౌసల్య లాగానే సుమిత్ర కూడా తన్ను భరించుకోగలదు. ఆమె జీవించడానికి అనేక వూళ్లున్నాయి. ఆమే నావంటి వారిని రక్షించగలదు. కాబట్టి వాళ్లిదరు కూడా వాసోగ్రాసాలకు ఇతరులపై ఆధారపడాల్సిన పని లేదు. అన్నా! నువ్వు నన్ను బంటుగా ఏలుకో. ఇందులో ధర్మహాని లేదు. అన్నను తమ్ముడు బంటులాగా వాడుకోవడం ధర్మవిరుద్ధమైన పని కాదు. అన్న తండ్రితో సమానం. అలా ఒప్పుకుంటే నేను నీ సేవచేసి జన్మ సాఫల్యం పొందుతాను. దీనివల్ల నీకు కూడా ప్రయోజనం వుంది. అడవుల్లో నీకవసరమైన కందమూలాలు నేను సేకరిస్తాను. (దీనివల్ల లక్ష్మణుడు ఫల సమర్పణ చేశాడు). నేను నీ వెంట వచ్చి చేసే పనేంటి అంటావా? ఒక చేత్తో గంపగడ్డపార, మరో చేత్తో విల్లంబులు ధరించి, నీ ముందు నడుస్తూ, తోవ బాగు చేస్తాను. నీకిష్టంగా కష్టం లేకుండా చేస్తాను. నేను రాకపోతే ఇవన్నీ నువ్వే చేసుకోవాలి కదా? ఆ శ్రమ తప్పిస్తాను. నీకు అలసట వస్తే విసురుతా...పాద సేవ చేస్తా. ఇంకా చేస్తా. అడవిలో దొరికే పండ్లు, దుంపలు, ఇంకా అలాంటివి తెచ్చిస్తా. నువ్వు సీత వినోదంగా వుండొచ్చు. కొండ శిఖరాలలో మీరిద్దరూ విహరిస్తుంటే లేదా నిదురిస్తుంటే విల్లంబులు ధరించి మీకు కాపలాగా వుంటాను".

లక్ష్మణుడు అరణ్యాలకు రావడానికి అంగీకరించిన శ్రీరాముడు

"నీ వాడిని...అని ఆశ్రయించిన వారిని పరిగ్రహించాలనే సిద్ధాంతం కల శ్రీరాముడు, పరమార్థ, ధర్మ, శరణాగతి యుక్తములైన లక్ష్మణుడి మాటలు విని, శరణు-శరణు అనగానే అభయం ఇవ్వాల్సిన తాను ఇంతవరకు ఆలశ్యం చేయడమే తప్పు కావడంవల్ల, ఇంకా పరీక్షించడం మరింత దోషమని, ఇంకే విధంగా అడ్డు చెప్పక, సంతోషించిన మనసుతో ఇలా చెప్పాడు."లక్ష్మణా! త్వరగా పోయి నీమిత్రులందరికీ సర్వ వృత్తాంతాన్ని చెప్పు. మనం ముగ్గురం అడవులకు పోతున్న సంగతి కూడా చెప్పు. పూర్వం, మనం యజ్ఞం చేసే సమయంలో, బంగారంతో అలంకరించబడి, సూర్యుడిలాగా ప్రకాశిస్తూ, చూడడానికే భయపడేట్లుగా వున్న రెండు కటారులు, అక్షయ బాణ తూణీరాలు, భేదించనలవికాని కవచాలు, వరుణుడు మనకిచ్చాడు. వాటిని ప్రతిరోజూ పూజచేయడాని గురువుల ఇంట్లో వుంచాం. అవి మనకు (రాక్షస వధ చేయడానికి, వేట కొరకు) అడవుల్లో ఉపయోగపడతాయి. కాబట్టి నువ్వు పోయి శీఘ్రంగా వాటిని ఇక్కడకు తే.

(ఈ ఆయుధాలను వరుణుడు శ్రీరామలక్ష్మణులకు ఇచ్చినట్లు బాలకాండలో చెప్పకపోయినా, ఇక్కడ చెప్పడమంటే ఇక్కడికి-అక్కడికి కథను అనుసంధానం చేయడమే. ఇది వాల్మీకి శైలి లక్షణం. ఒక సందర్భంలో జరిగినవన్నీ ఒక చోటనే చెప్పడు. సందర్భోచితంగా కొంత ఒక చోట, మరి కొంత మరో చోట చెప్తాడు. వరణుడి విషయం బాలకాండలో చెప్పకపోయినా ఇక్కడ చెప్పక తప్పదు. ఎందుకంటే, ఆయన ఇచ్చిన ధనుర్బాణాలను వెంట తీసుకొని పోక తప్పదు. ఇక అక్కడా-ఇక్కడా అదే విషయం చెప్పడం వ్యర్థం. అలాగే కాకాసుర వృత్తాంతం చిత్రకూటంలో జరిగింది. ఆ విషయం అయోధ్య కాండలో చెప్పకుండా సుందర కాండలో చెప్పాడు. అది కూడా సీతతో చెప్పించాడు. అది తనకు శ్రీరాముడికి మాత్రమే తెలిసిన రహస్య విషయమని ఆమె చెప్పింది. కథ ఔచిత్యాన్ననుసరించి అక్కడ చెప్పక, రహస్యంగా వుంచి, ఇక్కడ చెప్పించాడు సీతతో. అలాగే మణిబంధ విషయం, దుందుభి విషయం

రెండు-మూడు సార్లు చెప్పాడు. ఇలాంటివెన్నో వున్నాయి. ఏది, ఎక్కడ, ఎంతవరకు చెప్పాల్నో అంతే చెప్పడం వాల్మీకి శైలి లక్షణం).

సూర్యతేజుడైన లక్ష్మణుడు తన హితులకందరికీ తమ వనవాస యాత్రా విషయమంతా చెప్పి, శ్రీరాముడు చెప్పిన ఆయుధాలను తీసుకొనివచ్చి ఆయనకు చూపాడు. శ్రీరాముడందుకు సంతోషించాడు. పని తొందర తెలుసుకొని మసలుకున్నందుకు లక్ష్మణుడిని అభినందించాడు. అలా మెచ్చుకున్న శ్రీరాముడు, తనకున్న ధనం, ఇతర పదార్థాలు, లక్ష్మణుడితో కలిసి, బ్రాహ్మణులకు, ఇతర తపస్వులకు, తమను ఆరాధించేవారికి, సేవకులకు, ఎప్పుడు ఇచ్చేదానికంటే ఎక్కువగా ఇచ్చి సంతోషపెడ్దామని అంటాడు లక్ష్మణుడితో. వసిష్ఠుడి కుమారుడైన సుయజ్ఞుడిని, ఇతర పెద్దలను పిలిపించమటాడు.

❖ ❖ ❖

సర్గ-32

తన పదార్థాలను దానం చేసిన శ్రీరాముడు

శ్రీరాముడి ఆజ్ఞ ప్రకారం, ఆయన తనకు ప్రియమైన, శుభం కలిగించే మాటలు చెప్పడంతో, తదనుగుణంగా లక్ష్మణుడు సుయజ్ఞుడింటికి పోయాడు. ఆయనప్పుడు అగ్ని గృహంలో వున్నాడు. ఆయన వద్దకు పోయి నమస్కారం చేసిన లక్ష్మణుడు, స్నేహపూర్వకంగా ఆయనతో మాట్లాడుతూ, శ్రీరాముడు చేయబూనిన అసాధ్యకార్యం గురించి వివరించి, తనతో అక్కడకు రమ్మంటాడు. సుయజ్ఞుడు కూడా మాధ్యాహ్నిక సంధ్య వార్చి, కాంతివంతమైన, రమ్యమైన, శ్రీరాముడి గృహానికి వచ్చాడు. అలా ఇంట్లోకి ప్రవేశిస్తున్న పుణ్యాత్ముడైన, వేదవేత్తైన సుయజ్ఞుడికి, సీతా సమేతంగా అగ్నిసమానుడైన శ్రీరాముడెదురేగి, మొక్కి, నిష్కల్మషమైన ఆయనకు తన వస్తువులన్నీ ఇచ్చాడు. బంగారు భుజకీర్తులను, తళతళలాడే కుండలాలను, బంగారు మొలతాడులను, చేతి కడియాలను, రత్నకిరీటాలను, బంగారు ఉంగరాలను, ఇతర అలంకారాలను, మనోహరమైన రత్న సమూహాలను అన్నీ ఇచ్చాడు శ్రీరాముడు. ఇస్తూ. సీతాదే ప్రేరణతో ఇలా అన్నాడు: "అయ్యా! నీ భార్య ధరించేందుకు ముత్యాలసరం, ముప్పేట మొలనూలు, బంగారుతీగ, రెట్ట కడియాలు, భుజకీర్తులు సీత ఇస్తున్నది. తీసుకోండి. మణులతో చెక్కబడి, ఆభరణాలతో అలంకరించబడిన పాన్పు కూడా నీదగ్గరే వుంచుకోండి. వనవాసానికి పోవాలని దృఢంగా నిశ్చయించుకున్నాం. నాకు నా మేనమామ ఇచ్చిన శత్రుంజయం అనే ఏనుగు నా దగ్గరే వుంది. దానిని మరో వేయి ఏనుగులతో కలిపి ఇస్తాను". ఇలా వేరువేరుగా శ్రీరాముడివ్వగా అవన్నీ తీసుకున్నాడు సుయజ్ఞుడు. ఆయన శాస్త్రప్రకారం సంతోషంతో సీతారామలక్ష్మణులను దీవించి పోయాడు.

ఆ తరువాత శ్రీరాముడు లక్ష్మణుడితో, అగస్త్య కుమారుడిని, విశ్వామిత్రుడి కుమారుడిని పూజించమని, పైరుకు నీళ్లిచ్చినట్లే వాళ్లకూ వేయి ఆవులను, వెండి బంగారు నగలను, అనేక రకాల రత్నాభరణాలను ఇవ్వమని చెప్పాడు. అలాగే, కౌసల్యాదేవిని ఆశ్రయించి, తైత్తిరీ శాఖాధ్యాయనం చేసే

వారికి అధ్యాపకుడిగా వుంటున్నతనికి తనివి తీర వాహనాలను, దాసుల సమూహాలను, పట్టు వస్త్రాలను, మేకలు–ఇతర జంతువులను, వేయి ఆవులను, ధనరాసులను దానమివ్వమని చెప్పాడు. చాలా కాలంగా తన ఇంట్లో వుంటున్న చిత్రరథుడనే సూతుడికి ధన వస్త్రాలు, రత్నాలు, ఇక చాలనే దాక ఇవ్వమంటాడు. బ్రహ్మచారులు, కటశాఖ చదువుకున్నవారు, కలాపిశాఖ చదివినవారు, వేదాధ్యయనం చేసేవారు...వీరందరూ గొప్పవారైనందున, ఎనబై ఒంటెలు, అవి మోయగల రత్నాలు, పాలు–పెరుగు–నెయ్యి ఎప్పుడూ లభించే విధంగా వేయి ఆవులను ఇవ్వమంటాడు. వీటికి అదనంగా వ్యవసాయం చేసుకునేందుకు రెండొందల ఎద్దులను, వెయ్యి గోతాల వడ్లను, అవి మోసే ఎద్దులను త్వరగా ఇచ్చి పంపమంటాడు. కౌసల్య ఇంట్లో బ్రహ్మచారులెక్కువగా వుంటారని, వారికి ఒక్కొక్కరికి వారి కోరికమేరకు, వెయ్యేసి ఆవుల చొప్పున ఇవ్వమంటాడు. తను దానం ఇచ్చే పద్ధతిని తల్లి మెచ్చుకోవాలని అంటాడు. మిగిలిన బ్రాహ్మణులందరికి, ఇతరులకు కూడా తగిన విధంగా, ప్రేమగా, మిగిలిన ధనాన్ని ఇవ్వమని చెప్పగా శ్రీరాముడి ఆజ్ఞానుసారం లక్ష్మణుడు కుబేరుడిలాగా సర్వం దానం ఇచ్చాడు.

అందరికీ అన్నీ ఇస్తుంటే, ఇవ్వమని లక్ష్మణుడికి చెప్తుంటే, సమీపంలో నిలుచున్న తన సేవకులను చూసి, వారందరికీ స్వయంగా తానే సగౌరవంగా చాలా ధనాన్ని వేర్వేరుగా ఇచ్చాడు శ్రీరాముడు. తాము అడవులనుంచి తిరిగొచ్చేవరకు, తన ఇల్లు, లక్ష్మణుడి ఇల్లు ఎప్పటిలాగే కనిపెట్టుకుని వుండాలని అంటాడు. ఇల్లు విడిచి ఎక్కడికీ పోవద్దని కూడా కోరుతాడు. ఇలా వాళ్లకు చెప్పి, తన కోశాధిపతిని చూసి, తనకు గల ధనమంతా అక్కడికి తెమ్మంటాడు. వాడలాగే తెస్తాడు. దాన్ని బాలురందరికి, వృద్ధులకు, సద్బ్రాహ్మణులకు లక్ష్మణుడితో ఇప్పించాడు.

త్రిజటుడనే బ్రాహ్మణుడి వృత్తాంతం

ఇదిలా వుండగా త్రిజటుడు అనే ఒక బ్రాహ్మణుడు దైవ సంకల్పాన అయోధ్యానగరంలో ఆ సమయంలో వుండడం తటస్థించింది. ఆతడు నాగటికొనకుండే మురికిగా, గడ్డపారతో సమానంగా పండ్లు కోసే గోళ్లతో,

వుంఛ వృత్తిలోకి దిగి, దినమంతా అడవుల్లో తిరుగాడుతూ, దారిద్ర్యంలో మునిగిపోయి, మిక్కిలి ముసలివాడై పోయి, నడువలేక, వూగుతూ వున్నాడు. వయసు భార్యను, బిడ్డలను అతికష్టంతో రక్షించే గర్గ వంశంలో పుట్టాడు. పేదరికం వల్ల బూజు వారిన దేహంలాగా వుంది ఆతడి శరీరం. (విష్ణు పురాణం ప్రకారం వివాహ కాలంలో కన్యకు ఎనిమిదేళ్లు, వరుడికి ఇరవై నాలుగేళ్లు వుండాలి. కాబట్టి ఈ లెక్కన స్త్రీకి మంచి ప్రౌఢ వయసొచ్చేటప్పటికి, అంటే ముప్పై సంవత్సరాల వయసున్నప్పుడు, భర్తకు నలబై ఆరేళ్లుంటాయి. బ్రాహ్మణ స్త్రీలు పూజాపునస్కారాలతో కాలం గడుపుతారు కాబట్టి రుతుకాలంలో మాత్రమే సంగమిస్తారు. అందువల్ల వాళ్లకు బ్రహ్మచర్య దీక్షవలన కామ బాధ కలుగదు). పతివ్రతైన ఆయన భార్య త్రిజటుడికి ఒక సలహా ఇచ్చింది. పార గుద్దలి బయట పడేసి, ఆమె మాట విని, శ్రీరామచంద్రుడిని చూడడానికి ఆలశ్యం చేయకుండా పొమ్మంటుంది. భార్య బిడ్డలున్న వాడినని, దరిద్రుడనని చెప్పమంటుంది. ధర్మబుద్ధికల శ్రీరాముడు ఎంతో కొంత దానం చేస్తాడని సలహా ఇస్తుంది. త్రిజటుడు తాను కట్టుకున్న వస్త్రంలో చిరుగులు కనిపించకుండా వుండే ప్రయత్నం చేసి, విఫలమై, అలాగే శ్రీరాముడి ఇంటికి పోయాడు. కూటికి పేదవాడైనా, తపో బలం వల్ల అంగిరుడితోను, భృగువుతోను సమానమైన బ్రాహ్మణ తేజస్సుండడం వల్ల త్రిజటుడి రాకను ఎవరూ అడ్డగించలేదు. అంతే కాకుండా తన ఇంటిలోని పంచమ కక్ష్య వరకు ఎవరైనా రావచ్చని, అడ్డగించవలదని, శ్రీరాముడు మొదలే ఆజ్ఞాపించాడు. అందుకే త్రిజటుడిని ఎవరూ ఆపలేదు. శ్రీరాముడి సమీపంలోకి పోయి త్రిజటుడిలా అన్నాడు.

"రామచంద్రా! కడు పేదవాడిని. చాలామంది పిల్లలున్నారు. ఉంఛవృత్తిలో జీవిస్తున్నాను. నామీద కనికరం చూపించు". (దేహాన్ని బతికించుకోవడానికి, శాస్త్ర నిషిద్ధం కాని స్వకర్మలతో, శరీర కష్టం లేకుండా గృహస్థుడు దనాన్ని సంపాదించుకోవచ్చు. బ్రాహ్మణ కర్మలలో ప్రతిగ్రహం చేరింది కాబట్టి ఇది శాస్త్ర నిషిద్ధం కాదు. దేహధారణ కొరకై, కుటుంబ రక్షణకొరకై అడిగాడు కాబట్టి అది తప్పు కాదు. బ్రాహ్మణుడు ధనాన్ని సమకూర్చుకునేందుకు, దాచిపెట్టడానికి ఆర్జించకూడదు, యాచించనూ కూడదు. కుచేలుడిని ఈ

విషయంలో ఉదాహరణగా తీసుకోవాలి. ఎందుకు త్రిజటుడు శ్రీరాముడిని ధన సహాయం చేరమని అడిగాడు? ముసలి తల్లిదండ్రులను, పతివ్రతైన భార్యను, పసిబిడ్డలైన కొడుకులను, వంద పనులు చేసైనా రక్షించుకోవాలని మనువు చెప్పాడు. కాబట్టి త్రిజటుడి యాచన తప్పు కాదు).

ఇంత తపస్సు చేసినవాడు, ముసలివాడు, భార్యా పుత్రులకొరకు యాచించాల్సి వచ్చిందికదా! అని అనుకున్న శ్రీరాముడు ఆయన శక్తిని పరీక్షించాలనుకున్నాడు. "ఓ పుణ్యచరిత్రా! నా అవుల్లో దానమీయగా ఇంకా వెయ్యావులున్నాయి. నువ్వొక కర్ర తీసుకో. దానిని ఆ మందపైన విసరాలి. అదెంత దూరం పడుతుందో అక్కడినుండి ఇక్కడివరకున్న ఆవులన్నీ నీకిస్తాను. నీ బుజబలాన్ని చూపించు" అంటాడు శ్రీరాముడు. వేళ్లాడుతున్న దోవతి అంచులను పైకెత్తి జారిపోకుండా బిగించి కట్టాడు త్రిజటుడు. కుడి చేత్తో కర్రను పట్టుకుని, కాళ్లు ముందుకు వెనక్కు పెట్టి, పళ్లు బిగించి, ప్రాణాలుగ్గబట్టుకుని, ఆ బ్రాహ్మణుడు కర్రను గిర్రున తిప్పి, సంతోషంగా ఆవుల గుంపులోకి విసిరాడు. (ఆవులన్నింటినీ బ్రాహ్మణుడికి ఇవ్వాలని మనసులో వున్నప్పటికీ, బ్రాహ్మణ ప్రభావం తెల్సుకోవాలనుకున్నాడు శ్రీరాముడు. ఆయన ఇది పరిహాసానికి అనలేదు. త్రిజటుడికి కూడా ఇది బాధ కలిగించలేదు. ఇలా బ్రాహ్మణుడితో చేయించడం వల్ల, పరీక్షించడం వల్ల, ఆతడి యాచానా దోషం తొలగి, కష్టించి సంపాదించుకున్నట్లయింది). బ్రాహ్మణుడు విసిరిన ఆ కర్ర సరయూ నది దగ్గరున్న ఆవుల గుంపులను దాటి ఎద్దుల సమీపంలో పడ్డది. శ్రీరాముడు ప్రేమతో ఆ బ్రాహ్మణ శ్రేష్టుడిని కౌగలించుకున్నాడు. అక్కడి గొల్లలతో సరయూనది తీరంలో వున్న ఆవులన్నింటినీ తోలుకుని పోయి బ్రాహ్మణుడి ఆశ్రమంలో వదిలి పెట్టి రమ్మంటాడు. త్రిజటుడి తపో శక్తి తెలుసుకోలేక నవ్వుల మాటలన్నందుకు క్షమించమని అంటాడు. "మహానుభావా! నాపై కోప్పడవద్దు. వార్ధక్యం వల్ల, ఆహారం లేనందువల్ల, నీ శరీరం బాగా లేకపోయినా, నీకున్న తేజస్సు ప్రజలందరికీ తెలియచేయాలని, వినోదం కోసం నేనలా పలికాను కాని, నీకు ఆవులివ్వ వద్దని కాదు. వాస్తవానికి, నాకున్న ధనమంతా బ్రాహ్మణ సంఘ రక్షణార్థమే కాని నా కోసం కాదు. నీ లాంటి మహాత్ములకు ధనమంతా ఇచ్చినా మంచిదే. నాకు విస్తార కీర్తి, సంతోషం

కలుగుతుంది" అన్న శ్రీరాముడి మాటలకు జవాబుగా, తనకు ధనంతో పనిలేదంటాడు త్రిజటుడు. కీర్తి, బలం, సంతోషం, అసమానమైన సుఖం కలగాలని శ్రీరాముడిని దీవించి, భార్యా సమేతంగా ఆవులతో సహా తన ఆశ్రమానికి పోయాడాయన.

(గురుకులంలో వేదాధ్యయనం పూర్తి చేసుకున్న తరువాత, వివాహార్థులై వున్న బ్రాహ్మణులకు రాజులు ధనధాన్యాలిచ్చి, శాస్త్ర ప్రకారం పూజించాలి. ఇలా బ్రాహ్మణులకిచ్చిన ధనధాన్యాదులు నిధి లాగా తరగకుండా ఎప్పుడూ రాజులకు మేలు కలిగిస్తుంటాయి)

అసమానమైన సత్య పరాక్రమాలతో, స్వధర్మాన్ని అనుసరించి, తాను సంపాదించిన ధనాన్ని, ఆప్తులకు గౌరవించి నిండు మనసుతో ఇచ్చాడు శ్రీరాముడు. వారికే కాకుండా బ్రాహ్మణులకు, స్నేహితులకు, సేవకులకు, దరిద్రులకు, బిక్షాటన చేసి బతికేవారికి, తగిన రీతి గౌరవించి అలక్ష్య బుద్ధి లేకుండా విస్తారంగా ఇచ్చాడు.

❖ ❖ ❖

సర్గ-33

తండ్రి దగ్గరకు పోతున్న సీతారామలక్ష్మణులను చూసి దుఃఖించిన ప్రజలు

దానాలిచ్చి అందరినీ తృప్తి పరిచి, రామలక్ష్మణులు సీతాసమేతంగా తండ్రిని చూడడానికి బయల్దేరారు. ఇల్లు విడిచి వెలుపలికి వస్తున్న వారి దగ్గర వేలాడుతున్న దట్టమైన కాంతులను వెదజల్లే గంధంతో పూజించబడిన ఆయుధాలు, ధనస్సులు, ఖడ్గాలు చూసిన పురప్రజలు దుఃఖంతో పరితపించారు. మిద్దెల మీద, మేడలలో, సౌధాల మీద, ఎక్కి చూసేవారు; దట్టంగా వ్యాపించి వున్న గుంపుల్లో దూరి నలగిపోవడంతో శ్రీరాముడిని చూడలేకపోయినందున సమీపంలోని గోడలనెక్కి చూసే వారు; పట్టపగటి ఎండలో గొడుగు-చెప్పులు లేకుండా కాలినడకన పోయే శ్రీరాముడిని చూసి దుఃఖించే వారు; అయ్యయ్యో! మన శ్రీరాముడికి ఎంత కష్టం వచ్చె కదా అని ఆయనను కని తపించే వారు; గతంలో నాలుగు రకాలైన సైన్యం వెంట వస్తుంటే వేంచేసే ప్రభువు ఈ రోజున నడచుకుంటూ భార్య, తమ్ముడు తోడురాగా పోతున్నాడే అని నిప్పుల్లో పొర్లినట్లుగా బాధ పడేవారు...ఇలా ఎందరో...ఐశ్వర్యం రుచి ఎలాంటిదో అనుభవించి, అది తెలిసినప్పటికీ, కోరికలు కోరేవారికి సంతోషం కలిగించే వాడు, ధర్మం అంటే నమ్మిన వాడు, తండ్రి మాట జవదాటని వాడు అయిన శ్రీరాముడిని చూడడానికి పోటీ పడ్డారు. పూర్వం ఆకాశంలో తిరిగే దేవతలకైనా కనిపించని రాజ కుమారి సీతాదేవిని ఇపుడు ఈ విధంగా గుంపులు గుంపులుగా వచ్చి చూడడానికి సాధ్యమైందని కొందరనుకున్నారు. ఎంతో ప్రకాశవంతంగా వున్న, హరిచందనం పూసుకున్న, సీతాదేవిని చూసి, పుర జనులందరూ, ధారలుధారలుగా శోక భాష్పాలను, హర్ష భాష్పాలను కురిపించారు. ఇలాంటి గొప్పదానికి ఇంత కష్టం వచ్చింది కదా అని వేడి కన్నీళ్లను, ఆమె పాతివ్రత్యానికి మెచ్చి ఆనంద భాష్పాలను కురిపించారు.

కైకేయీ దశరథులను నిందించిన పౌరులు

ఇలా తండ్రిని చూడడానికి పోతున్న రామలక్ష్మణులను, వారి వెంట వున్న సీతాదేవిని చూసి దుఃఖపడే పురజనులు కైకేయీ దశరథులను నిందించడం ప్రారంభించారు. "ఇవి దశరథుడు అన్న మాటలు కాదు. ఆయన మీద పిశాచం ఆవేశించి ఇలా పలికించింది. అలా కాకపోతే, ఎప్పుడైనా, ఏ దేశంలోనైనా, తండ్రి అనేవాడు నీతి తప్పి తన గారాల కొడుకును అడవులకు పొమ్మంటాడా? కన్న కొడుకు గుణహీనుడైనప్పటికీ వెడలగొట్ట కూడదు. న్యాయం ఇలా వుంటే....తన మంచి గుణాలతో లోకాలను జయించిన చిన్న పిల్లాడిని ఈ విధంగా వదలిపెట్టే పురుషుడు కూడా వుంటాడా? మంచి గుణాలు లేవని కొడుకును విడువకూడదు. కాకపోతే దుష్ట గుణాలు కలిగి, అధర్మంగా ప్రవర్తిస్తూ, అపకీర్తి తెచ్చే వారిని, సగరుడిలాగా వదలవచ్చు. మనోవాక్కాయ కర్మలందు ఇతరులను నొప్పించకుండా వుండడం, ఉత్తమోత్తమ దయా గుణం, శాస్త్రాలను అధ్యయనం చేయడంలో ఆసక్తి, సాధు స్వభావం, ఏ సమయంలోనూ ఇంద్రియ నిగ్రహం పాటించడం-వాటిని తన స్వాధీనంలో వుంచుకోవడం, శాంత బుద్ధి కలిగి వుండడం లాంటి ఆరు గుణాలు శ్రీరామచంద్రుడికి ధరించని ఆభరణాలు. ఇలాంటి పురుషోత్తముడిని, కళ్యాణ గుణాలే అలంకారంగా కలవాడిని, వదలిపెట్టేవారు కూడా వుంటారా? వివేకం కలవాడెవ్వడూ ఇలా చేయరు.

ఉపనిషత్తులలో చెప్పిన ఆరు హేయ గుణాలు లేకపోవడమే కాకుండా, వాటికి బదులుగా, ఆరు కళ్యాణ గుణాలు కలిగి, అవే ఆభరణాలుగా గల భగవంతుడిని, జీవకోటికంటే ఉత్తముడిని, ఎవరైనా వదలుకుంటారా? శ్రీరాముడిని విడువలేక ప్రజలింతగా బాధపడడానికి కారణాలను కవి వర్ణించాడిక్కడ. ఎండాకాలంలో నీళ్లెండినప్పుడు, నీటిలో బతికే జీవరాశుల శరీర స్వరూపం ఎలా చెడిపోతుందో, అలానే ప్రజలకు, జలజంతువులకు జీవనమైన జలం లాంటివాడైన శ్రీరాముడు లేకపోతే జరుగుతుంది. దూరంగా పోతాడని తెలిసి ప్రజలు దుఃఖించారు. జలచరాలకు నీరులాగా భూతకోటికి తానైనవాడు. అలాంటివాడు దూరంగా పొతే ఆయనను ఆశ్రయించినవారు

బాధపడతారు. కాబట్టి, భగవత్ సమాశ్రయణం కలవాడు చెడిపోడు కాని తక్కినవారు చెడిపోతారు. అలాంటి ఆశ్రయం చెడిపోతే దుఃఖించనివాడెవడు? శ్రీరాముడు జగదీశ్వరుడు. సమస్తానికి మూలం ఆయనే. ఆయనకే కష్టం వస్తే లోకాలన్నీ దుఃఖించడంలో వింత ఏముంది? ఎలాగంటే...చెట్టు వేరుకు హానికలిగితే చెట్టుకున్న పూలు-పండ్లు నాశనం కావా? వేరుకు, చెట్టుకు, చెట్టు మీది పూలుపండ్లకు ఎలాంటి సంబంధం వుందో, భగవంతుడికి ప్రపంచంలోని ప్రాణికోటికి అలాంటి సంబంధమే వుంది. ఇందులోనే పరిణామవాదం సిద్ధాంతీకరించబడింది. వాదాద్వైతులలో కొందరు దీనిని సమ్మతించినా, కొందరు సమ్మతించకున్నా, మనువాదులు, అనుభవాద్వైతులందరూ దీనిని సమ్మతించినవారే.

శ్రేష్ఠమైన ధర్మమే సారంగా కలవాడు, అధికమైన తేజస్సు కలవాడైన శ్రీరాముడు ప్రజలకు వేరు లాంటి వాడైతే, ఇతరులు అంటే నరులు, ఆకులు, ఫలాలు, పుష్పాలు, పెద్ద కొమ్మల లాంటివారే కదా! వేరుకు బలం ఎలా సారమో, శ్రీరాముడికి ఉత్తమ ధర్మమే తేజం, సారం. వేరులోని నీటివలనే చెట్ల కొమ్మలు, కాయలు, పూలు, పండ్లు, ఆకులు జీవించి తేజోవంతమై వున్నట్లే, భగవంతుడి శక్తి వల్ల జీవకోట్లన్నీ క్షేమంగా వుండగలవు. ఉపనిషత్సారం కూడా ఇదే. వేరు సత్యమైతే, దాని పరిణామమైన చెట్ల కాయలు, పండ్లు, పూలు, ఆకులు ఎలా సత్యమవుతాయో, సమ్సృత ప్రపంచం కూడా సత్యమే.

ప్రజలిలా అనుకుంటారు...."ఈ కారణాల వల్ల మనం శ్రీరాముడిని ఎడబాసి ఎలా వుండగలం? మనకు ప్రాణం శ్రీరాముడు. ఆయన మనలను విడిచిపోతే ఈ తోటలెందుకు? ఇల్లెందుకు? మడులెందుకు? దొడ్లెందుకు? కాబట్టి లక్ష్మణుడిలాగా మనం కూడా సర్వసంగ పరిత్యాగం చేసి, ఏ రోజున, ఏ గడియలో, శ్రీరాముడెక్కడుంటాడో, ఏ సుఖాలను-దుఃఖాలను అనుభవిస్తాడో ఆ విధంగానే మనం కూడా వుందాం. మన వెంట కేవలం అవసరమైన కొందరు బంధువులను, భార్యలను తీసుకొని పోయి అక్కడే వుందాం. రక్షణార్థం భూమిలో మనం దాచిపెట్టిన ధనాన్ని వెలికితీసి, ఇండ్లను పాడుపెట్టి, ధనధాన్యాలు కైకకు దొరక్కుండా మన వెంట తీసుకుని పోదాం. పూజలు

చేసేవారు లేక, ఇండ్ల ముందర కసవు చిమ్మేవారు లేక, నేలంతా దుమ్ముధూళితో నిండి వుంటే, మేడలపైన బూజులు వేలాడుతుంటే, పందికొక్కులు తోడడం వల్ల మట్టికుప్పలు ఇండ్ల నిండా పోగైతే, ఎలుకలు ఇండ్లలో ఇష్టం వచ్చినట్లు తిరుగుతుంటే, మంత్రాలు-హోమాలు-జపాలు చేసేవారు లేక కాంతి విహీనమైన ఇండ్లను తన మనసార కైక తన తలపై పెట్టుకోవాల్సిందే! శ్రీరాముడుండే అడవే సంపదతో కలకళలాడే నగరం అవుతుంది. ఆయన లేని అయోధ్య పెద్ద అరణ్యంగా మారుతుంది".

"మనమందరం ఒక్క మాట మాట మీదుండి, ఒకే సారి అందరం నగరం వదలిపోతే, అడవుల్లో గుహల్లో నివసించే సింహాలు, ఏనుగులు, పుట్టల్లో వుండే పాములు, కొండచరియల్లో వుండే పెద్ద పక్షులు, నిలువనీడ లేక మనకు భయపడి దూరంగా పరుగెత్తి, వుండడానికి ఎక్కడా జాగా లేక, పాడుపడిన ఈ వూరి ఇండ్లలో నిర్భయంగా, హాయిగా, సుఖంగా వుండాలి. శ్రీరాముడితో మనమందరం అరణ్యానికి చేరగానే, ఇక్కడుండే మాయలమారి కైక తన ముద్దుల కొడుకు, బంధువులు ఆమెకు సేవచేస్తుంటే, ఇక్కడుండే మాంసాహారులైన పులులపైన, సింహాలపైన, తోడేళ్లపైన, గడ్డి తినే జింకలపైన, కాయలు తినే పక్షులపైన అధికారం చెలాయించాలి".

దుఖం పొంగి పొర్లుతుంటే, తనను చూడవచ్చిన ప్రజలందరూ ఇలా మాట్లాడుతుంటే, అవన్నీ వింటున్నప్పటికీ, మనసులో కొంచెమైనా బాధ పడకుండా, దూరం నుంచే వెండికొండతో సమానమైన తన తండ్రి వుండే ఇంటిని చూశాడు శ్రీరాముడు. ప్రజల బాధ చూసి తన మనసు చలించనీయలేదు. చిరునవ్వుతో కూడిన ముఖంతో, దూరంగా వున్న మంత్రి సుమంత్రుడిని పిలిచాడు అనురాగంగా.

❖ ❖ ❖

సర్గ-34

తన రాక విషయం తండ్రికి చెప్పమని సుమంత్రుడిని అడిగిన శ్రీరాముడు

పిలువగా తన వద్దకు వచ్చిన మంత్రి సుమంత్రుడితో, రాజును చూసి, రాజాజ్ఞ తీసుకుని తాను అరణ్యాలకు ప్రయాణమై పోదల్చుకున్నానని, తన రాక తండ్రికి తెలియచేయమని శ్రీరాముడు అడిగాడు. ఆయన కోరికను విన్న పుణ్యాత్ముడు సుమంత్రుడు కడు దుఃఖంతో , కళ్ల వెంట నీళ్లు కారుతుంటే, లోపలికిపోయి దుఃఖంలో మునిగిపోయి, రాహువు పట్టిన సూర్యుడిలాగా వున్న దశరథుడిని కలిశాడు. బూడిదకప్పిన నిప్పులాగా, నీళ్లు లేని చెరువులాగా, వెంట వెంట దుఃఖం తెచ్చుకుంటూ, నిండు భయంతో,గ్భ్రమతో, కొడుకు శ్రీరాముడిని ఒకటికి పదిసార్లు స్మరించుకుంటూ ఏడుస్తున్న రాజును చూసి, భక్తితో నమస్కారం చేసి జయం-జయం అని పొగిడాడు సుమంత్రుడు. "నీ కొడుకు అడవులకు పోతూ చెప్పడానికి వచ్చాడు" అన్న దుర్వార్త ఎలా చెప్పాలన్న బాధతో ఏడుస్తూ, దానివల్ల గొంతు గద్గదం కాగా, మెల్లగా ఇలా అన్నాడు సారథి సుమంత్రుడు. "దేవా! శ్రీరామచంద్రుడు బ్రాహ్మణులకు, సేవకులకు, తనకున్న ధనమంతా దానం చేసి, స్నేహితులకందరికీ చెప్పి, మీ ఆజ్ఞ తీసుకుని అడవులకు పోవడానికి వాకిట్లో నిలబడి వున్నాడు. ప్రేమతో మిమ్మల్ని చూడాలనుకుంటున్నాడు. ఆలశ్యమైతే వెళ్లిపోతాడు. ఆ తరువాత చూద్దామన్నా కుదరదు. ఇలా ఏడుస్తూ కూర్చోవడం రాజధర్మం కాదు. అయిందేదో అయింది. ఇప్పుడు ఏడ్చి ప్రయోజనం ఏముంది? కాబట్టి ధీరుడిలాగా, రాజగుణాలతో, కాంతితో, సూర్యుడిలాగా ప్రకాశిస్తూ, కొడుకును కళ్లతో చూడండి. ఆ భాగ్యం కూడా లేకుండా చేసుకోవద్దు".

సముద్రంలాగా గాంభీర్యం, ప్రజల స్తోత్రం చేయబడిన ధర్మం మీదే ఆసక్తి, ఆకాశంలాగా నిర్మలం, సత్యం ఆడే స్వభావం కలవాడైన దశరథుడు మంత్రితో ఇలా అన్నాడు: "నా భార్యలందరినీ ఇక్కడకు రమ్మని చెప్పు. భార్యలతో కలిసి పితృవాక్యపాలన ధర్మం అనే స్థిరబుద్ధి కల శ్రీరాముడిని చూడాలను

కుంటున్నాను. నేనొక్కడినే చూస్తే, శ్రీరామచంద్ర ముఖ దర్శనం కూడా వారికి కలగదు. అదే కాకుండా, తల్లులందరూ ఏక వాక్యంగా ప్రార్థిస్తే, వారి మాట వినైనా అడవులకు పోకుండా ఆగిపోతాడేమో! నా ఆజ్ఞ ప్రకారం పోయి రాణులందరినీ పిలుచుకుని రా". వెంటనే సుమంత్రుడు పోయి రాణులను చూసి, మీరంరినీ రమ్మని రాజు ఆజ్ఞాపించాడని అంటాడు. (దీనర్థం: గృహస్థులు దైవ దర్శనం చేసుకోవాలంటే తామొక్కరే కాకుండా భార్యలతో కలిసి చేయాలని. అలానే భర్త ఆజ్ఞ వుంటే భార్యలు భగవత్ దర్శనార్థమై ఆయనతో కలిసి ఎక్కడికైనా పోవచ్చునని). సుమంత్రుడి మాటలు విన్న మూడువందల ఏభై మంది రాజు భార్యలు, అప్పటికే ఏడుస్తూ కళ్లు ఎఱ్ఱబడి వుండగా, రాజాజ్ఞ తిరస్కరించరాదని, కౌసల్యతో సహా దశరథుడి దగ్గరకు వచ్చారు. అప్పుడు శ్రీరాముడిని పిల్వమని దశరథుడు మంత్రి సుమంత్రుడికి చెప్పాడు.

సుమంత్రుడు లోపలికి రమ్మని చెప్పగానే, సీత లక్ష్మణుడు తన వెనుక వస్తుంటే, చేతులు జోడించుకుని, శ్రీరామచంద్రమూర్తి రాజు దగ్గరకు వెళ్లబోతాడు.

సీతారామలక్ష్మణులను చూసిన దశరథుడు

తన దగ్గరకు వస్తున్న శ్రీరాముడికి ఎదురుగా పరుగెత్తుకుంటూ పోయి, దుఃఖం పెల్లుబికి వస్తుంటే, ఆ కన్నీళ్లకు దారి కనబడకపోవడంతో, ఇక పరుగెత్తలేక, సగం దూరంలోనే కింద పడిపోయాడు దశరథుడు. నిండారు దుఃఖంతో నేలమీద పడ్డ రాజు దగ్గరకు పోయి శ్రీరామలక్ష్మణులు ఆయనను చేత్తో పైకెత్తారు. ఆ సమయంలో హా రామా! హా రామా! అని హాహా కారాలు చేస్తున్న స్త్రీల భూషణాల ధ్వని, అలానే వాళ్లు తల-రొమ్ము కొట్టుకుంటుంటే వచ్చిన ధ్వని రాజు ఇంట్లో మారుమోగాయి. శ్రీరామలక్ష్మణులు, సీతాదేవి ముగ్గురూ కలిసి రాజును తమ చేతుల్లో పట్టుకుని, దుఃఖం వస్తుంటే, ఆపుకుంటూ, మంచం మీద కూచోబెట్టారు. కొంత సేపు మాట్లాడకుండా వున్న శ్రీరాముడు, తండ్రి మూర్ఛ నుండి లేవగానే, చేతులు జోడించి, ఆయనను చూసి, "మా అందరికీ నువ్వు రాజువు. నువ్వే ఇలా ధైర్యంగా లేకపోతే ఎలా? దండకారణ్యానికి పోతున్నాను. ఆజ్ఞ ఇవ్వు. మమ్మల్ని దయార్ద్ర దృష్టితో, శాంతంతో చూడు" అంటాడు.

సీతాలక్ష్మణులతో వనాలకు పోయేందుకు అనుజ్ఞ కోరిన శ్రీరాముడు

ఇంకా ఇలా అన్నాడు శ్రీరాముడు దశరథుడితో: "సీత, లక్ష్మణుడు కూడా నాతో అరణ్యాలకు వస్తున్నారు. న్యాయంగా, నిజంగా, సత్యం ప్రకారం, ఎన్నో కారణాలు ఎన్నో విధాలుగా చెప్పి, వాళ్లు రాకుండా చేయడానికి నా చేతనైనంత ప్రయత్నం చేసాను. నేనెంత వద్దని వారించినా, వదలక, నా వెంట రావడానికి ఇష్టమున్నందున, ఇక్కడ వుండలేమన్నారు. కాబట్టి వాళ్లు రావడానికి అంగీకరించాను. తండ్రీ! దుఃఖం వదలిపెట్టు. నాకు, సీతకు, లక్ష్మణుడికి, ప్రజలకు బ్రహ్మదేవుడిలాగా త్వరగా అనుమతి ఇవ్వు". (శ్రీరామచంద్రమూర్తి తన విషయంలో, తమ్ముడు లక్ష్మణుడి విషయంలో అనుమతి కోరవచ్చు కాని, భర్త స్వాధీనంలో వున్న సీతాదేవి విషయంలో తండ్రి ఆజ్ఞ అవసరమా? భార్య తన స్వాధీనురాలైనప్పటికీ, తాను తండ్రి ఆధీనంలో వున్నందున, ఆయనకు చెప్పకుండా ఏ పనీ చేయకూడదనుకున్నాడు. అంతే కాకుండా, కొడుకు మనస్సు వల్ల కాని, వాక్కు వల్ల కాని, చేతల వల్ల కాని తండ్రి శుశ్రూషకు విఘ్నం లేకుండా ఏదైతే చేయాల్నో, అదంతా తండ్రికి చెప్పే చేయాలి. కాబట్టి సీతకు అనుమతి కోరడం ధర్మమే).

జవాబుగా దశరథుడు శ్రీరాముడితో ఇలా అన్నాడు: "రాబొయ్యే కష్టాలను ఆలోచించకుండా, కీడేంటో తెలుసుకోకుండా, కైక పన్నిన మాయ వలలో పడి, అజ్ఞానంతో వరాలిచ్చి పరితపించడం మూలానే ఇన్ని విపరీతాలు కలిగాయి. వద్దంటే సత్యహాని...పొమ్మంటే ప్రాణహాని...ఈ రెండు గండాల నుండి నువ్వు నన్ను తప్పించాలి. నన్ను ధిక్కరించి ఇప్పుడు నువ్వు అడవులకు పోను అంటే, నాకు సత్యహాని కాని, ప్రాణ హాని కాని లేదు. అలా వేసి సమస్త రాజ్యం నువ్వే తీసుకో. ఇది నిజం. నేను వద్దనే వాడిని కాదు. ఇంత మాత్రం నా మాట గౌరవించు.

(ఇంతవరకు దశరథుడు తానంతట తాను నోరు తెరిచి శ్రీరామంద్రమూర్తిని అడవికి పొమ్మని చెప్పలేదు. అలా చెప్పింది కైక. ఇప్పుడేమో నువ్వు పోవద్దని అంటున్నాడు. ఇది తండ్రి ఆజ్ఞ కాదా? ఎందుకు దీన్ని శ్రీరామచంద్రమూర్తి

తిరస్కరించాడు? తన ఎదురుగా ఎప్పుడైతే కైక చెప్పిన మాటను దశరథుడు కాదనలేదో, అప్పుడే దానికి ఆయన అంగీకరించినట్లు లెక్క. ఇప్పుడాయన చెప్తున్నది ఉపచారం మాటే కాని పరమార్థ వాక్యం కాదు. ఎందుకంటే శ్రీరామచంద్రమూర్తికి ప్రత్యుత్తరంగా "పోయి రా" అన్నాడు. కాబట్టి ఉపచారంగా చెప్పే మాటలను పట్టించుకోకూడదు. అది కాకుండా తనను ధిక్కరించి రాజ్యాన్ని తీసుకోమంటున్నాడు. అది కొడుకు స్వధర్మానికి విరుద్ధమైన పని. స్వధర్మానికి విరుద్ధమైన పనిని ఎవరు చెప్పినా చేయకూడదు. స్వధర్మాన్ని వదలిపెట్టేవాడు పాషండుడు, పతితుడు అవుతాడు. అస్వస్థచిత్తుడైన కారణాన స్వధర్మహాని కలిగించే పనిని తండ్రి చెప్పినా కొడుకు వినకూడదు. భర్త చెప్పినా భార్య వినరాదు. గర్వంతో ఇది చేయొచ్చు, ఇది చేయకూడదు, అని తెలియకుండా ఆజ్ఞాపించిన భర్త ఆజ్ఞ కాని, పతితుడైన భర్త ఆజ్ఞ కాని భార్య వినాల్సిన అవసరం లేదు).

దశరథుడు చెప్పిన మాటలు విని ఆయనను చూస్తూ శ్రీరాముడిలా అన్నాడు. "పుణ్యాత్మా! నువ్వింతవరకు ఏ పాపం చేయలేదు. ఇప్పుడు నా కొరకు నువ్వెందుకు అసత్యమాడిన వాడివి కావాలి? నేను అడవికి పోకపోతే, నువ్విచ్చిన వరాలు వ్యర్థమవడం వల్ల నువ్వు అసత్యమాడినట్లే కదా? ఆ దోషం వ్యర్థంగా పోతుందా? నిన్ను ఆ దోషం నుండి తప్పించే శక్తి నాకుండి కూడా అది నెరవేర్చని దోషం నాకు కూడా కలుగుతుంది కదా? నన్ను పాడుచేసుకుని, నిన్ను పాడు చేస్తే నాకొచ్చే లాభం ఏంటి? నా శరీరం కష్ట పడితేనేం? శరీర కష్టానికి భయపడాలా? పరలోక హానికి భయపడాలా? నిన్ను అసత్యమాడించి, తిరస్కరించి, అవిధేయుడనై ప్రవర్తించి రాజ్యమంతా తీసుకున్నా నాకేం సంతోషం? కాబట్టి దండకారణ్యానికి పోయి అక్కడే సంతోషంగా వుంటాను. తొమ్మిది, మరో ఐదేండ్లు వనవాసం చేసి, వెనక్కు వచ్చి, నీ పాద దర్శనం చేసుకుంటాను. ఇది నిజం".

ఏకాంతంలో, ఎవ్వరూ లేనప్పుడు, తన భార్య కైక చెప్పిన మాటలను సత్యవాక్యమనే పాశంతో బంధించిబడినవాడైన శ్రీరాముడు పాటించడం తనకు దుఃఖం కలిగిస్తుంటే, తన కొడుకు శ్రీరాముడిని చూస్తూ దశరథుడు ఇలా అంటాడు.

శ్రీరాముడు అరణ్యాలకు పోవడానికి అంగీకరించిన దశరథుడు

"నాయనా! శ్రీరామా! ఇహంలో గొప్పతనం, పరంలో గొప్ప మేలు కలిగే విధంగా, మంచి మార్గంలో, శాశ్వత శుభంతో అడవులకు పోయి శీఘ్రంగా తిరిగి రా. ప్రసిద్ధ ధర్మమే స్వభావంగా కలవాడివి. సత్యమంటే ప్రీతికలవాడివి. అలాంటి నిన్ను, రాఘవా! అడవులకు పోకుండా ఆపుచేయడం నాకు శక్యం కాదు. అయినా నాకో కోరిక వుంది. దాన్ని నెరవేర్చు. ఈ రాత్రికి నా దగ్గర వుండు. ఇప్పుడే అడవికి పోవద్దు. ఒక్క పూటైనా నీతో హాయిగా గడుపుతాను. అన్నా! రామచంద్రా! నిన్ను కన్న తల్లిని చూడు. నువ్వు అడవికి పోతున్నావని ఎలా ఎక్కెక్కి ఏడుస్తున్నదో గమనించు. కుమారా! తండ్రిని, ముసలివాడిని, నన్ను చూడు. మా కొరకు, మా మనసులను సంతోషపెట్టడానికి ఒక్క రోజు ఇక్కడ వుండు. మా ఆశ తీరేవిధంగా సమస్తం నీకు కట్టపెట్టి, అది చూసి సంతోషిస్తాం. నీ మాట ప్రకారం ఉదయాన్నే లేచి పోవచ్చు. నీకు అమితంగా ఇష్టమైనవన్నీ వదలి, నాకు పరలోకంలో సంతోషం కలిగించేందుకు, నువ్వు అడవులకు పోవడానికి సిద్ధపడ్డావు. కుమారా! ఎంత కష్టమైన పని చేయడానికి పూనుకున్నావు? కుమారా! సత్యం మీద ప్రమాణం చేసి చెప్తున్నా.....నాకు ఏ పాపం తెలియదు. నీ విషయంలో ద్రోహ బుద్ధిలేదు. ఈ కుచ్చితురాలు మోహంతో నన్ను మోసం చేసింది. ఈ బూడిద కప్పిన నిప్పు, ఈ పాపాలరాశి వంశ గుణాన్ని నిందల పాలు చేసింది. ఇంత ఘోరమైన పని చేసింది. నువ్వు కూడా దాని మోసానికే అనుకూలంగా మసలుతున్నావు. నేనేం చేయగలను? 'కైక మోసం చేసిందంటున్నావు...ఆమె చేసిందేంటి?....నువ్వు పూర్వం ఇస్తానన్న వరాలనే కోరిందికదా' అంటావేమో! లోకంలో వరాలను కోరేవారెందరో వున్నారు కాని, ఇలా, నమ్మినవాడి గొంతు కోసినవారెవరూ లేరు. భార్యకదా...నా మీద ప్రేమ వున్నది కదా...నాకెందుకు అపకారం చేస్తుందని భావించి, విశ్వసించి, వరాలిస్తానని ప్రమాణం చేశాను. అలా నాతో మోసంతో ప్రమాణం చేయించుకుని, ఇంత ఘోరమైనవి కోరవచ్చునా? ఇది వేశ్యా లక్షణమే కాని పతివ్రతల లక్షణమా? తన కొడుక్కు రాజ్యం అడిగితే పరవాలేదు కానీ, నిన్నేల

అడవులకు పొమ్మనాలి? ఇది కుచ్చితం కాదా? ఇదే మోసం కాకపోతే, మరి మోసమంటే ఇంకేముంటుంది? నువ్వు అడవికి పోవడమనేది ఎంత ఆశ్చర్యమైన విషయం? నువ్వు నా పెద్ద కొడుకువై వుండి, ఎంత కష్టం వచ్చినా, నాకు అసత్య దోషం కలిగేట్లు చేయవుకదా?

తన మనో నిశ్చయాన్ని తండ్రికి చెప్పిన శ్రీరాముడు

దుఃఖంతో తండ్రి తనకు చెప్పిన మాటలను విన్న శ్రీరాముడు తమ్ముడు లక్ష్మణుడు పక్కనుండగా ప్రతిగా జవాబిచ్చాడిలా: "రాజేంద్రా! నువ్వు ఇవ్వాలనుకున్న వస్తువులన్నీ నేను తీసుకున్నట్లే. తీసుకుంటే ఎంత సంతోషంగా వుంటుందో, అంతే సంతోషం నీ మాటలవల్ల కలిగింది. అయ్యా! ఇవ్వాళ నువ్విస్తావు...మంచిదే! రేపిదే వేళ ఎవరిస్తారు? రేపటి నుండి లేనివి ఈ ఒక్కరోజెందుకు? నాకు అలాంటి వాటిమీద కోరిక లేదు. నాకవసరం లేని వస్తువులను ఇస్తానంటున్నావు. అవెందుకు నాకు? నాకు కావాల్సినవి అడుగుతా....నువ్విస్తానన్న వాటికి బదులు ఇవి ఇవ్వు. అవేంటంటావా? నీ వాగ్దానం భంగం కాకుండా వుండేట్లు. మాట సార్థకమయ్యే విధంగా, నన్ను అడవికి పోనివ్వు. అడవుల్లో పద్నాలుగేళ్లు వుండడానికి అంగీకరించాను. ఆ నానిశ్చయం తప్పదు. తప్పుతే నేను అసత్యవాదినవుతాను. భూమి, జనసమూహం, ధనం, ధాన్యంతో కూడిన ప్రభుత్వ సంపదనంతా లోగడ నువ్వు కైకకు చెప్పినట్లు, భరతుడికి దక్కే విధంగా చేయి. నేను నీ ఆజ్ఞ నెరవేర్చేందుకు ఋషులతో వుంటాను".

"రాజేంద్రా! ప్రభుత్వం నాకిస్తే సుఖాన్ని అంగీకరించినట్లే కదా అని, నేను యువరాజుగా వుండడానికి అంగీకరించిన వాడిని కాదు. నువ్వు నన్నిలా చేయమనగానే, నీ ఆజ్ఞ మీరరాదు కనుక అది నెరవేర్చడానికి ఒప్పుకున్నాను. నువ్వు దుఃఖాన్ని వదలిపెట్టు. భూమండలాన్నంతా భరతుడు భరించేట్లు చెయ్యి. నా కు రాజ్యం వద్దు...భోగాలొద్దు...ప్రియపదార్థాలొద్దు...నాకు కావాల్సిందల్లా నీ ఆజ్ఞ నెరవేర్చడమే...దాన్నే చేస్తాను. హృదయంలో దుఃఖం మాను. బైటికి మంచిగా వున్నప్పటికీ, లోలోన బాధపడితే ఏం లాభం? కన్నీళ్లు కార్చవద్దు. అదెలా సాధ్యమంటే...సముద్రుడు ఎప్పుడైనా లోపలి భాగంలో కలత

చెందుతాడా? సముద్రానికి ఎంత క్షోభ వచ్చినా పైపైనే కాని లోపలేం జరగదు కదా? సత్యం మీద నీ ముందే ప్రమాణం చేస్తున్నాను. నా కోరికంతా నువ్వు సత్యవాదివి కావాల్సనే. దానికి విరుద్ధంగా రాజ్య సుఖాలు నాకొద్దు. ఈ లోకంలోనే కాదు...దేవేంద్రుడి పట్టణాన్నిచ్చినా తీసుకోను. ఇంతెందుకు? నా ప్రాణాలను కూడా లెక్క చేయను. తండ్రీ! నేనొక్క నిమిషం కూడా ఇక్కడుండ కూడదు. ఈ ఘోరాన్ని చూసి దుఃఖ పడొద్దు. ఇది నిజం. నా నోట ఈ మాట తప్ప మరింకేమీ రాదు. నువ్వు నన్ను పొమ్మనలేదు....నీతో పోతానని నేనుఅనలేదు. కైక నన్ను పద్నాలుగేళ్లు అడవులకు పొమ్మంది...నేను అంగీకరించాను".

"నేను చెప్పిన సత్యాన్ని కాపాడుకుంటాను. నువ్వు నన్ను అరణ్యాలకు పొమ్మన్నావని...అందుకే నేను పోతున్నానని బాధపడను. ఆ తల్లి చెప్పింది...ఈ కొడుకు పోయాడనుకుని సంతృప్తిచెందు. కాబట్టి, నా మాట ప్రకారం అనేకరకాలైన పక్షులు, మృగాలు నివసించే అడవికి పోతాను. తండ్రీ! ఎందుకు బాధపడతావు? దేవతలకైనా దైవం తండ్రే అని విన్నందున, నీ ఆజ్ఞ దేవుడి ఆజ్ఞగా భావించి, నీ మాట సార్థకం చేస్తాను. దీనికై ఎందుకు బాధపడ్తావు? పద్నాలుగేళ్ల వనవాసం తరువాత అనుకున్న విధంగా నన్ను చూడొచ్చు. ఇప్పటికి దుఃఖం మానుకుని నన్ను పోనివ్వు. నిన్ను చూస్తుంటే, నీ బాధ చూస్తుంటే, నా తల్లి-ఇతరులు, నాకోసమే కాకుండా, నీ కొరకు కూడా కళ్లల్లో నీళ్లు కారేట్లు బాధపడుతున్నారు. వాళ్లను సముదాయించాల్సిన వాడివి నువ్వే కదా! నువ్వే ఏడుస్తుంటే నిన్నెవరు సముదాయిస్తారు? వాళ్లను సముదాయించేవారెవరు? ఎవరూ లేరు. కాబట్టి నువ్వు దుఃఖం ఆపి, భరతుడు రాజ్యభారం మోసేట్లు చేయి. నేను రాజ్యాన్ని వదలాను. నేను దండకారణ్యానికి పోయిన తరువాత భరతుడు, కొండలతో, అడవులతో కూడిన ఈ రాజ్యాన్నంతా, బారులు తీరిన ప్రజలంతా తనను భక్తితో సేవిస్తుంటే, ఏ బాధాలేకుండా పరిపాలించాలి. నేను నీ ఆజ్ఞ ప్రకారం నీ కోరిక తీరుస్తాను. నా కోసం నువ్వెందుకు ఇలా నిట్టూర్పులు విడుస్తున్నావు? నా ప్రయాణం సాగనివ్వు".

"బుద్ధిమంతులు మెచ్చే నీ ఆజ్ఞను నియమంగా, వ్రతంగా పూని నెరవేర్చాలని మాత్రమే కోరుతున్నాను కాని, శ్రేష్ఠంబులైన భోగాలను కాదు.

రాజా! నాకోసం ఎందుకు బాధపడతావు? నీతో అబద్ధాలాడించి, రాజ్యాన్ని, భోగాలను, ప్రాణాలను కోరేవాడినా నేను? సత్యాన్ని వదలాలా? సీతను వదలాలా? అన్న మీమాంస వస్తే, ఎలాంటి కష్టాలలోనైనా, ప్రాణం పోయినా, వంద అబద్ధాలు ఆడైనా, భార్యను వదలాల్చి వచ్చినా, సత్యాన్ని మాత్రం వదలను. తండ్రీ! ఒక్క మాట చెప్తా విను. ఎన్నో మాటలని ప్రయోజనం లేదు. పని జరగడం ముఖ్యం. ఆ పనేంటంటే...పండ్లు, కందమూలాలు, ఆకులలాలు ప్రధాన ఆహారంగా తీసుకుంటూ, కొండలు, అందమైన సెలయేళ్లను చూసుకుంటూ, దండకారణ్యమనే ప్రసిద్ధ అడవిలో వుండే కల్ప వృక్షాలతో సమానమైన చెట్ల కింద హాయిగా నివసిస్తాను".

శ్రీరాముడు తనను వదలి పోతున్నాడనే బాధతో, దుఃఖంతో, నిద్రాహారాలు మాని ఏడుస్తుండడం వల్ల కలిగిన శరీర తాపంతో, గుండె చెదరిన దశరథుడు, కొడుకును కౌగలించుకుని, శవంలాగా కాళ్లు చేతులాడించకుండా నేల మీద పడిపోయాడు. దశరథుడి ముద్దుల భార్య కైక మినహా తక్కిన రాజు భార్యలందరు, హాహా కారాలు చేస్తూ, ఏడుస్తుంటే, సుమంత్రుడు కోపంగా కైకనుద్దేశించి మాట్లాడడం ప్రారంభించాడు.

❖ ❖ ❖

సర్గ-35

కైకను దూషించిన సుమంత్రుడు

కటకట అనే ధ్వని కలిగే విధంగా, పండ్లు కొరుకుతూ, కడు వేగంగా చేతిని విసురుతూ, కళ్ల నుండి నిప్పుల్లాంటి వేడి నీళ్లను బొటబొటా రాలుస్తూ, శరీర కాంతిమారిపోతుంటే, వేడి నిట్టూర్పులు విడుస్తూ, కోపంగా చిటచిట లాడాడు సుమంత్రుడు. రాజు మనసు తెలిసినవాడైనందున, కైకను తాను తిట్టినా రాజుకు కోపంరాదని భావించి, కైక గుండెలు పగిలేలా పటపటా తునకలయ్యే మాటల బాణాలను వదలాడు. తన మాటల దెబ్బలతో కైక శరీరం నలిగిపోవాలని, పొగరుమోతు నడవడిగల దానిని చూసి సుమంత్రుడిలా అన్నాడు:

"ఓసీ! ప్రాణ భర్త, భూమి పతి, దయావంతుడైన దశరథుడిని వదిలిన నీకు, చేయలేని పనేదైనా వుందా? నువ్వేం ఆడుదానివే? ఎలాంటి దుష్ట స్త్రీ ఐనా ఇలా చేస్తుందా? ఈ రాజుకు ఎంత ఆపద వచ్చినా కొండలాగా దైర్యం కోల్పోయేవాడు కాదు. ఇంద్రుడిలా ఎంతటి శత్రువునైనా జయించే శక్తిమంతుడు. సముద్రం లాగా క్షోభ లేనివాడు. అలాంటి దేహబలం, మనోబలం కలవాడిని, నువ్వు, నీ కుఛ్చితపు చేష్టలవల్ల నడుం విరిగి కూలబడేట్లు, నలుగురిలో అవమానం పాలయ్యేట్లు చేశావు. ఎంత నేర్పరివే నువ్వు? ఓసీ దుర్మార్గురాలా! నువ్వు భర్తను చంపిన దానివి మాత్రమే కాదు....కులాన్ని నాశనం చేసినదానివి కూడా అని అంటాను. స్త్రీకి కోటిమంది కొడుకులున్నా, పతి అసమర్థుడైనా, భర్తను అనుసరించే వుండాలి. అదే క్షేమం. అలాంటిది, నువ్వు కోరిన వరాలనిచ్చే మగడిని, నీ వయసనే పొగరుతో ఇలా బాధించవచ్చా? లోకంలో ధర్మ ప్రకారం, ఒక రాజు మరణిస్తే పెద్ద కొడుకు రాజ్యం చేయడం శాస్త్ర సమ్మతమైన పని. న్యాయం ఇలా వుంటే, ఈ రాజు ఊపిరితో వుండగానే, అదే న్యాయాన్ని పాడుచేయాలనుకుంటున్నావు. నీ కొడుకే రాజైనా, ప్రభువైనా, మేం చేసేది చేస్తాం. అదేంటో దృఢంగా చెప్తా విను. ప్రజలమైన మేమందరం, శాశ్వతంగా, శ్రీరాముడెక్కడ సంతోషంగా తిరుగుతుంటాడో, అక్కడే సంతోషాన్ని

అనుభవిస్తూ నివసిస్తాం. శ్రీరాముడెక్కడుంటే అక్కడే మాకు సర్వ సౌఖ్యాలు, సర్వ భోగాలు, సర్వ సంతోషాలుంటాయి కాని న్యాయం తప్పిన ఈ వూళ్లో, మంచి బుద్ధి గల పండితులు, మంచి నడవడి కల సాధువులు, పెద్దవారు ఎవరూ వుండరు".

"ఆహా! ఏమి విచిత్రం? ఇలాంటి నీ లోక విరుద్ధమైన నడవడికి భూమి రెండుగా బద్దలై పగలలేదేంటి? అధర్మాన్ని సహించని ఈ వసిష్ఠాది మహామునులు నిన్నెందుకు శపించకుండా క్షమించి విడిచిపెట్టారు? మామిడి చెట్టును గొడ్డలితో నరికి పారేసి, దాని స్థానంలో వేపచెట్టును నాటి పాలుపోసి పెంచినా అది తియ్యగా వుందదు కదా? పట్టమహిషైన కౌసల్యను ఆదరించకుండా నిన్ను గొప్పదాన్ని చేసి, ఆదరించి, దశరథుడు తన నెత్తిపై పెట్టుకుంటే నువ్వు మంచిదానివైతావా? కాలేవు. నీ తల్లి ఎలాంటిదో నువ్వు కూడా అలాంటి దానివే. వేపచెట్టు నుండి తేనె ఎలా కారుతుంది? నీ కన్న తల్లి చెడుగుణాలు గురించి చాలా విన్నాం. వాటినిప్పుడు నీలో చూసున్నాం. స్వభావ గుణాలు దాచడం ఎవరికి చాతనవుతుంది? తేలుకు కుమ్మరి పురుగు పుడుతుందా? నీ తల్లి చేసిన చెడు పని ఒకటి చెపుతా విను. ఎవరికీ తెలియదని అనుకుంటున్నావేమో? ఒక సిద్ధుడు నీ తండ్రికి పశువులు-పక్ష్యులు మాట్లాడుకునే మాటలు తెల్సుకునే వరం ఇచ్చాడు. ఒక రోజున పడక గదిలో భార్యతో పడుకున్న సమయంలో, బంగారు వన్నెకల చీమ మాటకు గొల్లున నవ్వాడు. వెంటనే ఆయన భార్య, నీ తల్లి, ఎందుకాయన నిష్కారణంగా నవ్వాడని కోపంతో అడిగింది. అది తాను చెప్పకూడదన్నాడు మీ నాన్న. అలా చెప్తే తనకు మరణం ప్రాప్తిస్తుందని గురువాజ్ఞ కాబట్టి చెప్పనన్నాడు. తనను అవమానించిన తరువాత చచ్చినా, బతికినా ఒకటే అని తనకా విషయం చెప్పాల్సిందే అని మీ అమ్మ బలవంతం చేసింది. తనకు వరమిచ్చిన సిద్ధుడికీ విషయం చెప్పి ఆయన సలహా కోరాడు మీ తండ్రి. ఏదేమైనా చెప్పొద్దని అన్నాడు సిద్దుడు. ఆయన మాట ప్రకారం దుష్టురాలైన నీ తల్లిని వూరు వెడలగొట్టి సుఖంగా జీవించాడు నీ తండ్రి. అలా చేయకుండా, నీకు దాసుడై ఇలా ఏడుస్తున్నాడు నీ భర్త. తాను ఏడుస్తూ లోకాన్నంతా ఏడిపిస్తున్నాడు".

"నీతి మాలిన చెడ్డ పనులు చేయడంలో నీ తల్లి అంతటి దానివి నువ్వు కూడా. అంతకంటే ఎక్కువ కూడా! చెడు నడవడితో పాపాత్మురాలివై రాజును బాధిస్తున్నావు. ఇది యదార్థం. ఎందుకంటే...తల్లిని పోలిన కూతురు, తండ్రిని పోలిన కొడుకు పుడుతారంటారు. లోకులందరూ వినేట్లు పలికిన రాజు మాటలు నిజం కానివ్వు. నీ తల్లిలాగా రాజును చంపడానికి ప్రయత్నం చేయొద్దు. భర్తను భక్తితో సేవించు. పురజనులకు సంతోషం కలిగే పని చేయి. ఇంద్రుడితో సమానమైన భర్తను అధర్మ కార్యం చేయమని ప్రోత్సహించవద్దు. నీకిచ్చిన వరాలు వృధాగా పోతున్నాయని అనుకోవద్దు. ఇప్పుడు నీకున్న సంపదకంటే ఎక్కువగా నీకిస్తాడు రాజు. మిక్కిలి బలవంతుడు, రాజ్య రక్షణలో సమర్థుడు, జ్యేష్ఠుడు, శాస్త్ర ప్రకారం, వంశాచారం ప్రకారం పట్టాభిషేకానికి అర్హుడైన పెద్ద కొడుకు, ప్రజలను రక్షించే స్వభావం కలవాడు, సామర్థ్యం, హక్కు మాత్రమే కాకుండా స్వభావరీత్యా కూడా రాజుగా వుండతగిన వాడు, స్వధర్మ రక్షణలో పట్టుదలగలవాడు, దాత, లోభితనం లేనివాడు, సంపాదించినదంతా తిరిగి ప్రజలకే ఇచ్చేవాడు, ఐన, శ్రీరాముడిని పట్టాభిషేకం చేసుకోనివ్వు".

"శ్రీరాముడు రాజును, తండ్రిని వదలి అడవులకు పోతే నీకు నింద తప్పదు. చక్కగా ఆలోచించి చూడు. వరాలిచ్చాడు కదా అపనింద వుండదనుకోవద్దు. రాజ లక్షణాలున్న శ్రీరాముడు లేని లోటుతో రాజ్యం అరాచకమవుతుంది. ఇక నీ రాజునెవరు గౌరవిస్తారు? వున్నా లేనట్లే! శత్రువులు వచ్చి మీద పడితే ఈ ముసలి రాజేం చేయగలడు? రాజ్యం పరాధీనమవుతుంది. అప్పుడు నీకు అపకీర్తి తప్పదు. ఈ అనర్థానికంతటికీ నువ్వే కారణం కాబట్టి నీకు నింద తప్పదు. శ్రీరాముడు అడవులకు పోతే రాజ్యపాలనలో అంతటి సమర్థుడు మరొకరు దొరకరు. కాబట్టి కోపస్వభావురాలా! నీ కోపం వదలి శ్రీరాముడే రాజయ్యేట్లు చేయి. శ్రీరాముడు రాజైతే సంప్రదాయం ప్రకారం దశరథుడు వానప్రస్థాశ్రమం అంగీకరించి అడవులకు పోయి తపస్సు చేసుకుంటాడు".

నీతి యుక్తమైన, పరుషమైన, మనసు కలత చెందే విధంగా గొప్పవాడైన సుమంత్రుడు ఇలా మాట్లాడాడు. ఇంతైనా కైకకు బాధ కలగలేదు. కొంచెం కూడా మార్పు కనిపించలేదు. కోపం తగ్గలేదు.

❖ ❖ ❖

సర్గ-36

శ్రీరాముడి వెంట సైన్యం పంపమని సుమంత్రుడికి చెప్పిన దశరథుడు

ఇంత చెప్పినా కైక ముఖంలో మార్పు రాకపోవడం గమనించిన రాజు దశరథుడు, మెల్లగా కన్నీళ్లు కారుస్తూ, వేడి నిట్టూర్పులు విడుస్తూ, తానిచ్చిన వరాలను ఊహించి, సుమంత్రుడితో ఇలా అన్నాడు: "సారథీ! శ్రీరాముడి వెంట పోవడానికి రత్నాలతో రథగజతురగపదాతుల సమూహాలతో కూడిన సైన్యాన్ని, అస్త్ర శస్త్ర సమూహాలను శీఘ్రంగా సిద్ధం చేయించు. చక్కగా పాడేవారిని, అందంగా వుండే వేశ్యలను, ధనవంతులైన వైశ్యులను సిద్ధం చేసి, వీరందరూ వారి వారి వస్తువులతో సైన్యం వెంబడి పోయి శ్రీరాముడిని ఆనందంగా వుంచాలి. శ్రీరాముడిని ఆశ్రయించి వుండేవారికి, సాములు, గరిడీలు చేసేవారికి, ఇంకా శ్రీరాముడికి ఇష్టమైన వారికి, కావాల్సినంత బంగారం ఇచ్చి, వారి కోరికలు తీర్చి, వాళ్లనూ పయనం కమ్మణి చెప్పు. ఆయుధాలు ధరించినవారిని, నూనె, నేయి లాంటి పదార్థాలను తీసుకోపొయే బండ్లను, పౌర జనులను, ప్రయాణానికి సిద్ధం చేయి. తోవ చూపేటందుకు వన సంచారులైన బోయవాళ్లను, చెంచులను శ్రీరాముడి వెంట పంపు. ఏనుగులను దండిస్తూ, మృగాలను ఖండిస్తూ, అనేక నదుల్లో స్నానం చేస్తూ, తీయని తేనె తాగుతూ, ఇక్కడి మనోహర రాజ్యాన్ని మరచి అడవుల్లోనే కొడుకుండేట్లు చేయి. మనుష్య సంచారం లేని అడవుల్లో తిరిగే రాముడు సుఖంగా వుండడానికి ఆయన వెంట నాకున్న ధనధాన్యాలన్నీ పంపించు. మంచి స్థలాల్లో చక్కగా తగురీతిన యజ్ఞాలు చేస్తూ, మునులకు, బ్రాహ్మణులకు సంతోషం కలిగేలా భారీ దక్షిణలిస్తూ, దేవర్షులతో, మహర్షులతో ఎప్పుడూ ముచ్చడించుకుంటూ, ఏ ఆపదా లేకుండా శ్రీరాముడు అడవుల్లో వుండాలి. భరతుడు అయోధ్యలో వుండి సకల భోగాలతో సంతోషంగా రాజ్యాన్ని పాలించాలి. రామచంద్రుడు అరణ్యాలకు పోవడానికి తొందరపడుతున్నాడు కాబట్టి నేను చెప్పినవన్నీ త్వరగా కానివ్వు సుమంత్రా".

ఇలా అంటున్న దశరథుడి ఎత్తిపోటు మాటలు విన్న కైకకు భయం పట్టుకుంది. నిజంగా దశరథుడు చెప్పినట్లు సుమంత్రుడు చేస్తాడేమోనని ముఖం వాడిపోయింది. గొంతు బొంగురు పోయింది. పెద్ద దుఃఖం వచ్చింది. రాజు ముఖాన్ని చూస్తూ..."ఓ ఉత్తమ సాధువా! నువ్వు చాలా పెద్దమనిషిలా వున్నావే? సారం పోయిన జనం లేని పాడు రాజ్యం నా కొడుక్కెందుకు?" అని అడిగింది. ఇలా సిగ్గు విడిచి క్రూరత్వం మనసులో వుంచుకుని, మాట్లాడుతున్న కైకను చూసి దశరథుడు దూషించాడు. "ఓ అనిష్టురాలా! నా నెత్తి మీద మోయలేని భారాన్ని పెట్టి ఇంకా బాధిస్తావా? ఓసీ చెనటీ! నన్ను నువ్వు వరాలడిగేటప్పుడు శ్రీరాముడి వెంట ఎవరూ పోరాదని అన్నావా? ఇష్టం వచ్చినవారు పోతారు... లేనివారుంటారు. అధికమైన కోపంతో, సిగ్గు-భయం లేక మాట్లాడుతావా?" అని నిండు కోపంతో బలికిన దశరథుడిని తప్పుబట్టింది కైక. "ఓహో...వీడు మరొక ప్రకారం నా కోరికను వ్యర్థం చేయడానికి ప్రణాళిక వేస్తున్నాడు" అనుకుని వయసు-పొగరున్న కైక ఇంతకు ముందుకన్నా రెండింతలు కోపం తెచ్చుకుంది. "నీ వంశంలోనే కదా సగర చక్రవర్తి తన పెద్ద కొడుకు అసమంజుని అడవికి పంపి మంచి కీర్తిని సంపాదించాడు? అలానే నీ పెద్ద కొడుకును కూడా వుత్త చేతులతో అడవికి పంపడమే నాకిష్టం" అంటుంది కైక.

ఛీ! ఇదేం తెలివితక్కువ మాట్లాడుతున్నది అనుకున్నవారిని కాని, ఆమె మాటలు వినేవారు, స్త్రీలు, "ఔరా! దీనివల్ల స్త్రీ జాతికంతా అపకీర్తి వస్తున్నదే? ఇక ఏ ఆడుదానిని ఏ పురుషుడు నమ్మడు" అని సిగ్గుతో తలలు వంచుకున్నవారిని కాని, కైకేయి లక్ష్యపెట్టలేదు. ఆ సమయంలో దగ్గర్లో వున్న ముసలి మంత్రి సిద్ధార్థుడు స్పందించాడు.

కైకకు బుద్ధి చెప్పిన సిద్ధార్థుడు

రాజు గౌరవించే పుణ్యస్వభావం కల సిద్ధార్థుడు కైకేయితో ఇలా? యువరాజ్య పట్టాభిషేకానికి అన్నాడు: "కైకేయీ! తెలిసినదానిలాగా ఎందుకు మాట్లాడుతున్నావు? అసమంజుడిని ఎందుకు నగరం నుండి పంపించారో, దానికి కారణం ఏంటో చెప్తా విను. అసమంజుసడనే ఆ రాజకుమారుడు, నగరంలో ఆడుకుంటున్న పిల్లలను బలవంతంగా తీసుకునిపోయి, సరయూనది

నీళ్లలో వాళ్లు కుయ్యో-మొయ్యో అని కేకలు పెట్టున్నా వినకుండా, పడవేసేవాడు. ఆ నీళ్లలో వాళ్లు మునిగి తేలుతూ, కాళ్లు చేతులు కొట్టుకుంటూ, అరుస్తుంటే, దుష్టుడై వినోదించేవాడు. ఇలా శిశు హత్యలు చేసే అసమంజసుడిని చూసి నగరంలో వున్న పౌరులందరూ వాడిపై కోపంతో, సగర చక్రవర్తికి పిర్యాదు చేశారు. ఆయనకు ప్రజలు కావాలో, కొడుకు కావాలో తేల్చుకోమన్నారు. ఇరువురిలో ఒకరిని వూరు నుండి వెడలకొట్టాలని కోరారు. అలా అడగడానికి కారణమేంటని రాజు వారిని ప్రశ్నించగా వారున్న విషయాన్ని చెప్పారు. భయంకరమైన, లోక విరుద్ధమైన నడవడిగల కొడుకు పిల్లలని నీళ్లలో పడేసి వేడుక చూస్తున్నాడని జవాబిచ్చారు. పురజనుల కోరికపై రాజు వాళ్లని తృప్తిపరచడానికి, కొడుకును భార్యతో సహా అడవులకు పొమ్మని ఆజ్ఞాపించాడు. వాడు చచ్చేటంతవరకు ఘోరమైన అడవుల్లో నలుదిక్కులు తిరుగుతూ, దుంపలు, ఆకులు అలాలు తింటూ బతికాడు. ధర్మాత్ముడైన సగర చక్రవర్తి, దుర్మార్గుడైన, పాపాత్ముడైన తన కొడుకును అలా వదలుకున్నాడు".

"శ్రీరాముడిలో ఏ దోషం వుందని నువ్వు అడవులకు పంపుదామను కుంటున్నావు? ఆ దోషమేంటో చెప్పు. పగవాడనే వాడే లేని శ్రీరాముడిలో మాకు ఒక్క దోషం కూడా కనబడడం లేదు. సముద్రంలో పుట్టినందున చంద్రుడికి బురద అంటుకుంటుందా? నువ్వేం దోషం ఆయనలో చూశావో చెప్పు? అలా ఏదన్నా వుంటే, ఇప్పుడే భయంకరమైన అడవులకు ఆయనను పంపవచ్చు. నిష్కారణంగా ఎందుకీ మూర్ఖత్వం? సాధువు లాంటివాడిని, సన్మార్గంలో నడచుకునే వాడిని, నిష్కారణంగా ఆపదల పాలు చేయడం ధర్మహాని. ఆ దోషం ఇంద్రుడంతటి వాడినే దహించి వేస్తుంది వంకర నడతగల దానా! నీలాంటి వారి సంగతి చెప్పనక్కర లేదు. కాబట్టి, ఓ కైకేయీ! శ్రీరామచంద్రమూర్తి యౌవరాజ్య పట్టాభిషేకానికి విఘ్నం కలిగించవద్దు. ఈర్ష్య వదలుకో. ఎందుకు నిష్కారణంగా ఆపద తెచ్చి పెట్తావు? మనసు రాయి చేసుకోవద్దు. అపకీర్తిని పోగొట్టుకో?".

ఈ విధంగా అంటున్న సిద్ధార్థుడి మాటలను వింటున్న దశరథుడు కైకతో అన్నాడిలా: "పాపాత్మురాలా! ఈ మాటలేవీ నీకు రుచించవుకదా? నీకు, నాకు

ఏది మేలో, అది ఆలోచించలేవు. లోభ గుణంతో చెడ్డ తోవలో పోదామనుకుంటున్నావు. నీచమైన కార్యం చేస్తున్నావు. ఎందుకీ మంకుతనంతో అందరినీ బాధ పెట్తావు? ఓసీ! చెడు మనసున్నదానా! సుఖం, ధనం, రాజ్యం, ప్రభుత్వం, సర్వస్వం వదలి శ్రీరాముడి వెంట నేనూ అడవులకు పోతాను. శాశ్వతంగా ఈ ప్రభుత్వాన్ని నువ్వు, నీ కొడుకు, మీా నెత్తిపై కొట్టుకోండి. ఈ అన్యాయ ప్రభుత్వాన్ని నేను ఒక్క రోజైనా చూదగలనా?"

❖ ❖ ❖

సర్గ-37

సీతారామలక్ష్మణులకు నార చీరెలిచ్చిన కైక

మంత్రి, తండ్రి, ఇతరులు చెప్తున్న మాటల్ను వింటున్న రామభద్రుడు, కడు వినయంతో, చలించని ధైర్యంతో, భక్తి అతిశయంతో, ఇలా అన్నాడు. "తండ్రీ! మీరందరు అడవికి వస్తామంటున్నారు....ఏం చేయడానికి? నేనైతే అన్ని సుఖాలను వదలిపెట్టి, సర్వసంగ పరిత్యాగం చేసి, దండకారణ్యంలో తిరుగుతూ, ఆకులలాలు దండిగా తింటూ, కాలం వెళ్లబూస్తాను. నాకు మీ జంజాటం ఎందుకు? ఇంకా మీకు భ్రాంతి ఎందుకు? ఏనుగును దానం చేసి కట్టడానికి తాడు ఇవ్వడానికి బాధపడ్తున్నావు? ఈ సైన్యాన్ని నా వెంట పంపితే ప్రయోజనమేంటి? నేనెవరి మీదికైనా దండయాత్రకు పోతున్నానా? కైక సంతోషించే విధంగా వాటన్నింటినీ భరతుడికి ఇస్తాను. నాకెందుకివన్నీ? నాకు కావాల్సింది నార చీరెలు, గంప, గడ్డపార. అవి త్వరగా తెప్పించు. చాలు. నేను పద్నాలుగు సంవత్సరాలు అరణ్యంలో వుంటాను".

దశరథుడు చెప్పిన దానికి శ్రీరాముడు అంగీకరిస్తాడేమో...సమస్త జనులు శ్రీరాముడి వెంట పోతారేమో....తన కోరిక వ్యర్థమవుతుందేమో...అని విచారపడుతున్న కైకకు శ్రీరాముడి మాటలు విని "దక్కిందిరా రాజ్యం" అని మిక్కిలి సంతోషించి, ఉప్పొంగి పోయింది. స్వయంగా తానే నార చీరెలు తెచ్చి, "రామా! వీటిని కట్టుకో" అని పురజనులందరి ముందర సిగ్గు, జంకు, భయం లేకుండా శ్రీరాముడికిచ్చింది. ఇలా ఎప్పుడైతే నార చీరెలు తన చేతికి వచ్చాయో, వెంటనే, శ్రీరాముడు తాను ధరించిన సన్న వస్త్రాలను తీసేసి, పక్కన పెట్టి, సంతోషంగా నార చీరెలు కట్టుకున్నాడు. ఆయన కట్టుకోగానే, తండ్రి చూస్తుండగానే, లక్ష్మణుడు కూడా కట్టుకున్నాడు. శ్రీరామలక్ష్మణులు నార వస్త్రాలు కట్టుకున్న తరువాత, సీతను కూడా కట్టుకొమ్మని, ఆమె చేతికి కైక నార చీరెలను ఇచ్చింది. పట్టవస్త్రాలు కట్టుకున్న సీత సిగ్గుతో, వలను చూసిన ఆడు జింకలాగా భయపడిపోయింది ఒక క్షణం. వాటిని ఎగాదిగా చూస్తూ, పతివ్రతా ధర్మం తెలిసిన స్త్రీ కాబట్టి, భర్త కట్టుకుంటే లేంది తనెందుకు

కట్టుకోరాదని ఆలోచించి వాటిని తన చేతిలోకి తీసుకుంది. వస్త్రాలను తాకిన సీతకు, ఇలాంటి కరకు వస్త్రాలను గంధర్వులతో సమానమైన తన భర్త ధరించె గదా! అని దుఃఖ పడింది. శోకంతో నిండిన కళ్లతో భర్తను చూసింది. "నాథా! ఈ నార వస్త్రాలను అడవులలో మునులెలా కట్టుకుంటారో"అంది. వాటిని కిందామీదా పైనా తిప్పి చూసి, ఒక చేత్తో ఒక చీరె తీసుకుని, మెడ కింద తగిలించి, గడ్డంతో అదిమిపట్టి, రెండోది తీసుకుని ఏం చేయాలో తెలియక సిగ్గుపడింది. అలా వున్న ఆమెను చూసి శ్రీరాముడు ఆమె దగ్గరకు వెంటనే పోయి, ఆమె కట్టుకున్న చీరె మీదే దాన్ని కప్పే ప్రయత్నం చేశాడు. (నార చీరెలు మూర మీద మూడు జానల పొడవుంటాయి. రొమ్ము మీద ఒక తునక, మొలకు ముందొక తునక, వెనకొకటి కట్టుకోవాలి. గరకుగా వుంటాయి)

సీతను తీసుకోపోవద్దని శ్రీరాముడిని ప్రార్థించిన రాజకాంతలు

శ్రీరాముడు తానే స్వయంగా తన ప్రియమైన భార్యకు చీరెలు కట్టుంటే చూసిన అక్కడున్న స్త్రీలందరూ కళ్లల్లో నీళ్లు కార్చారు. మాటలు తడబడుతుంటే... "రామా! సీతను అడవికి పొమ్మని ఎవరు చెప్పారు? ఈ ఉత్తమ స్త్రీని నువ్వెందుకు అడవులకు తీసుకుని పోతున్నావు? అయ్యా! మా మాట విను. పిలుచుకుని పోవద్దు సీతను. మీ తండ్రి నిర్బంధం వల్ల నువ్వు అడవులకు పోతే, ఇక్కడున్న సీతను చూసైనా మేం బాధపడకుండా వుంటాం. నువ్వు, నీ తమ్ముడు, మగవారు కాబట్టి, ఒకరికొకరు తోడుగా అడవుల్లో సంచారం చేయడానికి పొండి. నాయనా! కోమలి సీత అడవుల్లో మునుల లాగా ఎలా వుండగలదు? ఎలా కష్టపదగలదు? అయ్యా! మా మాటలు వినవయ్యా! జానకిని వదలిపెట్టి పోవయ్యా! నీకు పుణ్యం వుంటుంది. నువ్వు ధర్మాన్ని తలచి పితృవాక్య పాలనకొరకు అడవులకు పోతే పోవచ్చు". ఇలా అక్కడున్న అంతఃపుర స్త్రీలు అంటుండగానే, ఆ పలుకులను వినిపించుకోకుండా, శీలవతైన సీతకు నార వస్త్రాలు కట్టాడు శ్రీరాముడు.

సీత నార చీరెలు కట్టుకోకూడదని నిషేధించిన వసిష్ఠుడు

శ్రీరాముడు నేర్పిన విధంగా నార చీరెలను చక్కగా కట్టుకుంటున్న సీతను చూసి, అవి కట్టుకోవద్దని ఒకటికి రెండు సార్లు చెప్పి, నిర్దయతో కూడిన నడవడీగల కైకతో కోపంగా ఇలా అన్నాడు వశిష్ఠ ముని. "ఓసీ వంశ నాశకురాలా! భయంకర చరిత్ర గల దుష్టనడవడిగలదానా! వంచనతో రాజును మోసగించి, ప్రమాణం చేయించుకుని, అంతటితో ఆగక ఎందుకు నీ మర్యాద మీరి పోతున్నావు దురాత్మురాలా? సీతాదేవి నార చీరెలు కట్టకూడదు. అడవికి పోకూడదు. ఇక్కడే పట్టపుదేవి హోదాలో, తన భర్త ఎక్కాల్సిన సింహాసనాన్ని తానెక్కుతుంది. అది ఏ ధర్మం ప్రకారమని అడుగుతే దానికీ జవాబుంది. గృహస్థ ధర్మంలో వున్న పురుషుడి ఆత్మ వాడి భార్యే కాబట్టి, శ్రీరాముడికి బదులుగా సీత రాజ్యాన్ని ఏలుతుంది".

(ఈ ప్రమాణాల వల్ల భార్యాభర్తలకు మధ్య భేదం లేదు కాబట్టి, భర్తకు మారుగా భార్య సింహాసనం ఎక్కవచ్చని వశిష్ఠుడన్నాడు. రామాయణ వాక్యమే వేద ప్రమాణం. దానికి ప్రమాణాలు చూపడమంటే సూర్యుడున్నాడని నిరూపించడానికి దివిటీలను ఉపయోగించినట్లే!)

వసిష్ఠుడు ఇంకా ఇలా అన్నాడు: "తన భర్త అడవుల్లో తిరుగుతుంటే తాను సింహాసనం మీద కూర్చుని ప్రభుత్వాన్ని ఎలా నిర్వహిస్తానని, అదెలా స్త్రీ ధర్మమని సీత పట్టాభిషేకానికి అంగీకరించకపోతే, పట్టుబట్టి శ్రీరాముడి వెంటే పోతానని అంటే, మేమంతా వారివెంట పోయ్యే వాళ్లమే. మేమే కాదు అయోధ్యానగరమంతా శ్రీరాముడి వెంట పోతుంది. శ్రీరాముడు తన భార్యతో కలిసి పోయే ప్రదేశానికి, తమ భార్యాబిడ్డలతో, ధనంతో, ధాన్యంతో, జీవమున్న-లేని పదార్థాలతో, సేనానాయకులంతా పోతారు. వాళ్లు, మేమే కాదు....నీ కొడుకు భరతుడు తమ్ముడు శత్రుఘ్నుడితో కలిసి కృష్ణాజినం, నార చీరెలు ప్రీతితో ధరించి, మునివేషంలో అన్న దగ్గరకు పోతారు. అప్పుడు, పాడుపడిన ఈ రాజ్యాన్ని, సర్వజనులకు అప్రియమైన మనసుగల నువ్వు, గ్రహించి, నీ అధికారాన్నంతా, తప్పొప్పులు ప్రశ్నించేవాళ్లు లేకుండా, ఏ బాధా లేకుండా, చెట్లమీద, చేమలమీద ఉపయోగించి పాలించు". (త్రికాలవేదైన

వశిష్ఠుడు చెప్పినదంతా యదార్థమైంది, వాన ప్రస్థులాగా నందిగ్రామంలో భరతుడున్నాడు).

"రాష్ట్రం...రాష్ట్రం అంటున్నావు. ఓసీ కాముకా! శ్రీరాముడు పాలించని రాష్ట్రం ఒక రాష్ట్రమే కాదు. శ్రీరాముడుండేది అడవైనా అది రాష్ట్రమే అవుతుంది. ప్రీతితో తనకు తండ్రి ఇవ్వని రాజ్యం పాలించడానికి భరతుడెలా అర్హుడవుతాడు? కావచ్చు...కాకపోవచ్చు. అది వేరే మాట. భరతుడీ రాజుకే పుట్టినవాడైతే, నిన్ను తన తల్లిగా చూడడానికి కూడా ఆసక్తి కనపరచడు. నా మాట విను. భూమ్మీద నుండి ఆకాశానికి నువ్వెంత ఎగిసిపడినా, తండ్రి వంశాచారం తెలిసిన భరతడు ఆ ధర్మానికి హానివచ్చే విధంగా ఎందుకు నడచుకుంటాడు ఓసీ మిటుకులాడీ! కొడుకు మీదున్న ప్రేమ వల్ల అతడికి కష్టాలు తెచ్చిపెట్టావు. ఇది నీకు తెలియదు కదా! నీ నెత్తిమీద మట్టి తెలియకుండా నువ్వే వేసుకుంటున్నావు. అలా ఎలా జరుగుతుందంటావా? శ్రీరాముడిని సేవించని మూఢుడు ఒక్కడు కూడా లేడు. కైకా ఇది సత్యం. కైకా, నువ్విప్పుడే నీ కళ్లతోనే చూస్తావు. ఏం చూస్తానంటావా? తొందరపడవద్దు. నా మాట నిజమో, అబద్ధమో చూస్తావు. భూమ్మీద వున్న పశుపక్ష్యాదులు, మనుష్యులు, పాములు, అయోధ్యను విడిచి శ్రీరాముడి వెంట పోతే, నడవ చేతకాని చెట్లు మీదున్న పళ్లు, చిగుళ్లు, పూలు రాలిపోతూ శ్రీరాముడి దిక్కుకే చూస్తాయి".

"పాపపు కుత్సిత చరిత్రా! నువ్వు శ్రీరాముడిని ఒక్కడినే కదా అడవులకు పొమ్మని కోరావు. మిగిలినవారెలా పోతే నీకెందుకు? వాళ్లనెందుకు నువ్వు నిర్బంధిస్తావు? సీత ఎలా పోతే నీకెందుకు? కాబట్టి సీత తన భర్తతో ఎప్పటివలెనే అలంకరించుకుని, ఆభరణ సహితంగా ఆమెకు కావాల్సినవన్నీ తీసుకుని అడవికి పోవాలి. వాహనాలు, అందమైన చీరెలు, సొమ్ములు, దాసీజనాలు, ఇంకా కావాల్సిన ఏర్పాటుతో ఆమె భర్తతో పోవాలి. నువ్వు నీ భర్తను వరాలడిగేటప్పుడు ఈ ఉత్తమ స్త్రీని నార చీరెలు కట్టుకోవాలని అడగలేదుకదా? ఎందుకు ఆదరబాదరగా ఏదో మునిగిపోయినట్లు ఆమెకు నార చీరెలిచ్చావు?". ఈ విధంగా బ్రాహ్మణ శ్రేష్ఠుడైన వశిష్టుడు అన్న మాటలను మనసులో పెట్టుకోకుండా, భర్త మాట తన మాటగా, ఆయన మార్గమే తన మార్గంగా వుండేందుకు ఇష్టపడెది కనుక సీత నారచీరనే సంతోషంగా ధరించింది.

❖ ❖ ❖

సర్గ-38

సీతకు నార చీరలిచ్చినందుకు కైకను నిందించిన దశరథుడు

వసిష్ఠుడి మాటలను పట్టించుకోకుండా సీత నార వస్త్రాలను పట్టుచీరెల లాగా భావించి కట్టుకుంటుంటే చూసిన వారందరూ కఠినమైన పదజాలంతో దశరథుడిని ఛీ కొట్టారు. ఏడ్వసాగారు. అలా అక్కడివారు పెట్టే చీవాట్లకు, వారి ఏడుపులకు స్పందించిన దశరథుడు, ఇక మనం బతకడం వ్యర్థం.... మరణమే తగిన శరణం.....బతికినా ఇదివరకు వచ్చిన కీర్తి అంతా నాశనం అయింది.....ఇక రాబోయేది అపకీర్తే....ఇంతటి అధర్మం నా ఎదుట జరుగుతుంటే కళ్లార చూసి ఏమీ చేయలేని నాకు ధర్మ విచారం ఎక్కడినుండి వస్తుంది? అనుకున్నాడు. తన వలన లోకానికే ధర్మ శూన్యం కలిగిందని, దేహం, కీర్తి, ధర్మం తనకు దక్కవని భావించి, దుఃఖించి, కైకను చూసి ఈ సుమకోమలాంగి నార చీరెలు కట్టి అడవికి పోకూడదని అన్నాడు. ఈ లేత వయసు చిన్నపిల్ల, అయ్యో పాపం సీత, అడవులకు పోలేదని, పోకూడదని, పోయేట్లయితే పంపినవారికి పాపం కలుగుతుందని, వశిష్ఠుడు సత్యం చెప్పాడని అంటాడు దశరథుడు. "మహారాజు కూతురై, లోకంలో అందరిలాగా కాకుండా భూమిలో పుట్టి, పతివ్రతై, ఏ పాపం తెలియని బాల శోభావతి సీత ఈ విధంగా తాపసిలాగా నారచీరెలు కట్టి అందరూ చూస్తుండగా సభా ప్రదేశంలో నిలబడి వుండడానికి ఏం పాపం చేసిందే? ఓసీ! సీతను నారచీరెలతో వనవాసానికి పంపుతానని నీకు నేను ప్రమాణం చేశానా? ఎందుకిలా ఆమెను ఈ విధంగా నిర్భంధిస్తున్నావు? యథాసుఖంగా, సమస్త ఆభరణాలతో ఆమె పోవాలి. అమెందుకు నిష్కారణంగా ఆయాసపడాలి? కాబట్టి నార చీరెలు కట్టుకోకూడదు" అని అంటాడు కైకతో.

(సీతాదేవి పతివ్రత, తుల్యశీల అని కాదా చెప్పడం జరిగింది. అలాంటి ఉత్తమ పతివ్రత భర్త నారచీరెలు కట్టుకుంటే, తాను ఎలా పట్టు చీరెలు కట్టుకుంటుంది? ఇది వ్రతభంగం కదా? కాదనే ధర్మం చెప్తున్నది.

ఎందుకంటే....పట్టుచీరెలు కట్టుకున్నప్పటికీ, ఆమె కామాసక్తితో, భోగం, సుఖం కోరి ఆ పని చేయడం లేదు. పతివ్రత, తుల్యశీల కాబట్టే, వశిష్ఠుడు లాంటి వారందరూ, వద్దు–వద్దన్నప్పటికీ నారచీరెలే సంతోషంగా కట్టుకుంది).

దశరథుడు ఇంకా ఇలా అన్నాడు: "శ్మశానానికి పోవడానికి నాకు కాలం సమీపించినందున 'వినాశకాలే విపరీత బుద్ధ' అన్న చందాన దుష్టుడునై, పద్ధతి తప్పి, కామంతో నీచబుద్ధితో క్రూరమైన ప్రమాణం చేసాను. శ్రీరాముడిమీద ప్రమాణం చేశాను. మాట తప్పితే శ్రీరాముడికే కీడు. మాట తప్పకపోయినా శ్రీరాముడికే కీడు. అందుకే...వెదురులో పుట్టిన పువ్వు దాన్నే పాడు చేస్తుందన్న నానుడి ప్రకారం నా మాటే నన్ను దహించి వేస్తున్నది. పాపాత్మురాలైన దుష్ట స్త్రీ మాటలు వింటే దుఃఖం కలగదా? తేలుకు గర్భం, వెదురులో పువ్వు, అరటికి గెల...ఇవన్నీ మూలనాశనాలే! ఆ విధంగా ప్రమాణం చేయించుకుని, ఈ విధంగా ఇహపరాలలో కీర్తి, గొప్పతనాన్ని నాశనం చేసే వరాలను కోరి ఎలా వాగుతున్నావో కైకా? శ్రీరాముడిలో ఒక్క పాపమైనా మాట మాత్రమైనా వుంటే అంగీకరిస్తాను. దుష్టబుద్ధి కలదానా! నువ్వు మోసం చేశావు. భర్తతో కాపురం చేసే లక్షణమా ఇది? సీతలో ఏ ఒక్క గుణం చూసినా ఆమెనిలా చేయడం సరైంది కాదు. లోకహితమైన నడవడి కలదామె. కళ్లు జింక కళ్ల లాంటివి. మృధుస్వభావం కల వ్యక్తి. వయసా చిన్నది. మంచి తపస్సు చేస్తుంది. పతివ్రత. మహారాజు కూతురు. మిక్కిలి దయగల మనిషి. క్రూరత్వమేంటో తెలియదు. ఇలాంటి ఆమెలో ఏం పాపం చూసి ఇంతటి ఘోర కార్యం చేస్తున్నావు?"

"ఓసీ ! శ్రీరాముడిని అడవులకు పంపడంతో నువ్వు సంపాదించుకుంటున్న పాపమే నిన్ను శాశ్వతంగా నరక బాధలను అనుభవించేట్లు చేస్తుంది. ఇక సీతను లోభ బుద్ధితో కష్టాల పాలు చేయడం అంటే ప్రాయశ్చిత్తానికి కూడా సాధ్యపడని పాపం ఒడికట్టుకుంటున్నావు. శాశ్వత నరకానుభవం కంటే ఘోర శిక్ష అది. ఓసీ! విను. రాముడిని అరణ్యానికి పంపమనే నువ్వడిగావు. నేను దానికి అంగీకరించాను. సీత విషయం నువ్వు అడగనూలేదు, నేను ప్రతిజ్ఞ చేసిందీ లేదు. ఆ మర్యాదను విడిచి సీతను నారచీరెలు కట్టుకోమని నువ్వు

అనడమంటే, నువ్వు నరకాన్ని చూడబోతున్నావన్నమాట. నిన్ను యముడు క్షమిస్తాడా?"

ఇలా అంటూ, ఏడుస్తూ, బాధపడుతూ, నేలమీద పడివున్న తండ్రి దశరథుడిని చూసి శ్రీరామచంద్రుడు వినయంగా ఇలా అన్నాడు తండ్రితో.

తన తల్లిని కాపాడమని తండ్రిని వేడుకున్న శ్రీరాముడు

"నరేశ్వరా! నా తల్లి కౌసల్యాదేవి శ్లాఘ్యమైన గుణాలనే ఆభరణాలుగా ధరించే వ్యక్తి. బాగా తపస్సు చేసిందామె. సత్యం చెప్పడమే ఆమె నైజం. ఇంతకుముందు ఎప్పుడూ ఇలా దుఃఖపడలేదు. నేను అడవులకు పోతున్నందున, ఈ రోజు నుండే కడుపు నిండా దుఃఖ పడుతుందిక. దానికి తోడు వయసు మీరింది. ముసలిదైంది. నేను పోతున్నానన్న దుఃఖంతో చనిపోకుండా దేహంతో వుండే విధంగా ఆమెను రక్షించు. అంతమాత్రం చేస్తే నువ్వు మహాత్ముడవే. అలా చేయకపోవడానికి కారణం లేదు. నువ్విలా నా విషయంలో చేశావని ఆమెకు కోపం లేదు. నిన్ను నిందించదు. నన్ను తలచుకుంటూ, చిక్కి శల్యమై, యమపురికి పోకుండా కనిపెట్టాలని కోరుతున్నాను. ఇదే నా ప్రార్థన. ఇంకేమీ కావాలని నేను అడగను. నేను అడవుల్లో తిరుగుతూ కష్టపడుతున్నానని బాధ పడుతున్నదే కాని ఇతరుల విషయం ఆమెకేమీ పట్టదు. కాబట్టి నా తల్లి చావకుండా కనిపెట్టు".

ఇలా చెప్తున్న శ్రీరాముడి మాటలు వింటున్న దశరథుడు, ముని వేషంలో వున్న ఆయన ముఖం చూడలేక, భార్యలతో సహా మూర్ఛ పోయాడు.

❖ ❖ ❖

సర్గ-39

ముని వేషంలో వున్న శ్రీరాముడిని చూసి దుఃఖించిన దశరథుడు

నెమ్మదిగా కొంచెం తెప్పరిల్లిన రాజు, శ్రీరాముడిని గురించి బాధతో మాట్లాడసాగాడు. "అయ్యో! పూర్వం చేసిన పాపం నన్ను ఇబ్బందుల పాలు చేయకపోతుందా? కీడు కలిగే విధంగా దూడలను వాటి తల్లులనుండి, నీచుడనై, సంకోచం లేకుండా, ఎడబాపితినిగదా! ఎన్ని జీవులను అలా పాపకరమైన హింసల పాలు చేశానో....ఆ పాపం నన్నిప్పుడిలా బాధ పెట్తున్నది. అగ్నితో సమానమైన తేజంతో ప్రకాశించేవాడు కదా నా కొడుకు. అలాంటి వాడివ్వాళ నా ఎదుటనే నారచీరెలు కట్టుకుంటే సహించాల్సి వచ్చిందికదా! ఈ దురవస్థ చూసి, సహించి, ఏమీ చేయలేని అనాథత్వానికంటే భరించలేని దుఃఖం ఏముంటుంది? ఈ కైక బారినపడి చనిపోయినవాడినీ కాదు. ఐనా, మరణం అకాలంలో రమ్మంటుంటే ఎలా వస్తుంది? అది అసాధ్యం. కాబట్టి అనుభవించాల్సిందే! ఒకే ఒక్క కైక నన్ను వంచించి, ధనకామంతో, తన లాభం మాత్రమే చూసుకుని, ఇంతమంది ప్రజలను బాధిస్తున్నది కదా! శ్రీరామా!" అని దశరథుడు కన్నీళ్లు కార్చాడు. ఒక్క సారి అలా పెద్దగా ఏడ్చి, రామా అని అంటూ, ఆ పైన ఏమీ మాట్లాడలేక, ఏడుస్తూ, శ్రీరాముడెక్కి పోవాల్సిన రథాన్ని తీసుకుని రమ్మని సుమంత్రుడితో అంటాడు. ఆ రథం మీద శ్రీరాముడిని తీసుకునిపోయి, వూళ్లన్నీ దాటిన తరువాత అక్కడ వదలిపెట్టి రమ్మంటాడు. ఆయన మాట ప్రకారం సుమంత్రుడు రథాన్ని తేవడానికి పోయాడు.

పెద్దలను ధిక్కరించలేని వాడు, వాళ్లేమన్నా సహించే వాడు, వీరుడై ధిక్కరించ శక్తికలవాడిని మనం చెప్పిన దానికి ఎదురుచెప్పడు కదా అనే ధైర్యంతో రక్షించాల్సిన తల్లిదండ్రులే ఇలా దగ్గరుండకుండా దూరంగా పంపిస్తున్నారు. ఇది నిశితంగా ఆలోచిస్తే, సాధు చరిత్ర, నిర్మల గుణాల ఫలం ఇదే కదా అనిపిస్తుంది. ఇలాంటి సద్గుణాలు కలవాడు లోకంలో సుఖపడడు అని అనుకుంటాడు దశరథుడు. మెత్తగా వుంటే మొత్త బుద్ధి అయిందన్న సామెత

ప్రకారం ఇలా జరుగుతుంది. అందుకే మెత్తదనం వ్యర్థం. ఈ నేపధ్యంలో ఆలశ్యం చేయకుండా, పనిచేయడంలో ఉపాయం తెలిసిన సారథి, వెంటనే రథాన్ని సిద్ధం చేసి, గుర్రాలను కట్టి, రాజు ఇంటి ముందర వుంచాడు. బంగారు సొమ్ములతో అలంకరించిన రథాన్ని, దాన్ని లాగడానికి మిక్కిలి వేగంగా పోయే గుర్రాలను కట్టి, సిద్ధంగా వుంచానని సుమంత్రుడు రాజుకు విన్నవించుకున్నాడు.

రాజు అప్పుడు... ధనశాల అధిపతి, సాధువర్తనం కలవాళ్లలో ఉత్తముడు, కోశాగారంలో ఎంత ధనముంటుందో వాస్తవంగా తెలిసినవాడు అయిన కోశాధికారిని పిలిచాడు. పిలిచి: "ఓ బుద్ధిమంతుడా! పద్నాలుగేళ్లకు సరిపడా వెలగల భూషణాలు, సన్నని పట్టువస్త్రాలు, సీతకివ్వడానికి తీసుకురా!" అని ఆజ్ఞాపించాడు. అతడు అలాగే పోయి, అవన్నీ తెచ్చి రాజుకిచ్చాడు. వాటిలో కొన్ని భూషణాలు సీత ధరించింది. ఇలా ధరించిన సీత బంగారు దేహకాంతితో, భూషణాల కాంతితో, రెట్టింపు మెరుగుగా, బాల సూర్యుడి వల్ల ఆకాశం ప్రకాశించిన విధంగా కనిపించింది.

సీతకు ధర్మోపదేశం చేసిన కౌసల్య

అడవికి పోతున్నానన్న బాధ కొంచెమైనా లేని సీతను, ఎప్పటిలాగా నిలబడి వున్న సీతను, తన కోడలిని, తన దగ్గరకు చేయిపట్టుకుని లాగి, కౌగలించుకుని, కౌసల్యాదేవి ఇలా అంది: "సంపద, సౌఖ్యం, ఎల్లప్పుడూ తమ భర్తలు తమకు కలిగించేంతవరకు, విలాసంగా కులుకుతూ, అకారణంగా ఆ సంపదలు తొలగిపోయి పేదరికం వచ్చినప్పుడు, తమ భర్తలను నిందించేవారు రంకుటాడ్రే కదా! మొట్టమొదట సంపాదనపరుడైన భర్తతో సుఖమనుభవించి, ఆ తరువాత ఏదో ఒక కష్టం వస్తే, సుఖాలు తొలగిన భర్తను కట్టుకుని ఏం సుఖపడ్డాను అనే స్త్రీలుంటారు. ఇలా కష్టపడడానికా నేను నిన్ను కట్టుకున్నాను? అని ప్రశ్నిస్తారు. భర్తను తిట్టి వదలిపోతారు. లోకోపవాదానికి, నరకానికి, పతనానికి, వేరే గతి లేదని భయపడే స్త్రీలు మాత్రమే భర్తలతో కాపురం చేస్తారుకాని, ఈ ఆలోచన లేనివారు భర్తలతో కాపురం చేయరు. అసత్యానికి జన్మస్థానమై, హేళనగా తమ భర్తలను వెక్కిరిస్తూ, దురాలోచన చేయడంలో భయం లేకుండా, తమ మనసులో మాట బయటపడనీయకుండా, మకురుతనంతో, వయసు

మత్తులో, శరీరం తెలియకుండా ప్రవర్తించే స్త్రీలు, తమ ప్రాణానికి ప్రాణంలాగా చూసుకునే భర్తలకు నిమిషంలో రోతపుట్టిస్తారు".

"తాము పుట్టిన కులం, వంశం గొప్పతనాన్ని గురించి ఆలోచనచేయరు. మనం ఈ పని చేస్తే మన కులానికి, వంశానికి అపకీర్తి వస్తుందని అనుకోరు. తమ మీద తమ భర్తలు కొరతలేని అనురాగంతో తమను ఆదరించి చేసే పనులను మనసులో వుంచుకోరు. తమ భర్తల పాండిత్యం, దానివలన వారు సంపాదించిన కీర్తి-ప్రతిష్ఠలు ఆలోచించరు. తాము చేస్తున్న అకార్యాలవలన తమ భర్తలకు అపకీర్తి వస్తున్నదన్న భావనే వుండదు. పాణిగ్రహణ కాలంలో చేతిలో చేయి వేసి, అగ్నిసాక్షిగాప్రమాణం చేసిన సంగతి మరచిపోతారు. ఆ చేయి విడవవచ్చునా? అని ఆలోచించరు. తమకంతవరకు వారిచ్చిన ధనం, వస్త్రాలు, ఇతర పదార్థాల గురించి మనసులో గణించరు".

(ఇవన్నీ అందరు స్త్రీలు చేయరు...చపల చిత్తం కలిగి, నిలకడ లేని మనసున్న, మందబుద్ధికల కైక లాంటి స్త్రీలు చేస్తారని భావన. స్తంబాన్ని ధృఢంగా పాతేయాలనుకుంటే, ముందు గుంటలో అటు-ఇటు బాగా వూపి, ఆ తరువాత బిగించాలి. అలానే కైక లాగా చేయొద్దని చెప్పడానికి దుష్ట స్త్రీల లక్షణాలను చెప్పింది మొదలు కౌసల్య. ఆ తరువాత అనుసరణీయమైన సాధ్వీ స్త్రీ లక్షణాలను చెప్తున్నది)

"తన భర్తకు ఉభయలోకాల్లో శ్రేయస్సు కలగాలని కోరుకుంటూ, పతివ్రతలాగా, ధర్మాధర్మ పుణ్యాపుణ్య సదాచార దురాచార విధానాలను విని, తెలుసుకుని, సత్యం తప్పకుండా, కామంతో ఇంద్రియ నిగ్రహం కోల్పోక, సౌందర్యంకల భార్యామణికి పతియె గతి. ఆయనే పావనమైన గతి. పతివ్రతా లక్షణాలు ఇవి కాబట్టి, నువ్వూ పతివ్రతవే కాబట్టి, గొప్ప వంశంలో పుట్టి పెద్దల ద్వారా శాస్త్ర మర్యాద పాతివ్రత్యం తెలుసుకున్నావు కాబట్టి, నా కొడుకు దిక్కులేక అడవుల పాలయ్యాడని నిందించవద్దు. తల్లీ! ధనం కలిగినా, దారిద్ర్యం కలిగినా, నీకు అతడే దైవం".

అత్తగారు చెప్పిన మాటలు వింటున్న సీత వాటిని చక్కగా తన మనసులో నిలుపుకుంది. తన చూపును కౌసల్యామీద నిలిపి సమాధానంగా ఇలా అన్నది:

"అత్తగారూ! నేను గతంలో తండ్రి గారింట్లో వుండే రోజుల్లో, భక్తిశ్రద్ధలతో భర్తను ఎన్ని విధాల సేవించవచ్చో అవన్నీ విన్నాను. మీరు చెప్పినట్లే అనురాగంతో, భక్తితో మీ కొడుకును సేవిస్తాను. దుష్ట స్త్రీలలాగా నేను చేస్తానని కాని, మీ కొడుకును విడిచిపోతానని కాని, దరిద్రుడని నిందిస్తానని కాని అనుకోవద్దు. ధర్మాన్ని ఎప్పుడైనా వదలుతానా? చంద్రుడిని విడచి వెన్నెల వుండగలదా? భార్యాభర్తలకు అవినాభావ సంబంధం వుందికదా? తంతెలు లేని వీణలో నాదం రాదు. చక్రాలు లేని బండి నడవదు. కాబట్టి, స్త్రీలకు వందమంది కుమారులున్నా, అష్ట ఐశ్వర్లాలున్నా, భర్త లేకుంటే సౌఖ్యం రాదు. ఎంతో పవిత్రురాలైన అత్తగారూ! స్త్రీకి కన్న తండ్రి కూడా మితంగా ఇస్తాడే కాని వున్నదంతా ఇవ్వడు. కొడుకు కూడా తనకు, తన భార్యాబిడ్డలకు దాచిన తరువాతే కొంత తల్లికిస్తాడు. తల్లీ అంతే ఇస్తుంది. ఒక్క భర్త మాత్రమే అమితంగా, తనకున్నదంతా భార్యకిస్తాడు. తన శరీరాన్ని, పుణ్యాన్ని కూడా పంచి ఇస్తాడు. ఇలాంటప్పుడు తన భర్తను, తన మేలుకోరేవాడిని, ఏ స్త్రీ అయినా సేవించకుండా వుంటుందా? పెద్దల ద్వారా మంచిచెడ్డలను విన్నాను. వాటిలో మంచిమార్గం అవలంబించి జీవించాను. ఇంత చేసిన తరువాత నేనెందుకు నా భర్తను పరుషం మాటలంటాను? స్త్రీకి దేవుడంటే భర్తే కదా?"

తన కోడలు ఇలాంటి ఉత్తమ స్త్రీ కదా! అని సంతోషం, ఇలాంటి కష్టం వచ్చిందికదా! అని దుఃఖం....రెండూ.... పెనవేసుకుని పోయి కన్నీళ్లు కారుస్తున్న కౌసల్యకు, సవతులలో తానేదో గొప్ప దానినని, పట్టమహిషిని అని, పెద్ద దాన్నని గర్వపడని తన తల్లికి, ప్రదక్షిణ చేసి రామచంద్రుడు ఇలా అన్నాడు.

కౌసల్య, ఇతర మాతల దగ్గర సెలవు తీసుకున్న శ్రీరాముడు

"తల్లీ! బాధపడవద్దు. నా కొరకు దుఃఖిస్తూ తండ్రిని చూసుకోకుండా వుంటావేమో? నీ కోడలికి నువ్వు చెప్పిన మాటలు నీకు కూడా వర్తిస్తాయి కాబట్టి గుర్తుంచుకో! ఏ కారణాన, ఎంత బాధ కలిగినా, భర్తను కోపగించుకో రాదు. నువ్వు నిద్రపోయి మేల్కొనే లోపల, నా పద్నాలుగేళ్ల వనవాసం

అయిపోతుంది! అది అయిపోగానే త్వరగా స్నేహితులతో, హితులతో వచ్చిన నన్ను నువ్వు చూస్తావు". ఒక వైపు తల్లి దుఃఖాన్ని ఆపుచేసే ప్రయత్నం చేస్తూనే, తన దుఃఖం ఆపుకోలేకపోయాడు శ్రీరాముడు. ఆ తరువాత మూడొందల ఏభై మంది తల్లులకు చేతులు జోడించి, వినయంగా, ధైర్యంగా, ధర్మబద్ధంగా, నమస్కారం చేశాడు శ్రీరాముడు. నమస్కరించిన శ్రీరాముడిలా అన్నాడు వారితో: "మీ కష్టాలు తెలియకనో, తెలిసి కూడా నేనర్థం చేసుకోలేక పోయినందునో, నీతి విడిచి ఏమైనా అంటే తల్లులారా! నా నేరాన్ని క్షమించి నాకు అడవులకు పోవడానికి అనుమతి ఇవ్వండి".

ఆ మాటలు విన్న ఆ స్త్రీలందరూ, మహా పరితాపంతో, పెద్ద పెట్టున క్రౌంచాలలాగా గొల్లున ఏడిచారు. దాంతో, క్రితం రోజువరకు, వీణెలతో, మద్దెలలతో, పణవములు, తాలాలు లాంటి మంగళ వాద్యాలతో మారుమోగిన రాజు మేడ, పెద్ద కోలాహాల ధ్వనితో స్త్రీల సమూహాల ఏడుపులతో అందవిహీనమైంది.

❖ ❖ ❖

సర్గ-40

శ్రీరాముడి వెంట పోవడానికి లక్ష్మణుడికి అనుమతి ఇచ్చిన సుమిత్ర

శ్రీరాముడు, ఆయన వెనుక సీత, ఆమె వెనుక లక్ష్మణుడు దీనత్వం, దుఃఖం, సంతాపంతో రాజుకు ప్రదక్షిణ చేసి శ్రద్ధతో, భక్తితో ఆయన పాదాల మీద పడ్డారు. శ్రీరాముడు ముందుగా సీతను, తరువాత లక్ష్మణుడిని తన తల్లికి మొక్కమని చెప్పి, ఇక నుంచి ఈ సేవ ప్రతిదినం దుర్లభం కదా అనుకుంటూ, దీనంగా తాను కూడా తల్లికి వినయంగా నమస్కరించాడు. కౌసల్యకు శ్రీరాముడు నమస్కరించగానే, ఎంతో భక్తితో, లక్ష్మణుడు కౌసల్యకు నమస్కరించి వినయంగా తన తల్లి సుమిత్రకు భక్తి పారవశ్యంతో మొక్కాడు. తనకు నమస్కరిస్తున్న లక్ష్మణుడిని తన దగ్గరకు తీసుకుని కన్నీరు కారుస్తూ సుమిత్ర ఆయన శిరస్సు వాసన చూసి, కొడుకుతో ఇలా అన్నది.

"అన్నా! లక్ష్మణా! లోక రక్షణార్థం కౌసల్య కడుపున శ్రీరాముడెలా జన్మించాడో, అలానే సకల సుహృజ్జన శ్రేష్ఠుడైన ఆయనకు సహాయంగా నిత్యం అనురాగంతో మసలుకునేందుకు నువ్వు నా కడుపున పుట్టావు. కాబట్టి శ్రీరాముడి వెంట నువ్వు అరణ్యాలకు పోయి నీ జన్మ సార్థకం చేసుకో. శ్రీరాముడు అరణ్యాలలో తిరుగుతున్నప్పుడు, అక్కడున్న పుష్పఫలభరిత వృక్షాల అందాలను చూసుకుంటూ, స్వవిషయంలో ప్రమాదపడి దారితప్పితే నువ్వలా కాకుండా జాగ్రత్తగా వుండాలి. నువ్వలాంటి సమయంలో దిక్కులు చూసుకుంటూ పోకుండా, ఆయన మీదే దృష్టి నిలిపితే, ఆయన గమన సౌందర్యంలోని ఆనందానికి పరవశుడవై నిన్ను నువ్వే మరచిపోతావేమో? అలా అయితే ఆయన రక్షణ విషయంలొ హెచ్చరికగా వుండలేవు. జాగ్రత్త సుమా! ఇక్కడ సుఖాలకు అలవాటు పడ్డ నువ్వు, నా మీద నీ భార్య మీద వున్న ప్రేమ వల్ల శ్రీరాముడిని మరచివుండడమే బాగని అనుకుంటావేమో? అలాంటి పొరపాట్లు చేయవద్దు. మా అందరినీ విడిచి పెట్టి నువ్వు పోవాల్సినవాడివే. శ్రీరామ చరణ సేవకొరకే నువ్వు పుట్టావు. నీకు నేను చెప్పాల్సిన పని లేదు. ఎన్నో విధాలుగా దాస్యం

చేయడంలో నువ్వు ఆదిశేషుడవే! ఏ వేళలో ఏ విధంగా దాస్యం చేయాల్నో నీకు నేను చెప్పాలా? నాయనా! నేను ఆడుదానని. శ్రీరాముడి వెంట పోయి ఆయనను సేవించే భాగ్యం నాకు లేదు. నీ ద్వారా ఆయన సేవ చేయాలని నా కోరిక. నువ్వు చేస్తే నేను నీ మూలాన తరిస్తాను. అప్పుడు నిన్ను నేను కన్నందుకు నా జన్మ సార్థకం అవుతుంది. నువ్వు అన్ని వేళలలో, అందరి మీదా, నిజమైన అనురాగం కలవాడివి. అలాంటప్పుడు సుహృద్వర్యుడైన శ్రీరాముడి మీద అనురాగం కలిగివున్నవాడివని నేను వేరే చెప్పాల్సిన పని లేదు. ఎప్పుడు కూడా, ఆయన విషయంలో ఏ కారణానైనా కూడా, ఏమరుపాటు వద్దు. శ్రీరాముడి వెంట నువ్వు పోవడానికి అనుమతిస్తున్నాను. శ్రీరాముడు కౌసల్యను అడిగినట్లు నువ్వు నన్ను ఆనుమతి ఇవ్వమని అడగాల్సిన అవసరం లేదు. నువ్వు అడుగకముందే నేనే ఆజ్ఞ ఇస్తున్నాను. శ్రీరాముడు దరిద్రుడు కదా....ఆయనను కొలిస్తే ఏం లాభం? అంటావా? అలా అనొద్దు. రాజ్యహీనుడై దరిద్రుడైనా, రాజై సంపన్నుడైనా, నీకు అతడే గతి. శ్రీరాముడు దరిద్రుడైనా నీకొచ్చే నష్టం లేదు. ఆయన సంపన్నుడైనా నీకు కలిగే లాభం లేదు. శ్రీరాముడి మీద భక్తి కలవాడివైతే నువ్వు బాగుపడతావు. భక్తి లేనివాడివైతే చెడిపోతావు. నిన్ను రక్షించినా, చెడగొట్టినా అది నీ భక్తే కాని మరోటి కాదు. కాబట్టి ఆయన ఎలా వుంటే నీకెందుకు? పెద్దవాడిని అనుసరించి తిరగడం చిన్న వాళ్ల ధర్మం. దాసుడికి స్వామిసేవే ధర్మం. దరిద్రుడైనా స్వామి స్వామే...సంపన్నుడైనా స్వామి స్వామే! పతివ్రతా ధర్మం లాంటిదే స్వామి ధర్మం కూడా. కాబట్టి నీ స్వత్వం, ఆయన స్వామిత్వం ఆలోచించి సేవ చేయి. నాయనా! ఇక వంశాచారం గురించి చెప్తా విను. సనాతన పుణ్యాచారాన్ని అనుసరించే ఈ రఘువంశంలో చిన్నవాడు జ్యేష్ఠానువర్తియై వుండాలి. అలానే పరమ ధర్మాలైన దానం, యజ్ఞాల మీద దీక్ష, రణమున మరణం లాంటివి కూడా వంశ ధర్మాలే. వీటిని కాపాడుకుంటూ పోయి రా. ఈ మూడు కూడా శ్రీరాముడి కొరకే. దానం చేసినా శ్రీరాముడి కొరకే...యజ్ఞ దీక్ష కూడా శ్రీరాముడి కొరకే....రణంలో మరణం కూడా శ్రీరాముడి కొరకే!"

ఇలా, సుమిత్రాదేవి, శ్రీరాముడితో పోవాలనుకున్న లక్ష్మణుడి మనస్సు చలించకుండా దృఢపరిచేందుకు ఈ మాటలన్నీ చెప్పింది. ఆ తరువాత

సుమంత్రుడు శ్రీరాముడిని చూసి రథం సిద్ధంగా వుందని, వాళ్లెక్కడికి పోవాలనుకుంటే అక్కడికే పోవచ్చని అంటాడు.

(శ్రీరాముడి వెంట పోతున్న లక్ష్మణుడికి ఒకవేళ కష్టం కలిగితే తల్లిదండ్రులు, అయోధ్య, స్మరణకొస్తుందేమోనని వాటికి ప్రతిగా ధర్మాన్ని బోధించింది సుమిత్ర. దశరథుడు "సోపాధికుడు" అని అతడి మీద ప్రేమ వదలమని అంటుంది. సోపాధిక బంధువులను నమ్మి రావద్దని భావం. ఇంకా ఇలా అంటుంది: "శ్రీరాముడు నిరుపాధిక స్వాభావికమైన తండ్రి. కాబట్టి అతడి మీదే ప్రేమ వుంచాలి. నామీద ప్రేమ వద్దు. నా మీద నీకెంతో ప్రేమ వున్నా, నీ మీద నాకెంతో ప్రేమ వున్నా, దానివల్ల ప్రయోజనం లేదు. నీ కష్టాలు నేను తొలగించగలిగానా? కాబట్టి నా మీద మాతృభావం వుంచడం వల్ల ఫలితం లేదు. జానకి స్వభావరీత్యా నీకు తల్లి. ఈమెకొక్క నమస్కారం చేసినా నిన్నీమె కాపాడుతుంది.'ప్రణతి ప్రసన్న జానకి'. శ్రీరాముడు లేని అయోధ్య కూడా అడవిలాంటిదే. ఆయన వున్న చోటే అయోధ్య కాబట్టి, మా మీద ప్రీతి కలిగి లాభం లేదు. ఆయనున్న స్థానమే నీకు ప్రాప్యమైన స్థానం. దశరథుడిలో ఎన్ని మంచి గుణాలున్నాయో అలాంటి గుణాలన్నీ శ్రీరాముడిలో వున్నాయి కాబట్టి శ్రీరాముడు ఎదురుగా వుంటే దశరథుడు స్మరణకు రావాల్సిన పనిలేదు. అయోధ్యలో నీకెంత సుఖముంటుందో అంతే సుఖం అడవిలో కూడా వుంటుంది. శ్రీరామ సహవాసం అడవిలో నీకు నిరంతరాయం లభిస్తుంది". ఈ సందర్భంలో లక్ష్మణుడి చర్య కఠినమైందని కొందరంటారు. తన వన ప్రయాణానికి అనుమతి తీసుకునేందుకు లక్ష్మణుడు సుమిత్ర, ఊర్మిళ ఇళ్లకు పోలేదు. శ్రీరాముడు కూడా తల్లి ఆజ్ఞ తీసుకుని రమ్మన్నాడే కాని భార్య అంగీకారం గురించి చెప్పలేదు. "సుహృత్తుల"కు చెప్పి శీఘ్రంగా రమ్మని మాత్రమే అన్నాడు. ఇదిలా వుంటే, వాల్మీకి రామాయణంలో ఊర్మిళ పేరు ఒక్క బాలకాండలో తప్ప మరెక్కడా పేర్కొనలేదు. బహుశా ఆయన చెప్పదల్చుకున్న కథా ప్రపంచానికి ఆమె ఆవశ్యకత అంతగా లేకపోయుండాలి. సీత, ఊర్మిళ ఇద్దరిలో వాస్తవానికి ఎక్కువ దుఃఖం ఊర్మిళకే! సందర్భ బలంతో ఎక్కువ ప్రసిద్ధి చెందింది సీత. అపహరణం లాంటివి జరగకపోతే సీతాదేవి అంత ప్రసిద్ధికి వచ్చివుండదేమో! ఆమె భర్తతో వుంది కాబట్టి, శరీర కష్టాన్ని అంతగా పట్టించుకోలేదు. ఇక ఊర్మిళ

విషయానికొస్తే, భర్త ప్రవాసంలో వుండడంతో, సర్వభోగాలు వదలిపెట్టి, అలంకారాలు మాని, ఎల్లప్పుడూ భర్తనే ధ్యానం చేస్తూ గడిపింది. సీతాదేవికంటే ఊర్మిళాదేవికే విశేష మనోవేదన కలిగిందని చెప్పాలి).

రథమెక్కి అడవులకు పోతున్న సీతారామలక్ష్మణులు

పద్నాలుగేళ్లలో ఈ రోజే మొదటి దినం కదా! అని అన్నాడు సుమంత్రుడు శ్రీరాముడితో. అదే సమయంలో బాల సూర్యుడితో సమానంగా అనేక రత్నాలు చెక్కిన ఆ రథం చూస్తూనే, భర్తతో వెళ్లే భాగ్యం లభించిందికదా, అనుకుంటూ సమస్తాభరణాలు ధరించిన సీత, ముందుగా రథం ఎక్కింది. బర్త వెంట వనవాసానికి పోతున్న సీతకు ఆమె మామగారు దశరథుడిచ్చిన ధన సమూహాలు, అసమానమైన ఆభరణాలు తనతో తీసుకుపోతున్నది సీత. ఆ వెంటనే, అగ్నిహోత్రంతో సమానంగా బంగారుమయమైన ఆ రథాన్ని శ్రీరామ లక్ష్మణులు కూడా సంతోషంగా ఎక్కారు. వారి కవచాలు, విల్లులు, బాణాలు, కత్తులు, ఇతర ఆయుధాలు, అవి కప్పి పెట్టడానికి తోలుసంచీ కూడా త్వరగా రథమెక్కించారు సేవకులు. రథాన్ని మెల్లగా నడుపుతే పౌరులు అడ్డుపడి ప్రయాణం సాగనీయరనే అనుమానంతో దాన్ని వేగంగా తోలాడు సారథి. సుమంత్రుడు వాయువేగంతో రథాన్ని నడపడానికి గుర్రాలని అదిలించాడు. ఇది చూడడానికి వచ్చిన పురజనులు అయ్యయ్యో.... అయ్యయ్యో.... అనుకుంటూ మూర్ఛ పోయారు. ఆ పట్టణమంతా జనుల కోలాహలంతో నిండిపోయింది.

శ్రీరాముడు పోతుంటే దుఃఖించిన ప్రజలు

ఎండ వేడి తట్టుకోవడానికి మంచినీళ్లకై పరుగెత్తిన విధంగా, ముసలి వారు బాలురతో సహా, కన్నీళ్లు కార్చుకుంటూ, శ్రీరాముడి వెంట ఏడ్చుకుంటూ రథం పక్కనే పరుగెత్తసాగారు. కొందరైతే ఆ రథాన్ని పట్టుకుని వేళ్లాడారు. ఎక్కువ సేపలా పరుగెత్తలేనివారు సుమంత్రుడిని బతిమిలాడుకుంటూ...రథాన్ని మెల్లగా తోలమని కోరారు. "అన్నా! సుమంత్రా! శ్రీరాముడి అందమైన ముఖ కమలాలను తిరిగి ఎన్నాళ్లకు చూస్తామో కదా! ఇప్పుడే ఇంకోసారి

చూడనివ్వవయ్యా! రథాన్ని మెల్లగా తోలవయ్యా! ఏమయ్యా...తొందరగా పగ్గాలను బిగపట్టవయ్యా! శ్రీరాముడి లాంటి కొడుకును కన్నతల్లి గుండె రాయో, ఇనుమో అయి వుండాలి. అలా కాకపోతే మన్మధుడిలాంటి సౌందర్యంకల ఈ పుండరీకాక్షుడు అడవికి పోతుంటే శోకాగ్నితో ఆమె తునకలై ఎగిరిపడిపోయేది కదా? సూర్యుడు ఏ పక్కన వున్నా ఆయన కాంతి మేరు పర్వతాన్ని ఎడబాయక వుండిన విధంగానే, తన భర్తను విడువకుండా సీత ఆయన వెంటే పోతున్నది కదా! పుణ్యాత్మురాలంటే ఈమే కదా. ఔరా లక్ష్మణా! భూమ్మీద పుట్టినవారిలో జన్మ సఫలం అయింది నీకొక్కడికే కదా? ఎందుకంటే...ఎప్పుడూ మంచి మాటలే పలికే నారాయణ సమానుడు, నీ సోదరుడు, శ్రీరామచంద్రమూర్తిని నిర్మలమైన మనస్సుతో సేవించడానికి పోతున్నావు కదా! ఆహా ఏమి నీ భాగ్యం. లక్ష్మణా! శ్రీరాముడి వెంట నువ్వు పోవడం మోక్షకారణమవుతుంది. ఐహిక సుఖం కోరుకునే వారికి శుభం ఇచ్చే పని ఇలాంటిదే. స్వర్గ సుఖం కోరుకునే వారికీ ఇదే మార్గం. శ్రీరామానుసరణం, భుక్తి స్వర్గ మోక్షాలను ఇస్తుంది".

ఈ విధంగా తపిస్తూ, విడవకుండా ఏకధారగా జడివానలాగా కన్నీళ్లు కార్చుకుంటూ శ్రీరాముడి వెంట పోసాగారు పుర జనులు.

శ్రీరాముడిని చూడడానికి వచ్చిన దశరథుడు

పురజనుల్లాగా వెంట పోవడానికి కాకుండా, అడవులకు పోతున్న శ్రీరాముడిని చూస్తానని అంతఃపుర స్త్రీలతో కలిసి ఇల్లు వదలి వచ్చాడు దశరథుడు అక్కడికి. అప్పుడక్కడున్న స్త్రీలందరూ ఒక్క పెట్టున పెద్ద ధ్వనితో గొంతెత్తి ఏడుస్తుంటే దరథుడు రాహువు పట్టిన చంద్రుడులాగా తేజోహీనుడిగా మారిపోయాడు. తన వైపే వస్తున్న తండ్రిని చూసి కూడా ఏ మాత్రం చలించకుండా, శ్రీరాముడు సారథిని వేగంగా రథాన్ని తోలమనగా అతడు అట్లాగే చేసాడు. దశరథుడు వస్తే తాను పోవడం ఆలశ్యమవుతుందని భావించిన శ్రీరాముడు సారథిని రథాన్ని తోలు-తోలు అని పదే పదే అంటుంటే, నిదానంగా పోనిమ్మని దానివెంట పరుగెత్తుతున్న పురజనులు ఆయనను వారించారు. సారథికి ఏం చేయాలో తోచలేదు. మెల్లగా తోలితే దశరథుడొచ్చి ఆలశ్యం చేస్తాడు...వేగంగా తోలితే పరుగెత్తుతూ వస్తున్న ముసలివారు, బాలురు,

దుర్బలులు బాధపడుతారు...ఏం చేయాలో పాలుపోలేదు సుమంత్రుడికి. గుర్రాలు, జనాలు తొక్కడంతో రేగిన దుమ్ము ప్రజల కళ్లనుండి కారిన నీళ్ల ప్రవాహంతో కలిసి నేలంతా బురదలాగా అయింది. హా..హా...కార ధ్వనులతో నిండిన అయోధ్య పట్టణంలో శ్రీరాముడు పోతున్న వేళ జన సమూహమంతా దుఃఖంలో మునిగిపోయింది. చేపలు కదిలించిన తామరపూలపై నున్న నీళ్లు రాలిపడినట్లే, స్త్రీలందరూ ఊహించని రీతిలో శోకబాధతో కన్నీళ్లు కార్చారు.

"శ్రీరాముడి వెంట మనం పోవాల్సిందే! ఇక్కడ నిలబడరాదు" అనే నిశ్చితాభిప్రాయంతో పోతున్న ప్రజలను చూసి తానెంతమందికి దుఃఖం కలిగించానోనని కలత చెందాడు దశరథుడు. అడుగున నరికితే నేలకూలిన చెట్టులాగా నేల మీద పడి మూర్ఛపోయాడు ఆయన. రాజు నేలమీద పడగానే, ఆయన చనిపోతాడేమో...ఇంకో విపత్తు వస్తుందేమో...అని ఆయన కొరకు ఏడ్వసాగారు. వారిలో కొందరు "కౌసల్యా...కౌసల్యా.." అని, మరి కొందరు "రామా...రామా..." అనిమ్ అంతఃపుర స్త్రీలు దుఃఖంతో "హా" అని ఏడ్వసాగారు. పిల్ల గుర్రాన్ని తాడుతో కట్టి వేసి తల్లికి దూరం చేస్తే ఎలాంటి పరిస్తితి వుంటిందో....అలాగే...తల్లి కౌసల్య, తండ్రి దశరథుడు తనకై వస్తుంటే, మనసు చెదిరినా, దిగ్భ్రమ పొందినా, పితృవాక్య పాలన అనే ధర్మపాశానికి కట్టుబడినవాడైనందున ఏమీ చేయలేక, వాళ్లను చూడడానికి కూడా మనసొప్పక చూసీ-చూడనట్లు వుండిపోయాడు శ్రీరాముడు. వాహనాలమీద వచ్చే స్థితి కలిగినా ఉత్త కాళ్లతో వస్తున్నవారిని, ఎంతగానో సుఖపడే గీత వున్నప్పటికీ దుఃఖంతో వున్నవారిని, తన తల్లిదండ్రులను చూసిన శ్రీరాముడు వాళ్లకు కనపడకుండా పోవాలని సారథిని శీఘ్రంగా రథాన్ని పోనిమ్మంటాడు. దయామయుడైన శ్రీరాముడు, పరుల దుఃఖాన్ని సహించలేని శ్రీరాముడు, అంకుశం పోటు సహించలేని ఏనుగులాగా తల్లిదండ్రులు పడే బాధను చూడలేకపోయాడు.

తాడుతో కట్టిన దూడవద్దకు పరుగెత్తి పోయే ఆవులాగా, పట్టపురాణి కౌసల్య రథం వెంట పరుగెత్తుతూ.... "కొడుకా...కొడుకా... రఘువంశ దీపకా.... బిడ్డా....పుత్రా.... లక్ష్మణా....దయావంతుడా.... అయ్యయ్యో తల్లీ

జానకీ...మిమ్మల్ని విడచి నేనెట్లు జీవించి వుంటాను?" అని ఏడుస్తుంటే శ్రీరాముడు మళ్లీ-మళ్లీ చూశాడు. వెనుక నుండి రాజు.... "సుమంత్రా....రథాన్ని నిలుపు...నిలుపు" అని అరుస్తుంటే, శ్రీరాముడు "ఊ...ఊ...తోలు...తోలు..." అని తొందరపెట్టుంటే, ఇరువురి మధ్య చిక్కినవాడిలా అయ్యాడు. "నువ్వు తిరిగి అయోధ్యకు పోయిన తరువాత రాజు నువ్వెందుకు రథాన్ని ఆపలేదని, నీకు నేనంటే లక్ష్యం లేదా అని ప్రశ్నిస్తే, నీకు వినపడలేదని చెప్పు. అసత్యం ఎందుకు చెప్పాలంటే దానికీ కారణం వుంది. ఆయన మాట ప్రకారం రథాన్ని ఆపుతే, ఆయన వచ్చి నన్ను అడ్డుకుంటాడు....విడవలేక బాధపడతాడు. ఇది నేను కనిపించే వరకుంటుంది. కాబట్టి, నేనున్నంతవరకు ఆయన దుఃఖం పెరుగుతుందే కాని తగ్గదు. ఇంత దీర్ఘకాలం ఆయన దుఃఖిస్తే అది సహించలేక మరణిస్తాడు. ఇలాంటి అసత్యం నిజంగా అసత్యం కాదు. దశరథుడి మేలుకోరే చెప్తున్నాను. రథం నిలిపితే కార్యహాని, ధర్మహాని, దశరథుడికి ప్రాణహాని.....కాబట్టి పోనివ్వు" అని శ్రీరాముడు చెప్తుంటే, రథం వెంట వచ్చే వారిని ఆగమని శ్రీరాముడితో చెప్పించాడు సుమంత్రుడు. అంతఃపుర స్త్రీల దుఃఖం ఒకవైపు కొనసాగుతూనే, మరో వైపు పోతున్న శ్రీరాముడి మీద దృష్టి మరల్చ లేదు. శరీరం ఆగిపోయినా మనసు ఆయన వెంటే వుంది. అంతఃపుర స్త్రీలలా వున్నా పురజనులు మాత్రం ఇంకా ఓపికున్నంతవరకు పరుగెత్తుతూనే వున్నారు. ఇదే బంధువులకు హితులకు భేదం. ఇక ఎక్కువ దూరం పోకూడదని చెప్పిన మంత్రుల మాట విన్న రాజు తన భార్యలతో కలిసి విషాదంలో మునిగి, దూరం నుంచే శ్రీరాముడిని చూస్తూ అక్కడే నిలబడిపోయాడు.

❖ ❖ ❖

సర్గ-41

శ్రీరాముడి కొరకు దుఃఖించిన అంతఃపుర స్త్రీలు

ఇక్కడిలా వుంటే అక్కడ అంతఃపురంలో పరిస్థితి దారుణంగా వుంది. శ్రీరాముడు తల్లులందరికీ నమస్కారం చేసి, రథమెక్కి పయనమై పోయిన తరువాత, అంతఃపురంలో ఏడుపులు ఆకాశానికి పాకాయి. ఏడుస్తూ వాళ్లలో వాళ్లీవిధంగా అనుకోసాగారు: "దిక్కులేనివారికి, బలం లేని వారికి ఎవరు పొందదగినవాడో, తపస్సు చేసుకునేవారి రక్షకుడెవరో, అలాంటి అందరి రక్షకుడు, ప్రాప్యుడైనవాడు, తనని రక్షించేవాడు లేకుండా అయ్యో! అడవులకు పోతున్నాడే! తనమీద ఎవరైనా తప్పుడుమాటలు చెప్తే కోపగించుకోడు. తాను చేసే పనులు ఎవరికైనా బాధ కలిగిస్తాయేమోనని సందేహించి, అలా ఎవరి మనసు గాయపడని రీతిలోనే చేసే గొప్పవాడు శ్రీరాముడు. తనమీద ఎవరికైనా కోపం వచ్చినా వారిని సమాధాన పరిచే గుణంకలవాడు. ఇతరుల సుఖం తన సుఖంగా, ఇతరుల దుఃఖం తన దుఃఖంగా చూసుకుంటాడు. కన్న తల్లి కౌసల్యను ఏ విధంగా చూస్తాడో అలానే మనందరినీ గౌరవిస్తాడు. అలాంటి పుణ్యాత్ముడు, నిర్దుష్ట చరిత్రుడు, ఎక్కడున్నాడో? ఎటు పోతున్నాడో? భార్య కదా అని నమ్మి కైక దగ్గరకు పోయిన దశరథుడికి శ్రీరామడిని అడవులకు పంపమని కోరింది. ఆ కోరికకు అనుగుణంగా మంచినడవడికల లోక రక్షకుడిని వదలిపెట్టాడు రాజు. అయ్యో! శ్రీరాముడెక్కడికి పోతున్నాడో....ఆయన గతేంటో? ఈ రాజు ఎంత బుద్ధిలేనివాడు? అలా కాకపోతే...కొంచెం కూడా దయ లేకుండా సత్యం పలికే స్వభావం కలవాడిని, ప్రజలందరికీ ప్రియమైనవాడిని, ధర్మస్వరూపుడిని, శత్రువులను అణగదొక్కే పరాక్రమవంతుడిని, సొంత కొడుకును, శ్రీరామచంద్రమూర్తిని అడవులపాలు చేశాడు?" అని హా..హా కారాలు చేస్తూ ఏడ్వ సాగారు.

లేత దూడలను విడిచిన ఆవులలాగా ఆ స్త్రీలందరూ అలా గట్టిగా ఏడుస్తుంటే, ఆ శోక ధ్వని విన్న రాజు మూర్ఛపోయాడు. ఇళ్లల్లో స్త్రీలు పురుషులు దుఃఖంతో వున్న కారణాన స్త్రీలు వంట చేయలేదు....పురుషులు వంట

అయిందా అని అడగలేదు. నిత్యాగ్నిహోత్రులు, పండితులు కూడా దుఃఖాతిశయం వల్ల కర్తవ్యతామూఢులై హోమాలు చేయాలనుకోలేదు. అగ్ని చల్లారిపోయింది. ఒక్క మనిషి కూడా ఆ రోజున విధిగా చేయాల్సిన ఏ పనీ చేయలేదు. పొద్దు గ్రుంకే వేళ కాకపోయినప్పటికీ, తన వంశంలో పుట్టిన భగవదవతార మూర్తికే ఇలాంటి కష్ట దశ వచ్చిందే అని, దీన్నెలా చూడాలనుకుని, సూర్యుడు కానరాకుండా వుండిపోయాడు. ఏనుగులు తిండి మాని కన్నీళ్లు కార్చసాగాయి. పాలుతాగడానికి వచ్చిన దూడలను ఆవులు దగ్గరకు రానీయకుండా తన్ని పంపించాయి. తొలిచూలు మగబిడ్డను కన్నప్పటికీ, శ్రీరాముడే తన పెద్దకొడుకని భావించి తొడమీద పెట్టుకున్న ఒక తల్లి, చిన్నప్పుడు లాలించి ముద్దాడిన వాడిలా అయ్యాడే అని బాధపడ్డది. కౌసల్య ఎన్నో వ్రతాలు తపస్సులు చేసి లేక లేక కని పెంచిన బిడ్డే ఇలా అయితే ఇక తమ బిడ్డల గతేంటని కొందరనుకున్నారు.

(గురువు, బుధుడు, అంగారకుడు అనే గ్రహాలు క్రూరంగా ఇక్ష్వాకు వంశపు కూటస్థపురుషుడైన త్రిశంకువును, చంద్రుడుని ఆక్రమించారు. గురువు, బుధుడు స్వయంగా క్రూర గ్రహాలు కాకపోయినా క్రూర గ్రహమైన అంగారకుడితో చేరడం వల్లనో, లేదా, వేరొక క్రూర స్థానానికి రావడం వల్లనో వారు కూడా క్రూరులయ్యారు. ఇంకొంచెం లోతుగా ఆలోచిస్తే, పద్నాలుగు ఏళ్లు అరణ్యవాసం పూర్తవగానే, పదిహేనో ఏడు మొదటిరోజైన పంచమినాడు శ్రీరాముడు భరద్వాజాశ్రమానికి చేరాడు. కాబట్టి శ్రీరాముడి ప్రయాణ దినం పంచమి కావచ్చు. ఆ రోజు పుష్యా నక్షత్రం కాబట్టి చంద్రుడు కర్కట రాశిలో వుంటాడు. బుధుడు ఎప్పుడూ సూర్యుడి సమీపంలో వుంటాడు కాబట్టి ఆ రోజున అతడికి చంద్ర సంబంధం కలుగదు. అలాంటప్పుడు బుధచంద్ర సంబంధం చెప్పడం తప్పని ఒక వాదన. చంద్రుడి ఎదుట అంటే చంద్రుడితో ఏక రాశిలో వుండడం అని అర్థం కాదు. అతడి వీక్షణం సరిపోతుంది కాబట్టి చంద్ర వీక్షణాన్ని బట్టి చంద్ర సంబంధం చెప్పడం జరిగింది. ఇక, కాంతిహీనాలై, అశ్విన్యాది నక్షత్రాలు, సూర్యాది గ్రహాలుండగా విశాఖ నక్షత్రం ధూమకేతువుతో కలిసింది. సూర్యుడు విశాఖ నక్షత్రంలో జన్మించాడు. శ్రీరాముడి వంశం సూర్యవంశం. ఇక్ష్వాకుల కులతార విశాఖ. దీనికి ధూమకేతువు కమ్మడం

రాబోయే దశరథుడి మరణాన్ని సూచిస్తున్నది. ఒక మహాత్ముడి దుఃఖానికి లోకమంతా దుఃఖిస్తుంది).

మేఘాల తాకిడితో కూడిన వాయు వేగానికి సముద్రం ఎలా తల్లడిల్లిపోతుందో, క్షోభిస్తుందో, అదే మాదిరిగా అయోధ్యా నగరమంతా సంచలించిపోయింది. నలుదిక్కులా చీకట్లు కమ్మాయి. ఆకాశంలో ఒక్క నక్షత్రం కూడా ప్రకాశించలేదు. తీవ్రమైన దుఃఖం పొంగిపొర్లుతుంటే, ఆ పట్టణంలోని ఆడువారుకాని, మగవారుకాని, వేడుకగా తిరగడానికి కాని, భోజనం చేయడానికి కాని ఇష్టపడలేదు. వేడిగా, పెద్దగా శ్వాస విడుస్తూ, అందమంతా పోయి, బాధపడిన ప్రజలందరూ కత్తితో గీచినా నెత్తురుచుక్క రాలని విధంగా సంతాపం చెందారు. తెల్లబోయిన ముఖాలతో కాంతివిహీనులయ్యారు. గాలి చల్లగా వీయలేదు. అగ్ని కూడా చల్లబడిపోయింది. సూర్యుడిలో వేడి లేకుండా పోయింది. చంద్రుడిలో ప్రసన్నత కానరాలేదు. అంత పెద్ద పట్టణంలో ఒక్క పసివాడు కూడా తల్లి పాలకై ఏడవలేదు. తల్లులను పిల్లలు, బిడ్డలను తల్లులు, తమ్ములు అన్నలను, అన్నలు తమ్ములను, భార్యలను భర్తలు, భర్తలను భార్యలు ఒకరినొకరు విడిచి భరించలేని దుఃఖంతో తామెటుపోతున్నదీ తమకే తెలియని రీతిలో, మనసంతా శ్రీరాముడి మీద వుంచి ఎక్కడెక్కడికో పోయారు.

(తన ఒకే ఒక్క కొడుకు, శ్రీరాముడంతటి వాడు, అడవికి పోతుంటే తల్లి కౌసల్య ఉపేక్షించింది కాని ఏ విధమైన సహాయం చేయలేకపోయింది. తల్లులందరూ ఇలాంటివారే కదా అని కొడుకులు తల్లులను వదలిపెట్టారు. దీర్ఘకాలం ఎన్నో నోములను నోచి, తపస్సులు ధారపోసి, కనక-కనక ఒక్క కుమారుడిని కని, వీడు మనకు ఇహ-పరాలకు కారకుడవుతాడని ఎంతో ఆశపెట్టుకున్న తల్లి కౌసల్యను విడిచి శ్రీరాముడు అడవికి పోయాడు.....ఇక ఇంకే కొడుకు తల్లిని రక్షించగలడు? కొడుకులను నమ్మితే తమ గతి ఇంతే కదా అని తల్లులు బిడ్డలనుపేక్షించారు. భార్యలంటే ఎప్పుడూ తమ సుఖాన్నే చూసుకుని, దానికొరకు, కైక లాగా భర్తను ఎన్ని కష్టాల పాలైనా చేసేవారే కదా! వీరిని నమ్మి ఏమి ప్రయోజనమని భావించి భర్తలు భార్యలను విడిచి పెట్టారు. పెద్ద భార్య కౌసల్యను కాదని, ఆమె కుమారుడిని అడవికి పంపిన దశరథుడిని ఉదాహరణగా తీసుకుని, భర్తలంటే సమయం వచ్చినప్పుడు ఎంత

గుణవతినైనా వదలేవారే కదా! అని భార్యలు భర్తలనుపేక్షించారు. పుట్టగా భ్రాతలు, పెరిగినాక జ్ఞాతులన్నట్లు భరతుడేకదా శ్రీరాముడు అరణ్యానికి పోవడానికి కారణం.....కాబట్టి, తోడబుట్టినవారందరూ, తమ అన్నలు వారి మేలే చూసుకుంటారని అన్నలు తమ్ములనుపేక్షించారు. ముఖ్యులైనవారే ఇలా వుంటే, ఇక చుట్టపక్కాలా మనలను రక్షించేది? అని భావించిన బంధువులు ఒకరినొకరు వదలారు. వీరందరూ నమ్మదగినవారిఉ కాదు....శ్రీరాముడొక్కడే తల్లయినా, తండ్రయినా, అన్నైనా, తమ్ముడైనా, భర్త అయినా, బంధువైనా.....అని మనసులో అనుకుని భారమంతా ఆయనపై మోపారందరూ. దీనివలన తేలేదేంటంటే, సోపాధిక బంధువులందరూ, అక్కరకు, అవసరానికి ఆదుకునేవారు కాదు. నిరుపాధిక బాంధవుడు శ్రీరాముడే ఎక్కడున్నా విశ్వసింప తగినవాడు అని అర్థం చేసుకోవాలి)

(బంధువులందరూ నమ్మరానేవారు కావచ్చు....ప్రాణపదంగా వుండే స్నేహితులైనా శ్రీరాముడిని ఆపి వుండవచ్చు కదా? దానికీ సమాధానం వుంది. ఆయన స్నేహితులందరూ అమితమైన దుఃఖంతో దిక్కు తోచక, ఇళ్లలోనే ఏడుస్తూ పండుకున్నారు. బంధువులందరికీ కనీసం దేహస్మృతి వుందికాని, వీళ్లకు అదికూడా లేదు. నిలబడలేక, కూర్చునే శక్తి లేక కింద పడిపోయారు. శ్రీరాముడు తన తల్లిదండ్రులకు చెప్పని రహస్యాలను కూడా చెప్పే కొందరి స్నేహితులున్నారు. వారు తమ ప్రాణాలనైనా పణంగా పెట్టి శ్రీరాముడిని రక్షిస్తారు. వ్యతిరేకంగా నడచుకునేవారొక్కరైనా లేరు....అంతా ఒకే రీతి నడచుకునే వారు. సర్వ స్వంతంత్రుడైన తండ్రి, చక్రవర్తి, అడవికి పో నాయనా అని కొడుకు పంపాడు. తల్లి కౌసల్య దీవించి మరీ పంపించింది. స్నేహితులు అలాంటివారు కాదు. శ్రీరాముడు అడవికి పోతున్నాడని తెలియగానే మూర్ఛపోయారు. ఇక లేవలేదు. కాబట్టి వీళ్లు కౌసల్యా, దశరథుడికంటే శ్రీరాముడి మీద ఎక్కువ ప్రేమ కలవారని భావించాలి. అంత ప్రేమే వుంటే, శ్రీరాముడి కాళ్లు పట్టుకుని బతిమిలాడైనా ఆపొచ్చు కదా అని ప్రశ్న వేయవచ్చు. దుఃఖం అతిశయించడంతో, దిక్కు తోచక, మీద పిడుగు పడ్డట్లయిపోయి, ఇళ్లల్లోనే పడి పోయారు. శ్రీరాముడిని ఆపాలన్న ఆలోచన కూడా రాలేదు).

❖ ❖ ❖

సర్గ-42

తన ఇంటికి వెళ్లిపోయిన దశరథుడు

శ్రీరాముడి రథం పోతుంటే ఆ వేగానికి లేచిన దుమ్ము కనిపించేంతవరకు దశరథుడు కొడుకు పోయిన దిక్కువైపే చూస్తూ, రెప్ప వాల్చకుండా వుండిపోయాడు. కొడుకు పోవడం రాజు చూసేంతవరకు దుమ్ము విపరీతంగా లేస్తూనే వుంది. శ్రీరాముడు కనపడకపోతే దశరథుడు దుఃఖం మాని ఇంటికి పోతాడేమోనని బహుశా దుమ్ము అలా రేగిందేమో! రథం చూపు మేరదాటి చాలా దూరం పోయిన తరువాత దుమ్ము కూడా కనబడకపోవడంతో ధైర్యం కోల్పోయిన రాజు పట్టుతప్పి నేలమీద పడిపోయాడు. అప్పుడు కుడి పక్కనున్న కౌసల్య, ఎడమ పక్కనున్న కైకేయి ఆయనను ఇరువైపులా చేతులు పట్టుకుని లేపడంతో కొంచెం తెప్పరిల్లాడు రాజు. ఆ వెంటనే దుర్మార్గురాలైన కైకను చూసి శోకాగ్ని వల్ల మనసు దహించుకుపోతుంటే రాజిలా అన్నాడు: "ఓసీ! పాపాత్మురాలా! నన్ను తాకవద్దు. దూరంగా పో. నీ ముఖం చూడడానికే అసహ్యంగా వుంది...ఇక నువ్వు తాకితే ఎలా సహించగలను? అది కుదరదు....నువ్వు చావడమే నాకు సంతోషం కలిగిస్తుంది. ఈ భూమ్మీద నీ ప్రాణమున్నంతవరకు నువ్వే కాకుండా నీకు కావాల్సినవారందరూ నాకు శత్రువులే. నా వాళ్లందరూ నీకలాగే. నువ్వు, ధర్మం నాశనం చేసైనా సరే, అర్థం సాధించాలని ఆలోచనకలదానివి. నీకు ధర్మంతో పనిలేదు. కాబట్టి, అగ్నిసాక్షిగా వివాహ సమయంలో నేను చేపట్టిన నీ చేయిని ఇహ-పర లోకాలలో కూడా విడిచిపెట్టాను. ఈ లోకంలో నువ్వెలా నా భార్యకావో, పరలోకంలో కూడా నాతో సంబంధం నీకు లేకుండా పోవాలి. భరతుడీ రాజ్యాన్ని గ్రహించి సంతోషిస్తే వాడు నాకు పుట్టినట్లు కాదు. తండ్రితో విభేదించేవాడు, ద్వేషించేవాడు, ఇతరులకు పుట్టినవాడితో సమానం. కాబట్టి వాడు విడిచే ధర్మోదకాలు, తిలోదకాలు పరలోకంలో నాకు చెందకుండా వుండాలి. నాకు వాడు పుట్టి వుంటే ఈ రాజ్యాన్ని వాడంగీకరించడు".

దుమ్ములో పడి వున్న భర్తను, కౌసల్య, కన్నీళ్లు కాలువల్లా పారుతుంటే, కళ్లు ఒకవైపు మూతపడుతున్నప్పటికీ, రాజును ఎలాగో పట్టుకుని తీసుకొని పోయింది. రాజు పదేపదే తన కొడుకును తలచుకుంటూ, తనంతట తానే నిప్పును తాకి అది కాలుస్తుంటే బాధపడిన విధంగా, కీర్తిమంతుడైన బ్రాహ్మణుడిని చంపి బ్రహ్మ హత్యా దోషం అంటకట్టుకున్న వాడిలా, కాసేపు మూర్ఛపోవడం, కాసేపు లేవడం, కొడుకు పోయిన వైపే చూడడం చేస్తూ, రాహువు మింగిన సూర్యుడిలాగా అయిపోయి ఏడవసాగాడు. కొడుకును తీసుకొని పోయిన ఉత్తమాశ్వాల అడుగుల గుర్తులు ఇంకా కనిపిస్తుంటే, కొడుకేమో కానారాకపోతే, అలాంటి పుణ్యాత్ముడిని విడిచి భూమ్మీద ఎలా బతకాలి అని దుఃఖించసాగాడు.

"చందనం సుఖంగా పూసుకుని, ఉత్తమ స్త్రీలు వింజామరలు వీస్తుంటే, సుఖంగా నిడివైన పరుపు మీద సుఖ నిద్రపోయే నా కొడుకు ఎక్కడో, ఏ చెట్టు నీడనో, దిక్కులేనివాడిలా, తుండు గుడ్డో, రాయో, చేయో దిండుగా పెట్టుకుని నేలమీద ఎలా పడుకున్నాడో? వంశ పరంపరలను పొగడుతూ, స్తోత్రం చేస్తూ, స్తోత్ర పాఠకుల మంగళ ధ్వనులతో నిత్యం మేల్కొనే శ్రీరాముడు, దీనంగా, దుమ్ము దులుపుకుంటూ, సెలయేళ్ల సమీపంలో–అడవిలో, గజసమూహ నాయకుడిలాగా లేవాల్సిందే కదా! ముల్లోకాలకు ప్రభువై, ఆజానుభాహుడై, చక్రవర్తి అయినా నా కొడుకు దిక్కులేనివాడిలా అడవుల్లో పోతుంటే అక్కడున్న చెంచులు, బోయలు, ఎరుకలు కన్నులపండుగగా ఆయనను చూస్తారుకదా! పోవద్దమ్మా...పోవద్దు...అంటే వినలేదు సీత. జనులతో పొగడ్త కన్న జనకరాజు కూతురామె. ఆ సుందరి ఎప్పటికీ సుఖించడానికే యోగ్యురాలు. అలాంటి జానకి ముళ్ల నేలలో పోతుండవచ్చు. ఆ రూపవతి అడవంటే ఏమిటో, ఎలా వుంటుందో కూడా తెలిసింది కాదు. మాంసం తినే క్రూర మృగాల అరుపులకు భయపడి దిగులు పడుతుందో? ఏమో?" ఇలా అనుకుంటున్న దశరథుడు ఇంకా తన పక్కనే వున్న కైక చూసి మండి పడ్డాడు.

"ఓసీ విధవా! నీ ఇష్ట ప్రకారం రాజ్యాన్ని నువ్వే తలకు కట్టుకుని వూరేగు. కమలాల లాంటి ముఖం కల నా శ్రీరాముడిని ఎడబాసి ఇంక ఒక్క గడియ కూడా నేను బతకలేను. కాబట్టి నేను చనిపోయినట్లే భావించు". ఇలా ఏడుస్తూ

దశరథుడు అక్కడున్న జనం, మంత్రులు, శ్రీరాముడి వెంట పోలేని ఇతరులు తన వెంట వస్తుంటే, అమంగళకరమైన అయోధ్యా పురానికి మృతస్నాతుడిలాగా పరవశుడై ఇతరులు తనను తీసుకొస్తుంటే వచ్చాడు. వస్తుంటే....మనుషులు లేని ఇళ్లు, చావళ్లు, బడుగుల ఏడుపులు, మూతపడిన దేవాలయాలు, అంగళ్లు....ఇలా పాడుపడిన దానిలా (స్మశానాన్ని తలపిస్తూ) వున్న రాచబాట గుండా దాన్ని చూసుకుంటూ దశరథుడు తన ఇంటిలో ప్రవేశించాడు. తన మీదున్న పామును గరుడుడు హరించుకుని పోతే కలత లేకుండా స్థిమితమైన మడుగులోకి ప్రవేశించిన విధంగా, సూర్యుడు మేఘాల చాటుకు పోయినట్లు, కొడుకులు, కోడళ్లు లేని ఇంటిని దశరథుడు సమీపించాడు. వచ్చిన రాజు తనకు అక్కడ వుండడం ఇష్టం లేదని సన్న గొంతుతో అంటాడు.

కౌసల్య ఇంటికి పోయిన దశరథుడు

తన ఇంట్లో కాని, కైకేయి కొంపలో కాని, వుండడం తనకింకేమాత్రం ఇష్టం లేదని, కౌసల్యా మందిరానికి తనను తీసుకుని పొమ్మని, ఆ రామ జననియే తనను శ్రద్ధగా చూసుకుంటుందని అన్నాడు దశరథుడు. తిన ముందు పోతున్న భటులు దారి చూపుతుంటే దశరథుడు కౌసల్య ఇంటికి పోయి అక్కడున్న పక్క మీద పడుకుని ఏడ్వసాగాడు. కోడలు ఇద్దరు కొడులు లేని ఆ ఇంటిని, చంద్రుడు నక్షత్రాలు గ్రహాలు లేని ఆకాశం లాగా చూసిన దశరథుడు రెండు చేతులెత్తి "రామా! వదలి పోతివా" అని గట్టిగా ఏడ్చాడు. క్షేమంగా శ్రీరాముడు తిరిగి వచ్చిన తరువాత ఆయనను గట్టిగా కౌగలించుకుని సంతోషించేందుకు అంతవరకు బతికున్నవారే ధన్యులని, సార్థక జన్మలని, తనకంత పుణ్యం లేదని అంటూ, పొర్లి-పొర్లి ఏడ్చే రాజు పాలిట మృత్యుదేవత కాలరాత్రిలాగా రాత్రి సమీపించింది. ఆ నడిరాత్రి ఆయన కౌసల్యతో తన బాధనంతా వెళ్లబోసుకున్నాడు. దశరథుడి పంచేంద్రియాలలో ప్రతి ఒక్కటి శ్రీరాముడికి లోబడినవే. "సకల కళ్యాణగుణమణులకు సముద్రుడైన శ్రీరాముడి, చంద్రుడికంటే అభిరాముడైన శ్రీరాముడిలో నాటుకు పోయిన నా చూపులు మరలిరావు" (సముద్రంలో పడ్డదేదీ తిరిగిరాదుకదా!). ఫలానాది జడపదార్థమని, ఫలానాది కాదనే భేదం లేకుండా అందరినీ ఒక్క విధంగా సంతోషించేట్లు

చేసేవే శ్రీరాముడి గుణాలు. "లోకంలో ఒక వస్తువును చూస్తున్నప్పుడు దృష్టి తానే పోయి చూస్తుంది. నా విషయంలో ఇప్పుడు నా దృష్టులు శ్రీరాముడిని చూడడం లేదు. శ్రీరాముడి ఆకారమే న్నా దృష్టులను చూసింది. ఆ ప్రకారమే వాటిని చూసి విడవలేనందునే అక్కడే నిలిచిపోయి మరలి రావడం లేదు. అదే కాకుండా లోకంలో చూపులు తమ దగ్గరకు వచ్చినవాటినే చూడడం న్యాయం అయినప్పటికీ, నా చూపులే తిరుక్కుంటూ పోయి, శ్రీరాముడి ఆకారంలో నిలిచాయి. చూశావా? చేతన కార్యమైన సంచారాన్ని అచేతన దృష్టులు చేస్తున్నాయి. ఇది కాలవైపరీత్యమే కదా! దేవతలకు, మనుష్యులకు, అందరికీ దృష్టిలాంటి వాడు కదా శ్రీరాముడు! అలాంటి వాడు ముందు పోతుంటే నేను ఇక్కడెలా వుంటాను? అని భావించిన నా దృష్టి శ్రీరాముడిని వెంబడించింది. చూపు అంటే చూసేదని కదా అర్థం? సారాసారాలను చక్కగా చూసేదే నా దృష్టి.....కాబట్టే....శ్రీరాముడిని వెంబడించింది. నాకు మేలుచేసేది తనకు చేసుకోదా? శ్రీరాముడికంటే రమ్యమైన వస్తువు ఇంకోటి వుంటె కదా చూపులు శ్రీరాముడిని విడచి మరోవైపు పోయేది? మందార మకరంద మాధుర్యమునదేలు మధుపంబు పోవునే మదనములకు...అన్నట్లు రామ సౌందర్యానుభవం రుచిచూసిన దృష్టి మరొకవైపు పోతుందా?"

"నా చూపులు... అరవై వేల ఏళ్లు కొడుకు కోసం అనేక వ్రతాలను, ఉపవాసాలను చేసి కొడుకు పుట్తాడా...పుట్తాడా? అని ఎదురు చూసిన చూపులు, జన్మతః నాతో పరిచయమున్న నా చూపులు..., నేడు శ్రీరాముడిని చూడగానే వెడలిపోయే కదా! కాబట్టి ఇదొక అభిసారికేమో! (అభిసారిక అంటే, ప్రియుడిని ఒక సంకేత స్థలానికి రమ్మని, తానక్కడికి వచ్చెదనని అభిసరింప చేసేది, అభిసరించునది ఐన నాయిక). కైకేయి లాంటి దుష్ట చిత్తుల దృష్టి అయితే శ్రీరాముడిని అనుసరించదు. ఇది నాదృష్టి. నాది స్థిర స్నేహంకల దృష్టి. వింత వస్తువులకై పరుగులెత్తేదే నా దృష్టి. ప్రతి నిమిషానికీ కొత్త వైభవంతో కనబడే శ్రీరాముడి సౌందర్యాన్ని అనుభవించకుండా నా దృష్టి ఇంకెక్కడికి పోతుంది? సమస్త విషయాలలో చాపల్యం వున్నట్లే శ్రీరాముడి మీద కూడా చాపల్యం వుంది. నా చపల గుణమే నా చూపులకు కూడా వచ్చింది. నా దృష్టి నన్ను

వదలి శ్రీరాముడి మీదకు పోయినా, నాకు దాని మీద వున్న చిరపరిచయం వల్ల అది నాది అన్న అభిమానం పోవడం లేదు. ఈ చూపు నాదే అయితే, నన్ను వదలక అనుసరించే వుంటుంది. ఇది శ్రీరాముడిని వెంబడించడం వల్ల నాది కాదేమో అనిపిస్తున్నది".

"నేను కనబడక పోయినా నువ్వేలా మాట్లాడుతున్నావని అడుగుతావేమో? నీ స్వరాన్ని బట్టి తెలుసుకుంటున్నాను కాని నీ రూపాన్ని బట్టి కాదు. శ్రీరాముడి ముఖం కాకపోయినా, ఆయన తల్లివైన నీ ముఖం చూద్దామనుకున్నా అది కూడా నాకు కనబడడం లేదు. శ్రీరాముడిఉ మీద మునిగున్న చూపు వేరొక పదార్థాన్ని చూస్తుందా? కాబట్టి నా చూపు నీమీద పడడం లేదు. నా దృష్టి పోయినా వాగింద్రియం మాత్రం పోలేదు. కాబట్టి నిన్ను చూసి సంతోషించ లేకపోయినా నీతో మాట్లాడైనా సంతోషిస్తాను. నాకు కైక కదా కాంత, నువ్వు కాదంటావేమో? శ్రీరాముడే నాకు ప్రాణం....అలాంటప్పుడు ఆ శ్రీరాముడిని వెడలగొట్టిన కైక నాకు కాంత ఎలా అవుతుంది? ప్రాణమిచ్చిన దానివి నీవు. దానిని తీసిందది. లోక భర్తను పుత్రుడిగా కన్న నువ్వు ధన్యురాలివి. నా కారణాన నీకు అతడు దుఃఖ కారకుడయ్యాడు. దోషిని నేనే కాని అతడు కాదు.

ఇలా రాజు విలపించడం చూసిన కౌసల్య శ్రీరాముడు తనను వదలి అడవికి పోయినట్లే, దశరథుడు పరలోకానికి పోతాడేమోనని భయపడి ఆయన దగ్గరకు వచ్చింది.

కౌసల్యా దశరథులకు శ్రీరాముడి పరత్వ జ్ఞానం లేదు. వాల్మీకి ఋషి శ్రీరాముడి పరత్వాన్ని ఆయా పాత్రలలో తాననుసరించుకున్నాడు.

❖ ❖ ❖

సర్గ-43

శ్రీరాముడిని తలచుకుని దశరథుడితో చెప్పుకుంటూ ఏడ్చిన కౌసల్య

కౌసల్య పుత్ర శోకంతో తన భర్తను చూసి ఇలా అంది: "కుబుసం విడిచిన ఆడ పాము లాగా కైక తన కుటిలత్వాన్ని, విషాన్ని శ్రీరామచంద్రుడి మీద కక్కింది. అయ్యో! నా కొడుకు ఊరిలో బిచ్చమెత్తుకుని తిని, ఆ సవతికి దాసుడై ఇతర జంజాటం లేకుండా ఇంట్లో వుండనిచ్చినా మేలు చాలుకదా! నీకు ఆ కైక తీయటి మాటల మీద అంత ప్రేమ వుంటే, ఆ మధురవాణికి అలాంటి వరమే ఇవ్వొచ్చుకదా? న్యాయంగా శ్రీరాముడికి దక్కాల్సిన రాజ్యం దక్కక పోతే సరే. వాడిని నిష్కారణంగా అడవులకు ఎందుకు పంపాలి? దాని వల్ల నీకు కలిగిన లాభం ఏంటి? అయ్యో! ఆహితాగ్ని అయిన వాడు ఆమావాస్యనాడు, పున్నమినాడు, హోమంలోని హవిస్సును దేవతలకు బదులుగా రాక్షసులకు ఇచ్చినట్లు, కైక కోరిందికాదా అని, నీ ఇష్టానుసారం, సంపదతో కూడిన రాజ్యాన్ని దుష్టురాలైన దానికిచ్చి, గుణవంతుడైన కొడుకును వెడలగొట్టితివి కదా! చేతిలో విల్లు ధరించి, భార్య, తమ్ముడు తోడు రాగా అడవుల్లో కరిరాజులాగా శ్రీరాముడు అడవిలో ప్రవేశించి వుండవచ్చు. అడవుల్లో నివసించడానికి పడాల్సిన కష్టాలు ఇలా వుంటాయని తెలియని వారిని కైక ఇష్టపడిందని ఆమె ఇష్టానుసారం అడవుల్లోకు నెట్టావు. అక్కడ వారేమైపోతారో కదా? లేత వయసువారిని, సుఖం అనుభవించాల్సిన వారిని, ఆ సమయంలో ఇంట్లో వుండకుండా చేశావు. పళ్లు, వేళ్లు తిని వారెలా ప్రాణాలుగ్గబట్టుకుని అక్కడ వుండగలరో నువ్వే చెప్పు? భార్యతోను, తమ్ముడితోను, ఈ పాటికే పద్నాలుగు సంవత్సరాలైనవని తిరిగి రాకూడదా! నా దుఃఖం పూర్తిగా నశింపచేసే సమయం ఇంకా రాలేదా?"

"నిద్రపోయే వారు తటాలున మేల్కొన్నట్లు నా కొడుకులు, కోడలు అయోధ్యానగరానికి ఎప్పుడు వస్తారో అని ఎదురుచూస్తున్నాను. వారి రాకను విన్న వివిధ స్థలలోని పురజనులు తమ సంతోషాన్ని సూచిస్తూ తోరణ ధ్వజాలు ఎప్పుడు కట్టారోనని ఎదురుచూస్తున్నాను. ఈ నగరమంతా వారి రాక విని సంతోషంతో పున్నమినాటి సముద్రంలాగా ఎప్పుడు ఉప్పొంగి పోతారోనని ఎదురు చూస్తున్నాను. ఆవు వెంట వచ్చే కోడెలాగా సీత వెంట శ్రీరాముడు

ఎప్పుడు వస్తాడో కదా? రాచవీధుల వెంట వచ్చే నా ముద్దుల కొడుకు మీద ఈ వూరి ప్రజలు పూలవర్షం కురిపిస్తుంటే ఎప్పుడు చూస్తానో కదా? చూసి ఎప్పుడు నా దుఃఖాన్ని పోగొట్టుకుంటానో? మనోహరమైన కుండలాలతో, భయంకరమైన విల్లు-కత్తి ధరించి, శిఖరాలతోనే పర్వతాలన్న విధంగా, నగరం ప్రవేశించే కొడుకులను చూసే పుణ్యమెప్పుడో? బ్రాహ్మణ జాతి కన్యలు చేతిలో పూలు పట్టుకుని, సంతోషం అధికం కాగా, నగర ప్రదక్షిణ చేయడం నేనెప్పుడు చూస్తానోకదా? గొప్ప ఆరితేరిన జ్ఞానం కలవాడు, వయసులో ఇంద్రుడి ప్రాయంతో సమానమైన వాడు, కఠినంగా మాట్లాడలేని ముగ్ధుడైన శ్రీరామచంద్రుడి ముఖకమలాన్ని ఎప్పుడు చూస్తానో కదా? ఆడుకునే మూడేళ్ల ముద్దు బాలుడిలాగా నా ఎదుట నా చిన్ని శ్రీరామచంద్రిడు కనపడుతుంటే కళ్లారా ఎపుఉడు చూస్తానో కదా? అలా చేయడానికి శ్రీరాముడెక్కడున్నాడో? అయ్యో...అంతటి పుణ్యాత్మురాలనా? నాకు కొడుకు కూడా వున్నాడా? నాకు కూడా కొడుకున్నాడా?"

"నాకెందుకీ విధంగా పుత్రవియోగం కలిగిందని ఆలోచించాను. పూర్వజన్మలో ఏం చేస్తే అది ఈ జన్మలో లభిస్తుందంటారు. నేను బహుశా గత జన్మలో తల్లులు సంతోషంగా తమ కొడుకులకు చనుపాలిస్తున్నప్పుడు నీచబుద్ధితో ఆ బిడ్డల నోటి ముందున్న చన్నును పొగరుతో కోసేసి వుంటాను. ఆ పాపమే ఇప్పుడీవిధంగా భయంకరంగా నన్ను మింగుతున్నది. సందేహం లేదు. సింహం చంపిన దూడగల ఆవు దూడ లేనిది ఐనట్లు పుత్ర ప్రేమకల నేను కైకేయి వల్ల పుత్రుడు లేనిదానినైనాను. ఇక నేను ఏమనుకున్నా ఏం ప్రయోజనం? అలాంటి సద్గుణాలు కలవాడిని, సమస్త్ర శాస్త్రాలు తెలిసిన పండితుని, శూరుడైన కొడుకును, ఇష్టమైన వాడిని విడిచి ఎంత కాలం దుఃఖించాలి? ఎలా బతకాలి? పుత్ర శోకం వల్ల అగ్ని నా శరీరాన్నంతా కాలుస్తున్నది".

(నీళ్లు తాగే ఆవును, తల్లి పాలు తాగే దూడను వెడలగొట్టకూడదు. ఇంద్రధనస్సును చూసిన వారు దానిని ఇతరులకు చూపకూడదు. పాలు తాగే దూడ కడుపునిండేవరకు దానిని తీయకూడదు. పాలు తాగే దూడను నిష్కారణంగా బయటకు ఈడ్వరాదు. స్వార్థం సరైన కారణం కాదు. మన పొట్టలు నింపుకోవడానికి తల్లి పాలు బిడ్డలకు లేకుండా చేయడం కంటే ఘోరపాపం ఇంకోటి లేదు").

❖ ❖ ❖

సర్గ-44

కౌసల్య శోక ఉపశమనం చేసిన సుమిత్ర

(శ్రీరాముడు పరమాత్ముడనే విషయాన్ని సుమిత్ర మాటల ద్వారా వాల్మీకి ఈ సర్గలో వెల్లడి చేశాడు. తారా, మండోదరి లాగానే సుమిత్రకు జన్మాంతర పుణ్యం వల్ల శ్రీరాముడి వాస్తవ స్థితి చక్కగా తెలుస్తుందని అంటారు. రామాయణమంతా ధ్వని కావ్యమే. దశరథ శబ్దానికి గరుడవాహనుడైన మహావిష్ణువని అర్థం. అలాంటి మహావిష్ణువుకు శరీర భూతైన ప్రకృతి భార్య లాంటిది. ఆ ప్రకృతికి సత్త్వము, రజస్సు, తమస్సు అనే మూడు గుణాలుంటాయి. సత్త్వము సుమిత్ర, కౌసల్య రజస్సు, కైక తమస్సు. పరోక్ష మహావిష్ణువే ప్రత్యక్ష శ్రీరాముడయ్యాడు. కాబట్టె శ్రీరాముడు తండ్రిని పోలినవాడని చెప్పడం జరిగింది రామాయణంలో చాలా సందర్భాలలో).

ఈ విధంగా దుఃఖిస్తున్న కౌసల్యతో ధర్మ మార్గంలో నడచుకునే సుమిత్ర, ధర్మం, నీతితో కూడిన మాట్లను చెప్పడం మొదలుపెట్టిందిలా: "నీ కొడుకు అసమాన కళ్యాణగుణాలు కలిగినవాడు. పరాజయం పొందనివాడు. పురుష శ్రేష్టుడు. ఇలాంటి వాడిని గురించా నువ్వు దీనంగా విలపిస్తున్నావు? నీ కొడుకు అడవులకు పోయిన కారణం ఏంటి? నేరం చేశాడా? కాదుకదా! తండ్రిని సత్యవాదిగా చేయడానికే కదా? తండ్రిని సత్యవంతుడిని చేయడానికి అడవులకు పోయిన కొడుకు గురించి ధర్మం తెలిస్న నువ్వు దుఃఖించవచ్చా? ధర్మ విచారాన్ని ఎందుకు పక్కన పెట్టున్నావు? ఎంత తీవ్రమైన దుఃఖం వచ్చినా ధర్మం తప్పవచ్చునా? మోక్షాన్ని కావాలని అనుకునేవారు ఏ ధర్మ మార్గాన నడిచారో ఆ ధర్మ మార్గంలోనే నీ కొడుకు కూడా నడిచాడు. దీంట్లో దోషం ఏముంది? ఏ పాప కార్యం శ్రీరాముడు చేసాడని దుఃఖిస్తున్నావు? నీ కొడుకు శ్రీపతి కదా...అలాంటివాడికి దుఃఖం ఎందుకు కలగాలంటావా? శిష్టాచారం నిలపడానికి, లోకులను ధర్మ మార్గంలో నడపడానికి ఆయన అలా చేసాడు. నిత్య విభూతిలో, నిత్యానంద రూపుడైన భగవంతుడు, లీలా విభూతిలో ఎందుకు అవతరించాలి? ఆలోచించలేవా?"

"లక్ష్మణుడు తన స్వరూప ధర్మమైన, స్వభావ సిద్ధమైన, కైంకర్య సేవలో వున్నాడు. పెద్దవారిని సేవించడానికి సిద్ధంగా, సమస్థ భూతాలు భగవత్ స్వరూపమే అనే జ్ఞానంతో, ఎవరిని హింసించినా అది భగవంతుడిని నొప్పించడమే అనే ధ్యాసతో వున్నవాడు లక్ష్మణుడు. శ్రీరాముడేవిధంగా తన స్వధర్మ రక్షణలో వున్నాడో అలానే లక్ష్మణుడు కూడా తన ధర్మాన్ని అనుసరిస్తున్నాడు. అందుకే ఇరువిరి విషయంలో విచారించాల్సిన పని లేదు. ఎలాంటి వారికైనా స్వధర్మ నిర్వహణే పరమ ధర్మం కదా? వనవాసంలో వున్న కష్టాలు తెలియనందున సీత శ్రీరాముడి వెంట పోయిందని నువ్వు అనుకుంటే అది పొరపాటు. ఆమె సుఖశీల. సుఖాన్నిచ్చే ఆచారం కల మనిషి. సుఖానుభవంతో వర్ధిల్లుతున్నది. ఈ లోకంలోని సుఖమే సుఖం కాదు. పరలోక సుఖమే అసలైన సుఖం. ఆ సుఖాన్ని పొందే అర్హతున్నామె సీత. ఆమె మహా జ్ఞానైన, యోగైన జనక మహారాజు కూతురు. జనకుడు వైదేహుడు. జ్ఞానానంద స్వరూపమైన ఆత్మ నుండి దీపం ఎలా వస్తుందో. అలాంటి జ్యోతియే అయోనిజ అయిన సీత. అలాంటి ఆమె అజ్ఞానంతో రాముడు వెంట పోయిందని అనుకోవద్దు. ఆమె సహధర్మచారిణి. ఆమె స్వధర్మాన్ని ఆమె రక్షించికునేందుకు ధర్మ స్వరూపుడైన భర్తను సేవించాలనే కోరికతో ఆయన వెంట పోయింది. ఇలా ఆ ముగ్గురు స్వధర్మాచరణే ఉత్తమోత్తమ ధర్మమార్గమనే భావనతో, స్వానుష్టానపూర్వకంగా లోకాని చెప్పాలనుకుని అనుకుంటుంటే నువ్వెందుకమ్మా వారికోసం దుఃఖిస్తావు?"

"శ్రీరాముడు తన కీర్తి కిరీటాన్ని లోకానికంతటికీ ప్రసరించేట్లు చేయగల సమర్థుడు. ఆయన కీర్తి లోకంలో శాశ్వతంగా నిలుస్తుంది. అలాంటి ప్రభువు, అలాంటి సమర్థుడు, అలాంటి ఉత్కృష్ట జన్మకలవాడు, వ్రతాన్ని, ధర్మాన్ని, సత్యాన్నిసంపదగా భావించేవాడు.....శ్రీరామచంద్రుడు...ఆయనకు అడవిలో దొరకనివి ఇక్కడ దొరికేవి అనే తేడా లేదు. ఎక్కడున్నా ఒక్కటే. ఆయన ఎక్కడున్నా పూర్ణుడే. ఆయనకు ఏ కొరతా వుండదు. శ్రీరాముడు త్రికరణాలలోను పరిశుద్ధుడని లోకానికంతటికీ స్పష్టంగా తెలిసినందున సూర్య కిరణాలు ఆయనకు వేడిగా వుండవు. గాలి కూడా సువాసనతో మెల్లగా సమయానికి తగినట్లుగా చల్లగా లేదా వేడిగా వీస్తుంది. శ్రీరాముడు నిదురించే వేళ చంద్రుడు

తన కిరణాలను తండ్రిలాగా తాకించి సంతోషం కలిగిస్తాడు. శంభరాసురుడి కొడుకును చంపినప్పుడు బ్రహ్మ మెచ్చుకుని అనేక దివ్యాస్త్రాలను శ్రీరాముడికిచ్చాడు. అలాంటి పరిపూర్ణ సత్త్వుడు భవనంలో లాగానే వనంలో కూడా సుఖంగా వుంటాడు. సాధువులు కీడు చేస్తారని అంటావేమో? ఆ భయం లేదు. శ్రీరాముడి బాణం పారేంతవరకున్న ప్రదేశంలో శత్రువులు నిశ్శేషంగా నశించి పోతారు కాని సమీపంలోకైనా రాలేరు. అలాంటి వారి ఇక కీడేం చేస్తారు? దిష్టులను ఆయన శౌర్యంతో జయిస్తాడు కాబట్టి ఆయన ఆజ్ఞ ప్రకారమే సమస్త భూమండలం నడచుకుంటుంది. ఆయనను అతిక్రమించేవారుండరు. ఇక శ్రీరాముడు మరలి వచ్చినతరువాత భరతుడు ఆయనకు రాజ్యమివ్వడనే భయం లేదు. సామం వల్ల కాకపోయినా దండం వల్ల రాజ్యం లభిస్తుంది. అమ్మా! లోకంలో రాముడు తప్ప మిగిలిన అందరిలోను బలం, శౌర్యం, తేజం కొంతకాలం మాత్రమే వుంటుంది. కొన్ని చోట్ల మాత్రమే వారు ప్రదర్శించగలరు. శ్రీరాముడట్లా కాదు. ఆయన అస్త్ర-శస్త్ర విద్యలు సర్వకాల-సర్వావస్థలందు ఆయనను విడువవు. అలాంటి ఉత్తమ వీరుడు అడవిలో కొన్నాళ్లుండి, తిరిగి శీఘ్రంగా వచ్చి రాజ్యాన్నంతా పాలిస్తాడు".

ఆ విధంగా సుమిత్ర శ్రీరాముడికి రాజ్యం తప్పక లభిస్తుందని చెప్పింది. ఇంకా ఇలా అంటుంది: "శ్రీరాముడంటే ఏమనుకుంటున్నావు? సూర్యుడికే సూర్యు...అగ్నికి ఆయన అగ్ని...శ్రీ కి శ్రీ...ప్రభువులకు ప్రభువు...కీర్తికి కీర్తి...దేవతలకే దేవత.... భూమికి భూమి...భూతాలలోకెల్లా మహా భూతం. ఇలాంటివాడు అరణ్యంలో వున్నా, నగరంలో వున్నా ఏ లోపం లేదు. ఆయనకు రెండూ సమానమే. భేద దృష్టి కల మనకు భేదం కనిపిస్తుంది. పరమపదంలో, శ్రీ భూనీళలతో కూడిన భగవంతుడిలాగా శ్రీరాముడు త్వరగా అరణ్యం నుండి వచ్చి భూ-సీతా-లక్ష్మణులతో అభిషేకం చేయించుకుంటుంటే లోకులందరూ ఆనందభాష్పాలు రాలుతుంటే దుఃఖం వదలి సంతోష పడనున్నారు. కాంతిగా ప్రకాశించే వాడు, తనకు హితుడైనవాడు, పరాజయం ఎరుగని వాడు, సర్వం తానే అయి అందరికీ దేవుడైన వాడు. కుశలతో తయారైన వస్త్రాలను ధరించినవాడు, అయిన శ్రీరాముడిని లక్ష్మి దేవిలాగా సీత వెంటపోయింది. కాబట్టి శ్రీరాముడికి దుర్లభమైందేదీ లేదు. లక్ష్మి తోడుండగా అసాధ్యమనేదేదీ

లేదు. ఆమె తోడుండగా, ఆ సాంగత్యం వలన శ్రీరాముడి తేజస్సు అపరిమేయంగా వెలుగుతుంది. కాబట్టి శ్రీరాముడెక్కడున్నా శ్రీమంతుడే.... విచారించవద్దు".

"భయంకరమైన విల్లు, బాణాలు, కత్తి ధరించి లక్ష్మణుడు ముందు నడుస్తుంటే, చూసిన రాక్షసులు, క్రూర మృగాలు భయంతో దూరంనుండే పరుగు లంకించుకుంటారు. ఒక వేళ వచ్చినా లక్ష్మణుడిని చంపిన తరువాత కదా రాముడిమీదకు వచ్చేది? ఇంతలో శ్రీరాముడు హెచ్చరికతో వుంటాడు. కాబట్టి నా కొడుకు లక్ష్మణుడు ఊపిరితో వుండేంతవరకు నీ కొడుకు శ్రీరాముడికి ఏ అపదా లేదు. ఒకటికి రెండు సార్లు ప్రమాణం చేసి చెప్తున్నా విను. నా మాట తప్పదు. నీ కొడుకు అరణ్యం నుండి మరలి క్షేమంగా రాగా నువ్వు సంతోషంతో చూస్తావు. కాబట్టి, శోకం, మోహం వదలి పెట్టు. నీ పాదాల ముందు మోకరిల్లి నీ కొడుకు నీకు నమస్కరిస్తుంటే సంతోషంతో కొత్తగా పుట్టిన చంద్రుడిలాగా నువ్వు చూస్తావు. ఎందుకు వృధాగా బాధపడతావు. నువ్వు జీవించి వుండగానే నీ కొడుకు తిరిగొస్తాడు. అడవినుండి మరలి అయోధ్యకు సుఖంగా వచ్చి పట్టాభిషేకం చేసుకున్న నీ ప్రియమైన కొడుకును చూసి, ఏ విచారం లేకుండా మంచి మనస్సుతో సమ్తోషంతో కళ్లల్లో నీళ్లు కారుతుంటే కన్నుల పండుగగా నువ్వుండబోతున్నావు. ఎక్కడి పద్నాలుగేండ్లు? ఎక్కడి నేను? అంతవరకు నేను జీవించి వుంటానా? జీవించి వున్నా రాముడు జీవించి మరలి వస్తాడన్న నమ్మకం ఏంటి? ఏ ధైర్యంతో నేనీ మాటలౌ చెప్తున్నాను అని అంటావేమో? నువ్వు సుశీలవు. నీకు భగవంతుడు దీర్ఘ శోకం కలిగించడు. ఇప్పటి శోకం మబ్బు నీడ లాంటిది".

"అమ్మా! ఏడ్వవద్దు. దుఃఖంతో కలతపడవద్దు. నీ కొడుకుకు ఏ హానీ కలుగదు. లక్ష్మణ సహితంగా సీతతో కలిసి నీ కొడుకు శ్రీరామచంద్రుడుని ఈ వూళ్లోనే, ఈ ఇంట్లోనే చూస్తావు. శ్రీరాముడికొరకై ఇంతమంది దుఃఖిస్తున్నారు. అలానే నీ తీరు చూసి నీకోసం కూడా దుఃఖపడుతున్నారు. వీళ్లందరినీ నువ్వు ధైర్యంగా వుండి ఓదార్చాలి. కాని నువ్వే ఇలా దుఃఖపడితే నిన్నెవరు ఓదార్చాలి? సీతారాముల దుఃఖం కాకుండా నీ దుఃఖం మాకందరికీ కలిగించడం న్యాయమా? శ్రీరాముడిలాంటి ధీరుడికి తల్లివైన నువ్వు ఇలా శోకించడం

తగునా? నువ్వే చెప్పు....తల్లి గుణాలే కదా కొడుక్కొచ్చేది? నువ్వు ధీర వనితవే కాకుండిన నీ కడుపున శ్రీరాముడిలాంటి ధీరుడెలా పుట్టాడు? నువ్వు సద్గుణాలకు స్థానమైన దానివి కదా? శ్రీరాముడికంటే సన్మార్గంలో నడిచే వేరొకరెవరైనా వున్నారా? ఏడీ ఎక్కడున్నాడు? లేడు కదా? స్నేహితులతో కలిసి నమస్కారం చేసే నీ ముద్దుల కొడుకును కళ్లారా చూసి నువ్వు వానాకాలంలో మేఘాలు వర్షించే విధంగా ఆనాంద భాష్పాలు రాలుస్తావు. శీఘ్రంగా నీ కొడుకు శ్రీరాముడొచ్చి నీ పాద కమలాలను తన మెత్తటి చేతులతో సంతోషంగా పట్టుకుని నమస్కరిస్తుంటే, అతడి శిరస్సు మీద కారు మబ్బులు జడివాన కురిపించినట్లు నీ కంట్లో ఆనందభాష్పాలు వెల్లువగా పారుతాయి. అలాంటి నువ్వు ఎందుకు దుఃఖపడుతున్నావు?"

ఇలాంటి మాటలతో సుమిత్ర నానా విధాలుగా కౌసల్యను ఊరడిస్తుంటే ఆమె కూడా శోకాన్ని ఎడబాసింది.

❖ ❖ ❖

సర్గ-45

పౌరులను మరలిపొమ్మని ప్రార్థించిన శ్రీరాముడు

శ్రీరాముడు వెడలిపోయిన తరువాత, ఆయన వెంటనే, అడవికి పోతున్న ఆయనతో అనురాగమౌ కల జనులందరూ వెళ్లనారంభించారు. అలా పోతున్న వారిని రాజు, మంత్రులు పోవద్దని ఎంత వారించినా వారు నిలువక పోతూనే వున్నారు. బంధువుల ప్రేమకు లోకుల భక్తికి ఎంత తేడా వుందో? అయోధ్యా పురంలోని వారందరికీ అసమాన కీర్తిగల శ్రీరామచంద్రుడు పదహారు కళలతో కూడిన చంద్రుడిలాంటివాడు. కాబట్టి అలాంటి పున్నమి చంద్రుడిని చూడకుండా ఇంట్లో వుండమంటే ఎవరైనా వింటారా? అలానే మంత్రులందరు, రాజుతో సహా శ్రీరాముడిని అడవులకు పోవద్దని చెప్పినప్పటికీ, తండ్రిని సత్యవాదిగా చేయదల్చిన శ్రీరాముడు వారి మాటలను వినలేదు. చూడగలంతవరకు చూడాలనే మనోనేత్రాహ్లాదం కోరిన ప్రజలు, ఆయన వెంటనే పోగా లేంది, తండ్రికి పరలోక సౌఖ్యం కలిగించాలన్న కోరికగల శ్రీరాముడెలా ఆగుతాడు? ఇలా పోతూనే, తన వెంట వస్తున్న పురజనులను చూసి శ్రీరాముడిలా అన్నాడు:

"నా మీద మీకున్న ప్రీతి, గౌరవం, భరతుడి పైన వుంచండి. అలా మీరు చేస్తే నన్ను మీరు గౌరవిస్తే సంతోషపడినదానికంటే ఎక్కువగా సంతోషపడుతాను. (భగవంతుడు తనను పూజించినవారికంటే తన భక్తులను పూజిస్తే ఎక్కువగా సంతోషపడుతాడని అర్థం). భరతుడు కైక పుత్రుడు కదా అని మీరు సందేహించాల్సిన పని లేదు. అతడు మంచి నడవడి కలవాడు. మీకిష్టమైన పనులన్నీ చేస్తాడు. మీకు కష్టమైన దేదీ చేయడు. ఏమవుతుందీ అన్న భయం కాని, దుఃఖం కాని వద్దు. పౌరులారా మీ ఇళ్లకు పొండి. భరతుడు పిల్లవాడు....ఆయనకు లోకుల గురించి ఆలోచన ఎందుకుంటుందని అనుకోవద్దు. వయసులో భరతుడు చిన్నవాడైనప్పటికీ, జ్ఞానంలో వృద్ధుడు. మృధువైన గుణం కలవాడు. అలాంటి మెతక మనిషి మిమ్మల్ని ఎలా రక్షిస్తాడని అనుకుంటున్నారేమో? అతడు వీర్యవంతుడు. మంచిమాటలకు లోబడనివారిని దండించే శక్తికలవాడు. కావున మీకు తగిన పాలకుడే. నిష్కారణంగా

భయపడవద్దు. రాజులకుండాల్సిన గునాలు, లక్షణాలు వున్న భరతుడు మీకు యువరాజుగా రాజుగారు నియమించారు. రాజాజ్ఞ ప్రకారం మీరు, నేను తక్కిన జనులంతా నడచుకోవాల్సిందే".

"ప్రజలారా! నాకు సంతోషం కలగడం మీకు ఇష్టమైతే, నేను అడవుల్లో వున్నంత కాలం మా తండ్రికి బాధ కలిగే పనేదీ చేయకుండా అయనను కనిపెట్టుకుని వుండడి". ఇలా శ్రీరాముడెంత చెప్పినా ధర్మ ప్రభువగు రాముడే రాజుగా వుండాలని వారందరూ కోరారు. మొదట శ్రీరాముడినే యువరాజుగా నియమించారు కాబట్టి ఆ ఆజ్ఞను తాము మీరజాలమన్నారు. రాముడు కూడా మీరజాలడన్నారు. తమ వెంట రమ్మని రాముడిని కోరారు. శ్రీరాముడెలానైతే మనస్సు స్థిరం చేసుకుని ధర్మ మార్గం నుండి బయటకు తప్పుకోలేక పోయాడో, అలానే, ఇలాంటి ధర్మాత్ముడు మనకు రాజుగా వుండాల్సిందేనని, ఆయనను ఎలానైనా మరలించుకుని పోదామని ప్రజలు కూడా పట్టుపట్టారు. కళ్లల్లో నీళ్లొస్తుంటే, తెల్లబోయిన ముఖాలతో, వస్తున్న ప్రజలను గమనిస్తున్న శ్రీరాముడికి కూడా కళ్ల వెంట నీళ్లు కారుతుంటె తోవకనబడలేదు. తాళ్లతో కట్టి ఈడ్చుకుపోతున్న వారిలా రామలక్ష్మణులు కదిలారు. జ్ఞానంలో, వయస్సులో, తపస్సేజంతో, వృద్ధులైన వారు కూడా రథం వెంట పరుగెత్తాలనుకుని కూడా అలా చేయలేక దుఃఖంతో పెద్ద గొంతుకతో ఇలా అనసాగారు:

"శ్రీరాముడిని తీసుకుని పోతున్న ఉత్తమాశ్వములారా! మీరు పశువులు కాబట్టే, మీరు చేస్తున్నది సత్కార్యమా? అసత్కార్యమా? మీకు తెలియడం లేదు. తెలిసే వుంటే లోక రమణుడైన శ్రీరాముడిని అరణ్యాలలో వదిలిపెట్టడానికి ఏదో మునిగిపోయినట్లు ఇంత వేగంగా పోతారా? మీరు చేసే పని ప్రజలకు ఎంత బాధ కలిగిస్తుందో పశువులైన మీకెలా తెలుస్తుంది? ఇక పోవద్దు. వెనక్కు మరలాలి. మీకు తోచకపోతే మేం చెప్పేదన్నా వినాలి. పెద్దవాడి మాటలు శ్రీరాముడు జవదాటడు కదా? శ్రీరాముడి గుర్రాలైన మీరు అతిక్రమించవచ్చా? పోవద్దన్నా పోవచ్చా? చెవులున్నవారందిరిలో సూక్ష్మ ధ్వనిని కూడా గ్రహించే శక్తి మీలో అధికంగా వుంది. అలాంటి మీకు మా మాటలు వినబడడం లేదా? అలా ఎందుకు పోతున్నారు? ఇంతవరకు మేమెవరినీ, ఏదీ యాచించలేదు. ఇప్పుడు మిమ్మల్ని ప్రార్థిస్తున్నాం. వెనక్కు మళ్లండి. ఇది మా

ప్రార్థన. యాచకుల ఆశ వ్యర్థం చేయకూడదనే వ్యక్తి శ్రీరాముడు. ఇలాంటి శ్రీరాముడి దగ్గర పనిచేస్తున్న మీరు ఇలా చేయడం తగదు. దీనివల్ల ఆయనకు అపకీర్తి వస్తుంది. శ్రీరాముడు శూరుడు...ధర్మమే ప్రధానంగా కలవాడు...మాంచి ఆచారవంతుడు....త్రికరణాలలో పవిత్రుడు. ఇలాంటి రాముడిని, ఆయన, ఇతర దేశాలలో వున్నప్పటికీ మన వూరికి పిలుచుకుని రావాలి కాని, మన వూళ్లో వున్న వాడిని, అడవుల్లో దింపడానికి తీసుకుని పోవచ్చా? మీరెంత పశువులైనా ఇంత మాత్రం జ్ఞానం లేదా?

శ్రీరాముడిని అయోధ్యకు రమ్మని ప్రార్థించిన పుర వృద్ధులు

ఇలా ఏడుపుల మధ్య బిగ్గరగా మాట్లాడే ఆ బ్రాహ్మణ శ్రేష్ఠుల మాటలు విని రథాన్ని త్వరగా పోనివ్వడం జరిగింది. ఆ రథ వేగానికి అనుగుణంగా వారు పోలేక దశరథుడిలాగానే వాళ్లు కూడా వెనక్కు తిరిగి పోతారని భావించాడు శ్రీరాముడు. అయినా వాళ్లు వెనక్కు తిరిగి పోకుండా అలానే పరుగెత్తుకుంటూ వస్తుంటే చూసి బాధపడ్డ శ్రీరాముడు సీతా లక్ష్మన సమేతంగా రథాన్ని దిగి, వారు కలుసుకునేలా మెల్లగా నడిచి పోసాగారు. రథం దిగి వెనక్కు తిరగకుండా, నిలవకుండా, కాలినడకన పోతున్న సదాచార సంపన్నుడైన, కరుణామూర్తి శ్రీరాముడిని కలిసిన బ్రాహ్మణులు ఇలా అన్నారు: "శ్రీరామా! శ్రీరాముడన్న పేరుగల నువ్వు కూడా ఇలా చేయొచ్చా? ఇలా చేస్తే నీకా పేరు నేతిబీరకాయ లాంటిదే అవుతుంది". బ్రాహ్మణులు ఇలా దీనంగా చెప్తున్నప్పటికీ, శ్రీరాముడు అంగీకరించక ముందుకు సాగుతుండడంతో, వారు, "శ్రీరామా! నువ్వు మావెంట వెనక్కు వస్తావా? లేదా. మమ్మల్నే నీవెంట తీసుకుని పోతావా?" అని అడిగారు.

ఇంకా ఇలా అన్నారు: "బ్రాహ్మణ ప్రియుడవైన నీ వెంట బ్రాహ్మణ సమూహం వస్తున్నది. ఇందులో దోషం ఏముంది? మమ్మల్ని ఎందుకు రావద్దంటున్నావు? మీరు నిత్యాగ్నిహోత్రులు...మీరిలా వస్తే అగ్నులు చెడుతాయని అంటావేమో? అగ్నులను అడవిలోనే ఆరోహించాం. వాటిని బ్రాహ్మణుల భుజాల మీద మోసుకుని వెంట తెచ్చుకున్నాం. వీరు కేవలం నిరతాగ్నిహోత్రులే కాదు.... వాజపేయ యాగం చేసిన వారు కూడా వస్తున్నారు. అదిగో చూడు....వాళ్ల తెల్ల గొడుగులు. నువ్వెందుకు ఇలా ఎండలో నడచి

పోవాలి? వాజపేయ యాగంలో మేము సంపాదించిన, యావజ్జీవం ధరించాల్సిన ఈ గొడుగును నీకు పట్టాం. ఫల భోక్తవు నువ్వే కదా? నువ్వు వాటి నీడలో రా. వేదాలను ఏం చేస్తారంటావా? నీతో వుండి, ఉండిన చోటే. అధ్యయనం చేస్తాం. వేదానుసారంగానే మా మనసులున్నాయి. వేదాలలో బ్రాప్యుడవు నువ్వే అని చెప్పగా విన్నాం. అలాంటి ప్రాప్యమైన నువ్వే మమ్మల్ని వీడిపోతే మా యజ్ఞాలెందుకు? వేదాలెందుకు? వాటి వల్ల కలిగే ఫలం కంటే నీతో వుండే ఫలమే ఎక్కువ. కాబట్టి నీతో మేం అడవుల్లో తిరుగుతాం. నీతో వుండే వరకు మాకు కర్మలోప భయం లేదు. నీ సేవకు విరుద్ధమైన కర్మము త్యాజ్యమని కదా శాస్త్రం చెప్తున్నది?".

"బ్రాహ్మణోత్తములారా! అగ్నిహోత్రాలు అరణ్యంలో ఆరోపిమ్చి తెస్తున్నారు సంతోషమే! ఎవరివలన మీకా అగ్నిహోత్రాలు లభించాయో, ఆ భార్యలను ఏం చేస్తారని అంటావేమో? మా భార్యలను మేం కాపాడాల్సిన పని లేదు. వారి పాతివ్రత్యమే వాళ్లను కాపాడుతుంది. వాళ్లు పతివ్రతలే కాకుంటే వారిని భరించే భారం మా మీద లేదు. వాళ్లు ఇళ్లల్లోనే వుంటారు. ఇక మాకు పరమార్థమైన పవిత్ర వేదాలు మా మనస్సుల్లోనే వుంటాయి. కావల్సినప్పుడు ఎక్కడుంటే అక్కడె వల్లిస్తాం. అయ్యా! రామచంద్రా! నువ్వు హృదయంలో అనుకున్న వనవాస మార్గాన్ని వదలు. మేం మనసులో నిర్ణయిమ్చుకున్నది ఇదే. వస్తావా...మా వెంట నగరానికి రా....రానంటావా...నీ వెంట మేం వస్తాం. ఈ మా మనవిని విచారించకుండా నువ్వుంటె ఇంతకంటె గొప్ప ధర్మం నువ్వేం చేస్తావు? బ్రాహ్మణ రక్షణ కంటె గొప్ప ధర్మం ఏముంది? బ్రాహ్మణ ప్రియుడవైన నువ్వే ఇల్ బ్రాహ్మణుల మాటలను లెక్క చేయకపోతే, ఈ భూమిలో చేసేవారెవరు? శ్రీరామచంద్రా! తలలు పండిన పండు ముసలివాళ్లం. ఇలాంటి మేం, ఈ దుమ్ములో పడి నీకు సాష్టాంగ నమస్కారం చేస్తాం. మలినం లేని ఆచారం కల నీవు నీ రథాన్ని నగరం వైపు మళ్లించు".

శ్రీరాముడికి వయస్సుల్లో పెద్దవారైన బ్రాహ్మణోత్తములు శాస్త్ర విరుద్ధంగా నమస్కారం చేయడానికి కారణం, ఆయన, సాక్షాత్తూ భగవంతుడైనందునే! వారింకా ఇలా అన్నారు: "ఇక్కడున్న సద్బ్రాహ్మణులెందరో యజ్ఞాలు చేయడానికి ప్రయత్నం చేసినవారే. వాటికి కావాల్సిన పదార్థాలన్నీ తయారుగా వున్నాయి.

నువ్వు వచ్చి వాటిని పూర్తి చేయించాలి. అది సొంతం చేయడమనేది నీ చేతుల్లో వుంది. నువ్వు రాకపోతే అవన్నీ విఘ్నం అవుతాయి. ఆ దోషం నీదే. దుష్టులను ఖండించువాడా! నువ్వు ఖండించేది దుష్టులనే కదా? సాధువులైన బ్రాహ్మణులమైన మమ్మేల ఇలా బాధ పెట్టున్నావు? నీ మీద భక్తి కలవారం మేమొక్కరమే కాదు. మా కోసం మాత్రమే నిన్ను వేడుకోవడం లేదు. పశు పక్ష్యాదులు, మనుష్యులందరూ, సంచరించలేని వృక్షాదులు కూడా నీ మీద భక్తితో వున్నాయి. నోరు లేనందున పశుపక్ష్యాదులు, వృక్షాలు, నిన్ను వేదుకోలేక లోలోన దుఃఖిస్తున్నాయి. నోరున్నందున మేం నిన్ను ప్రార్థిస్తున్నాం. కాబట్టి మా ప్రార్థన అంగీకరించు.

"కదలలేని, నోరు లేని వృక్షాలు మా లాగా నీకు చెప్పుకునే వీలు లేనందున నీ వియోగ దుఃఖానికి తపిస్తూ, నీ వెంట వచ్చే అవకాశం లేకపోవడంతో, నేల బాదుకుంటూ, వేళ్లను పెకిలించుకునే శక్తి లేక, నిన్నే చూస్తూ, రామా! రామా! అని బాధ పడ్తున్నాయి. రామా! పౌరులను వదిలేసినట్లే మమ్మల్ని కూడా వదిలేస్తావా? నీకు మనుషులు కదా అపరాధం చేసింది, మేమేం చేయనప్పుడు మమ్మల్ని ఎందుకు విడిచెదవని అడుగుతున్నాయి. గాలి వేగంతో హోరున ఏడుస్తున్నాయి. సమస్త ప్రాణికోటులందు దయగల నిన్ను కదలక, మెదలక శవాల్లాగా అయిపోయి, ఆహారం తీసుకోకుండా, చెట్లమీదే వున్న పక్షుల గుంపులు నిన్ను పోవద్దని ప్రార్థిస్తున్నాయి. చూడు వాటిని."

❖ ❖ ❖

సర్గ-46

తమసా నదీ తీరాన్ని చేరిన శ్రీరాముడు

ఇలా సమస్త జనులు శ్రీరాముడిని అయోధ్యా నగరానికి మరలించేందుకు ప్రార్థించుచుండగా, వారి మాట్లను లెక్క చేయకుండా పోతున్న శ్రీసీతారామ లక్ష్మణులకు తమసా నది వారి తోవకు అడ్డుతగిలింది. తమసా నది అడ్డం రాగానే శ్రీరాముడి ప్రయాణం నిలిచిపోయిందని ప్రజలు సంతోషించారు కాని, తమస్సు ఇంద్రియ సుఖాలు వదలని తమకు అడ్డమని భావించలేదు. ఇలా తమసా నది అడ్డం వచ్చిన సమయంలోనే సాయంత్రం కావడంతో, సుమంత్రుడు గుర్రాలను రథం నుండి విప్పి నీళ్లు తాపించాడు.

అప్పుడు శ్రీరాముడు ఏం చేద్దామని సీతను (ఉద్దేశించి) చూసుకుంటూ, లక్ష్మణుడితో ఇలా అన్నాడు: "అడవిలోకి వెళ్దామని నిర్ణయించుకున్న మనకు, పద్నాలుగు సంవత్సరాలలో మొదటి దినం గడుస్తున్నది. వనవాసం ఎలా చేస్తామోనని విచారపడవద్దు. (సాయంకాలం కావడంతో, తమ తమ గూళ్లకు వెళ్లే పక్షులు, గుహలకు పోయే మృగాలు చేసే ధ్వనులు, అడవిలో భయంకరమైన ఏడుపు లాగా అనిపించాయి). అయ్యో ఎంత కష్టం వచ్చింది మన రామచంద్రుడికి? అనుకుంటున్నారు. మన రాజధానిలో స్త్రీ పురుషులు మిక్కిలి దుఃఖిస్తున్నారు కదా? మనం అడవులకు పోతే వారెందుకు దుఃఖ పడాలి అంటే, వారంతా, నిన్ను, నన్ను, భరతశత్రఘ్నులను, రాజును ప్రేమించినట్లే ప్రేమిస్తున్నారు కాబట్టి. మనమీద వున్న ప్రేమంతా శోకంగా మారింది. ఊరిలో వారంతా దుఃఖించడం ఒక ఎత్తైతే, మన తండ్రిని తలచుకుంటేనే దుఃఖమేస్తోంది. పతివ్రత, కీర్తిమంతురాలు, వృద్ధురాలు ఐన నా తల్లిని తలచుకుంటే దుఃఖం గుండెల్లోంచి వుబికి వస్తోంది. మనల్ని తలచుకుంటూ, దుఃఖం పెరుగుతుంటే, మరీ ఘోరంగా రెండు కళ్లు వాచినట్లు ఏడుస్తుంటే మన తల్లిదండ్రులు గుడ్డివారవుతారేమోనని భయం వేస్తోంది లక్ష్మణా! ఐనప్పటికీ తల్లిదండ్రుల విషయంలో నాకు విచారం లేదు. ఎందుకంటే, భరతుడు కైక కొడుకైనా బుద్ధిమంతుడు కాబట్టి తల్లిదండ్రులు దుఃఖపడకుండా ఊరడిస్తాడు.

భరతుడున్నాడు కనుక ఆ విషయంలో నాకు విచారం లేనే లేదు. లక్ష్మణా, నువ్వు నా వెంట వచ్చి, నాకూ సీతకూ ఉపకారం చేయడానికి అంగీకరించి నందుకు నాకెంతో సంతోషంగా వుంది. ఈ అడవిలో నేను తినడానికి అనేకమైన దుంపలున్నాయి. కాని నీళ్లే తాగి ఉపవాసం చేద్దామనుకుంటున్నాను". (నిన్న రాత్రి ఉపవాసం...నేడంతా ఉపవాసం)

అని లక్ష్మణుడికి చెప్పి సుమంత్రుడుని చూసి, గుర్రాలను జాగ్రత్తగా చూసుకొమ్మని అన్నాడు శ్రీరాముడు. ఆ విధంగానే గుర్రాలకు నీళ్లు పెట్టి దానా ఇచ్చాడు సుమంత్రుడు. ఆ తరువాత శ్రీరాముడు సంధ్యాధిదేవతకు నమస్కరించాడు. సీతతో కలిసి ఆ ఏటి ఒడ్డున ఏర్పాటు చేసిన పడక మీద విశ్రమించాడు. లక్ష్మణుడు అన్నా వదినలి నిద్రిస్తుంటే చూసి సుమంత్రుడితో ఇలా అన్నాడు: "తామర లాంటి కళ్లు కలవారు, సుఖార్హులు, శ్రీసీతారాములు నేల మీద ఎలా పడుకుని వున్నారో చూశావా సుమంత్రా?". ఇంకా శ్రీరాముడి గుణగణాలను నిదురపోకుండా లక్ష్మణుడు చెప్పాడు సుమంత్రుడికి. ఇంతలోనే సూర్యుడు ఉదయించే చిహ్నాలు కనపడ్డాయి. నీళ్ళు తాగటానికి నిరంతరం వస్తుండే ఆవుల గిట్టల తాకిడితో కలతచెందిన ఒడ్డు కల అందమైన ఆ తమసానదీ తీరంలో, పురజనులతో, భార్య, తమ్ముడు సేవిస్తుండగా, గుణరత్నాల గని శ్రీరాముడు ఆ రాత్రి సుఖంగా నిద్రించాడు.

పౌరులను మోసగించి వెళ్లిపోయిన శ్రీరాముడు

శుక్రోదయ సమయంలో శ్రీరాముడు నిద్ర మేల్కొని, ఆ నదీ తీరంలో, అక్కడక్కడ గుంపులుగుంపులుగా, అలసిపోయి నిద్రపోతున్న పురజనులను చూసి "లక్ష్మణా! చూశావా? ఎంత విపరీతంగా వుందో? పౌరులు మన మీద ప్రేమతో ఇళ్లను, ఇల్లాళ్లను వదిలి, ఎత్తుపల్లాలు ఆలోచించకుండా, ఇక్కడ పడి నిద్ర పోతున్నారు.ఓ జనులారా! ఈ హఠమేల? వలదు....నేను వూరికి రాను. మీరు మరలిపొండి అని నేను ఎంత చెప్పినా వదలడంలేదు. వెంటపడుతున్నారు. గట్టిగా చెపితే ప్రాణాలు విడుస్తారు. ఇది నిజం కాబట్టి, వీళ్లు నిద్రిస్తున్నప్పుడే మనం హెచ్చరికతో రథమెక్కి వనభూమిలో భయం లేని దారిలో పోదామా? వీరంతా దేహాలు తెలియకుండా నిదురిస్తున్నారు. ఈ

రోజు వీరు నిద్రించినట్లు మరెప్పుడూ పోరు. అంతగా అలసిపోయారు. (ఇది సహజ నిద్రకాక పోవచ్చు)".

త్వరగా పోవడం మంచిదని శ్రీరాముడు చెప్పడంతో లక్ష్మణుడు దానికి అంగీకరించాడు. సుమంత్రుడిని గుర్రాలను రథానికి కట్టమన్నాడు శ్రీరాముడు. వీరంతా మేల్కొనకముందే పోదామన్నాడు. అతడలాగే చేశాడు."మహాత్మా రథం సిద్ధంగా వుంది. నువ్వు లక్ష్మణుడితో, సీతతో రథమెక్కండి" అని సుమంత్రు డనగానే శ్రీరాముడలాగే చేశాడు. సారథి కూడా అమిత వేగంతో తమసానది వెంట రథాన్ని తోలాడు. ఆవలి గట్టు దగ్గరగా రథాన్ని ఆపి, ముగ్గురూ దిగి నీళ్లలోనే నడిచి అవతలి ఒడ్డుకు చేరుకున్నారు. పురజనులను మోసగించి త్వరగా అక్కడనుంచి పోవాలన్న ఆలోచనతో వున్న శ్రీరాముడు సుమంత్రుడిని వెళ్లమంటాడు. "సుమంత్రా...నువ్వొక్కడివే రథమెక్కి త్వరగా ఉత్తర ముఖంగా అయోధ్యానగరం వైపుగా చాలా దూరంగా పోవాలి. అక్కడనుండి రథం కనిపించని తోవలో రథాన్ని తప్పు మార్గంలో తీసుకుని పో. ఎలాగైనా సరే...ఈ ప్రజలు మమ్మల్ని చూడకుండా వుండే విధంగా వెళ్లిపో.

(తన మీద ఇంత ప్రేమ చూపిస్తూ, తన కోసం ప్రాణాలనైనా విడవడానికి సిద్ధపడి, ఇండ్లు, వాకిండ్లు వదలి వచ్చిన భక్తులను శ్రీరాముడిలా మోసగించవచ్చునా అనే ఆక్షేపణ వుంది. అయితే....ఎవరికైనా ఒక పెద్ద పుండు వంటిమీద అవుతే, అది పోను-పోనూ మరింత పెద్దదవుతుంటే, అపాయకరమని భావించిన వైద్యుడు శస్త్ర చికిత్స చేసి దాన్ని తొలగించి బాగుచేస్తాడు. శస్త్ర చికిత్స చేస్తున్నప్పుడు రోగికి బాధగానే వుంటుంది. ఆ తరువాత సుఖంగా వుంటుంది. అలాగే శ్రీరాముడు కూడా పౌరులతో చాలా రోజులు గడపడంతో వాళ్ల ఆనందం మితిమీరిపోయింది. ఇంకా కొన్నాళ్లుంటే ఆ ఆనందం భరించలేక ఒక రకమైన పిచ్చికి దారితీస్తుంది. శరీరం ఎంత భరించగలదో అంతే భరించాలి. అంతకు మించితే కీడు కలుగుతుంది. కాబట్టి ఇప్పుడే ఏదో ఒక నెపం మీద ఆ ఆనందాన్ని తగ్గించి వారికి అనుభవ సాధ్యమైన ఆనందాన్ని మాత్రమే ఇవ్వాలని శ్రీరాముడి సంకల్పం. అందుకే శ్రీరాముడు ఈ మార్గాన్ని అనుసరించాల్సి వచ్చింది. దీని తరువాత వారికి అంతా సుఖమే అవుతుంది. కాబట్టి ఇలా

చేయడం వంచన కాదు. శ్రీరాముడు బుద్ధిపూర్వకంగా వారి మేలు కోరి చేసిన మోసమే ఇది. అలా శ్రీరాముడు చేయడమే సమంజసం. అలా చేయకపోతే అందరిలో ఒక్కడైనా మేల్కొని వుంటే ఆయన వెళ్లలేక పోయేవాడు. ఏ జన్మలో ఎవరికెంత పుణ్యం రావాలో, అదే భగవదేచ్ఛగా, అంతే వస్తుంది కాని దానికి మించి పోనీయడు భగవంతుడు. ఇలాంటి ఉపాయమే చేయకపోతే ఆరీరాముడు దోషిగా మిగిలి పోయేవాడు).

రామాజ్ఞ ప్రకారం సుమంత్రుడు వెడలిపోయి ఆయన చెప్పినట్లే శ్రీరాముడి దగ్గరకొచ్చాడు. సీతారామలక్ష్మణులు రథమెక్కారు. ఉత్తర దిక్కుగా ప్రయాణం శుభప్రదం కాబట్టి అటువైపే రథాన్ని తిప్పి అడవులకు పోసాగాడు.

❖ ❖ ❖

సర్గ-47

శ్రీరాముడు కనపడక దుఃఖించిన పౌరులు

ఆ ఉదయాన్నే లేచిన ప్రజలందరు శ్రీరాముడు కనపడకపోతే దుఃఖంతో మూర్ఛ పోయి పడిలేస్తూ కన్నీరు కార్చసాగారు. రామా! రామా! అంటూ వారందరూ వేడి నిట్టూర్పులు విడువసాగారు."అయ్యో ఈ నిద్ర పాడైపోను! తలమీదికెక్కి ఇలా చేసింది కదా? బుద్ధి ప్రమాదంలో పడే! ఇంక ఎక్కడి పోవాలి? ఎక్కడా కనపడడే? అయ్యో ఎంత విపత్తు కలిగె? తన భక్తులందరినీ వదిలి శ్రీరాముడు పంతం పట్టినట్లు పోయాడు కదా! శ్రీరాముడికి ఇంతవరకు వంచన అంటే తెలియదు కదా? ఇవ్వాళ ఎందుకిలా చేశాడు? విశాలమైన వక్షస్థలం, పొడుగాటి భుజాలు కల శ్రీరాముడిని మనమెలా చూడగలం? కన్న బిడ్డలను రక్షించే విధంగా మనలను ఎల్లప్పుడూ సంరక్షించే శ్రీరాముడు ఇప్పుడు మనలనందరినీ విడిచి పోయాడు?మన ప్రాణాలకు ప్రాణమైన శ్రీరాముడు లేకపోతే మన ప్రాణాలున్నా పోయినా ఒకటే. ప్రాణాలిక్కడే వదలడం మేలు. ఇక్కడే ప్రాయోపవేశం చేద్దామా? అలాకాకుండా, ఉత్తరాభిముఖంగా మహాప్రస్థానం పోదామా?రెంటిలో ఏది మేలో తేల్చుకోవాలి. ఇక్కడ దండిగా ఎండిన కట్టెలున్నాయి. వీటన్నింటినీ చితిగా పేర్చి, మంట చేసి, దాంట్లో పడి యముడి దగ్గరకు పోవడమే మంచిది. కాకపోతే, మరణం కలిగే దాకా జరిగే ఆలశ్యానికి, శ్రీరామ వియోగ తాపానికి ఓర్చుకోవాలి. ఇక అగ్ని బాధ లేదా అని అనుకుంటే....శ్రీరామ వియోగాగ్ని బాధ కంటే కాలుతున్న ఈ దేహాలు పడే బాధవే నయం. ఇంతకంటే ఏం చేస్తాం? అందుకే అగ్ని ప్రవేశమే తగిన కార్యం. ఆ శ్రీరాముడి స్నేహం, ఆ మాధుర్యం, ఆ నీతి, అ సహనం, ఆ తీయటి మాటలు, ఆ అసమాన గుణసంపత్తి, ఎవరిలోనూ మనం ఇంక చూడలేం. శ్రీరాముడుని విడిచి అయోధ్యకు పోదామంటే, ఆయనను తీసుకునైనా వస్తాం...లేదా ఆయన వెంట మేం పోతాం అని చెప్పి వచ్చాం కదా? కాబట్టి మన రాక చూసి ఏడీ రాముడు? అని అడిగేవారికి ఏమని ప్రత్యుత్తరం ఇస్తాం? శ్రీరాముడుని అడవికి సాగనంపి వస్తున్నామని చెప్పాల్నా? అలా కాకపోతే ఏమని చెప్పాలి? మనమందరం శ్రీరాముడుతో, ఆయన వెంట పోతామని

దంభాలు పలికాం. ఆడంబరంగా వచ్చాం. శ్రీరాముడుని తీసుకుని పోకపోతే, ఉత్త చేతులతో పోతే ముసలివారేమటారు? స్త్రీలేమంటారు? బాలురేవిధంగా చూస్తారు? వీరంతా మనం శ్రీరాముడుని తీసుకొస్తామని నమ్మి ధైర్యంతో ప్రాణాలు బిగబట్టుకుని వున్నారు. వాళ్లు ఈ వార్త విని మహా దుఃఖంలో మునిగి పోరా? మనం పోకుండా ఇక్కడే మరణిస్తే, మన మగవారు శ్రీరాముడుతో పోయారు...శ్రీరాముడుకి భయం లేదు, క్షేమంగా వుంటాడని ధైర్యంతో వుంటారు. ప్రేమ కలవారిలాగా శ్రీరాముడుతో ఇంత దూరం వచ్చాం. ఇప్పుడే ముఖంతో వూరి ముఖం చూస్తాం? ఏమని చెప్పి లోపటికి పోతాం? లోపటికి పోవడానికి మనసెలా ఒప్పుతుంది?" అని విచార పడ్డారు.

లేగ దూళ్లను పోగొట్టుకున్న ఆవుల మాదిరి, చేతులెత్తేసి ఏ ఉపాయం కనిపించక, ఏడుపు మాటలతో ఈ విధంగా రోదన చేశారు వారంతా. పచ్చిక మీద, తీగల మీద సుమంత్రుడు రథాన్ని తోలుకుంటూ పోయినందిన రథం పోయిన గుర్తులు కూడా వారికి కనిపించలేదు. తామెంత అదృష్టహీనులమని, రామ సాంగత్యం వదిలిపోయింది కదా అని వారంతా దుఃఖించారు. తమను తామే తిట్టుకున్నారు. తామొకటి తలిస్తే దైవం మరోటి తలచింది కదా! ఇక్ ఏం చేయాలి? గాఢ నిద్ర ఎందుకు రావాలి? ఇది దైవ కృత్యమే...అని ఏడుస్తూ అయోధ్యకు పోయారు.

❖ ❖ ❖

సర్గ-48

తిరిగి అయోధ్యకు చేరిన పౌరులు

అయోధ్యా నగరమంతా పాడుపడ్డ విధంగా కనబడింది వారికి. శ్రీరాముడుండే స్వగృహం అమంగళమై రూపం మారి పోయింది. గరత్మంతుడు వెంటబడి తరిమిన పాము లేని మడుగు లాగా, చంద్రుడు లేని ఆకాశం లాగా, నీళ్లెండి పోయిన సముద్రం లాగా, అయోధ్యానగరం అందమే లేకుండా పోయింది. అని చింతిస్తూ, కళ్ళు వాచేట్లు ఏడ్చారు వచ్చిన వారందరు. కళ్ల నిండా నీళ్లుండడంతో వచ్చిన వారెవరైందీ గుర్తించలేక పోయారు. శ్రీరాముడి వెంట పోయి, మరలివచ్చి, శవాల్లాగా, వారివారి ఇళ్లకు పోయి, భార్యా బిడ్డలను పట్టుకుని, రాముడేడీ అని వాళ్లు ప్రశ్నిస్తుంటే, సిగ్గుతో, శోకంతో, వెలెవెల బోయిన ముఖాలతో, చేతులు ముడుచుకుని, ఏం చేద్దామా అని గట్టిగా ఏడ్చారు. వీరంతా కొత్త స్నేహితులు దొరికినా సంతోషించరు....కొత్త పదార్థాలు దొరికినా ఇష్టపడరు.....కోమట్లు అంగళ్లలో వుండరు....కొత్త కోడళ్లు వచ్చినా అత్తలకు సంతోషం లేదు....వంట కోసం ఎవరూ పొయ్యి వెలిగించరు...విశేషంగా కొత్త ధనం దొరికినా, రాదనుకున్న డబ్బు చేతికందినా, తొలిచూలు కొడుకు పుట్టినా సంతోషించరు.

అయోధ్యకు పోయిన పౌరులను నిందించిన స్త్రీలు

పురుషుల దుఃఖాన్ని వర్ణించిన కవి, శ్రీరామ వియోగం వల్ల కలిగిన స్త్రీల దుఃఖాన్ని వర్ణించాడిలా:

శ్రీరాముడు అడవికి పోయె కదా అని ఇంట్లోనే వుండి ఏడుస్తున్న స్త్రీలు తమ మగవారు ఆయన వెంట పోయారు కదా...ఎలాగైనా పిల్చుకుని రాగలరని కొంచెం నిబ్బరించుకున్నారు. కాని, శ్రీరాముడు లేకుండా వారే వచ్చినందువల్ల, ఛీ...వీళ్లేం మగవారు? శ్రీరాముడిని విడిచి మళ్లీ ఇళ్ల కోసం, భార్యల కోసం, కామంతో వచ్చారని, దుఃఖం, కోపం కలిసి రావడంతో ఏనుగును అంకుశంతో పొడిచినట్లు నిష్టూరాలు ఆడారు. "ఓ మగవాళ్లూ! శ్రీరాముడితో పోయిన

వాళ్లు, రాజ శ్రేష్టుడైన శ్రీరామచంద్రమూర్తిని పిలుచుకుని రాకుండా ఏ ముఖం పెట్టుకుని, ఏ అభిప్రాయంతో ఇళ్లకు మరలి వచ్చారు? శ్రీరాముడిని కళ్లారా చూసే పుణ్యం లేని వారికి ఇల్లెందుకు? పెళ్లాలెందుకు? బిడ్డల సుకమ్మెందుకు? ధనమెందుకు? శ్రీరాముడి సుఖావలోకనం చేసేకంటే ఇవన్నీ సుఖాలని, ఆనందమని అనుకుని వచ్చారా? మీరెక్కడ శ్రీరామచంద్రుడెక్కడ? మీరు విషయ చింతకల పాపాత్ములు. ఇలాంటి చపలచిత్తులు ఇళ్లల్లో పడి వుండక ఎందుకు శ్రీరాముడి వెంట పోయారు? మమ్మల్ని పొమ్మంటే మేం పోయి ఆయనను తీసుకొచ్చేవాళ్లం కదా? ఆయన పాదాల మీద పడి వేడుకుంటే ఆయన మమ్మల్ని కాదని అడవులకు పోయేవాడా? మీకామాత్రం తోచలేదా?"

"పెళ్లాల మీద భ్రాంతితో పరిగెత్తుకుని వచ్చారా? మీ మగతనం మగువల మీదే కాని భగవద్విషయంలో కాదు కదా?" "ఈ ప్రపంచంలో సజ్జనశ్రేష్ఠుడెవరనిన లక్ష్మణుడొక్కడే! శ్రీరాముడనగా ఏవరనుకుంటున్నారు? లక్ష్మణుడొక్కడే శ్రీరాముడిని కొలిచేందుకు ఆయన వెంట వెళ్లాడు. శ్రీరాముడిని సేవించడానికి అలాంటి వారు అర్హులు కాని మీలాంటివారా? అడవిలో వున్న మనోహరమైన నదులు, కొలనులు ఎంతో పుణ్యం చేసుకున్నాయి కాబట్టే వాటిలో శ్రీరాముడు స్నానం చేస్తున్నాడు. అవి కూడా శ్రీరాముడి గాత్ర సంస్పర్శం లభించి పవిత్రాలైనాయి కదా! వాటి జన్మ సార్థకం...మన జన్మ వ్యర్థం. అడవుల సమూహాలు శ్రీరాముడికి ఫల పుష్పాలిచ్చి, నదులు తమ సమీపంలోని నేలలను నీటితో తడిచినవిగిగా చేసి శ్రీరాముడి పాదాలకు మెత్తగా వుండేట్లి చేసి, పర్వతాలు విహారానికి శయ్యాసనానికి అనుకూలంగా వుండేట్లు చేసి, శ్రీరాముడిని సేవించి ఆయనను సంతోషింప చేస్తున్నాయి. అచేతనములైన స్థావరాలిలా శ్రీరామ సేవ చేస్తూ జన్మ సార్థకం చేసుకుంటుంటే, మనుషులమైన మనం వ్యర్థ జీవులమైనాం. అడవులు, పర్వతాలు జడాలైనవే కావచ్చు. అవి కూడా ప్రియుడైన అతిథిలాగా తమ దగ్గరకొచ్చిన శ్రీరాముడిని తాము ఆయన వద్దకు పోలేక పోయినా ఆయనే వచ్చినప్పుడు పూజించకుండా వుండగలవా? మీరు మాత్రం ఆయన వద్దకు పోగలిగి వుండి కూడా స్థావరాలు చేసినంత చేయలేకపోయారు కదా? మీరు స్థావరాల కంటె నికృష్టులయ్యరు కదా?"

"భగవత్ దర్శనం చేసేటప్పుడు, మధుర స్వరాల మంగళ గానం చేసే స్త్రీల లాగా ఝుంకారం చేసే తేనేటీగలు కూడా తలలో పూలు పెట్టుకుని, పూల గుత్తులు తీసుకుని పోయే స్త్రీల లాగా అడవిలోని చెట్లు, చెట్లమీదున్న పూలు శ్రీరామ దర్శనం చేసుకుని తమ జన్మలను సార్థకం చేసుకున్నాయి. మనుష్య స్త్రీలమైన మనకంత అదృష్టం లేదు కదా? దానికి కారణం మీరే కదా? భగవంతుడు ప్రభువు....తన దగ్గరకు వచ్చినప్పుడు కానుకలివ్వకుండా వుండకూడదు కాబట్టి, తమ దగ్గర విహరించడానికి శ్రీరాముడు వచ్చినప్పుడు, దగ్గర పూలు-పళ్లు వచ్చే కాలం కాకపోయినా, ప్రేమతో పాలు లేకపోయినా చంటి పిల్లలను వాత్సల్యంతో చూసినట్లు, పర్వతాలు మిక్కిలి ఆదరాభిమానాలతో పూలు పళ్లు ఇస్తాయి. శ్రీరాముడు తమతమ పొలిమేరలకు చేరినప్పుడు పెద్ద పర్వతాలు పాద్యమో అన్న విధంగా కొండవంకల్లో అధికమైన నీటిని వెల్లువగా పాదాలపై పోస్తాయి. ఎండ వేడికి తపిస్తూ, తమ నీడలోకి ధరణీసుత సీత, ధరణీ విభుడు శ్రీరాముడు వస్తే, వాళ్ల కాళ్ల నొప్పి, ఎండ తాపం పోయే విధంగా, వృక్షాలు వింజామరలతో వీచే స్త్రీల లాగా, తమ కొమ్మలతో చల్ల గాలి తగిలేట్లుగా విసురుతాయి. ఆ చెట్ల కొమ్మలు చేసిన పుణ్యం కూడా మనం చేయలేకపోయాం కదా?"

శ్రీరాముడిని తలచుకుని దుఃఖించిన పుర స్త్రీలు

"అయ్యా! పురుషులారా! అడవుల్లో క్రూర మృగాలుంటాయని భయపడవద్దు. పామరులు, మీరు అడవుల పాలై, ఆలుమగలు విడిపోయారని అవమాన మాటలంతారని భయపడవద్దు.ఎందుకంటే రాముడున్న చోట ఏ భయమూ లేదు. ఏ అవమానమూ లేదు. ఆ విషయంలో మీరు ఆలోచించాల్సిన అవసరం లేనే లేదు. ఆ సాధు చరితుడు వేగంగా , దూరంగా పోకముందే మనం పోయి కలుసుకోవాలి. పదండి పోదాం...ప్రయాణం కాండి...మేం సిద్ధంగా వున్నాం. ఇక్కడ చేసే పనులక్కడే చేయవచ్చు. అక్కడే పోయి వుందాం. మీరు రాకపోతే ఇక్కడే వుండడి. మాకు అనుమతి ఇవ్వండి. మేం శ్రీరామచంద్రుడి సన్నిధికి పోతాం. ఇంత తొందరెందుకంటారేమో? సమస్త జీవకోటులకు ధారణ పోషణలకు ఆధారమైన వాడు శ్రీరాముడే. ఎన్నటికైనా

మనం పొందాల్సినది శ్రీరాముడినే. కాబట్టి, ఏనాడో మనం వెతుక్కుంటూ పోవాల్సిన చోటుకు, ఇప్పుడే, సమీపంలో వుండగానే పోదాం. మనం సోమరులమై ఆలోచిస్తూ వుంటే, ఆలశ్యం చేస్తే, ఆయన దూరంగా పోతాడు. దుర్లభుడవుతాడు. అక్కడకు పోయి ఏం చేద్దామంటారా? ఆ మహాత్ముడి పాద సేవ యధావిధిగా చేసేందుకు మా మనస్సులు వువ్విళ్లూరుతున్నాయి. మేం సీతను భక్తితో సేవిస్తాం. మీరంతా బాల సూర్య తేజుడైన శ్రీరాముడిని నిత్య కృత్యంగా సూర్యో పాస్తి చేసేట్లుగా ప్రీతిగా సేవించండి. ఇంక ఎందుకాలశ్యం? శుభస్య శీఘ్రం...లెండి..పొండి."

(దీనివలన అర్థం చేసుకోవాల్సిందేంటంటే: పరమాత్మ, ప్రాప్యుడు, శ్రీరాముడే అని, ఆయనను పొంది ముక్తి దశలో చేయాల్సిన పనులు, భక్తితో కూడిన సేవే అని, భగవత్ ప్రాప్తి విషయంలో ఆలాశ్యం చేయకుండా ఈ జన్మలోనే త్వరపడి సాధించాలనీ).

"సీత సేవ మేం చేస్తామన్నారే?...... సీత ఆడది...చిన్నది...ఆమె మీకేం బదులు చేస్తుందని అంటారేమో! శ్రీరాముడు మీకేం కావాలని, మీ యోగ క్షేమాలు ఆలోచిస్తాడు? అది ఉత్త వ్యాగ్యాపారమే! కార్యం చేయాల్సింది మా సీతమ్మే. పతి ఆజ్ఞ తీసుకుని, ఆశ్రితులకు చేయాల్సినవన్నీ ఆమే చేస్తుంది. ఆడబిడ్డలకు కావాల్సింది తల్లికే తెలుస్తుంది. కాబట్టి ఆమెను మేం అడగాల్సిన పనే లేదు. మాకు కావాల్సింది ఆమే తెలుసుకుని మా క్షేమానికి ఏం చేయాలో అవన్నీ ఆమే తనంతట తానే, మ అప్రార్థన లేకుండా తల్లి లాగా చేస్తుంది. కాబట్టి ఇతరుల సేవలన్నీ మానేసి వారినే సేవిస్తే మాకే బాధా రాదు. భయం లేదు. కావాల్సింది లేదని కాని, ఉన్నది పోయిందని కాని భయం లేదు. ఆపదలన్నింటినీ శ్రీరామచంద్రమూర్తి హరించి వేయును. సంపదలన్నీ సీత సంఘటిస్తుంది. కాబట్టి వాళ్ల దగ్గరే వుంటే మనకే లోపం రాదు".

(ఆ పుర స్త్రీలు, సుమిత్ర, తార, మండోదరి భగవద్విషయ జ్ఞానం కలిగిన భక్తురాండ్రు కావడం, పురుషులు మొద్దువాళ్లవడం చిత్రంగా వుంది. స్త్రీ జన పక్షపాతి వాసుదాసుడు మాత్రమే కాదు...వాల్మీకీ అలాంటివాడే. ఇరువురూ సాధ్వీజన పక్షపాతులే కాని దుష్ట స్త్రీ పక్షపాతులు కాదు. ఇరువురూ సాధుస్త్రీల

స్వభావం తెలుసుకుని ఉన్నదున్నట్లుగా వివరించిన వారే. సాధ్వీ పక్షపాతి కాకపోతే, వాల్మీకి, రామాయణం రాసే వుండేవాడు కాదు. ఈ స్త్రీలు చెప్పిన విధంగా పురుషులకు బదులుగా స్త్రీలు శ్రీరాముడి వెంట పోయి వుంటే, ఆయనను మరలి తెచ్చే వారో...లేక...ఆయనను ముందుకు సాగనీయక పోదురో? స్త్రీలు ఏడ్చి వున్నట్లయితే శ్రీరాముడు మరలి వచ్చేవాడేమో? పురుషులు కాబట్టి వాళ్లు ఇళ్లకు పోతారులే అను వదలి వుండవచ్చు. స్త్రీల విషయంలో అంత క్రూరంగా ప్రవర్తించి వుండేవాడు కాదేమో? పుర స్త్రీలు శ్రీరామ పాద సేవ వలన కలిగే ఇహపర సుఖాల గురించి చెప్పి, శ్రీరాముడిని విడిచి సంసారంలో వుండే కష్టాలను చెపుతున్నారు).

"మీరు శ్రీరాముడి వెంట పోతే, ఇక్కడ కొంపల గతి ఏమని అంటారేమో? ఈ కొంప జ్ఞాన వృద్ధులు వుండేది కాదు. మేలని ప్రశంసించాల్సిందీ కాదు. మనసును ఆకర్షించే మంచి గుణమూ లేదు. కావల్సినన్ని దుర్గుణాలే వున్నాయి. దీంట్లో మనముంటే ఎలాగైనా నాశనమై పోతాం. అదీ కాకుండా ఏ వేళకు ఏ కీడు కలుగుతుందో అని భయం కూడా వుంది. ఇలాంటి వూళ్లో ఎవరికి ప్రేమ వుంతుంది? ఇవన్నీ ఇప్పుడే ఎలా వచ్చాయంటావా? ఇదింకా కైక రాజ్యం. స్త్రీ నాయకత్వంలో రాజ్యంలో సుఖం ఎలా వుంటుంది? (ప్రకృతి స్త్రీ...ఈ దేహం ప్రకృతి పరిణామం....ఆత్మ మీద ఈ దేహాధికారం చెల్లుతే ఆ తరువాత ఆత్మ నాశనం కాకుండా ఎలా తప్పుతుంది?) కైక రాజ్యంలో ధర్మం ఎక్కడుంది? ప్రాకృత విషయాల్లో మునిగితేలుతున్న ఇంద్రియ దాసుడికి ధర్మాధర్మ విచారం వుంటుందా? కాబట్టి రక్షకుడు లేకుండా పోయింది. శాసకుడైన ఈశ్వరుడు ఉపేక్షించి వుండిపోతాడు. అలాంటప్పుడు కైక రాజ్యంలో సుఖ శాంతులెలా వుంటాయి? ఎక్కడి బిడ్డలు? ఎక్కడి ధనం? కైక ఆజ్ఞ అని చెప్తూ, ఏ దుండగులు కొల్లగొట్తారో? అలా ఎందుకు కైక చేస్తుందని అడగవచ్చు? ఐశ్వర్యం కొరకే కదా తన కొడుకును విడిచింది....మగడిని వదులుకుంది...అటువంటి దుర్మార్గురాలు, అటువంటి కులక్షయకారిణి ఎవరికి ఏ వేళ ఏం చేస్తుందో ఎవరు చెప్పగలరు? అలా ఆమె చేస్తే మనం ఏం చేయగలం? తరువాత చింతించుట వెర్రి దనం. కాబట్టి ముందుగానే హెచ్చరికగా వుందాం. కైక జీవించి ప్రభుత్వాధినేతగా వుంటే, ఆమె దగ్గర మేం కూలివాళ్ల లాగా

జీవించడానికి మా మనసొప్పదు. అలాంటి స్థితి మాకు రావద్దు. ఇది ఉ ద్రేకంగా చెప్పడం లేదు. మా వొళ్లో వున్న మీ కొడుకులపై ప్రమాణం చేసి చెప్తున్నాం".

"ఇంత ఘోరమైన ప్రమాణం చేయడానికి కారణం చెప్తాం వినండి. దిక్కులేని ఊరివారి బిడ్డని కాదు. రాజు గారి కుమారుడనే. ఏ రాజు కుమారుడినో కాదు. తనకు మగడైన రాజుగారి కుమారుడినే. దయ అనేది కొంచెం కూడా లేకుండా దురాలోచనతో అడవుల్లో కృషించి చావమని పంపింది. అలాంటి చెడు మనసు కలదామె. తన ఆలోచన తనలోనే వుంచుకోకుండా ఇలా ప్రవర్తించింది. ఇలాంటి గయ్యాళిని కొలిచి ఎవరు సుఖపడతారు? కాబట్టి ఎవరూ ఈ నగరంలో వుండరు. ప్రజలే లేకపోతే నాయకులెక్కడ? కాబట్టి ప్రభువుండడు. ఈ నగరమంతా మనుష్యులు లేకుండా పాడుబడి పోతుంది. శ్రీరాముడు అడవులకు పోయినందిన రాజు చచ్చి పోతాడు. రాజ్యం అరాజకమవుతుంది. ఏడుపు ధ్వనులే వినపడ్తాయి. కాబట్టి శ్రీరాముడి వెంట పోయి మరలి వచ్చిన దౌర్భాగ్యులారా! ఇంత మాత్రం ఆలోచించలేకపోయారు కదా? విషం తాగడం మంచిదో....శ్రీరాముడి వెంట పోవడం మంచిదో...ఇవేవీ కాకుండా ఈ నగరం సంగతులు తెలుసుకునే వీలులేని దూరప్రదేసానికి పోవడమా...ఏదో ఒకటి నిశ్చయించుకోండి. ఇక్కడ మాత్రం వుండవద్దు".

"రాజు మాత్రం మంచివాడా! ఆయనా చెడ్డవాడే! ?ది వింటే ఎవరేమి అనుకుంటారనే జంకు లేకుండా, మోసం చేసి, పట్టాభిషేకం చేస్తానని పదిమందిలో చెప్పి, ఇంటికి పోయి అడవులకు పొమ్మన్నాడు. శ్రీరాముడిని, సీతను, లక్ష్మణుడిని దయాహీనుడిగా అదవులకు పంపాడు. అలాంటి వాడు మన విషయంలో, అయ్యో! పాపం అంటాడా? ఆయనేం చేస్తాడో మనకు తెలుసా? తన అభిప్రాయం మార్చుకోక దిక్కులేని ముమ్మ, మమ్మల్ని బోయవాడి ముందు పశువులను వుంచే విధంగా కైక కొడుకుకు అప్పగిస్తాడు. కాబట్టి ఈ రాజు బతికున్నా మనకు మేలు లేదు".

(కైక దశరథులను స్మరించడం వల్ల వచ్చిన పాపం పోవడానికి శ్రీరాముడి గుణగణాలను స్మరించి దుఃఖం పోగొట్టుకోవాలని భావించి శ్రీరాముడి గుణగణాలను వర్ణిస్తున్నారు)

"పూర్ణచంద్రుడి లాంటి ముద్దు ముఖం కలవాడు, విరోధులకు మృత్యు స్వరూపమైన వాడు, బలసిన కండరాలతో ప్రసిద్ధుడు, మోకాళ్లనంటే పొడుగాటి చేతులు కలవాడు, కమలాల లాంటి జంట కళ్ల వాడు, తానే అందరినీ ముందుగా పలకరించే వాడు, స్నేహభావంతో తియ్యటి మాటలు చెప్పేవాడు, ఎదురులేని శౌర్యం కలవాడు, ప్రపన్నుడు, లోకులందరికీ చూడడానికి చంద్రుడిలాగా ప్రియమైన వాడు, పుణ్య కార్యాలలో ఆసక్తి కనపర్చేవాడు, శ్రీరామచంద్రుడు, ఈ పాటికే అరణ్యాలను పావనం చేయకుండునా? సత్యమైన మాటలనే చెప్పేవాడు, మదించిన ఏనుగు నడకలాంటి నడక కలవాడు మన శ్రీరామచంద్రమూర్తి. అలాంటి మహనీయుని దేహకాంతితో ఆ అడవంతా ప్రకాశిస్తుంది".

ఈ విధంగా పుర స్త్రీలు దుఃఖంతో, చావు భయంతో, కలతచెంది, పమరుల్లాగా రామ వియోగ తాపంతో బాధపడ్తుంటే చూసిన సూర్యుడు వారి దుఃఖం చూడలేక అస్తమించాడు. బ్రాహ్మణులెవ్వరూ అగ్నిహోత్రాలు చేయరు. వీధుల్లో వేదపురాణాలలోని మంచి కథలెవ్వరూ పఠించరు. గాడాంధకారం నగరమంతా కమ్ముకొనడంతో, వ్యసనంలో మునిగి, దిక్కులేక, సంతోషం అసలే లేక, పాడబడినట్లుండు అంగళ్లతో అయోధ్యానగరం గ్రహాలు, నక్షత్రాలు లేని ఆకాశంలాగా కనిపించింది. తమ తమ ముద్దు బిడ్డలను, అన్న దమ్ములను కోల్పోయినట్లుగా, ఆ నగరమందలి స్త్రీలు, "ముద్దుల రామన్నా...మోహన రామన్నా..నాయనా..తండ్రీ..." అని ఏడుస్తుంటే, శాంతికరమైన ఆటలు, మనోహరమైన ఉత్సవాలు లేకుండా ఎండిపోయిన సముద్రంలాగా, సొంపుచెడి వుంది అయోధ్యానగరం.

❖ ❖ ❖

సర్గ-49

కోసల దేశం దాటి పోయిన శ్రీరాముడు

ఇక అక్కడ శ్రీరామచంద్రుడు ఆ రాత్రి ఇంకా మిగిలి వుండగానే, చాలా దూరం పోయి, ఉదయం కాగానే సంధ్య వార్చి, ఉత్తర కోసల దేసం దాటి పోయి, దూరంలో వున్న ఊళ్లను చూశాడు. అందమైన తోటలను, విత్తు వేస్తున్న దుక్కి మళ్లను చూశాడు. చుట్టూ వుండే వినోదాలను చూశాడు. వీరిని చూసిన చుట్టుపక్కల వాళ్లు, చిన్న పల్లెల్లోని జనాలు...."ఛీఛీ, దశరథుడు కామవశుడై ఆడది చెప్పినట్లు నడచుకుని, పాపాత్మురాలైన, భ్రష్టురాలైన కైక మాట విని పాపకార్యం చేశాడు కదా! అనుకున్నారు. కైక ఎంత సిగ్గిమాలింది? ఎంత క్రూరురాలు? ఎంత పాప చింత కలదో కదా? ఇలాంటి ముద్దుల కుమారుడిని, దయ గలవాడిని, శాంత చిత్తుడిని, ఇంద్రియాలను జయించిన వాడిని, అడవుల పాలు చేసె కదా? విదేహ రాజు కూతురు సీత, మహానుభావురాలు, అడవుల్లో దుఃఖ పడుట విపరీతం కదా? అయ్యో! చిన్న కుమారుడిపై దశరథుడెంత పుత్ర స్నేహం లేనివాడో కదా! ఇలాంటి పుణ్యాత్ముడిని, ఇలాంటి లోక హితం కోరేవాడిని, విసిరేసినట్లు అడవులకు పంపాడు కదా!"

ఈ విధంగా ఆయా వూల్ల ప్రజలు మాట్లాడుకుంటుంటే, వాటిని వినుకుంటూ, క్రమక్రమంగా శ్రీరాముడు ఉత్తర కోసల దేశమంతా దాటాడు. ఆ తరువాత అక్కడ వేదశ్రుతి అనే ఒక నదిని చూశాడు. దానిని సంతోషంగా దాటి, దక్షిణం వైపు వెళ్తూ, గోమతి అనే మరో నదిని కూడా దాటాడు. ఆడ గోరువంకలు, ఆడ చిలుకలు, ఆడ నెమళ్లు, కలహంసల ధ్వనితో కోలాహలంగా వున్న, మనోహర, గంభీర స్యందికా నదిని కూడా దాటాడు శ్రీరాముడు. దాటిన తరువాత సీతతో "ఈ ఆడ పక్షుల లాగా నువ్వు కూదా అడవిలో సంతోషంగా వుందాలి సుమా!" అని సూచించాడు శ్రీరాముడు.

"కమల నేత్రా! ఈ నది అంతా, కోసల దేశాన్నంతా, నిన్ను ఏలుకొమ్మని మొదటి రాజైన మనువు, మా వంశానికి మొదటివాడైన ఇక్ష్వాకు మహారాజుకు ఇచ్చాడు. ఇంతవరకు ఇక్ష్వాకు వంశం వారే స్వయంగా పాలించారు. ఇతర

దేశాల రాజులు, మా అధికారానికి లోబడి, మాకు పన్నులు చెల్లించి, సంతోషంగా వారు ఏలుకుంటున్నారు. అవి మా ప్రత్యక్ష పాలనకు లోబడి లేవు. కాని వాటిలో మాకు స్వామిత్వం వుంది". (ఈ కారణం వల్లే శ్రీరాముడు వాలితో 'ఇక్ష్వాకూణా మియం భూమి సశైల వనకాసనా' అని చెప్పాడు. హనుమంతుడు సురసతో నువ్వు శ్రీరాముడి దేశంలో వున్నదానివని చెప్పాడు)

ఈ విధంగా సీతాదేవికి చెప్పి, సారథిని చూసి, రాబోయే తండ్రి వియోగాన్ని తలచుకుంటూ, బాధపడుతూ, మధురమైన తన గొంతుతో ఇలా అన్నాడు: " సుమంత్రా! ఎప్పటికైనా సరయూ తీరంలో, అందమైన తోటల్లో, తల్లిదండ్రులు వెంట వుండగా, సమ్తోషంతో వేటాడే వినోదం, తిరిగే భాగ్యం మళ్లా వస్తుందా? లోకంలో రాజులు వినోదం కొరకు, సజ్జనులు పిత్రు కార్యం చేసేందుకు, విలువిద్య నేర్చినవారు చలించే వస్తువులను గురి తప్పకుండా కొట్టేందుకు, వేటాడుతారు. ఈ మూడింటితో నాకు పని లేదు. కాబట్టి నాకు వేట మీద విశేష ప్రీతి లేదు. గో బ్రాహ్మణ రక్షాణార్థం, లేదా అవశ్యమైతే తప్ప, క్రూర మృగాలను చంపను.

(వెలది, జూదం, పానం, వేట, మాటల్లో కరకుదనం, దండ పారుష్యం, వ్యర్థంగా డబ్బు ఖర్చు చేయడం...అనేవి సప్త వ్యసనాలు)

శ్రీరాముడు రాజుల గునాలను ఈ విధంగా స్మరించుకుంటూ, సంతోషంగా సుమంత్రుడితో మాట్లాడుకుంటూ, దక్షిణ కోసల దేశం సరిహద్దులను దాటిపోయాడు. సుమంత్రుడీ విషయాలన్నీ రాజుతో వివరంగా చెప్తాడు తరువాత.

❖ ❖ ❖

సర్గ-50

ఊరు విడిచి వెళ్లేటప్పుడు గ్రామ దేవతకు నమస్కారం చేయడం అనాదిగా వస్తున్న ఆచారం. తన వెంట వస్తున్న నగర ప్రజల సందడి మూలాన అప్పుడే చేయడం కుదరలేదు. కాబట్టి శ్రీరాముడు ఉత్తర దిక్కుగా, అయోధ్యా పురం వైపు తిరిగి, వినయంగా మొక్కి ఇలా ప్రార్థించాడు.

"ధర్మం చెడిపోకుండా వుండేందుకు, కులం పాలించడానికి, లోకాన్ని అనువర్తింప చేయడానికి, శాస్త్ర కట్టుబాట్లను స్థాపించడానికి, నాకు, దేవదేవుడగు విష్ణుమూర్తి సంతోషించడానికి, బుద్ధిగలవాడు వైదికాచారాన్ని మనసులోనైన ఉల్లంఘించ కూడదు".

(శ్రీరాముడు దేవుడు కదా? భగవంతుడు కదా? ఈ విధంగా క్షుద్రదేవతలకు నమస్కారం చేయవచ్చా? అన్న ఆక్షేపణ కలగవచ్చు. స్వానుష్టానంతో లోకంలో శిష్టాచార స్వధర్మాలను స్థాపించడానికి అవతరించిన అవతార మూర్తి కదా శ్రీరాముడు! కాబట్టి ఇక్కడ కాని, మరెక్కడైనా కాని, సీతారాములు నదీ వృక్షాది దేవతలకు నమస్కారం చేయడమంటే, తమకంటే వారు గొప్పవారని అర్థం కాదు. శిష్టాచార స్థాపన కొరకు తనకు ప్రయోజనం కలిగించని కర్మలను కూడా లోకం కొరకు జ్ఞానియైన వాడు చేయాలి)

శ్రీరాముడు తన ప్రార్థనను కొనసాగించాడిలా: "రఘువంశంలో జన్మించిన రాజుల వల్ల రక్షించబడే అయోధ్యానగరమా! నిన్ను, గ్రామ దేవతా సమూహాన్ని, నీలో నుండు దేవతలందరినీ, తండ్రి మాట తీర్చేందుకు అడవుల్లో తిరిగి, ఆ పిమ్మట తల్లిదండ్రులను కలిసి, తరువాత మిమ్మల్ని చూస్తాను. నా మీద దయ వుంచండి".

(మనమెవరికైనా నమస్కారం చేస్తున్నామంటే, అది వారి శరీరానికి కాదు. మనం నమస్కారం చేసేది శరీరంలో వుండే ఈశ్వరుడికి. అలాగే భగవంతుడు ఆత్మకు ఆత్మకావున ఎవరికి నమస్కారం చేసినా జీవప్రకృతి విశిష్టుడై అంతర్యామి అయిన ఈశ్వరుడికే అని అర్థం).

ఇలా పలికిన శ్రీరాముడు, తాను అడవులకు పోయినందున, వూళ్లోని స్త్రీపురుషులెందరో తన కోసం తపిస్తున్నారని బాధపడి, కళ్లెర్ర కాగా, దూరంగా

వున్న వారికి చేతులెత్తి చూపుతూ, తనను చూడడానికి వచ్చిన చుట్టుపక్కల వాళ్లను చూసి నిండు మనసుతో ఇలా అన్నాడు:

"పుణ్యాత్ములారా! మీకు నా మీద దయ, ఆదరం వుండడం వల్లే, మీకిలా చిరకాలం దుఃఖం కలిగింది. ఇది తప్పించుకోవడం సాధ్యం కాదు. కాబట్టి మీ పనులు చేసుకోవడానికి మీరు వెళ్లిపొండి. నా స్వప్రయోజనానికి నేను పోతాను". అనగానే వారంతా మహాత్ముడైనా శ్రీరాముడికి ప్రదక్షిణ నమస్కారాలు చేసి, ఏడుస్తూ, ఆయన పోయే దిక్కుని అక్కడినుండే చూస్తూ, తృప్తి లేక వుంటే, అదే సమయంలో శ్రీరాముడు సాయంకాల సూర్యుడిలాగా వారికి కనిపించకుండా మరుగునపడి పోయాడు.

శ్రీరామచంద్రుడిలా పోతూ....ధనధాన్యాలు పెద్ద రాసులున్న... ధానస్వభావంగల ప్రజల గౌరవం పొందుతున్న....అమిత సుందరమైన... దేనివల్లా భయం లేకుండా....మిక్కిలి రమ్యంగా...దట్టమైన దేవాలయాల సమూహంతో...గుజ్జు మామిడితోటలతో....అందమైన నీళ్లతో నిండి శ్రేష్ఠమైన మడుగులుండి.... దేహపుష్టితో, మనసుకు సంతోషం కలిగించే మనుష్యులతో నిండిన వూళ్లతో....ఆవులమందలతో....బ్రాహ్మణులు చదివే వేదమంత్రాలతో.... రాజులకు సహితం వినోదం కలిగించే పల్లెటూళ్లతో...శుభప్రదమైన కోసలదేశాన్ని చూశాడు. ఇలాంటి దేశాన్ని చూసి, మధ్యలో కనపడే ఉద్యాన వనాలను కూడా చూస్తూ, రాజోజ్యమైన రాజ్యాన్ని వదిలి ధీరుడైన శ్రీరాముడు ఆ స్థలంలో ప్రవహించే గంగానదిని చూశాడు.

గంగానదిని చూసిన శ్రీరాముడు

పెద్ద-పెద్ద అలలు గల, స్వచ్ఛమైన జలాలు గల, మహర్షుల సంబంధం గల, పుణ్యకార్యాలు చేసే ఆశ్రమాలు తన తీరంలో గల, స్నానం చేసే దేవతా స్త్రీలు గల, అందమైన పక్షిజాతులతో ప్రకాశించే అలలు గల, అక్కడక్కడా మడులు గల, మనుష్యులకు జనన-మరణ భయాన్ని పోగొట్టే సామర్థ్యం గల, అధిక శుభం ఇచ్చేదైన, గంగానదిని శ్రీరాముడు సంతోషంతో చూశాడు. ఆటలందాసక్తి కల దేవకన్యలు క్రీడించడానికి అవసరమైన తోటలతో, అందంగా, కన్నులకింపుగా వుందా గంగానది. రాళ్లపై నీళ్లు దూకడం వల్ల, అలలు

ఒకదానితో ఇంకొకటి కొట్టుకోవడం వల్ల కలిగిన ధ్వనిలాంటి పెద్ద నవ్వు, నురుగు లాంటి చిన్న నవ్వుతో కూడి, ఒక చోట వంకగా పారుతూ....ఒక చోట సుడిగా తిరుగుతూ..మరో చోట లోతుగా మెల్లగా పారుతూ...ఒకచోట మహావేగంగా పారుతూ... ఒక చోట గంభీర ధ్వని కలిగి....దేవతలు స్నానమాడే రేవులు కలిగి....దేవతలు ఉపయోగించే కమలాలు, నిర్మలమైన కలువలు కలిగి...వెడల్పైన ఇసుక దిబ్బలతో...తెల్ల ఇసుక కలిగి...బెగ్గురులు, హంసలు, చక్రవాకాల ధ్వనులతో గంగానది ప్రవహించడం చూశాడు శ్రీరాముడు.

గంగానదిని స్త్రీతో వర్ణించిన కవి ఇలా అంటాడు: నదీ తీరంలో పుట్టిన చాలు చెట్లు మెడలో ధరించిన తీగల్లంటి హారంలాగా, ఒకచోట కొత్తగా వికసించిన ఉత్పలముల (స్త్రీల పిరుదలమీద వుండే గుంతలను ఉత్పలమలు అని అంతారు) తో కప్పబడి, మరో చోట కుముదాల గుంపులతో ప్రకాశిస్తూ, ఒకచోట నానారకాల పుష్పాల సమూహాల పుప్పొడితో తెల్లటి రూపం నుండి ఎర్రగా మారి, యౌవన మదంలో వున్న స్త్రీలాగా, ఒకచోట నిర్మలమైన అద్దంలాగా నిగనిగా మెరుస్తూ, దిగ్గజాలు..అడవి ఏనుగులు...దేవతలెక్కి తిరిగే ఏనుగులు, ధ్వనిచేసే అడవులతో, మేలైన భూషణాలతో, రత్నాలతో, అలంకరించిబడిన మదించిన జవ్వనిలాగా గంగ, కళ్లకు, ఆనందం కలిగించింది. ప్రకాశించే పూలతో, పండ్లతో, జిగుళ్లతో, ఆవరించబడి, పక్షులతో అలరారే పొదలున్న గంగను, మొసళ్లు, నీటి కోతులు, పాములతో సేవించబడుతున్న గంగను, విష్ణుపాదం నుండి విడువబడిన గంగను, పాపం లేని గంగను, పర్లుఅ పాపం పోగొట్టె గంగను, శివిడి జటాజూటం నుండి రాలిన గంగను, సరస్సులలో వుండడానికి యోగ్యమైన క్రౌంచాల ధ్వనులతో మనోహరంగా, కన్నులపండుగగా వున్న గంగను చూసిన శ్రీరాముడు, దాని తీరంలో వున్న శృంగిబేర పురానికి వేగంగా పోవడానికి సిద్ధమయ్యాడు.

గంగాతీరాన్ని చేరిన శ్రీరాముడు

"నాట్యమాడే విధంగా, మనోహరంగా, కదలుతున్న అలలతో, శృంగారంగా, గంగానది అందంగా వుంది సారథీ! మనకిప్పుడిక్కడ వుండడానికి వీలుగా వుంది. కాబట్టి తగిన స్థలాన్ని చూసి రథాన్ని ఆపుచేయి. సమీపంలోనే

వికసించిన పూల గుంపులతో, చిగుళ్ల రాసులతో, అందంగా వున్న గార చెట్టు కనిపిస్తున్నది. రథాన్ని మెల్లగా పోనివ్వు. మనమక్కడే వుందాం. అక్కడ మనముంటే దేవతలు, దానవులు, మనుష్యులు, మృగాలు, సుందరమైన పక్షులు...వీటన్నితో ప్రకాశించే గంగానదిని బాగా చూడడానికి సాధ్యపడుతుంది". అని శ్రీరాముడంటాడు. లక్ష్మణుడు కూడా అంగీకరించిన తరువాత, ఆలశ్యం చేయకుండా, రాముడు చెప్పిన చోటికి సుమంత్రుడు గుర్రాలను తోలగానే, సీతారామలక్ష్మణులు అక్కడ దిగారు. ముగ్గురూ దిగిన తరువాత సుమంత్రుడు గుర్రాలను విప్పి, మేత వేసి, చెట్టునీడన వున్న శ్రీరాముడి దగ్గరకు పోయి చేతులు ముడిచి నిలుచున్నాడు.

ఆ సమయంలో శ్రీరాముడికి మంచి స్నేహితుడు, ప్రాణ సమానుడు, బోయ జాతిలో పుట్టినవాడు, గొప్ప సేనగల మహావీరుడు, బోయల నాయకుడు, గుహుడు, ఈ విధంగా శ్రీరాముడు చెట్టునీడలో నిలబడి వున్నాడని విని తక్షణమే ఉన్నవాడున్నట్లే చెప్పులు కూడా తొడుక్కోకుండా, రాజు వచ్చే విధంగా కాకుండా కుల పెద్దలు, హితులు, కార్యాలోచన చేసే మంత్రులు, బంధువులతో కలిసి నడచుకుంటూ శ్రీరాముడి దగ్గరకు వచ్చాడు. (తానెంత గొప్పవాడైనా, భగవత్ దర్శనానికి పొయేటప్పుడు, పాదరక్షలు-పావుకోళ్లు తొడుక్కొని పోరాదని, వాహనముల పోరాదని దీనర్థం).

శ్రీరాముడిని దర్శించిన గుహుడు

వస్తున్న గుహుడిని దూరం నుంచే గమనించిన శ్రీరాముడు, సంతోషంతో ఉప్పొంగి పోయాడు. లక్ష్మణ సమేతంగా ఎదురు బోయి కలుసుకున్నాడు. శ్రీరాముడి ముని వేషం చూసిన గుహుడు దుఃఖించాడు. ఆయనను గట్టిగా కౌగలించుకుని ఇలా అన్నాడు: "శ్రీరామచంద్రా! నీకు అయోధ్య ఎలాంటిదో ఇక్కడ కూడా అలాగే అని మనసులో భావించు. సుశీలా! నీ నేను ఏం చేయగలనో చెప్పు. నీ లాంటి మంచి ప్రియుడు, మనసుకు నచ్చిన అతిథి ఎవరికైనా ఎలా లభిస్తాడు? నాకు దొరికినందుకు నేనెన్ని పుణ్యాలు చేశానో?"

అని చెప్పి, నానా రకాలైన అన్నాలు, మంచి రుచిగల పానీయాలు, పూజా ద్రవ్యాలు, తీసుకొని వచ్చి సమర్పించి వినయంగా నమస్కారం చెసి మళ్లీ ఇలా

అన్నాడు గుహుడు. (దీన్నే నమస్కార రూపక శరణాగతి అంటారు. అంటే, వినయనత శిరస్కుడు కావడం అంటే, ప్రపత్తికంగమైన కార్పణ్యాన్ని చెప్పడం జరిగింది. శుష్క నమస్కారం కాకుండా శరణాగతి లక్షణంతో చెప్పాడు. శాస్త్రార్థంగా కొంచెం అన్నం, నీళ్లు సమర్పించుకోవడం కాకుండా తన సర్వస్వాన్ని శ్రీరాముడికి సమర్పించుకున్నాడు గుహుడు. దీన్నే ఆత్మ నిక్షేపం అంటారు). " దేవా! శ్రీరామచంద్రా! నీ రాక మేలగునుగాక! ఈ భూచక్రమంతా నీదే! నువ్వు అయోధ్యలో వున్నట్లే ఇక్కడా వుండవచ్చు. మేమందరం నీ కింకరులమే కాబట్టి నీవు సేవకులు లేరని సందేహించవద్దు. నిర్మలాత్మా...మమ్మల్ని ధన్యులను చేయి, మాకేదైనా పని ఇచ్చి చేయించుకో. నాయనా! రామచంద్రా! ఇగో బక్ష్యాలు...ఇగో భోజ్యాలు...ఇగో లేహ్యాలు...ఇగో పానీయాలు...నువ్వు పండుకోవడానికి పాన్పులిగో...నీకు సపర్యలు చేయడానికి భాగ్యం కలిగిన గుర్రాలకు మేత ఇదిగో...వీటిలో నీకేం కావాల్నో అవ్వన్నీ నా మీద దయతో, నన్ను కృతార్థుడిని చేయడానికి తీసుకో".

నిర్మలమైన భక్తితో గుహుడు చెప్పిన మాటలు విన్నాడు శ్రీరాముడు. విని ఇలా అన్నాడు: "మిత్రమా! నీ సేవలన్నీ గ్రహించాను. నువ్వు కాలి నడకన రావడం, స్నేహ వాక్యాలు పలకడం, నాకు సంతోషాన్నిచ్చాయి. నీ సేవలో ఏ లోపం లేదు" అంటూ గుహుడిని తన రెండు చేతులతో గట్టిగా కౌగలిమ్చుకున్నాడు శ్రీరాముడు. (ఆహా! ఏమి గుహుడి పూర్వ జన్మ సంస్కారం!! అంత కష్ట పడిన ఆంజనేయుడికి కూడా లభించని రాముడి కౌగిలి ఏ శ్రామా లేకుండా గుహుడికి దొరికింది కదా!). ఆముడింకా ఇలా అన్నాడు: "మిత్రుడా! బంధువులతో కలిసి ఆరోగ్యంతో వున్న నిన్ను నా భాగ్యవశాన ఇప్పుడు చూదగలిగాను. మన హితులందరూ బాగున్నారా? ధనం, రాష్ట్రం కుశలమే కదా? మిత్రమా! నా కోసం నువ్వు సమస్థ పదార్థాలను కేవలం స్నేహం కోసమే ఏర్పాటు చేశావని తెలుసు. నా మీద నీకున్న స్నేహ భావానికి చాలా సంతోషం. కాని నేనొక్క మాట చెప్తాను. రాముడింత కఠినుడా అని అనుకోవద్దు. అదేంటంటే...నువ్వు తీసుకొచ్చిన పదార్థాలలో ఒక్కటి కూడా నేను తీసుకోవడం సరైంది కాదు. సర్వ సుఖాలను వదలి అడవుల్లో కందమూలాలు తింటూ వుండాల్సిన నాకు పరుపులు, దిండ్లు ఎందుకు? భక్ష్య భోజ్యాలెందుకు? నువ్వే

చెప్పు. అలా చేయవచ్చా? భక్తిమంతుడా! నాకు కావాల్సింది నా గుర్రాలకు గడ్డి మాత్రమే! అది నువ్వు తెచ్చావు. దానిని ఇవ్వడమంటేనే నువ్వు నన్ను వెయ్యి విధాల పూజించినట్లు అనుకుంటా. (తనను పూజించడం కంటే తన ఆశ్రితులను పూజించడం సంతోషకరమైందని అనుకోవాలిక్కడ. తనను ఆరాధించే బదులు తన భక్తులను ఆరాధించడం అంటే భగవంతుడికి ఎక్కువ సంతోషం ఇస్తుంది). స్నేహితుడా! ఈ గుర్రాలు దశరథ రాజువి. నువ్వు ఈ గుర్రాలను తృప్తి చేయడమంటే నన్ను సంతోషింప చేసినట్లే.

ఈ విధంగా శ్రీరాముడు చెప్పగా గుహుడు గుర్రాలకు నీళ్లు, మేత తెచ్చి వేసి, వాటిని రాత్రి సమయంలో జాగ్రత్తగా చూస్తుండమని తన వాళ్లకు చెప్పాడు. ఆ తరువాత లక్ష్మణుడు గంగానది తీర్థాన్ని తీసుకునివచ్చాడు. శ్రీరాముడు సంధ్య వార్చి, సీతతో కలిసి వాటిని తాగి, హాయిగా నేలమీద నిద్రపోయాడు. తదనంతరం, లక్ష్మణుడు వింట బాణం సంధించి, సీతారాముల చుట్టూ ప్రదక్షిణం చేస్తూ వాళ్లకు కాపలాగా వున్నాడు. గుహుడు కూడా అలాగే విల్లెక్కిపెట్టి లక్ష్మణుడి వెంట వెనుకపక్కగా తిరగ సాగాడు. ఎందుకంటే...ఒక సవతి కొడుకు వల్ల శ్రీరాముడికి ఇంత విపత్తు కలిగింది...ఈ సవతి తల్లి కొడుకేం చేస్తాడో అని భావించి, ఏ కొంచెం అనుమానం కలిగినా అతడిపైన బాణం వేయడానికి సిద్ధంగా వున్నాడు గుహుడు. ఇది పౌరాణిక చమత్కార కల్పన కూడా కావచ్చు. లేదా, గుహుడి భక్తి అతిసయాన్ని చెప్పడానికి కూడా కావచ్చు. వాస్తవానికి ఇప్పుడు గుహుడి కాపలాగా వున్నా, మిగిలిన పద్నాలుగేళ్లు ఎవరు శ్రీరాముడికి కాపలాగా వున్నారు?

అన్న పాదాలు కడిగి తడి ఎత్తిపోసి చెట్టుకింద లక్ష్మణుడు వుండగా సుమంత్రుడితో సహా గుహుడు శ్రీరాముడు గుణాలను ప్రశంసించుతూ, రెప్పవాల్చకుండా విల్లెక్కుపెట్టి, నిద్రపోకుండా శ్రీరామచంద్రుడిని రాత్రంతా రక్షిస్తూనే వున్నాడు. బుద్ధిమంతుడు, కీర్తిమంతుడు, కృపాణభూషణుడు, మహాత్ముడు, కష్టమెరుగనివాడు అయిన రాజకుమారుడు ఆ భూమ్మీద పండుకుని వుంటే మెల్లగా రాత్రి గడిచిపోయింది.

❖ ❖ ❖

సర్గ-51

అన్న అయిన శ్రీరాముడికొరకు వంచన లేని దుఃఖం కలవాడై, వంచన లేక మేల్కొని వుండి, సాధువులతో పొగడబడిన, నడవడిగల లక్ష్మణుడిని చూసి గుహుడు "అన్నా! లక్ష్మణా! నీకొరకు పరుపు ఏర్పాటు చేసాను. దానిమీద సుఖంగా నిద్రపో, బడలిక తీరుతుంది. నువ్వెందుకిలా మేల్కొని వుండాలి? పూజ్యుడవైన రాజకుమారా! నువ్వు సుకుమారుడవు. ఇక్కడ వుండేవారు అడవుల్లో తిరగడానికి అలవాటుపడిన కఠిన దేహం కలవారు. కాబట్టి శ్రీరాముడిని రాత్రంతా జాగ్రత్తగా కాపలా కాస్తాం. నువ్వు సుఖంగా నిద్ర పో. శ్రీరాముడికే భయం లేదు. శ్రీరాముడి కొరకు నీకెందుకుంత శ్రమ అంటావేమో? నన్ను పండుకొమ్మంటావా? విను...శ్రీరాముడికంటె ఎక్కువ ప్రీతిపాత్రుడు నాకెవ్వరూ లేరు. ఆయన మీద నాకంత అనన్య భక్తి వుంది. ఇది అపోహ కాదు. సత్యం మీద ప్రమాణం చేసి చెపుతున్నాను. ఈ మహానుభావుడి దయవల్లే కదా, గొప్ప కీర్తి, అసమానమైన గొప్ప ప్రయోజనం, విస్తారమైన ధర్మ ఫలం లభిస్తుంది. అలాంటి వాడిని ఉపేక్షిస్తానా? భార్యాసమేతంగా నిద్రించే నా ప్రియ స్నేహితుడిని, నేను, నా బంధువులు, ఎక్కుపెట్టిన విల్లులతో, నాలుగు పక్కలా మిక్కిలి హెచ్చరికతో, చతురంగ బలాలతో, ఎవ్వరు ఎదిరించినా నిద్రాభంగం కలగకుండా రక్షిస్తాను. ఈ అరణ్యంలో నాకు తెలియకుండా ఎవరూ రాలేరు. లక్ష్మణా! వీళ్లు కాపలా వుండగలరో, లేరో అని సందేహించవద్దు".

ఇలా అన్న గుహుడితో లక్ష్మణుడిలా అన్నాడు: "మిత్రమా! నేను నిద్రపోకుండా వుండడానికి కారణం, సీతారాములకు ఏదో అపాయం కలుగుతుందన్న భయం కాదు. నువ్వు రక్షించలేవోనన్న సందేహం కూడా కాదు. ఎందుకంటే...నువ్వు భయంతో చేయాల్సివచ్చిందికదా అని చేసేవాడివి కాదు. భక్తుడి ధర్మానికి అనుగుణంగా శ్రద్ధగా, అన్ని విధాలా నువ్వు రక్షిస్తూ వున్నావు. రక్షించగలవు కూడా. కాని కమలాల వంటి నేత్రాలు కల శ్రీరాముడు, అలాంటిదే అయిన సీత, వుత్త నేల మీద మీద ఎలాంటి అసరా లేకుండా నిద్రపోతుంటే, సుఖ నిద్ర ఏమోకాని నేను కన్ను మూసేందుకైనా సాధ్యమా?

నేను నిద్రపోదామని ప్రయత్నించినా రెప్పలు మూతపడునా? అసాధ్య కార్యం నేనెలా చేస్తాను? చేయగలను?"

శ్రీరామ వనవాస వృత్తాంత దుఃఖం గురించి గుహుడికి చెప్పిన లక్ష్మణుడు

"ప్రియ మిత్రమా! దేవదానవ సంఘాలైనా విరోధిస్తే, అవలీలగా తరిమిగొట్టగల మహా సమర్థుడు, తాను తన భార్యతో గడ్డి పడకమీద పండుకుంటే నాకెలా నిద్ర వస్తుంది? బతుకెలా సుఖంగా వుంటుంది? భోగాలు మనసు దరిచేరుతాయా? ఉపవాసాల్లాంటి వ్రతాలు చేసి, యాగాలు చేసి, లేకలేక నీ లాంటి ఒక్క కొడుకును, అమిత పరాక్రమవంతుడిని, కని, అడవులపాలుచేసిన దశరథుడు, దుఃఖంతో దీనంగా వుండడంవల్ల, చాలాకాలం భూమ్మీద బతకడం అసత్యం కాబట్టి భూమి దిక్కులేనిదై త్వరలోనే చెడిపోతుంది. నామాట సత్యమవుతుంది చూడు. హా..అంటూ స్త్రీలందరూ ఏడ్చి, అలసిపోయి, మూర్ఛ పోయి భూమ్మీద పడిపోతే ఏడుపు ధ్వని కూడా లేకుండా రాజగృహం పాడుపడ్డట్లు ధ్వని లేకుండా అవుతుంది కదా! శత్రుఘ్నుని మీద ప్రేమతో అతడైనా వున్నాడు కదా అని ఆ తల్లి సుమిత్రాదేవి బతుకుతే బతుకుతుందేమోకాని, వీళ్లను కన్న తల్లి, ప్రసిద్ధికన్న కౌసల్యాదేవి ఒక్కక్షణమైనా జీవించదని దుఃఖిస్తాను".

"అనురాగం కల ప్రజలతో నిండిన పట్టణమది. పుణ్యాత్ములైన ప్రజల సుఖమైన చూపులకు సంతోషం కలిగించే పట్టణమైన ఈ నగరం రాజు మరణించిన కారణంగా, వ్యసనపడి కలత చెందడం సత్యం. రాజు మరణాన్ని గురించి ఇంత నమ్మకంగా, నిశ్చయంగా చెప్తున్నావే...అదెలా తెలుసంటావేమో? విను...జ్యేష్ఠ కుమారుడు, ప్రజలందరితో శ్లాఘించబడిన నడవడికలవాడు, నీతిగుణ సంపద కలవాడు, సుకుమారత్వానికి స్థానమైన వాడు, అయిన శ్రీరాముడిని చూడకుండా రాజెలా జీవించగలడు? కాబట్టి ఆయన చనిపోవుట ఖాయం. నిరపరాధిని నిష్కారణంగా పెద్దకొడుకుని అడవుల పాలు చేసిన వాడు పుత్రశోకంతో, పాపబలంతో, చావకుండా బతికితే అంత పాపాత్ముడు,

అంత కఠినచిత్తుడు మరొకడుండడు. రాజు మరణం చూసి పతివ్రతైన కౌసల్య త్వరగానే చనిపోతుంది. కౌసల్య మరణించగానే నా తల్లి పతిలోకమే తనదని ప్రాణం విడుస్తుంది. సర్వం మించిపోయింది. ఇప్పుడు చేసేందేమీ లేదు. ఏం మించిందటావా? రాజు శ్రీరాముడిని రాజుగా చేద్దామనుకున్నాడు. అలా చేయడానికి ముందే చచ్చిపోతాడు. రాజు మరణించే సమయంలో భరతశత్రుఘ్నులు దగ్గరే వుండి కొడుకులు చేయాల్సిన ఊర్ధ్వలోక కర్మలు తీర్చి కృతార్థులవుతారు. మాకా భాగ్యం లేదు".

"అయ్యో! తండ్రికి ఊర్ధ్వలోక ప్రక్రియలు తీర్చి భరత శత్రుఘ్నులు అందమైన ముంగిళ్లతో; మనోహరమైన బాటలతో; ప్రాసాదాలు, హర్మ్యాలు లాంటి ఇళ్లతో; ఉత్తమ వేశ్యలతో; రథాలు, ఏనుగులు, గుర్రలతో; శ్రావ్యమైన నృత్య, గీత వాద్యాల ధ్వనులతో; సంతోషంతో పుష్టిగల ప్రజలతో; అన్ని విధాలైన శు భకార్యాలతో సంపూర్ణంగా కూడి వుండడంతో; ఇళ్లకు చేరిన తోటల గుంపులతో; ఎల్లప్పుడూ జరిగే గొప్ప సభల ఉత్సవాలతో; వాటితో వచ్చే కాంతితో; నా తండ్రి ఏలే రాజధానిలో సంతోషంగా తిరుగాడుతారు. మేం అరణ్యావాసం నుండి తిరిగొచ్చేవరకు దశరథుడు జీవించి వుంటే, ఆ వనవాసం ముగించి ప్రతిజ్ఞ తీర్చుకుని, ఆ తరువాత అయోధ్య చూడగలమా? తండ్రి పాదకమలాలను దర్శించగలమా? మా ప్రతిజ్ఞ తీరినప్పటికీ, అయోధ్యలో తండ్రి జీవించి వుండకపోతే, మాకక్కడ ఏం పని? అక్కడికి పోవాల్సిన అవసరం ఏముంది" అని అంటుండగానే రాత్రి గడిచిపోయింది. అన్న, తండ్రి మీద వున్న భక్తి భావంతో, స్నేహభావంతో లక్ష్మణుడు అమితంగా దుఃఖిస్తూ పరితాప పడుతుంటే, ఇలాంటివారికిలాంటి కష్టదశ వచిందికదా అని గుహుడు కన్నీరు కార్చాడు.

❖ ❖ ❖

సర్గ-52

గంగ దాటేందుకు ప్రయత్నించిన శ్రీరాముడు

దేహకష్టం, మనోవ్యధలతో పీడించబడినప్పటికీ, ముఖ వర్చస్సు మారని శ్రీరాముడు, అంతే వున్న తమ్ముడు లక్ష్మణుడితో రాత్రి క్రమంగా గడిచిపోయిందని అంటాడు. "సూర్యోద్యం కావచ్చింది. కోకిలలు, నెమళ్లు, ఇతర రకాలైన పక్షులుతమ అవ్యక్త మనోహర ధ్వనులతో లోకులందరినీ నిద్ర లేపుతున్నాయి. వేగంగా పారుతున్న గంగానదిని దాటిదామా?" అని లక్ష్మణుడిని అడిగాడు. శ్రీరాముడావిధంగా చెప్పగానే, లక్ష్మణుడు, గుహుడిని, సుమంత్రుడిని చూసి "ఈ పుణ్యాత్ముడి ఆజ్ఞ మీరు విన్నారుగా? కావల్సిన అకర్యం కానిండి" అనగా గుహుడు తన మంత్రులను పిలిచాడు. వాళ్లందరినీ శీఘ్రంగా తెడ్లు, కట్టెలు, ఇతర రకాలైన ఓడ నడిపే సామానులను, రంగురంగుల ఓడను, ఓడ నడిపేవారిని సిద్ధంగా వుంచమని అంటాడు.

గుహుడిలా చెప్పగానే వారందరూ అలానే చేసారు. చేసామని ప్రభువైన గుహుడికి చెప్పరు సేవకులు. గుహుడా విషయాన్ని శ్రీరాముడికి తెలియచేయడానికి వినయంగా నమ్స్కారం చేస్తూ ఇలా అన్నాడు: "దేవా! నావ సిద్ధమైంది. ఆ తరువాత ఏం చేయమంటావో తెలియచేయి. ఇక గంగా దాటవచ్చు" అనగానే శ్రీరాముడు సంతోషించి గుహుడితో ఇలా అన్నాడు: "నా మేలు కోరే స్నేహితుడా! నా కోరిక నెరవేరింది. గంప, గడ్డపార, చీరలు మొదలైన వస్తువులను ఓడపైకి ఎక్కించండి" అనగానే అతడలానే చేసాడు. శ్రీరామలక్ష్మణులు కత్తులు, అమ్ములపొదులు, విల్లు ధరించారు. సీతాదేవి సహితంగా శ్రీరామలక్ష్మణులు గంగ సమీపంలోకి పోతుంటే చూసిన సుమంత్రుడు తనకేమి ఆజ్ఞ అని ప్రేమతో అడిగాడు రాముడిని. రాముడప్పుడు ఆతనిని ప్రేమగా చూస్తూ, తన కుడి చేతిని అతడి భుజంపై వేసి మనసరా ఇలా అన్నాడు: "సుమంత్రా! ఇక నువ్వు త్వరగా రాజు దగ్గరకు పో. హెచ్చరికగా వుండు. మేమ్ రథం వదిలి అడవికి నడచుకుంటూ పోతాం. నేను ఆయన్ను విడిచి పోయానన్న దుఃఖంతో వున్న నా తండ్రిని మునపుటికంటె స్థిరమైన

భక్తితో సేవించు. ఇంత దాకా ప్రేమగా మాతో రథం మీద వచ్చి మాకెంతో ఉపకారం చేశావు. చాలా సంతోషం. ఇక ఆలస్యం చేయకుండా అయోధ్యకు పో".

తనను కూడా అరణ్యానికి తీసుకుపొమ్మని శ్రీరాముడిని అడిగిన సుమంత్రుడు

అని శ్రీరాముడు చెప్పగా సుమంత్రుడు విని ఇలా అన్నాడు: "రామచంద్రా! నువ్వు అరణ్యాలకు పోవడానికి అంగీకరించినవాడు లోకంలో ఒక్కడైనా లేడుకదా? అలా అయినప్పటికీ, నువ్వు అరణ్యానికి పోవలసి రావడం అంటే, బ్రహ్మచర్య వ్రతం, మెత్తని తనం, వంచన లేని వేదాధ్యయనం లాంటివన్నీ శ్రమకొరకు సాధించాల్సినవే కాని వాటివల్ల ప్రయోజనం లేదని అనిపిస్తున్నది. సామాన్య క్షుద్రజంతువల లాగా నువ్వు, నీకంటే చిన్నవాడైన తమ్ముడు లక్ష్మణుడు, చిన్నది ఆడుపిల్ల నీ భార్య, ఈ విధంగా దుఃఖంతో కలతచెందడం చూసి విచారపడకుండా కాలం గడిపేవాడు లోకంలో ఎవరైనా వుంటారా? తమ్ముడు, భార్య సేవిస్తుంటే, నువ్వు దండకారణ్యంలో నివసించి ముల్లోకాలు గెలిచినంత కీర్తిని సంపాదిస్తావు. మహాత్మా! నీకు ఏ లోటూ లేదు కాని, పాపాత్మురాలైన కైక చేసిన మోసం చాలక, ఇంకా శ్రీరాముడు రాజవుతాడని, ఇంతకంటే బాహా సుఖపడుతామని, కొండంతా ఆశతో నీ ప్రభుత్వం కొరకు ఎదురుచూస్తున్న మమ్మల్నందరినీ నిమిషంలో మోసం చేసి, మా ఆశ వ్యర్థం చేసి ఇటు వచ్చావు కదా? ఇక అయోధ్యకు ఎలా పోతాను? ఒక వేళ పోయినా, చెడుమనసున్న, పాపాలకు లోబడ్డ, కైక పాలనలో ఎలా జీవించగలను? ఈ విధంగా చెప్పాడు సుమంత్రుడు. చెబుతూ... ప్రాణంతో సమానమైన, ప్రియమైన, విడువరానివాడైన, ఆ మహాత్ముడిని ఉద్దేశిమ్చి గట్టిగా హా! అంటూ, కన్నీరు కారుతుంటే, కొంతసేపటికి ప్రయత్నంతో నిబ్బరించుకున్నాడు. కళ్ళు కడుక్కున్నాడు. నిర్దోషి అయిన తన భక్తుడైన సుమంత్రుడిని చూసి, శ్రీరామచంద్రుడు ప్రేమతో, స్నేహాతిశయంతో ఇలా అన్నాడు.

సుమంత్రుడిని సమాధానపర్చిన శ్రీరాముడు

"అయ్యా! నీలాంటి కడు స్నేహశీలి, రఘువంశ రాజులకు ఎప్పుడైనా దొరుకుతాడా? కాబట్టి, మా మేలు గల మనసున్నవాడవైనందున, మా తండ్రి ఎలా బాధపడకుండా వుందాలో ఆ ఉపాయం చేయడానికి నీవే తగినవాడివి. ఏమి! శ్రీరామచంద్రా! నీ తండ్రి ప్రభువు...ఆయన మమ్మల్ని కాపాడాలా? మేము ఆయన్ను కాపాడాలా? అని అంటావేమో? ఇది విపరీతం కాదు. ఆయన విషయంలో నీకింతగా చెప్పాల్సిన కారణం చెప్తా విను. ఆయన ముసలివాడు, చపలచిత్తుడు కావడం అనే ఒక్క కారణం చాలు. దానికి తోడు నన్ను విడనాడిన దుఃఖంతో బాధ పడుతున్నాడు. కామాతిశయంతో స్వాధీనం తప్పిన మనసు కలవాడాయాన. ఇలాంటి వాడి స్థితి ఎంత పరాధీనమో నువ్వే ఆలోచన చేయి. ఆ కారణం వల్ల, కైక సంతోషం కొరకు రాజు నీకు ఏ పని అప్పచెప్పినా, నిరాకరించకుండా ప్రీతిగా చేసిపెట్టు. రాజులు రాజ్య పాలనయందు ఆసక్తి చూపడానికి కారణం ఇదే కదా! ఏ పనిలోనైనా, అది అల్పమైనా, గొప్పదైనా, తప్పైనా, ఒప్పైనా, న్యాయంగానైనా ...అన్యాయంగానైనా, తాము పట్టిన పట్టే సాధించాలనుకుంటారు. ఏ విధంగానైనా అతడికి అప్రియం, పరితాపం కలగకుండా వుండేట్లు, హెచ్చరికగా నువ్వు ప్రవర్తించాలి పుణ్యశీలా! నిన్ను నేను కోరేది అదే! ఆ రాజు బాగా ముసలివాడు....సాధు వర్తనం కలవాడు. ఇంతవరకు దుఃఖమంటే తెలియని వాడు. జితేంద్రియుడు. ఆతనికి నువ్వు నా ప్రతినిధిగా సాష్టాంగ నమస్కారాలు తెలియచేయి".

"సాష్టాంగ నమస్కారం చేసి, రాజుతో నా మాటలుగా ఇలా చెప్పు: 'అయోధ్య విడవాల్సి వచ్చె కదా! వనవాసం చేయాల్సి వచ్చె కదా! కష్టపడాల్సి వచ్చె కదా! అని నేను ఆలోచించడం లేదు. లక్ష్మణుడు దుఃఖ పడడం లేదు. సీత కూడా బాధ పడడం లేదు. రాజా ఇది నిజం. పద్నాలుగేళ్లు అడవుల్లో తిరిగి త్వరగా రాగా నన్ను లక్ష్మణుడిని, సీతను మళ్లా చూడొచ్చు' అని నామాటలుగా చెప్పు. నా తండ్రిని, కౌసల్యను, కైకకు, ఇతర తల్లులకు నేను వారిని కుశలం అడిగినానని మరీ-మరీ చెప్పు. కౌసల్య, కైకల కుశలమడిగిన తరువాత, నేను సీతా లక్ష్మణ సమేతంగా కౌసల్య కుశలం మళ్లీ అడిగామని,

ఆమె పాదాలపై పడి మొక్కామని గట్టిగా నొక్కొ చెప్పు. కైక కొడుకు భరతుడిని త్వరగా పిలిపించి ఆయన అభిప్రాయం ప్రకారమే యౌవ రాజ్యమివ్వమని చెప్పు. వాడిని కౌగలించుకుని రాజ్యమిస్తే నన్ను విడిపోయినందువల్ల కలిగిన దుఃఖం పోతుంది. ఈ విధంగా నా తండ్రి సంతోషించే విధంగా నా మీద ప్రేమ వుంచి చెప్పు. భరతుడు అయోధ్యకు వచ్చిన తరువాత నేను చెప్పానని ఈ మాటలు అతడికి చెప్పు. తండ్రి మీద ఏ న్యాయంతో ప్రవర్తిస్తావో తల్లుల విశయంలో కూడా అదే విధంగా వుండమని చెప్పు. నీ కన్న తల్లికంటే ఎక్కువగా సుమిత్రాదేవిని చూసుకొమ్మని చెప్పు. నీతి మార్గంలో నా తల్లి కౌసల్యను విశేషంగా ప్రేమించమని చెప్పు. తండ్రి చెప్పిన విధంగా రాజ్యభారం మోసుకుంటూ ఇరు లోకంలో వుండేవారిని సుఖపడేట్లు చెయ్యమను. న్యాయ మార్గంలో రాజ్యం పాలించమని చెప్పు."

శ్రీరాముడిని వదిలి పోలేక పరితపించిన సుమంత్రుడు

శ్రీరాముడి మాటలను విన్న సుమంత్రుడు దుఃఖపడుతూ ఇలా అన్నాడు: "దేవా! నేను చెప్పబోయేది గౌరవార్థం చెప్పే మాట కాదు. భయంలేకుండా స్నేహభావంతో చెప్తున్నాను. నువ్వు నా మీద స్నేహం వుంచి, వీడు మన భక్తుడే కాదా అని నా తప్పు క్షమించు. నువ్వు దయావంతుడవు కాబట్టి నా మనవి అంగీకరించు. పుత్ర శోకంతో విలవిల్లాడుతున్న స్త్రీలాగా నిన్ను వదలలేక దుఃఖం వస్తుంటే, తత్తరపాటుతో వున్న ఆ అయోధ్యకు నిన్నిక్కడ విడిచి నేనెలా పోగలను? పోతే…నాగతేంటి నాయనా? మొదట్లో, మనం వెళ్లేటప్పుడు శ్రీరాముడి రథం చూసిన ప్రజలు, అయోధ్య, నేడు శ్రీరాముడు లేని రథాన్ని చూడగానే, వెలవెలబోయి, చూడలేక ఎడమొగం పెడమొగం పెట్టి, సహించలేని దుఃఖంతో మునిగిపోతారు కదా! నువ్వు లేకుండా నేను రథాన్ని తోలుకుని పోతుంటే, అయొధ్యాపురవాసులందరూ, శత్రువుల చేతిలో వీరులందరూ చావగా, సారథి మాత్రం మిగిలిపోయినట్లున్న సేనాసమూహాన్ని చూసినట్లు, దుఃఖాతిశయంతో బాధపడడం జరగదా? కమలాక్షా! దూరదేశవాసివైన నిన్ను తలచుకొని, పురజనులందరూ, ప్రేమతో నిన్నే మనసులో వుంచుకుని, తిండీ బట్టా వదలి, విశేష ధ్యానమార్గంలో తమకు నువ్వే సర్వ జగద్రక్షకుడవని

భావించి, నీ దివ్య మంగళ విగ్రహాన్నే కళ్లకు కట్టినట్లు చూస్తూ వుండిపోతారు రామచంద్రా! శ్లాఘ్య చరిత్రా! నువ్వు అరణ్యానికి బయల్దేరేటప్పుడు గుండెలు చెదిరి ప్రజలు ఏడ్చిన ఏడ్పు నువ్వే కన్నార చూశావుకదా? నేను నిన్ను పిలుచుకుని తిరిగొస్తానేమోనని ఆశతో వున్న పురజనులు, నువ్వు లేని ఖాళీ రథాన్ని నేనొక్కడినే తోలుకుని రాగా, నువ్విక రావేమోనని, నీ ఆశమాని, ఇంతకంటే ఎక్కువగా ఏడుస్తారు. నాలాంటి వాడు అది చూసి సహించగలడా?"

"అయ్యో! నేను మళ్లీ అయోధ్య పోగానే, మీ తల్లిని చూడక తప్పదుకదా? చూడగానే...'సుమంత్రా! నా చిన్ని కుమారుడు శ్రీరామచంద్రు డేమయ్యాడయ్యా?' అని తప్పక అడుగుతుంది కదా? అడిగిన ఆమెకు నేనేమని జవాబివ్వాలి? అమ్మా! మేనమామ ఇంట్లో విడిచి వచ్చానని, నువ్వు ఏడ్వ వద్దనీ చెప్పమంటావా? అసత్యం ఆడకూడదని తెల్సి కూడా అసహ్యించుకోకుండా ఎలా అబద్ధం చెప్పమంటావు? అసత్యం ఎందుకు చెప్పాలి? వున్నది వున్నట్లె చెప్పొచ్చుకదా? అంటే....నరక బాధ లాంటి సత్యాన్ని నేనెలా చెప్పాలి? ఇవన్నీ అయోధ్యకు పోతే జరిగే మాట. ముందు అయోధ్యకు పోయేదెలా? నిన్ను, సీతాదేవిని మోసుకొచ్చిన గుర్రాలు, నువ్వు లేకుండా నేను అదలించినా, మరలించినా, కొట్టినా, అవి అయోధ్యవైపు పోతాయా? నువ్వెంతో సౌమ్యుడవు కదా? రామచంద్రా...ఇంతమందిని ఇంత కఠినంగా బాధిస్తున్నావెందుకు? శ్రీరామచంద్రా! నువ్వు లేకుండా అయోధ్యకు పోవడం నాకు సాధ్యపడదు. ఎందుకంటే....ఇంతకు ముందు చెప్పిన కారణాలే కాకుండా మరో ముఖ్య కారణముంది. నువ్వు నాకు ఆరాధించదగిన దేవుడివి. ఆరాధించువారొకచోట, ఆరాధింపబడె దైవం మరో చోట వుంటే ఆరాధకుడేం చేయగలడు? నువ్వు నాతో రాకపోతే, ఆరాధకుడనైన నన్ను నీవద్దనే వుంచుకో. నన్ను నీతో రావడానికి అనుజ్ఞ ఇవ్వు".

"నేను నీతో వచ్చుటకు కాదు...నీవు నాతో అరకూడదని దయ లేకుండా నా ప్రార్థన వృథా చేస్తే నీ అనుగ్రహానికి నోచుకోని ఈ దేహం వ్యర్థ కాబట్టి, నిన్నారాధించడానికి సాధనమైన ఈ రథంతో సహా నేను మండే మంటను నా దేహాన్ని నీకు ప్రీతిగా ఆహుతి చేస్తాను. ఇది నిజం సుమా! అయ్యా...నువ్వు

నాతో వచ్చి నాకేం సేవ చేస్తావంటావేమో? నా కైంకర్య విధం చెప్తా విను. అడవిలో నువ్వు చేసే తపస్సుకు క్రూర జంతువులు, పులులు మొదలైనవి విఘ్నాలు చేస్తాయి. అలాంతి వాటిని రథమెక్కి నిశ్శేశంగా చంపుతాను. ఇది సరైన సేవ అవునో? కాదో? ఆలోచించు. నువ్వు కోమలగాత్రుడవు. ఎప్పుడూ నడచుకుంటూ తిరిగినవాడివి కాదు. ఇలాంటి నీకు కష్టం కలగకుండా, నీకు సారథినై, సుఖించే అదృష్టం నేను అయోధ్యకు పోతే రాదు. నీకు పట్టాభిషేకం ఐతే నీరథం నడిపి కడదేరుదామనుకున్నాను. అది లభించలేదు. మరేవిధమైన సుఖం కోరెదనందువా? ఈ భయంకరారణ్యంలో నీతో వస్తే సుఖపడతాను. కాబట్టి నా సుఖం కొరకైనా, తండ్రీ, నీకు నామీద దయ వుంటే, నన్ను కాదనవద్దు. నిండు మనస్సుతో ఈ భయంకరారణ్యాలలో నీ దగ్గర వుండాలని ఆశ కలుగుతోంది. నేను కోరినట్లే రమ్మనమని ఒక్క మాట అను కమలాక్షా! నేను కోరేది అంతే. నేనడిగిన ఒక్కమాట నువ్వు అంగీకరిస్తే, బాగుపడేవాడిని నేనొక్కడినే కాదు. నీ సేవచేసి ఈ గుర్రాలు ముక్తికిపోతాయి. మిట్టపల్లాలలో ఈ గుర్రాలు నిన్ను మోసి, నీకు శ్రమలేకుండా చేసి, పరమపదానికి పోతాయి. వారి వారి శక్తికొలది భక్తితో ఎవరెలాంటి సేవచేసినా నువ్వు అనుగ్రహిస్తావు కదా? నిన్ను వదలిపోలేక, నీ పరిచర్య చేసుకుంటూ, దండకారణ్యంలో నీతోనే తిరుగుతాను. అంతటి నీ సేవాభాగ్యమే కలుగుతే నాకింక అయోధ్య ఎందుకు? స్వర్గం ఎందుకు? నీ సేవ తుచ్ఛమైన ఐహిక స్వర్గ కైవల్య ఫలం కంటే ఎక్కువైన మోక్షఫలాన్నే ఇస్తుంది”.

“పాపాత్ములు స్వర్గంలోకి ప్రవేశించడానికి సాధ్యపడని విధంగా, నీ ఆశ్రమాన్ని వదిలి, ఒంటిగా పోయి అయోధ్యా నగరంలోకి ఎలా ప్రవేశించగలను? ఎంతో ఘోర పాపం చేసాను కాబట్టే నీతో వుండడం సాధ్యపడడం లేదేమో? రామచంద్రా! ఒక్క ఆలోచన వచ్చింది. దాని ఆశ చేత హృదయం అదెప్పుడు నెరవేరునా అని కొట్టుకుంటున్నది. అదేంటంటావా? విను. నువ్వు పద్నాలుగు సంవత్సరాలు ఈ రథమందే కూర్చుండబెట్టుకుని, దానికీ గుర్రాలనే కట్టి, నేనే సారథినై, భూమి గడగడలాడుతుంటే, బద్దలైపోతుంటే, మిమ్ముల్ని అయోధ్యకు తీసుకునిపోవాలి. ఇది నా ఆశ. దీన్ని తీర్చాలి.

రామచంద్రా! నీ సాంగత్యం వల్ల వనవాసం మొత్తం పద్నాలుగేళ్లు ఒక్క నిమిషంలోనే అయిపోతుంది. నిన్ను విడిచిన త్రుటికాలమే కల్పమై ఆయాసాన్ని కలిగిస్తుంది. రామచంద్రా! నీ భక్తుడిని...నీ సేవకుడిని...నీ మీద అనురాగం వున్నవాడిని. నా ప్రభువు కుమారుడి పాద సేవ చేయాలనుకునే వాడిని. సేవ చేసేందుకు కావాల్సిన దేహ ధృఢ శక్తి వున్నవాడిని. నీ సేవకు అన్ని విధాలా యోగ్యుడను. నువ్వేమో భక్తులను రక్షించే ఆచారం కలవాడివి. ఇలాంటి నీవు నన్ను వదలవచ్చా?". (దీని వల్ల భక్తుడు, భృత్యుడు, సమరక్తుడు, అయిన ఆశ్రితుడిని నిష్కారణంగా విడువరాదని సూచించబడింది. భక్తుడిని, సేవించేవాడిని, నీవాడనేవాడిని, కష్టకాలంలో కూడా విడువకూడదని సూర్యుడితో జమదగ్ని చెప్పాడు. భక్తుడై సేవ చేయువాడిని, దుర్గుణాలు లేనివాడిని, విడిచిన వాడికి ఈ లోకంలో పరలోకంలో సుఖం లేదంటారు. అలాటివారికి స్త్రీ హత్య, గోహత్య చేసిన పాపం కలుగుతుందంటారు. అలాంటప్పుడు రాముడెలా సుమంత్రుడిని వదిలాడు? సుమంత్రుడు దశరథుడి సేవకుడు కాని శ్రీరాముడి సేవకుడు కాదు. అలాంటి వాడిని దశరథుడి ఆజ్ఞ లేకుండా వెంట తీసుకోపోరాదు. శ్రీరాముడిని అడవుల్లో విడిచి రమ్మని రాజాజ్ఞ. ఆవల పొమ్మని ఆయన అనలేదు).

ఈ విధంగా ఎన్నో విధాల దుఃఖంతో కూడిన మాటల వల్ల సంతోషం చెడి తనను ప్రార్తించిన సుమంత్రుడిని, తన సేవకుడిని, చూసిన దయగల శ్రీరాముడు సారథితో ఇలా అన్నాడు. "రాజు మీద ప్రేమగల నువ్వు భక్త మాత్రుడివె కాదు...పరమ భక్తుడివి. ఇది సత్యం. ఈ మాత్రం తెలియని కఠినమైన మనసున్నవాడిని కాదు నేను. నిన్నెందుకు అయోధ్యకు పొమ్మంటున్నానో చెప్తా విను. ఉరికి వచ్చిన నిన్ను చూసి నా పినతల్లి కైక నిజంగా రాముడు అడవికే పోయాడని నమ్ముతుంది. నువ్వు పోకపోతే నేను అడవులకు పోలేదని ఎక్కడో దాగి ఉన్నాడని ఆమె సందేహిస్తుంది. నువ్వు పోతే సంతోషించి రాజు అసత్యం చెప్పలేదు...శ్రీరాముడిని నిజంగా అడవులకు పంపించాడని అసత్యవాది కాదని భావిస్తుంది. భరతుడు పాలించే రాజ్యంలో కైక అనుభవించాలని నా కోరిక. కాబట్టి నువ్వు నాకు, రాజుకు, ప్రియంగా వుండేట్లు రథాన్ని తోలుకోపోయి నేను చెప్పిన మాటలు చెప్పు.

జడలు ధరించిన శ్రీరామలక్ష్మణులు

శ్రీరామచంద్రుడు సుమంత్రుడిని ఓదార్చి, తనను అక్కడనే నివసించమని, అలా చేస్తే వ్రతహాని వుండదని కోరిన గుహుడిని చూసి ఇలా అన్నాడు: "మిత్రమా! ఇది జనసంచారం వున్న ప్రదేశం కాబట్టి ఇది అరణ్యమైనా ఇక్కడ వుండకూడదు. జనావాసాలు లేని చోట ఆశ్రమం ఏర్పాటు చేసుకుని, అక్కడ వానప్రస్తుడు వుండాల్సిన విధంగా వుంటూ, మునిజనులకు అనుగుణంగా జీవిస్తూ, బ్రహ్మచర్యం లాంటి ఉత్తమ విధులను పాటిస్తూ, తండ్రికి హితమైన రీతిలో సీతాలక్ష్మణులకు ప్రియంగా వారి హితం కోరుతూ జడలు ధరిస్తాను. మర్రిపాలు త్వరగా తెప్పించు". ఇలా రాముడనగానే, గుహుడలానే చేసాడు. దేవవిభుడు, సౌందర్యధాముడు, సుందరాకాముడైన శ్రీరామచంద్రమూర్తి తాను జడలు ధరించి, లక్ష్మణుడికి దరింప చేసాడు. ఈ విధంగా నిడివి చేతులవాడు, కల్యాణగుణనిధి, విష్ణు విభుడైన శ్రేరాముడు జడధారి అయ్యాడు. నారచీరెలు, నేలను తాకే విధంగా వున్న నిడువైన జడలు ధరించిన శ్రీరామ లక్ష్మణులు సాక్షాత్తు మునీంద్రుల లాగా కాంతి కలవారైరి.

తల్లిదండ్రుల ఆజ్ఞ నిర్వహించడానికి శ్రీరాముడు వానప్రస్తాశ్రమంలో వుండాలనుకుని, లక్ష్మణుడితో కలిసి సంతోషంతో గుహుడితో ఇలా అన్నాడు: "సేనలు, బొక్కసాలు, దుర్గాలు, ఊళ్ళు, పల్లెలు, మొదలైన వాటి విషయంలో జాగ్రత్తగా వుండు. స్నేహితుడా...ఏమరుపాటు వద్దు. ఆలోచించి చూస్తె, రాజ్యాన్ని మిక్కిలి ప్రయాసతో రక్షించాలి". గుహుడికి ఇలా చెప్పి, సీతాలక్ష్మణ సమేతంగా త్వరగా గంగా తీరానికి పోయాడు. అక్కడున్న నావను చూసి, దాన్ని కదలకుండా పదిలంగా పట్టుకోమని తమ్ముడు లక్ష్మణుడికి సూచించి, "పిరికి" సీతను ముందుగా నావ ఎక్కించి, తరువాత అతన్ని ఎక్కమంటాడు రాముడు. అలానే చేసిన లక్ష్మణుడు శ్రీరామాజ్ఞ ప్రకారం సీతను ముందుగా నావ ఎక్కించి, తానెక్కాడు. తరువాత శ్రీరాముడు ఎక్కాడు. గుహుడు అప్పుడు తన బంధువులను నావ నడపమన్నాడు. నావ కదిలే ముందర ప్రయాణానికి పూర్వం చేయాల్సిన శ్రేష్ఠమైన మంత్రాలను, బ్రాహ్మణ క్షత్రియులు చేసే విధంగా, శ్రీరాముడు తన మేలుకై జపించి, సీతాలక్ష్మణులతో జపింప చేసాడు. గుహుడిని,

సుమంత్రుడిని, ఇక అక్కడే నిలవమని ఆజ్ఞ ఇచ్చాడు. త్వరగా ఓడ నడపమని హెచ్చరించగా, నావ నడిపేవారలానే చేసారు. అలా కదిలిపోయింది ఓడ.

గంగను ప్రార్థించిన సీత

నీళ్ల మధ్యలోకి ఓడ పోగానే అక్కడ సీత చేతులు జోడించి, గంగానది వైపు చూసి, భక్తితో ఇలా ప్రార్థించింది. "తల్లీ! గంగాదేవీ! ఈ దశరథరాజు కుమారుడు, శ్రీరాముడు, వనవాస దీక్ష ఎలాంటి కొరత లేకుండా నెరవేరేట్లు దీవించు. భగీరథుడి కూతురా! నీకు ఈయనకు గల సంబంధం తలచైనా, స్నేహభావంతో ఈయనను రక్షించు. శంకరుదేవీ! అడవిలో పద్నాలుగేండ్లు వుండి, ప్రతిజ్ఞ తీర్చి, ఈ రామచంద్రుడు ఆ తరువాత, తన తమ్ముడితోను, నాతోను, నిర్విఘ్నంగా మళ్లీ నిన్ను చేరేట్లు అనుగ్రహించు. ఎ విఘ్నం అపాయం లేకుండా, శ్రీరామలక్ష్మణులు, నేను, మరలి వచ్చినపుడు మా కోరికలన్నీ నేరవేరగా నియమంగా, నిన్ను బహువిధాల నువ్వు సంతోషించేట్లు పూజిస్తాం".

"దేవీ! నువ్వంటే సామాన్య నదివా? త్రిపథగ అనే పేరుతో మూడు దారుల్లో పారి కీర్తి గడించావు. బ్రహ్మ లోకంలో వుంటూ, ఈ లోకంలో సముద్ర రాజు భార్యవై నీ నీళ్లల్లో స్నానం చేసేవారి పాపాలను కడిగివేసే నిన్ను ఏమని పొగడగలను? చేతులు జోడించి నమస్కరిస్తాను. శ్రీరామచంద్రుడు మరలివచ్చి, రాజ్యాన్ని పొందితే నీకు సంతోషంగా లక్ష ఆవులను బ్రాహ్మణులకు ఇస్తాను. నీకు మంచి అన్నం, వస్త్రాలు, వేయి కల్లు కుండలు, సమర్పించుకుంటాను. కాబట్టి తల్లీ! గంగాభవానీ! దయ చూపించు".

"గంగాదేవీ! నీ ఒడ్డున వుండే కాశీ లాంటి పవిత్ర క్షేత్రాలను, మణికర్ణ లాంటి పవిత్ర తీర్థాలను, అక్కడుండే దేవతలను, నిష్ఠగా, నియమంగా పూజిస్తాను. పాపాలను కడిగేసేదానా నన్ను దయతో చూడు. ఎ దోషం లేని శ్రీరామచంద్రుడు వనవాసం పూర్తిచేసుకుని, సంతోషంగా తమ్ముడితో, నాతో, క్షేమంగా తిరిగి వచ్చేట్లు దయతో అనుగ్రహించు".

(కొందరు తత్వజ్ఞానహీనులు, హిందువులు రాళ్ళకు, గుట్టలకు, చెట్లకు, నదులకు, నమస్కారం చేస్తారని ఆక్షేపిస్తూ తమ అజ్ఞానాన్ని బయట

పెట్టుకుంటారు. వాస్తవం ఏంటంటే, "వాసుదేవ సర్వం, సర్వం ఖల్విదం బ్రహ్మ"..... అంటే, హరిమయం కాని ద్రవ్యం, పరమాణువు లేదు. ఈశ్వరుడు ఒక్కడే అంతర్యామి. మన్ను, చట్టిబాన, పిడుత లాంటి వేరు-వేరు పేర్లెలా వున్నాయో, అలా నానారూపాలు ధరిస్తున్నదో, అలాగే, ఈశ్వరుడు తానె సర్వ రూపాలు, సర్వనామాలై వున్నాడు. కాబట్టి సర్వం భగవన్మయమే! భగవత్ స్వరూపమే! ఇతర పదార్ధమేదీ లేదు. కాబట్టి ఎవరు దేనికి నమస్కారం చేసినా, ఆ రూపం వహించి, అందు అంతర్యామిగా వుండే భగవంతుడికే నమస్కారం చేస్తున్నాం కాని, వేరే దేనికీ నమస్కారం చేయడం లేదు. సర్వం ఈశ్వర భావంతో నమస్కారం చేయడం తత్వజ్ఞ లక్షణం. తెలియకుండా నైనా నమస్కారం చేయడం మధ్యముల లక్షణం. దానిని నిషేధించడం మూర్ఖుల, బాహ్యుల లక్షణం. మన శరీరంలో ఈశ్వరుడు ఎలా వున్నాడో, అన్ని ప్రదేశాల్లో అలానే వున్నాడు. స్థూల దృష్టికి కనిపించేది ఆయన శరీరమైన ప్రకృతి మాత్రమె. కాబట్టి, కనిపించేవి, వినిపించేవి, లోపల-వెలుపల వుండేవి అన్నీ, సర్వం వ్యాపించిన నారాయణుడే! బ్రహ్మ మొదలు గడ్డి గంటవరకు చరాచరాలలో సర్వం పరమాత్మ స్వరూపమే వుంది. కాబట్టి జగన్మయుడైన భగవంతుడికి నమస్కారం చేస్తున్నట్లే! ఆకాశం, వాయువు, అగ్ని, జలం, భూమి, నక్షత్రాలు, జంతువులు, దిక్కులు, చెట్లు, నదులు, సముద్రాలు, అవన్నీ విష్ణువు శరీరమే! కాబట్టి అనన్య బుద్ధి నమస్కారం చేయాలి).

సీత గంగను ప్రార్తిస్తుండగానే, వేగంగా పోతున్న నావ అవతలి ఒడ్డుకు చేరింది. అక్కడ అందరూ దిగారు. అప్పుడు శ్రీరాముడు లక్ష్మణుడితో ఇలా అన్నాడు: "సౌమిత్రీ! ఇక రక్షణలో మనం ఏమరుపాటుగా వుండాలి. జనం వున్న చోటా, లేని చోటా, నువ్వు దారి చూసుకుంటూ ముందు నడువు. నీ వెంట సీత నడుస్తుంది. నేను మీ ఇద్దరినీ రక్షిస్తూ సీతకు వెనుక పక్కగా వస్తాను".

(ఈ అడవిలో తిరిగేవారు "సీత"ను అంటే "ప్రకృతి" పరిణామయమైన దేహాన్ని ముందుంచి, దానిని మార్గదర్శిగా చేసి, అది పోయిన దారిలో లక్ష్మణుడు, అంటే జీవుడు పోతే, ఇరువురికీ అపాయం తప్పదు. కాబట్టి దేహ

రక్షాభారాన్ని అవ్యవధానంగా జీవుడిలో, ఈశ్వరుడిలో వుంది. జీవుడు చేతనుడు...జ్ఞానస్వరూపుడు. కాబట్టి తాను ముందు పోయి, ప్రకృతిని దేహం తన వెంట వచ్చేట్లు చేసుకుంటే ఇరువురికీ అపాయం లేదు. తానూ "ఇద్దరినీ రక్షిస్తూ సీతకు వెనుక పక్కగా వస్తాను" అని శ్రీరాముడన్నాడంటే, ప్రకృతిని, జీవుడిని రక్షించువాడు ఈశ్వరుడు అని అనుకోవాలి. భగవంతుడు ప్రయోజకకర్త...జీవుడు ప్రయోజ్యకర్త).

(వాస్తవానికి శ్రీరామలక్ష్మణులకు సీతా సహాయం అనావశ్యకం. ఆమె చేయగలిగిందేమీ లేదు. అయినప్పటికీ, అరణ్యంలో క్షేమంగా, సంతోషంగా తిరగాలంటే, సీతను క్షేమంగా కాపాడడం అవశ్య కర్తవ్యనీ. ఆమెన్ ఉ పెక్షినీచడమంటే అది తమ అగచాట్లకే. అలాగే జీవాత్మ పరమాత్మలకు దేహ (ప్రకృతి) సహాయం అనావశ్యకమైనప్పటికీ, లోకయాత్ర చేయాల్సి వచ్చినప్పుడు దేహ రక్షణ అవశ్య కర్తవ్యం అవుతుంది. దేహాన్ని ఉపేక్షించిన జీవుడు ఉ భాయలోక భ్రష్టుడే. ఈ ఉద్దేశంతో "పరస్పర రక్ష" అని చెప్పడం జరిగింది. అలా కాకుండా పరస్పరం అనేది రామలక్ష్మణులకే అన్వయిస్తే సీతను ఉ పేక్షించిన దోషం అవుతుంది. వాల్మీకి ఈ అర్థాన్ని మనసులో పెట్టుకునే దానికి అనువైన పదాలను వాడాడు).

(మించి పోయిన కార్యాన్ని మళ్లా చక్కచేయడం అసాధ్యం. కాబట్టి మించి పోవడానికి ముందే మనం ప్రయత్నించి హెచ్చరికతో సోమరితనం లేకుండా రక్షించాలి. ఈ జీవుడికి ఈ దేహం పోతే మరో దేహం రాదా అని అనుకోవచ్చు. ఒకటి కాదు...కోటి అయినా ఒకటి వెంట మరొకటి రావచ్చు. అలా జన్మాలెత్తుతూ ఈ ప్రపంచారణ్యంలో వుండాలనుకునేవారు బుద్ధిమంతులా? ఈ ఒక్క దేహంతోనే ఈ అరణ్యానికి మళ్లీ రాకుండా వైకుంఠం (అయోధ్య) చేరేవాడు బుద్ధిమంతుడా? ఈ సీత పోతే వేరొక భార్య వస్తుందని కాని, లోకంలో స్త్రీలకూ దారిద్ర్యం వచ్చిందా? అని కాని శ్రీరాముడనలేదే? శ్రీరాముడు ఎకపత్నీవ్రతుడై ఎందుకున్నాడు? కాబట్టి వైకుంఠం చేరే ప్రయత్నం ఈ దేహంతోనే చేయాలికాని వేరొక దేహానికొరకు కాచుకుని ఉండరాదు. ఒక్క దేహంతో ముక్తిపొందే మార్గాన్నే రామాయణం బోధిస్తున్నది. కాబట్టి దేహాన్ని ఉపేక్షించ కూడదు. దానిని రక్షించుకుంటూ మరల జన్మ ఎత్తకుండా చూసుకోవాలి).

శ్రీరాముడు ఇంకా ఇలా అన్నాడు తమ్ముడు లక్ష్మణుడితో: "మనుష్యుల గుంపుల రాపిడి కొంచెం కూడా లేకుండా, మనోహరమైన తోటలేమీ లేకుండా, అందమైన పంట భూములేవీ లేకుండా, గుండ్లు-గండ్లు-ముండ్లు కలిగి భయంకరంగా వుండే అరణ్య ప్రదేశం ఇదే. ఇక మీద వనవాసంలోని ప్రయాసం సీతకు తెలుస్తుంది. ఇంతసేపు రథం మీద ప్రయాణం చేసినట్లు కాదు". అని చెప్పగా ప్రీతితో లక్ష్మణుడు ముందుకు పోయాడు. ఆయనను సీత వెంబడించినీది. ఆమె వెనుక వీర్యవంతుడై వీరిరువిరినీ రక్షించే సమర్ధవంతుడైన శ్రీరాముడు ధనుర్ధరుడై హెచ్చరికతో మెల్లగా పోసాగాడు.

(ముందు పోయేవారికి వెనుకున్నవారు కనబడనట్లు జీవుడు, దేహం తమల్ని రక్షించే భగవంతుడిని కనుక్కోలేరు. వారికి కనిపించినా, కనిపించకపోయినా భగవంతుడు తన రక్షా కార్యం చేస్తూనే వుంటాడు. అది తెలుసుకుని, తన రక్షాభారం ఆయన మీదే వేసి, ప్రకృతిని వెనుకవుంచుకుని సరైన మార్గంలో పోతూ, హెచ్చరికగా నిర్భరుడు నిర్భయుడై లోకయాత్ర చేసే జీవుడికి ఏ భయం లేదు...హాని లేదు).

వారు ముగ్గురూ, గంగానది అవతలి ఒడ్డుకు పోగా రెప్పవాల్చక చూసి ఇంకా దూరం పోగా సుమంత్రుడు కన్నీళ్లు కారుస్తూ బాగా దుఃఖించాడు. సీతారామలక్ష్మణులు ఒక చెట్టు నీడకు చేరారు. అక్కడ సీతను ఒంటరిగా వదిలి శ్రీరామలక్ష్మణులు పోయి, పందిని, మనుబోతును, చారల దుప్పిని, దుప్పిని, ఇలా నాలుగు జంతువులను చంపి తెచ్చుకుని, ఆకలిగా వుండడం వల్ల భుజించారు. ఆ తరువాత సూర్యాస్తమయం కావడంతో సంధ్య వార్చారు.

❖ ❖ ❖

సర్గ-53

తల్లిదండ్రులను తలచుకుని దుఃఖించిన శ్రీరామచంద్రుడు

శ్రీరామచంద్రుడు లక్ష్మణుడిని చూసి, "లక్ష్మణా! పల్లెలను అన్నింటినీ దాటి, జనులుండే ప్రదేశానికి వెలుపల వుండే ఇక్కడ నివసించడం, సుమంత్రుడు కూడా మనల్ని వదలిపోవడం, ఈ రెండూ జరిగిన మొదటి రోజు ఇవ్వాలే కదా? కాబట్టి గడచిపోయిన దానిని గురించి ఆలోచన చేయొద్దు. విచారపడవద్దు. నిద్రమానుకుని ఈ రాత్రినుండి నిండు హెచ్చరికతో రాత్రుల్లో మనమిద్దరం సీతను రక్షించాలి. ఆమె యోగ క్షేమం మనమీదే ఆధారపడ్డది. మనం తెచ్చిన ఆకులు భూమ్మీద పరచి తలగడగా రాతిని వుంచుకుని పండుకోవాలి". అని అంటాడు. ఇలా చెప్పి సుఖ శయ్య మీద పడుకోవాల్సిన వాడు నేల మీద కూర్చుండి పోయి, పొద్దుపోయే దాకా కష్టం మనసుకు రానీయకుండా ఇంపైన మంచి కథలను తమ్ముడికి ప్రేమగా వినిపించేవాడు.

ఆ మాటల ధోరణిలో.... "అన్నా! లక్ష్మణా! దశరథ మహారాజు తన కొడుకు అడవులకు దుఃఖపడుతూ పోయాడు కదా! అనుకుంటూ నేలమీదే పడుకుంటాడు. ఇది సత్యం. ఇక కైకేమో తన కోరిక తీరెనే అని సంతోషపడుతుండవచ్చు. కైక తన ముద్దులకొడుకు మేనమామ ఇంటినుండి మరలిరాగానే, తన కొడుకు ఇంకా యువరాజుగానే ఎందుకు వుండాలి? ఈ ముసలివాడు రాజుగా ఉన్నంతవరకు నా కొడుకు పెద్ద రాజుకాలేడు..... రాముడు వచ్చేవరకు వీడు బ్రతికుంటే రాముడినే పెద్దరాజుగా చేస్తాడు....వీడిప్పుడే చస్తే తన కొడుకు పెద్ద రాజే అవుతాడు....అని ఆలోచించి రాజ్యం కొరకు మహారాజును చంపుతుందేమో? చంపినా ఏం చేయగలడు? చంపకపోతే ఏం చేయగలడు? ఎందుకంటే ముసలివాడు కాబట్టే ఏం చేయలేడు. చేయడానికి ధైర్యం లేనివాడు. దానికితోడు కైక మీద మోహంతో వలతాళ్ళలో చిక్కుకున్నాడు. తాను విడిపించుకుని రాలేడు. విడిపించ గలవాడు లేడు. నేను విడిపించ గలను కాని దూరంగా వున్నాను. ఇలా దూరంగా వచ్చాను కాబట్టే ఏం చేయడానికి తోచక రాజు ఏం చేస్తాడో కదా? ఏం బాధ పడుతున్నాడో ఏమో? తమ్ముడా నేనేం చేయాలిప్పుడురా?"

"మన గొప్పతనం చెడేట్లు వ్యసనం వల్ల కలిగే కష్టం మనకు, కామమే సేవింపతగినదనే భ్రాంతి రాజుకు, కలుగుట వల్ల అర్థం కంటే, ధర్మం కంటే, కామమే బలమైనదని తలుస్తాను. రాజు కామవశుడై, అధర్మమని భయం లేక, మనకు కష్టం కలిగించి తానూ కష్టపడడం వల్ల, తాను కట్టుకున్న తాళ్లు తానె తెచ్చుకున్నట్లు తన ప్రభుత్వం తానే పోగొట్టుకోవడం మూలాన, ఈ రెండింటినీ సహించైనా కామ భోగంలో ఆసక్తి కలవాడగుట వల్ల, ఆ రెండింటి కంటే కామమే బలమైనదని తలుస్తాను. నువ్వు చెప్పింది సరైనాదికాదు, ధర్మమే బలీయమైనదని నువ్వంటావా? లక్ష్మణా! అట్లయితే మోసపోయి ఎంత తెలివిహీనుడైనా, తన ప్రియ కుమారుడిని, తాను చెప్పకముందే తన మనసులోని విషయం తెలుసుకుని ఆ ప్రకారమే నడచుకునేవాడిని, వయసు మళ్ళిన పెళ్ళాం మాటలు విని, నన్ను, మన తండ్రి వదలినట్లు వదలుతారా ఎవరైనా? కాబట్టి కామమే బలీయం. మన్మధ బాణాలతో కొట్టబడిన మనసు కలవాడికి ఏది మంచో, ఏది చెడో, ఎలా తెలుసుకుంటారు? భార్యతో భరతుడు ఒక్కడే హాయిగా వుంటాడు కదా! కోసల రాజులు ఏలే రాజ్యమంతా వాడొక్కడే ఏలుతాడు కదా? ఏమి విచిత్రం? తండ్రి ముసలివాడు....అవును, కాదు, అని చెప్పగల సామర్థ్యం లేనివాడు. చెప్పినప్పటికీ, ఇతరులు వినకపోతే ఏమీ చేయలేనివాడు. భయంకరమైన అడవుల్లో నేను దుఃఖ పడుతున్నాను. పెద్దవాళ్లిద్దరూ రెండు తోవలు పట్టడం వల్ల భరతుడు ఒక్కడే ఏకంగా రాజ్యమంతా ఏలుతాడు కదా! ఈ చిత్రాన్ని ఏమనాలి? ఇహపరలోక సాధనాలైన ధర్మాన్ని, అర్థాన్ని విడిచి ఎవరు కామాన్ని సేవిస్తారో ఆ వ్యర్థుడు దసరథుడి లా కీడు పాలవుతాడు."

"తన భర్తను చంపడానికి, నన్ను అడవుల పాలు చేసి కృశింపచేయడానికి, తన కొడుకుకు రాజ్యం లభించేట్లు చేయడానికి, కైక మనకు దాపరించింది. నేను సవతి కొడుకును. రాజ్యపాలనలో తన కొడుకుకు అడ్డం వచ్చేవాడిని అనే కోపంతో పాప కార్యం చేసే ఆలోచన కల కైక, నా తల్లిని, నాకనుకూలుడవైన నీ తల్లిని, వారు మంచివారైనప్పటికీ, ఎంత కీడు సహించెవారైనప్పటికీ, న్యాయం తప్పి బాధ పెడుతున్నారు. లక్ష్మణా! నా కొరకై నీ తల్లి సుమిత్రాదేవి ఎందుకు కష్ట పడాలి? తెల్లవారగానే నువ్వు ఇక్కడ నుండి త్వరగా అయోధ్యకు పోవాలి. (లక్ష్మణుడు అయోధ్యకు పోవడానికే శ్రీరాముడు ఇన్ని మాటలు

చెప్పాడనుకోవాలి). నిన్నెందుకు పోమ్మని అంటున్నానో తెలుసా? దిక్కులేని కౌసల్యకు దిక్కై ఆమెను రక్షిస్తావనే! ఇక నాగతి ఏమిటి? అంటావా? నేను సీతను తీసుకుని ఒక్కడినే అడవులకు పోతాను. నీచ కార్యాలు చేయడానికి అలవాటు పడ్డ కైక దయ లేకుండా నా తల్లికి విరోధంగా అవమానాలు కలిగిస్తుంది. కాబట్టి నాతల్లిని జాగ్రత్తగా కాపాడమని భరతుడికి చెప్పు. పూర్వ జన్మలో నా తల్లి ఏ చిన్న కొడుకును తల్లి నుండి ఎడబాటు చేసిందో? ఆ పాపం కారణంగా ఇప్పుడు పవిత్రమైన నడవడికల ఆమెకు ఇలాంటి పుత్రా శోకం కలిగింది. నన్ను కనిపెంచి పెద్దవాడిని చేసింది. అనేక రకాలైన బాధలు పడ్తూ నన్ను బతికించింది. అలాంటి కన్న తల్లిని, నావల్ల సుఖం అనుభవించాల్సిన సమయంలో ప్రయత్న పూర్వకంగా వదలిపెట్టాను. ఛీఛీ నేనొక కొడుకునా?"

"కడుపార కన్నతల్లికి నేను ఎలాంటి తీవ్ర దుఃఖాన్ని కలిగించానో చూసావా? ఆహా! ఎలాంటి కొడుకును నేను? భూమ్మీద నాలాంటి కొడుకును ఏ తల్లి కూడా కనకుండా వుండు గాక! లక్ష్మణా, నా జన్మ వ్యర్థం. ఎందుకంటావా? ఏమని చెప్పాలి? మా తల్లి నన్ను పెంచినట్లే చిలుక-గోరువంకను కూడా పెంచింది. తన శత్రువైన పిల్లి వస్తే కాలికి గాటుపడేవరకు దాన్ని కోరకమని చెప్పింది చిలుకకు గోరువంక. పిల్లిని తరమమని చిలుకకు గోరువంక చెప్పినట్లు మనుష్యుడైన నేను చెప్పలేకపోయాను కదా! నా తల్లి నన్ను కొడుకుగా కని ఏమీ సుఖపడ్డది? సుఖం లేకపోతె పరవాలేదు..ఎంత దుఃఖం అనుభవిస్తున్నది? నాలాంటి కొడుకుండి కూడా ఏమీ ప్రయోజనం? మా తల్లి నిర్భాగ్యురాలు సుమీ. దుఃఖాల పాలుపడిన దానికి, ముత్తైదువగా వుండే భాగ్యం మాత్రం ఉన్నదానికి, కొడుకుండీ లేనిదానికి, నేను చేసిన మేలు ఏమీటి? నన్ను తన గర్భాన దాల్చి కనడం వల్ల కౌసల్య నిర్భాగ్యురాలైంది. కాబట్టే సహించరాని దుఃఖంతో బాధపడి వ్యసనపడుతున్నది".

"అలా అవుతే పట్టాభిషేకం చేసుకోరాదా? నేను సహాయపడతాను అంటావేమో? నేనే పట్టాభిషేకం చేసుకోవాలనుకుంటే నాకు ఇతరుల సహాయం కావాలా? నేనొక్కడినే అయోధ్యతో సహా భూమినంతా జయించలేనా?

అలాంటప్పుడు ఇలా ఎందుకు అడవులకు వచ్చానంటావా? కారణం లేకుండా నేను పరాక్రమం చూపవచ్చునా? చూపితే తప్పేంటి అంటావా? నిరపరాధులను చంపిన పాపంతో పరలోక ప్రాప్తి నాకు లేకుండా పోతుందన్న భయం. రాజ్యకాంక్షతో ధర్మం తప్పానన్న అపనింద పడుతుందన్న భయం. వీటి జ్ఞానం వల్ల నన్నాపని చేయకుండా ఆపింది కాని పట్టాభిషేకం చేసుకోవడం కూడా ఒక కష్ట కార్యమా?"

ఇలా తనవల్ల తల్లికి, లోకులకు కలిగిన దుఃఖాన్ని తలచుకుని అనేకవిధాలుగా కన్నీరు కారుస్తున్న శ్రీరాముడిని ఓదార్చడానికి జనులు లేని అడవిలో, ఏ పాపం తెలియని ఆయన ఆ రాత్రంతా ఏడిచి మౌనవ్రతం పట్టిన వాడిలాగా వుండిపోయాడు. అలలు కదలని సముద్రంలాగా, మంటలు చల్లారిన అగ్నిహోత్రంలాగా, ఏడుపు నిలిపినిలిపిన శ్రీరాముడితో లక్ష్మణుడు ఉత్సాహకరమైన మాటలు చెప్పాడు.

శ్రీరాముడిని ఓదార్చిన లక్ష్మణుడు

"రామచంద్రా నువ్వు చెప్పిన మాటలన్నీ నిజమే. నువ్వు వదలి వచ్చిన కారణాన అయోధ్య దిక్కులేనిదై, కాంతిహీనంగా, చంద్రుడు లేని రాత్రి లాగా వుండడంలో సందేహం లేదు. కాని, వనవాసానికి రాకముందు చేయాల్సిన ఆలోచన వనవాసం చేద్దామని నిశ్చయించుకున్న తరువాత, ఇప్పుడు, ఇక్కడ ఆలోచించి దుఃఖ పడడం సరైంది కాదు. ముందు చేసిన పనిని గురించి వెనుక ఆలోచించేవాడు బుద్ధిమంతుడు అనిపించుకోడు. వెనుక చింతించడం వెర్రిదనం. నువ్వు ధైర్యంగా ఉన్నందునే, ఆయన ధైర్యంగా వుండడం జరిగింది. నువ్వు దుఃఖిస్తే ఆయనకు బాధ కలుగుతుందని మేమందరం నిబ్బరంగా వున్నాం. నువ్వు ఇలా దుఃఖ పడితే, నీకై మేమెంత దుఃఖినీచాల్సి వుంటుందో ఆలోచించు. రామచంద్రా! నువ్విక్కడ దుఃఖ పడ్తూ, నన్ను అయోధ్యకు పొమ్మన్నావుకాని, నా మనస్థితి ఆలోచించలేదు. నేను కాని, సీత కాని, మా సుఖం కోరి నీవెంట రాలేదు. సుఖం కావాలంటే అయోధ్యలోనే వుండేవాళ్ళం. నీ సేవ కొరకు వచ్చాం. ఆ సేవ నువ్వు వూళ్ళో వున్నా చేస్తాం...అడవిలో వున్నా చేస్తాం. కాల దేశాలు మాకు ప్రధానం కావు"

"మాకు ఉత్తమ పురుషార్థం నీతో వుంది నీకు సేవచేయడమే! అదే మాకు సుఖం. అదే మాకు లాభం. అదే మాకు స్వభావ సిద్ధం. మా అభిప్రాయం ఇలా వుంటే, నిన్ను వదలి నేను, సీత ఒక్క క్షణ కాలమైనా వుండలేం. నీటిలోని చేపను బైట వేస్తె బతకగలదా? నిన్ను ఆశ్రయించి జీవించేవాళ్ళం. ఒకవేళ సీతాదేవి స్త్రీ కాబట్టి, వాళ్ళ మనసు కఠినం కాబట్టి, నిన్ను విడిచి కొంత కాలమైనా వుండగలదేమో కాని, నేను మాత్రం ఉండలేను. ఇది వాస్తవం. నిన్ను విడిచిన నాకు జనకుడేల? జనని ఏల? తమ్ముడేల? ఆ స్వర్గమే ఎదురుగా వచ్చిన ఏల?"

(దీన్నే పరమ భక్తి అంటారు. అలా చేయాల్సి వస్తే, సమస్త సోపాధిక బంధవుల వదలైనా భగవత్సేవ చేయాల్సి వుంటుంది. భగవంతుడితో వియోగం వస్తుందని భయపడడమే పరమ భక్తి. ఇదే ముక్తి కారణం).

ఇలా చెప్పిన తరువాత, ముందున్న చెట్టు కిందనే ఇరువురూ పడుక పరుచుకుని దాని మీద ఎంతో సంతోషంగా కూర్చొన్నారు. తమ్ముడి మాటలకు రామచంద్రుడు సంతోషించాడు.

కొండచరులలో కనిపించే రెండు సింహాల లాగా, భయం, తొట్రుపాటు వదలి పరమ పరాక్రమవంతులైన శ్రీరామలక్ష్మణులు ఆ రాత్రి మనుష్యులు లేని అడవిలో వున్నారు.

❖ ❖ ❖

సర్గ-54

భరాద్వాజ ఆశ్రమానికి పోయిన శ్రీరాముడు

సూర్య బింబం నిర్మలమై కనపడగా, గంగా-యమునా నదుల సంగమంలో వుండే ప్రదేశాన్నీ, భయంకరమైన అడవినీ, ఇంతకు ముందెన్నడూ చూడని మనోహరమైన దేశాలనూ, క్షేమంగా చూసుకుంటూ, నానారకాలైన చెట్లను పరికించుకుంటూ, పగలు అర్ధ అస్తమయ సమయాన, లక్ష్మణుడిని చూసి, శ్రీరాముడు ఇలా అన్నాడు: "లక్ష్మణా! ఇదిగో చూడు...అగ్నిహోత్రుడి ధ్వజంలాగా సంతోషంతో పొగ ఎగబారుతున్నదక్కడ. అచట భరద్వాజుడు వుండవచ్చు. లక్ష్మణా! మనం గంగా-యమునా నదులు కలిసే ప్రదేశానికి వచ్చాం. అదెలా తెలిసిందంటే...అలలు ఒకదానితో మరొకటి కలిసి కొట్టుకుంటుంటే కలిగే ధ్వని వినపడుతున్నది కదా? అడవుల్లో పుట్టిన వస్తువులతో జీవనం చేసేవారు, అక్కడి జనులు, చీల్చిన కట్టెలు, పలురకాలైన చెట్లు, భరద్వాజ ఆశ్రమం దగ్గరున్నాయి చూసావా లక్ష్మణా?"

పడమటి కొండ సమీపంలో సూర్యుడు ఎర్రటి బింబం కలవాడై, అలరారుతుండగా, ధనుర్ధరులైన ఆ శ్రీరామలక్ష్మణులు గంగా-యమునలు కలిసే స్థలంలో వున్నా భరద్వాజ ముని ఆశ్రమానికి చేరారు. విల్లుబాణాలు ధరించిన వారిరువురిని - బలవంతులైన శ్రీరామలక్ష్మణులను-చూసి ఆశ్రమంలోని మృగాలు, పక్షులు, భయపడి బెదిరాయి. ఆశ్రమ విచిత్రాలను చూసుకుంటూ, సంతోషంతో లోపలి వెళ్లారు రామలక్ష్మణులు.

ఆ విధంగా సీతా సమేతంగా ఆశ్రమం ప్రదేశం చేరి శ్రీరామలక్ష్మణులు ఆ మహామునిని దర్శించాలని కోరిక తెలియచేశారు. అది సాయంకాలం అగ్నిహోత్ర సమయం కావడాన, అది పూర్తయ్యేవరకు దూరంగా వేచి వున్నారు. తరువాత ఆయన శిష్యులతో తమ రాక తెలియచేశారు. రమ్మని శిష్యులు వచ్చి చెప్పడంతో, లోపలి పోయి, తపాలతో పవిత్రమైన శిష్యులతో కూడిన వాడు, చక్కగా అనుష్టించబడిన వ్రతాలు కలవాడు, లోకులందరూ కీర్తించే నడవడి కలవాడు, ఏక లక్ష్యం మీదే మనసుంచిన వాడు, గొప్ప తపస్సు వల్ల

సంపాదించిన యోగ దృష్టి కలవాడు, గొప్ప మనసు కలవాడు అయిన భరద్వాజ మహర్షిని సమీపం నుండి చూసారు. ముని అగ్నిహోత్ర కార్యం పూర్తికావడంతో, మెల్లగా, శ్రీరాముడు జానకీ లక్ష్మణులతో తన పేరు చెప్తూ, నమస్కరించాడు. సీతాలక్ష్మణులు కూడా అలానే చేశారు. ఇలా నమస్కారాలు అయిన తరువాత శ్రీరాముడు మునీస్వరుడితో ఇలా అన్నాడు:

(జల కుంభం చేతిలో ఉన్నవారికి, భిక్షకై తిరిగేవారికి, పూలు-నేయి చేతిలో ఉన్నవారికి, అశుచిగా ఉండేవారికి, దేవ-పితృ కార్యాలు చేసేవారికి, శయనించి ఉండేవారికి, నమస్కారం చేయకూడదు. అందుకే శ్రీరాముడు ఇవన్నీ లేనంతవరకు ముని సమీపంలోకి పోలేదు. పోతే నమస్కారం చేయకుండా వుండ లేడు, చేయకపోతే బాగుండదు. హోమం అయ్యేంతవరకు బయటనే కాచుకుని వున్నాడు).

"ఇంద్రియాలను వశపరుచుకున్నవారిలో శ్రేష్టుడా! మేమిద్దరం దశరథ కుమారులం. నా పేరు శ్రీరాముడు. ఇతడు లక్ష్మణుడు. ఈమె నా భార్య...జనకరాజు కూతురు...శుభ గుణాలు కలది కాబట్టి పాతివ్రత్య ధర్మాన్ని అనుసరించి నావెంట వచ్చింది. కష్టాలలో మనసు చలించని వాడు ఈ లక్ష్మణుడు నా చిన్న తమ్ముడు, నావెంట వచ్చాడు. మా తండ్రి అడవులకు పొమ్మని ఆజ్ఞాపించడం వల్ల ఆయన ఆజ్ఞ తలదాల్చి అడవులకు మునుల్లాగా తిరగాలని వచ్చాం. మా మేలుకోరే వాడా! వానప్రస్థ ధర్మాన్ని అనుసరించి కూరగాయలు తిని వుంటాం" అని అనగా భరద్వాజుడు ఆయనకు అర్ఘ్యాన్ని, పాద్యాన్ని, ఎద్దును, హవిస్సును, ఫలాలను ప్రీతిగా ఇచ్చాడు.

గొప్ప తపోమహిమగల భరద్వాజుడు తనతో వున్న మునులతో, మృగాలతో, పక్షులతో, శ్రీరామచంద్రుడిని పూజించి "మీ తండ్రి బాగున్నారా? మీ తల్లి క్షేమమా?" అని వాళ్ల క్షేమ సమాచారం విచారించగా శ్రీరాముడు సంతోషించాడు. భరద్వాజుడు, ఇతరులు, ఇచ్చిన అర్ఘ్యాదులను గ్రహించిన వీరుడైన శ్రీరాముడు, సుఖంగా కూర్చున్నాడు. అప్పుడాయనను ప్రేమతో చూసిన భరద్వాజుడు ధర్మయుక్తమైన మాటలతో ఇలా అన్నాడు: "శ్రీరామచంద్రా! నిన్ను ప్రత్యక్షంగా ఇక్కడ చూడాలని ఎన్నాళ్లుగానో కోరుకుంటున్నాను. నా యోగాభ్యాస

సమయంలో హృదయంలో కనిపించే పరందాముడి ఆకారాన్ని కళ్లారా ఈ ప్రాకృత చక్షువులతో చూసే భాగ్యం నాకెప్పుడు కలుగుతుందా అని ఎంతో ఆశతో ఎదురుచూస్తున్నాను. నువ్వు అరణ్యాలలో నివసించడానికి ఎక్కడికో ఎందుకు పోవాలి? ఇది పుణ్యభూమి. జనావాసం లేనిది. గొప్ప నదులతో కూడి ఐశ్వర్యం సంపాదించుకున్నది. నువ్వు ఇక్కడే నివసించు".

(భక్తులందరూ కోరే కోరిక ఇదే! ఇదే, పవిత్రాణాయ సాధూనాం అన్న చోట చెప్పబడిన ముఖ్య రక్షామార్గం. ఇక్కడ అనడమంటే, దేహాన్ని విడిచిన తరువాత వైకుంటానికి వచ్చి, అక్కడ నిన్ను ఈ రీతిగా చూడడం కాదు. "నా తపఃఫలంగా నువ్వే ఇక్కడకు వచ్చి, దర్శనం ఇవ్వాలని కోరుకున్నాను" అని అర్థం. ఈ సాదు రక్షణ భగవంతుడు సంకల్పంతో ఈ విధంగా తప్ప మరో విధంగా చేయలేడు. కాబట్టే అవతరించడం అంటారు. శ్రీరాముడి అవతార రహస్యం భరద్వాజుడు వెల్లడించ రాదు కాబట్టి లోకమర్యాద ప్రకారం చెప్పాడు. శ్రీరాముడి పట్టాభిషేకం విఘ్నం కావడం వల్లే, దానివల్ల కలిగిన అవమానం వల్లే, కారణం లేకుండా దశరథుడు శ్రీరాముడిని అడవులకు పంపడం, వాళ్లు వన ప్రవేశం చేయడం, ఆ కథ అంతా శ్రీరాముడు రాకముందే భరద్వాజుడు విన్నాడు. తన నియమం ప్రకారం భగవంతుడు, పరందాముడైన శ్రీరాముడు, తానై పోయి దర్శనమిచ్చి అనుగ్రహించిన భక్తులలో మొదటివాడు భరద్వాజమహర్షియే!)

భరద్వాజుడిలా చెప్పగానే, ఆయన్ను చూసి శ్రీరాముడిలా అన్నాడు: "మునీంద్రా! నేను సుందరుడనని, సులభంగా ఎప్పుడైనా చూడవచ్చనీ, ఇదివరకు నా దర్శనం దుర్లభమని తలచిన వారందరూ, చుట్టుపక్కల పల్లెల నుండి, పట్టణాల నుండి, నన్ను, సీతాదేవిని చూడడానికి పలుమార్లు వస్తుంటారు. కాబట్టి ఇక్కడ వుండడానికి మనసొప్పదు. సుకుమారి అయిన జానకి సుఖంగా వుండేదుకు యోగ్యమైన స్థలం చెప్పు. అక్కడకు పోయి వుంటాం". అప్పుడు, లోక వీరుడై రాక్షసులందరినీ వధించాల్సిన శ్రీరాముడుకి, రెండు ఆమడల దూరంలో వున్నా చిత్రకూట పర్వత ప్రాంతం వుండడానికి అనువైనదని చెప్పాడు భరద్వాజుడు. అక్కడ గంధమాదన పర్వతంతో సమానమైన సువాసనలు కల

వృక్షాలు వున్నయంటాడు ముని. అక్కడ ఎలుగులు, కోతులుంటాయి... చూడడానికి సుందరంగా వుంటుంది అని చెప్పాడు ముని.

"రామచంద్రా! ఆ చిత్రకూట పర్వతం శిఖరాలు ఎంతదూరం కనబడుతాయో అంత దూరంలోపల జీవజంతువుల హృదయాలలో పాప చింత వుండదు. అవి పుణ్యాన్నే చేస్తుంటాయి. అక్కడ వందల సంవత్సరాలు పున్యాచార పరాయణులైన ఋషి శ్రేష్ఠులు శిరస్సు నేలమీదుంచి, వెంట్రుకలు, చర్మం, సమసి పోయేవరకు విపరీతకరణిని తపస్సు చేసి స్వర్గానికి పోయారు. ఆ పర్వతంలో పామర జనులు లేరు. కాబట్టి మీకు సంతోషం కలుగుతుందని భావిస్తాను. అయినప్పటికీ, నీ ఇష్టానుసారం అక్కడైనా, ఇక్కడైనా, నాతోనైనా, దయ వుంచి వుండవచ్చు". అని భరద్వాజ మహర్షి, భార్యతో, తమ్ముడితో వున్నా పుణ్యాత్ముడైన అతిథి శ్రీరామచంద్రుడిని ఉపచారాలతో సంతోషం కలిగేట్లు చేశాడు. ఆ తరువాత శ్రీరాముడు అయోధ్య విషయాలను చెప్పాడు.

సాయంకాల సంధ్యా సమయమందు ఎర్రటి కాంతులు పడమటి దిక్కున కనబడ్డై. ఆ తరువాత తమ్ముడితో, సీతతో, ఆ ఆశ్రమంలోనే సంతోషంగా గడిపాడు శ్రీరాముడు. ఉరు విడిచిన ఐదవ నాటి ఉదయాన శ్రీరామాదులు మేల్కొని, తపస్సంపదగల భరద్వాజ మునిని చూసి, ఈ పుణ్య ప్రదేశనీలో రాత్రి సుఖంగా గడిపామని, పోవడానికి ఆజ్ఞ ఇవ్వమని అడిగాడు శ్రీరాముడు. జవాబుగా భరద్వాజుడు: "ధర్మం ద్వారా ప్రభావితుడైన శ్రీరామా! చిత్రకూట పర్వతం పవిత్రమైన, తియ్యనైన, కందమూలాల ఫలాలలతో, తేనెలతో, కూడిన స్థలం. అనేక రకాల చెట్లుంటాయక్కడ. కిన్నరుల, సర్పాల, ఏనుగులతో ఆశ్రయించబడింది. నెమిళ్ళున్నాయి. మిక్కిలి పుణ్యప్రదేశనీ. అందమైనది. కాబట్టి, శ్రీరామచంద్రా! అక్కడికి పో. అది నువ్వుండ తగిన స్థలం. అక్కడ ఏనుగుల గుంపులు, మృగ సమూహాలు, ఆసక్తిగా తిరుగుతుంటాయి. పర్వత శ్రేష్ఠమైన చిత్రకూటంలోని పాపనాశక మందాకినీ నదిలో స్నానం చేస్ది పితృ కార్యాలు తీర్చిన వారికి అశ్వమేధ యాగ ఫలం లభిస్తుంది. నీటి ప్రవాహాలు, కొండలోయలు, సంచారం చేసే ఏనుగులు, చీలిన రాళ్ల సందునున్న గుహలు, రాల సంధులు, చిలుకలు, కోవెలలు, ధ్వనించే చెట్లు, ఇవన్నీ నీ భార్యకు సంతోషం కలిగిస్తాయి". అంటాడు.

సర్గ-55

శ్రీరాముడికి చిత్రకూట మార్గం తెలిపిన భరద్వాజుడు

భల్లున తెల్లవారగానే రాజకుమారులు భరద్వాజుడి లాంటి మహర్షి అనుగ్రహానికి మనం పాత్రులమైనాం కదా! అని పరిపూర్ణ సంతోషంతో, మునికి నమస్కారం చేసి, చిత్రకూటం పోయే మార్గాన్ని గురించి అడగ్గా, వాళ్లను ఇంపైన మాటలతో ఆశీర్వదించి, బిడ్డల వెంట పోయే తండ్రిలాగా, శ్రీరాముడిని చూసి భరద్వాజ మహర్షి ఇలా అన్నాడు: "గంగా-యమునలు కలిసే చోటు చేరి అక్కడ యమున పడమటి ముఖంగా పారే చోట మీరు పడమటి మిఖంగానే ఏటి ఒడ్డు వెంబడి చాలా దూరం పోవాలి. అక్కడ గంగ నీరు అడ్డు పడకుండడం వాళ్ళవాళ్ళ యమునా నీరు త్వరగా పారుతుంది. ఆ ప్రదేశంలో జనుల రాకపోకల వల్ల తొక్కిడి ఏర్పడి బాట నలుగుతుంది. అక్కడే తెప్ప కట్టుకుని మీరు యమునను దాటిపోయి పచ్చని ఆకులున్న శ్యామమని పేరుతో, అనేక చెట్లుగల వృక్షాన్ని చూసి అది మంచి దీవెనలిచ్చే విధంగా సీతతో మొక్కినీచనీడి. సీత బడలికతో వుండడం వల్ల ఆ శ్యామ వృక్షం దగ్గర అలసట తీర్చుకావాలనుకుంటే కాసేపు ఆగవచ్చు. అలా కాకపోతే పోదల్చుకుంటే పోవచ్చు. అక్కడికి ఒక కోసెడు దూరంలో నీలవనం వుంది. అక్కడ రేగులు, వెదుళు మనోహరంగా వుంటాయి. అందంగా వున్న ఈ దారిలో నేను చాలా సార్లు పోయాను. రాళ్లు, రప్పలు వుండవు... కార్చిచ్చు భయం లేదు".

ఈ విధంగా భరద్వాజుడు చిత్రకూటానికి వెళ్లే మార్గాన్ని చెప్పి "శ్రీరామచంద్రా! ఇక నేను ఆగేనా?" అని అడిగాడు. శ్రీరాముడు వినయంతో మంచిదని అంగీకరించాడు. వెంటనే పరిశుద్ధ చరిత్రుడైన భరద్వాజుడు వెనక్కు వెళ్లిపోయాడు. మునీశ్వరుడి దయవల్ల పుణ్యం చేసిన వాళ్లమైనామని లక్ష్మణుడితో అంటాడు శ్రీరాముడు...అలా మాట్లాడుతూనే నడక సాగించారు. అంతవరకు వెనుకపోతున్న శ్రీరాముడు ముందుగా యమునా తీరం వెంట పోయి, ఆ నది వేగంగా పారే చోటు చూసి, ఈ నది ఇక్కడ ఎలా దాటగలమా? అని శ్రీరామలక్ష్మణులు ఆలోచనచేశారు. కట్టెల మోపు తెచ్చి శ్రీరామ లక్ష్మణులు

తెప్ప బిగించారు. అలా కట్టిన తరువాత ఎండిన వెదురు బొంగులను కట్టి, దానిపై వట్టి వేళ్ళు పరచి, ఆ మీద సన్నటి పబ్బ కొమ్మలను, నేరేడు కొమ్మలను కూర్చి, ఆసనాన్ని లక్ష్మణుడు ఏర్పాటు చేశాడు.

లక్ష్మీదేవిలాగా అచింత్య మహిమ గల సీతను, సుందరిని, కొంచెం సిగ్గుపడుతున్న దానిని, కొంచెం చిరునవ్వు కలదానిని, శ్రీరాముడు ముందుగా తెప్పపై చేతిని పట్టుకుని ఎక్కించాడు. లక్ష్మణుడు నీళ్లలో దిగి, పడవ కదలకుండా పట్టుకున్నాడు. ఆమె సొమ్ములను, చీరలను, తమ ఆయుధాలను, గడ్డపార, తోలుగప్పిన గంప లాంటి వాటిని శ్రీరాముడు సీత పక్కన వుంచాడు. శ్రీరామలక్ష్మణులు కదలకుండా ఆ తెప్ప పట్టుకుని, సీతను ఎక్కించి, భయం లేకుండా దాటే సమయంలో నది మధ్యకు పడవ వచ్చినప్పుడు, సీతాదేవి చేతులు జోడించి ఆ నది గురించి సంతోషంతో ఇలా అంది: "దేవీ! యమునా నదీ! నిన్ను దాటి పోతున్నాం. నా పాతివ్రత్యం భంగం కాకుండా, వనవాసం పూర్తిచేసి, సుఖంగా మరలి వచ్చేట్లు అనుగ్రహించు. మరలి అయోధ్యాపురికి పోయేటప్పుడు, వేయి ఆవులు బ్రాహ్మణులకు ఇస్తాను. నూరు కల్లు కుండలు నువ్వు మెచ్చుకునేట్లు నీకిస్తాను". ఇలా సీత నమస్కారం చేస్తుండగానే మంచి రసవంతములైన చెట్లతో ఆనందింప చేసే దక్షిణ తీరానికి తెప్ప పోయింది. అప్పుడు శ్రీరామలక్ష్మణులు సీతను అక్కడ దింపి, పడవకట్లు విప్పారు.

శ్యామ వటవృక్షాన్ని చేరిన సీతారామలక్ష్మణులు

యమునా నది ఒడ్డున వున్న వృక్షాలను వరుసగా చూసుకుంటూ పోయి, మనోహరమైన ఆకుపచ్చ రంగుగల ఆకులతో, చల్లగా, నిర్మలంగా, వున్న "శ్యామ"మనే పేరుగల మర్రి చెట్టును సమీపించారు సీతారామలక్ష్మణులు. మర్రి చెట్టును చూసిన జానకీదేవి, దృఢమనస్సుతో "ఓ వృక్షరాజమా! నా పతి వనవాస వ్రతం పూర్తిచేసేట్లు నిండు ప్రీతితో నన్ను అనుగ్రహించు. నా నమస్కారం అందుకో. పరిమాణం లేని మంచి నడవడికల కౌసల్య, సాధువులతో పొగడబడిన గుణాలుకల సుమిత్ర అనే నా అత్తలను, మరల దర్శించేట్లు, నా నమస్కారం తీసుకుని, వారిని అనుగ్రహించు.

ఈ విధంగా ప్రదక్షిణ చేసిన సీతను చూసి శ్రీరామచంద్రుడు లక్ష్మణుడితో ఇలా అన్నాడు: “సీతను నువ్వు వెంట తీసుకుని ముందు పో. ఆయుధాలు ధరించి నేను వెనుక వస్తాను. ఇలా పోతుంటే దారిలో సుందరమైన పుష్పం కాని, పండు కాని సీత అడుగుతే నువ్వు దాన్ని తెచ్చి ఇవ్వు”. జవాబుగా లక్ష్మణుడు “అలానే” అంటూ, ముందుకు సాగాడు. వాళ్లిద్దరి మధ్య పోతున్న సీత, రెండు మదించిన ఏనుగుల మధ్య పోతున్న ఆడ ఏనుగులాగా వుంది. అలా ఆమె వింతలు చూసుకుంటూ నడిచింది. పూర్వం ఎప్పుడూ చూడని అమిత ఆశ్చర్యం గల చెట్టు కాని, పుష్పం కాని, పూపొద కాని, కనబడినప్పుడు, సీతాదేవి “రామా! దాని పేరేంటి?” అని ప్రేమతో ప్రశ్నించేది. “బలే! బలే! రామచంద్రా! ఈ ఆకు చూడు. ఎంత వింతగా వుందో? రామా! ఈ పుష్పం చూడు. ఏమి దీని సౌందర్యం? ఆహా! చిగురు హృదయాన్ని కరిగిస్తున్నది. ఈ నునుపైన మొక్క అందం సెబాసు”. అని సీత అనగానే, ఆమె మనసు దానిమీద పోయిందని భావించిన లక్ష్మణుడు వాటిని తెచ్చి భక్తితో ఇచ్చేవాడు. వినోదకరమైన ఇసుక వెంట, మనోహరమైన హంసల ధ్వనుల మధ్య, నిర్మలమైన యమునా నది పక్కన కోసెడు దూరం ప్రయాణం చేసి, అక్కడ జింక మాంసం తిని రాజకుమారులు ఆ పూట గడిపారు. నెమళ్ళ కేకలు, కోతుల కిచకిచలు, ఏనుగుల ఘీంకారాలు వ్యాపించిన యమునాతీరంలో, సీత నచ్చిన నీటిఒడ్డున బలశాలులైన రామలక్ష్మణులు ఆగిపోయారు.

❖ ❖ ❖

సర్గ-56

సీతకు చిత్రకూటంలోని చిత్రాలను చూపిన శ్రీరాముడు

ఆ రాత్రంతా ఆ ఏటి ఒడ్డునే గడిపి, ఉదయం కాగానే, కొంచెం నిద్రించిన లక్ష్మణుడిని శ్రీరాముడు మెల్లగా నిద్రలేపాడు. లేపి, "సౌమిత్రీ! అడవిలోని కోయిలలు, చిలుకలు, గోరువంకలు, కలకలమని విన ఇంపుగా కూస్తున్నాయి. విన్నావా? ఇక ప్రయాణం చేద్దాం" అని శ్రీరాముడు అనగా, లక్ష్మణుడు నిద్రమబ్బును, బడలికను, తొలగించుకున్నాడు. అందరూ ఏటి నీళ్లలో స్నానం చేసి, సంధ్యాదులు తీర్చుకుని, భరద్వాజ ముని చెప్పిన మార్గంలో చిత్రకూటానికి పోసాగారు. దారిలో శ్రీరామచంద్రుడు సీతాదేవికి అక్కడి చిత్రవిచిత్రాలను చెప్పుకుంటూ నడవసాగాడు.

"సీతా! అదిగో! మోదుగు చెట్లు, అడవులు కనపడుతున్నాయి చూసావా? అవి వికసించిన పూలతో ఎర్రగా మండుతున్నట్లు కనిపిస్తున్నాయి. ఈ వసంత కాలంలో మనోహరమైన పూదండలతో అలంకరించుకున్న విధంగా వున్నాయి. పూచినా జీడిచెట్లు తమ చుట్టూ కంపలను, పొదలను పెంచుకుని, సమీపంలోకి జనాలను రానీయకుండా తమ పళ్ళతో, ఆకులతో బరువుగా వంగి వున్నాయి. చూసావా! ఇలాంటి జీవనసాధనమైన చెట్లు వుండడం వల్లనే నేను బతకగలిగాను". (దీని వలన శ్రీరాముడు ముఖ్య ఆహారం ఫలాలే అని అర్థమవుతున్నది).

లక్ష్మణుడితో రాముడు "తేనెటీగలు కూర్చిన తేనె పొరలు ఒక్కొక్కటి రెండు తూముల తేనెతో నిండి తాగేవాడు లేక, కొండ కొండలో చేట్టుకొనల్లో వేలాడుతున్నాయి. చూశావా తమ్ముడూ? లక్ష్మణా! అత్యూహాలు, పూలతో ప్రకాశించే రమ్యమైన అడవి ప్రదేశాల్లో పూ చిగుళ్ల పానుపులలో విస్తారంగా కూస్తుంటే, నెమళ్లు మారు కూస్తున్నాయి. ఏనుగుల గుంపుతో ప్రకాశిస్తూ, మనోహరమైన పక్షుల ధ్వనులతో అలరారుతూ వుండే చిత్రకూట పర్వతం ఇదిగో కనపడుతున్నది లక్ష్మణా చూడు! ఆ పర్వతం సమీపంలో రమ్యమైన సమ ప్రదేశంలో ఆకులు నిండిన చెట్లున్న అందమైన చోట మనం నివసిద్దాం" అంటాడు.

ఈ విధంగా చెప్పిన శ్రీరామచంద్రుడు, తమ్ముడు లక్ష్మణుడు, భార్య సీత తోడురాగా, గమ్యస్థానం చేరాం కదా అని సంతోషపడతాడు. అనేక పక్షుల ధ్వనులతో, విస్తారమైన పండ్లతో, దుంపలతో, తియ్యటి జలంతో, సుందర మనోజ్ఞ తీగలతో, చెట్లతో, తపస్సు చేసుకునే మునులకు వాసయోగ్యమైన చిత్రకూట పర్వతం చేరి "లక్ష్మణా! మనమిక్కడ సుఖంగా జీవించవచ్చు. ఎంకంటే ఈ స్థలం మనస్సుకు సమ్మతమై, ఇంపై వుంది. ఫలాలు, మూలాలు విస్తారంగా వున్నాయి. నానావిదాల తీగెలు, చెట్లు పుష్పించి వున్నాయి. గొప్ప తపోధనులైన ముని శ్రేష్టులు ఈ పర్వతం సమీపంలోనే నివాసం ఏర్పాటు చేసుకున్నారు. మనం ఈ పర్వతమే నివాసంగా చేసుకుని సంతోషంగా వుండవచ్చు" అని అంటాడు శ్రీరాముడు.

వాల్మీకి మహర్షిని సందర్శించిన శ్రీరాముడు

తమ వెనుక వినయంగా లక్ష్మణుడు రాగా, శ్రీసీతారాములు ముందుగా పోయి మహాత్ముడైన వాల్మీకిని చూసి వరుసగా నమస్కారం చేశారు. (మిగతా ఋషీశ్వరుల దగ్గరకు పోయినపుడు శ్రీరాముడే ముందు పోయి నమస్కారం చేశాడు. వాల్మీకిని చూడడానికి పోయినపుడు సీత ముందుగా పోయి మొక్కింది. రాగల కాలంలో వాల్మీకితో పని వుంది కాబట్టే ఇలా జరిగి వుండవచ్చు. బాలకాండలో వాల్మీకి తమసా నదీ తీరంలో వున్నట్లు చెప్పడం జరిగింది. ఇప్పుడు చిత్రకూటంలో వున్నట్లు చెప్తున్నారు. శ్రీసీతారామలక్ష్మణులు చిత్రకూటానికి వచ్చినపుడు వాల్మీకి అక్కడే వున్నాడు. భరత దర్శనానంతరం మునులందరూ చిత్రకూటం విడిచి పోయినప్పుడు వాల్మీకి తమసా తీరం చేరాడు. అగస్త్యుడు లాగానే ఒకే ఋషి పలుచోట్ల వుండడం జరగొచ్చు. ఇది ఉరు విడిచిన ఆరవ రోజు.

పుణ్యాత్ముడైన వాల్మీకి వారందరికీ పూజలు చేసి కూర్చోమని చెప్పి, సుఖాసనాలు వేశాడు. వాళ్ళ క్షేమ సమాచారాలు అడిగి తెలుసుకున్నాడు. శ్రీరామూడు శాస్త్రప్రకారం తమ వివరాలను చెప్పాడు. తాము వచ్చిన కారణాలను చెప్పాడు. ముని దగ్గర సెలవు తీసుకున్నాడు. తరువాత, గట్టివి, శ్రేష్ఠమైనవి అయిన కొయ్యలు తెచ్చి ఒక పర్ణశాల, సుందరంగా, వానకు

చెడకుండా దృఢంగా వుండేట్లు నిర్మించమని తమ్ముడు లక్ష్మణుడితో చెప్పాడు. లక్ష్మణుడు అలాగే ఏర్పాటు చేశాడు.

చిత్రకూటంలో పర్ణశాల నిర్మించిన శ్రీరామలక్ష్మణులు

గాలికి, వానకు చలించని పర్ణశాల గోడలు, బయటి ఆవరణలు, దృఢంగా కట్టబడి పదిలంగా వుండడంతో, ఆ కుటీరాన్ని చూసి తాను ఏ పని చెప్పినా ఇతర కార్యాలపై మనసు పోనీయకుండా, దాన్నెలా పూర్తి చేద్దామా అని తన కైంకర్యం మీదే వుండే లక్ష్మణుడిని చూసి సంతోషించిన శ్రీరాముడు ఇలా అన్నాడు: "లక్ష్మణా! జింక మాంసాన్ని సంపాదించు. గృహ దేవతలను పూజించి శాస్త్ర ప్రకారం శాంతి చేయాలికదా? ఇది భూమ్మీద చిరకాలం బతకాలనుకునేవారికి అవశ్యం చేయాల్సిన పని. కాబట్టి శాస్త్రంలో చెప్పినట్లు ఆ విదానాన్ని స్మరణకు తెచ్చుకో. జింకనొకదాన్ని చంపి తే". లక్ష్మణుడు వెంటనే శ్రీరాముడు చెప్పినట్లు చేశాడు. తెచ్చిన జింక మాంసాన్ని పక్వం అయ్యేదాకా వండమని చెప్పాడు శ్రీరాముడు. లక్ష్మణుడు నల్ల జింక మాంసాన్ని నెత్తురు పోయేదాకా వండాడు. ఆ తరువాత శ్రీరాముడితో, జీవించి వున్నప్పుడెలా వుండేదో, అలానే, అవయవాలేవీ విచ్ఛిన్నం కాకుండా వండానన్నాడు. చేయాల్సిన కర్మ విధానంలో నేర్పరైన శ్రీరాముడిని దేవకార్యం పూర్తి చేయమని ప్రార్థించాడు.

లక్ష్మణుడు ఇలా చెప్పగానే, శ్రీరాముడు, వారుణ స్నానం చేయించి, వాస్తుదేవతల మంత్రాలు జపించి, చేయవలసిన ఇతర కార్యాలు పూర్తిచేసి, గృహదేవతలను తృప్తిగా పూజించి, అందరూ చూస్తుండగా శ్రీసీతారామ లక్ష్మణులు లోపలి ప్రవేశించారు. పిమ్మట శ్రీరామచంద్రుడు సంతోషంగా వైశ్వదేవం జరిపించాడు. బలి వేసి, రౌద్ర బలి, వైష్ణవ బలి చేసి, వాస్తుదోషాలు పోయేట్లు పుణ్యాహవచనం, శాంతి జపం లాంటి శుభకార్యాలు ఆచరించాడు శ్రీరాముడు. మళ్లీ మరోమారు నీళ్లలో మునిగాడు. క్రూర భూతాలకు శాంతికలిగేట్లు బలులిచ్చారు. ఈ విధంగా తమ మేలుకోరకై శాస్త్రంలో చెప్పినట్లు, పలువురు ఋషులు మెచ్చుకునేట్లు సర్వ కార్యాలు నెరవేర్చారు.

ఆశ్రమానికి తగినవిధంగా అరుగుల్లాంటి బలిపీఠాలు, విష్ణు మందిరాలు, చక్కగా ఏర్పరిచి, అడవిపూల దండలు, పండ్లు, బక్క మాంసాలను, వేదమంత్రాలతో మంత్రించిన తీర్థాలను, దర్భల సమూహాలను, సమిధలను, శాస్త్రంలో చెప్పిన విధంగా సీతా సమేతంగా పవిత్రంగా చేసిన శ్రీరాముడు దేవతల సభ సుధర్మలో ఇంద్రుడిలాగా ప్రకాశించాడు. అనేక విధాలైన మృగాలతో, పక్షులతో కూడినదై, అందమైన చెట్లతో ప్రకాశిస్తూ, ఏనుగులు ఇతర మృగాల ధ్వనులతో నిండినదై, మంచి తీరాలు కల మాల్యవతీ నది ఒడ్డున ఉల్లాసంగా శ్రీసీతారాములు తమ పరదేశవాసంలో కలిగే కష్టాలను పూర్తిగా మరచిపోయి ఆనందంగా వున్నారు.

ఇదిలా వుండగా అక్కడ అయోధ్యలో జరిగిన వృత్తాంతం మరో విధంగా వుంది.

❖ ❖ ❖

సర్గ-57

అయోధ్యకు మరలపోయిన సుమంత్రుడు

దుఃఖ పీడితులైన సుమంత్రుడు, గుహుడు, తమ కంటికి కనపడేదాకా పోతున్న శ్రీరాముడిని చూస్తూ, ఆ విషయాలే మాట్లాడుకుంటూ, ఆయన కనపడకపోవడంతో ఇంటికి వెళ్ళిపోయారు. శ్రీసీతారామలక్ష్మణులు గంగ దాటిన తరువాత, మొదటిరోజు ఒక చెట్టు దగ్గరకు పోవడం, రెండవనాడు భరద్వాజాశ్రమంలో వుండడం, మూడవ దినం యమునా తీరంలో వుండడం, నాల్గవ దినం చిత్రకూటానికి పోవదానికి సంబంధించిన సమాచారమంతా ఐదవ దినం చారులు గుహుడితో చెప్పారు. ఇది విన్న సుమంత్రుడు శ్రీరాముల వృత్తాంతమంతా తెలుసుకున్నందువల్ల, గుహుడి అనుమతి తీసుకుని, అయోధ్యాపురానికి రథం తోలుకుని పోయాడు. దారిలో ఒకవైపు దుఃఖపడుతూనే, కనిపించిన సువాసనగల వనాలను, నదులను, పట్టణాలను, చూసుకుంటూ పోయాడు.

సుమంత్రుడు ప్రవేశించిన అయోధ్యాపురం శబ్దహీనంగా, చూడడానికి పాడుపడినట్లుగా, గుర్రాలుకాని, ఏనుగులుకాని, ప్రజలుకాని, రాజులుకాని కనపడకుండా వుండడంతో, ఆయన కన్నీళ్లు కార్చుకుంటూ, శ్రీరామ శోకాగ్నిలో దహించుకుంటూ వున్న విధంగా కనిపిస్తున్న ఊళ్లోకి చేరాడు. అలా పోతున్న సుమంత్రుడికి పురజనులు శోకంతో వాచిన మొగంతో రథానికి అడ్డుతగిలి, శ్రీరాముడు ఏడని అడిగారు. గంగాతీరంలో శ్రీరాముడి ఆజ్ఞ తీసుకుని మరలి వచ్చానని, ఆయన వెళ్లిపోయాడని సుమంత్రుడు చెప్పగా, "హా! రామా!" అంటూ పౌరులు దుఃఖించారు.

సుమంత్రుడి రథాన్ని చూసి దుఃఖించిన పౌరులు

హా! అనే వారు, రాజకుమారా! అనేవారు, ఇంకేం బతుకు అనేవారు, గుంపులుగా గూడి ఇక మనమేం చేయగలం? అనేవారు, బతికినా చచ్చిన వారితో సమానమే అనేవారు, దానాలకు, యజ్ఞాలకు, పుణ్యసభలకు, పెండ్లిల్లకు

శ్రీరాముడిని చూడలేం కదా? అనేవారు అక్కడ కానవచ్చారు. పురజనులు ఇంకా ఇలా అనుకుంటున్నారు: "ఆ శ్రీరాముడి ముఖం ప్రీతితో మనం చూడలేకపోతే, మనం ఎంత పాపరహితులమైనా, మనకేం సుఖం వుంటుంది? (పాపరహితుడైనా భగవత్ సాక్షాత్కారం లేకపోతే, ముక్తి-సుఖం లేదని అర్థం). మనమెంత ఆర్యులమైనా చంద్రుడిలా కళ్లకు ప్రీతికలిగించు వాడిని, సూర్యుడిలా లోకహితం కోరే వాడిని, చూడకపోతే మనకేం లాభం? సూర్య-చంద్రులను చూడడానికి కళ్ళు లేనివాడు ఇంకేం ప్రియమైన వస్తువులను చూడగలడు? మనమెంత పుణ్యాత్ములమైనా ఆ కమలాక్షుడి సమీపంలోకి పోలేకపోతే మనకు సుఖం కలిగించేది ఇంకేం వుంటుంది? సాయుజ్యం కలిగితేనే శాశ్వత సుఖం కలదు. దీనులమై వుండే మనకు తండ్రిలాగా రక్షించే శ్రీరాముడు విడిచి పోతే మనకిక దిక్కెవ్వరు? దీనదశలో కన్నతండ్రే రక్షకుడు. అలాంటివాడే విడుస్తే ఇతరులెవరు రక్షించగలరు? ఇంతెందుకు? ఆలోచించి చూస్తే, అలాంటి ధర్మాత్ముడు, అలాంటి పుణ్యమూర్తి, అలాంటి మంచి హృదయం కలవాడు, అలాంటి దయావంతుడు, విడిచిపోతే ఇలా దుఃఖ పడడానికి మనమెంత భాగ్యహీనులమో కదా? శ్రీరాముడు మనకేది సుఖం కలిగిస్తుందో, ఏది ప్రజలకు ప్రియమో, ఏది ప్రజలకందరికీ క్షేమకరమో, అని ఆలోచించి అవే చేస్తాడు. తండ్రిలాగా రక్షిస్తాడు."

(ఒకసారి జప పూజలతో భగవత్ స్పర్శ సాన్నిధ్యం కలిగి మళ్లా దాన్ని విడిచేవాడు నిర్భాగ్యుడే!)

శ్రీరాముడు అడవులకు పోయిననాడు దుఃఖంతో చాపచుట్టలాగా నేలపడిపోయిన వారు, సుమంత్రుడు రథంతో వచ్చాడని విని, శ్రీరామచంద్రమూర్తి మరల తిరిగోచ్చాడేమోనని భావించి కూడా, లేచి వీధుల్లోకి రాలేక కిటికీలనుంచే రథాన్ని చూసి, మళ్లీ రామవియోగ తాపంతో బాధపడ్డారు. ప్రజల దుఃఖాన్ని తాను చూడలేక, శ్రీరాముడిని అడవుల పాలుచేసి ఏమని వచ్చావని వారడుగుతారేమోనని సిగ్గుతో, వాళ్లు వేసే ప్రశ్నలకు జవాబు చెప్ప లేక, గుడ్డతో ముఖం కప్పుకుని, ప్రజలు చూడకుండా వేగంగా రథాన్ని తోలుకుని సుమంత్రుడు రాజు ఇంటివేపు పోయాడు. అక్కడ రథాన్ని దిగి, మెల్లగా పోతే

ప్రజలంతా చుట్టుముడతారేమోనని భయంతో, వేగంగా, పోయాడు. సుమంత్రుడిని చూసిన జనం గుంపులుగా గూడి, రామవార్త వినడానికి, రాజుగతి తెలుసుకోవడానికి వేచి చూసారు.

ఒంటి మేడలు, ఏడంతస్తుల మేడలు, ధనికుల ఇండ్లు, రాజుల ఇండ్లు, వీటిపైభాగాలందు స్త్రీలు నిలుచుండి శ్రీరామచంద్రమూర్తి లేని రథాన్ని చూసి, పెద్దగా హా! హా! అని వికారధ్వనులతో ఒకరిని ఇంకొకరు చూసుకుంటూ, హృదయం మండేట్లు దీర్ఘమైన కన్నీటి బొట్లు కార్చారు. అలా కార్చడం వల్ల, కాటుక కరగిపోయి, తెల్లటి కళ్లల్లో కన్నీరు కాల్వలై పారుతుంటే, అంతఃపుర స్త్రీలుండే ప్రాసాదాలలోని దశరథుడి భార్యలు రాజు సమీపంలో ఉన్నందున మెల్లగా ఏడ్చారు. వాళ్లిలా అనుకున్నారు: " సుమంత్రుడు శ్రీరామచంద్రమూర్తితో పోయి ఆయనను అడవులపాలు చేసి, వచ్చి తానేమని కౌసల్యకి సమాధానం చెప్పగలడు? ఆమెకేమైనా చెప్పినా, చెప్పకపోయినా, మనమెలా బతకాలి? ఎందుకు బతకాలి? ఇది సాధ్యమా? అయ్యో! శ్రీరాముడిని విడిచి కూడా కౌసల్య ఇంకా దేహం రక్షించుతున్నదికదా? ఎంత అసాధ్యమైన పని ఇది? దేహాన్ని రక్షించిన ఏం లాభం? సహించలేని దుఃఖతాపం ఎలా భరిస్తుంది?"

దశరథుడిని చూసిన సుమంత్రుడు

ఈ విధంగా రాజస్త్రీలు మాట్లాడుకుంటుంటే వింటూ, విస్తారమైన శోకాగ్నితో కాలిపోతున్నదా అన్నట్లున్న రాజగ్రుహంలో ఎనిమిదవ కక్ష్యలోకి ప్రవేశించాడు సుమంత్రుడు. అక్కడ దీనమైన మనసున్నవాడిని, బాధపడేవాడిని, పుత్రశోకంతో వాడిపోయిన వాడిని, తెల్లటి ఇంటిలో ఉన్నవాడిని, దశరథుడిని చూసి నమస్కరించాడు. శ్రీరాముడి మాటలన్నీ చెప్పాడు. దశరథుడు బదులు చెప్పకుండా అన్నీ విని, కలతపడిన మనసుతో నేలమీద మూర్ఛపోయాడు. అక్కడున్న స్త్రీలు ఆయనను ఎత్తుకుని హా! అంటూ తీవ్రంగా ఏడ్చారు. సుమిత్రాదేవి సహాయంతో నేలమీద పడిన దశరథుడుని కౌసల్య లేపి ఇలా అంది: " రాజా! ఇతడు అసాధ్య కార్యాలను సాధించే శ్రీరామచంద్రుడి దూత. అడవులనుండి వచ్చాడు. ఇంత అధర్మ కార్యాన్ని నేను చేశానుకదా అని ఇప్పుడెందుకు సిగ్గుపడతావు? నీకు చాలా పుణ్యం వస్తుందికాని లే...లేచి

నిలుచో! కార్యం అయిపోయిన తరువాత ఇపుడు ఏడ్చి ఏం లాభం? ఎవతెకు నువ్వు భయపడి నీ కొడుకు వార్త కూడా అడగలేవో ఆ నీ ప్రాణ ప్రియురాలు కైక ఇక్కడ లేదు. ఇది సత్యం. కాబట్టి ధీరుడవై మాట్లాడవచ్చు".

ఇలా చెప్పిన కౌసల్య దుఃఖ అధికంగా మూర్ఛపోయి నేలమీద పడిపోగా, అంతఃపుర స్త్రీలు చూసి హా! హా! అని ఏడ్చారు. మిగతా స్త్రీలు కూడా అలాగే ఆమెను చూసి బాధతో ఏడ్చారు.

❖ ❖ ❖

సర్గ-58

సుమంత్రుడిని శ్రీరామలక్ష్మణుల వృత్తాంతం అడిగిన దశరథుడు

ఈ లోపల రాజు మూర్ఛ నుండి లేచాడు. సుమంత్రుడిని అడిగి తన పెద్దకొడుకు సంగతులు తెలుసుకోవాలనుకున్నాడు. తనకు తెలిసిన విషయాలు చెప్పడానికి రాజు సమీపంలోకి వచ్చాడు సుమంత్రుడు. దశరథుడు అడిగాడు సుమంత్రుడిని..."అయ్యా! ఎంతో సుఖం అనుభవించాల్సిన ధర్మాత్ముడు శ్రీరాముడు, ఏ చెట్ల మొదళ్ళ కింద నివసిస్తున్నాడు? రాజకుమారుడై హంసతూలికాతల్పం మీద పడుకోవాల్సిన యోగ్యతకలవాడు, మిక్కిలి మృదువైన దేహంకలవాడు ఏ నేలమీద పడుకున్నాడు? ఎవనివెంట ఏనుగులు, గుర్రాలు, రథాలు, కాలిభటులు పోతుంటారో, అలాంటివాడు ఒంటరిగా ఏ అడవిలో దుఃఖిస్తున్నాడు? పాముల, మృగాల గుంపులతో కూడిన అడవిలో పిల్లవాళ్ళు ఎలా బాధతో కృశించారు? చిన్నది, సుందరి, మిక్కిలి పతిభక్తికలది, ఇది కష్టం, ఇది సుఖం, ఇది సత్యం, ఇది మోసం, అని తెలియని సీత తమ వెంటరాగా, నా కొడుకులు ఒంటరిగా నడచుకుంటూ, రథం దిగి ఎలా పోయారు?"

"సుమంత్రా! మందర పర్వతంలో అశ్వినీ దేవతలు ప్రవేశించినట్లు నా ఇరువురు కొడుకులు అడవిలో ప్రవేశించగా నువ్వు కళ్లారా చూశావు. అంతవరకు చూసే భాగ్యం నీకు కలిగింది. కాబట్టి నీ జన్మే సార్థకం. నిన్ను మరలిపోమ్మని చెప్పినపుడు శ్రీరాముడేమని చెప్పెను? లక్ష్మణుడేమన్నాడు? సీతాదేవి ఏం చెప్పింది? ఆ రామచంద్రుడుండే ప్రదేశం ఎలాంటిదో, దేనిని తిన్నాడో, చెప్తే ఆ చరిత్ర వినైనా సాదువుల్లో పడిన యయాతిలాగా నీ దేహాన్ని ధరించి వుంటాను. సాధుసాంగత్యం, సాదుసల్లాపం, ప్రత్యక్షంగా లభించనప్పుడు వారి చరిత్ర వినడమే మంచిది."

అని రాజు అడగగా, కన్నీళ్లు కుత్తుకదాకా రాగా, గద్గద స్వరంతో మాటలు తడబడుతుంటే, దుఃఖపడుతూ, దశరథుడితో సుమంత్రుడు ఇలా అన్నాడు.

శ్రీరాముడి మాటలను దశరథుడికి చెప్పిన సుమంత్రుడు

సుమంత్రుడు దశరథుడితో శ్రీరాముడి మాటలుగా ఇలా చెప్పాడు: "మొట్టమొదట నా గురించి తెలిసిన నా తండ్రికి నా మారుగా నేను మొక్కానని చెప్పి, పాదాలమీద పది నమస్కారం చేయి. తక్కిన వారందరికీ వారివారికి సరిపోయేట్లు నాకు బదులుగా నమస్కారాలు తెలుపు. అంతఃపుర స్త్రీలనందరినీ వారు కుశలమా? అని, నేను అడిగానని చెప్పు. ఆ తరువాత నా తల్లి కౌసల్యను కుశలమడిగి సాష్టాంగ నమస్కారం చేయి. అలా చేసి ఇలా చెప్పు.....తల్లీ! అన్ని కార్యాలను మునుపటిలాగే మరచిపోక చేయి. వ్యసనం వల్ల ఏపని మానవద్దు. ఎల్లప్పుడూ పాతివ్రత్య దర్మం విషయంలో స్థిరమైన బుద్ధిగల దానవై వుండు. నా కొడుక్కు ఇలాంటి కష్టం కలిగిందని నా తండ్రిని ఉపేక్షించవద్దు. సమయం ప్రకారం అగ్నిహోత్రాన్ని కాపాడు. భర్త పాదాలను దేవుడిని కొలిచినట్లే కొలువాలి. నా సవతికి వశపడి నన్ను అవమానించాడని భావిస్తూ, దశరథుడి సమీపానికి పోకుండా వుండవద్దు. నేను ఉత్తమ క్షత్రియ కన్యననే గర్వం వదలి, రాజుకు సమానురాలైన కైక మనసు నొప్పి కలగకుండా ప్రవర్తించు. ఆమె కొడుకే రాజు కదా అని ఆలోచించు. రాజులు దానం వల్లే వృద్ధులు కాని వయసు వల్ల కాదు అనే సామెత నీకు తెలుసుకదా? కాబట్టి రాజధర్మాలను మనసులో వుంచుకో. భరతుడు వచ్చినప్పుడు కుశల ప్రశ్నలను నేనడిగినట్లు నువ్వు అడుగు. సవతి కొడుకు వీడితో పనేంటని మాట్లాడకుండా వుండవద్దు. నా మాటలుగా నువ్వీ మాటలను అతడికి చెప్పు. అందరు తల్లుల విషయంలో న్యాయంగా వ్యవహరించు. ప్రభుత్వం చేతుల్లోకి రాగానే ముసలి తండ్రికి చిక్కులు కలిగించే ఆలోచనలు చేయొద్దు. తండ్రి చెప్పిన మార్గంలోనే రాజభోగాలు అనుభవించు....అని చెప్పమని చెప్పిన శ్రీరాముడు, కళ్లల్లో నీళ్ళు కారుతుంటే, ఇలా భరతుడితో చెప్పమనెను".

"తమ్ముడా! తన కొడుకు మీద ప్రేమ వున్న నా తల్లిని నీ తల్లిలాగా చూసుకో. నీ తల్లికి నీమీద ప్రేమ ఉన్నట్లే, నా తల్లికి నా మీద ప్రేమ వుండడాన్ని తప్పుగా భావించవద్దు. అని మిక్కిలి శోకంతో తలవంచి ఆ తరువాత చెప్పడం ఇష్టం లేక ఎర్ర తామరలాంటి కళ్లున్న శ్రీరామచంద్రుడు కళ్ళ నిండా నీరుంచాడు".

దశరథుడికి లక్ష్మణుడి మాటలను చెప్పిన సుమంత్రుడు

"లక్ష్మణుడు కోపంతో, తొట్రుపాటుతో, రోజుకుంటూ, ఇలా అన్నాడు..... ఓయీ సుమంత్రా! మీ రాజు ఏం దోషం చేశాడని పెద్దకొడుకు శ్రీరామచంద్రుడిని అడవుల పాలు చేశాడో చెప్పమను. సవతి కొడుకులమైన కారణాన మాకు కష్టం కలిగించాలనుకున్న కైక నీచమైన ఆజ్ఞను గొప్పగా, అనివార్యమైనదానిగా, శిరసావహించి చేయరాని చెడ్డ కార్యాన్ని, చేయాల్సిన కార్యంగా మీ రాజు చేశాడు. ఇచ్చిన వరాలు నెరవేర్చుట దోషమా? అని అంటాడేమో! అలా అయితే, వరాలిచ్చే సమయంలో శ్రీరాముడు అడవులకు పోవాలని కాని, భరతుడు రాజు కావాలని కాని కోరలేదు కదా? అప్పుడు కోరిన వరాలు, ఇప్పుడు కోరిన వరాలు ఒకటేనా? అని రాజు అడగలేదు. ఒక వేల ఒకటే అయినా, శాస్త్ర విరుద్ధమైన, పరులకు బాదాకరములైన, లోక గర్హితములైన వరాలను ఎలా ఇస్తాడు? ఒంటి కొడుకును, పెద్ద కొడుకును, విడువకూడదని శాస్త్రం చెప్పడం లేదా? శాస్త్ర విరుద్ధములైన వరాలివ్వ వచ్చునా? అలా కాకుండా, పరుల రాజ్యం అపహరించు కోరికతో చేసాడంటావా? అది కూడా తప్పే. శాస్త్ర ప్రకారం పెద్దవాడికి రావాల్సిన రాజ్యం చిన్నవాడికి ఎలా ఇస్తాడు? ఇవ్వనని చెప్పి వుండాల్సింది కదా? మీ రాజు శాస్త్ర మర్యాదను ఉల్లంఘించినందున, ఆ పాపానికి ప్రాయశ్చిత్తం లేదు".

"అయ్యా! దీంట్లో ఆయన దోషం ఏదీ లేదు, దైవం ప్రేరిపిస్తే ఇలా అయిందంటావా? దైవం అయినా కారణం లేకుండా నిష్కారణంగా ఏదీ చేయదు కదా? ఆ కారణం ఏంటో చెప్పమను. ఆయన సమ్మతించే ఇది చేస్తే, ఇప్పుడు ఏడవడం ఎందుకని అడుగు. ఆలోచనలేక ఇలాంటి లోక విరుద్ధ కార్యం చేసినందుకు మేం కూడా ఏడుస్తున్నాం. ఆ కారణం వల్లే రాజు కూడా ఏడుస్తున్నాడు. చేయాల్సిన కార్యం చేస్తే ఎందుకు ఏడవాలి? అయ్యా! తండ్రి విషయంలో నువ్వింత కఠినంగా మాట్లాడవచ్చా? అంటావేమో? సుమంత్రా! రాజు మీద నాకు జనకుడనే భావం పోయింది. ఇంత ఘోరకార్యం చేసినవాడు తండ్రి ఎలా అవుతాడు? కాబట్టి నాకు, అన్న అయినా, తండ్రి అయినా, భర్త అయినా, ప్రియబంధువైనా, శ్రీరామచంద్రుడే! శ్రీరాముడు కాకుండా వేరే సోదరుడు లేడు, భర్త లేడు, ఇష్ట బంధువు లేడు, తండ్రి లేడు...ఎవ్వరూ లేరు".

"నా మాటగా రాజునిలా అడుగు. సర్వ లోకాలకు, సమస్త భూతాలకు మేలుకోరేవాడు, సర్వ జనులకు ఇష్టుడైన వాడు, ఏ దోషం అంటనివాడు, ధర్మమందే ఆసక్తికలవాడు, జనులను సంతోషపెట్టేవాడు, అయిన, శ్రీరాముడిని విడిచి నువ్వు రాజు పేరును సార్థకం చేసుకోవాలనుకుంటే, ప్రజలందరినీ ఎలా రంజిల్ల చేయుదువో చెప్పమను. నువ్వు చేసిన పనికి నీ కైక, భరతుడు సంతోషించాల్సిందే కాని, మరెవ్వరూ సంతోషించరు. నువ్వు ప్రజలను రంజింప చేసినా, చేయకున్నా, నువ్వు ప్రభువుగా వుండతగవు. ఎందుకంటే....ఏ కాలంలోనైనా, ఎలాంటి అధర్మిష్టుడైనా చేయని లోక విరుద్ధమైన కార్యాన్ని చేసిన నువ్వు, భూమికి ఎలా ప్రభువుగా వుండగలవు? కాబట్టి రాజ్యాన్ని వదలి పొమ్మని నేను చెప్పానని చెప్పు".

"శ్రీరాముడిలా ప్రియం పలికాడు. లక్షణుడు నిష్టురాలాడాడు. ఇక సీత ఏమందంటావా? ఆమె దయ్యం పట్టిన దానిలాగా దిక్కు తోచక ఉరికే చూసింది కాని, ఎన్నడూ దుఃఖం తెలియని ఆమె ఏమీ చెప్పలేక ఏడుస్తూ కూర్చుండిపోయింది. కన్నీళ్లు కారుస్తున్న తన భర్త ముఖాన్ని చూసి, వాడిన ముఖంతో నన్ను చూసి, సీతాదేవి కన్నీరు కార్చింది. లక్ష్మణుడు శరచాపహస్తుడై అన్నాను కాపలాకాస్తూ నిలబడి వున్నాడు. శ్రీరాముడు ఏడుస్తూ, చేతులు మోడ్చి నిలబడి వున్నాడు. సీతాదేవి నన్నూ, రథాన్నీ చూసుకుంటూ దుఃఖిస్తూ వుంది. ఎవరేమైనా తనకు కావాల్సింది రామసేవ అనుకున్న లక్ష్మణుడు, ఆయనపైనే మనసుంచి, దృష్టి నిలిపి, వుండిపోయాడు. తన మీద ఇంత ప్రేమకలవారికి ఇంత కష్టం అని, తన కొరకు వచ్చెకదా! అని శ్రీరామచంద్రమూర్తి ఏడుస్తూ వున్నాడు".

❖ ❖ ❖

సర్గ-59

తాను వచ్చిన మార్గంలోని విశేషాలను దశరథుడికి వివరించిన సుమంత్రుడు

సుమంత్రుడు చెప్పిన మాటలు విన్న దశరథుదు ఆ తరువాతి కథా శేషాన్ని చెప్పమని అడిగాడు. జవాబుగా సుమంత్రుడు...."రామలక్ష్మణులు ఇద్దరూ జడలు ధరించి, కుశపవిత్రాలనే నారచీరెలు కట్టి, గంగ దాటి, ప్రయాగకు పోయే తోవన పోయారు. లక్ష్మణుడు శ్రీరాముడిని రక్షించుకుంటూ ముందుగా నడచాడు. లకష్మణుడి వెంట సీతాదేవి, ఆమె వెనుక శ్రీరాముడు పోయారు. ఇదంతా చూస్తే నాకు దుఃఖం ఆగలేదు. నేను గుర్రాలను రథానికి కట్టి, వెనక్కు తిప్పగా, శ్రీరాముడు తమని వదలిపోయాడని బాధతో, శోకంతో, విస్తారంగా వేడి కన్నీరు కారుస్తూ, గుర్రాలెంత అదిలించినా కదలలేదు..... వెనుకకు మరల లేదు".

"రాజా! నేను మరలి వస్తున్నప్పుడు తోవలోని చెట్ల పూలు, సగం విచ్చిన కాయలు, మొగ్గలు, వాడిపోయి వున్నాయి. కొలనులు, నదులు, చిన్న సరస్సులలోని నీళ్లు సలసలా కాగుతున్నాయి. చెట్లమీద ఆకులు వాడిపోయి వరుగుల్లా గలగలా శబ్దం చేస్తున్నాయి. ఇవన్నీ చూసిన నా మనసు విలవిలలాడింది. ఈ విధంగా రామవియోగాన్ని వృక్షాదులు కూడా సహించలేక పోయాయి. రామచంద్రుడికి కలిగిన కష్టం వల్ల పాములు ఆహారం కొరకు బయట తిరగడం లేదు. అడవి ఏనుగులు అవి వున్న చోటునే పడి వున్నాయి కాని కదలలేదు. క్రూర మృగాలు ధ్వనించలేదు".

"శ్రీరాముడి వియోగం వల్ల, ఆయనకు కలిగిన కష్టం వల్ల, నీటిలో దాగిన (తేలాడవలసిన ఆకులు మునిగాయి) తామరాకుల గుంపులను, దాగిన చేపలను, జలపక్షులను, వేడితో కాగిన తామరలను, వాటి తుడుములను చూశాను. గతంలో లాగా నీటి తామరలు కాని, మెత్త తామరలు కాని, కొంచెం కూడా వాసన ఇవ్వడం లేదు. తోటల్లో ఎక్కడి పక్షులు అక్కడే పడి, సంచారం లేకుండా, కలకల ధ్వని చేయకుండా, శూన్యంగా పడి వున్నాయి. ఇక ఊళ్లో ఒక్కరి

ముఖం కూడా తేరగా లేదు. మాటిమాటికీ నిట్టూర్పులు విడుస్తున్నారు. శ్రీరాముడు లేని కారణాన నేను వస్తున్నప్పుడు నిలువు గుండెపడి, కదలక–మెదలక నోటి మాట లేక బొమ్మల్లాగా నిలుచుని ప్రజలు చూస్తున్నారు.

పౌరుల దుఃఖాన్ని దశరథుడికి చెప్పిన సుమంత్రుడు

"శ్రీరామచంద్రుడు లేని రథాన్ని నేను తోలుకునిరాగా చూసిన పురజనులు సహించలేని దుఃఖాతిశయంతో, రాజవీధిలో తల్లడిల్లిపోయారు. ఆడవారు మేడలమీదనుండే, హా! అని బిగ్గరగా ఏడ్చారు. పురజనుల తీవ్ర శోకం గురించి ఇంతకంటే ఎక్కువగా నేనేం చెప్పగలను? స్త్రీల కన్నులనుండి నీళ్లు కారుతుంటే, కాటుక కరగిపోయి, తెల్లటి కళ్ళతో ఒకరినొకరు చూడలేక ఎవరంతట వారు దుఃఖం అణచుకోలేక ఏడ్చారు. జనులందరూ ఒకే విధంగా దుఃఖించడం వల్ల ఫలానా వారు మిత్రులనీ, ఫలాన వారు శత్రువులనీ, ఫలానా వారు మధ్యస్తులనీ తెలుసుకోలేక పోయాను. శ్రీరామచంద్రుడి విషయంలో మధ్యస్తులు కాని శత్రువులు కాని లేనే లేరు. సంతోషం కోల్పోయి శోకంతో పరితపించే గుర్రాల, ఏనుగుల ఏడ్పు ధ్వని, చింతతో కూడిన నిట్టూర్పుల మధ్యన ఇక్కడ కౌసల్యాదేవి ఎలా వుందో, అయోధ్య అంతా అలానే వుంది. శ్రీరామవియోగంతో కన్న తల్లి కౌసల్య ఎలా వుందో, పురమంతా అలానే వుంది. ఈమెను చూస్తే పురమంతా నువ్వు చూసినట్లే! ఈమె కన్నతల్లి అని ఎక్కువ దుఃఖం కాని, వారు అన్యులని తక్కువ దుఃఖం కాని కనబడలేదు".

ఈ విధంగా సూతుడు చెప్పగా రాజు విని, దృఢనీగా నాటిన శోకంతో మనస్సు చీలినవాడై డగ్గుత్తికతో మంత్రి శ్రేష్ఠుడైన సుమంత్రుడితో ఇలా అన్నాడు.

తనను శ్రీరాముడుండే ప్రదేశానికి తీసుకుపొమ్మని సుమంత్రుడికి చెప్పిన దశరథుడు

తాను అడిగిన ప్రశ్నలకు జవాబు చెప్పడమే కాకుండా, రాజ్య క్షోభాదుల గురించి కూడా సుమంత్రుడు వివరంగా వర్ణించడం విని దశరథుడు, తాను చేసినది లోక సమ్మతం కాని దుష్కార్యమని తెలిపే విధంగా సుమంత్రుడు రాజ్య క్షోభం గురించి చెప్పాడని అనుకుని, తానూ చేసింది నిజంగా దుష్కార్యమేనని అంగీకరిస్తూ ఇలా అన్నాడు.

"వంశపరంపరగా వచ్చిన పాపాభిప్రాయం కలిగిన, మూర్ఖురాలైన కైక ప్రేరణతో ఇది చేయవచ్చు-ఇది చేయరాదు అనే ఆలోచన లేక, ఆలోచన చేయగలిగే నేర్పరులైన మంత్రులు, పెద్దవారు, మేలుకోరేవారు, బుద్ధిమంతులైన పౌరులు ఇక్కడే పట్టాభిషేకానికై గుమిగూడి వున్నప్పటికీ, ఒక్కరితోనైనా సంప్రదించకుండా, స్త్రీలమీద నాకున్న దుష్కామంతో మతిచెడి, వెంటనే చేయకుంటే కొంప మునిగిపోతుందేమోనని త్వరపడి ఇంత సాహస కార్యం చేశాను. కులం ఈ విధంగా నాశనం కావాల్సి వుండడం వల్లే ఇంత భయంకరమైన దుఃఖం దైవికంగా తటాలున వెనుక-ముందూ ఆలోచించ నీయకుండ తటస్థించింది. అయిందేదో అయింది. నేను నీకెన్నడైనా, ఏదైనా మేలుచేసి వుంటే, దాని బదులు నాకు తిరిగి మేలుచేయడం నీకు ఇష్టమైతే, నన్ను శ్రీరాముడి దగ్గరకు తీసుకునిపో".

"అలా నేను పోవడం సరైంది కాదని నువ్వనుకుంటే, నేను పోతే అందరు జనులొస్తారని నువ్వు భావిస్తే, నేనొక మాట చెప్తా విను. నేను రాజునని, నా ఆజ్ఞ మీరరాదని నీకుంటే, శ్రీరాముడిని వెంటనే పిలుచుకుని రా. ఆ ప్రకారమో, లేదా, ఈ ప్రకారమో ఏదో ఒక విధంగా శ్రీరాముడిని చూడకుండిన, ఎక్కువ రోజులు నేను బతకను. శ్రీరాముడు మరలి రాడంటే, మనమిలా మాట్లాడుకుంటుంటే, ఆలస్యం జరిగి, శ్రీరామచంద్రుడు దూరంగా పోతాడు. కాబట్టి రథాన్ని సిద్ధం చేసి తీసుకుని రా. ఆ అప్రాకృత దివ్యసుందర విగ్రహాన్ని, ఆ మహా యశోవంతుడిని, ఈశ్వరుడిలాగా సర్వ జనుల హృదయాల్లో వుండేవాడిని, జీవితం వుండగానే చూడగలను. చిరునవ్వుతో అందమైన ముఖానికి రత్నాలు చెక్కిన పోగులతో, బాగా వికసించిన కమలాలలాంటి విశాలమైన కళ్ళతో, మొకాలునంతే నిడుపాటి చేతులతో, మనోహరమైన దంతాలతో, వున్న శ్రీరాముడిని నేను చూడకపోతే మరణించడం తథ్యం".

"సుమంత్రా! శ్రీరాముడిని విడిచి వుండడం కంటే, మిక్కిలి దుఃఖమైనది నాకేం వుంది? ఇలాంటి ఆసన్న మరనావస్థలో వున్నా నేను కళ్లారా నా శ్రీరామచంద్రమూర్తిని చూడకపోతే నాకేం దిక్కు? హా రామా! హా లక్ష్మణా! హా సీతాదేవీ! సహించరాని దాటరాని బాధతో దిక్కులేనివాడిలాగా చావనున్న నన్ను మీరు ఎరుగరుకదా?"

ఈ విధంగా రాజు దుఃఖసముద్రంలో మునిగిపోయాడు. కౌసల్యవైపు తిరిగి, "దేవీ! రామ శోకం అనే వైశాల్యం కలిగి, సీతా వియోగం అనే ఒడ్డును ఒరిసి, నిట్టూర్పు సుడులతో, కన్నీటి నురుగుతో, భయంకరంగా ఏడుస్తుంటే, చేతుల విదిలించడం లాంటి చేపల సంచారంతో, ఏడుపు అనే ధ్వని, విరియబోసిన వెంట్రుకలనే పాచి, కైక అనే బడబాముఖం కలిగి, నా కన్నీరనే నదుల వేగంతో పుట్టి, మంధర వాక్యాలనే మొసళ్లు, పాపాత్మురాలైన కైక వరాలనే చెలియలి కట్ట కలిగి, శ్రీరాముడి దేశ త్యాగమే నిడివిగాగల ఈ గొప్ప సముద్రంలో ఇప్పుడా శ్రీరాముడు సహాయుడై రాకపోతే నేను మునిగిపోతాను. ఈ దుఃఖం సముద్రాన్ని నేను దాటలేను. లక్ష్మణుడితో కూడిన శ్రీరాముడిని చూడడానికి ఆశతో వున్నాను. అయినా చూడలేకపోతున్నాను. ఇంతకంటే ఘోరపాపం వుంటుందా?" అంటూ దశరథుడు మూర్ఛపోయి పడిపోయాడు. కొడుకు కోసం, మగాడి కోసం దుఃఖం రెండితలు కాగా కౌసల్య వదలని భయంతో వణకింది.

❖ ❖ ❖

సర్గ-60

కౌసల్యను ఓదార్చిన సుమంత్రుడు

దయ్యం పట్టిన విధంగా దేహం తెలియకుండా, ప్రాణం పోయినట్లు చేష్టలుడిగిన కౌసల్య సుమంత్రుడిని చూసి, "సూత వంశ రత్నమా! శ్రీరాముడు, సీత, లక్ష్మణుడు ఎక్కడున్నారో అక్కడ నన్ను వదలిపెట్టు. నీకు పుణ్యం కలుగుతుంది. ఎందుకంటే, ఆ ప్రఖ్యాత చరిత్రులను విడిచి వుంటే ఒక్క నిమిషమైనా ప్రాణం నిలిచేట్లు లేదు. కాబట్టి నన్ను అక్కడ విడిస్తే నీకు ప్రాణ రక్షణ చేసిన పుణ్యం కలుగుతుంది. అయ్యా! సుమంత్రా! రథానికున్న గుర్రాలను ఇంకా విప్పలేదుకదా? విప్పవద్దు. రథాన్ని వెనక్కు తిప్పు. కల్యాణగుణాలే అలంకారాలుగా నా కొడుకులు వుండే దండకారణ్యంలో నన్ను త్వరగా వదలిపెట్టు. నా కొడుకులను నేను కలుసుకోలేకపోతే యమపురికి పోవడం నిశ్చయం" అని ఏడ్చిన కౌసల్యను చూసి నమస్కరించి సుమంత్రుడిలా అన్నాడు ఆమెతో.

"తల్లీ! శ్రీరాముడు విడిచి పోయాడన్న దుఃఖాన్ని వదులు. అడవుల్లో వారికి ఏ ఆపద కలుగుతుందో అన్న అనుమానాన్ని కూడా పెట్టుకోకు. శ్రీరాముడికి దుఃఖం కలిగిందన్న మతిభ్రమ వదులు. ఏ బాధా లేకుండా నీ కొడుకు, కోడలితో సహా, అడవుల్లో తిరుగుతున్నాడు. లక్ష్మణుడేమో ధర్మం మీద వున్న గౌరవంతో శ్రీరామచంద్రుడి పాదకమలాలనే గొప్ప పరమపదాన్ని పొందగోరి, ఇంద్రియాలను జయించి, ప్రాకృత సుఖాలను కోరక, నియమం తప్పకుండా సేవిస్తున్నాడు రాముడిని. ఇక స్త్రీరత్నమైన సీతాదేవి మనసంతా శ్రీరాముడి మీదనే నిలిపి, తన ఇంట్లో ఎలా వుంటుందో, అలాగే ఎప్పటిలాగే, కొత్త స్థలమని అనుకోకుండా, తృప్తిగా, భయం కొంచెమైనా లేకుండా, బాద ఎంతమాత్రం పడకుండా, దీరురాలిలాగా సంతోషంగా తిరుగుతున్నది. తన మనసంతా తన భర్తమీదే వుండడం వల్ల తానరణ్యంలో వున్నా విషయమే ఆమెకు స్ఫురణకు రావడం లేదు".

(భక్తుల చరిత్ర ఇంట్లో వున్నా, అడవిలో వున్నా, ఒకే విధంగా వుంటుంది. ఇల్లు అడవిలాగా, అడవి ఇంటిలాగా, కనిపిస్తుంది. అక్కడా-ఇక్కడా చేయాల్సిన పని శ్రీరాముడి మీద మనసు నిలపడమే! అందులో పొరపాటు వుండకూడదు. తక్కినవేవైనా భయంలేదు. అడవే అయోధ్య అని సుమిత్ర చెప్పింది కదా!)

"స్త్రీలు తిరిగే ఉద్యానవనాలలో ఎలా పూర్వం భయం లేకుండా తిరిగిందో, అలాగే, సీత మనుష్యులు లేని అడవుల్లో సంతోషంగా తిరుగుతున్నది. సీతాదేవి తన మనసును తన భర్త స్వాధీనంలో వుంచి, మనుష్యులు లేని అడవుల్లో కూడా చిన్న పిల్లలాగా ఆడుకుంటున్నది".

(ఇంద్రియాల మూలాన మనసు పోయి విషయాల సంస్పర్శ కలుగుతేనే అవి కనబడడం, వినపడడం, జరుగుతుంది. మనసు ఏకాగ్రంగా భగవంతుడి మీద వుంచితే ఏదీ కనపడదు. ఏ ధ్వనీ వినపడదు. దేన్నీ చూడడం, వినడం లేనప్పుడు, భయం ఎక్కడినుండి వస్తుంది?)

"ప్రాణం శ్రీరాముడి స్వాధీనం చేసి, రక్షాభారం ఆయన మీదే వేసి, మనసు ఆయనపైనే నిలిపిన సీతకు, శ్రీరాముడులేని అయోధ్య అడవే...అడవే అయోధ్య. మనసు, ప్రాణంలేని దేహం ఎక్కడున్నా ఎలా సుఖపడగలదు? భక్తులకు, భక్తురాళ్లకు, సీతాచరిత్ర అనుసరణీయం. సదా స్మరణీయం. దారిలో పోతున్నప్పుడు సీతాదేవి, శ్రీరామలక్ష్మణులను, గ్రామాల పేర్లు, ఊళ్ల పేర్లు, నదుల పేర్లు, చెట్ల పేర్లు ఏమిటనీ, నదులెక్కడికి పోతాయనీ, ప్రశ్నలు వేస్తూ నడుస్తుందికాని, ఏడుస్తూ వుండదు. నిర్మలమైన మనసున్న సీత, మన నగరంలో ఒక కోసెడు దూరంలో వున్న ఉద్యానవనంలో ఎలా ఆటలాడుకుంటుందో, అలాగే అడవిలో కూడా తిరుగుతున్నది. ఆమెకోసం పామరులు ఏడవాలికాని, నీలాంటిది ఏడవ వచ్చా?"

"అమ్మా! సీత గురించి నాకు జ్ఞాపకం వున్నా విషయాలివే. కైకేయి గురించి ఏవో కొన్ని మాటలు చెప్పిందికాని అవి జ్ఞాపకం లేవు. ప్రయాణపు బడలిక వల్ల కాని, క్రూరమైన గాడ్పుల వేగం వల్ల కాని, ఎండ వేడివల్ల కాని, సీతాదేవి వెన్నెలతో సమానమైన దేహకాంతి, కొంచెమైనా మారలేదు. అమ్మా! ఇది నిజం. నీపాదాలపైన ఒట్టు పెట్టుకుని చెప్తున్నాను. తామర రేకుతో సమానమైన

చంద్రుడిలాగా ప్రకాశించే ఆ సీతాదేవి యుద్ధంలాంటి ముఖ వికాసం కొంచెమైనా మారలేదు. పాదాలు చిగుళ్లలాగా ఎర్రగా, ఎప్పటిలాగా స్వభాసిద్ధంగా, తామర మొగ్గల్లాగా వున్నాయి. సోమ్ములమీద ఆశతో సీతాదేవి, తన అందెలను పాదాల నుండి తీయకుండానే, శ్రీరాముడితో సమానంగా, వేగంగా, అడవుల్లో నడుస్తుంటే, అందెలు ఘల్లు-ఘల్లున సవ్వడి చేస్తుంటే నేను చూశాను. ఇంకా ఎందుకమ్మా...విచారం?"

"శ్రీరాముడి బాహువులనే కోటను రక్షగా చేసుకుని, అడవిలో క్రూర మృగాలను చూసి ఏమాత్రం భయపడదు. శ్రీరామ రక్షితులు దీరులుకాకుండా భీరువులవుతారా? అమ్మా! వారు అడవుల్లో కష్టపడుతున్నారని కాని, మనల్ని విడిచిపోయి మనకింత దుఃఖం కలిగించారనికాని, రాజు వారిని అడవులపాలు చేసెనే అని కాని, నువ్వు బాధపడవద్దు. వీళ్ల చరిత్ర స్థిరమై కీర్తితో భూమ్మీద నిలుస్తుంది. అయ్యా! దిక్కుమాలిన పక్షుల్లాగా నిష్కారణంగా అడవుల్లో అల్లాడుట కీర్తి కార్యమా? అంటావేమో? దానివలన ఇహమా? పరమా? అని అడుగుతావేమో? అదికాదమ్మా! అడవులకు ఎందుకు పోయాడు? పాపం చేసి శిక్ష అనుభవించడానికి పోయాడా? లేదుకదా? జనకుడి ఆజ్ఞ నిర్వహించడానికి, తన సత్యం లోకానికి తెలియచేయడానికి, పోయాడు. పోయినవాడు మునిజనుల్లాగా వానప్రస్థ మార్గంలో ఫలాలు, పత్రాలు తింటూ, ధర్మ మార్గంలో శాశ్వతమైన కీర్తిని సంపాదించుకుంటున్నాడు. కాబట్టి బాధపడవద్దు".

అని సుమంత్రుడు చెప్పగా కౌసల్య కొడుకుని తలచుకుని సుకుమారా! కుమారా! రామా! అని ఏడ్చింది.

❖ ❖ ❖

సర్గ-61

దశరథుడితో అతడి దుశ్చర్య గురించి చెప్పి ఏడ్చిన కౌసల్య

ఇలా ఏడుస్తూ కౌసల్య మగాడిని చూసి ఇలా అంది: "రాజా! నీకు దాత అని, దయగలవాడని, సత్యవాది అని, అధిక కీర్తి అగును కాక అని చెప్పవచ్చు. రాజా! ఆడది కోరినంత మాత్రానే వరాలిచ్చే ఎంతటి దాత? అనీ; వయసు ఆడపిల్ల దుఃఖం చూసి సహించలేక మనసు కరిగేవాడయ్యే అంతటి దయావంతుడు కదా? అనీ; కొడుకులు, కోడలు, పెళ్లాలు, దేశమంతా ఏడ్వనీ, తాను చావనీ కాని పెళ్లానికి చెప్పిన మాట తప్పని సత్యవాది అనీ; తనను ఎంతో అప్రియమైన మాటలన్నా ప్రియాలే పలికే ప్రియైకవాదనీ; నానా వ్రతాలు ఉపవాసాలు ప్రయాసపడి కన్నా పెద్దకొడుకును అడవుల్లో విడిచిపెట్టే త్యాగి అనీ; లోకంలో నీకు అధికమైన కీర్తి వస్తే రానీ, కాని, ఎంతో సుఖంగా పెరిగిన ఈ చిన్న బిడ్డలు, మహారాజు కూతురు సీత ఎలా అడవుల్లో దుఃఖ పడతారని అనుకున్నావు?"

"రాజా! మగ పిల్లలెలాగైనా అడవుల్లో బాధ పడతారని అనుకున్నా, చలికి వణకక, వేడికి తపించక, గాలికి వడబడక, అడవుల్లో లేతవయసుది, సుఖం అనుభవించాల్సిన వయసున్నది, సుఖం అనుభవించడానికి అలవాటుపడ్డది, మృదువైన శరీరం కలది, మిథిలారాజు కూతురు, సీత ఎలా తిరగ గలదో నువ్వే చెప్పు? పప్పు, ఉరగాయలు, పచ్చడ్లు, తన నోటికి రుచిగా నంజుకుంటూ అన్నం తినే సీత...అయ్యో!....ఉప్పు లేక, చప్పగా వుండే నేలరాలిన గడ్డి గింజలను ఎలా తినగలదో, నువ్వు చేసిన పని ఎలాంటిదో, చూడు. మంగళవాద్యాల ధ్వనులలో పుట్టిన గీతాలను వీనులార విని సంతోషించే సీత ఏ విధంగా పులుల, సింహాల భయంకర ధ్వనులను వినగలదో? విని భయపడకుండునో?"

"ఇంద్రధ్వజం లాంటి నా కొడుకు ఇనుప గుదియను పోలిన తన చేతిని దిండుగా తలకింద పెట్టుకుని దిక్కులేనివాడిలాగా నేలమీద మెత్తటి పచ్చిగడ్డి

పానుపుగా ఎక్కడ పడుకున్నాడో కదా? తండ్రే కోపంతో దుఃఖ సముద్రంలో పడేస్తే ఇక దిక్కెవ్వరు? వికసించిన తామర రేకు వన్నె, మేలైన క్రొందామర పరిమళం లాంటి సువాసన, కమలాల లాంటి కళ్ళు, ఇంపైన ముఖం మీద వేలాడే ముంగురులు, చిరునవ్వు అనే వెన్నెల గల నిండు చంద్రుడిని పోలిన నా కొడుకు ముద్దు ముఖం మరల నేనెప్పుడు చూడగలనోకదా? ఇంత కష్టం వచ్చినా నా గుండె చిన్న-చిన్న ముక్కలై పగిలిపోకుండా వుండడానికి కారణం అది బహుశా వజ్రసారంతో చేసి వుండాలి! అలా కాకపోతే ఇప్పటికే వేయితునకలై పోవాల్సి వుండే".

"నా కొడుకును, కోడలిని, నాకు కావలిసిన లక్ష్మణుడిని, ఎంతో సుఖపడడానికి యోగ్యులైనవారిని, అడవుల మధ్య తోసేశావు. ఏకాలంలోనైనా నీలాంటి మగడుంటాడా? నా కొడుకు నీ కొడుకు కాదా? నా కోడలు నీ కోడలు కాదా? నామీద కోపంతో ఇలా చేయవచ్చా? ఎలుక మీద కోపంతో ఇంటికి నిప్పు పెట్టేవాడుంటాడా? పదిహేనవ సంవత్సరంలో నా కొడుకు అడవులనుండి వచ్చిన తరువాత భరతుడు రాజ్యం ఏలుతున్నందున తనకు తానై రాజ్యం తీసుకొనడానికి ఇష్ట పడడు. భరతుడు ఇచ్చినా అంగీకరించడు. శ్రాద్ధానికి యోగ్యుడైన బ్రాహ్మణుడిని పిలవకుండా, పిసినితనాన అధములను పిలిస్తే, పండితులెవరైనా ఆ ఇంటికి భోజనానికి వస్తారా? ఇతర జంతువు తినగా మిగిలినదానిని బలంకల వేరొక పులి ఎప్పుడూ తినదు. పశువులలోనే ఇలాంటి మర్యాద వుంటే, పురుష శ్రేష్ఠుడైన రాచకొడుకు శ్రీరామచంద్రుడు పరులు అనుభవించిన దానిని అసహ్యించుకోకుండా కోరుతాడా? ఒకసారి యజ్ఞంలో వాడిన నెయ్యి దర్భలు, హవిస్సు, పురోడాశనీ, ఊపస్తంబం, మరో యజ్ఞంలో వాడవచ్చా?"

"సారం తీయబడిన కల్లులాగా, సోమంలేని యజ్ఞం లాగా, రాజా! నా కొడుకు ఇతరులు అనుభవించి విడిచిన నిస్సారమైన భూమిని కోరునా? నా కొడుకు అంత చెడి బతికాడని అనుకుంటున్నావా? రాజా! ఇంత అవమానం నా కొడుకు సీతానాథుడు ఎలా అనుభవించగలడు? లోకంలో తన తోక కొనను తొక్కిన పులి శాంతిగా ఊరుకుంటుందా? అలాగే నీ కొడుకుకు

రోషం, పౌరుషం, బలం వుంటే ఎందుకు రాజ్యం పట్టం కట్టుకోలేడంటావా? సామర్థ్యం లేక కాదు. పద్నాలుగు లోకాలన్నీ ఒక్కటై ప్రయత్నించినా, యుద్ధానికి వచ్చినా, వాటికి నాకొడుకును భయపెట్టగల శక్తి లేదు. అధర్మ మార్గంలో పయనించేవారిని ధర్మమార్గంలో నడపడానికి, దానికి తానూ మార్గదర్శిగా వుండడానికి దుఃఖం సహించి అడవులకు పోయాడు. బంగారు పిడులుకల కరకు బాణాలతో సముద్రాన్నైనా, సమస్త భూతాలనైనా, ప్రలయకాలపు యముదిలాగా కాల్చివేయగలడు. అలాంటి సింహబలుడు మగచేపతో చంపబడే పిల్ల చేపలాగా తండ్రితో చంపబడ్డాడు. రాజా! నువ్వు ధర్మం తెలిసినవాడివేనా? కన్నకొడుకును అడవుల్లో ఇలా కృశినీప చేశావుకదా? ఇది రాజులు, బ్రాహ్మణులు, వైశ్యులు, అంగీకరించిన ధర్మ శాస్త్రాలలో నిష్కారణంగా చేయాల్సిన కార్యమని ఎక్కడైనా వుందేమో చెప్పగలవా?"

"రాజా! నీకేం... మహారాజువి. నిన్ను ఆదరించడానికి కైక లాంటి భార్యలున్నారు. భరతుడిలాంటి కొడుకున్నాడు. కాని నా గతేంటి? నేను ఆడదాన్ని. ఆడడానికి మొదటి దిక్కు కట్టుకున్న భర్త. వాడు లేనప్పుడు రెండవ దిక్కు కడుపున పుట్టిన కొడుకు. ఈ ఇరువురు లేనివారికి ప్రేమగల బంధువులు, తోడబుట్టిన వారు మూడవ దిక్కు. ఈ ముగ్గురు తప్ప ఎంత ఆలోచించినా స్త్రీకి మరొక దిక్కులేదు. మగడివైన నీవల్ల నాశనమైనదాన్ని నేనొక్కదాన్నే కాదు. నీలాంటి అవివేకి రాజవడంవల్ల ఈ భూమి, రాజ్యం అంతా నాశనమైంది. ప్రజలే లేకపోతె నువ్వెందుకు? ప్రజలుంటేనే కదా వారికొరకు రాజుండాలి? రాజే లేకపోతె మంత్రులెందుకు? ఇక నేను, నా సుతుడు చెప్పాల్సిన పనే లేదు. ఎప్పుడో నాశనమైనాం. ఇందరు పొతే పురజనులుంటారా? వారూ చచ్చినట్లే. అందరూ పోగా నిండు సంతోషంతో నీ ప్రియురాలు, నీ కొడుకు, అసమాన భోగాలు అనుభవించుకుంటూ హాయిగా వుండండి".

ఈ విధంగా కౌసల్య తనను కఠినంగా పలకడం విన్న దశరథుడు శోకబాధ సహించలేక, ఓర్చుకోలేక, భూమ్మీద పడి, "ఇది ఆడదైనా శోకంలో వున్నా సత్యం చెప్తున్నది...ఈమె చెప్పిన దాంట్లో అసత్యం లేదు...నిష్కారణంగా ఇతరులను బాధించే ధర్మం, ధర్మం కాదు....ఒక ధర్మం చేసేవారు, తాముచేసే

ధర్మం, మరొకరి ధర్మాన్ని బాధించేదిగా వుండకూడదు....ఇది నేను ఆలోచించలేదు...ఎవరూ చేయని ఇంతటి మహాపాపం చేశాను" అంటూ, ఈ జన్మలో ఇంత ఘోర పాపం అనుభవించడానికి తాను చేసిన పాపం ఏంటని ఆలోచించసాగాడు.

❖ ❖ ❖

సర్గ-62

క్షమించమని కౌసల్యను వేడుకున్న దశరథుడు

మూర్ఛనుండి లేచిన దశరథుడికి జాగ్రత్తగా ఆలోచించగా తానూ చేసిన పాపం స్మృతికి వచ్చింది. అజ్ఞానంతో లోగడ మునికుమారుడిని చంపిన విషయం జ్ఞప్తికి తెచ్చుకుని, చేతులు మోడ్చి, కౌసల్య విషయంలో తానూ చేసిన మహాపరాధాన్ని తలచుకుని సిగ్గుతో తలవంచుకుని ఆమె అనుగ్రహం సంపాదించుకోవాలని ఇలా అన్నాడు: "దేవీ! నువ్వెప్పుడూ నీ విరోధుల విషయంలో సహితం దయ తప్పని దానివి. కాబట్టి నా అపరాదాన్ని మన్నించు. కామాంధకారంతో కళ్ళు కనబడక నీ విషయంలో గొప్ప తప్పు చేశాను. కాబట్టి నీకు నేను పగవాడినే! అయినా, నీకు చేతులు జోడించి నమస్కారం చేస్తాను. పతివ్రతైన స్త్రీలకు మంచిగుణాలు కలవాడైనా, చెడుగుణాలు కలవాడైనా, పతియే ప్రత్యక్ష దేవత. ధర్మాసక్తిలో నువ్వు అసమానవు. లోకంలోని వాళ్లు చేసే మేలు-కీడు నీకు తెలుసు. సద్గుణ సంపత్తి కలదానివి. ఇన్ని మంచి గుణాలున్న నువ్వు, పుత్రశోకంతో బాధపడే నన్ను పరుషం మాట్లాడి మరింత దుఃఖపెట్టవచ్చా? శాంతి వహించి పాపం కట్టుకున్న మగడే అని దయతలపవచ్చు కదా? ఇంత కఠినంగా మాట్లాడడం ధర్మమా?"

ఇంత దయగా వేడుకుంటున్న భర్తను చూసి, ధర్మ భయంతో, అతడి అంజలిని శిరం మీద దాల్చి, తన కళ్ళ నుండి నీళ్ళు కార్చి ఇలా అంది: "ప్రాణేశ్వరా! నీ చరణాల మీద పడి ప్రార్థిస్తున్నాను. నేను ఆడదానిని. కాబట్టి తెలివిమాలిన దానిని. నువ్వు నన్ను శాసించాలి కాని ప్రార్థించ కూడదు. ఇలా నా స్వధర్మ హాని కలిగించడం అంటే నన్ను చంపడమే! ఇది నీకు ధర్మమా? నీకు సత్యం అంటే ప్రాణమని, ధర్మమే అలంకారంగా కలవాడవని తెలుసు. మగడు సత్యాత్ముడు అనే సంతోషం కంటే పుత్రశోకం బలీయంగా వుంది. నా కొడుకును తలచుకున్న కొద్దీ కడుపు భగ్గున మండుతున్నది. నిన్ను నొప్పించాలని లేదు. నన్ను క్షమించు. నిన్ను నొప్పిస్తే నాకేంటి లాభం? శ్రీరాముడు అరణ్యాలకు పోయి నేటికి ఐదు రాత్రులయ్యాయి. రాజా! శోకాతిశయంతో వున్నా నాకు

అవే ఐదు సంవత్సరాలు. దుఃఖం రోజు–రోజుకూ పెరుగుతున్నది. నా గతి ఏం కానున్నదో?".

ఇలా కౌసల్య చెప్తుంటే సూర్యుడు అస్తమించాడు. రాత్రి వ్యాపించింది. రాజు కౌసల్య చెప్పిన హితవాక్యాలను విని కూడా బాధతో కలక పడుతూ కళ్ళు మూసాడు.

❖ ❖ ❖

సర్గ-63

తాను చంపిన ముని బాలుడి వృత్తాంతాన్ని కౌసల్యకు చెప్పిన దశరథుడు

కాసేపలా నిద్రపోయిన రాజు, మేల్కొని, తాను చేసిన పాపాన్ని తలచుకుని, కొడుకు-కోడలు గురించి ఆలోచించాడు. తరువాత, ఆ ఆరవనాటి అర్ధరాత్రి కౌసల్యతో ఇలా చెప్పాడు:

"శ్రీరాముడిని వదిలి నేను ఏడుస్తున్నాను. చూశావా.... నేను చేసిన ఒకానొక కర్మానికి శ్రీరామచంద్రుడిని ఎడబాసేట్లు ఫలితం కలగగా, బుద్ధిలేని నేను దుఃఖపడ్తున్నాను. నేను చిన్నవాడిగా వున్నప్పుడు విల్లు ధరించి, శబ్దవేది అని పేరు తెచ్చుకున్న వాడినై, పూర్వం ఒక పాపాన్ని చేశాను. దాని ఫలం ఇప్పుడు అనుభవించాల్సి వచ్చింది. శబ్దవేది బాణ ప్రయోగం వల్ల ఒక గొప్ప పాపం చేశాను. ఆ కథ చెప్తా విను. నీకప్పటికి నాతో వివాహం కాలేదు. నేను యువరాజుగా వున్నాను. ఇంతలో ఒకసారి వానాకాలం వచ్చింది. వేడి మాయమైంది. నీటితో బలసిన మేఘాలు మినమినలాడుతున్నాయి. కప్పలు కూస్తున్నాయి. నేమిళ్ళ ధ్వనులు ఆకాశానికి వ్యాపించాయి. మనోహరమైన ఆ సుఖ కాలంలో బాణం, విల్లు ధరించి రథం ఎక్కి, వేటమీద వున్న కోరికతో, సరయూ తీరంలో వున్న క్రూర జంతువులను చంపడానికి అవి నీళ్లు తాగే రేవు వద్ద మాటేసుకుని ఒక రాత్రివేళ ఒంటరిగా కూర్చున్నాను. అప్పుడు ఏనుగు నీళ్లు తాగిన చప్పుడులాంటి చప్పుడు వివచ్చింది. దట్టమైన చీకటి కారణం వల్ల ఏదీ కనపడలేదు. శబ్దం జాడబట్టి ఏనుగే అనుకుని, ధ్వనికలిగిన చోట పాములాంటి బాణాన్ని వదిలాను. బాణం పద్దచోట హా! అనే మనుష్య శబ్దం వినపడ్డది. అది తగిలి ఒక ముని నేలపడ్డాడు".

"నేలబడ్డ ముని తపస్సు చేసుకునే తనపైన ఎలా బాణం పడిందనీ, మనుష్యులు తిరగని చోటుకు నీళ్లకై వచ్చాననీ, ఎవరో తనను నిష్కారణంగా చంపాడనీ, వాడికి తానేం కీడుచేసాననీ, ఋషినైన తనను-జడలు ధరించి నార చీరెలు కట్టుకున్న తనను అడవిలో వున్నప్పుడు ఎవరో క్రూర బాణంతో

చంపాడనీ, తననిలా చంపినా అతడికి ఏం లాభమో అనీ, వాడిని లోకులు తిట్టుతారనీ అన్నాడు. తన చావుకు తానూ దుఃఖించననీ, తానూ దీర్ఘకాలంగా రక్షించుకుంటూ వస్తున్న తన ముసలి తల్లిదండ్రులను తలచుకుంటే గుండెలు ఝల్లుమంటున్నాయనీ, తన చావు విన్నవెంటనే వారూ దిక్కులేని చావు చస్తారనీ, తప్పొప్పులు తెలియని ఎవరో మూఢుడు ఒక్క బాణంతో ముగ్గురిని చంపాడనీ, ఆ మునిబాలుడనగానే, నా చేతిలోని విల్లుబాణాలు తమంత అవే నేలబడి పోయాయి".

ఆ మాటలు విన్న తాను గుండెలు ఝల్లనగా సరయూ నదీ తీరానికి పోయి బాణ వేదనతో బాధపడుతున్న ఆ ముని బాలుడిని చూశాననీ, తనను చూడగానే బాలుడు నిష్టురాలాడాడిలా అని దశరథుడు చెప్పాడు: "ఓయీ రాజా! నేను నీకేం అపకారం చేశాను? దప్పికగొన్న నా తల్లిదండ్రులు నీళ్లు తెమ్మంటే ఇక్కడకువచ్చాను. వచ్చి నీ చేతుల్లో చచ్చాను. నన్ను ఒక్క బాణంతో కొట్టి ముగ్గురిని చంపావు కదా! నాకై వేచి వున్నా నా తల్లిదండ్రులు ఈ వార్తా ఎలా సహించుతారు? నన్ను వెతకడానికి వాళ్లకు కళ్లు లేవు. కాబట్టి అక్కడే పడి కొడుకా! కొడుకా! అను ఏడుస్తుంటారు. నిర్మానుష్యమైన ఈ అడవిలో వారికి నాగతి ఎవరు చెప్తారు? ఒకవేళ ఎవరైనా చెప్పినా నడవలేని వారు నన్నెలా వెతుకుతారు? దశరథా! నువ్వు త్వరగా మా తండ్రి వుండే చోటుకు పో. నువ్వు పోకపోతే నిన్ను కోపంతో శపిస్తారు. భస్మం చేస్తారు. (ఆశ్రమానికి పోయే మార్గాన్ని చూపిస్తాడు ముని బాలుడు). నువ్వు ఆయనను ప్రార్థిస్తే నీపై కోపగించుకోడు. ఈ బాణాన్నివూడతీయి. బాణం తీస్తే నేను మరణిస్తాను. అలా జరిగితే నీకు బ్రహ్మ హత్యా దోషం తగులుతుందని భయపడవద్దు. నేను బ్రాహ్మణుడను కాను. వైశ్యుడికి, శూద్ర స్త్రీ కి పుట్టాను". అని అంటూ మూర్ఛపోయాడు.

బాణం తీశానని చెప్పాడు కౌసల్యతో దశరథుడు. ముని కుమారుడు చెప్పినట్లే ఆ దారిన ఆశ్రమానికి పోయాడు. నడువలేని, కళ్లు లేని, ముసలివారిని చూశాడు. మునికుమారుడి తల్లిదండ్రులను సమీపిస్తున్నకొద్దీ దశరథుడి గుండెలు కొట్టుకోవడం మొదలైంది. దశరథుడు వస్తున్నా చప్పుడు విని

కళ్లు లేని వారు తమ కొడుకొస్తున్నాడని భావించి ఇంత ఆలశ్యనీ చేశావేంటని అడిగారు. "నాయనా మా నాలుకలు ఎండి పోతున్నాయి. నీటికై పోయి మా కష్టాలు మర్చిపోయి ఆడుకుంటున్నావా? ఇప్పటికైనా నీళ్లు ఇవ్వు. కుమారా! నువ్వు తపోధనుడవు. మాతాపితృ శుశ్రూష వల్ల ధన్యుడివి. మా ప్రాణాలన్నీ నీ మీదే వున్నాయి. ఎందుకు మాట్లాడవు? కళ్లు లేని మాకు నువ్వే కళ్లు. రక్షకుడు లేని మాకు నువ్వే రక్షకుడివి. నువ్వు మమ్మల్ని ఉపేక్షించ తగునా?" అని సన్న గొంతుతో మాట్లాడుతున్నా ఆ ముని దగ్గరకు పోయి తానూ చేసిన పాపకార్యం గురించి భయపడుతూ మెల్లగా ఇలా అన్నాడు దశరథుడు.

"మునీంద్రా! నేను మీ కొడుకును కాను. నా పేరు దశరథుడు. నేను క్షత్రియుడను. గొప్ప పాపం చేశాను. సరయూ తీరంలో వేటకై పోయి మృగం కోసం కాపుకాయగా, నీళ్లలో బుడ-బుడ అనే శబ్దం వచ్చింది. ఏనుగు నీళ్లు తాగే చప్పుడని భ్రమించి బాణం వేశాను. దగ్గరకి పోయు చూడగా బాణం నాటివున్న ఒక మనుష్యుడిని చూశాను. పుణ్యాత్ములారా! అడవి ఏనుగును చంపడానికి నేను ప్రయోగించిన బాణం మీ కొడుకును చంపింది. అతడు తన విషయాలన్నీ చెప్పాడు. అతడు చెప్పిన మార్గంలో నేను మిమ్మల్ని చూడడానికి వచ్చాను. ఈ పాపాత్ముడిని మీ ఇష్టం వచ్చినట్లు చేయండి. నేను దోషం చేశాను. దండించినా, మన్నించినా, మీ ఇష్టం". అని చెప్పానని కౌసల్యతో అన్నాడు దశరథుడు. ఇంకా ఇలా అన్నాడు:

"పాప భయంతో నేను పలికిన మాటలు విని కొడుకా! కొడుకా! అని ఏడ్చారు. నన్ను ఉద్దేశించి ఇలా అన్నాడు. 'రాజా! వానప్రస్థుడిని చంపి క్షత్రియుడు బతకలేడు. నువ్వు పశ్చాత్తాపంతో నీ పాపాన్ని చెప్పి బతికిపోయావు. నువ్వు అజ్ఞానంతో తప్పు చేయడం వల్ల, మన్నిస్తున్నాను. రాజా! మా కుమారుడు చచ్చిపడి వున్న చోటుకు మమ్మల్ని తీసుకుపో. నెత్తుటి తడితో నేలమీద పడి వున్న మా కొడుకును చూడాలని మా కోరిక'. అనగా నేను వాళ్ళిద్దరినీ అక్కడికి తీసుకుపోయాను".

తన కొడుకుకై విలపించిన ఋషి

కౌసల్యతో ఇంకా ఇలా చెప్పాడు దశరథుడు: చచ్చిపడి వున్న తన కొడుకు దేహాన్ని నిమిరి చూసి తండ్రి ఇలా అన్నాడు. "పుత్రా! నేను నీ సమీపానికి వచ్చినపుడు నువ్వు నాకునమస్కారం చేయకుండా వుండడం ధర్మమా? కొడుకా! ఎందుకు మాట్లాడవు? నామీద కోపమెందుకురా? మా దుఃఖం తీరేలా కౌగలించుకోరా! నువ్వింతవరకూ చదువుతుండే శాస్త్రాలు ఇంకెవరు చదువుతారు? ఎవరు సంధ్య, అగ్నిహోత్రం, ఉపాసనం చేసి పుత్రశోక భయంకల నన్ను నా సమీపంలో వుండి ఉపచారం చేస్తారు? కందమూలాలిచ్చి ప్రీతితో ఎవరు ఆరాధిస్తారు? మమ్మల్ని అనాధలు చేసి నువ్వు విడిచపోవడం ధర్మమా? దీనురాలు, నిండు ముసలి నీ తల్లిని, కళ్లు కానరానిదానిని, నేనేవిధంగా భరించగలను? నువ్వు యమపురికి పోవద్దు. తెల్లవారగానే నీ వెంట మేమూ వస్తాం. మేమెందుకు రావాలంటావా? విను...నిన్ను ఎడబాసి దుఃఖాతిశయంతో నలుగుతూ ఈ అడవిలో కుళ్ళుతూ వుండలేం. నువ్విలా బాల్యంలోనే చనిపోవడానికి నువ్వు చేసిన పాపం ఏమీ లేదు. పాపపు రాజు నిన్ను చంపాడు. నా సత్య బలం వల్ల నువ్వు స్వర్గానికి, సగరుడు, దిలీపుడు, నహుషుడు, జనమేజయుడు పోయినట్లే పోతావు. ఎన్నో వేల గోదానం చేసినవారు పోయే లోకాలకు నువ్వు పోతావు. గంగా-యమునాల సంగమంలో దేహాలు విడిచే వారేలోకాలకు పోతారో నువ్వు అక్కడికే పోతావు. నీకు అదోగతులు రావు".

ఇలా ఏడుస్తూ మునివరుడు తన పుత్రుడికి ఉదకాలిచ్చాడు. అప్పుడు మునికుమారుడు దివ్యరూపం ధరించి, ఆకాసంలో ఇంద్రుడి పక్కన నిలుచుని, తల్లితండ్రులతో ఇలా అన్నాడు: "వైదిక ధర్మ విధిజ్ఞులారా! మీకు శుశ్రూష చేసినందున నాకు ఊర్ధ్వ లోకాలలో సుఖాలు ప్రాప్తించాయి. కాబట్టి నాకొరకు మీరు బాధపడవద్దు. పుణ్యాత్ములారా! మీరు కూడా నన్ను శీఘ్రంగా స్వర్గంలో కలుసుకుంటారు". అని చెప్పి స్వర్గానికి పోయాడు.

కొడుకు ఈ ప్రకారం స్వర్గానికి పోగా, ముని తన భార్యతో కూడి అతడి నివాసానికి వచ్చి, తన దగ్గరే చేతులు కట్టుకుని నిలబడ్డ దశరథుడిని చూసి బాధతో, కోపంతో ఇలా అన్నాడు.

❖ ❖ ❖

సర్గ-64

దశరథుడిని శపించిన ఋషి

"ఓయీ రాజా! ఒకే కొడుకున్న నన్ను కొడుకులేనివాడిగా చేశావు. ఇంక చావంటే నాకు భయం లేదు. కాబట్టి నన్ను కూడా ఇప్పుడే చంపు. నిష్కారణంగా నా కొడుకును అజ్ఞానంతో చంపావు. కాబట్టి నీ పొగరు అణిగేట్లు భయంకరమైన శాపం ఇస్తాను. నాకిప్పుడు ఇలాంటి పుత్రశోకం కలిగించిన కారణం వల్ల నువ్వు కూడా మాలాగే పుత్రశోకంతో ఏడ్చి-ఏడ్చి చచ్చిపోతావు. తెలియక చేసిన కారణం వల్ల నీకు బ్రహ్మహత్య లాంటి ఘోరపాపం కలగదు కాని, అల్ప ప్రాయశ్చిత్తంతో పోయే పాపం తగులుతుంది. కాబట్టి దాతకు దక్షిణ ఫలంలాగా ఇప్పుడు మాకు కలిగిన స్థితే నీకూ కలుగుకాక!"

ఇది చెప్పి దశరథుడు కౌసల్యతో ఇలా అన్నాడు: "ఈ ప్రకారం వారు నన్ను శపించి, కొడుకు కోసం అనేకవిధాలుగా ఏడ్చి, నేను చితి పేరిస్తే, వారగ్నిలో ప్రవేశినీచి చనిపోయారు. ఇంకేం చెప్పాలి? నాకీ దుఃఖం ఎందుకు కలుగున్నదో ఆలోచిస్తే ఇది జ్ఞప్తికి వచ్చింది. ఆ పాపం ఈ విధంగా నన్ను బాధిస్తున్నది. అయ్యో! కౌసల్యా! ఇంకేం చెప్పాలే? ఆ గొప్ప మునుల మాటలు ఇప్పుడు అనుభవంలోకి వచ్చాయి. పుత్రశోకంతో చావాల్సి వచ్చింది. నాకు కళ్లు కనబడడం లేదు. నువ్వెక్కడున్నదీ నేను చూడలేకపోతున్నాను. కాబట్టి, దేవీ నన్ను ముట్టుకో". అని ఏడుస్తూ దశరథుడు మరణ భీతితో ఇలా అన్నాడు.

"ఆనాడలా ముని కుమారుడిని చంపాను. ఈనాడు కన్నా కొడుకును చంపుకునే పని చేశాను. ఇలాంటి పని నేను తప్ప మరొకడు చేయడు. చేయజాలడు. నావిషయంలో శ్రీరాముడు చేసింది శ్రీరాముడికే చెల్లుతుంది. ఆ విధంగా మరొకడు చేయలేడు. కన్న కుమారుడిని, జ్యేష్టుడిని వదిలే వివేకహీనుడుంటాడా? నిష్కారణంగా అడవికి పోరా, అంటే, పోయే కొడుకుంటాడా? భూమ్మీద వుండగానే శ్రీరాముడిని చూడాలనుకుంటున్నాను. శ్రీరాముడి చేయి నన్ను తాకితే, ఆయన ముఖాన్ని నేను చూస్తె, యమపురికి పోవాల్సిన పనిలేదు. బతుకుతాను. అదిగో! యమకింకరులు పిలుస్తున్నారు.

ప్రాణం పోయే సమయంలో శ్రీరామచంద్రుడిని కళ్లారా చూడలేకపోతున్నాను. ఇంతకంటే దుఃఖం లేదు. నా ప్రాణాలు క్షీణిస్తున్నాయి. శ్రీరాముడు పదిహేనేళ్ల తరువాత మరలి వచ్చినపుడు పుణ్యాత్ములు, జన్మ సఫలం కాగలవారు మాత్రమే ఆయనను చూడగలరు. కళ్లు కనపడడం లేదు. చెవులు వినపడడం లేదు. హృదయం తునకలైంది. హా! రామా! దీర్ఘ బాహువులు కలవాడా! హా! పూర్ణ చంద్రుడి లాంటి ముఖం కలవాడా! హా! ప్రియ కుమారా! అయ్యో! నా రక్షకుడా! ఎక్కడ పోయావురా! రారా! నా ఆయాసం తగ్గినీచరా! నీకు పుణ్యముంటుందిరా! కౌసల్యా! నా పాపం వల్ల నేను చేదిపోవడమే కాకుండా భార్య అయిన నీకూ పుత్రశోకం కలిగించాను. సుమిత్రా! ఎంతో ఇంపైన నడవడికలదానా! నిన్ను చాల కష్టపెట్టాను. పగదానివైన కైకా! వంశనాశకురాలా! ఇంతమంది దుఃఖం నువ్వేకదా తెచ్చావు? ఓసీ చండీ" అని ఏడుస్తూ దశరథుడు అర్ధరాత్రి చింతిస్తూ ప్రాణాలు విడిచాడు. ఇది ఆరవనాటి (రాముడు అడవులకు పోయిన) వృత్తాంతం.

❖ ❖ ❖

సర్గ-65

మృతుడైన దశరథుడు

ఉదయకాల సేవకొరకు మంగళ పదార్థాలను బోగం పడుచులు సిద్ధం చేసుకుని, సమస్త శుభ లక్షణాలతో ఏర్పాట్లన్నీ చేసి, ఉదయాన్నే వెలుపలికి రావాల్సిన రాజు సూర్యోదయమైనా రాకుండా వుండడంతో కారణం ఏమై వుంటుందని సందేహంతో రాజు సమీపంలో తిరిగే స్త్రీలు ఆయన మీద చేయి వేశారు. ఆయనను మేల్కొలపడానికి మెల్లగా దేహాన్ని తాకారు. నిద్రపోయే లక్షణాలు రాజులో కనిపించలేదు వారికి. ఎక్కడ వేసిన చేతులు అక్కడే చల్లగా వుండడంతో, ముక్కునుండి శ్వాస రాకపోవడంతో, గుండె కొట్టుకోకపోవడంతో, ఆ స్త్రీ సమూహం, రాజు బతికిలేదని అనుమానం వచ్చింది. రాజు మరణించాడని దృఢపరచుకుని దుఃఖంతొ కౌసల్య దగ్గరకు పోయారు.

❖ ❖ ❖

సర్గ-66

దశరథుడి మృతికి ఏడ్చిన అంతఃపుర స్త్రీలు

రాజు చచ్చిపోయాడని సందేహం కలిగినప్పటికీ, కౌసల్య వచ్చి చూసి నిశ్చయించాలని రాజు సమీపంలోనే ఏడుస్తూ వున్నారు. కౌసల్య మూర్ఛపోయింది. తక్కిన స్త్రీలు, కైక, సుమిత్ర దుఃఖ పడ్డారు. బంధువులందరూ రాచపీనుగు చుట్టూ గుమిగూడి ఏడవసాగారు. రాజు శిరస్సును తన తొడమీద వుంచుకుని కౌసల్య కైకతో ఇలా అంది: "ఓసీ! చెడుమనసు కలదానా! ఇక హృదయం చల్లబడగా ఇతరుల వల్ల బాధలేని రాజ్యాన్ని, సంపదను, సుఖంగా స్వాధీనం చేసుకో. నీ బాధపడలేక రాజు చచ్చిపోయాడు. శ్రీరాముడు అడవుల పాలయ్యాడు. నీ కోరికలు నేరవేరాయికదా? ఇక నువ్వు ఏ ఆటలు ఆడినా కాదనే వారెవరు? ఇక నేను పతిని, కొడుకును విడిచి ఎలా ఈ ఊళ్లోనే ఊపిరితో వుండగలను?"

"గయ్యాళి కైక రఘువంశాన్ని బూడిదపాలు చేసింది. ఇదంతా మంథర కొరకు భార్య చెప్పిన మాటలు విని దశరథుడు శ్రీరాముడిని సీతతో అడవులకు పంపాడని విని జనక రాజెంత బాధపడుతాడో? ఇక్కడ రాజు చనిపోవడం, నేను దిక్కులేనిదాన్నై ఏడవడం అడవిలో వున్నా శ్రీరాముడికి తెలియదు కదా? దేనికి ఏమనుకోవాలి? అడవిలో సీత ఎన్ని బాధలు పడుతున్నదో? శ్రీరాముడిని ఆశ్రయించి కూడా బాధపడుతున్నది. ఆమె తండ్రి జనకరాజు ఈ విషయం తెల్సి కృశించి పోతాడు. నేను సహగమనం చేసి అగ్నిహోత్రుడికి దేహం ఇస్తాను"

ఇలా విలపిస్తుండగా, రాజకీయ వ్యవహారాలు తెలిసినవారు వచ్చి, కౌసల్యను ఓదార్చి, రాజు దేహాన్ని నూనె కాగులో వుంచి, ఆ తరువాత చేయాల్సిన పనుల గురించి ఆలోచన చేశారు. ఒక్క కొడుకైనా దగ్గర లేకపోవడంతో రాజు శరీరాన్ని కావదగువారికి ఆజ్ఞ చేశారు. నూనె కాగులో వున్నా రాజు శరీరాన్ని చూసి అంతఃపుర స్త్రీలు ఏడవసాగారు. ఎక్కడ చూసిన ప్రజలు కన్నీళ్లే కార్చారు. కులస్త్రీలు హాహా కారాలు చేశారు. అది అయోధ్యాపురమా? అని గుర్తించకుండా అయింది. దశరథుడి భార్యలందరూ దుఃఖంలో మునిగిపోయారు. సూర్యుడు

అస్తమించాడు. చీకటి వచ్చింది. దశరథుడి కొడుకులు ఒక్కరైనా లేకపోవడంతో దహనం చేయడానికి బదులు ఇంట్లోనే భద్రపరిచారు. కైకను ప్రజలు ఇష్టమొచ్చినట్లు తిట్టారు.

ఆ తరువాత ఎనిమిదవ రోజు (శ్రీరాముడు అడవులకు పోయి) ఉదయం రాజును నిర్ణయించే అధికారం కల బ్రాహ్మణ పెద్దలు గౌతముడు, మౌద్గల్యుడు, కాత్యాయనుడు, మార్కండేయుడు, జాబాలి, కాశ్యపుడు, వామదేవుడు, మంత్రులతో సభ తీరారు. వీరంతా వసిష్ట మహర్షిని చూసి "మునీంద్రా! రాజు మరణించడం వల్ల, రాజకుమారులెవరూ దగ్గర లేకపోవడం వల్ల, గొప్పవారైన రాజకుమారులలో ఎవరినైనా ఒకడిని పురానికి రాజుగా చేయాలి. అలా కాకపోతే సంకటంలో పడిపోతాం" అన్నారు.

❖ ❖ ❖

సర్గ-67

అరాజకత్వ దోష వర్ణన

"భూమిని పాలించడానికి రాజు లేకపోతే, మేఘదారలున్నా, ఉరుములు మెరుపులున్నా, తగిన సమయంలో వర్షాలు కురవ్వు. భూమిని పాలించ రాజు లేకపోతే, ధాన్యాలు నాటాల్సిన సమయంలో రైతులు విత్తనాలేసి పైర్లు పెట్టరు. పైరు పండినా దొంగల భయం లేకుండా ఇంటికి ధాన్యం వస్తుందన్న నమ్మకం లేదు. జారుల వలన, చోరుల వలన, అధికంగా భయముంటుంది. ప్రభువు లేకపోతే ఎవరంతత వారు, స్వతంత్రించి, చెట్లు కొట్టి పాడు చేస్తారు. కాబట్టి మనోహరమైన ఉద్యానవనాలుండవు. క్షుద్రులు ప్రవేశించి అపరిశుభ్రం చేస్తారు కాబట్టి క్షేత్రాలు నిలవవు. మనస్సులో కుదురుగా వుండనందున సభలకు మనుష్యులు రారు. రాజు పాలించని దేశంలో నమ్మకం కోల్పోయిన బ్రాహ్మణులు యజ్ఞాలు చేయరు. దొంగల భయంతో దాతలు ధనం వున్నా దక్షిణలు ఇవ్వరు. భూమి అరాజకమైతే నటులు, నర్తకులు వున్నా, ఉత్సవాలు, యాత్రా సంచారాలు సంతోషంగా కనబడవు. అధికారులు లంచాలు తీసుకుని తగవులను న్యాయంగా పరిష్కారం చేయరు. అందుకే, కోమట్లు బేరాలలో లాభాలు సంపాదించలేరు. పాలించే రాజు లేకపోతే, పౌరులు వారి మనసు నిశ్చింతగా వుండనందున ఇష్టానుసారం కథలు చెప్పుకోరు. దుష్టుల భయం వల్ల స్త్రీలు సింగారించుకోరు".

"రక్షించే రాజు లేనపుడు వయసు పడుచులు శృంగారించుకుని ప్రేమగా, విలాసంగా, తోటల్లో వేడుకతో సాయంకాలాలలో తిరుగుతూ సుఖపడరు. భార్యలు భర్తలతో రథమెక్కి కూర్చుని పూలు కోయడానికి ఉద్యాన వనాలకు పోరు. ప్రభువు లేని రాష్ట్రంలో సూర్యాస్తమయం కాగానే దొంగల భయంతో వాకిళ్లు తెరిచి నిద్రపోరు. రాజులేని నగరంలో వయసుగల ఏనుగులు గంటల చప్పుడుతో రాచబాటల్లో పోవడానికి వీలుపడదు. రాజులేని నగరంలో బాణవిద్య నేర్చుకునే సమయంలో వినపడే అల్లెత్రాటి ధ్వని వినరాదు. రాజులేని దేశంలో దూరదేశాలకు పోయే కోమట్లు సుఖంగా వూరు చేరరు. తోవలో దొంగల చేతులో దెబ్బలు తింటారు. రాజు పాలిమ్చని దేశంలో సన్యాసి ఒంటరిగా

తిరగడు. అన్నదాత లేనందున ఎక్కడ పొద్దు కుంకుతుందో అక్కడే నిద్రపోతాడు. అరాజకమైన రాజ్యంలో పుణ్యం కలగదు. యోగం లేదు. క్షేమం లేదు. యుద్ధానికి పోయిన సేనలు ధీరుడైన నాయకుడు లేనందున శత్రువుల చేతిలో ఓడిపోతారు. రాజులేని దేశంలో సంతోషంగా ప్రజలు ఏనుగులు, గుర్రాలు, రథాలు, ఇతర వాహనాలు ఎక్కి వారి ఇష్ట ప్రకారం తిరగలేరు".

"రాజులేని దేశంలో ప్రజలు శాస్త్రాలను క్షుణ్ణంగా చదివినప్పటికీ, వారి ఇష్టానుసారం ఋషులు వుండే వనాలలో, తోటల్లో, నదీతీరాలలో, తమ పాండిత్యాన్ని ప్రదర్శించి కృతార్థులు కాలేరు. రక్షించే రాజు లేని చోట దేవుడి పూజకొరకు పూదండలు, నైవేద్య వస్తువులు, దక్షిణలు తీసుకుని పురజనులు దేవాలయాలలోకి పోలేరు. రాజు పాలించని రాజ్యంలో రాకుమారులు గంధాన్ని పూసుకుని సుఖంగా తిరగరు. రాజు జీవించి వున్న రోజుల్లో సముద్రానికి చెలియలికట్ట లాగా నీ ఆజ్ఞను దాటకుండా ప్రవర్తించాం. ఇక ఇప్పుడేనీ చెప్పాలి? కాబట్టి లోకహితం ఆలోచించి రాజ్యానికి ఒక ప్రభువును ఏర్పాటు చేయి. రాజనేవాడు ఒకడు లేకపోతే రాష్ట్రం అడవైతుంది. ఇది నీకు తెలిసిన విషయమే. కాబట్టి దశరథుడి కొడుకుల్లో ఒకడిని రాజుగా నిర్ణయించు".

❖ ❖ ❖

సర్గ-68

భరతుడి దగ్గరకు దూతలను పంపిన మంత్రి పురోహితులు

రాజపురోహితులు, మంత్రులు చెప్పిన మాటలు విన్న వశిష్ఠుడు ఇలా అన్నాడు: "ఆర్యులారా! భరతుడు శత్రఘ్నుడితో మేనమామ ఇంట్లో రాజగృహంలో సుఖంగా వున్నాడు. వాళ్లిద్దరూ లేకుండా ఏపనీ ఎలా సాగుతుంది? కాబట్టి దూతలను ఇప్పుడే వేగంగా వారిదగ్గరకు పోయి శీఘ్రంగా వారిని తీసుకు రమ్మని చెప్దాం. భరతుడికేకదా రాజు రాజ్యాన్ని ఇచ్చింది?". వశిష్ఠుడి మాటలకు వారందరూ సరే-సరే అన్నారు. అదే రాజనియమం అన్నారు. అదే బాగుంటుందని అందరూ అంగీకరించిన తరువాత, సిద్ధార్థుడు, విజయుడు, జయంతుడు, అశోకుడు, నందనుడు అనే పేర్లుగల దూతలను పిలిచి చేయాల్సిన పని గురించి వివరించారు. వారితో ఇలా చెప్పారు: "వేగమైన గుర్రాలను ఎక్కి భరతుడి దగ్గరకు పొండి. భరతుడిని చూసి వశిష్ఠుడి ఆజ్ఞగా ఇలా చెప్పండి. చెప్పడానికి భయపడవద్దు. రాజకుమారా! వశిష్ఠుడు, ఇతర మంత్రులు మీ క్షేమం అడిగారు. ఏదో ముఖ్యమైన పని ఉన్నందున ఎంత మాత్రం ఆలశ్యం చేయకుండా వెంటనే బయల్దేరి మిమ్మల్ని రమ్మన్నారని మాత్రం చెప్పండి. మీరు భరతుడితో శ్రీరాముడు అరణ్యానికి పోయాడని కాని, తండ్రి మరణించాడని కాని, చెప్పవద్దు".

వారలాగే వేగంగా పరుగెత్తే గుర్రాలను ఎక్కి ప్రయాణమయ్యారు. పోతూ, నవరాతలమనే కొండకు పడమర, ప్రలంబాద్రికి ఉత్తరాన, వాయువ్య మూలగా రెండు కొండల నడుమ ప్రవహించే మాలినీ నది వెంట చక్కగా పోయి, హస్తినాపురం దగ్గర గంగానదిని దాటి, అక్కడనుండి పడమటగా కురుదేశంలో గల జాంగల తోవన, పాంచాల దేశంలోకి ప్రవేశించారు. అక్కడున్న సరస్సు చూశారు. అక్కడినుండి అతి వేగంగా ప్రయాణం చేస్తూ, జనప్రవాహమైన శరదండ నదిని దాటి, పడమట వున్న నికూలమనే (కోరిన కోరికలను ఇచ్చే) వృక్షానికి నమస్కారం చేసి, కుళింగపురం చేరి, అభికాళమనే గ్రామాన్ని దాటి, బోధి పర్వతాన్ని సమీపించి, దశరథుడికి పూర్వం వున్నా రాజులనుభవించిన

యిక్షుమతీనదిని చూసి, అక్కడ కాసిని నీళ్లు తాగి, అక్కడున్న బ్రాహ్మణులను చూసి, అక్కడనుండి బాహ్లికమనే దేశంలోకి వెళ్లారు. అక్కడే సుదామ అనే కొండను, విష్ణుపాదాలున్న విష్ణుపదం అనే క్షేత్రాన్ని చూశారు. వశిష్ఠుడు పుత్రశోకంతో మరణించాలనుకుని దూకిన విపాశ అనే నదిని, బూరుగు చెట్టును, మనోహరమైన బావులను, నదులను, చిన్న సరస్సులను, ఇంపైన చెరువులను, జింకలను, ఏనుగులను, సింహాలను, పెద్ద పులులను, భయంకర జంతువులను చూసుకుంటూ, గిరివ్రజపురానికి చేరారు. (గిరివ్రజం అనేది కేకయ రాజు పట్టణానికి ఇంకో పేరు. దీన్నే రాజగృహం అంటారు). పట్టణం చేరిన దూతలు రాత్రంతా ఒక చోట గడిపి భరతుడి దర్శనం కొరకు ఎదురుచూశారు.

❖ ❖ ❖

సర్గ-69

దుస్వప్నం కని పరితపించిన భరతుడు

ఏ రాత్రయితే దూతలు భరతుడున్న నగరం ప్రవేశించారో అదే రోజు రాత్రి కైక కుమారుడు భరతుడు తెల్లవారు ఝామున ఒక చెడ్డ కల కని, భయపడ్డాడు. ఉదయం కాగానే తన కల గురించి భరతుడు జ్ఞప్తికి తెచ్చుకుని బాధపడుతుంటే, ఆయన స్నేహితులు ఆయనను నాలుగు మంచిమాటలు చెప్పి దుఃఖమణచడం జరిగింది. పొద్దుపోయేవరకు వారంతా భరతుడికి ఎన్నో ముచ్చటలు చెప్పారు. కొందరు వింత కథలు చెప్పారు. కొందరు హాస్యం ఆడారు. కొందరు నాట్యాలాడారు. కొందరి వాద్యం వాయించారు. అవన్నీ వ్యర్థం అయ్యాయి. భరతుడి బాధ తీరలేదు. స్నేహితులు ఆయనెందుకు బాధపడుతున్నాడని ఆరా తీశారు. తనకు భయంకరమైన కల వచ్చిందనీ, అది మనసును కలవర పెట్టుతున్నదనీ, కల నిశ్చయమనీ భరతుడు స్నేహితులకు చెప్పాడు. మాసిన దేహంతో, తల విరియబోసుకుని, కొండమీద నుండి తాను పేడమడుగులోకి దూకినట్లు, అందులో కప్పగంతులు పెట్టుకుంటూ, నవ్వుతూ, దోసెట్లో నూనె తీసుకుని నూనె అన్నం తిని తాగినట్లు, తలకిందికి కాళ్లు పెట్టుకుని పైనుండి నూనె దేహానికి రాసుకున్నట్లు, నూనెలో మునిగునట్లు, సముద్రాలు ఎండినట్లు, చంద్రుడు నేలమీద పడ్డట్లు, గాడాంధకారం లోకమంతా వ్యాపించినట్లు, పట్టపు ఏనుగు దంతం విరిగినట్లు కల వచ్చిందని భరతుడు చెప్పాడు. నిప్పు చల్లగా అయిందనీ, భూమి పగుళ్లు పారిందనీ, చెట్లు ఎండిపోయాయనీ, కొండలు పొగరాజుకున్నాయనీ, నల్ల ఇనుప పీటమీద నల్ల కాంతిగల వస్త్రం ధరించి, దశరథుడు ఆయన్ను నల్లటి-పచ్చటి స్త్రీలు పరిహసిస్తుంటే, నవ్వుతుంటే, ఎర్రటి పూడండలు ధరించి గాడిదలు కట్టిన రథం మీద దక్షిణ దిక్కుగా పోయినట్లు కలగన్నానని అన్నాడు. "ఎర్రటి గుడ్డ కట్టుకున్న ఒక స్త్రీ రాజును చూసి నవ్వుతున్నది. వికారపు ముఖం కల ఒక రాక్షసి నా తండ్రిని బలాత్కారంగా లాగుతున్నది. ఇలాంటి భయంకరమైన కలగన్నాను. ఈ కల ఫలితం ఏమంటారు? దశరథుడో, రాముడో, లక్ష్మణుడో, నేనో మరణించడం కలుగుతుంది". అన్నాడు భరతుడు.

(రామాయణంలో దశరథ, భరత, త్రిజటలు స్వప్నాలు కన్నట్లు చెప్పడం జరిగింది. ముగ్గురి కలలు నిజమయ్యాయి. ఈ విషయం శాస్త్ర–ఇతిహాసాలలో కూడా వివరంగా చెప్పడం జరిగింది. కాబట్టి స్వప్నాలు నిజమవుతాయే కాని అబద్ధం కాదు)

భరతుడు ఇంకా ఇలా అన్నాడు: "గాడిదలను కట్టిన వాహనం మీద ఎవడు పోతాడో, వాడు శీఘ్రంగా చితిమీదకు పోతాడు. అందుకే నా హృదయం పగిలింది. మాటలు తడబడుతున్నాయి. గొంతు ఎండిపోయింది. మనసు ఆ సుడిగుండంలో పడి సుళ్లు తిరుగుతున్నది. స్థయిర్యం లేదు. ఎలాంటి పరుష వాక్యాలు వినాలో? మనసు బాగుండనందువల్ల మీతో సంతోషంగా మాట్లాడలేకపోతున్నాను. భయం కావచ్చు. స్వభావైమన నా కంఠస్వరం ఏ కారణం చేతనో చెడిపోయింది. నా కాంతి మలినమైంది. మనసు అప్రయత్నంగా బాధపడుతున్నది. కారణమేంటో కొంచెమైనా అర్థం కావడం లేదు. ఇంతకు ముందు ఎన్నడూ రాని ఇలాంటి పీడకల నన్ను నానా విధాలుగా పీడిస్తున్నందువల్ల, నా జనకుడికి ఏదో కీడు కలిగిందని అనుమానిస్తున్నాను".

ఈ విధంగా తన కల గురించి స్నేహితులకు వివరిస్తూ, పిచ్చివాడిలాగా తిరుగుతూ, తండ్రిని స్మరించుకుంటూ, చింతిస్తుండగా, రాజ దూతలొచ్చారని తెలిసింది.

❖ ❖ ❖

సర్గ-70

భరతుడితో మాట్లాడిన రాజదూతలు

ఆ సమయంలో రాజదూతలు వచ్చి, రాజు పాదాలను తమ చేతులతో తాకారు. ఆ తరువాత భరతుడిని చూసి ఇలా అన్నారు: "రాజా! మీ పురోహితులు, మంత్రులందరూ మీ క్షేమం అడిగారు. ఇక త్వరగా ప్రయాణం చేయండి. అక్కడ మీరు చేయాల్సిన అనివార్య కార్యం వుంది. ఆభరణాలు, వస్త్రాలు మీకిమ్మని ఇచ్చారు". వాటిని తీసుకున్న భరతుడు రాజదూతలతో ఇలా అన్నాడు: "దూతలారా! మా తండ్రి దశరథ మహారాజుగారు కుశలంగా వున్నాడా? శ్రీరామచంద్రుడికి సుఖమా? లక్ష్మణుడు ఆరోగ్యంగా వున్నాడా? వశిష్ఠుడు క్షేమమా? పూజ్యురాలైన కౌసల్య భద్రమా? సుమిత్రాదేవి సంతోషంగా వుందా? దుష్టురాలైన నా తల్లికి ఏ రోగం లేదుకదా? ఆమె మీరిక్కడికి వచ్చేటప్పుడు మీతో ఏం చెప్పింది?"

భరతుడి ప్రశ్నలకు జవాబుగా కాదు వినయంతో, ఏమాత్రం ఆలశ్యం చేయకుండా ఇలా చెప్పారు రాజదూతలు: "మీరు కోరినవారందరూ సుఖమే! నిన్ను లక్ష్మీదేవి వరించుకాక. ఇంక ఆలశ్యం చేయొద్దు. ప్రయాణానికి సిద్ధం కా". రాజుగారికి చెప్పి శీఘ్రంగా బయల్దేరుతానని అన్నాడు భరతుడు. ఆ తరువాత భరతుడు తాతైన కేకయరాజును చూసి, "రాజా! అయోధ్యకు పోయి వస్తాను. దూతలు వేచి వున్నారు. మీరెప్పుడు రమ్మంటే అప్పుడే వస్తాను" అని అడిగాడు. దానికి రాజు సమ్మతించాడు. భరతుడికి ప్రయాణంలో సహాయపడేందుకు, తోడుగా వుండడానికి, వెంట కొందరిని పంపాడు కేకయరాజు. మేనమామ ఇచ్చిన ఏనుగులను, కంచరగాడిదలను, సాకుడు కుక్కలను, రథాలను, గుర్రాలను, ఆవులను, తీసుకుని మనసులో సంతోషం ఏమాత్రం లేకుండా ప్రయాణానికి సిద్ధమయ్యాడు భరతుడు.

❖ ❖ ❖

సర్గ-71

అయోధ్యకు ప్రయాణమైన భరతుడు

ప్రయాణమైన భరతుడుతూర్పుదిక్కుగా కొంత దూరం పోయాడు. అక్కడ సుదామ నదిని సమీపించాడు. ఆ తరువాత వరుసగా, హ్లాదిని, పశ్చిమ దిక్కుగా పారే శత్రుదు నదిని నేలధానమనే వూరు దగ్గర దాటాడు. కాసేపు పర్వటాల దగ్గర ఆగాడు. తరువాత, శిలావహయనే నదిని దాటి, ఆగ్నేయంగా వున్నా శల్యకర్తనమనే పట్టణం చూసి, చైత్ర రథాన్ని దర్శించి, గంగా-సరస్వతి అనే రెండు నదులను చూశాడు. అక్కడనుండి వీరమత్స్యములు అనే దేశాలలో ఉత్తరాన వుండే భారుండ వనంలోకి ప్రవేశించి, కొండల మధ్యన వున్న కులింగ దేశానికి అటువైపున వున్న యమునాతీరంలో సైన్యాన్ని ఆపి, బడలిక తీర్చుకున్నారు. గుర్రాలను కడిగారు. వారూ స్నానం చేశారు. దాహం తీర్చుకున్నారు. కాసిన్ని మంచినీళ్ళు వెంట తీసుకున్నారు. అక్కడ నుండి భరతుడు సైన్యంతో గంగాతీరం చేరుకున్నాడు. అంశుదానమనే దేశంలో వున్నా భ్రాగ్వటం అనే వూరు దగ్గర గంగను దాటి, గుటికోష్టికానది దగ్గర ధర్మవర్ధనం అనే పట్టణాన్ని చూశారు. ఇక అక్కడ నుండి, తోరణ దేశం దక్షిణ భాగం నుంచి జంబూప్రస్థం పట్టణం చేరుకున్నారు. రమ్యవరూధం అనే గ్రామం సమీపంలో వనంలో కాసేపు ఆగారు. తరువాత తూర్పుగా పోతూ, నుజ్జిహానం దగ్గర తమ దేశంలోకి ప్రవేశించారు. అక్కడ వేగమైన గుర్రాలను రథానికి కట్టించి అందులో భరతుడు కూర్చుని ప్రయాణం సాగించాడు. తమ దేశంలోకి ప్రవేశినీచాం కాబట్టి, సేనలను నిమ్మదిగా రమ్మని అతడు వేగంగా పోయాడు. సర్వ తీర్థంలో ఒక రాత్రి ఆగాడు. తరువాత నుత్తానక నదిని, హస్తి వృష్టకంలో కుటిక నదిని, లౌహిత్యం పట్టణం దగ్గర గపీవతి నదిని, ఏకసాలం దగ్గర స్థాణుమతీ నదిని, విమతం దగ్గర గోమతీ నదిని దాటి, కళింగపురం లోని సాలవనంలో కాసేపు వుండి, రాత్రివేలనే అక్కడనుండి బయల్దేరి, అరుణోదయాన భరతుడు అయోధ్యాపురాన్ని చూశాడు. ఇలా ఏడూ రాత్రులు ప్రయాణం చేశాడాయన. ఎనిమిదవ దినం ఉదయాన్నే దూరం నుండి అయోధ్యను చూసి సారథితో ఇలా అన్నాడు.

అయోధ్య స్థితికి బాధపడ్డ భరతుడు

"చూశావా సారథీ! అయోధ్య ఎలా వుందో? రాజులలో శ్రేష్ఠుడైన దశరథుడు పాలించుతున్నప్పటికీ, యజ్ఞాలు-యాగాలు చేస్తున్నప్పటికీ, వేదాధ్యయనం జరుగుతున్నప్పటికీ, గోప్పవారందరూ వుంటున్నప్పటికీ, నెత్తురులేనివాడి ముఖంలా, తెల్లగా-పాలిపోయి, దూరంనుండి చూస్తుంటే, ఈ అయోధ్య విషయంలో నాకు సంతోషం కలగడం లేదు. పూర్వం ఎల్లప్పుడూ స్త్రీ-పురుషుల గల-గల ధ్వని దూరం నుంచే వినపడేది. ఇప్పుడు దగ్గరకు వచ్చినా వినబడడంలేదు. సారథీ! కారణం ఏమై వుంటుంది? విలాసంగా ఆడుకోవడానికి ఆసక్తిగల మనుష్యులు సాయంకాలం ఆడుకుని, ఉదయాన్నే వారిళ్లకు పోయేవారు. ఇప్పుడొకడు కూడా అలా కనబడడం లేదేంటి? సారథీ! మనుష్య సంచారం లేని అడవిలాగా కనిపిస్తున్నది నాకు అయోధ్య. వాహనాలపైన ఒక్కరు కూడా వూళ్లో నుంచి రావడం లేదు. నగరానికి పోయే వారూ లేరు. ఏనుగుల మీద, గుర్రాల మీద తిరిగావేరే లేరు. ఇవన్నీ చూస్తుంటే మనసుకు ఏదో సందేహం కలుగుతున్నది. సారవంతమై, ప్రకాశించే తోటలు కళావిహీనమై వున్నాయి. చూడు... ఈ క్రీడా వనాలెలా వున్నాయో? ఉద్యానవనాలలో ఒక్కరైనా కనబడడం లేదు. వీనులకు ఇంపైన పక్షుల ధ్వని వినబడడం లేదు. కమ్మని గాలి వీయడం లేదు. శకునాలు మంచిగా లేవు. హృదయం కలత చెందుతున్నది. ఇది నిశ్చయం. నా సమీప బంధువులెవరికో, ఏదో, అశుభం కలిగింది" అని అంటూ భరతుడు నగరంలో ప్రవేశించి సారథితో మరల ఇలా అన్నాడు.

"సారథీ! ఆలోచించిన కొద్దీ నా మనసు బద్దలై పోతున్నది. పెద్దవారు దశరథుడు, శ్రీరాముడు వుండగా, వసిష్ఠుడు నన్ను ఎందుకు పిలిపించాలి? దానికి కారణం వుండాలి కదా? తొందర-తొందరగా రమ్మని వసిష్ఠుడు పిలిచినప్పుడు దానికేదో కారణం వుండాలికదా? ఇవన్నీ చూస్తుంటే ఏదో కీడు జరిగిందన్న అనుమానం కలుగుతున్నది. మనసు విహ్వలమవుతున్నది. వీదులవెంట పోతుంటే, పురజనులు అనుకుంటున్న మాటలు వింటుంటే, రాజు మరణిస్తే ఏం జరుగుతుందో అవన్నీ ఇప్పుడీ వూళ్లో కనిపిస్తున్నాయి. అవేందంటే....ఇళ్లల్లో కసుపు వూడవలేదు....సువాసనకల పొగలు రావడం

లేదు..... వంటలు లేవు.....పూజలు లేవు. గృహస్థుల ఇళ్లన్నీ కాంతివిహీనంగా లక్ష్మి తొలగిపోయినట్లుగా వున్నాయి. జనులు కాంతి లేకుండా వున్నారు. దేవాలయాలు అలకలేదు. ముగ్గులు పెట్టలేదు. పూదండలు వేలాడతీయలేదు. మనుష్యుల ముఖం చూద్దామన్నా సరిగ్గా కనబడడం లేదు. అవన్నీ పాడుపడ్డట్లున్నాయి. ఇవన్నీ చూస్తుంటే పరితాపం కలుగుతున్నది".

"వైశ్యులు కొనడం లేదు. అమ్మడం లేదు. అంతా బాధతో వున్నారు. మునుపటిలాగా కనబడడం లేదు. వాడిన ముఖంతో కనిపిస్తున్నారు. ఏమిటోకదా? దేవాలయాలలోని పెంపుడు పక్షులు శోకిస్తున్నాయి. స్త్రీ-పురుషులు శోకిస్తున్నారు. కారణమేంటో?"

ఇలా సారథితో మాట్లాడుకుంటూ, పూర్వం స్వర్గంతో సమానమైన అయోధ్యానగరం ఇలా వుండడం చూసి దుఃఖంతో కలతచెందిన మనసుతో తలవంచుకుని వేగంగా తండ్రి వుండే మేడవైపు పోయాడు భరతుడు.

❖ ❖ ❖

సర్గ-72

కైకేయి మేడకు పోయిన భరతుడు

తండ్రి ఎప్పుడూ వుండే మెడకు పోయి అక్కడ ఆయన లేకుంటే, తల్లి కైకేయి ఇంటికి పోయాడు భరతుడు. పరదేశ0 నుండి వచ్చిన కొడుకును చూసి సంతోషంగా తాను కూచున్న బంగారు పీఠం మీదనుంచి దిగి, కొడుకుదగ్గరకు పోయింది. భరతుడు తల్లి పాదాలకు నమస్కరించాడు. తల్లి భరతుడిని తన తొడల మీద కూర్చోబెట్టుకుని అతడి శిరస్సు వాసన చూసి ఇలా అన్నది: "నాయనా! నువ్వు వూరు వదిలి ఎన్నాళ్ళయింది?లల మార్గాయాసం వల్ల అలసటగా వుందా? మేనమామ సుఖమా? అక్కడ ఎలా వున్నావు నువ్వు? అక్కడ సంతోషంగా వుందా నీకు? నువ్వు లేకపొతే కళ్లకు కట్టినట్లే వున్నావు కదా?". జవాబుగా భరతుడు: "అమ్మా! నేను వూరు వదిలి ఏడు రాత్రులయ్యాయి. తాత మామ అందరూ క్షేమమే వారు నాకు దండిగా ధనమిచ్చారు. అవన్నీ సరే! నా ప్రశ్నలకు జవాబివ్వు. తల్లీ! నువ్వు పడుకునే పక్క ఎందుకు పాడుబడినట్లునీది? ఎందుకు రాజబంధువులు, రాజునకు సంబంధించిన ఇతరులు దుఃఖపడుతున్నారు? రాజెప్పుడూ నీ ఇల్లు విడిచిపోడుకడా? ఇప్పుడెందుకు లేడు?" అని అన్నాడు.

దశరథుడి మరణవార్త భరతుడికి చెప్పిన కైక

"వినయంగా తండ్రికి నమస్కారం చేయాలని వేగంగా ఇటు వచ్చాను. ఆయనకు నేను వచ్చిన సంగతి చెప్పు. పెద్ద భార్య కౌసల్య ఇంట్లో వున్నాడా? అట్లయితే నేను అక్కడికే పోతాను" అని అడిగాడు భరతుడు తల్లి కైకేయిని. తాను చెప్పబోయే వార్త భరతుడికి సంతోషం కలిగిస్తుందన్న ఆశతో కైక ఇలా అంది. "నాయనా! నీ తండ్రి సామాన్యుడా? ఆయనకు యజ్ఞాలు చేయడం స్వభావం. పాపమంటే ఏమిటో తెలియదు. గొప్ప మనసున్నవాడు. తేజోవంతుడు. ఆర్యులకందరికీ ఆయనే దిక్కు. ఇలాంటివాడైనప్పటికీ భూమ్మీద పుట్టినవారు ఏ తోవన పోతారో ఆ దారిలోనే ఆయనా పోయాడు". అని తండ్రి మరణవార్తను భరతుడికి చెప్పింది. ఆ వార్తా విన్న భరతుడు ఆర్తుడై "హా! తండ్రీ" అని

నేలమీద చచ్చిపోయినవాడిలాగా పడిపోయాడు. లేచి, చేతులెత్తి ఏడుస్తూ, దుఃఖపడుతూ,గ్భ్రమ చెంది, నేల మీద పడి....”నాయనా! నన్ను చూడు..ఎక్కడికి పోయావు?...తండ్రీ దయతో నన్ను చూడవా? శరత్కాలం నాటి రాత్రి పూర్ణబింబంతో ఆకాశం లాగా ఈ అందమైన శయ్య రాజు పడుకుంటే ఎంతో కాంతివంతంగా వుండేది. నేడు రాజు లేనందున చంద్రుడు లేని ఆకాశం లాగా, నీళ్లు లేని సముద్రం లాగా కనిపిస్తున్నది.” అన్నాడు.

ఇలా అంటూ వస్త్రంతో ముఖం కప్పుకుని గొడ్డలితో నరకబడ్డ చెట్టులాగా నేలపై పడి ఏడ్చాడు. కైక కొడుకును తన చేతులతో పట్టి మెల్లగా లేపింది. లేపి, “రాజా! లే..లెమ్ము. ఈ విధంగా నేలమీద పడి ఎందుకు ఏడుస్తావు? నీలాంటి బుద్ధిమంతులున్నారా? బుద్ధిమంతులు ఇలా ఏడుస్తారా? మనుష్యులు ఎల్లప్పుడూ బతుకుతారా? నాయనా! సమస్త వేదాలు చదివావు. అందరికీ ఇష్టమైన విధంగా ప్రవర్తించాలి. విష్ణుపూజ మీద నీ మనసెప్పుడూ లగ్నమై వుంటుంది. ఇలాంటివాడివి చచ్చిన వారికై ఏడవడం వలన లాభం లేదు” అని భరతుడితో అన్నది. జవాబుగా, అతి కష్టం మీద భరతుడు, “శ్రీరాముడిని యువరాజుగా చేస్తాడనో, లేదా, ఏదైనా యజ్ఞం చేస్తున్నాడనో అనుకుని ఆశతో వచ్చాను. రాజును చూసే పుణ్యం లేకపోయింది. నా కోరికా తీరలేదు. హృదయం ముక్కలైపోతున్నది. నేను రాకముందే ఇలా చావడానికి ఆయనకేమైంది? వచ్చిన రోగం ఏమిటి? తండ్రికి పరలోక కార్యం చేసిన శ్రీరామలక్ష్మణులు ఎంత పుణ్యాత్ములోకదా? నేను వచ్చేవరకు తండ్రి బతికుంటే నా శిరస్సు వాసన చూసి వుండేవాడు కదా? ఇక దుమ్ములో మునిగిన నా శరీరాన్ని తన చేతులతో ప్రేమగా తుడిచి బుజ్జగించేవారు ఎవరు? నాకు సుఖంగా తాకే చేఏదీ? శ్రీరామచంద్రుడికి నేను వచ్చిన వార్త చెప్పి పంపండి. తండ్రి పోయిన కారణాన ఇక అన్నీ అన్నే కదా? తండ్రిలాగా పూజ్యుడు...ఆయనే కదా నాకిక రక్షకుడు. కాబట్టి ఆయన పాదాలపైన పడుతాను. తండ్రి స్వర్గానికి పోయే ముందర నాకు ధర్మంతో కూడిన హితబోధ ఏమని చేశాడు? తండ్రి మరణించే ముందర చివరిగా నాకు చెప్పమని చెప్పిన హితవాక్యాలు నాకు వినాలని వుంది” అని అన్నాడు. కైక ఉన్నదున్నట్లు ఇలా చెప్పింది భరతుడికి.

"రామా! సీతా! లక్ష్మణా! అని మిక్కిలి దుఃఖంతో ఏడుస్తూ, ఏడుస్తూ, రాజు స్వర్గానికి పోయాడు". ఈ అప్రియ వాక్యాలు విన్న భరతుడు, మనసులో చాలా బాధపడ్డాడు. ఏడుపు ముఖంతో తల్లిని చూస్తూ, "అమ్మా! శ్రీరాముడు సీతాదేవితో, లక్ష్మణుడితో ఎక్కడికి పోయాడు? అలా పోవడానికి కారణమేంటి? అని ప్రశ్నించాడు తల్లిని. కైక వినడానికి దుఃఖ వార్తైనా అది సంతోష వార్తగా తానూ చేసిన పని వున్నదున్నట్లు ఇలా చెప్పసాగింది.

శ్రీరాముడు అరణ్యానికి పోయిన విషయాన్ని భరతుడికి చెప్పిన కైక

"కుమారా! నారచీరెలు కట్టుకుని శ్రీరాముడు సీతతో, లక్ష్మణుడితో దండకారణ్యానికి పోయాడు" అని కైక అనగా, ఆ భయంకర వార్తను విని, భయంతో, అన్న ఏదో చేయతగని దోషం చేశాడా? దానివలన వంశానికి అపకీర్తి వచ్చెనే? అని అనుకుంటూ ఇలా అన్నాడు భరతుడు. "అమ్మా! శ్రీరాముడు బ్రాహ్మణ ధనాన్ని ఆశించలేదుకదా? నేరం చేయని ధనవంతుడినైనా, లేదా, నిరుపేదనైనా బాధించలేదుకదా? పరాంగనల సాంగత్యం చేయలేదుకదా? అలా చేయకపోతే భ్రూణ హత్య చేసినవాడిలాగా శ్రీరాముడిని అరణ్యాలకు పంపడానికి కారణం ఏమిటి?".

భరతుడు ఇలా అడిగేసరికి, తాను పండితురాలిని అని అనుకుంటున్న చపలచిత్త కైకేయి, ఉన్నదున్నట్లు తానుచేసిన పనికి తానే ఉబ్బిపోతూ, ఇలా అంది.

"శ్రీరామచంద్రమూర్తి బ్రాహ్మణ ధనం కొంచెమైనా కోరినవాడు కాదు. పరస్త్రీలను కామ దృష్టితో కన్నెత్తి అయినా చూడడు. పేదవాడినైనా, గొప్ప గుణాలు గల నిర్దోషినైనా బాధించడు. శ్రీరాముడిని అడవులకు పంపమని, నిన్ను రాజుగా చేయమని, నేనేరా నీ తండ్రిని కోరాను. తానూ చెప్పిన మాటపై నిలిచి నీ తండ్రి తమ్మునితో, సీతతో, శ్రీరాముడిని అడవులకు పంపాడు. అలా పంపిన తరువాత తన ప్రియకుమారుడిని చూడకుండా వుండలేక దుఃఖంతొ చనిపోయాడు. కొడుకా! నీకొరకు నేనింత పనిచేశాను. ఏడుపు ఆపు.

పురోహితులు నీ రాజ్య సంపద నీవు పొందేలా చేయాలని నీ రాకకొరకు ఎదురు చూస్తున్నారు. ధైర్యం తెచ్చుకుని పట్టాభిషేకానికి సిద్ధం కా. ఈ పట్టణం, ఈ రాజ్యం, నానా రకాలైన బొక్కసాలు, ఇవన్నీ నీవే అవుతాయి. రాజునకు కావాల్సిన సంస్కారాలు ముగియగానే బ్రాహ్మణులు నీకు అభిషేకం చేస్తారు".

❖ ❖ ❖

సర్గ-73

కైకేయిని దూషించిన భరతుడు

కైక ఇలా భరతుడితో చెప్పగానే తండ్రి మరణాన్ని, అన్న-తమ్ముడు అడవులకు పోవడాన్ని విన్న అతడు శోకాగ్నితో కాలిపోయాడు. తల్లితో, "నా తండ్రిని, తండ్రితో సమానమైన రఘువంశ శ్రేష్ఠుడైన శ్రీరామచంద్రమూర్తిని విడనాడి ఏడిచే ఈ అనాధకు, నిర్భాగ్యుడికి ఐశ్వర్యం ఎందుకు? రాజ్యం ఎందుకు? ఓసీ క్రూరురాలా! రాజును చంపావు. సాదుగుణాలున్న శ్రీరామచంద్రుడిని అడవుల పాలు చేశావు. పుండుమీద కారంలాగా తీవ్ర దుఃఖంలో వున్న నాకు మరింత బాధ కలిగించావు. అయ్యో! ఆ రాజేంద్రుడు బుద్ధిలేనివాడిలాగా నిన్ను తెచ్చుకుని నిప్పున్ ఒళ్లో పెట్టుకున్నాడు కదా! ఓసీ దుష్ఠురాలా! మా వంశాన్ని నాశనం చేయడానికి నువ్వెక్కడనుండి దాపరించావే? సమస్త లోకాలను నాశనం చేసే కాళరాత్రిలాగా రాజును చంపావుకదా? బుద్ధిలేని దానా! అజ్ఞానంతో, ధనకాంక్షతో, నీ వంస సుఖాలన్నీ నాశనం చేశావుకదా? నిన్ను పెళ్లి చేసుకున్న కారణాన రాజు దిక్కులేనివాడిలాగా చచ్చిపోయాడు కదా!"

"మిక్కిలి ధర్మాత్ముడు, ఉత్తమోత్తముడు, శ్రీరామచంద్రుడు నువ్వు సవతి తల్లివని, పరమ పాపివని ఎంచక తన తల్లే అనుకుంటూ శ్రద్ధాభక్తులతో తన తల్లిని ఆదరించినట్లే నిన్ను గౌరవించలేదా? మా తల్లి కౌసల్య మనఃపూర్వకంగా ప్రేమతో తన చెల్లెలిలాగా నిన్ను కూడా ఆదరించలేదా? అలాంటి మహాత్మురాలి కొడుకును, ధర్మాత్ముడిని, నారచీరెలు కట్టించి భయంకరమైన అడవులకు బలాత్కారంగా తోసిన దరిద్రురాలా....నీకు కొంచెమైనా బాధలేదుకదా? శ్రీరాముడిని వూరు వెడలగొట్టి నువ్వు పొందిన పుణ్యలాభం ఏమిటి? శ్రీరాముడి విషయంలో నాకు ఏవిధమైన భావం వుందో పిసినిగొట్టువైన నువ్వు తెలుసుకోలేకపోయావు. ఓసీ వంశ నాశకురాలా! ఈ భూమికి నువ్వెంత కీడు కలిగించావో నీకు తెలియదు. శ్రీరామలక్ష్మణులు దూరదేశవాసులు అయితే ఏబలంతో ఈ రాజ్యాన్ని, ఈ నగరాన్ని నేను పాలించగలను? రామలక్ష్మణుల బలం వల్లే, సహాయం వల్లే, దశరథుడు శత్రువులకు భయపడకుండా

పాలిస్తున్నాడు. ఇప్పుడు వారి సహాయం లేకుండా నేనెలా పాలించగలను? ఈ భూభారాన్ని నాలాంటి బాలుడు భరించడం ఎలా సాధ్యం? పెద్ద ఆబోతు కోడె మోయాల్సిన భారాన్ని లేగదూడ ఎలా మోస్తుంది?"

"నువ్వు రాజకుమారుడవు కావా? క్షత్రియ వంశంలో పుట్టలేదా? యౌవనవంతుడవు కావా? నీకెందుకు ఇతరుల సహాయం? మంత్రులు-అధికారులు లేరా? నువ్వు పడే కష్టం ఏమిటి? అంటావేమో? నీ పాపిష్టి ఆలోచనలను నేను ఒప్పుకోను. నీ సంకల్పం వ్యర్థం కాగా, ఆ దురంత తాపంతో మాడిపో! నీకిదే శిక్ష. వేరే శిక్ష లేదు. వ్యర్థ సంకల్పవై ఏడుస్తుండు. ఇదేనా నువ్వు నాకు చేసే మేలంటావా? విను. శ్రీరాముడు నిన్ను తల్లి అనే భావంతో చూస్తున్నాడు కాబట్టి, నిన్ను ఇంకా ఎక్కువగా దండిస్తే ఆయనకు కోపం వస్తుందని భయపడి ఇంతటితో వదిలిపెట్టాను. అలా కాకుంటే, ఓసీ మాయలమారీ! నువ్వు చేసిన దానికి నిన్ను వూరి నుండి వెడలకొట్టాల్సింది. మా వంశంలో పెద్దవారు భూభారం వహిస్తే తక్కిన సోదరులు ఆయనను తండ్రిలాగా సేవిస్తారు. ఈ ధర్మం నీకెందుకు తోచలేదు? ఓసీ నీచురాలా! నీతో సంబంధం వుండబట్టే నా పొగరు మట్టిలో కలిసింది. మా వంశం సంగతి అలా వుంచు. నీ పుట్టినింట్లో కూడా అంటే కదా? ఓసీ పాపాత్మురాలా! నా తండ్రిని చంపినట్లే నన్ను చంపాలనుకున్నావు. నా తండ్రిలాగా నీ మాయ మాటలకు లోబడను. నేను నీ ఇష్టానికి వ్యతిరేకంగా చేస్తాను. ఆ శ్రీరాముడిని పట్టణానికి మరల వచ్చేట్లు చేస్తాను. అగ్నిప్రభ కల ఆయన్నే రాజుగా చేసి స్థిరమైన అంతఃకరణతో ఆయనకు దాసుడనై, చత్రచామరాదుల సేవ చేస్తూ, ఆయనకు సంతోషం కలిగిస్తాను. ఇది నా స్వరూపస్వభావం. నా స్వరూపం వల్లే నేను ఆయనకు దాసుడిని".

ఇలా భరతుడు అసహ్యపడి వంచన మనసున్న కైకను తిట్టి, మితిమీరిన దుఃఖంతో గుహలోని సింహంలాగా పెద్దగా ధ్వని చేశాడు భరతుడు.

❖ ❖ ❖

సర్గ-74

కైకేయిని మరింత దూషించిన భరతుడు

దుర్వార్త వినగానే కలిగిన అల్ప కోపం వల్ల మృదువుగా తల్లిని ఇంతవరకు దూషించాడు భరతుడు. ఆమె చేసిన పని ఆలోచించిన కొద్దీ మరింత ఘోరంగా అనిపించడంతో కోపం పెరిగి ఆమెను తీవ్రంగా దూషించసాగాడు. "చెడు నడవడికల దానా! ఛీ! పో! నువ్వు రాజ్యంలో వుండకుండా అడవులకు పో. క్రూరురాలా! ఇలాంటి ధర్మహీనమైన పని చేశావు కదా! భార్యా భర్త న్యాయం నీలో లేదు. కాబట్టి భర్త చనిపోయాడని నువ్వు ఏడ్చి వుండవు.....నేను చచ్చానని ఏడువు. రాజు కాని, పుణ్యాత్ముడు సీతావిభుడు కానీ, నువ్వీ దుష్కార్యం చేయడానికి ముందు తిట్టారా? కైకేయీ! ఈ వంశం కూలిపోయే పని చేశావు కాబట్టి నిన్ను భ్రూణహత్య బాధిస్తుంది. నువ్వు అధోలోకాలకు పోతావు. నీకు నీ భర్తతో సాలోక్యసుఖం కలగదు. ఇలాంటి భయంకరమైన పాపకార్యం చేయడానికి ఆసక్తిగల నిన్ను చూసి, సీతావిభుడు నా సమీపంలో లేనికారణాన నాకు రాజ్యం రావడం నిజమే అయినా, నేను ఏలడం అసత్యం అని అంటాను. నువ్వు చస్తావేమోనని కూడా అనిపిస్తున్నది. వైధవ్యానికి, హత్యకు భయపడకుండా భర్తను చంపిన పాపాత్మురాలివినీ మాట ప్రకారం నడచుకుంటే, లోకనిందతో, అధర్మంతో చస్తాను. నా తండ్రిని చంపావు. అన్నాను అడవులకు పంపావు. ఈ రెంటికీ నేను కారణమన్న అపకీర్తి నాకు అంటకట్టావు. ఇక నలుగురిలో ఏం న్యాయమని తలెత్తుకుని తిరగగలను?"

"నువ్వు నాకు తల్లివి కావు. కొడుకుల సుఖం, కీర్తి కోరేది తల్లికాని, నీలాగా దుఃఖం, అపకీర్తి కలిగించేది తల్లి ఎలా అవుతుంది? ఏ పగవారూ చేయలేని పని నువ్వు చేశావు. పగవారు యుద్ధంలో దెబ్బతీస్తారేమోకాని నీలాగా వంశనాశనం, నాకు అపకీర్తి వచ్చేట్లు చేయలేరు కదా? ఇలాంటి నువ్వు నాకు తల్లివి కావు....బంధువు కూడా కాదు. నీతో మాట్లాడ కూడదు. నీ ముఖమైనా చూడ కూడదు. నువ్వు భర్తను చంపి శ్రీరాముడి తల్లికి, లక్ష్మణుడి తల్లికి దుఃఖం తెచ్చిపెట్టావు. అసమాన ధర్మనిష్ఠుడైన కేకయరాజు కూతురివి కాదు నువ్వు. ఆయన కూతురివే అయితే ఆయన గుణాలు నీలో వుండాలి. నువ్వు ఒక ఆడ దయ్యానివి. పుట్టింటివారికి, అత్తింటివారికి అపకీర్తి తెచ్చావు.

శ్రీరాముడిని అడవుల్లోకి తోసి నా తండ్రిని స్వర్గానికి పంపావు. తల్లిలాంటివాడే కొడుకంటారు....నీ వల్ల నేను లోకాలకు అప్రియుడనైనాను. తల్లితో చాటుగా ఈ పని చేయించాను నేను అన్న అపకీర్తి వస్తుంది నాకు. కౌసల్యను కొడుకులేనిదానిగా చేసి నువ్వు సంపద కోరుకున్నావు. పాపాత్మురాలా నీకు నరకం తప్పదు".

"దయాహీనురాలా! నీచపు నడవడికలదానా! కౌసల్య కొడుకు నాకు పెద్దవాడని, తండ్రితో సమానమని నీకు తెలియదా? అతడికి కీడు చేస్తే అందరికీ చేసినట్లే కదా? పుత్రుడికంటే ఎక్కువ ఇష్ట బంధువు స్త్రీకున్నాడా? అలాంటప్పుడు ఒక్క కొడుకు మాత్రమే గల కౌసల్య శ్రీరాముడిని వదిలి ఎలా వుండకలదు? పతివ్రత అయిన కౌసల్య బుద్ధిలేని నీవల్ల బిడ్డలేనిదై ఏడవకుండా వుండగలదా? అలా ఆమెను దుఃఖపెట్టిన కారణాన నువ్వు ఇహ-పర లోకాల్లో దుఃఖపడతావు. మ అన్న శ్రీరాముడు వున్న చోటుకు పోయి ఆయనను పిలుచుకుని వచ్చి, ఆయన పాదాలను కొలిచి, తండ్రికి చేయాల్సిన పితృ కార్యాలను చేసి, నువ్వు నాకు అంటకట్టిన అపకీర్తికి బదులు సత్కీర్తి, పాపానికి బదులుగా పుణ్యాన్ని సంపాదించుకుంటాను. నీవిపత్తికి, శ్రీరాముసంపత్తికి, నాప్రతిపత్తికి, నువ్వు కళ్ళనిండా నీళ్లు పెట్టుకుని ఏడ్వు. దుఃఖం ఎలా వుంటుందో నీకు తెలుస్తుంది".

"శ్రీరామచంద్రమూర్తి రాజైతే కౌసల్య రాజమాత అవుతుందనీ, గౌరవించబడుతుందనీ, సవతికి ఇలాంటి గౌరవం రాకుండా నీకు రావాలని ఆలోచన చేశావు. నువ్వు ఏడుస్తుండగానే శ్రీరాముడిని రాజును చేస్తాను. కౌసల్యకే రాజమాత అనే గౌరవం కలిగిస్తాను. శ్రీరాముడెలా మునివేషంతో అడవులకు పోయాడో, అలాగే నేను, నువ్వు చూస్తుండగానే మునివేషంతో అడవులకు పోతాను. ప్రజలు ఏడుస్తున్నది శ్రీరాముడికి రాజ్యం రాలేదని కాదు.....శ్రీరాముడు అన్యాయంగా అరణ్యాలపాలైనాడని ఏడుస్తున్నారు. లోకులెలా ఏడ్చారో అలానే నువ్వూ ఏడవాలి. పుత్రశోకంతో ఏడ్చే శిక్ష నీకు చాలదు. కాబట్టి నువ్వు చేసిన పాపానికి ఇప్పుడే అగ్నిలో దూకు. హో! అని ఏడుస్తూ దండకకు వెళ్లు. లేదా ఉరిపోసుకుని చావు. నీకు వేరొక ప్రాయశ్చిత్తం లేదు. శ్రీరాముడిని అడవులకు పంపిన పాపం పోవాలంటే ఆయన్ను మరల తీసుకువచ్చి రాజును చేయడమే. ఆయనను భూమికి రాజును చేసి నేను పుణ్యుడనవుతాను".

❖ ❖ ❖

సర్గ-75

కౌసల్యను చూడడానికి పోయిన భరతుడు

భరతుడు రోషంగా కళ్ళు ఎర్రగా చేసుకుని శరీరం మీదున్న ఆభరణాలను పారేసి, తనను చూడడానికి వచ్చిన మంత్రులతో ఇలా అన్నాడు: "అయ్యా! అమాత్యులారా! వాస్తవం చెప్తా వినండి. రాజ్యం నాకు కావాలని నేను కోరలేదు. అది నాకు లభించాలని దురాలోచన చేసిన నా తల్లిని నేను ప్రేరేపించలేదు. రాజు సంకల్పించిన శ్రీరామ పట్టాభిషేక వార్త కూడా దూరదేశాల్లో వున్నా నాకు తెలియదు. శ్రీసీతారామలక్ష్మణులు దండకారణ్యానికి పోయే విషయం కూడా నాకు తెలియదు". ఇలా అంటూ పెద్ద ఎత్తున గొంతెత్తి ఏడ్చాడు భరతుడు. ఆ ఏడుపు ధ్వని కైక ఇంటి నుండి వస్తున్నట్లు కౌసల్య, సుమిత్ర అర్థం చేసుకున్నారు.

ఇలా కైకతో మాట్లాడిన భరతుడు, శత్రఘ్నుడితో కలిసి, కౌసల్య ఇంటికి పోయి దుఃఖంతో వున్న ఆమెను కౌగలించుకున్నారు. ఆ ఇల్లాలు భరతుడిని చూసి ఇలా అంది: "విస్తారమైన రాజ్యమంతా నీవు కోరినట్లే భరతా, నీ తల్లి కారణాన లభించెకదా! కార్యభారం అయిపోయింది కాబట్టి, నువ్వు, నీ తల్లి కైక రొమ్ములమీద చేతులుంచుకుని విచారం లేకుండా హాయిగా నిద్ర పొండి. క్రూరమైన మనసున్న నీతల్లి నా కొడుకును నారచీరెలు కట్టించి అడవులకు పంపి ఏం లాభం పొందింది? రాజ్య లాభం నీ పట్టాభిషేకంతో వచ్చింది కదా? శ్రీరాముడిని దండకకు పంపడంలో వచ్చిన లాభం ఏమిటి? మర్యాదహీనురాలైన కైక, శ్రీరాముడితో కౌసల్యను కూడా అడవులకు పంపమని అడిగాల్సింది. ఇప్పుడైనా ఆ పని చేయాలి. అవశ్యం చేస్తుంది. అలా అయితే నాకొడుకుతో నేనీ సుఖంగా వుంటా కదా?"

"కైక పొమ్మనేదాకా నేనెందుకు కాచుకుని వుండాలి? భర్త లేనిదానికి కొడుకే దిక్కు కదా? నా కొడుకు దగ్గరకు నేను పోవడానికి ఒకరి అనుమతి ఎందుకు? నీ తండ్రి నిత్యాగ్నిహోత్రం పెద్ద భార్యనైన నాదగ్గరే వుంది కదా? దాంతోనే కదా రాజుకు సంస్కారం చేయాలి? నువ్వు తనకు సంస్కారం చేయొద్దని

నీ తండ్రే చెప్పాడు కదా? నీ తల్లిని కూడా వదిలిపెట్టుతానని, ఆమె తనకు భార్య కాదని కూడా రాజు చెప్పాడు. కాబట్టి రాజుకు సంస్కారం చేసే అధికారం నీకు లేదు. కాబట్టి అగ్నిహోత్రం తీసుకుని నేను, సుమిత్ర శ్రీరాముడున్న చోటుకు పోతాం. చేయాల్సిన సంస్కారాలన్నీ శ్రీరాముడే చేస్తాడు. నువ్వు ఈ భూమినంతా పాలించు". అని కఠిన వాక్యాలను కౌసల్య చెప్పింది భరతుడికి.

కౌసల్యతో శపథం చేసిన భరతుడు

కౌసల్య పలికిన కఠినమైన తిమాటలు విన్న భరతుడు ఆమె పాదాలపైన మూర్ఛపోయాడు. కొద్దిసేపైన తరువాత తేరుకుని, వినయంగా చేతులు ముకుళించి కౌసల్యతో ఇలా అన్నాడు: "తల్లీ! ఎందుకు నన్నిలా నిందిస్తావు? శ్రీరాముడిపైన నాకెలాంటి భక్తి వుందో నీకు తెలియని కొత్త విషయమా? ఇక్కడి పట్టాభిషేక విషయంకాని, అది నాతల్లి విఘ్నం చేసిన సంగతికాని, శ్రీరాముడిని అడవులకు పంపిన పాపపు చరిత్రకాని, నాకు తెలియదు. ఇది అసత్యం కాదు. అన్నను అడవుల పాలు చేసేంతటి పాపాత్ముడనా? (భరతుడు తన దోషం లేదని చెప్పడానికి ప్రమాణాలు చేశాడు). పడుకుని వున్నా ఆవును కాలితో తన్నిన వాడే గతులకు పోతాడో, ప్రేమకలవానిలాగా నటించి భృత్యుడితో గొప్ప పనులు చేయించి ఏ ప్రతిఫలం ఇవ్వనివాడు ఏ గతికి పోతాడో, శ్రీరాముడు అరణ్యానికి పోవడానికి సమ్మతించిన ఆ దుర్మార్గునికి అదే గతి లభించు గాక! లోకులందరినీ తన బిడ్డలలాగా రక్షించే రాజుకు ద్రోహం తలపెట్టేవాడికి ఏ గతులు కలుగుతాయో, ఆరవ భాగం పన్ను తీసుకుని ప్రజలను రక్షించ లేని రాజుకు ఏ గతి పట్టుతుందో, అదే గతులు శ్రీరాముడిని నేను అరణ్యవాసానికి అంగీకరిస్తే నాకు కూడా పట్టుగాక. యజ్ఞం చేయించుకుని బ్రాహ్మణుడికి దక్షిణ ఇవ్వని మోసగాడికి ఏగతి పడుతుందో శ్రీరాముడిని అడవికి పోమ్మన్న పాపికి అదే గతి పట్టుగాక. యుద్ధంలో పిరికితనంతో పారిపోయే రాజుకు ఏగతి పడుతుందో, గురువు చెప్పిన వేదాంత రహస్యాన్ని సోమరితనంతో అనుష్ఠానం చేయనివాడికి ఏగతి కలుగునో ఆ గతి శ్రీరాముడిని అడవికి పోమ్మన్నవారికి కలుగుగాక".

"శ్రీరాముడిని అరణ్యానికి పోవడానికి అంగీకరించిన వాడికి ఆయన సింహాసనం మీదుండగా చూసే భాగ్యం లేనివారవుగాక. పెద్దలను తిరస్కారంతో చూసేవాడికి, ఆవును కాలుతో తాకేవాడికి, గురువుమీద నిందా మోపేవాడికి, ఏగతి కలుగునో అదేగతి శ్రీరాముడు అడవులకు పోవడానికి ఒప్పుకున్నవాడికి కలుగుగాక. స్నేహితుడిని చెరచాలనుకునేవారికి, స్నేహితుడు చెప్పిన రహస్యాన్ని లోకులందరకూ చెప్పేవారికి, ఏగతి కలుగుతుందని పెద్దలు చెప్పారో అదే గతి శ్రీరాముడిని అడవులకు పోమ్మన్నవారికి కలుగుగాక. మేలుచేసినవారికి ఉపకారం చేయాల్సిన సమయం వచ్చినపుడు చేసే శక్తి వున్నా చేయనివారికి, తనకు చేసిన మేలు మరచినవారికి, సాదువుల్లో వుండడానికి తగనివారికి, చెడుకార్యం చేసికూడా సిగ్గుపడనివారికి, భార్యాబిడ్డలకు అన్నం పెట్టనివాడికి, సంతానం లేక చనిపోయేవారికి, ధర్మకార్యాలు చేయనివారికి, ఏగతి కలుగుతుందో అదేగతి శ్రీరాముడిని అడవులకు పొమ్మన్న క్రూరాత్ముడికి కలుగుగాక".

"శ్రీరాముడిని అడవికి పొమ్మని సమ్మతించిన దరిద్రుడు తాను శాస్త్రప్రకారం వివాహమాడిన భార్యతో కొడుకులను కనకుండా చింతపడుతూ మధ్య వయసులోనే మరణించు గాక! వారు, ముసలివారిని, పిల్లలను, రాజును, స్త్రీలను వధించిన పాపం, నిష్కారణంగా సేవకులను విడిచిన పాపం కలుగుతుంది. కల్లు, లక్క, ఉప్పు, విషం, ఇనుము, మాంసం అమ్మి తాను రక్షించాల్సిన భార్యాబిడ్డలను రక్షించేవాడు ఎగతికి పోతాడో ఆ గతికే శ్రీరాముడు అరణ్యానికి పోయిన వార్తా తెల్పినవాడు పోతాడు. రాజుద్రవ్యాన్ని తినే వాడిని ఎలా చంపాలో శ్రీరాముడిని అరణ్యాలకు పోవడానికి ఒప్పుకున్నవాడిని అలానే చంపాలి. సూర్యోదయం వేళ, సూర్యాస్తమయం వేళ, నిద్రపోయేవారికి ఏవిధమైన కష్టాలు కలుగుతాయో శ్రీరాముడి విషయంలో ద్రోహం చేసినవారికి అవే కష్టాలు కలుగుగాక. గురువు భార్యతో సంగమించిన నీచులకు ఏపాపమో, ఇళ్లకు నిప్పు పెట్టినవాడికి ఏపాపమో, స్నేహితుడిని వంచించిన వారికి ఏపాపమో, అలాంటి గొప్ప పాపమే శ్రీరాముడిని వంచించిన వారికి, దుఃఖ పెట్టినవారికి కలుగుగాక! శ్రీరాముడి విషయంలో ద్రోహం ఎంచిన వారికి, దేవతలా, పితృ దేవతల, జీవించి వున్న తల్లిదండ్రుల సేవ కలగకుండా ఉండుగాక. శ్రీరాముడిని

వనవాసానికి అంగీకరించిన వారు పలువురు బిడ్డలను కన్న పేదవారవుతారు. ఎప్పుడూ జ్వరంతో బాధ పడతాడు. పెక్కు కష్టాలు కలిగి దుఃఖపడతాడు".

"తల్లీ! శ్రీరాముడు అడవులకు పోవడానికి అనుమంతించిన వాడు దరిద్రుడై, దీనుడై, వ్యర్థంగా వుంటాడు. తల్లీ! శ్రీరాముడిని అడవులకు పంపినవాడికి సత్పురుషుల సహవాసం, సాధువులతో లభించే కీర్తి, దేవా పితృ పూజాది సత్కార్యాలు ఈ నిమిషం నుండే పోవునుగాక. తల్లికి శ్రద్ధతో పరిచర్య చేయని కీడరి అగుగాక. శ్రీరామచంద్రుడి వనవాసానికి అంగీకారం తెలిపినవారు తన భార్య ముట్టు స్నానం చేసిన నాడు సమీపంలో వుండికూడా సంభోగం చేయలేని దుష్టుడు అవుతాడు. శ్రీ్రరాముడిని అడవులకు పంపిన మూఢులు ధర్మ శాస్త్ర ప్రకారం వివాహం చేసుకున్న భార్యతో సంగమించ లేక, ఇతరుల భార్యతో సంగమించు గాక! శ్రీరాముడికి కష్టం కలిగించిన వాడు తన బిడ్డలకు కూడు–గుడ్డ పెట్టక చంపువాడవుతాడు.....తాగడానికి ఉపయోగపడే నీటిలో మలమూత్రాలను విడిచే వాడవుతాడు.....మురికి వస్తువులను అమ్ముకుంటాడు".

భరతుడిని ఓదార్చిన కౌసల్య

దుఃఖం అతిశయించగా నేలమీద పడ్డ కొడుకు భరతుడిని చూసిన కౌసల్య, "నాయనా! ఎంత కఠినమైన ప్రమాణాలు చేశావు? నిన్ను చూస్తుంటే నాకు ఎంతో బాధ కలుగుతున్నది. నా మనసు, నా కొడుకును విడిచి వుండాల్సి వచ్చినందున బాధపడ్తున్నది. దానికి తోడు నీ ప్రమాణ వాక్యాలు మరింత బాధిస్తున్నాయి. నీ మాటలతో నాకు బాధ కలిగినా, నువ్వు, నీ మీద సందేహం తొలగిపోయేట్లు నా ప్రాణాలు కాపాడావు. కుమారా! నువ్విలా చేయకపోతే నేనేమయ్యేదానినో? నాయనా! ఇది నా అదృష్టం. నీ తమ్ముడు లక్ష్మణుడిలాగా, నువ్వు కూడా, జ్యేష్ఠకనిష్ఠసోదర న్యాయం పాటించావు. సత్యసంధుడవై ప్రకాశించు. నీకు సత్పురుషులకు కలిగే పుణ్యలోకాలు కలగాలి" అని తన తొడమీద కూర్చుండబెట్టుకుని దుఃఖ బాధతో దీనురాలై హో! అని ఏడ్చింది.

ఇది భరతుడు కేకయపురం విడిచిన ఎనిమిదవనాటి సంగతి.

❖ ❖ ❖

సర్గ-76

తండ్రి శవం చూసి ఏడ్చిన భరతుడు

భరతుడు అయోధ్య చేరిన మర్నాటి ఉదయం వసిష్ఠుడు అతడిని చూసి ప్రేమతో "అన్నా! ఎందుకు ఏడుస్తున్నావు? ఏడ్వద్దు. ఇలా ఏడుస్తుంటే వచ్చే లాభం ఏమిటి? రాజకుమారా! నువ్వు నీ తండ్రికి పరలోక కర్మలు చేయాలికదా?" అన్నాడు. భరతుడు ఆ మాటలు విని ఏడుపు మానాడు. శాస్త్ర ప్రకారం పరలోక క్రియలు చేయాలనుకుని, నిద్రపోతున్నవాడిలాగా వున్న దశరథుది దేహాన్ని దీర్ఘకాలం నూనెలో వుంచడం వల్ల పచ్చబారిన దేహాన్ని చూసి మళ్లీ ఏడిచాడు. ఏడుస్తూ ఇలా అన్నాడు: "రాజేంద్రా! పరదేశంలో వున్న నేను రాకముందే ధర్మ నిష్ఠగల రామచంద్రుడిని, మహాశౌర్యం కల లక్ష్మణుడిని అడవులకు పంపడానికి కారణం ఏమిటి? అలా శ్రీరాముడిని, నన్ను, దగ్గర లేకుండా చేసుకుని తండ్రీ! ఎందుకు పోయావు? దేనికని ఏడవాలి? శ్రీరాముడిని అడవికి పంపావు కాని, దాని ఫలితంగా నేను, ఇక్కడ వున్న ఇతరులు ఏవిధంగా ఏడుస్తున్నారో చూడవు కదా? ప్రజల యోగక్షేమాలు ఆలోచించాల్సిన వారు మీ ఇరువురు. ఒకడివి నువ్వు, మరొకరు శ్రీరామచంద్రుడు. మీ ఇరువురిలో శ్రీరాముడు అడవులకు పోయాడు. నువ్వు స్వర్గానికి పోయావు. ఇక వారి యోగక్షేమాలు ఎవరు ఆలోచిస్తారు? దేశానికి రక్షకుడవైన నువ్వు మరణించడం వల్ల రాష్ట్రం నాయకుడులేనిదై, చంద్రుడు ప్రకాశించని రాత్రిలాగా ఈ అయోధ్యాపురం ప్రకాశించడం లేదు".

దశరథుడికి ఉత్తర క్రియలు జరిపిన భరతుడు

ఏడుస్తున్న భరతుడిని చూసి వసిష్ఠుడు "సుభ చరిత్రా! నువ్విలా ఏడవడం సరైంది కాదు. తండ్రికి ప్రేత కార్యాలు జరపాలి. అవి చేసే ప్రయత్నం చేయి" అన్నాడు. భరతుడు "సరే" అని అంగీకరించాడు. ఆచార్యులు, ఋత్విక్కులు, పురోహితులు జరగాల్సిన పనులు శాస్త్రప్రకారం జరిపించడానికి సన్నాహాలు చేశారు. యాజకులు రాజపీనుగును పల్లకిలో వుంచారు. పరిచారకులు కన్నీళ్లు కారుతుంటే పల్లకిని మోశారు. పీనుగు ముందర వెండి-బంగారు

పూలు చల్లుకుంటూ, దారిలో వస్త్రాలు పరుస్తూ కొందరు పోయారు. కొందరు చందనం, అగరు, దేవదారు ధూపాలు, గుగ్గిలం ధూపాలు వేస్తూ పోయారు. గంధం చెక్కలతో పేర్చిన చితిమీద రాజు దేహాన్ని వుంచారు. ఋత్విజులు మంత్రాలు చెప్పారు. భరతుడు అగ్ని మండేట్లు చేశాడు. రాజస్త్రీలైన కౌసల్య, ఇతరులు, పల్లకెక్కి పురాన్ని విడిచి భరతుడున్న చోటుకు పోయి, శవానికి ప్రదక్షిణగా, అప్రదక్షిణగా తిరిగారు. తరువాత పల్లకీలలో సరయూ నదీతీరం చేరి, స్నానం చేసి, పదిరోజులు సూతకంతో నేలమీద పడుకుని గడిపారు.

❖ ❖ ❖

సర్గ-77

రోదించిన భరత-శత్రఘ్నులు

పదకొండో రోజున భరతుడు అశౌచాన్ని ముగించాడు. పన్నెండో రోజున పున్యాహవచనం లాంటి కర్మలన్నీ జరిపాడు. విస్తారంగా ధనం, అన్నం, రత్నాలు, వెలగల వస్త్రాలు, తెల్లమేకల మందలు, వందలకొలది ఆవులు, దాసులను, దాసికలను, వాహనాలను, ఇండ్లను, తండ్రిని ఉద్దేశించి బ్రాహ్మణులకు దానంగా ఇచ్చాడు. తరువాత పదమూడోరోజున రాజకుమారుడు అస్తికల సంచయనం కొరకు తండ్రిని కాల్చిన చోటుకు వచ్చి, చితి దగ్గర ఏడుస్తూ, "తండ్రీ! నన్ను మా అన్న శ్రీరాముడికి అప్పగించావు. ఆయన అడవికి పోయినందున నన్ను దిక్కులేనివాడిగా చేశావు. రెండూ నువ్వు చేసినవే! నీ పట్టపు దేవైన కౌసల్యకు ఒక్కడే కొడుకు. ఆయనను నువ్వు కారడవికి పంపావు. ఆమె దిక్కులేక ఏడుస్తున్నది. అలాంటి ఆమెను వదిలి నువ్వెక్కడికి పోయావు?" అంటూ, వెక్కి-వెక్కి ఏడుస్తూ మూర్ఛపోయి నేలమీద పడ్డాడు.

ఇలా పడ్డ భరతుడిని పక్కనున్న వారు లేపారు. అప్పుడాయనను మంత్రులు సమీపించారు. భరతుడు పడిపోగానే తమ్ముడు శత్రఘ్నుడు ఆయన గతేం అవుతుందోనని భయపడ్డాడు. కలతతో శత్రఘ్నుడు సహితం ఏడ్చాడు. ఏడుస్తూ, దశరథుడుని ఉద్దేశించి, "మంథర వలన పుట్టి, కైక అనే పెద్ద మొసలితో నిండి, వరదానమనే కలతున్న ఈ పెద్ద దుఃఖ సముద్రంలో మమ్మల్ని ముంచి పోయావా? తండ్రీ! భరతుడిని విడిచి పోవడానికి నీ మనసెలా ఒప్పుకుంది? పుణ్యస్వభావా? మేం కోరినవి మాకిచ్చి మమ్మల్ని ఇక ఎవరు లాలిస్తారు? మేం కోరిన తినుబండారాలు మాకెవరిస్తారు? మమ్మల్నెవరు ముద్దుపెట్టుకుని ఆడిస్తారు? తండ్రేమో స్వర్గానికి పోయాడు....శ్రీరాముడు అరణ్యాలకు పోయాడు...ఇక మా ప్రాణాలు నిలవవు. కాబట్టి నేనూ అడవులకు పోతాను. అయోధ్యలో వుండడానికి మనసు రావడంలేదు" అన్నాడు.

ఇలా అన్నదమ్ములిద్దరూ దుఃఖపడుతూ ఏడుస్తుంటే జ్ఞాని అయిన మౌని వశిష్ఠుడు భరతుడితో, "భరతా! పదమూడవ రోజు జరుగుతున్నది. వ్యర్థంగా

కాలం గడపడం తగదు. ఎముకల సంచయనం పూర్తికావాలి. ఆకలి, దప్పిక, శోకం, మోహం, జరామరణం, అనేవాటిని ఎవరూ ఆపలేరు. దుఃఖం మాని కావాల్సిన పని చేయాల్సిన పని పూర్తీ చేయి" అంటాడు. సుమంత్రుడు శత్రఘ్నుడి దగ్గరకు పోయి ఆయనను ఓదారుస్తాడు. అప్పుడు ఆ రాజకుమారులు పూర్తీ చేయాల్సిన ఇతర కార్యాల మీద దృష్టి సారించారు.

❖ ❖ ❖

సర్గ-78

భరతుడిని ఓదార్చి మంథరను తన్నిన శత్రఘ్నుడు

రఘురాముడిని చూడాలని అనుకుంటున్న భరతుడు, తక్షణమే దండకకు పోయే ఆలోచనలో వుండడంతో, శత్రఘ్నుడు విచారంతో అన్నతో "భూత సమూహాలన్నింటికీ సర్వకాలాలో దిక్కైన ఆ రాముడే నీకు దిక్కని నేను చెప్పక్కర లేదు. సమస్త భూతాలకు ఆశ్రయమైన శ్రీరాముడు మహా బలవంతుడైనప్పటికీ అసమర్థుడు లాగా ఒక ఆడది పోమ్మనంగానే తలవంచుకుని అడవులకు పోయాడు. శ్రీరాముడు తండ్రికి పరతంత్రుడు కాబట్టి ఆయన చెప్పినట్లు విన్నాడనుకున్నా, శ్రీరాముడికి పరతంత్రుడైన లక్ష్మణుడు, విస్తార బలవంతుడు, తండ్రిని ధిక్కరించకుండా శ్రీరాముడి వెంట తాను కూడా పోవడానికి ఎందుకు సమ్మతించాడు? ఇది అంతకంటే ఆశ్చర్యం. నీటి తప్పి చరించువాడా తండ్రి?" అని అన్నాడు.

శత్రఘ్నుడు ఇలా చెపుతుండగానే, తూర్పు వాకిట్లో, తన ఉపాయం సఫలమైందనీ, ఇక భరతుడు రాజవుతాడనీ, కైక రాజమాత అవుతుందనీ, ఆమెకు ముఖ్యురాలు తానవుతాననీ, వీరందరూ తన చేతి కింది వారేననీ, తానెలా చెపితే అలా నడుచుకోవాల్సిన వారేననీ, ఇదంతా చేసింది తానేననీ, తన ప్రతిష్ట అందరికీ తెలియాలనీ, ఎవరిది అని తన గురించి భరతుడు అడిగితే ఇదే నీకు రాజ్యం ఇప్పించిన బుద్ధిమంతురాలు మంథర అని అందరూ చెప్తారానీ, అప్పుడు భరతుడు తనను బహుకరిస్తాడనీ, ఆయనతో పాటే శత్రఘ్నుడు కూడా బహుకరిస్తాడనీ, వారిద్దరూ గౌరవిస్తే అందరూ అలాగే చేస్తారనీ, అనుకుంటూ మంథర ఆభరణాలు ధరించి కులుక్కుంటూ వస్తుంటే ద్వారం దగ్గర వున్నవారు ఆమె ఎవరో శత్రఘ్నుడికి చెప్పారు.

శత్రఘ్నుడు కోపంతో మంథరను ఏం చేస్తానో చూడండి అని చెప్పి, అది చేసిన క్రూరత్వానికి ఫలితం ఇప్పుడే అనుభవించేట్లు చేస్తానని అన్నాడు. మంథర తప్పించుకుని పోయే ప్రయత్నం చేసింది. అందరూ కల్సి దాన్ని పట్టుకున్నారు. కోపంతో శత్రఘ్నుడు తన్నిన తన్నుకు అది నేలమీద పడిపోయింది. హా! అని

ఏడిచింది. దాంతో వచ్చిన దాసీలందరు రక్షించమని వేడుకునేందుకు కౌసల్యను ప్రార్థిద్దామనుకున్నారు. శత్రఘ్నుడు మంథరను పలుమార్లు భూమ్మీద వేసి తన్నాడు. అడ్డం పోయిన కైకను కోపంతో తిట్టాడు. మంథర గేటు తనకు పట్టుతుందేమోనని భయపడి ఆమె భరతుడి దగ్గరకు పోయి, "భరతా! భరతా! నన్ను కాపాడు" అని అంది. భరతుడి సూచన మేరకు తల్లిని ఏమీ అనకుండా ఆగిపోయాడు శత్రఘ్నుడు. తల్లిని చంపితే శ్రీరాముడికి కోపం వస్తుందని ఆపని చేయడం లేదని అన్నాడు శత్రఘ్నుడు. మంథరను కూడా అంతటితో వదిలాడు.

❖ ❖ ❖

సర్గ-79

భరతుడిని పట్టాభిషేకం చేసుకొమ్మని ప్రార్థించిన రాజ్య కర్తలు

పదునాల్గవ నాటి ఉదయాన, సింహాసనానికి రాజును చేయడానికి అధికారం వున్న రాజకర్తలు భరతుడితో, "మాకు గురువులలో శ్రేష్ఠుడైన మీ తండ్రి దశరథ మహారాజు శ్రీరాముడిని లక్ష్మణుడితో సహా అడవులకు పంపి, తానూ స్వర్గానికి పోయాడు. కాబట్టి రాజకుమారుడవైన నువ్వే మాకిప్పుడు రాజువి. దైవ వశాత్తు రాజ్యం మంచి దశలో వుంది. పట్టాభిషేకానికి అవసరమైన వస్తువులను సమకూర్చి పోరులు, మంత్రులు, నీ ఆజ్ఞ కొరకు ఎదురు చూస్తున్నారు. నీ తండ్రి పాలించిన అసమాన రాజ్యాన్నంతా నువ్వు తీసుకుని మమ్మల్ని పాలించు" అన్నారు. రాజ్య కర్తలు చూపించిన అభిషేక వస్తువులకు ప్రదక్షిణ చేసి భరతుడు వారితో, "లోకులారా! నా అభిప్రాయం వినండి. మా వంశంలో రాజ్యానికి అర్హుడు పెద్దవాడే! ఇది తెలిసి కూడా నన్ను పట్టాభిషేకానికి ప్రేరేపించడం న్యాయమా? మా అన్న శ్రీరాముడిని రాజును చేసి, ఆయనకు బదులుగా, నేనే అడవుల్లో పద్నాలుగేళ్లు వుంటాను. ఇది నిజం. ప్రయాణ సన్నాహాలు చేయండి. మా అన్న శ్రీరాముడిని నగరానికి తెస్తాను. సమస్త సైన్యాన్ని సిద్ధం చేయండి. అభిషేక వస్తువులను అక్కడికే అడవికి తెండి. అరణ్యంలోనే ఆయనకు పట్టాభిషేకం చేద్దాం" అన్నాడు.

ఇంకా ఇలా అన్నాడు: "ఊరి బయట యజ్ఞం చేసి ఇంటికి అగ్నిహోత్రాన్ని తెచ్చినట్లు అడవిలో మా అన్నకు పట్టాభిషేకం చేసి, రాజును చేసి, పట్టణానికి పిలుచుకు వస్తాను. ప్రజలారా! ఇది నిజం. కన్నతల్లికి వుండాల్సిన గుణాలు లేకున్నా ఆమె కడుపున పుట్టిన దోషం వల్ల తల్లి అని చెప్పుకోవడమే కాని, వివేకంలేని ఆమె కోరిక కొనసాగానివ్వను. ఇక్కడ మా అన్నకు భూభారం అప్పగించి నేనే అడవుల్లో పద్నాలుగేళ్లు వుంటాను. కాబట్టి ఆయన వున్నా చోటుకు పోవడానికి దారి ఏర్పాటుచేయండి. మిట్టపల్లాలు సమంగా చేయండి".

భరతుడి మాటలకు రాజయ కర్తలు ఎంతో సంతోషించారు. రాజకుమారుడిని శ్లాఘించారు. "రాజనందనా! నువ్వు మీ అన్నకు రాజ్యం ఇవ్వాలన్న ఆలోచన చేయడం మంచిది. ఇలాంటి ఉదార భావం నీకుండడం వల్ల నీకు శాశ్వతంగా శ్రీదేవి అత్యధిక సంతోషాన్ని, శాశ్వత బ్రహ్మానందాన్ని కలిగించాలి. రాజా! నీ ఆజ్ఞ ప్రకారం మార్గాన్ని బాగుచేయడానికి గురుభక్తులను, మార్గవిదులను, వరశిల్పులను పంపాం" అని చెప్పారు.

❖ ❖ ❖

సర్గ-80

వనమార్గాన్ని బాగుచేసిన పౌరులు

స్థల జ్ఞానం కలవారు, యంత్రాలు కలవారు, వలల గుంటలు తవ్వేవారు, సాలెలు, నూలుపట్టే వారు, శూరులు, కమ్మరులు, వడ్రంగులు, కమసాలులు, కూలివాళ్లు, చాపలు-బుట్టలు అల్లే మేదరవారు, బావులు తవ్వేవారు, బేలుదార్లు, మార్గాన్ని చూపేవారు, ఇతర విధాలైన నేర్పరి పనివారు......ఇలా...అందరూ, తమంతట తామే స్వచ్ఛందంగా తమ పని ముట్లను తీసుకుని గుంపులు-గుంపులుగా బయల్దేరి పోయారు.

వీరంతా పోవాల్సిన దారిని బాగుచేసుకుంటూ కదిలారు. తోవకు అడ్డంగా వున్నా ముళ్ళను, రాళ్ళను తొలగించారు. గుంటలు బాగుచేశారు. చెట్ల గుంపులను నరికారు. వంకరటింకర తోవలను చక్కబరిచారు. అవసరమనుకున్న చోట అడవులను తగలబెట్టారు. రాతినేలలను చదును చేశారు. వాగులు-వంకలను బాగుచేశారు. దారి పొడుగూతా పూపొదలను ఏర్పాటు చేశారు. భరతుడు దిగడానికి సరైన స్థలమని అధికారులు చెప్పిన చోట డేరాలు, పందిళ్లు వేసి, అలంకరించారు.

❖ ❖ ❖

సర్గ-81

పౌరులను వారించిన భరతుడు

సూతులు, మాగధులు, మంగళకరమైన స్తోత్ర పాఠాలు చదువుతుంటే, జాము-జాముకు నగారాలు మోగుతుంటే, శంఖాలు పూరిస్తుంటే, భరతుడు నిద్రలేచి వారిని చూసి, వారించి, తాను రాజును కాదని, రాజుకుండాల్సిన ఇవన్నీ తనకెందుకనీ, అన్నీ ఆపుచేయమనీ, చెప్పాడు. తమ్ముడు శత్రుఘ్నుడిని చూసి, "తమ్ముడా! చూశావా! కైక లోకానికంతా ఎంత అపకారం చేసిందో? నన్నెంత దుఃఖానికి గురిచేసిందో? రాజ్యలక్ష్మి రాజులేక తల్లడిల్లుతున్నది. మనందరి రక్షకుడైన పుణ్యాత్ముడు శ్రీరాముడిని అన్యాయంగా అడవులకు పంపింది మన తల్లి కైక. ఇలాంటి దుష్కార్యానికి నేనేమని ఏడవాలి?" అని అన్నాడు.

ఇక్కడ ఇంట్లో భరతుడిలా ఏడుస్తుంటే, అంతఃపురంలో వున్నవారు కూడా ఏడుస్తున్నారక్కడ. అక్కడ వశిష్ఠుడు శిష్యులతో కొలువుకూటంలోకి ప్రవేశించి, సేవకులతో, "మీరు బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య ప్రముఖులను, అమాత్యులను, పెద్దలను, రాజకుమారులను, భరతశత్రఘ్నులను, మంత్రులైన విజయ సుమంత్రులను, వెంటనే పని వుందని పిలుచుకు రండి" అని చెప్పాడు. వారలాగే చేశారు. వశిష్ఠుడు పిలుపుమేరకు వారంతా అక్కడికి చేరుకున్నారు. సభకు వస్తున్న భరతుడికి ఎదురుగా పోయి పూర్వం దశరథుడిని ఎలా కొలిచారో అలాగే చేశారు. పూర్వం దశరథుడు వున్నప్పుడు సభ ఎలా ఉండేదో ఇప్పుడు భరతుడున్న సభ కూడా అలాగే వుంది.

❖ ❖ ❖

సర్గ-82

భరతుడిని పట్టాభిషేకం చేసుకొమ్మని చెప్పిన వశిష్ఠుడు

వచ్చిన పెద్దలందరినీ వారి-వారి ఆసనాల మీద కూర్చోమని భరతుడు చెప్పి తన ఆసనం మీద తానూ కూచున్నాడు. అప్పుడు అక్కడున్న రఘువంశ ధర్మం తెలిసన వశిష్ఠుడు లేచి నిలుచుని, అందరినీ కలియచూసి, భరతుడితో "కుమారా! నీ తండ్రి రాజ్యాపాలనను ధర్మ మార్గంలో చేసి విశేష ధనదాన్యాదులతో కూడిన ఈ భూమిని నీకిచ్చి స్వర్గానికి పోయాడు. సత్యమంటే స్థిరబుద్ధిగల శ్రీరాముడు సజ్జనుల ధర్మ మార్గంలో తండ్రి ఆజ్ఞానుసారం పుత్ర ధర్మంగా అడవులకు పోయాడు. నీకు రాజ్యాన్ని నీకంటే పెద్దవారైన నీ తండ్రి, అన్న మనఃపూర్తిగా ఇచ్చారు కాని ఇది అన్యాయంగా వచ్చింది కాదు. నువ్వు ఈ రాజ్యాన్ని తీసుకుంటే ఎవరినా పేచీ పెట్టారని భయం నీకక్కరలేదు. ఎవరూ తిరస్కరించరు. నువ్వు హాయిగా పట్టాభిషేకం చేసుకోవచ్చు. ఈ విషయంలో మంత్రులందరూ సంతోషపడేవారే! నాలుగు దిక్కుల వున్న రాజులందరూ నిన్ను రాజుగా అంగీకరించి విస్తారంగా కానుకలిస్తారు ప్రేమగా. సర్వజన సమ్మతం విషయంలో నువ్వు సందేహించాల్సిన అవసరం లేదు" అని అంటాడు.

జవాబుగా భరతుడు, "గురుకులవాసం చేసి కోరతలేకుండా వేదాలను అభ్యసించి, అందరితో బుద్ధిమంతుడనిపించుకుని, ధర్మాచరణలో ప్రీతిగలవాడి రాజ్యాన్ని నాలాగా శాస్త్రబద్ధుడైనవాడు ఎవరైనా తీసుకుంటాడా? దశరథుడి కుమారుడైన శ్రీరామచంద్రమూర్తి లక్ష్మిని నేను కోరేటంతటి నీచ జన్ముడని అనుకుంటున్నావా? నేనే పాత్ముడనని భావించావా? పాపాత్ముడైన వాని కొడుకని తలచావా? నేనెలాంటి వాడినని నాకు ఈ అధర్మం ఉపదేశిస్తున్నావు? దశదిశల్లో తన రథంలాగా తన కీర్తిని వ్యాపింపచేసిన శ్రీరాముడి కొరకు ప్రాణాలు విడిచిన దశరథుడి కుమారుడనైన నేను శ్రీరాముడి రాజ్యాన్ని ఎలా హరిస్తాను? ఈ రాజ్యం, నేను, రెండూ శ్రీరాముడి సొత్తే! వాస్తవం ఇదైతే నువ్వే ధర్మం ఆలోచించు. దేహబల-మనోబలాలో దిలీపుడికి, నహుషుడికి సమానుడైన శ్రీరామచంద్రుడు,

పెద్దవాడైనందున, సర్వజనులచే శ్లాఘించబడిన వాడైనందున, పవిత్ర గుణాలు కలవాడైనందున, దశరథుడి లాగా రాజ్యలక్ష్మి పొందడానికి అర్హుడు. ధర్మం ఇలా వుంటే, ఏమాలోచించి నన్ను రాజ్యం తీసుకోమంటున్నావు? వయసులో పెద్దవాడు...గుణాలలో శ్రేష్ఠుడు...అలాంటి శ్రీరాముడి లక్ష్మిని చిన్నవాడైన నేను ఆశించే నీచుడనని తలచావా? పాపాత్ములు చేసే ఘోరపాపం నేను చేస్తే ఇక్ష్వాకుల వంశానికంతా అపకీర్తి తెచ్చినవాడినవుతాను కదా? మునీంద్రా! వేయి మాటలతో ఏం పని? నన్ను కనడం తప్ప తల్లిలో వుండాల్సిన సుగుణాలేవీ లేని నా తల్లి చేసిన దుష్కార్యం నాకు కొంచెం కూడా ఇష్టం లేదు. జ్ఞానులతో స్తోత్రం చేయించుకునే ఓ వసిష్ఠ మహామునీ! ముల్లోకాలు ఏలాల్సింది శ్రీరాముడే! ఇప్పుడు శ్రీరామచంద్రుడు పోయిన తోవలో నేను పోతాను" అని చెప్పాడు.

ఇలా భరతుడు చెప్పగా సభలో ఉన్నవారందరూ శ్రీరాముడిని మళ్లీ చూడగలం కదా అని కళ్ళ నుండి కన్నీటి భాష్పాలు రాల్చారు. ఎప్పుడు శ్రీరాముడి దగ్గరకు పోతామా? అని ఎదురు చూడసాగారు. అప్పుడు మళ్లీ భరతుడు, " సభ్యులారా! వినండి. పట్టణానికి రమ్మని శ్రీరాముడిని ఎన్ని విధాల వేడుకోవాలో అన్ని విధాలా వేడుకుంటా. ఆయన రానంటే, లక్ష్మణుడిలాగా నేను కూడా శ్రీరాముడి సేవ చేస్తూ, భయంకరమైన అడవుల్లో వుంటా. ఎలా చేస్తే శ్రీరాముడు వస్తాడో అలాగే చేస్తా. దారి బాగుచేయడానికి పనివాళ్ళను పంపించా. నేను కూడా త్వరగా పోతా" అని అన్నాడు. తరువాత సుమంత్రుడిని చూసి, సేనలను ప్రయాణానికి సిద్ధం చేయమన్నాడు. సుమంత్రుడు అంతా సిద్ధంగా వున్నారని చెప్పాడు. కొందరు గుర్రాల మీద, కొందరు ఎడ్ల బండ్ల మీద, కొందరు రథాల మీద పోవడానికి సిద్ధపడ్డారు. తన రథం కూడా సిద్ధం చేయమని భరతుడన్నాడు.

❖ ❖ ❖

సర్గ-83

శ్రీరాముడిని తీసుకురావడానికి ప్రయాణమైన భరతుడు

తరువాత తెల్లవారుతూనే భరతుడు రథాన్ని ఎక్కి, తన వెంట మంత్రులు, గురువులు, ఏనుగులు, ఆయుధాలు ధరించిన వారు, గుర్రాలు, కౌసల్య, సుమిత్ర, పశ్చాత్తాపంతో కైక వస్తుంటే, జానకీనాదుడిని చూడడానికి బయల్దేరాడు. ప్రజలు దారిపోడుగూతా శ్రీరామచంద్రుల కథలే చెప్పుకున్నారు. మేఘశ్యాముడు, స్థిరమైన మనసున్నవాడు, మోకాలినంటే చేతులుకలవాడు, సత్య శరణాగత రక్షణలో స్థిరంగా వుండేవాడు, లోక సమూహాల దుఃఖం నాశనం చేసేవాడు, మహానుభావుడు శ్రీరామచంద్రమూర్తిని ఎప్పుడు చూస్తామోకదా? అనుకుంటూ, అతడి దర్శనం దొరికితే చాలంటూ, శ్రీరాముడి కథలు చెప్పుకుంటూ, కోమట్లు, రత్నాలు సానె పెట్టేవారు, కుమ్మరులు, కమ్మరులు, కంసాలులు, కంబళ్ళు నేసేవారు, గందం పొడి చేసేవారు, బేల్దారులు, నెమలి ఈకలతో విసన కర్రలు కట్టేవారు, బెజ్జాలు వేసే వారు, సాలెవారు, రంపం పని చేసే వారు, చాకలి వారు, తలంటి పోసే వారు, దేహం పిసికే జెట్టులు, గుడ్డలు కుట్టేవారు, గొల్లలు, వైద్యులు, కళ్ళు గీసే వారు, బెస్తవారు, బ్రాహ్మణులు, వారి-వారి వాహనాల మీద, పరిశుద్ధమైన బట్టలు కట్టుకుని పెరుమాళ్ల దగ్గరికి పోయినట్లు పోతున్నారు. ఇలా వారందరూ కొంత దూరం పోయిన తరువాత గుహుడుండే శృంగిబేర పురాన్ని చూశారు. సేనంతా గంగా తీరంలో ఒక రమ్యమైన ప్రదేశంలో దిగింది. భరతుడు వారందరినీ చూసి, నది రేపు దాటవచ్చునీ, తానూ గంగా జలాలలతో తండ్రికి తర్పణం విడుస్తాననీ, వారు కూడా వారి-వారి కార్యక్రమాలు వారి వర్ణాశ్రమ ఆచారాన్ని బట్టి తీర్చుకోవచ్చునీ అంటాడు.

❖ ❖ ❖

సర్గ-84

భరతుడి రాకను సందేహించిన గుహుడు

భరతుడు ఇలా సైన్యంతో రావడం గమనించిన బోయరాజు గుహుడు తన స్నేహితులతో "చూశారా! ఇంత అని లెక్కించలేని సేన మన ప్రాంతానికి వస్తున్నది. చూడడానికి సముద్రం లాగా వుంది. వస్తున్నవాడు ధరించిన ధ్వజం చూస్తుంటే భారతుదని తెలుస్తున్నది. ఈ ధ్వజాన్ని ధరించే దశరథుడు మరణించాడు. శ్రీరాముడు అరణ్యంలో వున్నాడు. ఇక వచ్చేది భరతుడు కాకుండా ఎవరై వుంటారు? ఇతడి మార్గం సౌమ్యంగా కనబడడం లేదు. అన్న మీద భక్తితో పోయేవాడికి ఇంత సైన్యం ఎందుకు? మనం శ్రీరాముడి స్నేహితులం కాబట్టి మనల్ని భరతుడు కలుపుకుంటాడో? చంపుతాడో? తెలియదు. శ్రీరాముడిని అడవులకు పంపడమే కాకుండా ఆయన సంపత్తు అంతా అపహరించి, ఇప్పుడు చంపడానికై సైన్యంతో కోపంగా పోతున్నాడు. ఉరికే చూడడానికి పోవడానికి ఇంత సైన్యం ఎందుకు? కాబట్టి ఇతడి ఉద్దేశం వేరేగా వుంది. ఇప్పుడు మనం చేయాల్సింది భరతుడు గంగానది దాటకుండా చూడడమే! నా స్నేహితుడైన శ్రీరాముడిని ఎలాగైనా భరతుడి బారిన పడకుండా రక్షిస్తాను. మీరంతా శీఘ్రంగా పోయి భరతుడి సైన్యం గంగ దగ్గరకు రాకుండా చూడండి. మన ఓడలన్నీ సిద్ధం చేయండి. ఎన్ని దినాలు యుద్ధం చేయాల్సి వస్తుందో తెలియదు కాబట్టి అన్ని విధాలుగా తయారవండి. శ్రీరాముడు అడగకుండా యుద్ధానికి కాలు దువ్వచ్చా? అని అంటారేమో? కోరినా, కోరకున్నా, స్నేహితుడిని కాపాడడం మిత్ర ధర్మం. నా స్వామికోరకు నేనేదైనా చేస్తాను. నావలను సిద్ధం చేయండి. బలవంతులైన బెస్తవారిని తెండి. శ్రీరాముడి విషయంలో భరతుడు ప్రేమతో వుంటే, సుఖంగా గంగ దాటిద్దాం. అలా కాకపోతే గంగ ఎలా దాటుతాడో చూద్దాం. నా చేతనైనంత నేను చేస్తాను.

భరతుడిని చూడడానికి వచ్చిన గుహుడు

ఇలా తన వాళ్లతో చెప్పి, స్వయంగా తానూ భరతుడి మనసు తెలుసుకోదల్చి, తేనె, మాంసం, పిండివంటలు తీసుకుని, భరతుడి దగ్గరకు బయల్దేరాడు.

వస్తున్నా గుహుడిని చూసిన సుమంత్రుడు, శ్రీరామచంద్రుడి ముఖ్య స్నేహితుడు గుహుడు వస్తున్న విషయాన్ని భరతుడికి చెప్పి, ఆయనకు దండకారణ్యంలోని అన్ని మార్గాలు తెలుసంటాడు. “భరతా! ఈ గుహుడికి నువ్వు తప్పక దర్శనం ఇవ్వు. మన సీతారామలక్ష్మణులు వుండే చోటు ఇతడికి తప్పకుండా తెలుస్తుంది. సరైన స్థలం, తోవ తెలియకుండా ఏ మార్గంలో మనం వెతుక్కుంటూ పోతాం?” అని సుమంత్రుడు చెప్పగా, భరతుడు గుహుడిని పిలుచుకొని రమ్మంటాడు. సుమంత్రుడు గుహుడిని ఆతడి బంధువులతో సహా పిలుచుకుని రావడం, వారందరినీ భరతుడు గౌరవించడం జరిగింది.

ఇది జరిగిన తరువాత గుహుడు భరతుడితో, “రాజకుమారా! కమలాల లాంటి కళ్ళు కలవాడా! నేనుండే ఈ అడవి ప్రదేశం మనోహరమైన తోటలాగా వుంటుంది కాని భయంకరమైన అడవిలాగా వుండదు. కాబట్టి ఇక్కడ వుండు. ఇది కూడా మీ ఇల్లే కదా? ముందుగా మీరు వస్తున్న వార్త చెప్పి పంపాల్సింది. చెప్పకుండా హటాత్తుగా ఇలా వచ్చి మమ్మల్ని మోసగించవచ్చా? నువ్విక్కడే వుండమని ప్రార్థన. రాజా! ఇక్కడ అనేక రకాలైన పండ్లు వున్నాయి. మాంసం వుంది. మా బోయలు ఇంకా తేవడానికి సమర్థులు. కాబట్టి ఈ రాత్రి ఇక్కడే వుండి ఉదయం బయల్దేరి పోవచ్చు” అని అంటాడు.

❖ ❖ ❖

సర్గ-85

భరతుడిని తన సందేహం అడిగిన గుహుడు

గుహుడి మాటలు విన్న భరతుడు సంతోషించాడు. "మా అన్నగారికి నువ్వు స్నేహితుడవు కాబట్టి, నాకు నువ్వు అన్నలాంటి పూజ్యుడవే! ఇంత సైన్యాన్ని నువ్వు ఒక్కడివే గౌరవించాలనుకున్నావు. నీ అనేక రకాలైన కోరికలన్నీ సఫలం కావాలి. అన్నరసం కంటే ఆదరణ రసం శ్రేష్ఠమని సామెత వుంది. నీ మాటలను మెచ్చుకున్నాను. గంగ దాటడం మాకు సాధ్యపడదు. అడవి చొరబడకుండా వుంది. కాబట్టి భరద్వాజ ముని వుండే ఆశ్రమానికి పోయే మార్గం చెప్పు" అని గుహుడిని అడిగాడు భరతుడు. ప్రసిద్ధ శౌర్యుడైన శ్రీరామచంద్రుడి మీద భరతుడికి దురభిప్రాయం లేకపోతే ఆయన వెంట, బెస్తవారిలో ప్రముఖులను పంపుతానని గుహుడంటాడు. "ఇంత సేనతో శ్రీరాముడి దగ్గరకు పోవడానికి కారణం ఏంటి? మంచి అభిప్రాయంతో పోతున్నానని నువ్వంటే, ఈ సేన ఎందుకు? కాబట్టి నా మనసులో గొప్ప సందేహం వుంది" అని తన మనసులో ఆమాట వెల్లబుచ్చాడు గుహుడు.

గుహుడు సందేహించిన పాపపు రోజులు ఎప్పటికీ రాకూడదని భరతుడంటాడు. "నా విషయంలో సందేహించవద్దు. నా తండ్రితో సమానుడైన మా అన్న శ్రీరామచంద్రుడిని పిలుచుకుని రావడానికి సేనలతో, సర్వ ప్రయత్నంతో పోతున్నాను. నీ మనసులో వేరే ఆలోచన పెట్టుకోవద్దు. నేను సత్యమే చెప్తున్నాను" అని భరతుడు చెప్పడంతో గుహుడు కూడా సంతోషించి ఇలా అంటాడు: "భరతా! మేలు...మేలు. నీ జన్మ సార్థకం. నీ లాంటి పూజ్యులు లోకంలో వుండరు. లోకంలో రాజ్యం కొరకు అన్నలను, తమ్ములను, తండ్రిని చంపేవారుంటారు కాని, నీ ప్రయత్నం లేకుండా లభించిన రాజ్యాన్ని మంచివాడివి కావడం వల్ల వదులుకుంటున్నావు. ఇంద్ర సమానుడైన శ్రీరాముడిని మళ్లా పిలుచుకుని రావడానికి వచ్చిన నీ కీర్తి లోకంలో శాశ్వతంగా నిలిచిపోతుంది".

ఇలా మాట్లాడుకుంటుంటే రాత్రి అయింది. తమ్ముడితో కలిసి నిద్రపోదామనుకుంటాడు. నిద్ర రాదు. శ్రీరామ చింత వలన కలిగిన బాధతో దుఃఖపడ్డాడు. సంతాపంతో దేహం కాలిపోయినట్లయింది. సూర్యకిరణాల వేడికి హిమవత్పర్వతం మంచు కార్చినట్లు, విస్తారమైన శోకం అనే అగ్ని వల్ల భరతుడు చెమటలు కార్చాడు. భరతుడు నిట్టూర్పులు విడుస్తూ, శోకంతో కూడిన మనసు కలవాడై, దిక్కు తెలియక, శాంతి లేక, మందనుండి చీలిపోయిన ఎద్దులాగా ఏడ్చాడు. ఆయన్ను చూసి గుహుడు కూడా దుఃఖపడి, శ్రీరాముడిని తలచుకుని వూరడిల్లాడు.

❖ ❖ ❖

సర్గ-86

భరతుడికి లక్ష్మణ వృత్తాంతం చెప్పిన గుహుడు

పామరులు కలిస్తే పామర కథలే చెప్పుకుంటారు. భక్తులిద్దరు చేరితే భగవత్ కథలు, భాగవత కథలు చెప్పుకుంటూ పోద్దుపుచ్చుకుంటారు. గుహుడు, భరతుడు ఇద్దరూ శ్రీరామభక్తులే. వారికి భగవత్ కథలు ఎన్ని సార్లు చెప్పుకున్నా తనివి తీరదు. కాబట్టి పరమ భాగవతోత్తముడైన లక్ష్మణ కైంకర్య చరిత్రను భరతుడికి గుహుడు చెప్పాడిలా....."భరతా! అన్నను రక్షించాలానే ఉద్దేశంతో బాణం సంధించిన విల్లు ఒక చేత్తో, కట్టి మరో చేత్తో, పట్టుకుని నిద్రపోని లక్ష్మణుడితో నేనన్నాను...

'తండ్రీ! రాజకుమారా! సుకుమారా! కుమారా! నీకొరకు సుఖం కలిగించే మంచి పడక ఏర్పాటు చేశాను. దానిమీద సుఖంగా నిద్రపో! చాల ప్రయాసపడ్డావు. నిద్రపోయి లేస్తే శ్రమ తగ్గుతుంది. మీ అన్నను ఆయన దాసుడనైన నేను రక్షిస్తాను. నా మాట నమ్ము. పూజ్యుడవైన రాజకుమారా! నువ్వు సుకుమారుడివి. ఇక్కడ వున్నవారు అడవుల్లో తిరగడానికి అలవాటు పడ్డవారు. కఠినదేహం కలవారు. కాబట్టి శ్రీరాముడిని రాత్రంతా హెచ్చరికతో కాపాడుతాం. నువ్వు పోయి నిద్రపో. శ్రీరాముడికి ఏ భయం లేదు. శ్రీరాముడి కొరకు నీకెందుకీ శ్రమ అని అంటావేమో? విను. శ్రీరాముడికంటే ఎక్కువ ప్రీతిపాత్రుడు నాకెవరూ లేరు. ఆయన మీద నాకంతటి అనన్య భక్తీ వుంది. ఇది అపోహ కాదు. సత్యప్రమాణంగా చెప్తున్నాను. ఈ మహానుభావుడి వల్లే కదా, గొప్ప కీర్తి, గొప్ప ప్రయోజనం, విస్తారమైన మంచి ఫలం లభిస్తుంది? అలాంటి వాడిని నేనెలా ఉపేక్షిస్తాను? భార్యతో నిద్రించే నా ప్రియమిత్రుడికి నిద్రాభంగం కలగకుండా రక్షిస్తాను. ఈ అరణ్యంలో నాకు తెలియంది లేదు'......

జవాబుగా లక్ష్మణుడు......'అయ్యా! మిత్రమా! శ్రీరాముడు, సీత వట్టి నేలమీద నిద్రపోతుంటే, నేనెలా సుఖంగా పడుకుంటాను? అది ధర్మమా? నాకది సాధ్యపడుతుందా? దేవదానవులను అవలీలగా జయించగల మహాసమర్థుడు తానూ తన భార్యతో గడ్డిపడకమీద పడుకుంటే నాకంటికి

నిద్ర ఎలా వస్తుంది? భోగాలు మనసుకైనా రుచిస్తాయా? శ్రీరాముడిని అడవుల పాలుచేసిన దశరథుడు దుఃఖంతో దీనుడై, చాలాకాలం భూమ్మీద బతకడం కష్టం. కాబట్టి భూమి దిక్కులేనిదై చెడిపోతుంది త్వరలో. రాజగృహం పాడుపడినట్లు అయిపోతుంది. వనితారత్నమైన కౌసల్య, రాజు, నా తల్లి సుమిత్ర, ఇతరులు ఈ రాత్రైనా బతికి వుంటారా? అని సందేహం కలుగుతున్నది. శత్రఘ్నుడి మీది ప్రేమతో అతడున్నాడని నా తల్లి బతకొచ్చునేమోకాని, కౌసల్యాదేవి ఒక్క క్షణమైనా బతకలేదు. సర్వం మించిపోయింది. ఇప్పుడు చేయగలిందీ ఏమీ లేదు. రాజు మరణిస్తే అతడి కొడుకులు భరతశత్రఘ్నులు దగ్గరున్నందున ఉర్ధ్వలోక క్రియలు చేస్తారు. మాకు ఆ భాగ్యం కూడా లేదు. మేము ఆయనకు కొడుకులమని ఎలా చెప్పుకుంటాం? ఉర్ధ్వలోక క్రియలు తీర్చిన భరతశత్రఘ్నులు ఆనందంతో రాజదానిలో తిరుగుతారు. పద్నాలుగేండ్లు వనవాసం చేసి, తన ప్రతిజ్ఞ తీర్చుకుని, శ్రీరాముడితో అయోధ్యకు మేం పోగలమా? మాకంత పుణ్యమా?...."

ఇలా లక్ష్మణుడు రాత్రంతా శోకంతో మాట్లాడుతుండగానే తెల్లవారింది. నేనేం చెప్పగలను? సూర్యోదయం కాగానే అన్నదమ్ములకు ఇరువురికీ నేనే జడలు ధరింపచేసి సీతతోడ రామలక్ష్మణులను గంగానది దాటించా. వారంతా గంగ దాటిపోయారు". అని చెప్పాడు గుహుడు భరతుడితో.

❖ ❖ ❖

సర్గ-87

గుహుడి మాటలకు దుఃఖపడ్డ భరతుడు

గుహుడి మాటలు విన్న భరతుడు ఉస్సురుమంటూ శోకించి మూర్ఛపోయి, నేలబడ్డాడు. పక్కనే వున్న శత్రుఘ్నుడు ఆయనను పట్టుకుని దుఃఖంతో రోదించాడు. భరతుడు పడిపోయాడని విన్న తల్లులు అక్కడికి వచ్చి, కొడుకును చూసి, ఏడుస్తుంటే కౌసల్య, "తండ్రీ! భరతా! నీ దేహంలో శ్రీరామ విరహవేదన అనే రోగం లేదుకదా? ఈ వంశం నీ స్వాధీనంలో వుంది. నువ్వు చనిపోతే శత్రుఘ్నుడు మరణిస్తాడు. ఈ వార్తా శ్రీరామలక్ష్మణులు వింటే వారూ చనిపోతారు. కాబట్టి నీతో వంశం నిలిచి వుంది. మా జీవితం, ప్రాణం నువ్వే. నిన్ను చూస్తే శ్రీరాముడు అయోధ్యకు తిరిగొస్తాడు. ఆయన వస్తే మేం బతుకుతాం. నువ్వు చనిపోతే ఆయన రాదు. నువ్వు, శ్రీరాముడు లేకుండా మేమెలా బతుకుతాం? తండ్రి స్వర్గానికి పోయినా, శ్రీరాముడు అడవులకు పోయినా, నువ్వు శ్రీరాముడిని పిలుచుకొస్తావని ఆశతో నిన్ను చూసుకుంటూ ప్రాణాలతో వున్నాం. ఏదైనా అశుభ వార్తా విన్నావా? ఎందుకిలా ఏడుస్తున్నావు? శ్రీరాముడి దగ్గరకు పోతున్నాం కదా? మమ్మల్ని ఓదార్చవలసినవాడివి నువ్వే ఇలా ఏడుస్తుంటే మాకేం గతి?" అని అన్నది.

కౌసల్య మాటలు విన్న భరతుడు గాఢ మూర్ఛనుంచి లేచి, స్మృతి తెచ్చుకుని, కౌసల్యను ఓదార్చి, గుహుడితో మాట్లాడాడు.

సీతారాముల నిద్ర, ఆహార విషయాలను గురించి గుహుడిని అడిగిన భరతుడు

"మిత్రుడా? ఆనాటి రాత్రి మా అన్న భూమిమీద ఎక్కడ పడుకున్నాడు? సుకుమారి వదిన ఎక్కడ పడుకుంది? లక్ష్మణుడు ఎక్కడ కాపలాకాశాడు? వారేం తిన్నారు? దేనిమీద పడుకున్నారు? చెప్పవయ్యా!" అని భరతుడు అడగగా, గుహుడు శ్రీరాముడి చరిత్రంతా సర్వం జరిగింది-జరిగినట్లే చెప్పసాగాడు. "అనేక విధాలైన కమ్మని పండ్లు, అన్నం, పానీయాలు నేను

తీసుకునిపోయినా దయతో, మంచిమాటలతో ఆదరించాడు కాని, క్షత్రియ ధర్మం ప్రకారం ఒక్కదానిమీద కూడా వేలేసి అంగీకార సూచనగా ముట్టినవాడు కాదు.....'అయ్యా! మిత్రమా! క్షత్రియులమైన మాకు స్వార్జితం ఉత్తమం కాని, దత్తం కాదు. నువ్వు తెచ్చి ఇచ్చింది ఆతిథ్యం కాదు, కానుక కాదు. కాబట్టి నేను తీసుకోకూడదుతెచ్చిన'.....అని స్వధర్మంలో, పుణ్యకార్యంలో మనసున్న శ్రీరాముడు మంచి మాటలు చెప్పి, నేను ఇచ్చిన వస్తువులన్నిటినీ మరల పంపాడు. నేను ఇచ్చినవన్నీ పంపిన తరువాత, లక్ష్మణుడు తెచ్చిన నిర్మల జలాన్ని సీతతో కలిసి తాగి, ఉపవాసం చేశాడు. తానూ తాగగా మిగిలిన జలం తమ్ముడు లక్ష్మణుడికి ఇవ్వగా ఆయన కూడా తాగాడు. ఆ తరువాత ఆ ముగ్గురూ, సంధ్యాకాలంలో చేయాల్సిన దేవపూజలను, సంధ్యావందనాన్ని మౌనంగా కానిచ్చారు. తరువాత లక్ష్మణుడు దర్భలతో పడక ఏర్పాటుచేశాడు. ఆ పడకమీద శ్రీరామచంద్రుడు సీతతో పడుకున్నాడు. లక్ష్మణుడు శ్రీరాముడి పాదాలను కడిగి సీత దగ్గర నీరుంచి, సమీపంలో వుండకుండా కొంచెం దూరం పోయి నిలుచున్నాడు".

శ్రీరాముడు పడుకున్న స్థలాన్ని భరతుడికి చూపించిన గుహుడు

"తోలు కవచాలను చేతికి తొడుక్కుని, పదునైన బాణాలతో నిండిన పొదులను, పెద్ద వింటిని ధరించి, హెచ్చరికగా రాత్రంతా తిరుగుతూ రక్షించాడు. నేను కూడా విల్లు-బాణాలు ధరించి ఆయన వెనుకే వున్నాను. నేనెందుకు ధరించానంటే.... నీలాగా శ్రీరాముడికి లక్ష్మణుడు సవతి కొడుకే! ఒక సవతి కొడుకు శ్రీరాముడిని వూరు వెడలగొట్టాడు. ఈ తమ్ముదు ఏం చేస్తాడో అని భయంతో విల్లు బాణాలు ధరించి ఆయన వెనుకే వున్నాను. ఇలా మేమందరం శ్రీరాముడిని కాపలా కాశాం".

❖ ❖ ❖

సర్గ-88

శ్రీరాముడు పడుకున్న స్థలం చూసి బాధపడ్డ భరతుడు

ఇలా గుహుడు చెప్పగా అంతా విని భరతుడు శ్రీరాముడు పడుకున్న స్థలాన్ని చూసి చింతలో మునిగిపోయాడు. ఆ తరువాత ఇలా అనసాగాడు: "తల్లులారా! చూశారా! ఆ రోజు రాత్రి శ్రీరామచంద్రుడీ ముళ్ళ దర్భ శయ్య మీద, ఇదే ప్రదేశంలో కళ్ళు మూసుకుని నిద్రపోయాడట. అదిగో చూశారా? శరీరం రాసుకున్న నలిగిన గుర్తులు. నేనేమని ఈ విపరీతం చెప్పాలి? అసమానమైన కీరివంతుడు, దశరథుడు లాంటి మహారాజుకు కుమారుడు, ప్రపంచమంతా స్తోత్రం చేసే మనసున్నవాడు, సద్వంశంలో పుట్టినవాడు, విశేష పరాక్రమవంతుడు, జగమంతా పాలించేవాడు, శ్రీరాముడు, కృష్ణాజినం మీద పడుకోవాల్సినవాడు ఎక్కడ పడుకున్నాడో చూశారా? సర్వజనగర్వ్యుడు, నిరుపేదకుమారుడు, నలుగురు బుద్ధిలేదని పిలిపించుకునేవాడు, నీచవంశంలో పుట్టినవాడు, కేవలం నీచసేవకుడు, ముళ్ళలో పడుకోవడానికి అలవాటున్నవాడు, పడుకోవాల్సిన ఈ దర్భ శయ్యలమీద దేహాన్ని వుంచి పడుకున్నాడు కదా? రాజుల ఇండ్లలో మేడలమీద తిరగాల్సిన రాజు చెట్టునీడలో పడుకున్నాడు! ఉద్యానవనాలలో బంగారుమయమైన ప్రదేశాల్లో వుండేవాడు కఠినమైన భూమిమీద తిరిగాడు. మలయ పర్వతం నుండి వచ్చే కమ్మని చల్లగాలి పీల్చుకుంటూ జిగుళ్ళ పానుపుమీద పడుకోవాల్సిన భాగ్యశాలి దర్భ శయ్యల మీదనా పడుకుంది?"

"మంగల వాద్యాల మధ్య నిద్ర మేల్కొనాల్సిన రాజు నక్క కూతల ధ్వనులకు నిద్రలేవాలా? పెంపుడు చిలుకల మాటలు వినే మహారాజు భయంకర మృగాల కఠిన ధ్వనులు ఎలా విన్నాడో? వేలాదిమంది కొలుస్తుంటే వుండే ప్రభువు ఒంటరిగా ఇక్కడ ఎలా ఉన్నాడో కదా? గులకరాళ్ళ నేల నీకు హా! రామచంద్రా! బంగారు వెండి మయమైన మేడ అయిందా? ఒరుసుకుని వాతలు పడేసే దర్భల రాశి అన్నా! నీకు అందమైన హంసతూలికా తల్పం అయిందా? చెట్టుకొమ్మలు నీకు సోదరా! దోమతెరలయ్యాయా? హోరుగా వీచే గాలి విభూ!

వయసు సుందరీమణులు వీచే వింజామరలయ్యాయా? కఠినమైన కాకి కూతలు వందిమాగధుల స్తోత్రాలు, సంగీత వాద్యధ్వనులు అయ్యాయా?"

"ఒకదానిని చూసి నా మనసు మోహంతో మోసపోయి వేరొకటిగా భావిస్తున్నది. అలా కాకపోతే ఇలాంటి విపరీత సత్యం ఇంకోటి వుంటుందా? ఇలా తోచడానికి కారణం...నా కల వల్ల నేను మొహపడ్డాను. శ్రీరాముడు ఎక్కడ? ఈ గొడ్డు నేల మీద పడుకోవడం ఎక్కడ? ఇది నిజమని ఎలా నమ్మేది? అన్ని విధాల గొప్పవాడైన శ్రీరాముడిని, దశరథుడి కుమారుడిని, పరమ పాపి అయిన దుష్టుడిలాగా నిదురపోయేట్లు చేసింది కాబట్టి దైవం కంటే కాలమే బలీయం. దైవమె శ్రీరాముడు. కాల బలం వల్ల ఆయనకు ఇన్ని కష్టాలు వచ్చినప్పుడు కాలమేకదా బలీయం?"

"మగవాడు కాబట్టి శ్రీరాముడెలాగో కష్టాలు పడ్డాడనుకుందాం. సీత ఎలా నేలమీద పడుకుంది? ఆమె అంటే సామాన్యురాలా? జనక మహారాజు కూతురు....దశరథ మహారాజు పెద్ద కోడలు....శ్రీరామచంద్రుడి భార్య.... సంతోషకరమైన దర్శనం కలది. ఎలాంటి దుఃఖంలో మునిగి వున్నవాడైనా ఆమెను చూస్తె ఆ దుఃఖం మరచిపోయి ఆనందంలో తేలిపోతాడు. అలాంటి అయోనిజ, లోకపావని సీత, నేలమీద పడుకుందా? ఇంతకంటే క్రూరమైన విషయం మరొకటి కలదా? ఇది మా అన్న పడుకున్న శయనం. నేల కఠినంగా ఉన్నందున పడక కుదరక, నిద్రపట్టక, ఇటు-అటు పొర్లగా దర్భ చెదిరి నలిగింది. మృదువైన శరీరం ఉన్నవాడికి కరకు దర్భ శయనం అయింది! దీనిని ఏమనాలి? జానకీదేవి పడుకున్నందున ఉత్తమమైన శయ్య ఇదే! దీనిమీద ఆమె ఆభరణాలు పెట్టుకునే శయనించింది. అందుకే సన్నని బంగారు రేణువులు అక్కడక్కడ కనపడ్తున్నాయి. దైవమె మోసం చేస్తే మనం ఏం చేయగలం?"

"సీతాదేవి పైట (ఉత్తరీయం) ఆమె లేచేటప్పుడు దర్భలలో పట్టుకుంది. అందుకే ఆమె కట్టుకున్న వస్త్రం సన్న పోగులిక్కడ కనపడ్తున్నాయి. భర్తకు ప్రియమైన పడకలాంటిదే పతివ్రత అయిన సీతాదేవికి కూడా ప్రియమైంది. అయ్యయ్యో! నేనెంత పాపాత్ముడిని? ఎంతటి నీచుడిని? రామచంద్రుడు తన భార్య సీతతో ఇలాంటి కఠిన నేలమీద, దర్భల మీద, పడుకోవడానికి నేనే కదా కారణం? ఇంతకంటే దుఃఖ కారణం వుంటుందా? ఆలోచించిన కొద్దీ

కడుపు మండిపోతున్నది. సార్వభౌమ కులమైన సగరుడి వంశంలో పుట్టి, నీటికి స్థానమైన సుందరుడు, కమలనేత్రుడు, రక్తలోచనుడు, రంపంలాంటి కఠిన సయ్యమీద పడుకోవాల్సి వచ్చిందే! అన్నకు సహాయంగా అడవులకు పోయి, జన్మ సార్థకం చేసుకున్న తమ్ముడు లక్ష్మణుడు అదృష్టవంతుడు. అందుకే లోకానికంతా పూజ్యనీయుడైనాడు. పురుషులలో లక్ష్మణుడిలాగా స్త్రీలలో సీత ధన్యురాలు. భారత్తో పాటే పయనమైంది".

"దశరథుడు స్వర్గానికి పోవడం వల్ల, శ్రీరాముడు అడవులకు పోవడం వల్ల, ఓడ నడిపేవాడు లేక అల్లాడే నావలాగా భూమి దిగులుపడుతున్నది. అయితే, ఏవిధంగా చూసినా అయోధ్యానగరానికి భయం లేదు. శ్రీరాముడు అరణ్యంలో వున్నా, ఆతడికి భయపడి అయోధ్యపైన ఎవరూ దండెత్తరు. ఏ రాజైనా సంపదున్న నగరాన్ని వశం చేసుకోవాలనుకుంటాడు కాని, పాడుబడిన ఈ నగరాన్ని ఎవరు కావాలనుకుంటారు? ఇన్ని కష్టాలకు నేనే కదా కారణం? కాబట్టి దానికి ప్రాయశ్చిత్తం చెప్తా వినండి".

"నేటి నుండి నేను గడ్డి పడక మీద కాని, ఆకుల పడకమీద కాని పడుకుంటాను. లేదా భూమ్మీద పడుకుంటాను. జడలు ధరిస్తాను. సర్వకాలం నార చీరెలే కట్టుకుంటాను. పండ్లు, కందమూలాలు తిని ప్రాణం కాపాడుకుంటాను. పద్నాలుగు సంవత్సరాలలో శ్రీరాముడున్న కాలం పోగా మిగతా కాలం నేను ఆయనకు బదులుగా అడవుల్లో వుంటా. ఆయన ప్రతిజ్ఞ తీరుస్తా. శ్రీరాముడు ఈ భూమిని లక్షణుడితో సహా పాలించాలి. అన్న మీద వున్న భక్తితో నా తమ్ముడు శత్రఘ్నుడు నాతోపాటు అడవుల్లో నాకు సహాయంగా వుంటాడు. అక్కడ బ్రాహ్మణ ముఖ్యులు శ్రీరాముడికి అయోధ్యలో పట్టాభిషేకం చేస్తారు. దేవతలారా! నా ఈ దృఢమైన కోరిక తీర్చండి. మీకు నమస్కరిస్తాను. నేను ఆ శ్రీరామచంద్రుడి చరణాలమీద పది పట్టాభిషేకం చేసుకొమ్మని వేడుకుంటా. నా ఇష్ట ప్రకారం ఆయన చేయకపోతే నేను కూడా అడవిలో వుంటా. తమ్ముడిని, శరణాగతుడిని, శిష్యుడిని, దాసుడిని, అయిన నన్ను ఆయనెందుకు ఉపేక్షిస్తాడు?" (ఇదంతా భరతుడు గంగాతీరం చేరిన నాటి వృత్తాతం)

❖ ❖ ❖

సర్గ-89

గంగాతీరాన్ని దాటిన భరతుడు

ఇలా భరతుడు చెప్తుండగానే తెల్లవారింది. అప్పుడు భరతుడు తమ్ముడు శత్రుఘ్నుడిని పిలిచి రాత్రంతా శ్రీరాముడి గురించి మాట్లాడుకుంటూ నిద్రపోలేదని, అందరినీ గంగానది దాటించాలనీ, కాబట్టి గుహుడిని పిలుచుకుని రమ్మనీ, అంటాడు. శత్రుఘ్నుడు కూడా రాత్రంతా తానూ నిద్ర పోలేకపోయానని అంటాడు. ఇంతలో గుహుడు వస్తాడు. వచ్చి నమస్కారం చేసి, "నదీతీరాన మీకు రాత్రంతా నిర్విచారంగా గడిచిందా? సేనలకు సుఖమే కదా?" అని స్నేహంగా భరతశత్రుఘ్నులను అడిగాడు. తామంతా క్షేమమని, ఆయన చేసిన సేవలకు తాము సంతృప్తి చెందామని ఇక తమను గంగానది దాటించమని అంటారు. గుహుడు తన ఊళ్లోకి పోయి తన మనుషులందరినీ రమ్మని, నావలను సిద్ధం చేయమని చెప్పాడు. వారు రాజాజ్ఞ శిరసావహించి, "స్వస్తికం" అనే పేరుగల ఐదొందల నావలనుసిద్ధం చేశారు. వాటిమీదికి గురువులు, బ్రాహ్మణులు, తల్లులు, మిగతా అంతఃపుర స్త్రీలు సంతోషంగా ఎక్కారు. మరో అందమైన నావను చక్కగా అలంకరించి గుహుడు తెచ్చాడు. రాజకుమారులు ఇద్దరూ అందులో ఎక్కారు. అవసరమైన ఇతర వస్తువులన్నీ అందులో ఎక్కించారు తరువాత. బెస్తలు గాలిచాపలు ఎత్తగానే, నావలన్నీ కదిలాయి. నావలు వారిని గంగానది ఆవలి ఒడ్డున దించాయి. నావలెక్కనివారు ఈదుకుంటూ పోయారు. కొందరు తెప్పలమీద పోయారు.

❖ ❖ ❖

సర్గ-90

భరద్వాజ మహర్షిని సందరించడానికి పోయిన భరతుడు

ఆ విధంగా వారంతా "మైత్రం" అనే ముహూర్తంలో ప్రయాగవనం చేరారు. ఎక్కడివారిని అక్కడే వుండమని చెప్పి, కొందరినే తన వెంట తీసుకుని, భరతుడు పాదచారిగా, జ్ఞానం వల్ల, తపస్సు వల్ల, వయసు వల్ల, వృద్ధుడైన భరద్వాజ మహర్షిని, ఇంద్రుడి పురోహితుడిని, చూడడానికి పోయాడు. అక్కడ భరతుడు అందమైన వృక్షాలతో ప్రకాశించే వనాన్ని చూశాడు.

తన వెంట వచ్చిన వారిని కోసెడు దూరంలోనే ఆపుచేసి, ఆభరణాలు, విల్లు-బాణాలు వదిలి, శరీరం మీద కట్టువస్త్రాన్ని మాత్రమే ధరించి, పైన ఉత్తరీయం వేసుకుని, ముందు వశిష్ఠుడు నడుస్తుంటే, ఆయన వెనక భరతుడు నడిచాడు. వస్తున్నా వశిష్ఠుడిని చూసిన భరద్వాజుడు తన ఆసనం దిగి, శిష్యులను అర్ఘ్యం తెమ్మని, తెచ్చి తన చేతికి ఇవ్వమని ఆజ్ఞాపించాడు. వశిష్ఠుడు వెనుకనె వచ్చి తనకు నమస్కారం చేసినతనిని దశరథుడి కొడుకుగా గుర్తించి, పెద్ద-చిన్న వరుస ప్రకారం ఇద్దరికీ అర్ఘ్య-పాద్య-ఫలాలను ఇచ్చాడు. ఇచ్చి, "భరతా! నీ సేనలు, ధనాగారాలు, స్నేహితులు కుశలమా?" అని అడిగాడు. భరతుడు, వశిష్ఠుడు కూడా భారద్వాజుడి ఆశ్రమంలోని పక్షుల, జింకల, పూల, పండ్ల చెట్ల, క్షేమ సమాచారం అడిగారు. ఉభయకుశలోపరి తరువాత వారిమధ్య సంభాషణ సాగింది.

భరతుడి రాకకు కారణం అడిగిన భరద్వాజుడు

భరతుడితో భరద్వాజుడు, "నువ్వు రాజ్యం పాలిస్తూ ఇక్కడకు వచ్చిన కారణం ఏమిటి? నీ నడవడికలో దోషం కనపడుతున్నది. నిన్ను కన్నవాడు ఆడదానికి లోబడి శ్రీరామచంద్రుడిని భార్యతో, తమ్ముడితో, చిరకాలం అడవుల్లో వుండేట్లు చేశాడు కదా? కొడుకా! పో! అని కైక అనగానే ప్రత్యుత్తరం చెప్పకుండా పుణ్యచరితుడైన శ్రీరాముడు పద్నాలుగేళ్లు అడవుల్లో వుండడానికి సమ్మతించాడు కదా? అలాంటి ప్రశసీసించాల్సిన నడవడి గల వానికి, తమ్ముడు లక్ష్మణుడికి,

కీడు కలిగించి భూమంతా శత్రుబాధలేకుండా సంతోషంగా పాలించాలను కున్నావా దయాహీనుడా? పాపంతో సంపాదించిన ధనం ఇంత ఘోర కార్యం చేయించేంత ఇంపయిందా?" అనగా, భరతుడు దుఃఖం పడుతూ, కళ్ళలో నీళ్లు నిండగా, మాట తడబడుతుంటే, ఆ మునితో ఇలా అన్నాడు.

"అయ్యో! తపోమహిమ వల్ల భూత–భవిష్యత్–వర్తమానాలను తెలుసుకునే మహిమ కలవాడా! నీలాంటి వాడు, ముల్లోకాలలో, మూడు కాలాలో జరుగుతున్న విషయాలు తెల్సినవాడు, నిర్దోషి అయిన నన్ను దోషిగా పరిగణించితే, నా జన్మ వ్యర్థం. నా మనసు నేను శోధించి చూసుకున్నా. ఒక్క తప్పైనా కనపడలేదు నాలో. కాబట్టి భయంకరమైన, కఠినమైన మాటలను సూదుల్లాగా నన్ను గుచ్చటం ఎందుకు? నువ్వు పిలిచినట్లు కైక కొడుకన్న దోషం తప్ప నాలో ఏ దోషం లేదు. దైవం చేసిన దానిని నేనెలా సవరించగలను? కైక చేసినదానితో నాకు ఏ సంబంధం లేదు. నాతో ఆలోచించి చేయలేదు. నా అభిప్రాయం అడగలేదు. నా ఇష్టం తెలుసుకోలేదు. అలా అయితే నేనెందుకు ఇంత సేనతో వచ్చానంటావా? శ్రీరాముడిని అయోధ్యకు పిలుచుకు పోవడానికి వచ్చాను. పోయి ఏం చేస్తానంటావా? ఆయన రెండు పాదాలమీద పడి, నన్ను క్షమించమని ప్రార్థన చేసి, ఆయనకు అక్కడే పట్టాభిషేకం చేసి తీసుకొస్తాను. కాబట్టి శ్రీరాముడెక్కడ ఉన్నాడో ఆ స్థలం వివరాలు స్థిరమైన కృపతో చెప్పు".

వసిష్ఠుడు, ఇతర పెద్దలు, భరతుడి అభిప్రాయం నిజమే అని అన్నారు. మంచి మనసుతో పోతున్నాడని అనగా, భరద్వాజుడు, "దశరథనందనా! నీకు అన్నకు హితమైన ప్రవర్తన, జ్ఞానులు మెచ్చే ప్రవర్తన ఉండుగాక. నీ తేజస్సు లోకంలో ప్రకాశిస్తుంది. మూడులోకాలలో శాశ్వత కీర్తి కలుగుతుంది నీకు. రాజకుమారా! నీ మనసెలాంటిదో నాకు తెలియక కాదు, అయినా శ్రీరాముడి మీద నీ భక్తి లోకానికి తెలపాలని, నీకు కీర్తి కలిగించాలని, అలా అడిగాను. సీతారామలక్ష్మణులు ముగ్గురూ చిత్రకూట పర్వతం దగ్గరున్నారు. నాకు తెలుసు. నువ్వు నీ పరివారంతో ఈ రోజు నా ఆశ్రమంలో వుండు. శ్రీరాముడి కొరకు రేపుదయం పోవచ్చు".

❖ ❖ ❖

సర్గ-91

భరతుడికి, అతడి పరివారానికి విందు పెట్టిన భరద్వాజుడు

భరద్వాజ ముని ఆతిథ్యం ఇస్తానని భరతుడుకి చెప్పగా, ఆ రాత్రి వారంతా అక్కడే వుండడానికి అంగీకరించారు. కృతజ్ఞతగా భరతుడు మహర్షితో, "మునీంద్రా! మీరు అర్ఘ్యం, పాద్యం ఇచ్చారు. అడవిలో దొరికేవాటితో ఆతిథ్యం ఇచ్చారు. చాలా సంతోషం కలిగింది" అని అన్నాడు. జవాబుగా ముని, "రాజా! నేనేదో కొంచెం ఇచ్చినందుకే నువ్వు సంతుష్టుడవయ్యావు. అది నాకు తెలుసు. ఈ రోజు నీకు, నీ పరివారమలో అందరికీ భోజనం పెట్టాలని నా కోరిక. నేనిచ్చే విందు నువ్వు అంగీకరిస్తే నాకు సంతోషం కలుగుతుంది. నువ్వు నీ సేనను తీసుకునిరాకుండా ఒంటరిగా ఎందుకోచ్చావు?" అని అన్నాడు.

మునీంద్రుడి భయం వల్ల తాను సేనలను తేలేదని, సేనల్లోని ఏనుగులు, గుర్రాలు, ఒంటెలు ఆశ్రమంలో, పర్ణశాలలో వున్నా వృక్షాలను పాడుచేయొచ్చునేమో అని ఆలోచించి దూరంగా వాటిని వదిలానని భరతుడంటాడు. భరతుడిలా అనగానే భయపడాల్సిన పని లేదని, ఆలస్యం చేయకుండా సేనలను పిలిపించమనీ, ముని చెప్పడంతో సేనను రావలసిందిగా భరతుడు ఆజ్ఞాపించాడు.

ఋషి శ్రేష్ఠుడైన భరద్వాజుడు దేవతా సన్నిధానమైన, పవిత్ర అగ్ని గృహంలో ప్రవేశించి, మూడు సార్లు ఆచమనం చేసి, రెండు సార్లు పెదవి తుడుచుకుని, రాజునకు ఆతిథ్యం ఇవ్వడానికై దేవశిల్పి విశ్వకర్మను పిలిచాడు. తాను రాజుకు ఆతిథ్యం ఇవ్వాలనుకున్నానని, ఆయన, త్వష్ట వెంటనే వచ్చి రాజు పరివారం దిగడానికి, వుండడానికి ఇండ్లను ఏర్పాటు చేయమని ఆదేశించాడు. "ఇంద్ర దిక్పాలకులారా! సమస్త వస్తువులను సిద్ధం చేసుకోండి. నదుల్లోంచి చెరకుపాలలాంటి నీళ్లను. సురను, మైరేయాలను సమకూర్చండి. దేవా గంధర్వ విశ్వాసులు, హాహాహుహువులు, దేవతాప్సరసలు, గంధర్వ అప్సరసలు, విశ్వాచి ఘృతాచి యలంబన నాగామేరు పర్వతాలలో వుండే హేమ మిశ్రకేసి

మొదలైనవారు, బ్రహ్మను ఇంద్రుడిని కొలిచే స్త్రీలు, తుంబురుడు, మద్దెల తాళాల లాంటి పరికరాలతో రావాలి. కుబేరుడికి సంతోషకరమైన వస్త్రభూషణాలు ఆకులుగాను, స్త్రీలు ఫలాలుగాను వుండే చైత్రవనమా! రా! చంద్రుడా రా! భక్ష్య, భోజ్య, లేహ్య, చోష్యాలు, నానా రకాలైన అన్నాలు సమకూర్చు. అనేకరకాలైన పూడండలు, అమృతంతో పోల్చదగిన పానీయాలు, మాంసాలు చంద్రుడు సమకూర్చాలి" అని చెప్పి సమాధిలోకి పోయాడా ముని. స్వరం తప్పకుండా శ్రద్ధతో తూర్పు ముఖంగా తిరిగి జపం చేస్తూ, ఆహ్వానముద్ర పట్టుకుని, చేతులు దోసిలిలాగా జోడించి, దేవతలా పేర్లు చెప్తూ, వేరు-వేరుగా స్తోత్రం చేస్తుంటే శుభసూచకంగా మలయ, దర్దుర పర్వతాల నుండి చల్లని, కమ్మని గాలి వీచింది.

అప్సర స్త్రీల రాక తెలుపుతూ, మనోహరమైన వీణానాదాలు, స్త్రీల లయతో వినిపించాయి. శ్లాఘ్యమైన ఆ ధ్వని వినపడగానే అక్కడ ఏర్పాటైన ఇండ్లను సేనలు చూశారు. ఐదామడల భూమి చదునుగా అయింది. ఇంద్రనీలాలతో, వైడూర్యాలతో, సమానమైన పచ్చికపట్టులు వచ్చాయి....వీటిలో మామిడి, మారేడు, వేలగాలు, మాదీఫలాలు, పనసలు లాంటి వృక్షాలు వెలిశాయి. అక్కడ ఉసిరిక చెట్లున్నాయి. పండ్లతోటలున్నాయి. నదులు సహితం చెట్లతో అక్కడికి కదిలి వచ్చాయి. సైనికులకు చదరపు ఇండ్లు, ఏనుగులకు, గుర్రాలకు ఇండ్లు, తోరణాలు, ధనికుల ఇండ్ల సమూహాలు, వెలిశాయి. అక్కడ స్నానం చేయడానికి, భోజనం చేయడానికి, పడుకోవడానికి వసతులు ఏర్పాటయ్యాయి. అలాంటి శ్రేష్ఠమైన ఇంట్లో ముని ఆజ్ఞ ప్రకారం ముని శక్తిని మెచ్చుకుంటూ, సేవకులు, మంత్రులు వెంటరాగా భరతుడు ప్రవేశించాడు.

లోనికి ప్రవేశించిన భరతుడు అక్కడ రాజయోగ్యమైన సింహాసనాన్ని, వింజామరం, శ్వేతచ్ఛత్రం చూసి, శ్రీరామచంద్రుడిని తలచుకుని, వాటికి భక్తితో నమస్కారం చేసి, ప్రదక్షిణగా పోయి, చామరం తీసుకుని, మంత్రి కూర్చునే స్థానంలో కూర్చున్నాడు. ఆ తరువాత వరుసగా మంత్రులు, పురోహితులు, రాజకుమారుడి వెనుక కూర్చున్నారు. సేనానాయకుడు, ప్రశాస్త, దగ్గరే వున్నారు. అలా అందరూ కూర్చున్న తరువాత ఋషీశ్వరుడి మహిమవల్ల తక్షణమే, అక్కడే, పాయసంతో బురదైన నదులు పారాయి. ఆ నదుల ఒడ్డున తెల్లటి

ఇండ్లు కనపడ్డాయి. దివ్యమైన ఆభరణాలతో అలంకరించుకున్న ఇరవైవేల మంది దేవతాస్త్రీలు బ్రహ్మ పనుపున వచ్చారు. పగడాలతో, నవరత్న సమూహాలతో, బంగారంతో, అందమైన నానాలంకారాలు కల స్త్రీలు కుబేరుడి ఆజ్ఞ ప్రకారం వచ్చారక్కడికి. తుంబురుడు, నారదుడు, గోపుడు ముని ఆజ్ఞానుసారం భరతుడి ఎదురుగా పాడారు. మారేడు వృక్షాధి దేవతలు మృదంగాలు వాయించారు. రావిచెట్లు నాట్యమాడాయి. తాండ్రలు తాళం వేశాయి. ఇలా మునీశ్వరుడి ఆజ్ఞ ప్రకారం అందరికీ సంతోషం కలిగింది ఆ రాత్రి.

తాటిచెట్లు, బొట్టుగచెట్లు, కానుగుచెట్లు, దేవదారువులు, కుబ్జలై తిరిగాయి. ఇరుగుడు చెట్లు, ఉసిరకలు, నేరేడు చెట్లు, జాతి మల్లెలు, అందమైన తీగెలు ఆ ముని ఆశ్రమం ముందు స్త్రీలలాగా తిరుగుతూ, వినసొంపైన మాటలిలా మాట్లాడాయి: "సారాయి తాగేవారు ఇదిగో సారాయి...తాగండి. ఆకలిగొన్నవారు ఇదిగో పాయసం....మాంసం తినేవారికి ఇదిగో మాంసం....ఇలా ఒక్కొక్కరికి ఎనిమిది మంది స్త్రీలు సంతోషంతో వడ్డించారు. పరిశుభ్రమైన వస్త్రాలను ఇస్తూ, విసనకర్రలతో విసురుతూ, సారాయి తాగిస్తూ, స్త్రీలు తిరిగారు. వారంతా కడుపునిండా తిని, కావాల్సినంతా తాగి, తృప్తిగా దేవతా స్త్రీలతో మాట్లాడారు. తామిక దండకారణ్యానికి పోమని, అయోధ్యకూ పోమని, అడవిలో శ్రీరాముడు క్షేమంగా వుండాలనీ, అయోధ్యలో భరతుడు క్షేమంగా వుండాలనీ, వారంతా ఏమైనా కానీ తాము ఇక్కడే వుంటామనీ అరిచారు. వారంతా ఇదే స్వర్గమని కేకలేశారు. విందులో మనుష్యులకు తోడుగా గుర్రాలు, కంచర గాదిడలు, లొట్టపిట్టలు, ఆవులు, మృగాలు, ఏనుగులు, పక్షులు కూడా సంతోషించాయి. భుజించినవి జీర్ణంకావడానికి ఔషధాలతో నిండిన జలాలక్కడ వున్నాయి. స్వర్గంలాగా వున్న ఆ నందనవనంలో సంతోషంతో ఆ రాత్రంతా గడిచిపోయింది. గంధర్వులు, దేవతాస్త్రీలు, నదులు, ఇతరులు ముని ఆజ్ఞానుసారం భూమిని విడిచి దేవతల సమూహంతో స్వర్గానికి పోయారు.

ఇలా భరతుడు తన పరివారంతో గడిపి ఉదయం కాగానే భరద్వాజుడిని చూడడానికి పోయాడు. ఆ మహర్షి ఆయన్ను చూసి ప్రేమతో ఇలా అన్నాడు.

❖ ❖ ❖

సర్గ-92

రామాశ్రమానికి పోవడానికి భరద్వాజుడిని మార్గం అడిగిన భరతుడు

"రాజకుమారా! రాత్రి మా వనంలో నీకు సుఖంగా సంతోషంగా గడిచిందా? నేనిచ్చిన ఆతిథ్యం మీ వారికి సంతోషం కలిగించిందా?" అని అడిగిన మునికి సమాధానంగా భరతుడు, "రాత్రి మా వారంతా సుఖసంపదలతో ఓలలాడారు. భోగాతిశయం ఇంత అని చెప్పడం సాధ్యం కాదు. అన్నీ సమృద్ధిగా వున్నాయి. కొరత అసలే లేదు. మాకు పూర్తిగా తృప్తికలిగింది. అన్నగారిని చూడడానికి త్వరగా పోవాలని వుంది. మునీంద్రా! ఆజ్ఞ ఇవ్వు. నన్ను స్నేహభావంతో త్వరగా పోనివ్వు. మునీంద్రా! శ్రీరామచంద్రుడు ఎక్కడున్నాడు? ఆయన వున్న చోటుకు దారేది? ఆ స్థలం ఇక్కడికి ఎంత దూరం? అక్కడిని నేను పోవాలి" అన్నాడు. భరతుడు అడిగిన దానికి జవాబుగా భరద్వాజుడు "ఇక్కడికి రెండున్నర ఆమడల దూరంలో అడవిలో జనసంచారం లేని ప్రదేశం వుంది. అక్కడ కళ్లకు మనోహరంగా అనిపించే చిత్రకూటం అనే పర్వతం కనిపిస్తుంది. దీనికి ఉత్తరభాగంగా అందమైన చెట్లు, తీగెలు గుంపులుగా వున్నా వనం ఒకటుంది. అక్కడే మందాకిని అనే నది వుంది. ఆ నదికి సమీపంలో వున్న పర్వతాన్నే చిత్రకూటం అంటారు. ఆ పర్వతానికి, నదికి మధ్యన, అంటే, పర్వతానికి ఉత్తరంగా, నదికి దక్షిణంగా వున్నా ఆశ్రమంలో నాయనా! మీ అన్న శ్రీరాముడున్నాడు. ఇది నిజం. నేను యోగ దృష్టితో చూసి చెప్తున్నాను. కాబట్టి ఇలా దక్షిణం దిక్కుగా పో. అలా పోతుంటే నైరుతి మూల ఒక బాట పోతుంది. ఆ బాట వెంటే నీ సేనను పోనివ్వు. అక్కడ సుగుణదాముడు శ్రీరాముడిని చూడవచ్చు" అంటూ రామాశ్రమానికి పోయే మార్గాన్ని తెలియచేశాడు.

దశరథుది భార్యలందరూ తమ వాహనాలు దిగి, ఆ బ్రాహ్మణుడిని సేవించారు. కౌసల్య తన పక్కన సుమిత్ర రాగా మునీశ్వరుది రెండు పాదాలకు ఇద్దరూ మ్రొక్కారు. కైక కూడా మ్రొక్కి, సిగ్గుతో భరతుడి సమీపంలో చాటుగా

నిలుచుంది. వీరిలో భరతుడి తల్లులు ఎవరో చెప్పమని భరద్వాజుడు అడిగాడు. భరతుడు సమాధానంగా వారిని పరిచయం చేశాడు.

భరద్వాజుడికి తన తల్లులను పరిచయం చేసిన భరతుడు

"అదిగో! కౌసల్య...ఆమె పక్కన ఉన్నదే సుమిత్రాదేవి. ఆమె కొడుకులే మనోహరమైన నడవడికల లక్ష్మణుడు, పినతమ్ముడైన శత్రుఘ్నుడు. మునీశ్వరా! గొప్ప దోషం చేసి పాపరహితులైన శ్రీరామలక్ష్మణులకు ప్రాణగండం కలిగించిందో, రాజైన దశరథుడిని స్వర్గానికి పంపించిందో, అటువంటి పాపి, బుద్ధిలేనిది, దుష్టురాలు, కోపశీల, పరుష స్వభావం కలది, మోసం చేసే ఆచారం కలది అయిన కైక ఈమె!" అని తల్లులను పరిచయం చేశాడు మునికి భరతుడు. తల్లి కైకను దూషించవద్దని, శ్రీరాముడి అరణ్యవాసం తపసులకు, మనుష్యులకు, దేవతలకు విస్తార సుఖం కలిగిస్తుందని, కాబట్టి ఆమెను నిందించవద్దని భరద్వాజుడు అంటాడు. ఇక ప్రయాణం కమ్మని సూచించాడు.

చిత్రకూటానికి ప్రయాణమైన భరతుడు

గుర్రాలు, ఏనుగులు, రథాలు, నానా వాహనాలు, వెంటరాగా ధర్మనిష్టుడైన భరతుడు ముని చెప్పిన మార్గంలో ప్రయాణం చేశాడు. వీరితో పాటే అనేక సంఖ్యలో ప్రజలు ప్రయాణం చేశారు. భటులు కాలినడకన పోయారు. కోడలిని, కొడుకును ఎప్పుడు చూస్తామా? అన్న ఆతురతతో కౌసల్య, ఆమె సవతులు కదిలారు. పల్లకినెక్కి భరతుడు సేవకులు వెంట రాగా బయల్దేరాడు. ఈ మహాసేనతో దక్షిణ దిక్కుగా పోయి, అక్కడ దక్షిణ ముఖంగా పారే గంగానది పడమటి ఒడ్డున ప్రవేశించి, పక్షులు, మృగాలు గల ఒక పెద్ద వనాన్ని చూశాడు భరతుడు.

❖ ❖ ❖

సర్గ-93

చిత్రకూటం గురించి శత్రఘ్నుడికి వర్ణించి చెప్పిన భరతుడు

ఇలా గతంలో ఎప్పుడూ రాని మహా సైన్యాన్ని చూసి అడవిలోని ఏనుగులు, కలవరపాటుతో నాలుగు దిక్కుల పరుగెత్తాయి. అవి తొక్కడం చేత ఎలుగులు, జింకలు పరుగెత్తాయి. సముద్రం లాంటి సైన్యం ఆ ప్రదేశాన్ని ఆక్రమించింది. గుర్రాలు, మదపు ఏనుగులు నడుస్తుంటే చాలాసేపు భూమి కనపడలేదు. ఇలా చాలా దూరం పోయి, వాహనాలు అలసట చెందగా అక్కడ భరతుడు వసిష్ఠుడిని చూసి, "మనకు భరద్వాజుడు చెప్పిన ప్రదేశమిదే! ఆ కనపడుతున్నదే చిత్రకూటం. ఈ నదే మందాకిని. దూరంగా వున్న కాంతివంతమైన వనం దగ్గరకే మనం పోవాలి" అన్నాడు.

శత్రుఘ్నుడిని చూసి, "కొండలతో సమానమైన నా ఏనుగుల గుంపులు కొండచరుల సారం చెరుస్తున్నట్లున్నాయి. మన ఏనుగులు పోయే వేగానికి వాటి కాళ్ల కింద పడి శిలలు పొడి అయ్యాయి. చెట్లు పూలను రాల్చాయి. అదిగో ఆ కనపడేదే దేవతలు, కిన్నరులు సంచారం చేసే ప్రదేశం. ఆ కొండ చరుల ప్రదేశం మృగాలతో కలత చెంది మొసళ్లు నివసించే సముద్రంలాగా వుంది. సైనికుల భయం వల్ల మృగసమూహాలు శరత్కాల మేఘాల గుంపుల్లాగా నాలుగువేపులా పరుగెత్తుతున్నాయి. నల్లని మేఘంలాగా కాంతిగల వెంట్రుకలను పైకి నెట్టి ముడివేసి దాంట్లో పూలను విశేషంగా ధరించారు చూశావా? నిర్మానుష్యమైన ఈ కొండ ఇప్పుడు జనాలతో కూడి అయోధ్యానగరం లాగా ప్రకాశిస్తున్నది. గుర్రాల, ఎద్దుల గిట్టలు నేల తగలడం వల్ల రేగిన దుమ్ము ఆకాశాన్ని పూర్ణంగా కప్పి వేశాయి. దానివల్ల రామాశ్రమం కనబడకుండా పోయినా, అది కనపడేట్లు చేయడానికి గాలి వీయడం వలన ఈ దుమ్ము చెదిరిపోయింది. తమ్ముడా! శ్రీరామచంద్రుడిని చూడాలన్న సంతోషంతో వేగంగా పోతున్న భటులను చూశావా? రథాల గుంపుల ధ్వనులకు భయపడి పరుగెత్తుతున్న నెమళ్లు సంతోషం కలిగిస్తున్నాయి చూశావా? ఇదంతా చూస్తుంటే

సాక్షాత్తూ స్వర్గంలాగా వుంది. కాబట్టి ఇక్కడ మునుల ఆశ్రమాలు వుండవచ్చు. కాబట్టి ఇక్కడ శ్రీరాముడి ఆశ్రమాన్ని వెతకడానికి సేనాభటులను పంపుతా" అని అనగానే కొందరు భటులు చుట్టూ వెతికి వచ్చారు. వచ్చి, సమీపంలో పొగ కనపడిందనీ, మనుష్యులు లేకుండా నిప్పు వుండదనీ, అక్కడ శ్రీరామలక్ష్మణులు వుండవచ్చనీ చెప్పారు. అక్కడున్న మనుష్యులు ఒకవేళ శ్రీరామలక్ష్మణులు కాకపోతే, వారితో సమానులైన మునులై వుంటారనీ వారిని అడిగితే శ్రీరాముడి ఆశ్రమాన్ని చూపుతారనీ వారంటారు.

భరతుడు వారందరినీ అక్కడే వుండమని అంటూ, తానూ, శత్రుఘ్నుడు, సుమంత్రుడు, వసిష్ఠుదు పోయి చూసి వస్తామని చెప్పాడు. రాజాజ్ఞ ప్రకారం సేనలన్నీ జాగ్రత్తగా అక్కడే నిలిచాయి. భరతుడు శ్రీరాముడిని చూడబోతున్నామన్న సంతోషంతో పొగవచ్చిన వైపు కదిలాడు.

❖ ❖ ❖

సర్గ-94

సీతకు చిత్రకూటంలోని వినోదాలు చూపిన శ్రీరాముడు

అక్కడ చిత్రకూటంలో శ్రీరాముడు సీతతో నెల రోజులుగా కొండమీద వుంటున్నప్పటికీ, ఆ పర్వతం సొగసును, దాన్లో వుండే మనోహరమైన తీగలను ప్రతిరోజూ చూస్తున్నప్పటికీ, ఎప్పటికప్పుడు కొత్తగా కనిపిస్తూ విశేషమైన ప్రీతిని కలిగిస్తున్నాయి. ఆ రోజున ఉదయమే కాలకృత్యాలను తీర్చుకుని, స్నానసంధ్యలు ముగించుకుని, సీతతో ఒకచోట కూర్చుని, ఆ పర్వతం గురించి ఇంద్రుడు శచీదేవికి నాకపృష్ఠం చూపించిన విధంగా, శ్రీరామచంద్రుడు ఆ చిత్రకూట శైలాన్ని చూపిస్తూ తానూ అడవిలో వుండడం కొంచెమైనా దుఃఖం కలిగించడం లేదన్నాడు.

ఆ పర్వతాన్ని చూపిస్తూ శ్రీరాముడు...."దేవీ! అదిగో చూడు! తుమ్మెదల గుంపుతో, చిలుకలతో, జింకలతో, అలరారుతూ ఆకాశాన్నంటుతున్న అందమైన ప్రదేశం. వాటిలో కొన్ని పచ్చగాను, కొన్ని నీలం రంగులోను, స్ఫటికాల్లాగా, పగడాల్లాగా, పచ్చని వస్త్రాల్లాగా, మొగలిపూలలాగా కాంతితో ప్రకాశిస్తున్నాయి. చిత్రకూట పర్వత శిఖరాలలో అహింసా వ్రతం ఆచరిస్తూ తపస్సు చేసుకుంటున్న నిష్ఠాపరులైన మునీశ్వరుల సాంగత్యం వల్ల, పశుహింస చేసే సివంగులు, భయంకరమైన పెద్దపులులు, తమ క్రూరత్వాన్ని వదిలి తిరుగుతుంటే, శ్రావ్యమైన ధ్వనులతో నానా రకాల పక్షుల సమూహాలతో పర్వతం ప్రకాశిస్తున్నది. మద్ది, తినాస, మోరట, యూడుగ, తియ్యమామిడి, మారేడు, కానుగు, తుమ్మికిచెట్ల వరుసలతో కూడి పూల పండ్ల సమూహాల కాంతులతో అలరారుతున్నది చూశావా?"

"చిలుకపలుకుల్లాగా ఇంపైన వాక్కుగలదానా! అదిగో చూడు! కిన్నరులు భార్యాభర్తలు ఒకే మనసుతో మనోహరమైన లీలా విహారాలతో పర్వతం పైభాగాన ఆటలాడుతున్నారు. వారిని చూస్తుంటే గగుర్పాటు కలుగుతున్నది. తమ వస్త్రాలను, కత్తులను చెట్లమీద వుంచి సంతోషంగా విద్యాధర స్త్రీలు సంచరిస్తున్నారు. అదిగో చూడు! సఖీ! భూమిని చీల్చుకుని ప్రవహిస్తున్న

సెలయేళ్లు. దేవీ! చూడు! వాటిలోని నీళ్లు మదంతో వున్న ఏనుగుల చెక్కిళ్ళనుండి కారే మద ప్రవాహం లాగా వున్నాయి. చూడగా...చూడగా...కళ్లకు కనువిందు కలిగించే అనేక రకాలైన పూల వాసనలు గుహనుండి వస్తున్నట్లున్నాయి. స్త్రీరత్నమా! నువ్వు, లక్ష్మణుడు, నన్ను సేవిస్తుంటే ఎన్ని సంవత్సరాలైనా ఈ అడవిలో వుండడానికి నాకు కొంచెం కూడా బాధ కలగదు. ఈ చిత్రకూటాన్ని వదలక సంతోషంగా తిరుగుదాం".

"వికసించిన కమలాల రేకుల్లాంటి కళ్లున్నదానా! నా ఈ వనవాసానికి రెండు ఫలాలున్నాయి...... ఒకటి, తండ్రి ఆజ్ఞ నెరవేర్చడం కాగా మరొకటి తమ్ముడికి మేలు చేయడం. సుందరీ! ఈ చిత్రకూట పర్వతంలో నానా జంతువులు చేసే విలాస చేష్ఠలను సంతోషంగా చూస్తూ నాతొ కలిసి ఆనందంగా క్రీడిస్తావా? ఈ వనవాస వ్రతంవల్ల కలిగేది ఐహిక సుఖం మాత్రమే కాదు. సంసారమనే తాడు తెంచి మోక్షాన్ని కూడా కలిగిస్తుందని మా పెద్దలు చెప్పారు. పద్మముఖీ! ఈ పర్వతంలో ఎక్కడ చూసినా నల్లగా, ఎర్రగా, తెల్లగా, నానా వర్ణాలతో వందలాది చదరపు నాపరాళ్లున్నాయి చూశావా? వేలాది ఔషదులు ఈ పర్వతంలో వున్నాయి. ఇక్కడ గుహలు కొన్ని ఇండ్ల లాగా వున్నాయి. కొన్ని చోట్ల ఉద్యానవనాల్లాగా వున్నాయి. కొన్ని చోట్ల విశాలంగా ఒక బండలాగా వున్నాయి. ఇవన్నీ వినోదంగా వున్నాయి. చిత్రకూటం భూమిని పెగిలించుకుని వచ్చినట్లున్నది. చూడు! పున్నాగులు, చెంగల్వకోష్టులు, భుజపత్రాలు.....వీటి ఆకులు దుప్పట్లలాగా కాముకులు పడుకునే తామరపూల పరుపుల్లాగా వున్నాయి. అనేక రకాలైన వేళ్లకు, పండ్లకు, జలాలకు, ప్రసిద్ధమైన ఈ చిత్రకూటం అందాన్ని చూడు. ఇది మానస సరస్సును, సౌగంధికాన్ని, ఇంద్ర-కుబేరుల పట్టణాలను, ఉత్తర కురుభూములను మించి పోయింది. ఇంతీ! నువ్వు, లక్ష్మణుడు, నిండుమనసుతో నన్ను సేవిస్తుంటే, వనవాస కాలమంతా ఇక్కడే గడిపి వచ్చిన పని అయిపోయిన తరువాత, మళ్లీ అయోధ్యానగరానికి రాజ్యభారం మోయడానికి పోతా".

❖ ❖ ❖

సర్గ-95

సీతకు మందాకినీ నదిని గురించి వర్ణించిన శ్రీరాముడు

ఇలా చెప్పుకుంటూ పర్వతాన్ని దాటి మందాకినీ నదిని చూపించాడు సీతకు శ్రీరాముడు. చూపించి, "ఆశ్చర్యకరమైన ఇసుక దిబ్బలతో, మనోహరమైన ధ్వనిగల బెగ్గురు, హంస పక్షులతో కూడి బంగారు కమలాలతో ప్రకాశించే నదిని చూశావా? ప్రియురాలా! అందమైన పూలు, పండ్లతో, ప్రకాశించే ఒడ్డున వున్న చెట్లతో, కుబేరుడి కొలువులాగా నది ప్రకాశిస్తున్నది. అక్కడే జంతువు నీళ్లు తాగుతాయి....ఇక్కడే నీళ్లు కలిసి ఎర్రగా బారినా మనోహరంగా వుంది చూశావా? వేళ తప్పకుండా ఈ నదిలోనే ఋషులు జడలు, జింక చర్మాలు ధరించి స్నానం చేస్తారు. తీవ్ర నిష్ఠకలవారు చేతులు పైకెత్తి సూర్యుడికి నమస్కారాలు చేస్తున్నారిక్కడ. అదిగో....కొండ కూడా చలించి చెట్ల కొమ్మల నుండి పూలు రాల్చింది".

"ఓ హారిగాత్రీ! ఈ మందాకినీ నది జలాలు ఒకచోట మంచి ముత్యాలలాగా కాంతితో వుంది. ఓ తతనితంబా! ఒకచోట అందమైన ఇసుక దిబ్బలున్నాయి. మరో చోట ఈ నదిలో తుమ్మెదలతో పూలు ఉయ్యాల ఊగుతున్నాయి. ఒక పక్క సిద్ధులు వాహ్యాళి తిరుగుతున్నారు. గాలికి రాలిన పూలు కొన్ని గట్టులమీద, కొన్ని నీళ్లలో తేలుతున్నాయి. మనోహర ధ్వనులు చేస్తూ చక్రవాకాలు పూలపానుపులు ఎక్కుతున్నాయి. సీతా! ఈ నదిని, ఈ పర్వతాన్ని చూసినప్పుడు నిన్ను, అయోధ్యను చూసినదానికంటే సంతోషంగా వుంది. తెల్ల కమలాలు, ఎర్ర కమలాలు, నీ కళ్ళను, కరచరణాలను చూసి, సిగ్గుతో తల వంచుకోవడమే కాకుండా నీటిలో మునిగిపోతున్నాయి కాబట్టి, నువ్వు నీ చెలికత్తెలతో స్నానం చేసినట్లే నాతొ జలక్రీడ చేయి. ఆ అడవి మృగాలే అయోధ్యాపుర ప్రజలనుకో. పర్వటమే అయోధ్య అనుకో. ఈ మందాకినే సరయూ నది అనుకో. ఇలా ఆలోచించి విచారం లేకుండా సంతోషంగా వుండు. నువ్వు నన్ను వదిలిపోకుండా వుంటే, ఈ నదిలో మూడుసార్లు మునుగుతూ, తేనె-కందమూలాలు కలిపి

తింటూ, నీతో సంతోషంగా కాలం గడుపుతా. నాకు ఆ రాజ్యం వద్దు....అయోధ్యా వద్దు".

"ఏనుగుల మందలతో ప్రకాశిస్తూ, ఏనుగులు, సింహాలు, కోతులు, ఒకే సమయంలో ఒకేచోట నీళ్లు తాగుతూ, తీరంలో పూల భారంతో వంగిన చెట్లతో, ఉన్న ఈ నది తరుణీ! ఎవరికి సంతోషం కలిగించదు?"

❖ ❖ ❖

సర్గ-96

భరతుడు సైన్యంతో వస్తున్నాడని శ్రీరాముడికి చెప్పిన లక్ష్మణుడు

శ్రీరాముడిలా చిత్రకూటాన్ని, మందాకినీ నదిని గురించి చెప్తూ, పవిత్రమైన, తియ్యటి పక్వమైన మాంసాన్ని సీతకు చూపి తినమని చెప్తున్నప్పుడు ఆకాశం బద్దలయ్యే ధ్వని, దూళి ఆయనకు వినిపించింది-కనిపించింది. ఆ ధ్వనికి ఆ అడవిలోని జంతుసమూహాలు, పక్షులు, ఏనుగులు కలతచెందిభయంతో గందరగోళంగా నలుదిక్కుల పరుగెత్తాయి. ఇది చూసిన శ్రీరాముడు లక్ష్మణుడితో "లక్ష్మణా! ఎందుకీ నేలదుమ్ము ఆకాశాన్ని తాకుతున్నది? భయంకరమైన ధ్వని ఎందుకు వస్తున్నది? ఏనుగులు, అడవి దున్నపోతులు, మృగాలు దిక్కులకు పరుగెత్తుతున్నాయి. దీనికి కారణం...రాజెవరైనా వేటకొచ్చాడా? లేక ఘాతుక మృగం ఏదైనా అడవిలోకి వచ్చిందా? చూస్తుంటే, ఇక్కడ ఒక్క పక్షి అయినా కనపడకుండా ఎక్కడికో పోయాయి. దీని వాస్తవ కారణం ఏమిటో చూసి రా" అని అంటాడు. లక్ష్మణుడా మాటలు విని దూరంగా పోయి ఒక చెట్టెక్కి చూడగా ఉత్తరం వైపు నుండి తమవైపే వస్తున్న భయంకరమైన సైన్యమ కనిపించింది. పెద్ద రథాలు, ఏనుగులు, భటులతో కూడిన పెద్ద సైన్యాన్ని చూసిన లక్ష్మణుడు అక్కడినుండే శ్రీరాముడితో, "అన్నయ్యా! వెంటనే నిప్పు ఆర్పు. పొగ రానీయ వద్దు. నువ్వు విల్లు ఎక్కు పెట్టు. జానకిని గుహలోకి పంపు. కవచం తొడుక్కో. అన్నా పెద్ద గండం వచ్చింది" అని చెప్పాడు.

ఇది విన్న శ్రీరామచంద్రుడు లక్ష్మణుడితో ఆ సైన్యం ఎవరిదో చూడమంటాడు. జవాబుగా "కైక కొడుకు భరతుడు రాజ్యసంపదలన్నీ కైవసం చేసుకుని, అయోధ్యలో పట్టాభిషేకం చేసుకుని, శత్రుశేషం వుండకూడదన్న ఆలోచనతో మనల్ని చంపడానికి వస్తున్నాడు. అది భరతుడి సైన్యమే అనడానికి ఎత్తైన బోదె వున్న కోవిదార కేతనం ప్రకాశిస్తున్నది. ఆ సైన్యం భరతుడిదే! సందేహం లేదు. రౌతులు, మావటీలు, మనవైపే ఆయుధాలు దరించి గుర్రాల మీద, ఏనుగుల మీద ఎక్కి త్వరగా వస్తున్నారు. మనమిప్పుడు పదునైన

బాణాలను, విల్లు తీసుకుని కొండ ఎక్కుదామా? ఇక్కడే వుందామా? నువ్వే ఆలోచన చేయి, ఈ రోజు జరిగే యుద్ధంలో భరతుడు మనకు చిక్కుతాడు. నీకు, సీతకు, నాకు ఇలాంటి కష్టాన్ని కలిగించాడు. నిన్ను శాశ్వతంగా లక్ష్మి లేకుండా చేశాడు. మనసులో తాను మంచివాడిలా వుంటూ, దూరం నుండే తల్లితో ఇంత మోసం చేయించాడు. అలాంటి కైక కొడుకు మనకెలా స్నేహితుడవుతాడు? మనమీద దాడి చేయడానికి ఇక్కడిదాకా వచ్చాడు. కాబట్టి, భయంకర బాణం ప్రయోగం చేసి వాడి పౌరుషాన్ని బూడిద చేసి ఖండిస్తా. భరతుడిని చంపితే పాపం రాదు. ఎందుకంటే యితడు నిరపరాధి కాడు. ధర్మాన్ని వదిలాడు. కాబట్టి ఈ నీచుడిని చంపుతా. రాజ్యమంతా నువ్వే ఏలు. తన కొడుకు నా బాణాలతో నేలపడగానే రాజ్యం మీద ఆశపెట్టుకున్న కైక వాడిని ఏడ్చుకుంటూ చూడాలి. ఒకవేళ కైక కూడా చుట్టాల సహాయంతో యుద్ధానికి వస్తే ఆమెను కూడా చంపుదాం. అప్పుడు భూమి పాపహీనై శాశ్వతంగా బాగుపడుతుంది. నా కోపాన్ని శత్రు సమూహాల మీద చూపుతా. విరోధి సైన్యాన్నంతా చెండాడుతా” అని లక్ష్మణుడు అన్నతో అంటాడు.

❖ ❖ ❖

సర్గ-97

భరతుడి మీద కోపగించిన లక్ష్మణుడిని శాంతపర్చిన శ్రీరాముడు

ఇలా కోపంతో యుద్ధ ప్రయత్నంలో వున్నా లక్ష్మణుడి కోపాన్ని చల్లార్చే ప్రయత్నం చేశాడు శ్రీరాముడు. "సుమిత్రానందనా! మంచి మనసుగల భరతుడే స్వయంగా వస్తే మనకు బాణాలతో, కత్తులతో, విల్లుతో పనేంటి? తండ్రి సత్యవాక్య పాలనకొరకు, ఇక్కడ నన్ను చూడడానికి, వచ్చిన బుద్ధిమంతుడైన భరతుడిని చంపి, తండ్రి తన తమ్ముడికి ఇచ్చిన సొమ్ము అతడికి చెందకుండా చేయడానికి చేసిన వ్యక్తి శ్రీరాముడని నిందలపాలై ప్రభుత్వాన్ని పొందితే లాభం ఏంటి? నీకు కూడా ధనం ఇంత తీపా? యుద్ధంలో భరతుడిని నువ్వు చంపితే, అతడి రాజ్యాన్ని నేను తీసుకుంటానని అనుకుంటున్నావా? తండ్రి అతడికి ఇచ్చిన రాజ్యం అతడిదేకాని మనదెలా అవుతుంది? కాబట్టి నువ్వు భరతుడిని చంపినా నేను రాజ్యం తీసుకోను. భూమి, ధర్మం, అర్థం, కామం, మీకోసం నేను కోరుతున్నానే కాని వాటివల్ల నేను సుఖపడాలని కాదు. నా సుఖం కొరకు నేనేదీ కోరడం లేదు. రాజ్యం కూడా మీకొరకే. మీకేదైనా కీడు కలిగితే రాజ్యం ఎందుకు? సుఖమెందుకు? లక్ష్మణా! నేనే కావాలనుకుంటే సముద్ర పర్యంతం వున్న భూమండలంలోని సంపదంతా సాధించడం నాకు అసాధ్యం కాదు కదా! అసమర్థుడనై ఆశించడం లేదని కాదు. ధర్మం తప్పిన మార్గంలో ఇంద్రత్వం వచ్చినా నాకది వద్దు. అసమాన గుణసంపదగల భరతుడు, నువ్వు, శత్రుఘ్నుడు, మంచిగాలేని ఆ సుఖం అగ్నిహోత్రుడు భస్మం చేయాలిగాక!" అని అంటాడు లక్ష్మణుడితో.

భరతుడి రాక విషయంలో లకష్మణుడి అభిప్రాయం సరైంది కాదని శ్రీరామచంద్రమూర్తి తన అభిప్రాయాన్ని ఇలా చెప్పాడు లక్ష్మణుడితో: "భరతుడు మనమీదకు యుద్ధానికి వస్తున్నాడని భావించావు. నీ అభిప్రాయం సరైందికాదు. సోదర ప్రేమకల భరతుడు అయోధ్యకు వచ్చి, నేను నీతో, సీతతో కలిసి నారచీరెలు కట్టి అడవికి వచ్చానని తెలుసుకుని, మన వంశ

ధర్మమైన జ్యేష్ఠానువర్తనం అనుసరించి, వికలమైన మనసుతో స్నేహభావంతో నన్ను చూడడానికి వచ్చాడు. అలాంటప్పుడు సేనలెందుకు? అని అడగవచ్చు. నాకు రాజ్యం ఇవ్వడానికి సేనాసమేతంగా వచ్చాడు. భరతుడు మనల్ని చూడడానికి రావడం సరైన పని. రాకపోతే తప్పు. అతడు మనకు కీడు కలగాలని కలలో కూడా అనుకోడు. నువ్వు భరతుడిమీద కోప్పడడం సరైందేనా? ఆ పుణ్యాత్ముడు నీకెప్పుడైనా అప్రియకార్యం చేశాడా? ఎందుకు నువ్వు నిష్కారణంగా భయపడతావు? నీలాగా ఎప్పుడైనా ఇలాంటి మాటలన్నాడా? జరిగిందేదో జరిగింది. ఇక ముందైనా పెద్దవాడని గౌరవం లేకుండా ఇలా అతడిని అనవద్దు. అంటే, నువ్వనేది నన్నే అని భావిస్తా. ప్రాణతుల్యుడైన తోడబుట్టినవాడిని చంపే తమ్ముడుంటాడా? ఇలాంటి క్రూరమైన మాటలనడానికి నీ నాలుకెలా వప్పుకుంది? నీకు రాజ్యం మీద కాంక్ష వుంటే నీకివ్వమని చెప్పేనా? సరదాగా భరతుడిని నీకు రాజ్యం ఇవ్వమని మాటమాత్రంగా అంటే తథాస్తని అంగీకరిస్తాడు. ఎందుకంటే అతడికి భూమి మీద నీకున్న కాంక్ష లేదు".

శ్రీరాముడి మాటలకు లక్ష్మణుడు సిగ్గుపడ్డాడు. తనలో తానే బాధపడ్డాడు. మనల్ని చూడడానికి దశరథుడే వస్తున్నాడని అంటూ మాట మార్చే ప్రయత్నం చేశాడు. నిర్దోషి అయిన భరతుడిలో దోషం ఎంచానే అని సిగ్గుపడుతున్న లక్ష్మణుడిని చూసి శ్రీరామచంద్రుడు ఇలా అన్నాడు: "మనల్ని చూడడానికి దశరథుడు వస్తాడేమో? ఉరకే చూడడానికి ఇంత దూరం వస్తాడా? ఏమో? కాదు...మనల్ని ఇంటికి తీసుకుపోవడానికి వస్తాడేమో? అది కూడా కాకపోవచ్చు. మనకొరకు రాడు. సుకుమారి, సుఖార్హ సీతకోరకు దశరథుడు వస్తాడు. ఇది నిజం. మంచి జాతి గుర్రాలు రెండు, మన తండ్రి శత్రుంజయమనే పట్టపు ఏనుగు సేనకు ముందున్నాయి చూశావా? అయితే, ఎక్కడ వెతికినా మన తండ్రి ధరించే తెల్లగొడుగు కనపడడం లేదు. కాబట్టి తండ్రి విషయంలో నాకు అనుమానం కలుగుతున్నది. లక్ష్మణా! నేను చెప్పేది విను. నువ్వు చెట్టు దిగి రా". ఈ మాటలు విన్న లక్ష్మణుడు అన్న దగ్గరకు వచ్చాడు.

భరతుడు తన సేనను ఆశ్రమం సమీపంలోకి పోనీయకుండా కొండ కిందే నిలబెట్టాడు. ఆ సేన ఒకటిన్నర ఆమడ మేర ఆక్రమించుకుని వుంది. అలా సేననంతా ఒకచోట ఆపి, భరతుడు వినయంగా, పైన వున్నా ఉత్తరీయాన్ని నడుముకు చుట్టుకుని, చేతులు జోడించి బయల్దేరాడు.

❖ ❖ ❖

సర్గ-98

పాదచారిగా రామాశ్రమాన్ని వెదికిన భరతుడు

అన్నను చూడాలనే కోరికతో గురువైన వసిష్ఠుడు ఆజ్ఞ తీసుకుని, శత్రుఘ్నుడిని చూసి, కనపడుతున్న అడవిలో శ్రీరామచంద్రుడిని వెతకాలనీ, వాహనాల మీద పోరాదనీ, అందరూ కలిసి చుట్టుపక్కల వెతకమనీ అంటాడు. తమ్ముడితో భరతుడు, "మనతో మహాబలవంతుడైన గుహుడు తన బంధువులతో వస్తాడు. మంత్రులు, పౌరుల్లో ముఖ్యులు, గురువులు, పౌరజనులు నా వెంట వస్తారు. నేను శ్రీసీతారామలక్ష్మణులను చూసేదాకా నా మనసులోని ఆరాటం పోదు. వాళ్ళను కళ్లారా చూడాలి. చూసిందాకా నా మనసు శాంతించదు. రాజ చిహ్నాలైన వజ్రం, ధ్వజం, కమలం, పుష్పం, అంకుశం, అమృతకలశంతో లక్ష్మణుడితో కూడిన శ్రీరాముడి పాదపద్మాలను ఎప్పుడు కొలుతునో కదా? ఆయన పట్టాభిషిక్తుడై కిరీటం ధరించి సింహాసనం మీద కూర్చుని వుండగా, నేను ఆయన పాదాలను నా శిరస్సున వుంచి సేవించేదాకా నా మనసుకు శాంతి లేదు. మన తండ్రి, తాతలు పరిపాలించిన రాజ్యభారాన్ని తానూ రాజై మన అన్న పట్టాభిషేకం చేసుకోవడం నేను కళ్లారా చూసేవరకు నా మనసుకు శాంతి కలుగునా? సీతతో కూడిన శ్రీరామచంద్రుడి అందమైన ముఖాన్ని ఎల్లవేళలా ఒంటరిగా చూసి ఆనందించే లక్ష్మణుడు ఎంత సార్థక జన్ముడో కదా? ఆహా! సీతాదేవిది ఎంత సార్థక జన్మ? ఆమె ఎలాంటి పతివ్రతా రత్నం? ఎంత భాగ్యశాలి? తన భర్తతో ఎంత ప్రేమగా అడవులకు పోయిందో?"

ఇలా చెప్పి భరతుడు ఆ అడవిలో పాదచారియై పోతూ తనలో తాను శ్రీరాముడిని ఎలా ప్రార్థించబోతున్నదీ, ఆయనిచ్చే ప్రత్యుత్తరం ఎలా వుండవచ్చు, తానూ దానికి ఎలా జవాబివ్వాలి, లాంటి విషయాలను ఆలోచించసాగాడు. అలా ఆలోచిస్తూ ఒక కొండ దగ్గరకు పోగా అక్కడికి దగ్గరలో వున్న శ్రీరాముడి ఆశ్రమం నుండి పొగ అడుగు భాగం కనిపించింది. ఆ పొగ వచ్చే ప్రదేశంలో శ్రీరాముడున్న విషయాన్ని భరతుడు తెలుసుకుని సముద్రాన్ని ఈదేవాడు ఒడ్డుకు చేరిన విధంగా బంధువులతో కలిసి సంతోషించాడు.

❖ ❖ ❖

సర్గ-99

రామాశ్రమాన్ని చూసిన భరతుడు

అక్కడున్న వారు ఇదే రామాశ్రమమని భరతుడికి చెప్పారు. అక్కడే శ్రీరాముడు సీతాలక్ష్మణ సమేతుడై వున్నాడని తెలిపారు. గురుభక్తి కల భరతుడు వసిష్ఠుడితో తల్లులను పిలుచుకుని రమ్మని చెప్పి, గుహుడు తన వెంట రాగా రామాశ్రమం వైపు వెళ్లాడు. గురువు వచ్చేంతవరకు వేచి వుండలేదు. మునీశ్వరుల ఇండ్ల మధ్యన వున్న రామాశ్రమాన్ని శత్రుఘ్నుడికి చూపించి, తొందరగా పోయి, దూరంగా వున్న ఆకుల ఇంటిని-రాత్రి వుండే పర్ణశాలను, పగలుండే ఇంటిని బాగా చూశాడు భరతుడు. పర్ణశాల దగ్గర ఇంటిముందు దైవ పూజ కొరకు వున్నా పూల సమూహాలను, చీకటి పడినప్పుడు మంట వేయడానికి ఉపయోగించే విరిచి సిద్ధంగా వుంచిన కట్టెలను చూస్తూ పోయాడు భరతుడు. ఏటికి నీళ్ళకు, అడవికి కందమూలాలకు పోయి, మరలి ఆశ్రమానికి రావడానికి తోవ తెలుసుకునేందుకు, చెట్ల కొమ్మల్లో నారచీరెలు కట్టబడి వుండడం భరతుడు చూసి, అదే తోవలో తానూ, తనవారూ, పోవచ్చని భావించాడు.

చలి వేస్తే శరీరం వేడి చేసుకునేందుకు మంట చేసుకోవడానికి కావాల్సిన అడవి మృగాల, దున్నపోతుల ఎండిన పేడకళ్ల కుప్పలు చూసి ఆశ్రమం సమీపానికి వచ్చాం కదా అని సంతోషిస్తూ భరతుడు శత్రుఘ్నుడితో "మనకు భరద్వాజుడు గుర్తు చెప్పిన ప్రదేశం ఇదే అనిపిస్తున్నది. ఇక్కడికి దగ్గరలోనే మందాకిని నది వుండాలి. ఈ ప్రదేశంలోనే అన్న వున్నాడు. తమ్ముడా! చెట్ల మీద నార చీరెల పేలికలున్నాయి. ఇవి తోవ తెలుసుకోవడానికి లక్ష్మణుడు గుర్తుగా కట్టాడని అనుకోవచ్చు. ఈ దారిలోనే మనం కూడా పోదాం. పురుష శ్రేష్ఠుడు, నాకు అస్త్ర-శస్త్ర-మంత్రాలను నేర్పిన వాడు, పండిత శ్రేష్ఠుడైన శ్రీరామచంద్రుడిని మహర్షిలాగా ఇక్కడుండగానే, నేను సంతోషంగా చూస్తాను" అని అంటాడు.

ఇలా చెబుతూ, మరి కొంచెం దూరం పోయి, మందాకినీ నదిని చూసి భరతుడు శోకంతో కళ్ళ నుండి నీళ్లు కారుతుంటే వచ్చే వారితో ఇలా అంటాడు: "భూమికంతా అధిపతై, సీతకు భర్త అయినా, వీరాసనం మీద వున్నవాడై, ప్రకాశించే పురుష శ్రేష్ఠుడు, జనం లేని అడవిలో వున్నాడు. నేను ఇహంలో-పరంలో చెడి భూమ్మీద పుట్టడం ఎందుకు? పుట్టినా వెంటనే చావకుండా బతకడం ఎందుకు? అయ్యయ్యో! నా కొరకై సుఖాలన్నిటినీ వదిలి, ప్రపంచానికంతా అధిపతైన శ్రీరాముడు అడవుల పాలాయె. ఆ ముగ్గురి విషయంలో నేను అపరాధినే కాబట్టి మా అన్నకు, వదినకు, మొక్కడమే కాకుండా, లక్ష్మణుడికి కూడా మొక్కుతాను. ఆయన చిన్నవాడు కదా? మొక్కవచ్చా? అనవచ్చు. శ్రీరాముడి పాదాల మీద పడి నమస్కారం చేసి నన్ను క్షమించమని అడిగినప్పుడు, కైక చేసిన అపరాధం జ్ఞాపకానికి వచ్చి లక్ష్మణుడు నన్ను క్షమించవద్దని, క్షమించ తగినవాడు కాదని అంటే, అప్పుడు ఆయన్ను ప్రసన్నం చేసుకోడానికి ఆయనకు నమస్కరిస్తా. అలా చేయకపోతే నా వల్ల ఆయన పడే దుఃఖానికి ఎవరు బాధ్యులు?" ఇలా అనుకుంటూ కదిలి పోసాగాడు.

పోతూ... భోగవతీ పురంలాగా కనిపిస్తూ, తేజస్సుతో, సింహం వుండే గుహలాగా, ఈశాన్య మూల ఎత్తైన మండుతున్న అగ్నిహోత్రం కల వేదితో చాలా అందంగా వున్న శ్రీరాముడి పర్ణశాలను భరతుడు చూశాడు.

శ్రీ రాముడిని దర్శించిన భరతుడు

అన్నను చూడాలన్న నిండు కోరికతో వున్న భరతుడికి జడల గుంపుతో పర్ణశాలలో కూర్చున్న శ్రీరాముడు కనిపించాడు. ఆయన తన అన్నా? కాదా? అని సందేహంతో చూశాడు భరతుడు. చక్కగా చూడగా, సంతోషం కాని, కోపం కాని, బాధ కాని లేనివాడిని చూసి ఇతడే మా అన్న శ్రీరాముడు అని గుర్తించాడు. జింక చర్మం మీది వస్త్రంగా, నారచీరలు కట్టు వస్త్రాలుగా, అగ్నిహోత్రుడితో సమానంగా ప్రకాశిస్తూ, ఆసనం మీద కూర్చున్న ఆజానుబాహుడిని, పుండరీకాక్షుడిని, నాలుగు సముద్రాల మధ్యనున్న భూమికంతా ప్రభువును, సింహం మూపురంలాంటి మూపురాలు కలవాడిని,

ధర్మంమీద శాశ్వతమైన అనురాగం కలవాడిని, సీతాలక్ష్మణులతో దర్భాసనం మీద కూర్చున్న వాడిని, లోగడకంటే అధిక తేజస్సు కలవాడిని, శాశ్వత బ్రహ్మ లాగా వున్నవాడిని, శ్రీరాముడిని చూసి పరుగెత్తుకుంటూ సమీపంలోకి పోయాడు భరతుడు. పోయి, ఆయన్ను దగ్గరనుండి చూడగానే, శోకంతో కన్నీళ్లు వస్తుంటే, ఎదుటివారికి అర్థం అయి, కాని, మాటల్లో ఇలా చెప్పాడు:

"ఎత్తైన సింహపీఠం మీద ప్రజలందరూ స్తోత్రం చేస్తుంటే కొలువు కూటంలో వుండే మా అన్నేనా ఇప్పుడీ నేల మీద, అడవి మృగాలు పక్షులు కర్ణ కఠోరంగా అరుస్తుంటే, వింటున్నాడు? మా అన్నేనా ఇలా వున్నాడు? పూర్వం వెలకట్టలేని సన్నటి పట్టువస్త్రాలను ధరించిన వాడేనా ఇప్పుడీ జింక చర్మాన్ని ధరించాడు? పట్టణంలో నానా విధాలుగా సుఖపడాల్సిన కోమల దేహం కలవాడేనా ఇప్పుడు ఈ అడవుల్లో తిరిగేవాడు? ఘుమ-ఘుమ పరిమళించే పూలు శిరం మీద ధరించే సుందరుడేనా ఇప్పుడీ జడల భారం మోస్తున్నాడు? గంధం పూతలతో అందమైన దేహమేనా ఇప్పుడు మట్టిలో మునిగింది? అయ్యయ్యో! ఎంతో సుఖం అనుభంచే శ్రీరామచంద్రుడికి నా మూలంగా కదా ఇన్ని దుఃఖాలు కలిగాయి? ప్రపంచంలో ఇలాంటి అపకీర్తి తెచ్చుకున్న నేను బతకడం ఎందుకు? శాస్త్రం ప్రకారం సజ్జనులు మెచ్చుకునే విధంగా యజ్ఞాలు చేసి ధర్మాన్ని సంపాదించాల్సిన వాడా ఈ విధంగా అడవుల్లో తిరిగి దేహ శ్రమను సహించి వున్నాడు? ఋషుల మార్గాన ధర్మం ఆర్జించాల్సిన వాడు దేహ కష్టంతో కూటికి, నీళ్లకు మొహం వాచి, దుఃఖపడుతున్నాడే?"

ఇలా అంటూ, "అన్నా! అన్నా! అని నేలమీద పడిపోయాడు. అప్పుడు శత్రుఘ్నుడు ఏడ్చుకుంటూ పోయి శ్రీరాముడి పాదాలమీద పడిపోయాడు. శ్రీరాముడు భరత-శత్రుఘ్నులను పట్టుకుని ఎత్తి నిలువబెట్టాడు. వారి కన్నీళ్లను తుడిచాడు. కౌగలించుకున్నాడు. వారిని ఓదారుస్తూ మనస్తాపం తొలగించాడు. అప్పుడు సుమంత్రుడు, గుహుడు కూడా శ్రీరాముడి దగ్గరకు వచ్చారు. గురు శుక్రులతో కూడిన సూర్యచంద్రుల లాగా అన్నదమ్ములు శ్రీరామలక్షణులు కనిపించారు. వారిని చూసి ఆ అడవిలోని మనుష్యులు కూడా దుఃఖించారు.

❖ ❖ ❖

సర్గ-100

భరతుడిని కుశల ప్రశ్నలు వేసి ధర్మోపదేశం చేసిన శ్రీరాముడు

తండ్రికి ఎప్పుడైనా, ఎక్కడైనా మంచి పూల దండలు దొరికితే వాటిని మొదలు తన ప్రియురాలి కొడుకైనందున ముందుగా పిలచి బుజ్జగించి ప్రార్థిస్తేనే కాని వాటిని ధరించని వాడు ఇప్పుడు తలమీద జడలు ధరించి, తండ్రి ఎంత వేడుకున్నా బలవంతంగా కడితేనే కాని విలువైన బట్టలు కట్టని వాడు నారచీరెలు కట్టుకుని, తండ్రి ఎంత అడిగినా ఏదీ తీసుకోనివాడు, పూల పానుపు కూడా కఠినమనుకుని తండ్రి తొడలమీద పడుకునేవాడు, కష్ట దశలో, శుష్కించి వన్నె మాసిన వాడైన భరతుడిని చూసి అతి కష్టం మీద గుర్తు పట్టి, తన గారాబు తమ్ముడిని చేతుల్లో ఎత్తుకున్నాడు శ్రీరాముడు. ఎత్తుకుని, శిరం వాసన చూసి, తన తొడమీద కూర్చో పెట్టుకుని ఇలా కుశల ప్రశ్నలు వేశాడు.

"నువ్విలా ఇక్కడకు వచ్చావే? తండ్రి ఏమైనాడు? ఆయన బతికుండగానే నువ్వు కూడా నాలాగే ఆయన్ను దుఃఖపెట్టి ఇక్కడికి రాలేదుకదా? నిన్ను చూసి ఎన్నాళ్ళయిందిరా నాయనా! నిన్ను గుర్తుపట్టడమే కష్టమైంది కదా? నువ్విలా మనుష్యులు తిరగడానికి కష్టమైన అడవులకు ఎందుకు వచ్చావు? నువ్వు అడవులకు రావాల్సిన అవసరం ఏమిటి? తండ్రే నిన్ను పోయి రమ్మన్నాడా? లేక నేను లేని సమయం చూసి బలవంతులెవరైనా నీ రాజ్యాన్ని అపహరిస్తే నువ్విలా బయల్దేరి వచ్చావా? తండ్రి ఆజ్ఞప్రకారం నువ్వొచ్చావా? నువ్వు ఇక్కడికి రావడం తెల్సి తండ్రి బతికున్నాడు కదా? మరణించలేదు కదా? బాలుడవైననూ నువ్వు అందరికీ పూజ్యనీయుడవైనా, బలవంతులైన రాజులందరూ నిన్ను కోరుకున్నప్పటికీ, రాజ్యం నీ అసామర్థ్యం వల్ల బెదిరిపోయి వ్యాకులపడలేదు కదా? ప్రతిరోజూ మంచి మనసున్న రాజైన తండ్రిని పూజిస్తున్నావు కదా?"

"ప్రతిజ్ఞచేసి తప్పనివాడు, ఒక పని అనుకుని అదయ్యేవరకు మనసు చలించనివాడు, రాజసూయ యాగం, అశ్వమేథయాగం చేసినందువల్ల

సార్వభౌముడై, రాజశ్రేష్ఠుడని సార్థక నామధేయుడైన వాడు, పుణ్యాత్ముడు అయిన మన తండ్రి కుశలంగా వున్నాడు కదా? దశరథనందనా! ఇక్ష్వాకు వంశంలో పుట్టిన మనకు వంశపరంపరగా వచ్చినవాడు, సమస్త శాస్త్రాలు తెలిసిన పండితులలో శ్రేష్ఠుడు, వేదాధ్యయనం చేసి అర్థం తెలుసుకుని బ్రహ్మజ్ఞానం కలవాడు, వేదార్థం తెలుసుకుని అనుష్ఠానంలో వుంచుకోవడం వల్ల బ్రహ్మ వర్చస్సుతో ప్రకాశించేవాడు, మననశీలుల్లో శ్రేష్ఠుడు, జితేంద్రియుడు, అయిన వసిష్ఠుడు దశరథుడి కాలంలో లాగానే పూజించబడుతున్నాడా?"

"భరతా! నేను అడవులకు వచ్చినందువల్ల ఎక్కువగా దుఃఖపడడం చూసి కూడా విడిచి వచ్చిన నా తల్లి కౌసల్య, జ్యేష్ఠానువర్తనం అనే గొప్ప సాధుగుణం కలిగిన కొడుకులను కన్న సుమిత్ర శోకించడం ఆపు చేశారా? పూజ్యురాలైన నీ తల్లి రాజ్యప్రాప్తి వల్ల బాగా సంతోషపడుతున్నది కదా? కౌసల్యా సుమిత్రలు దుఃఖపడకుండా వుండేట్లు, కైక సంతోషంగా వుండేట్లు చూసుకుంటున్నావు కదా? భరతా! నీ పురోహితుడు గొప్ప బుద్ధికలవాడే కదా? ధనాశతో నీచకార్యాలు చేయడు కదా? సోమరితనంతో అశ్రద్ధగా కర్మ, మంత్ర, తంత్ర లోపాలు చేయడుకదా? నీ అగ్నిహోత్రాలు రక్షిస్తున్నాడు కదా? అగ్నిహోత్రం దగ్గరనుంచి అశ్వమేధం వరకు సకల వైదిక కర్మలు తెలిసినవాడే కదా? ఏకవిధమైన శ్రద్ధ, ఆచారం వున్నవాడే కదా? తానొకటి నమ్మి, నీకొకటి చెప్పడుకదా? త్రికరణశుద్ధి కలవాడేకదా? నీ ఎదుట ఒకవిధంగా చాటున మరో రకంగా వుండడు కదా? ఏఏ సమయాలలో ఏఏ హోమాలు చేయాలో అవన్నీ సకాలంలో చేస్తాడు కదా?"

"దేవతలను యజ్ఞాలతో తృప్తి కలిగిస్తున్నావు కదా? (ఈ నెల లోపలే యజ్ఞాలన్నీ చేశావు కదా? అన్న అర్థం లేదిక్కడ. రాజైనవాడు చేయాల్సినవి చేస్తున్నాడా? లేదా? అనే అర్థం) శ్రాద్ధాదులవల్ల పితృ దేవతలను తృప్తి పరుస్తున్నావా? ప్రజలను వాళ్లు చెప్పినట్లు విని సంతోషపరుస్తున్నావా? గురువులకు శుశ్రూష చేసి తృప్తి పరుస్తున్నావా? తండ్రితో సమానమైనవారిని ద్రవ్యదానాలిచ్చి, పెద్దలకు నమస్కారాలు చేసి తృప్తి పరుస్తున్నావా? విద్వాంసులను, ఆయుర్వేదం తెలిసిన వారిని, బ్రాహ్మణులను, ధనం ఇచ్చి

సంతోష పరుస్తున్నావా? అర్థశాస్త్రం, నీతిశాస్త్రం తెల్సిన శస్త్రాస్త్రజ్ఞానపూర్ణుడు, మన మేలుకోరేవాడు, సుధన్వుడు అనే పేరుగల ఉపాధ్యాయుడిని భక్తితో పూజిస్తున్నావా? నీ మంత్రులందరూ శౌర్యవంతులేకదా? గొప్ప కులంలో, గొప్ప వంశంలో పుట్టినవారేనా? నీతిశాస్త్రం చక్కగా చదివారా? బుద్ధిలో నీతో సమానమైనవారా? ఇంద్రియ నిగ్రహం వున్న వారేనా? ముఖం చూసి ఎదుటివారి అభిప్రాయం చెప్పగలరా? శాస్త్రాన్ని తెలిసిన మంత్రులు పని చేయడానికి ముందే నీ ఆలోచనలు బహిర్గతం చేయరు కదా?"

"నువ్వు నిద్రపోదామనుకున్నప్పుడు తప్ప ఎప్పుడు పడితే అప్పుడు నిద్ర రాదు కదా? నిద్రకు లోబడినవాడివి కాదు కదా? ఏ సమయంలో మేల్కొని వుండాలో అప్పుడు మేల్కొనే వుంటావుకదా? ఆలోచనలు చేసేటప్పుడు నిద్రపోవు కదా? అర్థరాత్రి లేచి ధనం గురించి ఆలోచన చేస్తావా? రహస్యాలను ఇతరులతో ఆలోచిస్తావా నువ్వు? ఒకడితోనే పంచుకుంటే వాడికి ఎవరనుకూలంగా వుంటే వారికి చెబుతాడు...... పదిమందితో పంచుకుంటే, వాళ్లలో ఒకరు కాకున్నా మరొకరు వేరే వారికి చెప్పొచ్చు.... భిన్నాభిప్రాయాలవారైతే ఒకరితో ఒకరు కలహించుకుంటారు. ఆలోచనకు ఆరు కళ్లు సమ్మతం అంటారు. నీ ఆలోచనలు ఏవిధంగా వున్నా, పనికి ముందే ఎవరికీ చెప్పవు కదా? నీతిశాస్త్రం ప్రకారం కార్యం చెడిపోయే విధంగా ఆలస్యం చేయవుకదా? నువ్వు ఆలోచించి నిర్ణయించిన కార్యక్రమం కావడానికి ముందే నీ సామంతరాజులకు ఆ విషయం తెలియదు కదా? అంతా అయిన తర్వాతే తెలుస్తుంది కదా? నువ్వు, నీ మంత్రులు చేసే ఆలోచనలు ఇతరులు తెలుసుకోలేరు కదా? వారు తెలుసుకునే అవకాశం మీరివ్వడం లేదుకదా? వేయిమంది మూర్ఖులకంటే కార్యం ఆలోచించి చేయగలవాడు ఒక్కడు చాలు. అలాంటి వారున్నారా నీ దగ్గర? జీతగాళ్ళను నియమించేటప్పుడు వారి యోగ్యతలను బట్టి నియమిస్తున్నావు కదా? యోగ్యత లేనివారిని యోగ్యులు చేయాల్సిన పనుల్లో నియమించడం లేదు కదా?"

"నీ మీద నిజమైన ప్రేమగలవారిని, అనేక పరీక్షల్లో నెగ్గినవారిని, ఆదినుండి వంశపరంపరగా సేవ చేస్తున్న వారిని, వాక్కు, మనసు, కర్మ మూడూ సత్యంగానే వుండేవారిని, ఏవిధమైన మాలిన్యం లేనివారిని, శ్రేష్ఠ కార్యాలలో శ్రేష్ఠులైన

వారినే మంత్రులుగా నియమిస్తున్నావు కదా? నిష్పక్షపాతంగా విచారించి నేరస్తులను శిక్షించకుండా నీకు భయపడి నువ్వు చెప్పిందే సరైందని నీ మంత్రులు అంగీకరిస్తారా? నువ్వు చేసిందే తప్పని నీకు భయపడకుండా చెబుతారా? నువ్వు ప్రజలను అన్యాయంగా, కఠినంగా దండించి, వారిని నొప్పించి, అవమానపరిచి బలాత్కరించి దానం సంపాదించడం లేదుకదా? భరతా! నీ దగ్గర, నిర్మలమైన మనసు లేనివారు, చెడు నీతిని బోధించేవారు, ఇతరులమీద పిర్యాదులు చేసేవారు, రాజభయం లేనివారు, ధనాశ వున్నవారు లేరుకదా? నీ సేనానాయకుడు సుగుణాల వాడే కదా? శూరుడేనా? ధైర్యం వున్నవాడేనా? మంచి కులంలో పుట్టినవాడేనా? త్రికరణశుద్ధి కలవాడేనా? రాజంటే ప్రేమ వున్న వాడేనా? నీ సేనలోని ముఖ్యులు బలవంతులేకదా? పరాక్రమవంతులే కదా? యుద్ధంలో సమర్థులేనా? అలాంటివారికి బహుమానాలిచ్చి నీ మీద వారికి ప్రేమ పెరిగేట్లు చేస్తున్నావా?"

"నియమితకాలంలో జీతభత్యాలిస్తున్నావా? ఆలస్యం చేయడం లేదుకదా? అలా చేయకపోతే విశ్వాసంతో పనిచేయరు. క్షత్రియ వంశంలో పుట్టిన ప్రధానులు ప్రేమగా నిన్ను చూసుకుంటున్నారా? యుద్ధంలో నీకోసం తమ ప్రాణాలివ్వడానికి సిద్ధపడేవారేనా? ఇతర దేశాలవారిని నువ్వు దూతలుగా నియమించావా? నీ దూత నీ దేశం వాడే అయి వుండాలి. వాడు ఎదుటివారి మాటలను బట్టి వారి అభిప్రాయం తెల్సుకోగాలగాలి. నువ్వు చెప్పిన మార్గంలోనే ఆలోచన చేయగలవాడై వుండాలి. కార్యసాధకుడై వుండాలి. ఏదో నెపం మీద పని చేయకుండా తప్పించుకునేవాడు కాకూడదు. ఎదుటివారి యుక్తి పసిగట్టి సమయోచితంగా నడచుకోవాలి. ప్రతిదానికీ రాజును అడిగి వస్తానని చెప్పేవాడు కాకూడదు. నీకు కార్యం సాధించడంలో ఆసక్తి వుంటే, ఇలాంటివారినే దూతలుగా పంపు".

"ఇతర రాజుల విషయంలో 18 మంది తీర్థులను నియమించావా?

(**18 మంది తీర్థులంటే:** మంత్రి - Minister – ఆలోచన చెప్పేవాడు; పురోహితుడు - Private Secretary; యువరాజు - Prince; సేనాపతి - Commander-in-Chief - సేనల కన్నిటికీ అధిపతి; దౌవారికుడు లేదా ద్వారపాలకుడు-

Gate Keeper - అంతఃపురంలాంటి వాటిదగ్గర వున్న ద్వారపాలకుల్లో మేటి; అంతర్వంశికుడు లేదా అంతఃపుర కార్యనిర్వాహకుడు- Palace Controller; కారాగారాధిపతి - Superintendent of Jails; అర్థ సంచయికుడు- Revenue Officer - Collector - ధనం సంపాదించేవాడు; కార్యనియోజకుడు – రాజాజ్ఞాలను వెల్లడించేవాడు; ప్రాడ్వివాకుడు - Judge - న్యాయ స్థానంలో న్యాయ విచారకర్త; సేనానాయకుడు – భటులకు జీతభత్యాలు ఇచ్చేవాడు; నగరాధ్యక్షుడు – రాత్రిపూట నగర ద్వార ప్రాకారాలలో ప్రహరీ తిరుగుతూ రక్షించేవాడు; కర్మాంతికుడు - Accountant General - పనులు చక్కబరుస్తున్న సైన్యేతర జీతగాళ్ళకు జీతాలు పంచిపెట్టేవాడు; సభ్యుడు – ప్రతిరోజూ సభను అలంకరించడం, రాజు, మంత్రి, ఇతర అధికారుల ఆసనాలు ఏర్పాటు చేయడం, సభలోకి అనుమతి ఉన్నవారిని రానీయడం, లేనివారిని నిరోధించడం, సభలో శబ్దం రాకుండా చూడడం, సభా రక్షకులను నియమించడం చేసేవాడు; ధర్మాధ్యక్షుడు - Munsif - ఇరుపక్షాల వాదనలు విని ధర్మశాస్త్రం ప్రకారం పరిష్కారం చెప్పేవాడు; దండపాణి లేదా దండపాలుడు - Magistrate జారులను, చోరులను ఇతర రకాల అపరాధం చేసిన వారిని దండించేవాడు; దుర్గపాలుడు – దుర్గాలను కాపాడేవారి మీద పై అధికారి; రాష్ట్రంతపాలుడు – రాష్ట్రాన్ని పరరాజులు ఆక్రమించకుండా పొలిమేరలను ఎల్లప్పుడూ కాపాడేవారి మీద అధికారి. వీరిలో మొదటి ముగ్గురు, అంటే మంత్రి, పురోహితుడు, యువరాజు స్వపక్షం వారు కాగా, మిగతావారు పరపక్షం వారు. వీరిమీద వేగులుండాల్సిన అవసరం లేదు. కారణం ఈ ముగ్గురూ ఎప్పుడూ రాజు సమక్షంలోనే వుంటారు కాబట్టి).

"స్వపక్షాన్ని వదిలి, పరపక్షంలో వున్న పదిహేను మంది విషయంలో, వారి నడవడి గురించి ఒక్కొక్కరికి ముగ్గురు–ముగ్గురు చొప్పున వేగులను నియమించావా? వారు వేగులని వారిలో వారికి కాని, ఇతరులకు కాని, ఆ పదిహేను మందికి కాని తెలియకుండా నియమించావా? శత్రువైనప్పటికీ పొగరు వదిలిన తరువాత బలహీనుడని వాడిని అవమానించ కూడదు. అలానే చేస్తున్నావా? బలహీనుడని ఎక్కువ చనువీయకూడదు. వాస్తవానికి గర్వం పోయి వచ్చాడో, లేక, ఎవరో ఒకరి సహాయంతో, మోసబుద్ధితో వచ్చాడో తెలుసుకోవాలి. కాబట్టి జాగ్రత్తగా వుండాలి. ఒకసారి దెబ్బతిన్నవాడు బలహీనుడే

కదా అనుకుని అలక్ష్య దృష్టితో చూడరాదు. యుద్ధానికి పోయేటప్పుడు తగిన సన్నాహంతోనే పోవాలి. సందర్భం విచారించకుండా గర్వంతో పోకూడదు".

"బ్రాహ్మణులు కదా అని నాస్తికవాదులైన చార్వాకులను, బౌద్ధులు లాంటివారిని ఏ సమయంలో కూడా గౌరవించడం లేదుకదా? వాళ్లను చేరదీస్తే ఈ లోకానికి, పరలోకానికి వాళ్లు కీడు చేస్తారు. వారి మనసులు యదార్థానికి విరుద్ధంగా విపరీతార్థాలు చెప్తాయి. వాళ్లు పండితులు కాకపోయినా తమను తాము పండితులమని అనుకుని సర్వజ్ఞత్వం తమ మీద వేసుకుని, విపరీత బుద్ధులు నేర్పుతూ, తమను నమ్మినవారిని ఉభయ లోకాల్లో చెడగొడతారు. సత్సంప్రదాయపరంగా చదవాల్సినవి చదవకుండా, ధర్మశాస్త్రాలను విపరీత బుద్ధితో వక్రభాష్యం చెబుతూ, నిస్సారమైన, నిరర్ధకమైన తర్క, యుక్తి వాదాలు చేసుకుంటూ వుండే చార్వాకులతో స్నేహం కీడు కలిగిస్తుంది".

"దృఢమైన వాకిళ్లు కలిగి, ఏనుగులు, గుర్రాలు, రథాలతో ప్రకాశిస్తూ, ఉత్సాహవంతులు, జితేంద్రియులు, సద్గుణ సంపత్తి కలవారు, వర్ణాశ్రమ ధర్మాలను అనుసరించి పనిచేసే బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు, పండిత జనులు, అనేక రకాలైన మేడలు-మిద్దెలు, వీరులు, పెద్దలు....వీరంతా ధర్మ పద్ధతిన రక్షిస్తున్న మన నగరం అయోధ్య, శత్రువులకు అసాధ్యంగా దాని పేరు సార్థకం చేసుకుంటున్నదా? ఆ నగరాన్ని ప్రీతితో పాలిస్తున్నావా? నాయనా! మన దేశంలో ఇంతవరకు, 'ఈ రాజులు మంచివారు... ధర్మంగా పాలిస్తారు... దేశం మంచిది..... రోగబాధలు లేవు.....' అనుకుంటూ ప్రజలు స్థిరంగా కాపురాలు చేస్తున్నారు. ఇక్కడ ఒక్కో స్థలంలో అనేక మహాయాగాలు చేశారు. ప్రతి గ్రామంలో దేవాలయాలున్నాయి. దప్పికగొన్న బాటసారులకు నీళ్లు ఇవ్వడానికీ చలి పందిళ్లున్నాయి. తటాకాలు, కొలనులు వున్నాయి. పుణ్య పురుషులు, పుణ్య స్త్రీలు ఎప్పుడూ సంతోషంగా వుంటారిక్కడ. సభామందిరాలలో ఉత్సవాలు జరుగుతుంటాయి. బీడు భూములు లేనే లేవు. ఆవుల, మేకల, పశువుల మందలకు పశుగ్రాసం కొరత లేదు. ప్రజలలో ఒకరివల్ల మరొకరికి బాధ లేదు. వరిపైరు పండడానికి వానను నమ్మి ఆకాశం వైపు చూడాల్సిన పనిలేదు. క్రూరమృగాలు లేవు. ప్రజలందరూ స్నేహభావంతో ఐకమత్యంగా

వుంటారు. వారికేవిధమైన భయం లేదు. బంగారు, వెండి, రత్నాల గనులెన్నో ఉన్నాయిక్కడ. ఇలాంటి మన దేశం సుఖంగా వుందా?"

"భూమి దున్ని జీవించేవారి విషయంలో, పశువులను మేపి జీవించేవారి విషయంలో, వారు కష్ట జీవులైనందున వారికి కావాల్సిన పదార్థాలకు సంబంధించి సహాయం చేస్తున్నావా? ప్రజలు తమ ఆహార పదార్థాల విషయంలో వీరిమీదే ఆధారపడ్డారు. అలాగే వాణిజ్యంలో జీవిస్తూ నిన్ను ఆశ్రయించే వారికి శుభమే కదా? వారికి నీ వల్ల కాని, ఇతరుల వల్ల కాని, ఇబ్బంది లేదు కదా? కృషి, గోరక్షణ, వాణిజ్యం చేసేవారికి రాజు సహాయం అత్యంత అవశ్యం కాబట్టి, వారికి కావలసిన సహాయం చేస్తూ, వారి బాధలు తీరుస్తున్నావా? రాజైన వాడు సమస్త వర్ణాశ్రమధర్మాల వారిని శాస్త్రప్రకారం రక్షించాలి. అలా చేస్తున్నావు కదా? నిన్ను ఆశ్రయించి వున్నా స్త్రీలను గౌరవిస్తున్నావు కదా? వారికి పరపురుష సంబంధ బాధ లేకుండా రక్షిస్తున్నావా? ఏకాంతంలో కూడా నువ్వు వారికి రహస్యాలు చెప్పడం లేదు కదా? ఎందుకంటే వాళ్లు చపల చిత్తులు కాబట్టి రహస్యాలను దాచలేరు". (స్త్రీలు భాగ్యవతులు, పు ణ్యవతులు, గృహదీపాలు, గృహస్తుడిపాలిటి లక్ష్ములు, పూజనీయులు కాబట్టి వారిని విశేషించి రక్షించాలి కాని నమ్మరాదు)

"ఏనుగు లుండే అడవులను రక్షిస్తున్నావు కదా? నువ్వు రక్షించకపోతే ఇతరులు ఏనుగులను పట్టుకుపోతారు. మగ ఏనుగులను పట్టడానికి ఆడ ఏనుగులను రక్షిస్తున్నావు కదా? నా కిన్ని ఏనుగులు, గుర్రాలున్నాయికదా అని తృప్తి చెందక ఆడ, మగ ఏనుగులను, గుర్రాలను సంపాదించుకుంటున్నావు కదా? ప్రతిరోజూ సభలో ఉదయాన ప్రజలకు దర్శనం ఇస్తున్నావు కదా? కొన్ని రోజులు సభకు రాకపోతే నీకేదో రోగం వచ్చిందని ప్రజలు సందేహిస్తారు. సేవకులు ఇష్టానుసారంగా వచ్చి-పోతుంటే అతిపరిచయం వల్ల నిన్ను చులకనగా చూస్తారు. అందుకే వాళ్లను అసలే చూడకుండా వుండకూడదు..... అలాగే... ఎప్పుడో ఒకసారి చూసి వారి స్థితిగతులు విచారించాలి. తమ్ముడా! నీ జలదుర్గాలు, గిరిదుర్గాలు, వనదుర్గాలు అన్నీ ధనధాన్యాలతో, జలాలతో, ఆయుధాలతో కూడి వున్నాయి కదా? వీరులైన భటులు, విలుకాళ్లు రక్షిస్తున్నారు కదా? పనులు చేయడానికి శిల్పులున్నారు కదా?"

"వ్యయం కంటే మించి ఆదాయం వుంది కదా? ఆదాయంకంటే తక్కువగానే వ్యయం చేస్తున్నావు కదా? అయోగ్యులకు అనవసరంగా ధన సహాయం చేయడం (అపాత్రదానం) లేదు కదా? యోధముఖ్యులకు, అతిథులకు, బ్రాహ్మణులకు, స్నేహితులకు కావాల్సిన ధనం ఇస్తున్నావా? వీరికివ్వడం సత్పాత్ర వినియోగమే. దేవతా కార్యాలు, పితృ కార్యాలు, చేసేవారికి ధన సహాయం చేస్తున్నావా? అన్ని కార్యాలు మనమే చేయలేం కాబట్టి పుణ్యకార్యాలు చేసేవారికి సహాయం చేస్తే మనకూ పుణ్యం వస్తుంది. మంచివాడు పొరపాటున దొంగతనం చేస్తే వారిని శిక్షించకూడదు.....వాస్తవంగా దొంగతనం చేస్తే వాడు శిక్షార్హుడు. ధనవంతుడికి, పేదవాడికి తగాదా వచ్చినప్పుడు నీ మంత్రులు కుటిలబుద్ధితో ధనికుడికి మద్దతివ్వకుండా జాగ్రత్త పడాలి. నేరం చేసినవాడిని వదిలిపెట్టడం వల్ల కలిగే పాపం కంటే నేరం చేయనివాడిని దండించడం వల్ల కలిగే పాపం ఎక్కువ అని తెలుసా?"

"గురువులకు, వృద్ధులకు, తాపసులకు, బ్రాహ్మణులకు, నాలుగు వీధులు కలిసే ప్రదేశంలో వున్న దేవతల్లాంటి చెట్లకు, అతిథులకు, మోక్షలాభం సిద్ధించినవారికి, దేవతలకు, భక్తితో, నిర్మల మనసుతో నమస్కారం చేస్తున్నావా? ధనం కోసం ధర్మాన్ని వ్యర్థం చేయడం లేదుకదా? ధర్మం చేయాల్సిన సమయంలో ధనం ఎలా సంపాదించాలా అని ఆలోచిస్తూ ధర్మం చేయకుండా వుంటున్నావా? అలాగే ధనం సంపాదించాల్సిన సమయంలో ధర్మ విచారం చేస్తూ కాలయాపన చేయవద్దు. రాత్రి అనుభవించాల్సిన కామాన్ని పగలు చేయడం తప్పు. ధర్మ, అర్థ, కామాలను ఏవేళకు ఏది చేయాలో అదే చేయాలి. ధనం మీది ఆశతో లోభివై ధర్మకార్యాలు చేయడం మానలేదుకడా? కేవలం ధర్మం కోసమే కుటుంబ పోషణకు కావాల్సిన ధనం కూడా సంపాదించడం లేదా? సుఖాబిలాషతో ధర్మ, అర్థాలను ధ్వంసం చేయడం లేదుకదా?"

"సకల శాస్త్రాలలో సామర్థ్యంగల పండితులైన బ్రాహ్మణులు, పురజనులతో, బయటి వూరివారితో కలిసి, మారాజు సుఖంగా, దీర్ఘాయువుగా జీవించాలని ప్రార్థన చేసేట్లు వారికి సంతోషం కలిగే విధంగా ధర్మ పద్ధతిన రాజ్యపాలన చేస్తున్నావుకదా? నీ కోసం ప్రార్థన చేయమని ఆజ్ఞాపించి చేయించడం లేదుకదా?"

"అసత్యం పలకడం, దేవుడు లేదనడం, పని చేయకుండా ఎప్పుడూ ఆలోచనే చేస్తూ కాలం గడపడం, కోపం రానివారి మీద కోపం తెచ్చుకోకూడని సమయంలో కోపగించుకోవడం, బుద్ధిపొరపాటు, బుద్ధిమాంద్యం, శ్రేయస్కరమైన జ్ఞానుల దర్శనం మనం పోయి చేసుకోక పోయినా వారొచ్చినప్పుడు కూడా చేయకపోవడం, పంచేంద్రియాలకు లోబడి వుండడం, రాచకార్యాలను ఒక్కడే ఆలోచన చేయడం, నీచులను గౌరవించడం లేదా ఒకే సమయంలో అనేకమంది శత్రువులమీద దండెత్తడం, నిర్ణయించబడిన పని చేయక పోవడం, అనర్థజ్ఞులతో కలిసి ఆలోచన చేయడం, ఆలోచనలను దాచుకోకుండా బయట పెట్టడం, శుభకార్యాలలో నిర్లక్ష్య భావం.......ఈ పద్నాలుగు దోషాలు రాజుకు వుండకూడదు. ఇవి లేకుండా రాజ్యం చేస్తున్నావు కదా?"

"దశవర్గం, పంచవర్గం, చతుర్వర్గం, అష్టవర్గం, త్రివర్గం, విద్యాత్రయం అనే వాటి లక్షణాలు తెల్సుకుని, వాటిలో ఏవి అవసరమో, ఏవి కావో ఆలోచించి, అలాగే ఆచరిస్తున్నావా? ఇంద్రియాలను చక్కగా వశపర్చుకున్నావా? దైవ వ్యసనాల గురించి, మానుష్య వ్యసనాల గురించి, కృత్యం గురించి, ప్రకృతి, మండలం, వింశతి వర్గాలు, షడ్గుణాలలో ముఖ్యమైన సంధి-విగ్రహం-యాత్ర-దండం గురించి, ఆలోచించి వాటిని విడిచి, గ్రహించాల్సిన వాటిని గ్రహిస్తున్నావా?"

"ఆలోచించి చేయాల్సిన పనులను ముగ్గురికి తక్కువ కాకుండా, నలుగురికి ఎక్కువ కాకుండా, అది కూడా మొదట ఒక్కొక్కరితో వేర్వేరుగా, తర్వాత అందరిని కలిపి ఒక్కటిగా, ఆలోచిస్తున్నావా? ఆలోచించి వారి అభిప్రాయాలను అర్థం చేసుకుంటున్నావా? ఆ తరువాత వారు చెప్పినదాంట్లో మంచి-చెడు నువ్వు స్వతంత్రంగా ఆలోచన చేస్తున్నావా? ఇద్దరితోనే కలిసి ఆలోచన చేస్తే, వారిరువురు వేరేవేరే అభిప్రాయం చెప్తే ఏం చేయాలనే సందిగ్ధం కలగొచ్చు. ముగ్గురైతే ఇద్దరు ఒక విధంగా, ఒకరు వేరే విధంగా చెప్తే ఎక్కువమంది అభిప్రాయం ప్రకారం నిర్ణయం తీసుకోవచ్చు. అప్పుడూ సందేహం వస్తే నాలుగో వ్యక్తీ అభిప్రాయం తీసుకోవచ్చు. అంతకన్నా ఎక్కువైతే, ఐకమత్యం కుదరక వారిలో వారు కలహించుకునే ప్రమాదం వుంది. రహస్యం చెడిపోవచ్చు.

రహస్య విషయాలు ఎక్కువ మందితో ఆలోచన చేయరాదు. కొందరు సలహా అడిగినప్పుడు, వారితో ఆలోచన చేసినప్పుడు, ఒంటరిగా ఒక విధంగా, నలుగురిలో మరో విధంగా చెప్తారు. అలాంటి వారి సలహాలు నమ్మకూడదు. ఎవరెన్ని చెప్పినా విని స్వయంగా ఆలోచించి తన మనసును సమాదానపర్చుకుని సరైన విధంగా నిర్ణయం తీసుకోవాలి"

"ధనం కలిమికి ఫలం. తాను భుజించి ఒకరికి ఇవ్వాలి. తను తిన్నది ఇహలోక ఫలం. ఒకరికి ఇస్తే పరలోక ఫలం.... పరజన్మఫలదం. కాబట్టి లోభిగా నువ్వు తినకుండా, పరులకు ఇవ్వకుండా వుండవద్దు. వ్యర్థమై పోకూడదు. తమ్ముడా! నేను నీకు చెప్పినవన్నీ ధర్మార్థ కామాలతో కూడినవి. ఇహ–పరలోక సుఖం కలిగించేవి. మోక్షార్థికి కావాల్సిన దీర్ఘాయువు ఇచ్చేవి. కాబట్టి వీటన్నిటినీ నిర్మలమైన మనసుతో నువ్వు ఆచరిస్తున్నావా? మన తండ్రి–తాతలు ఏప్రకారమైతే ఉభయలోక శ్రేయస్కరమైన నడవడితో ఎలా నడిచారో అలాగే నువ్వు కూడా సుభ చర్యలో నడుస్తున్నావుకదా? ధర్మార్థ కామాలలో ధర్మానికే ప్రాధాన్యం ఇస్తున్నావుకదా? స్నేహభావంతో నీ మేలుకోరే వారికి అక్కరకు అవసరమైనవి ఇచ్చి సంతోషపెట్టున్నావు కదా? రాజైనవాడు ధర్మ మార్గాన నడుచుకుంటూ ప్రజలను పాలిస్తే మరణించిన తరువాత స్వర్గానికి పోయి అక్కడ దివ్యభోగాలను అనుభవిస్తాడు. ధర్మ మార్గంలో పాలించకపోతే ప్రజలు చేసే పాపానికి రాజైన వాడు నరకానికి పోతాడు. కాబట్టి ధర్మ మార్గంలో పాలిస్తూ, ప్రజలు కూడా ధర్మంగా వుండేట్లు చేయాలి. ఎలాంటి సందర్భంలోనైనా, ప్రాణాపాయ స్థితిలో కూడా ధర్మాన్ని విడువకూడదు. ధర్మం శాశ్వతం".

❖ ❖ ❖

సర్గ-101

దశరథుడు మరణించిన సంగతి శ్రీరాముడికి చెప్పిన భరతుడు

శ్రీరాముడు చెప్పిన మాటలన్నీ విన్న భరతుడు, "అన్నా! నువ్వు చెప్పిన రాజధర్మాలన్నీ ఆచరించడం ధర్మాత్ములకు సాధ్యమవుతాయి కాని, రాజ్యాన్నే అధర్మ మార్గాన సంపాదించిన నాకెలా సాధ్యపడుతుంది? నాలాంటి ధర్మహీనుడా నువ్వు చెప్పే రాజధర్మాలను ఆచరించేవాడు? రాజధర్మ రక్షణకు నువ్వే సమర్థుడవు కాని నేను కాను. నువ్వు అనుగ్రహిస్తే నేను దాస ధర్మరక్షణ సమర్థుడను అవుతా. అన్నా! మన జాతిలో, ముఖ్యంగా మన వంశంలో, అనాదిగా ఒక ధర్మం వుంది. అది నీకు తెలుసుకదా? అదేంటంటే పెద్దవాడు జీవించి వుండగా చిన్నవాడు రాజ్యభారం పూనకూడదు. కాబట్టి మనోహరమైన అయోధ్యకు నువ్వు నావెంట వచ్చి సంతోషంగా పట్టాభిషేకం చేసుకో. నీ ఈ ధర్మాన్ని నువ్వు నిర్వహించకపోతే, స్వధర్మాన్ని నిర్వహించని నువ్వు, పరధర్మాన్ని నిర్వహించమని నాకెలా చెప్తావు? స్వధర్మనిష్ఠుడు కదా ధర్మోపదేశాదికారి?" అని శ్రీరాముడిని అడిగాడు. ఇంకా ఇలా అన్నాడు భరతుడు శ్రీరాముడితో:

"నా అభిప్రాయంలో నువ్వు సాక్షాత్తూ దేవుడివే! శ్రీమన్నారాయణుడివే! కాబట్టి, మనుష్యమాత్రుడవైనా నీవే రాజ్యాన్ని భరించాల్సిందై వుండగా, సాక్షాత్తు దేవుడివైన నువ్వు భరించాల్సిన దానిని దాసుడైన నేనెలా భరించగలను? నేను కేకయరాజు ఇంట్లో వుండగా నువ్వు సీతాలక్ష్మణులతో అడవులకు వచ్చినందువల్ల నిన్ను ఎడబాసిన దుఃఖంలో మన తండ్రి మరణించాడు. నువ్వు, లక్ష్మణుడు తండ్రికి తిలోదకాలివ్వండి.....నేను, శత్రుఘ్నుడు ఆ కార్యం చేశాం. మేం చేసి ప్రయోజనం లేదు. మీరు చేయాలి. ఎందుకంతే మరణించినవారికి ప్రీతిపాత్రులు నీళ్లు విడిస్తే సంతోషం కాని, ప్రీతిపాత్రులు విడిస్తే కాదు. నేను విడిచిన నీళ్లు తనకు చెందరాదని పదిమందిలో తండ్రి చెప్పాడట. కాబట్టి, మేం లోక ధర్మాన్ని అనుసరించి చేసినా ప్రయోజనం లేదు. నువ్వు తండ్రికి ప్రియుడివి. నువ్వు నీళ్లు విడిస్తేనే ఆయనకు ఊర్ధ్వగతులుంటాయి. కాబట్టి

నీళ్లు విడువు. అన్నా! నీ తండ్రి నిన్ను తలచుకుంటూ ఏడ్చి-ఏడ్చి నిన్ను చూడాలనుకుని, అది కుదరనందున, నీ మీదే మనసుంచి, దానిని మళ్లించుకోలేక, నువ్వు వెళ్లిపోయిన కారణాన నీ వియోగంతో రామా! రామా! అని నిన్నే స్మరిస్తూ చనిపోయాడు".

❖ ❖ ❖

సర్గ-102

తండ్రి మరణ వార్త విని దుఃఖించిన శ్రీరాముడు

తన కోసమే తండ్రి మరణించాడన్న వార్తను పిడిగుపడినట్లు భరతుడు చెప్పగా విన్న శ్రీరాముడు మూర్ఛపోయాడు. సొమ్మసిల్లి పడిపోయిన శ్రీరాముడి శయిత్యోపచారాలకు, భరతుడు, లక్ష్మణుడు, సీతాదేవి చల్లటి నీటితో ఆయన శరీరాన్ని తడిపారు. అలాచేయగా శ్రీరాముడు తేరుకుని దుఃఖపడ్డాడు. కళ్ళ వెంట నీళ్లు కారుతుంటే భరతుడితో, "అయోధ్యకు రమ్మంటున్నావే? తండ్రి లేని అయోధ్యకు నేనెందుకు రావాలి? రాజ్యభారం వహించుటకంటావా? దశరథుడు పాలించిన అయోధ్యను, ఆయన మోసిన భారాన్ని మరెవ్వరైనా మోయగల సమర్థులున్నారా? ఆదిశేషుడు మోసే భూభారాన్ని ఆయన తప్ప మరెవ్వరైనా మోయగలరా? నామీద ఎంతో ప్రేమ వున్న నా తండ్రికి పితృ కర్మ చేసి, ఇన్ని నీళ్లు విడువలేక పోతిని కదా? భరతా! నువ్వు శత్రుఘ్నుడితో కలిసి జనకుడికి చేయాల్సిన పరలోక హిత కృత్యాలన్నీ చక్కగా చేసి పుత్రత్వాన్ని సార్థక పరచుకున్నారు. లక్ష్మణుడితో అలా చేసే భాగ్యం నాకు లేకపోయిందికదా? పరలోకానికి పోయి, పరాదీనంలో వున్నవారికి సహాయపడి ప్రేతత్వం తొలగించి స్వర్గస్థులను చేయడం పరమ పుణ్య కార్యం కదా?" అని అన్నాడు. ఇంకా ఇలా అన్నాడు:

"భరతా! తండ్రి ఆజ్ఞ ప్రకారం పద్నాలుగు సంవత్సరాలు వనవాసం చేసి తండ్రిని సేవించడానికి అయోధ్యకు వద్దామనుకున్నా. అలాంటి భాగ్యం నాకు లేదే? దశరథుడు మరణించడం వల్ల ప్రజలు దుఃఖపడుతున్నారన్నావు. అలాంటి చోటుకు నేను రాలేను. తండ్రిని చంపిన నేను ఏమని అయోధ్యకు వస్తా? వనవాసం పద్నాలుగు సంవత్సరాలు చేస్తానని వ్రతం పూనాను. అది భగ్నపరిచి అపకీర్తి తెచ్చుకోవడం పాపకార్యం కదా? ఆ వ్రతం పూర్తిచేసి నువ్వు కోరినవిధంగా అయోధ్యకు వచ్చినా ఏం ప్రయోజనం? నాకక్కడ ఎవరు దిక్కు? మంచి-చెడులు చెప్పేవారేవ్వారు? తండ్రి లేదు కదా? భరతా! నువ్వే ఒకరికి మంచి-చెడులు చెప్పేవాడివని నన్ను అంటావేమో? మంచి మాటలు వినే భాగ్యం లేనిచోటుకు ఎందుకు రావాలి?"

హా! అని ఏడుస్తూ సీతవైపు తిరిగాడు శ్రీరాముడు. సీత దిక్కులేనిదైపోయిందని అన్నాడు. ఇక ఎవరిని మామా! అని నోరారా పిలుస్తావని అడిగాడు. లక్ష్మణుడిని తండ్రి లేనివాడివి అయిపోయావన్నాడు. ఇలా శ్రీరాముడు దుఃఖ పడుతుంటే, భరత, లక్ష్మణ, శత్రుఘ్నులు తమ తండ్రిని తలచుకుని దుఃఖంతో బాధపడ్డారు. తండ్రి మరణ వార్తకంటే శ్రీరాముడి బాధాకరమైన మాటలు ఎక్కువ దుఃఖం కలిగించాయి వారికి. అన్నను తండ్రికి నీళ్లు విడవమని చెప్పారు. దుఃఖంతో సీత భర్తను చూడలేక పోయింది. అప్పుడు సీతను, తమ్ముడు లక్ష్మణుడిని, శ్రీరాముడు సమాదానపరిచి తండ్రికి నీళ్లు విడువబోతున్నానని చెప్పాడు. లక్ష్మణుడితో:

"లక్ష్మణా! నార వస్త్రాలు పిండు. ముందు సీతను పోనివ్వు. ఆమె వెనుక నువ్వు రా. నీ వెనుక నేను వస్తా" అన్నాడు. సుమంత్రుడు వీరందరినీ ఓదార్చాడు. సీతారామలక్ష్మణులు మందాకినీ నదిని సమీపించి, మనోహర తీర్థానికి ఎదురుగా నిలబడి, దశరథుడిని మనసులో స్మరించుకుంటూ తర్పణాలు వదిలారు. అప్పుడు శ్రీరాముడు దోసిట్లో నీళ్లు తీసుకుని దక్షిణ దిక్కుగా తిరిగి దుఃఖం పొంగిపోతుంటే తండ్రిని ఉద్దేశించి ఇలా అన్నాడు.

తండ్రికి పిండప్రదానం చేసిన రామలక్ష్మణులు

"తండ్రీ! నేనిచ్చే ఈ నిర్మల జలం పితృలోకానికి పోయిన నీకు అక్కడ శాశ్వత సుఖాన్నివ్వాలి". ఇలా లక్ష్మణుడితో కలిసి నీళ్లు విడిచి ఒడ్డుకొచ్చి వేరే స్థలంలో పిండాలు పెట్టడానికి దర్భలు పరిచారు. వాటిమీద శ్రీరామచంద్రుడు రేగుపండ్లు, గారపిండి కలిపి పిండాలు చేసి, దర్భలమీద వుంచి, తండ్రిని స్మరించి, కళ్ళ వెంట నీళ్లు కారుతుంటే పిండాలను చూసుకుంటూ ఇలా అన్నాడు: "పురుషుడికి ఏది ఆహారమో అతడి దేవతలకు కూడా అదే విడవాలి కాబట్టి రాజా! నామీద ప్రేమతో మాకు అన్నమైన ఈ పిండిని తిను". (దీనివల్ల శ్రీరాముడి నిత్యాహారం ఫలమూలాలే కాని మాంసం కాదని అర్థమవుతున్నది).

ఈ విధంగా చేయాల్సిన పనులన్నీ చేసి కొండ ఎక్కి, పర్ణశాలకు పోయి, భరతలక్ష్మణులను కౌగలించుకుని "హా!" అని ఏడ్చాడు. వారు కూడా

ఏడ్చారు. వారి ఏడుపు ధ్వనికి పర్వతం నుండి ప్రతిధ్వని వచ్చింది. ఇది విన్న భరతుడి సేనలు రామాశ్రమం వైపు ధ్వని జాడ పట్టుకుని పరుగెత్తారు.

శ్రీరాముడి పర్ణశాలకు పోయిన పౌరులు

పౌరులు, సైనికులు, పెద్దలు, చిన్నలు, ఎవరికి తోచిన విధంగా వారు నడిచో, గుర్రాలమీదో, రథాలమీదో శ్రీరాముడి పర్ణశాల దిక్కుగా పోయారు. కేవలం నెల క్రితమే తమను వదిలిపోయిన శ్రీరాముడిని చూడక ఎన్నాళ్లో అయినట్లు ముఖం వాచిపోయిన విధంగా వేగంగా ఆశ్రమం వైపు పరుగెత్తారు. అన్నదమ్ముల కలయికను సంతోషంగా చూడాలన్న కోరికతో పౌరులు పోతుంటే, వారి వెంట పోయే వాహనాల ధ్వని మేఘాల ఉరుముల ధ్వనిని స్మరణకు తెచ్చింది. చుట్టుపక్కలున్న మృగాలు, ఇతర జంతువులు, పశు-పక్ష్యాదులు గడగడ అదురుతూ పరుగెత్తాయి ఆ ధ్వనికి. ఈ నేపథ్యంలో, తండ్రి మరణానికి బాధపడుతున్న, శ్రీరాముడిని పౌరులు చూశారు. కైక వలన శ్రీరాముడికి ఈ కష్టం వచ్చింది కదా! అనుకుంటూ, ఆమెను తిట్టూ, శ్రీరాముడిని ఎగా-దిగా చూశారు. వచ్చినవారినందరినీ చూసిన శ్రీరాముడు, తనకంటే పెద్దవారిని, పూజ్యులను, తండ్రిని-తల్లిని కౌగలించుకున్నట్లు కౌగలించుకున్నాడు. కొందరు శ్రీరాముడిని కౌగలించుకున్నారు. మీద-మీద పడి నమస్కరించారు మరికొందరు. బంధు-మిత్రులను వారి-వారి యోగ్యతలను బట్టి ప్రేమగా పలకరించాడు శ్రీరాముడు. ఆయన్ను చూడడానికి వచ్చినవారి రోదన ధ్వనులు భూమ్యాకాశాలను నిండాయి....ప్రతిధ్వనులు వచ్చాయి.

❖ ❖ ❖

సర్గ-103

శ్రీరాముడి ఏటినీటి రేవును సుమిత్రకు చూపించి దుఃఖించిన కౌసల్య

మగవారందరూ ముందుగా వచ్చి శ్రీరాముడిని దర్శించుకున్నారు. దశరథుడి భార్యలను పిల్చుకుని వసిష్ఠుడు కాలినడకన శ్రీరాముడిని చూస్తున్నానన్న సంతోషంతో వస్తుంటే, మార్గమధ్యంలో శోకతప్తులైన సుకుమారులు రాజు భార్యలతో మెల్లగా చెప్పాడిలా:

"అమ్మలారా! రాజ్యం నుండి పంపివేయబడి, దిక్కులేనివారైన రామలక్ష్మణులు నీటికోసం నిత్యం వచ్చి-పోయే రేవు ఇదే. నాకెలా తెలుసంటారా? ఇవిగో...వారి రాక-పోకల అడుగుల జాడ కలిగి, అడుగుల తొక్కిడితో నలిగిన నేల. ఇతర మనుష్య సంచారం లేని ప్రదేశం కాబట్టి ఇవి వారి అడుగులే".

సుమిత్రను చూసి కౌసల్య ఇలా అన్నది" సుమిత్రా! రామలక్ష్మణులకు వచ్చిన కష్టాన్ని చూశావా? నాకొడుకు కోసం నీ కొడుకు ఇక్కడినుండి ప్రతిరోజూ ప్రేమతో, జాగ్రత్తగా, నీళ్లు తీసుకుని పోతున్నాడు. నా పాపం నాతో పోకుండా నీకు కూడా చుట్టుకుంది. ఇలా నీళ్లు తీసుకుపోవడం రాజకుమారులకు నీచకర్మే! కాదనను కాని, ఈ కారణం వల్ల, నీ కొడుకును నీచకార్యం చేస్తున్నాడని లోకం నిందించదు. కూటికొరకు ఒకరిదగ్గర కొలువుండి నీళ్లు మోయడం నీచకార్యమే కాని, ప్రతిఫలాపేక్ష లేకుండా, ప్రేమతో, కర్తవ్యమనే భావనతో, ఉపకారబుద్ధితో పెద్దల సేవ చేయడం పరమ పురుషార్థ సాధనమని లక్ష్మణుడు అన్నకు సేవ చేస్తున్నాడు. అలాంటివాడిని ఎవరు నిందిస్తారు? వాస్తవానికి పొగుడుతారు. ఎందుకంటే, జ్ఞానం, భక్తీ కలిగి ధర్మ బుద్ధితో కష్ట సమయంలో మానాభిమానాలు ఎంచక సవతి తల్లి కొడుకన్న ఆలోచన చేయక, లోకంలో ఇలా చేసేవారేవరైనా వున్నారా? ఇలా చేయడం ఈ సుగుణ ధన్యుడికే చెల్లుతుంది కాని ఇతరులకు కాదు. శ్రీరాముడిని మరల అయోధ్యకు తీసుకుపోవాలన్న భరతుడి కోరిక నెరవేరుతేలక్ష్మణుడికి ఇక ఈ కష్టం వుండదు కదా?".

ఇలా చెప్పిన కౌసల్య, దక్షిణ భాగాన దర్భల మీద శ్రీరాముడు పెట్టిన గారపిండి పిండాలను సవతులకు చూపించింది. శాస్త్రప్రకారం శ్రీరాముడు తండ్రికి పిండప్రదానం చేశాడని చెప్పింది. జీవితకాలంలో తన కొడుకు శ్రీరాముడు వేలు కూడా వేసి తాకని గారపిండితో తండ్రికి పిండాలు పెట్టినందుకు తన గుండె రాతిది కాబట్టే చలించలేదని కౌసల్య బాధపడ్తుంది.

శ్రీరాముడిని చూసిన కౌసల్య-ఇతరులు

ఇలా దుఃఖపడుతున్న కౌసల్యను చూసి సవతులు గతించిన దానికి దుఃఖపడవద్దనీ, భరతుడు ఎలాగైనా శ్రీరామలక్ష్మణులను అయోధ్యకు తీసుకుపోతాడనీ, అందరం పోయి వేడుకుంటే శ్రీరాముడు అయోధ్యకు వస్తాడనీ, ఆమెను సమాదానపరుస్తారు. ఇలా మాట్లాడుకుంటూ ఆశ్రమానికి వస్తారు. అక్కడ శ్రీరాముడిని చూసి వారందరూ గొల్లున ఏడ్చారు. శ్రీరాముడు కూడా తల్లులను చూసి చివాలున ఆసనం మీదనుంచి లేచి వారి పాదాల మీద పడి నమస్కారం చేశాడు. తల్లులందరూ శ్రీరాముడి వీపు నిమురుతూ అలా వుండిపోయారు కాసేపు. తల్లులను చూసిన లక్ష్మణుడు సాష్టాంగ నమస్కారం చేశాడు. సీతాదేవి కూడా అత్తగార్లకు నమస్కరించింది. తల్లులామెను కౌగలించుకున్నారు. కౌసల్య సీతతో, “అమ్మా! నువ్వు జనకరాజు కూతురివి, దశరథ మహారాజు కోడలివి, రామచంద్రుడి భార్యవు. అలాంటి గొప్పదానివి, గొప్ప ఇంట్లో పుట్టి, గొప్ప ఇల్లు మెట్టి, ఇలాంటి గొప్పవాడిని చేపట్టిన సుకుమారివి, ఉత్తమ రాజకంయవు, ఏవిధంగా ఈ అడవుల్లో కష్టపడుతున్నావమ్మా!” అని అంటుంది.

ఇలా తన తల్లి కౌసల్య దుఃఖపడుతుంటే శ్రీరాముడు వసిష్ఠుడికి నమస్కారం చేశాడు. ఆయనతో కూర్చున్నాడు. వారిరువురు కూర్చున్న తరువాత భరతుడు కూర్చున్నాడు. ప్రజలందరూ భరతుడు శ్రీరాముడితో ఏం మాట్లాడుతాడో విందామని చెవులు విప్పి వినసాగారు. పౌరులతో శ్రీరామభరతలక్ష్మణులు యజ్ఞశాలలోని త్రేతాగ్నుల లాగా ప్రకాశించారు.

❖ ❖ ❖

సర్గ-104

భరతుడి రాకకు కారణమడిగిన శ్రీరాముడు

భరతుడు తనను అయోధ్యకు పిలుచుకుని పోవడానికే జడలు ధరించి వచ్చాడని గ్రహించిన శ్రీరాముడు, అతడిని కౌగలించుకుని, లక్షణ సమేతంగా ఇలా అడిగాడు: "ఇదేంటి భరతా! నీ గురించి నువ్వే చెప్తే వినాలని మనసవుతున్నది. రాజ్యభారం మోయాల్సినవాడివి ఈ అరణ్యానికి ఎందుకొచ్చావు? వేటకొచ్చావా? అలా అయితే ఈ జడలెందుకు? ఈ కృష్ణాజినం ఎందుకు? ఈ నారచీరెలు కట్టుకోవడానికి కారణం ఏమిటి? ఎందుకని నువ్వు రాజ్యాన్ని వదిలి వచ్చావు?".

జవాబుగా భరతుడు చేతులు జోడించుకుని, "అన్నా! చేయరాని చెడ్డ పని చేసి మిమ్మల్ని వదిలి రాజు పుత్రశోకంతో మరణించాడు. ఇది తండ్రి చేసిన తప్పుకు ప్రథమ ప్రతిఫలం. గొప్ప విషయాలలో స్త్రీలతో ఆలోచన చేయకూడదన్న ధర్మసూక్తిని మరిచి నా ఆతల్లి చెప్పినట్లు విని తన కీర్తిని నాశనం చేసుకున్నాడు. ఇది రెండవ ప్రతిఫలం. ఇంత ఘోరపాపం చేసిన నా తల్లికి ప్రథమ ఫలంగా ఆమె కోరిన రాజ్యం లభించలేదు. రెండవ ఫలంగా విధవై ఏడుస్తు ఘోర నరకాన పడ్డది. ఇక నా గతి, ఏపాపం తెలియకపోయినా, కైక కడుపున పుట్టిన కారణాన రాజ్యం కోసం తల్లిమూలాన అన్నను అడవిపాలు చేశాడన్న నిందతో చనిపోవడం. తండ్రి, తల్లి చేసిన పనిని సవరించడం ఇప్పుడు వీలుకాదు. నేను నీ దాసుడిని. నామీద అనుగ్రహం చూపి నామీద నిష్కారణంగా పడ్డ అపకీర్తిని తొలగిపోయేట్లు నీ రాజ్యాన్ని నువ్వే తీసుకో. ఇది నా కోరిక. దీనికోసమే నేను వచ్చాను. నీ దాసుడనైన నేను, స్వామియైన నువ్వు జడలు ధరించి నారచీరెలు కట్టి అడవిలో వుంటే, రాజ్య చిహ్నాలు ధరించి సింహాసనంపైన కూర్చొని నగరవాసిని అవుతా? దాస్యం నా పని. స్వామిత్వం నీ పని. నా పని నేను చేస్తా....నీ పని నువ్వు చేయి" అంటాడు.

ఇంకా ఇలా అంటాడు: "ఈ ప్రార్థన నా ఒక్కడిదేకాదు. ఈ ఉద్దేశంతోనే మంత్రులు, అమాత్యులు, పౌరులు, సామంతులు, మన తల్లులు, అందరూ

నిన్ను చూడడానికి వచ్చారు. వారి ముఖాలు చూడు. వారి అభిప్రాయం తెలుస్తుంది. మా తప్పులు మన్నించి మామీద కరుణ చూపు. నేనేం తప్పుచేసానంటావా? నా తప్పు నాకు తెలసు. పెద్దవాడుండగా చిన్నవాడు రాజైన ఉదాహరణలు లేవా అని అడుగుతావేమో? పెద్దవాడు దుష్టుడో, అంధుడో, పతితుడో, కుష్ఠ రోగో, అయితే అప్పుడు చిన్నవాడు రాజు కావచ్చు. నీలో ఎలాంటి దోషం లేదు. రాజ్యభారం వహించడానికి అన్ని విధాలా సమర్థుడివి. కాబట్టి నువ్వే రాజై అందరినీ సంతోషపెట్టు. అన్నా! నేను నీకు తమ్ముడిని, శిష్యుడిని, దాసుడిని. అందరు మంత్రులతో యోగ్యమైన విధంగా నీకు సాష్టాంగ నమస్కారం చేస్తున్నా. నా మీద దయ చూపు. వీరందరూ నువ్వు అయోధ్యలో వున్నప్పుడు రాజుపై గౌరవంతో, భయం-భక్తితో నీకు దూరంగా వున్నారు. ఇప్పుడు బిడ్డల్లాగా నీ దగ్గరికి వచ్చారు. వీరంతా రాజపూజ్యులు. వంశపరంపరగా మన అయోధ్యలోనే వుండి, మన మేలే తమ మేలనుకుని, మన కష్టమే తమ కష్టమనుకుని వుంటున్నారు. వీరంతా మన తండ్రికి ముఖ్యులు కాబట్టి మనకు తండ్రిలాంటివారు. నీకు వారిమీద నిజమైన ప్రేమ వుందని వారి నమ్మకం. నువ్వు వారి ప్రార్థన (ఇది ఆజ్ఞ కాదు) అతిక్రమించకూడదు. సవతి కొడుకన్న కారణాన నా ప్రార్థన నిరాకరించినా వీరి ప్రార్థనను ఎలా నిరాకరిస్తావు?"

భరతుడితో అతడు నిర్దోషి అని చెప్పిన శ్రీరాముడు

తన పాదాలమీద పడ్డ తమ్ముడు భరతుడిని లేవనెత్తి, కౌగిట్లో చేర్చుకుని, శ్రీరాముడిలా అన్నాడు: "తమ్ముడా! నీలాంటివాడిలా చేయవచ్చా? నువ్వే ఇలా చేస్తే జ్ఞానం లేనివారేమంటారు? సహజమైన గొప్ప కులంలో పుట్టి, సత్వగుణం కలిగి, స్వపౌరుషసాధ్యమైన మహావ్రతనిష్ఠ తేజస్సున్న నువ్వు, భూమికోసం, అన్న కోసం ఇంత పాపం చేయడానికి ఆలోచనచేయడం ఎలా సాధ్యం? నువ్వు చేయాలనుకున్నా పాపం చేయలేవు. సత్వగుణం అతిశయిస్తే తమో-రజో గుణాలకు నిలువనీడ లేదు. కైక నందనా! నీలో ఏవిధమైన అపరాధం లేదని, అలా చేయడం నీకు సాధ్యపడదని నాకు తెలసు. కాబట్టి నీ విషయంలో నేను నిన్ను తప్పుపట్టుతున్నానని అనుకోవద్దు. నువ్వు పిల్లతనంతో తల్లిని తిడుతున్నావు.

ఆమె నీ మేలు కోరి చేసిందా? కీడు కోరిందా? నీమీద ప్రేమతోనే కదా అలా చేసింది? ప్రేమతో పని చేస్తే దూషించవచ్చా? తల్లి చేయరాని పని ఏంచేసింది? లోకంలో పెళ్ళాం–పిల్లల కోసం ప్రేమతో ఇష్టం వచ్చినట్లు చేసేవారు లేరా? ఇష్ట ప్రాప్తి–అనిష్ట నివారణ, ఈ రెండూ, ప్రతి జంతువూ కోరుకునేవే కదా? ఇష్ట ప్రాప్తికోసం కొడుకైన నీకు రాజ్యం కావాలనుకుంది. అనిష్ట పరిహారానికి నన్ను అడవులకు పొమ్మంది. అంతేకాని నా మీద పగ లేదు. ఒకవేళ నా మీద ద్వేషభావమే వుంటే నన్ను చంపని అనేదికదా? కాబట్టి కార్యసాధనకొరకు ఎంత చేయాలో అంతే చేసింది కాని అంతకు మించి ఏమీ చేయలేదు. కాబట్టి ఆమెను దూషించడం నీకు తగదు".

"నువ్వు సాత్వికుడివి, సాదువువి కదా? సాధువులు చెప్పిన విధంగా మన తండ్రి విషయంలో మనం ప్రవర్తించాలా? వద్దా? అలా ప్రవర్తించడం న్యాయమే కదా? తండ్రికి కొడుకుల విషయంలో పెట్టడానికి, కొట్టడానికి అధికారం వుందా? లేదా? పెట్టడానికి అధికారం వున్న తండ్రికి కొట్టే అధికారం వుందికదా? తండ్రి చెప్పింది ఇష్టమైతే చేసి, కష్టమైతే చేయనివాడు కొడుకేలా అవుతాడు? కాబట్టి నన్ను రాజ్యభారం వహించి సుఖించమనకుండా, కృష్ణాజినాలు ధరించి అడవికి పొమ్మంటే, నేను పోనంటే, కొడుకేలా అవుతాను? నన్ను ఆమాత్రం ఆజ్ఞాపించే అధికారం ఆయనకు లేదా? తండ్రి చెప్పిన మాట వినేవాడే పుత్రుడు కాని ఇతరులు ఎలా అవుతారు? అలాగే, తండ్రిని మనం ఎలా గౌరవిస్తామో, తండ్రికంటే పదింతలు తల్లిని గౌరవించాలి కదా? తల్లి–తండ్రి, ఇరువురు మనకు పూజనీయులే అయినప్పుడు, ఇరువురూ ఒకే మాటగా నన్ను అరణ్యానికి పొమ్మని ఆజ్ఞాపించినప్పుడు నేను తిరస్కరించడం న్యాయమా?"

"రాజ్యభారం మోయలేనంటున్నావు భరతా! అలా అయితే నీకొక ఉపాయం చెప్తా విను. దానివల్ల నీకు భారం తగ్గుతుంది. తండ్రి వాక్యాన్ని మనం ఇరువురం పాలించినట్లవుతుంది. నువ్వు రాజ్యాన్ని, జనపదాలను, నగరాలను, అయోధ్యలోనుండి విచారించు. నేను అడవుల్లో నారచీరెలు కట్టి, జింక చర్మం ధరించి, ఏభయం లేకుండా ధర్మాధర్మాలు విచారిస్తా. ఈ విభజన

నేను చేసిందికాదు. లోకానికంతా తెలిసే విధంగా మనకు దాయాది భాగం పంచి తండ్రి స్వర్గానికి పోయాడు. చిన్నవాడైన నీ భాగాన్ని పెద్దవాడైన నేను తీసుకోవడం ధర్మమా? భరతా! నువ్వే చెప్పు. మన తండ్రి ప్రజలందరికీ గురువు. ధర్మయుక్తమైన మనసున్నవాడు. నువ్వు చిన్నవాడివి కాబట్టి సుఖభాగం నీకిచ్చి, పెద్దవాడైన నాకు కష్ట భాగం ఇచ్చాడు. నాకిచ్చిన భాగాన్ని నేను సంతోషంగా స్వీకరించా. నీకిచ్చిన భాగాన్ని నువ్వలా చేయకుండా పెనుగులాడడం నీకు తగునా? ఆయన మాట లోకానికంతా ప్రమాణమైనప్పుడు నీకు కాదా? నీ భాగం నీ ఇష్టం. నాకు తండ్రి ఇచ్చింది వనవాస భాగం. దానిని పద్నాలుగు సంవత్సరాలు అడవిలోనే వుండిఅనుభవించి ముగించాలి. ఇదే ఆయనకు, నాకు గొప్ప హితమైన కార్యమని నా భావన. ఉభయలోక పూజ్యుడైన తండ్రి ఏం చెప్పాడో అది చేయడమే నాకు శ్రేయస్కరం. అది కాదని, సర్వ ప్రపంచ ప్రభుత్వం లభించినా, నాకు సంతోషం కలిగించలేదు.

❖ ❖ ❖

సర్గ-105

శ్రీరాముడిని రాజ్యం తీసుకొమ్మని ప్రార్థించిన భరతుడు

శ్రీరామభరతులు కలుసుకున్న నాటి రాత్రి ఆ ఇద్దరూ ఏడ్పులు- ఓర్పులతో కాలం గడిపారు. ఉదయం కాగానే వారిరువురు మందాకినీ నదిలో స్నానం చేసి, సంధ్యాది కాలకృత్యాలు తీర్చుకున్నారు. భరతుడు, ఆయన మంత్రులు, శ్రీరాముడిని సేవిస్తూ ఆయన పక్కనే వున్న సమయంలో చాలాసేపు నిశ్శబ్దం ఆవరించిందక్కడ. ఆ తరువాత కొంతసేపటికి అన్నాను చూసి భరతుడు ప్రేమతో, భక్తితో, గౌరవంతో, ఇలా అన్నాడు:

"తల్లిదండ్రులు కోరిన విధంగా నువ్వు అడవులకు వచ్చానంటున్నావు. చనిపోయిన ఆయన అనుమతి మళ్లీ నేనిప్పుడు తేలేను. ఆయన నీకిచ్చిన ఆజ్ఞ నా తల్లి బలాత్కారంవల్ల అయింది కాని స్వబుద్ధిపూర్వకంగా కాలేదు. బలాత్కారంగా ఇచ్చిన సమ్మతి, సమ్మతికాదని మనువు చెప్పలేదా? వాస్తవం నీకు తెలుసు. ఈ అనర్థానికి కారణం నా తల్లి. ఆమె ఇక్కడే వుంది. ఆమె చేసింది తప్పని నేను ఆమెకు బుద్ధి చెప్పా. ఆమె నువ్వు మళ్లీ అయోధ్యకు రావడానికి అంగీకరించింది. రాజ్యం నాకు దత్తం అన్నావు. అది మోసంగా, అన్యాయంగా, నాకు లభించింది. అలాంటిది నాకెందుకు? ఏదో విధంగా నాదేనంటావా.... విస్తారమైన, ఐశ్వర్యంతో కూడిన ఈ భూమంతా నీకివ్వడానికి పనికట్టుకుని ఇక్కడికి వచ్చా. కాబట్టి నువ్వు నామీద దయ వుంచి, నిష్కటంక రాజ్యమంతా తీసుకో. అలా అయితే నేను కృతార్థుడిని అవుతా. నేను నీకు దానమీయడానికి రాలేదు. నా సొమ్ము నువ్వు తీసుకో అని చెప్పడం లేదు. తండ్రి నాకు ఇచ్చిన రాజ్యం నన్నే ఏలుకొమ్మని నువ్వంటున్నావు కాని, అది నాదే అయినా, దాసుడి సొమ్ము గురువులాగా, నువ్వు నా స్వామివలె తీసుకొమ్మంటున్నా. వాస్తవానికి రాజ్యం నాదికాదు. రాజ్యం, మేం...అందరమూ నీ వాళ్లమే. నీది నిన్ను తీసుకొమ్మంటున్నాను కాని నాది కాదు. కాబట్టి కులధర్మ హాని లేదిక్కడ". భరతుడు ఇంకా ఇలా అన్నాడు:

"వానాకాలంలో కట్ట తెంచుకుని వచ్చే ప్రవాహంలా, ప్రజలు, నేను అన్యాయంగా రాజైనానని నామీద విపరీతమైన కోపంతో వున్నారు. వారలా చేయడం న్యాయమే! ఇలాంటి సంకట సమయంలో నువ్వు తప్ప వారిని శాంతింప చేయగల సమర్థుడు మరెవరూ లేరు. అన్నా! నువ్విక్కడ ఒంటరిగా వుండి ఎవరికి ఏం మేలు చేస్తావు? గృహస్థాశ్రమమం తప్ప తక్కినవన్నీ పరాధీనపు బతుకులే. గృహస్థుడుగా వుండడానికి అసమర్థుడే సన్యాసి లేదా వనవాసి అవుతాడు. ఇక్కడ నీ ఇంటికి ఏ అతిథి వస్తాడు? ఏ అభ్యాగతి వస్తాడు? వచ్చినా ఎంతమంది వస్తారు? వచ్చినవారికి ఏం పెట్టావు? కాబట్టి గృహస్థ ధర్మాన్ని అవలంబించి పాలించు. రామచంద్రా! నువ్వు మాకందరికీ రక్షకుడివి. మేం నీకు భృత్యులం. మమ్మల్ని నువ్వు కాపాడకపోతే ఎవరు కాపాడుతారు? నిన్ను దశరథుడు కని, పెంచి పెద్ద చేసింది, నువ్వు ప్రజలను రక్షించి తనకు కీర్తి తెస్తావని కదా? అలాగే నువ్వు గొప్పవాడివయ్యావు. ఇతరులకు ఆరాధ్యుడివి అయ్యావు. దశరథుడు చెట్టు పెట్టాడు. నువ్వు మహావృక్షానివి అయ్యావు. మాలాంటివారు మరుగుజ్జులు. నువ్వు పట్టాభిషేకానికి అంగీకరించడం చెట్టు పూయడం లాంటిది.....రాజ్యం ఏలకుండడం చెట్టు గొడ్డుపోవడం, ఫలహీనం కావడం లాంటిది. అలాంటి చెట్టును చూసి చెట్టు పెట్టిన వాడు ఎలా సంతోషపడుతాడు? ఈ చెట్టు గొప్ప వృక్షం అవుతున్నది... ఫలిస్తుంది... తిందామని వేచి చూసే చిలుకలు, పక్షులు, మనుష్యులు, ఏవిధంగా సంతోషిస్తారు? నీ శక్తి సామర్థ్యాలు, నీ సుగుణ సంపత్తి, ప్రజల్లో ప్రకాశించాలా? లేదా, అడవిగాచిన వెన్నెల్లాగా ఈ చెట్లలో, మృగాలలో ప్రకాశించాలా?"

"రాజ్య సింహాసనం అధిష్టించిన నిన్ను శత్రువులను అణచివేసే సూర్యుడిలాగా ప్రజలు భావిస్తారు. ఇప్పుడు రాజులేని కారణాన దేశం శోకాంధకారంలో మునిగిపోయింది. నువ్వు అయోధ్యకు ప్రయాణమైతే సంతోషించే వారు నీ రాజ్యపాలనా సామర్థ్యం, శత్రు సంహారక శక్తి తెలిసిన పురుషులు మాత్రమే కాదు. ఏనుగులు నీవెంట ఘీంకారం చేసుకుంటూ నడుస్తాయి. అంతఃపుర స్త్రీలు సంతోషిస్తారు. అలాంటి సహజ స్నేహభావం కలవారిని దుఃఖపరచడం నీకు న్యాయమా?"

ఇలా భరతుడు శ్రీరాముడిని వినయంగా ప్రార్థిస్తున్న వ్యవహారం చూసిన పౌరులు భరతుడిని శ్లాఘించారు. ఓదార్పు మాటలతో శ్రీరాముడు తమ్ముడిని ఇలా సమాధాన పర్చాడు.

భరతుడికి దుఃఖోప శాంతి మాటలను చెప్పిన శ్రీరాముడు

"తమ్ముడా! నా వనవాసానికి కైక, దశరథుడు కారణమని నువ్వంటున్నావు. కార్య నిర్వహణలో పురుషుడే స్వతంత్ర కర్త అన్నట్లు నీ మాటల్లో అర్థం అవుతున్నది. ఆ అభిప్రాయం సరైంది కాదు. పురుషుడు తన ఇష్టానుసారం లోకంలో సంచరించే స్వాతంత్ర్యం కలవాడా? కాదు. అట్లయిన స్వతంత్రుడు ఎవరు? ఎవరికి పురుషుడు పరతంత్రుడు అంటావా? దైవం పురుషుడిని ఈ పక్కకు, ఆ పక్కకు లాగి బాధిస్తుంది. పురుషుడే స్వతంత్రుడు అయితే ఎప్పుడూ అతడు తన శ్రేయస్సు కోరుకుంటూ, తనకు ఏహాని రాకుండా చేసుకోవచ్చు కదా? సంపాదించిన ధనం ఎంత కాపాడినా నాశనమవుతుంది. పెరిగినవన్నీ విరుగుతాయి. కల్సినవారందరు విడిపోతారు. ధననష్టం, మరణం, వియోగం, విలయం ఎవరైనా కోరుకుంటాడా? ప్రయత్నిస్తాడా? ఎందుకిలా అవుతున్నాయి? వీటన్నిటికీ పురుష ప్రయత్నం చాలక కాదు....దైవమే కారణం. పండిన పండు ఎల్లకాలం అలాగే వుండదు. నేలబడక తప్పదు. అలాగే భూమ్మీద పుట్టిన మనుష్యుడు ఎంత కాలం జీవించినా ఏనాడో ఒకనాడు చావక తప్పదు. దీనికి కారణం పురుషకారం చాలక కాదు....భగవదాత్మకమైన కాలమే కారణం"

"ఎంత బలమైన స్తంబాలు వేసి ఇల్లు కట్టినా, కాలాంతరాన క్రమక్రమంగా అది అందం చెడిపోయి కూలిపోతుంది. అలాగే, ఎంతటి పురుషుడైనా కాలక్రమాన ముసలివాడై మరణిస్తాడు. దీనికి పురుషకారం చాలకపోవడమే కారణమంటావా? గడిచిన రాత్రి మరలిరాదు. అలాగే సముద్రంలో కలిసిన యమునానది మళ్లీ యమునగా వెనక్కి రాదు. అలాగే పోయినవాడు మళ్లీ తిరిగిరాడు. సముద్రంలో కల్సిన యమున, యమునగా రాదుకాని ఆ నీళ్లు సూర్యరశ్మికి ఆవిరై, మేఘమై, వర్షమై, మళ్లీ ప్రవాహంలో కలిసిపోవచ్చుకదా? ఎండాకాలంలో సూర్యుడు తన వేడి కిరణాలతో నీళ్లను పీల్చినట్లే రేయి-పగలు అనేవి పోయి-పోయి, జీవజంతువుల ఆయువును హరిస్తున్నాయి. కాబట్టి,

ఆయువు ఇలా వ్యర్థమై పోతున్నదే? అని నీకొరకు ఏడువు......అంతే కాని ఇతరులకొరకు ఏడ్చిన లాభం ఏమిటి? తమ్ముడా! ఆయువు శాశ్వతమా? ఆయువు శాశ్వతం కాదు...పోయిన నిమిషం మళ్లా రాదు. కాబట్టి పోయే నిమిషం వ్యర్థం కాకుండా చూసేవాడు వివేకి".

"పుట్టినవాడు చావడం నిజం. ఆయువు నువ్వెలా వున్నా క్షయిస్తుంది. కాబట్టి నువ్వేం చేస్తే ఆవలి ఒడ్డుకు చేరుతావో ఆలోచించు. తమ్ముడా! మృత్యుదేవత ఎక్కడినుండో వస్తుందని అనుకోవద్దు. పురుషుడితోనే పుడుతుంది. వాడిని అంటుకునే వుంటుంది. వాడితోనే తిరుగుతుంది. వాడెక్కడికి పోతే అక్కడికి పోతుంది. పరలోకానికి పోతే అక్కడికీ పోతుంది. అక్కడి నుండి ఈ లోకానికి వస్తే వెంటనే వస్తుంది. కాబట్టి హెచ్చరికతో సుఖం కలిగే మార్గాన్ని ఆలోచన చేయి. నీ దేహం దృఢంగా, ఆరోగ్యంగా, వయసులో ఉన్నప్పుడే నువ్వు పరలోక చింత చేయకపోతే, దేహం ముడుతలు పడి, నడిచేటప్పుడు కాళ్లు తడబడి, తల తెల్లపడ్డపడి, కష్టపడుతున్నప్పుడు నిన్ను నువ్వు ఎలా రక్షించుకుంటావు? అది నీ స్వాధీనం తప్పినప్పుడు నువ్వేం చేయగలవు? చేయదల్చుకున్నా ఇహలోకంలో కావాల్సిన దానికి చేయలేనప్పుడు పరలోకంలో కావాల్సిన దానికి ఎలా చేస్తావు? తన కాళ్లలో బలం వున్నప్పుడు నడవడం మాని, బలం పోయిన తర్వాత తనను తీసుకొని పొమ్మని ఇతరులను బతిమిలాడడం తెలివితక్కువతనం కదా?"

"సూర్యుడు ఉదయించాడు....ధనం సంపాదిద్దామని కాని, సూర్యుడు అస్తమించాడు..... కామభోగాలు అనుభవిద్దామని కాని, ఆలోచిస్తాడే కాని మానవుడు, అయ్యో! సూర్యాస్తమయం లోపు పన్నెండు గంటల కాలం వృధా అయిపోయింది కదా? మనం ఏమీ చేయలేదని అనుకోడు. రాత్రికి కావాల్సింది పగలు, ముసలితనంలో కావాల్సింది యవ్వనంలో, వర్షాకాలంలో కావాల్సింది ఎండాకాలంలో, సంపాదించినట్లు పరలోకానికి కావాల్సింది ఈ లోకంలో నేనేం సంపాదించానని మూఢత్వంలో ఆలోచించరు కదా? ఎండాకాలం పోయి వర్షం కురవగానే, అబ్బా...ఎండలకు మాడిపోయాం, చినుకులు పడ్డాయి, ఇక చల్లగా వుంది అంటాం. అదిపోయి చలికాలం రాగానే, అబ్బా....వానల

వల్ల కదలడానికి–మెదలడానికి వీలు లేకపోయింది, ఇక నెమ్మదిగా రాత్రుల్లో, వెన్నెల్లో సుఖపడవచ్చు అంటాం. ఇలా ఒక ఋతువు పోయి మరొక ఋతువు వస్తే సంతోషిస్తాం కాని ఆయుస్సులో ఇంత పోయిందే అని, మరణకాలం సమీపిస్తున్నదే అని ఒక్కరైనా ఆలోచించరు. భార్యా–బిడ్డలు, ధనం, వాటంతట అవే వచ్చి, ఒకచోట చేరి, మళ్లీ విడిపోవడానికి కారణం కాలబలమే కాని మరేంకాదు. కాబట్టి ఒకరినొకరు విడిపోక తప్పదు".

"ఎక్కడి స్నేహితులు, ఎక్కడి బంధువులు, ఎక్కడి అన్నదమ్ములు..... వీరందరూ తమ ఋణం రాబట్టుకోవడానికి వచ్చినవారే! ఋణం తీరగానే పోయేవారు బందువులెలా అవుతారు? మనం కూడా పెద్దవారు పోయిన బాటలోనే పోవాలి. నీటి ప్రవాహం వేగంగా పోయినట్లే వయసు పోతుంది. ప్రవాహమెలా వెనక్కు రాదో, అలాగే, వయసూ రాదు. అందుకే సుఖం కావాలనుకునే వారు మనసును నియంత్రించి నీతి మార్గంలో నడపాలి. క్షణభంగురమైన ఐహిక సుఖం కంటే శాశ్వతమైన మోక్ష సుఖం కోరుకోవాలి. భరతా! మన తండ్రి, భూమ్మీద పుట్టిన పురుషుడు, రాజైన వాడు, స్వర్గలోక ప్రాప్తికోరకు చేయాల్సిన ధర్మాలన్నీ చేశాడు. ధర్మ బుద్ధితో యజ్ఞాలన్నీ చేశాడు. ఆ యజ్ఞాలలో బ్రాహ్మణులకు శాస్త్రోక్తంగా దక్షిణలు ఇచ్చాడు. వారు సంతోషపడ్డారు. తనను ఆశ్రయించిన భృత్యులకు, భూప్రజలకు, వారి–వారి యోగ్యతానుసారంగా దానాలు చేశాడు. ఇష్టం వచ్చిన సుఖాలు అనుభవించాడు. సత్కార్యాలెన్నో చేశాడు. దీర్ఘకాలం బతికాడు. ఈ లోకంలో ఈ పుణ్యాలు చేసినందుకు స్వర్గలోక సుఖాన్ని పొందాడు. ఇలాంటి తండ్రి కోసం నువ్వెందుకు శోకిస్తావు?".

"మన తండ్రి వార్ధక్యం వల్ల జీర్ణించిన దేహాన్ని ఇక్కడే విడిచి ఈ లోకం కంటే ఉత్తమమైన బ్రహ్మ లోకంలో సంచారం చేస్తూ, యోగ్యమైన దేవతల దేహాన్ని ధరించాడు. అలాంటి తండ్రి కొరకు ఎందుకు ఏడుస్తున్నావు? నీలాగా వేదార్థజ్ఞానం, బ్రహ్మజ్ఞానం కల పండితుడు ఈ విధంగా దుఃఖపడడు. ఎందుకంటావా? చనిపోయినవారికొరకు ఎంత ఏడ్చినా వారు బతకిరారు. కాబట్టి ఏడవడం వల్ల లాభం లేదు. ధైర్యంకల బుద్ధిమంతుడు ఎంతటి కష్టం

వచ్చినా కన్నీరు కార్చడు. కాబట్టి నీ మనసు కుదుటపరచుకో. బాధ పడవద్దు. అయోధ్యకు పోయి రాజ్యభారం వహించు. తండ్రి చెప్పిన విధంగా నేను పద్నాలుగు సంవత్సరాలు వనవాసం చేస్తా. తండ్రి ఆజ్ఞ నేను వ్యర్థం చేయవచ్చా? నాలాంటి వాడికి ఇది ధర్మమా? మనకు తండ్రి బంధువు అతడే కాబట్టి, మన తండ్రి మాట గౌరవించడం కీర్తికరం. నువ్వలా చేయడం నాకు ఇష్టం. తండ్రి మాటతో సమానమైన నా మాట విను. స్వర్గలోక సుఖం కోరేవాడు తండ్రి మాట ప్రకారం నడుచుకోవాలి. తండ్రి మాట ధిక్కరించి ఏ ధర్మం చేసినా, ఎంత భూత దయ కలిగినా వ్యర్థమే. మన తండ్రి ఎలాంటి సాధువర్తనం కలవాడో, ఒక్క అసత్యమైనా చెప్పాడేమో ఆలోచించు. అలాంటి వాడికి మనవల్ల అసత్య దోషం రావచ్చా? ఇది మన చేతిలో పనికాని ఆయన చేసేది కాదు. ఇదంతా ఆలోచన చేసి రాజ్యభారం వహించు".

❖ ❖ ❖

సర్గ-106

శ్రీరాముడితో తన దుఃఖానికి కారణం చెప్పిన భరతుడు

ఇలా శ్రీరామచంద్రమూర్తి బోధించగా భరతుడిలా అన్నాడు: "అనఘాత్మకా! ఆహా! నీలాంటి నరుడు లోకంలో లేడుకదా? ఎందుకంటావా? లోకంలో అందరూ తమకు మేలు జరగాలని కోరుకుంటారు.....కలిగితే సంతోషిస్తారు. కీడు కలగకూడదని కోరుకుంటారు. వస్తే ఏడుస్తారు. నువ్వేమో మేలు కలిగితే సంతోషించావు...కష్టం కలిగితే దుఃఖపడవు....నీ మనసు లాంటి మనసున్న వారు దుర్లభులు. లోకంలో జ్ఞాన వృద్ధులనిపించుకున్న వారి సందేహాలు కూడా తీర్చే నువ్వు, నీకు తెలియనట్లు వారిని నీ సందేహాల విషయంలో ప్రశ్నిస్తున్నావు? ఎందుకు? నీకు తెలియకనా? వారి అభిప్రాయం తెలుసుకుని, అది సవరించడానికి నువ్వే ప్రశ్న వేసి, వాళ్లు ప్రత్యుత్తరం ఇచ్చినప్పుడు దానికి విరుద్ధంగా ఈ అర్థం చెప్పవచ్చుకదా? అని, వారితోనే నువ్వు చెప్పింది బాగుంది అనిపిస్తావుకదా? పామరులకు తాము చూడని వస్తువులమీద కోరికపోదు. జ్ఞానులకు కనపడే పదార్థాలమీద కూడా కోరికకలగదు. చనిపోయినవారి మీద ఎవరికీ ద్వేషం లేదు. జ్ఞానికి బతికున్నవారి మీదా ద్వేషం లేదు. కాబట్టి, తండ్రి విషయమై నేను దుఃఖపడలేదు".

"నేను దుఃఖపడింది తండ్రికోసం కాకపోతే మరెవరికోసం అంటావా? భూత-భవిష్యత్-వర్తమానాలు, ఆత్మానాత్మ వివేకం, జీవ-పరమాత్మల సంబంధం తెలిసినవాడికి, దుఃఖం కలిగినప్పుడు మనసు చలించదు. నువ్వు భగవత్సమానుడివి కాబట్టి అలాంటివాడివే.... కాదనను... కాని.... సత్వగుణసంపన్నుడివి, సత్యనియముడివి, సర్వజ్ఞుడివి, సర్వదర్శిదీరుడివి, సంసార స్థితిగతులు తెలిసిన చతురుడివి, మహాత్ముడివి అయిన నువ్వు, ఇలా సహించరాని కష్టాలను ఎందుకు అనుభవించాలి? నువ్వు దీరుడివి, జ్ఞానివి కాబట్టి నీకు కష్టం అనిపించక పోవచ్చు. ఎంతో సుఖం అనుభవించాల్సిన మహానుభావుడివైన నువ్వు అడవుల్లో దుఃఖం అనుభవిస్తుంటే చూసి మేమెలా సహిస్తాం? నా పాపఫలాన నీకింత కష్టం వచ్చిందికదా! అని దుఃఖపడుతున్నా.

నీతో సీతాలక్ష్మణులు కూడా దుఃఖిస్తున్నారు కదా? పాపరహితమైన వంశంలో పుట్టి, దశరథుడి కొడుకునై, ధర్మం అంటే ఇదని చక్కగా నేర్చుకున్న నేనెలా కోపానికి వశపడి లోక విరుద్ధమైన అధర్మ కార్యాన్ని చేస్తా? తల్లినెలా చంపుతా? జ్యేష్టుడవైన నీరాజ్యాన్ని నేనెలా అపహరిస్తా?".

"కైక ఆడది కాబట్టి కామంతో తెలివిమాలిన పని చేసింది అనుకుందాం. గుణంలో గొప్పవాడు, గురువు, ముసలివాడైనందున ఎంతో లోకానుభవం శాస్త్రానుభావం కలవాడు, ఫలానాది చేయవచ్చో-చేయకూడదో తెల్సినవాడు, పురుషుడైన తండ్రి చేసిన పని ఏమిటి? ఆయన మరణించినందువల్ల, ఇది నిండు సభ కాబట్టి ఆయన్ను నిందించ కూడదు కాని, మనుష్యులెవరైనా ఒక ఆడదానిని సంతోషపెట్టడానికి, ధర్మం-అర్థం నాశనం చేసే క్రూర పాపకార్యం కేవలం కామం కోసం చేస్తారా? పామరులు కూడా చేయని ఇలాంటి పాపం తండ్రిలాంటి వాడు చేస్తే నేనేమనుకోవాలి? తప్పో?ఒప్పో? తండ్రి చేశాడు...చనిపోయాడు. ఇప్పుడేమనుకున్నా ప్రయోజనం లేదు. ఆయన చెప్పినట్లు మనం చేయవలసిందే, అది మన విధి అంటావా? తండ్రి క్రోధ-మోహం వల్ల చేయకూడని పని చేసి పాపం ఆర్జించాడు. నీతండ్రి చేసిన పాపానికి ఆయన నరకబాధ పడుతుంటే నువ్వు సహించవచ్చా? కూడదు. కాబట్టి పాపం పోయేట్లు నువ్వు సాదువృత్తిలో నడుచుకుని ఆయన చేసిన అసత్కార్యాన్ని నువ్వు సత్కార్యంగా మార్చు. అప్పుడాయన బాధ పోతుంది".

"తండ్రి పాపం చేస్తే ఆ పాపం అతడికి తగలకుండా చేసే కొడుకే కొడుకు కాని పాపం తగులుతుంటే చూస్తూ వూరుకునేవాడు కొడుకెలా అవుతాడు? తండ్రికి నరకబాధ తప్పించేవాడే కొడుకు. కాబట్టి నువ్వు తండ్రికి నరకబాధ కలగకుండా రక్షించు. 'ఆయన పాపకార్యం చేశాడు కాబట్టి నరకబాధ అనుభవించాలి' అనవద్దు. ఆయన చేసింది మరిచిపో. ఆయన్ను రక్షించు. అన్నా! నువ్వు క్షత్రియుడివి. నీకు శాస్త్రవిహితమయింది క్షాత్రధర్మం. అయోధ్యలో వుండి నిర్వహించాల్సిన కార్యం. నువ్వుంటున్నది ఘోరారణ్యంలో. నీకు ఉచిత చిహ్నం కిరీటధారణ. నువ్వు ధరించింది జటాభారం. ఇలాంటి విపరీత చేష్ట సరైందేనా? కాబట్టి నామీద దయ వుంచి క్షత్రియోచితవేషం ధరించి, క్షత్రియోచితకార్యం చేయి. నన్ను, కైకను, తండ్రిని, మిత్రులను, బంధువులందరినీ, పౌరులను రక్షించు. నీకు నమస్కారం చేస్తా".

వనవాసం శ్రీరాముడికి అర్హధర్మం కాదని చెప్పిన భరతుడు

భరతుడు శ్రీరాముడితో ఇంకా ఇలా అంటున్నాడు: "క్షత్రియుడికి వానప్రస్థ ఆశ్రమ చర్య, వేషం శాస్త్ర విరుద్ధం కాదు కదా? అంటావేమో? క్షత్రియుడి ప్రథమధర్మం ప్రజాపాలన. ప్రజాపాలన చేసేవాడు పట్టాభిషేకం చేసుకుని సింహాసనం అధిష్టించాలి. ఇలా అని ప్రాజ్ఞులు చెప్తారు. నువ్వు వారిలో శ్రేష్ఠుడివి. ఇది నేను నీకు చెప్పాలా? క్షత్రుయుడికి ప్రజాపాలన ముఖ్య ధర్మం అని శాస్త్రం కూడా చెప్తున్నది. అన్నా! నువ్వు వుండాలని అనుకుంటున్న తాపస ధర్మం ప్రత్యక్ష ఫలం కాదు. దాని ఫలము ఇప్పుడు కనబడదు. ఇప్పుడు కాకపోతే ఎప్పుడైనా ఫర్వాలేదంటావా? ఎప్పటికైనా పూర్ణఫలం కలుగుతుందో? లేదో? అది సందేహమే! ఎందుకంటే.....ఎక్కడ, ఎప్పుడు, ఏవిధమైన కర్మలోపం జరుగుతుందో? దానివల్ల పుణ్యలోకవాసం భంగమవుతుందేమో అన్న సందేహం వుంది. తాపస ధర్మానికి ఒక నిశ్చయమైన లక్షణం వుందా అంటే అదీ లేదు. అది క్రియా? శక్తా? అపూర్వమా? అంటే....స్వరూప నిశ్చయం లేనిది. అది కూడా కాకుండా క్షత్రియుడికి ప్రప్రథమంలోనే తాపసచర్య ఏ శాస్త్రం విధించలేదు. ఇలాంటి తాపస ధర్మం ఏ క్షత్రియుడు అనుసరిస్తాడు? రాజధర్మం రక్షారూపంగా, దండరూపంగా, భోగరూపంగా కళ్లకు కనపడుతుంది. కాబట్టి ఫలం వుందో-లేదో అనే విషయంలో సందేహం లేదు. రాజు ప్రజాపాలన చేయాలని శాస్త్రం నిర్ణయించింది. ఇలా చేయడానికి క్షత్రియుడు ఎందుకు సందేహించాలి? రాజధర్మం సుఖ-భాగాలతో కూడింది. కష్టించి ధర్మం చేయాలంటావా? ప్రజాపాలన తాపస ధర్మం కంటే కూడా కష్టమైంది. ఇక్కడ నీ ఒక్కడి యోగక్షేమాలు చూసుకుంటే చాలు.....రాజ్యపాలనలో కోట్లాది మంది యోగక్షేమాలు ఆలోచన చేయాలి. కాబట్టి దానినే అంగీకరించు. ఇప్పుడు నువ్వు వానప్రస్థుడివై బ్రహ్మచర్యాన్ని అవలంభించావు. ఇవి రెండూ గృహస్థధర్మం కంటే గొప్పవేంకాదు. నాలుగు ఆశ్రమాలలో గృహస్థాశ్రమం శ్రేష్ఠమైందని పెద్దలంటారు. సంసారం నిర్వహించలేని దుర్బలుడే కదా సంసారాన్ని వదలాలి? కాబట్టి ధర్మం అంటే ఆసక్తికల నువ్వు అలాంటి ధర్మాన్ని వదిలి ఇలా వుండడం ధర్మం కాదు".

"అన్నా! జన్మ వరస క్రమంలోనూ, విద్యలలోనూ, నీకంటే చిన్నవాడిని. నువ్వు నాకంటే గొప్పవాడివి. కాబట్టి అన్ని విషయాలలో నీ వెనక వుండాల్సిన వాడినే కాని ముందు నడవాల్సినవాడిని కాదు. సూర్యుడుంటేనే సూర్యకాంత శిల వేడి చూపగలదు కాని, సూర్యుడు లేకపోతె అది ఏం చేయగలదు? అలాగే నేను నీతో వుంటే నీ బలం ఆధారంగా ఎంతైనా చేయగలను కాని నిన్ను విడిచి ఏం చేయలేను. నీ సహాయం లేకపోతే బుద్ధి, గుణాల వల్ల చిన్నవాడినైన నేను నిలువను కూడా లేను. ఇలాంటివాడిని రాజ్యభారం ఎలా భరిస్తా? కాబట్టి నేను అయోధ్యకు పోను. పౌర శ్రేష్ఠులు, పురోహిత శ్రేష్ఠులు,బాంధవ శ్రేష్ఠులు, ఇతరులు.....వుండాల్సిన వారందరూ ఇక్కడ వున్నారు. వారి–వీరి అభిప్రాయం ఏంటని నువ్వు సందేహించాల్సిన అవసరం లేదు. ఇక్కడే నువ్వు పట్టాభిషేకం చేసుకో. ఆ తరువాత పాలనకై అయోధ్యకు పో. పోయి, శత్రువులను గెల్చి, ఇంద్రుడి లాగా అందరూ సంతోషిస్తుంటే మమ్మల్ని కాపాడు. అలా చేస్తే నీ హితం కోరేవారందరూ సంతోషపడతారు. రాజ్యం నిష్కటంకం అవుతుంది".

"నిన్ను నేను ఇంతగా ప్రార్థించడం నా సుఖం కొరకు కాదు. నువ్వు పట్టాభిషేకం చేసుకుంటే, నా తల్లికి పాపనింద పోతుంది. తండ్రికి నరకబాధ తప్పుతుంది. ఈ రెండు పనులు నీవల్ల జరిగితే భగవంతుడు జీవకోటులందరినీ రక్షించినట్లు నువ్వు మమ్మల్ని రక్షించినవాడివవుతావు. నువ్వు పట్టాభిషేకం చేసుకుంటే ఈ మూడు పుణ్యాలు నీకు కలుగుతాయి. నేను రానని నువ్వు అంటావా? నీతో నేనుండాల్సిన వాడిని. నిన్ను విడిచి వుండను. నువ్వు అయోధ్యకు వస్తే అక్కడే కలిసి వుంటా......నువ్వు అరణ్యాలలో వుంటే ఇక్కడే కలసి వుంటా. ఇది నా నిర్ణయం. ఆత్మను విడిచి శరీరం ఎలా వుంటుంది?". భరతుడు ఇంత చెప్పినా శ్రీరామచంద్రుడు అయోధ్యకు పోవడానికి అంగీకరించలేదు.

❖ ❖ ❖

సర్గ-107

భరతుడు రాజు కావడం ధర్మమని చెప్పిన శ్రీరాముడు

భరతుడి ప్రార్థనకు బదులుగా, దశరథుడు కామవశుడై అధర్మ మార్గంలో పోయాడన్న దానికి సమాధానంగా శ్రీరాముడిలా అన్నాడు: "భరతా! దశరథుడు లాంటి ధర్మాత్ముడికి, కేకయరాజు లాంటి గొప్పవాడికి చెందిన కైకకు పుట్టిన నువ్విలా చెప్పడం న్యాయమా? నువ్వు చెప్పినట్లు దశరథుడు కేవలం అధర్మాత్ముడై రాజ్యం నీకివ్వలేదు. నీ తల్లి వివాహకాలమందు కన్యాశుల్కంగా తన రాజ్యాన్ని ఆమె కొడుక్కి ఇస్తానని దశరథుడు ప్రమాణం చేశాడు. ఇది ప్రమాణపూర్వకంగా చేసిన పని కాబట్టి, అలా చేసిన దశరథుడు ఎలా అధర్మాత్ముడవుతాడు? ఆ మాట ప్రకారం రాజ్యాన్ని నీకిచ్చినా, నన్నెందుకు అడవులకు పంపాలంటావా? అది అధర్మం అంటావేమో! దానికి కారణం చెప్తా విను. దేవ-రాక్షస యుద్ధంలో నీ తల్లి తనకు సహాయం చేసిన కారణాన మన తండ్రి ఆమెకు రెండు వరాలిచ్చాడు. ఆ రెండు వరాలిప్పుడు ఆమె కోరింది. అందులో ఒకటి నీకు రాజ్యాభిషేకం, రెండోది, నా వనవాసం. ఆ రెండు వరాలూ మన తండ్రి ఇచ్చినవే! కాబట్టి ఆయన మాట ప్రకారం పద్నాలుగు సంవత్సరాలు నేను అడవుల్లో వుండడానికి సీతాలక్ష్మణులతో వచ్చా. ఇలా నేను చేయడానికి కారణం తండ్రిని సత్యవాక్యపాలకుడిని చేయడమే కాని కామ-క్రోధాలు కావు".

"తండ్రిని నేను సత్యవచననిష్ఠుడిని చేసినట్లే, నువ్వు కూడా తండ్రిని సత్యవాదిని చేయాలికదా? కాబట్టి రాజ్యలక్ష్మిని అంగీకరించు. తండ్రి నీతో చెప్పలేదు కాబట్టి ఎందుకు అంగీకరించాలంటావా? అలా అయితే, తండ్రి తరువాత తండ్రి అంతటివాడిని నేను కదా? నేను చెప్తున్నా. పెద్దవాడు చెప్పాడని నాకొరకు నామాట విను. నష్టమైనా, కష్టమైనా, ఇష్టం అయినా-కాకపోయినా పెద్దవారి మాట వినాలికదా? కాబట్టి తండ్రి ఋణం ఆయన మాట ప్రకారం నడిచి తీర్చు. తల్లి కూడా సంతోషించే విధంగా ప్రవర్తించు. పున్నామనరకం నుంచి రక్షించేవాడు జ్యేష్ఠపుత్రుడే. అయితే, ఒక కొడుకు మాత్రమే కోడు కాదన్న న్యాయం అనుసరించి, మరికొందరు గుణవంతులను, వేదాధ్యయనం

చేసినవారిని కొడుకులుగా కోరవచ్చు. ఎందుకంటే, వారిలో ఒకడైనా గయకు పోయి పిండం పెడతాడని. రాజర్షులందరూ ఈ విధంగానే కోరుకుంటారు. కాబట్టి, రాజకుమారా! నువ్వు కూడా తండ్రి వాక్యం ప్రకారం నడుచుకుని, తండ్రికి అసత్య దోషం వల్ల కలిగే నరక బాధ నుండి రక్షించు. అయోధ్యకు పోయి రాజువు కా".

"కాదు...కూడదు...నేనే రాజు కావాలంటావా? నీ కోరిక, తండ్రి కోరిక నెరవేరే ఉపాయం చెప్తా విను. నగరాలు ఎలా తండ్రి రాజ్యంలో వున్నాయో, అడవులు కూడా తండ్రి రాజ్యంలో వున్నవే కదా? కాబట్టి నువ్వు అయోధ్య నుండి పాలించు.....అడవుల్లో నేను వన్యమృగాలకు రాజవుతా. నా రాజ్యం నేను పాలించడానికి దండకారణ్యానికి పోతా....నువ్వు అయోధ్యకు పో. నీకు ఎండ వేడి తగలకుండా శ్వేతచ్ఛత్రం వుంటుంది....నాకిక్కడ వెడల్పాటి చెట్ల కొమ్మలుంటాయి. ఇది అంగీకరిస్తే నీ కోరిక, తండ్రి కోరిక నెరవేరినట్లవుతుంది. అయోధ్యలో నీకు శత్రుఘ్నుడు సహాయపడితే, ఇక్కడ నాకు లక్ష్మణుడు సంతోషం కలిగిస్తాడు. ఈ విధంగా మనం నలుగురం తండ్రిని సత్యవాదిగా చేద్దాం".

❖ ❖ ❖

సర్గ-108

శ్రీరాముడితో నాస్తిక మాటలు చెప్పిన జాబాలి

ఈ విధంగా హితమైన మాటలు చెప్పి భరతుడిని సమాధాన పరుస్తున్న శ్రీరామచంద్రుడిని చూసి, బ్రాహ్మణోత్తముడైన జాబాలి శ్రీరాముడికి మేలు చేయాలన్న ఆలోచనతో, ఆయనకు కొన్ని అధర్మోక్తులను చెప్పాడు. (జాబాలి మాటలు ధర్మశాస్త్ర విరుద్ధమైనవైనా ఆయన ఉద్దేశం చెడ్డది కాదు. ఎలాగైనా శ్రీరాముడిని పట్టాభిషేకానికి ఒప్పించి సుఖపడేలా చేయాలన్నదే ఆయన ఆలోచన. కాకపోతే ఎంచుకున్న మార్గం సరైందికాదు). శ్రీరాముడితో జాబాలి ఇలా అంటాడు: "సర్వం తెల్సి కూడా, గొప్ప మనసున్న వాడివైన నీకు పామరుడిలాగా బుద్ధిమాంద్యం ఎలా కలిగింది? ఈ ప్రయోజనం లేని మాటలు చాలించి వేగంగా అయోధ్యకు పోయి భరతుడు చెప్పినట్లు ప్రజాపాలన చేయి. తండ్రి-తండ్రి అని చాలా సార్లు అంటున్నావే? మనిషికి తండ్రి అనేవాడెవరు? బందువులెవ్వరు? ఇదేం అనాలోచిత ప్రసంగం? ఒకడి ద్వారా మరొకడికి అయ్యే పనేంటి? ఒకడు ఇంకొకడికి ఏంచేయగలడు? ముసలితనం రాకుండా కాపాడగలమా? చావురాకుందా ఆపగలమా? పుట్టినప్పుడు తానొక్కడే పుట్టాడు.....చనిపోయేటప్పుడు ఒక్కడే చస్తాడు. అప్పుడీ తండ్రులలో, బంధువులలో ఒక్కడైనా వెంట వస్తారా? అలా రానప్పుడు వీరు కన్నవారెలా అయ్యారు? బంధువులెలా అయ్యారు?".

"ఎక్కడి తల్లి? ఎక్కడి తండ్రి? ఒకడిని తండ్రి అనీ, ఒకరిని తల్లి అనీ అనడం బుద్ధిలేనితనమే! ఒక ప్రాణికి, మరొక ప్రాణికి సంబంధమే లేదు. ఒక బాటసారి దూరాన వున్న గ్రామానికి పోతూ ఒక చోట ఒక రాత్రి ఆగి, ఉదయం కాగానే తోటి బాటసారులను వదిలిపోయినట్లే తానూ తల్లిని, తండ్రిని వదిలి జీవి పోతాడు రామచంద్రా! ఇదిలా వుంటే, ఒకరికి ఒకరు మేలుచేయడం అంటే ఏమిటి? రామచంద్రా! ఈ తల్లిదండ్రుల దేహాలు సత్రాలు, చలువ పందిళ్ళ లాంటివి. అప్పటికప్పుడు ఉపయోగించుకునేవి మాత్రమే! కాబట్టి వీటికోసం వివేకవంతుడు తాపత్రయపడడు. ఇలాంటి విపరీతబుద్ధి

నీకెక్కడనుండి వచ్చింది? బుద్ధిమంతుడవైన నీలో కలిగింది కాదే? రామచంద్రా! చనిపోయినవాడికి రాజ్యం ఎక్కడిది? నువ్వు జనకుడి రాజ్యం అంటున్నావు కాబట్టి చెప్తున్నా. అలాంటి నీ తండ్రి రాజ్యాన్ని వదిలి, కష్టకారణమైన ముళ్లతో కూడుకున్న, యౌవనంలో అనుభవయోగ్యం కాని చెడుమార్గాన్ని ఎందుకు కోరుకుంటున్నావు? సుఖకారణమై, భోగవస్తువులతో నిండిన అయోధ్యకు పో. నీ ఇష్టానుసారం సుఖం అనుభవించు".

"తండ్రి ఎవడు? నువ్వెవరివి? తండ్రికి నీకు ఏమి సంబంధం? అతడు వేరు, నువ్వు వేరు. దీనిని తెల్సుకుని మేం చెప్పిన విధంగా చేయి. పురుషుడు ఒక స్త్రీ గర్భంలో బీజం వేస్తే అది స్త్రీ రక్తంతో కలిసి పిండమై, ప్రాణంతో పుట్టున్నది. తండ్రి ఒక అల్ప సహాయం మాత్రమే. ఆ మాత్రానికి ఎందుకు తండ్రి–తండ్రి అని ఏడుస్తున్నావు? రాజెక్కడికి పోవాలో అక్కడికే పోయాడు. నాలుగు భూతాల సంయోగమే దేహం. మరణించిన తరువాత మళ్లీ నాలుగిటిలో కలిసి పోతుంది. సర్వకాలంలో మనుష్యకోటికి ఇదే వర్తిస్తుంది. పుట్టినవాడు ఎన్ని రోజులకైనా చావాల్సిందే. ఇది ఆలోచించకుండా పిచ్చివాడిలా వ్యర్థంగా ఏంటో అంటున్నావు. నువ్వెక్కడ? తండ్రి ఎక్కడ? ఇద్దరికీ ఏం సంబంధం? ధర్మం సంపాదించాలనీ, ధనం సంపాదించాలనీ కష్టపడేవారిని గురించి నేను దుఃఖపడతా. సుఖం కావాలనుకునేవారి గురించి నేను బాధపడను. కర్మ అంటే ఆసక్తికలవాడికి దాంతోనే వాడి ఆయువు సరిపోతుంది. వాడు సుఖపడేది ఎప్పుడు? మరణించిన తరువాత అందామా? సుఖించే దేహం మట్టిలో కలిస్తే సుఖం ఎవరికీ?".

"కష్టపడి వైదిక కర్మలు చేస్తున్నారు. చనిపోయినవాడు అన్నం తింటాడా? చనిపోయినవారి పేరు చెప్పి ఇతరురులు తింటున్నారు. దీనివల్ల లాభం ఏమిటి? బతికున్నవాడు అన్నం తింటే చనిపోయినవాడి కడుపెలా నిండుతుంది? ఒకడు కూడు తింటే మరొకడి కడుపెలా నిండుతుంది? ప్రయాణం చేసేవాడిని ఉద్దేశించి ఇంట్లో శ్రాద్ధం పెట్టేతే బాటసారి కడుపు నిండుతుందా? ఇవన్నీ మోసపు మాటలే కాని నిజాలు కావు. బుద్ధికలవారు ఇవి విని నమ్ముతారా? మబ్బుల్లో నీరును నమ్ముకుని చెరువు నీరు తెగగొట్టుతారా? చనిపోయిన తరువాత ఏదో

సుఖం కలుగుతుందని ప్రత్యక్ష రాజ్య సుఖాన్ని పోగొట్టుకునే బుద్ధిలేనివాడు ఎవరైనా వుంటారా? కాబట్టి లోకం సమ్మతించే ఆలోచన చేయి. మామీద దయ చూపి పట్టాభిషేకం చేసుకో".

❖ ❖ ❖

సర్గ-109

జాబాలి మతాన్ని ఖండిచిన శ్రీరాముడు

జాబాలి మాటలకు సత్యాత్ముడు, వైదికకర్మాచరణలో శ్రద్ధకలవాడైన శ్రీరాముడు తన మనసును మరింత నిబ్బరపర్చుకుని ఆయనకు జవాబుగా ఇలా చెప్పాడు: "ఓ బ్రాహ్మణుడా! నువ్వు పుట్టున పుటకేంటి? చెప్పే మాటల తీరేంటి? నా మేలుకోరి నువ్వు చెప్తున్న మాటలు వాస్తవానికి చేయకూడనివి. నువ్వు చెప్పినవన్నీ బయటికి మంచిగా ఉన్నప్పటికీ, అనుభవంలో కీడుచేసేవే. నువ్వు భువన సమ్మతమని చెప్పావు కాని అవన్నీ లోకంలో చేయరానివి. లోకసమ్మతమైతే లోకులందరూ ఎందుకు ఆ ప్రకారం చేయడం లేదు? కాబట్టి అలాంటి మాటలను విని ఎలా సహిస్తా? వేదోక్తమైన ఆచారం కంటే భిన్నమైన ఆచారాలను తెలియచేసే శాస్త్రాలను నమ్మేవారు, కట్టుబాట్లు లేక స్వేచ్ఛగా చరించేవారు, పాపపు నడవడికలవారు, తమ గొప్పతనాన్ని, గౌరవాన్ని పోగొట్టుకుని సభల్లో నిందలపాలవుతారు. ఇది యదార్థం. నువ్వు వీరిలో చేరినవాడివే. నువ్వు కల్మషప్రవర్తుడవని నాకెలా తెలుసంటావా? ఫలానావాడు నీచకులంలో పుట్టాడనీ, ఫలానావాడు గొప్ప కులంలో పుట్టాడనీ, ఫలానావాడు దుష్టుడనీ, ఫలానావాడు శిష్టుడనీ, ఫలానావాడు పాపహీనుదనీ, ఫలానావాడు పాపాత్ముడనీ, ఫలానావాడు శౌర్యవంతుడనీ, ఫలానావాడు శౌర్యహీనుడనీ, వాడి-వాడి నీటి ప్రవర్తన వల్ల తెలుస్తుంది. నీ మాటలను బట్టి నువ్వు నియమహీనుడివి కాబట్టి నువ్వు పాపివని తెలసుకున్నా. శిష్టుడైనవాడు దుష్టవాక్కులు కూడా నోటినుండి రానీయడు. మనసులో ఉన్నదే నోటి నుండి వస్తుంది. నీ మనసులో కూడా అలాంటి అభిప్రాయమే వుంది".

"వాస్తవానికి యోగ్యుడు కాకపోయినా యోగ్యుడిలా, శుద్ధాచారం లేకున్నా శుద్ధాచారం కలవాడిలా, యోగ్యుల లక్షణాలు లేకున్నా యోగ్యులలా, దుష్టుడైనా శిష్టుడిలా, వేదోక్త కార్యాలు లేనిదై లోకంలో సాంకర్యం కలిగించే అధర్మాన్ని నా లాంటివాడు న్యాయం, ధర్మం అని చెప్తే, ఇది చేయవచ్చు-ఇది చేయకూడదు అని తెలిసి కార్యం చేయగల సమర్థుడైన యోగ్యుడు, నాలాంటి దుష్టవర్తనుడిని,

లోక నింద్యుడిని, సంమార్గుడిగా ఎలా చూడగలడు? నేను చేసిన ప్రతిజ్ఞను సముద్రంలో కలిపి, సత్యాన్ని నాశనం చేసి, మీరు సత్యంలో వుండమని ఎవరికి ఏమని చెప్పను? అసత్యమాడి పరలోక సుఖం ఎలా అనుభవించను?".

సత్యం అవశ్యం అనుష్ఠేయం అని జాబాలికి బోధించిన శ్రీరాముడు

"యథారాజా తథా ప్రజా" అనే న్యాయాన్ని అనుసరించి రాజు నాస్తికుడై, దేవుడు లేడు...పరలోకం లేదు, అనే చెప్తే లోకులు కూడా వారి-వారి ఇష్టప్రకారం దొంగతనం, రంకుతనం, హత్యలు లాంటివి చేస్తారుకదా? అప్పుడు ధర్మం, సత్యం అనేవి నశిస్తాయి కదా? నేను చెడిపోవడమే కాకుండా లోకులందరినీ చెరిచిన వాడినై ఆ పాపం కూడా నేనే అనుభవించాలి. సత్యం, దయ ఆధారం చేసుకుని రాజులు జీవించాలి. ఆ రెండు లేని రాజు ఎక్కువ కాలం రాజుగా వుండలేడు. ఈ ప్రజలకు సత్యమే ఆత్మ. వారు సత్యాన్ని విడిచిపెడితే జీవుడు విడిచిన శరీరం అవుతుంది. కాబట్టి సర్వ జగాలకు సత్యమే ఆధారం. అన్నింటికంటే సత్యమే శ్రేష్ఠం. దేవతలు, మునులు, సత్యాన్ని ఎల్లప్పుడూ స్తోత్రం చేస్తారు. వాస్తవానికి మోక్షాన్ని కోరేవాడు సత్యాన్నే పలకాలి. సత్యమే లక్ష్మీవాసస్థానం..... ప్రపంచానికంతా సత్యమే నియంత. సత్యానికి లోబడి ప్రపంచం నడుస్తున్నది. సత్యమే ప్రపంచం నిలబడడానికి మూలాధారం. మోక్షప్రాప్తికి సాధనం సత్యాన్ని మించింది ఏదీ లేదు. దానం, హోమం, వేదం, ధ్యానం, తాపం, నిష్ఠ, యాగం, ఇవన్నీ సత్యాన్ని ఆశ్రయించి వుంటాయి. సత్యం విడిచిన వారికి ఇవేవీ పనిచేయవు. కాబట్టి నరుడు సత్యమే ప్రధానంగా కలవాడు కావాలి".

"సత్య నిష్ఠ కలవాడు లోకాన్ని ఏలుతాడు. సత్యానుష్ఠానంతోనే ఫలానుభావం కలుగుతుంది. బ్రాహ్మణుడా! లోకంలో ఇంతవరకు, రామచంద్రుడు మాట చెప్తే తప్పేవాడు కాదు అన్న కీర్తిని సంపాదించాడు. అలాంటప్పుడు ప్రమాణం చేసి తప్పడం న్యాయమా? సత్యం మీద ఇంత పట్టుదలకల నాలాంటివాడు తండ్రి ఆజ్ఞ ఏవిధంగా జవదాటగలడు? తండ్రి

ముందర నేనొక సత్యం చేశాను. అది లాభం కొరకో, లోభంతోనో, లేదా, ఒకటనుకుని మరొకటి చేశాననుకో. లేక పొరపాటునో చేశాననుకో. కారణమేమైనా ఒక సారి చేసిన ప్రతిజ్ఞను ఉల్లంఘించను. సేతువును ఆధారం చేసుకుని ఒక ఒడ్డునుండి మరొక ఒడ్డుకు పోతారు. అలాగే సత్యం అనే సేతువును ఆధారం చేసుకుని సంసార సముద్రాన్ని ఈ దరినుండి ఆదరికి చేరుతా. అలాంటి ఆధారాన్ని ఎలా తెగగొట్టి ఆత్మహాని చేసుకుంటా? చపలచిత్తుడు, సన్మార్గం నుండి తప్పుకున్నవాడు, అసత్యాలు చెప్పేవాడు, ఈ ముగ్గురూ, యాగాలలాంటి దేవతా కార్యాలు చేసినా దానిని దేవతలు అంగీకరించరు. శ్రాద్ధాది పితృ కార్యాలు చేసినా పితృ దేవతలు అంగీకరించరు. శాస్త్రాలు ఇలా చెప్పడం మనం వినలేదా?".

"సత్యమే స్వరూపంగా వుండే ధర్మం ఆత్మను విడిచి వుండేది కాదు. అదిలాంటిదని నేను కళ్లారా చూసినందున, సత్పురుషులు ఆచరించాల్సిన వానప్రస్థ ఆశ్రమాన్ని, జడలు ధరించి సత్యం కొరకై నేను స్వీకరించా. క్షత్రియ ధర్మంలో పాపభాగం ఎక్కువ, ధర్మ భాగం తక్కువ కాబట్టి, దానిని ఆశాపాతకులు, బుద్ధిహీనులు, హింస, క్రూరకర్మలు చేసేవారు, పాపం అంటే ఆసక్తికలవారు సేవిస్తారు. కాబట్టి దానిని నేను వదిలా. పాపకార్యాలు ఆలోచిస్తే, అవి చేయకపోయినా, పాపం వస్తుంది. ఇది మానసికం. అసత్యం నోటితో చెప్పినా పాపం వస్తుంది. ఇది వాచకం. దేహంతో చేయడం వల్ల ఈ మూడు రకాల పాపాలు వస్తాయి. సత్యమే ప్రదానంగాగల పురుషుడికి కీర్తి, యశస్సు, లక్ష్మి తమంతట తామే వలచి వస్తాయి. ఈ లోకంలో ఇవి సమకూర్చడమే కాకుండా సత్యం స్వర్గలోకానికి తోడుగా పోయి దివ్యసుఖాన్ని కలిగిస్తాయి. ఇలాంటి సత్యాన్ని ఎవరు వదులుకుంటారు?"

"నువ్వెంత ఆలోచించి మోసపు మాటలు చెప్పినా, నన్నది చేయమని అన్నా, నేనెలా అధర్మాన్ని చేస్తా? రాజు ముందర భరతుడి కొరకు చేసిన ప్రమాణాన్ని నేనెలా ధ్వంసం చేస్తా? పూర్వం తన భర్త ఎదురుగా నేను చేసిన ప్రమాణానికి కైక సంతోషించింది. ఇప్పుడు నేను ఆమాట తప్పితే ఆమె ఏంచేస్తుంది? ఆమె అంగీకరిస్తే అది మీ బలాత్కారం వల్ల కాని స్వబుద్ధివల్ల

కాదు. స్వబుద్ధిపూర్వకంగా అయితే అసలు ఇలా చేసే వుండేది కాదు. కాబట్టి వానప్రస్థులకు నిర్దేశించిన ఆహారమైన పండ్లు, పూలు, గడ్డలు లాంటివాటితో పితృ దేవతలకు తృప్తి కలిగించి అడవుల్లో వుంటా".

కర్మ అవశ్యకర్తవ్యమని జాబాలికి చెప్పిన శ్రీరాముడు

"అది లేదు-ఇది లేదు అనే విచారం కాని, లభించిన దాని మీద ప్రేమకాని లేకుండా, లభించినదానితో పంచేంద్రియాలను సంతోషపెట్టూ, శాస్త్రం మీద, కర్మఫలం మీద నమ్మకంతో, పాపరహితమైన మనసుతో, సత్కార్యాలు చేస్తూ, పితృవాక్యాన్ని పాలిస్తూ కాలం గడుపుతా. ఈ భూమండలం కర్మభూమి కాబట్టి ఇక్కడున్నవారు కర్మలే చేయాలి. ఊర్ధ్వలోకాలు ఫలభూములు....ఇక్కడ చేసిన కర్మల ఫలం అక్కడ అనుభవించాలి. ఇక్కడ పుణ్యం చేసినవాడు అక్కడ సుఖం అనుభవిస్తాడు.....ఇక్కడ పాపం చేసినవాడు అక్కడ దుఃఖం అనుభవిస్తాడు. కాబట్టి ఇక్కడ పుణ్యకర్మలే చేయాలి. అలా పుణ్యకర్మలు చేసిన మనుష్యులే వారి-వారి పుణ్యకర్మం కొద్దీ వాయువుగానో, అగ్నిగానో, చంద్రుడుగానో పుట్టాడు. (సూర్యుడు, చంద్రుడు, అగ్ని, ఇంద్రుడు, బ్రహ్మ, రుద్రుడు.....ఇవన్నీ ఉద్యోగాలే. మనుష్యులలో ఎవరే సంకల్పంతో ఏ కర్మ చేస్తాడో-ఆచరిస్తాడో, ఆ కర్మఫలంగా వాడే ఉద్యోగ పదవికి అర్హుడో వారికా పదవి ఇవ్వడం జరుగుతుంది. వీరంతా కొంతకాలం ఆ పదవుల్లో వుంది వేరేవారికి స్థానం కలిగిస్తారు. బ్రహ్మ రుద్రేంద్రాది పదవులన్నీ కర్మఫలాలే. ఫలదాత భగవంతుడైన విష్ణువే. భగవంతుడైన విష్ణువు తానె సృష్టికర్త అయి తన్ను సృజించు కుంటున్నాడు. పాలించేవాడై తన్ను రక్షించుకుంటున్నాడు. సంహరించేవాడై సంహరింపబడుతున్నాడు.) నూరు యజ్ఞాలు చేసినవారు ఇంద్రుడై నహుషుడిలాగా స్వర్గాధిపతి అవుతాడు. మహర్షులందరూ స్వర్గం పోవడానికి కారణం వారు-వారు చేసిన తపోనిష్ఠల వల్లే".

"ఇవేం పనికిమాలిన మాటలు? పరలోక సుఖం లేదనడం పొరపాటు. ఇలాంటి దుర్బోధలు చేయవచ్చా? సత్యం, పరాక్రమం, భూతదయ, ధర్మగుణం, మంచిమాట, పెద్దలను, అతిథులను, దేవతలను పూజించడం అనేవి ధర్మ మార్గాలు. వీటిలో ఒక్కొక్కటి ఒక రకమైన స్వర్గాన్నిస్తాయి. చాలా విషయాలలో

బ్రాహ్మణులలో ఏకాభిప్రాయం లేకపోయినా, ఈ విషయంలో వారందరిలో ఒకే అభిప్రాయం వుంది. వారి-వారి కులాచారం ప్రకారం ధర్మకార్యాలు విడువకుండా చేస్తున్నారు. ఫలం లేకపోతే వారెందుకు అలా చేస్తారు. నువ్వు అధర్మ మార్గంలో వున్నావనీ, నాస్తికుడివి అనీ, అవైదిక మార్గ నిష్ఠుడవనీ, నిన్ను దూషించి ప్రయోజనం లేదు కాని, నీలాంటి వాడిని దగ్గర చేర్చిన మా తండ్రిని ఎంతైనా దూషించవచ్చు".

"నీ కంటే ముందే, నీ కంటే జ్ఞానంలో గొప్పవారు, కఠినమైన నిష్ఠకలవారై, ఏమీ తక్కువచేయకుండా కర్మలు చేయలేదా? వారంతా బుద్ధిహీనులనా నీ భావన? నిర్మల మనసుతో కర్మలు చేసిన వారు, ఈ లోకంలో, పరలోకంలో జయలక్ష్మిని పొంది, తేజోమూర్తులై శాశ్వతంగా కీర్తిని పొందలేదా? అలాంటి ఫలం కలగడం వల్ల సుభ స్వభావం కల తమకు ఇష్టమైన పనులను సర్వకాలాలో చేయలేదా? కర్మలు నిష్ఫలమైతే వీరంతా ఎందుకిలా చేశారు? నువ్వు మునివేషం వేసావేకాని నీలో మునికి వుండాల్సిన జ్ఞానం, గుణం, ప్రవర్తన లేదు. ప్రజలతో పూజించబడేవారు నీలాంటి వేషధారులు కాదు. వారు దానగుణం ప్రధానంగా కలవారు...అపూర భూత దయ కలవారు...గొప్పవారి సమూహంతో సాంగత్యం కలవారు...ఎదురులేని తేజస్సుకలవారు... ఉత్తమమైన ధర్మ మార్గాన్ని గౌరవించేవారు...పాపరహితులు....సమానంలేని మంచి నడవడి కలవారు....కర్మనిష్ఠలను విడవని మునీశ్వరులు. వీరంతా నిజంగా లోకపూజితులు".

అని ఇలా కోపంతో శ్రీరామచంద్రమూర్తి మాట్లాడగా, నిష్కారణంగా ఇలాంటి గొప్పవాడి మనసు నొప్పించానే అని జాబాలి మళ్లీ సత్యమైన మాటలతో ఊరడిస్తూ ఇలా అన్నాడు: "రామచంద్రా! నువ్వు దేవశ్రేష్ఠులైన బ్రహ్మాదులతో స్తుతించబడినవాడివి. నేను నాస్తికుడిని కాదు. నేను నాస్తికోక్తులను చెప్పను. నాస్తి అనేది లోకంలో లేదు. సర్వం అస్తియే!

తనను క్షమించమని శ్రీరాముడిని వేడుకున్న జాబాలి

"నేను నాస్తికుడిని కాకపోయినా ఎందుకు నాస్తికవాదం చేశానంటావా? చెప్తా విను. రామచంద్రా! ధర్మానికి అపాయం సంభవించినప్పుడు ఏదో ఒక విధంగా, న్యాయంగానో-అన్యాయంగానో, ధర్మం చెడిపోకుండా కాపాడడం న్యాయం-ఆపద్ధర్మం. ఇప్పుడు నీ తండ్రి మరణించాడు. నువ్వు రాజ్యాన్ని అంగీకరించడం లేదు. తనకు రాజ్యం వద్దని భరతుడు కూడు-నీళ్లు మాని వానప్రస్థ వేషం వేసుకుని ఇక్కడికి వచ్చాడు. మీరిద్దరూ రాజ్యాన్ని అంగీకరించకపోతే రాజ్యం, ప్రజలు ఏగతి పట్టాలి? దేశం ఎంతటి దుస్థితికి వస్తుంది? ఈ మహావిపత్తును ఆలోచించి న్యాయంగా రాజ్యం నీది కాబట్టి నువ్వు రాజు కావడం ధర్మమని అనుకుని, న్యాయోక్తులన్నిటికీ విరుగుడు మాటలు చెప్పిన నీకు, ఈ మార్గంలోనైనా నిన్ను అంగీకరించేలా చేద్దామనుకుని నాస్తికవాదం చేశానే కాని, నేను నాస్తికుడిని కాదు. నేనలాంటివాడినైతే నీ తండ్రి నన్నెలా చేరదీసేవాడు? ఈ వసిష్ఠాదులు నన్నెలా కలుపుకుని పనిచేసేవారు? ఎవరైనా నాస్తికవాదం చేస్తే నేనే వారిని ఖండిస్తా".

"ఇప్పుడు నేను చేసిన వాదన, ధర్మానికి హాని కలిగినప్పుడు ఎలాగైనా ధర్మ స్థాపన చేయాల్సి వస్తే, నువ్వు రాజుగా వుండి అలా చేస్తే, నిన్ను నేనే ఆక్షేపించి ఇప్పుడు నేను చేసిన వాదన ఖండించే వాడిని. ఇప్పుడు నాస్తికవాదన చేయడమే కాదు...ఎప్పుడైనా ధర్మహాని కలిగితే, ఇలాంటి కష్టకాలం వస్తే, మళ్లా నాస్తికవాదన చేస్తా. ధర్మంగా వుండి, ఇంత దేశాన్ని అరాజకం చేసి ఇందరు ప్రజలను నాశనం చేయడం ఎక్కువ కీడా? నువ్వొక్కడివి తాత్కాలికంగా నాస్తికవాక్యాన్ని అంగీకరించి రాజువై, లోకరక్షణ చేయడం మేలా? నువ్వొక్కడివి చెడిపోయినా లోకమంతా బాగుపడుతుంది కదా? అనేదే నా అభిప్రాయం. నిన్నెలాగైనా అయోధ్యకు పిలుచుకు పోవడానికి భరతుడు బాధపడడం చేత, అతడి మీద నీకు దయకలగాలని ఇలా చెప్పా. పాపరహితా! క్షమించు. ఒక పని నెరవేరాలంటే వాడేనని విధాల ప్రయత్నించినా తప్పులేదు. యుద్ధంలో వీరులు మహాస్త్ర-శస్త్రాలే వాడుతున్నారా? అల్పబాణాలను కూడా ప్రయోగించడం లేదా?".

❖ ❖ ❖

సర్గ-110

జ్యేష్ఠుడు రాజ్యార్హుడని పూర్వరాజ వృత్తాంతాన్ని శ్రీరాముడికి చెప్పిన వసిష్ఠుడు

జాబాలి ఇలా చెప్పగా అతడిమీద కోపంతో వున్న శ్రీరామచంద్రుడితో వసిష్ఠుడు ఇలా అన్నాడు: "రామచంద్రా! నిన్ను అయోధ్యకు తీసుకుపోవడానికే జాబాలి ఆ విధంగా నాస్తికవాదం చేశాడు. ఈ ప్రపంచం ఎలా పుట్టిందో చెప్తా విను. బ్రహ్మాండమంతా జలంతో నిండి ఒక సముద్రంగా వున్నప్పుడు భూమి సృష్టించబడింది. పరబ్రహ్మం వల్ల దేవతలు, బ్రహ్మ కలిగారు. భూమి నీట్లో మునుగుతున్నప్పుడు విష్ణువు ఆదివరాహమై తన కొమ్ముతో దాన్ని పైకెత్తాడు. అప్పుడు అవ్యయుడు, నిత్యుడు, పరబ్రహ్మం వల్ల కలిగిన బ్రహ్మ తన కొడుకులైన మరీచ్యాదులతో ప్రపంచమంతా వ్యాపించాడు. ఆకాశమే పరబ్రహ్మం. ఆకాశమంటే సర్వత్రా ప్రకాశించేది. ఈ ప్రపంచం ప్రళయకాలంలో చీకట్లో మునిగి వుండేది. అంటే, ఆ కాలంలో మహదాది అయిన ప్రకృతి సూక్ష్మ ప్రకృతైన తమస్సులో లీనమై తమస్సు భగవంతుడితో ఏకీభావంగా వుండేది. ఈ కారణం వల్ల అది ప్రత్యక్ష ప్రమాణానికి అగమ్యంగా, చీకట్లో వస్తువులు కళ్లకు కనబడని విధంగా, ఇది ప్రపంచమని గుర్తించగల చిహ్నాలు లేకుండా, శబ్దం వల్ల కూడా తెలియకుండా అంతా నిద్రావస్థలో వున్నట్లుండేది".

(దీని సారాంశం: భగవంతుడు అవ్యాకృతాత్ముడై రూపం, నామం, క్రియ లేనివాడై కొంతకాలం వుంటాడు. ఆ తరువాత మళ్లీ సృష్టిని సంకల్పిస్తాడు. ఆ సంకల్ప శక్తివల్ల ప్రకృతి క్షోభిల్లుతుంది. అప్పుడు మళ్లీ ఒకదానిలో నుండి ఇంకొకటి పుట్తాయి. ఈ విధంగా తమస్సు, ప్రకృతి, మహత్తు, అహంకారం, ఆకాశతన్మాత్రం, అగ్ని, జలతన్మాత్రం, జాలం, పృథివీ, పృథివినుండి ఔషదులు, వరుసగా ఉద్భవిస్తాయి. ఇది పరిణామం-ఎవోల్యూషన్ అంటారు. మొదలు జరిగేది విపరిణామం-ఇన్వొల్యూషన్. విపరిణామం చాప చుట్టడం లాంటిది కాగా, పరిణామం చాప విప్పి పరచడం లాంటిది. ఇవన్నీ చేసేవారు ఎవరు? వాటంతట అవే అయ్యాయా? ప్రకృతి జడం కాబట్టి దానంతట అది పరిణామం

చెందలేదు. జీవుడు కర్మబద్ధుడైనందున, ఆకాలంలో ప్రకృతిలో కలసి వున్నందున అతడికి ఆ శక్తిలేదు. కాబట్టి ఇవన్నీ చేసేవాడు భగవంతుడే! ఈ విధంగా సర్వం భగవంతుడే అని అర్థం అవుతున్నది).

వసిష్ఠుడు ఇంకా ఇలా చెప్పుకుంటూ పోయాడు: "ఆ బ్రహ్మకు మరీచి, మరీచికి కశ్యపుడు, కశ్యపుడికి భాస్కరుడు, భాస్కరుడికి మనువు, మనువుకు ఇక్ష్వాకుడు పుట్టారు. అయోధ్యను మనువు ఇక్ష్వాకుడికి ఇచ్చాడు కాబట్టి మీ వంశానికి ఇక్ష్వాకుడే మూలపురుషుడు. అతడికి కుక్షి, ఆ కుక్షికి వికుక్షి, అతడికి బాణుడు, బాణుడికి అరణ్యుడు జన్మించారు. ఈ అరణ్యుడే రావణుడితో యుద్ధం చేసి శపించాడు. ఆయన పాలనలో దొంగల భయం లాంటివి లేవు. ఆయన చాలా సత్యధర్మ నిష్ఠుడు. అరణ్యుడికి బృథువు కలిగాడు. అతడి కుమారుడే త్రిశంకుడు. ఇతడి అసలు పేరు సత్యవ్రతుడు. ఇతడి దేహంతో స్వర్గానికి పోయాడు. త్రిశంకుడికి ధుంధుమారుడు లేదా యువనాశ్వుడు, అతడికి బలశాలి మాంధాత పుట్టారు. మాంధాత కొడుకు సుడంది. అతడి కొడుకులు ధ్రువసంధి, ప్రసేనజతుడు. ధ్రువసంధి కొడుకు భరతుడు. అతడి కొడుకు అసితుడు. ఇతడిని హైహయులు, తాలజంఘులు యుద్ధంలో ఓడించి రాజ్యం నుండి వెళ్ళగొట్టారు. అతడు దేశాన్ని వదిలి మంచుకొండలో తిరిగేవాడు. ఆయనకు ఇద్దరు భార్యలు. వారిలో ఒకామె గర్భవతిగా వున్నప్పుడు సవతి విషం పెట్టింది. గర్భవతి కాళింది చ్యవనుడనే మునిదగ్గరకు పోయింది. ఆ ముని ఆమెకు వంశాన్ని ఉద్ధరించే సజ్జన స్తోత్రుడైన కొడుకు పుడుతాడని దీవించాడు".

"ఇంటికి పోయిన కాళిందికి బ్రహ్మతో సమానుడైన కొడుకు పుట్టాడు. వాడు విషంతో పుట్టాడు కాబట్టి సగరుడు అనే పేరు వచ్చింది అతడికి. ఆ రాజు సముద్రాన్ని తవ్వించాడు. తన కొడుకు అసమంజుడు చిన్న పిల్లలను చంపుతుండడం వల్ల దేశం నుండి వెళ్లగొట్టాడు. ఆ అసమంజుడికి అంశు మంతుడు పుట్టాడు. అతడికి దిలీపుడు, అతడికి భగీరథుడు, ఆయనకు కకుథ్సుడు, ఆతడికి రఘువు, అతడికి కల్మాషపాదుడు పుట్టారు. కకుథ్సుడు పేరుమీదే మీ వంశం వారిని కాకుథ్సులు అని పిలుస్తారు. కల్మాషపాదుడినే పురుషాదకుడు, సౌదాసుడు అని కూడా పిలుస్తారు. అతడి కొడుకు శనీఖనుడు,

అతడి కొడుకు సుదర్శనుడు. సుదర్శనుడికి నహుషుడు పుట్టాడు. నహుషుడి కొడుకు నాభాగుడు. అతడికి అజుడు, సువ్రతుడు అనే ఇద్దరు కొడుకులున్నారు. అజుడి కుమారుడు దశరథుడు. ఆయన కొడుకుల్లో నువ్వు పెద్దవాడివి. కాబట్టి రామచంద్రా! నీ తండ్రిలాగా నువ్వు కూడా భూమిని పాలించు. పాపరహితుడా! ఇక్ష్వాకు వంశంలో పుట్టినవారిలో ఇప్పటిదాకా వంశపరంపరంగా పెద్దవాడే రాజవుతున్నాడు. కాబట్టి నువ్వు కూడా వంశధర్మాన్ని అనుసరించి, అది తప్పించకు, రాజ్యాభిషేకానికి అంగీకరించి ప్రజలను పాలించు".

❖ ❖ ❖

సర్గ-111

రాజ్యం పాలించమని శ్రీరాముడిని వేడుకున్న వసిష్ఠుడు

వంశాచారాన్ని అనుసరించి పెద్దవాడైన శ్రీరాముడే రాజ్యాన్ని రాజుగా పాలించాలని ఆయనతో పూర్వరాజుల వృత్తాంతాన్ని వివరంగా చెప్పిన వసిష్ఠుడు, మరో న్యాయం ప్రకారం ఆయనే రాజుకావాలని వేడుకుంటూ ఇలా అన్నాడు: "రామచంద్రా! పురుషుడికి తండ్రి, తల్లి, ఆచార్యుడు అనే ముగ్గురు గురువులున్నారు. జన్మానికి కారణమైన తల్లిదండ్రులు, జ్ఞానోపదేశం చేసిన ఆచార్యుడు గురువులయ్యారు. ఆ ముగ్గురిలో శరీరాన్నిచ్చిన తల్లిదండ్రుల కంటే జ్ఞానసంపద ఇచ్చిన ఆచార్యుడే శ్రేష్ఠుడు. మనుష్యుడిగా పుట్టినప్పటికీ జ్ఞానం లేకపోతే పశువుతో సమానమే కదా? రెండో జన్మ ఇచ్చిన ఆచార్యుడు తండ్రి కంటే శ్రేష్ఠుడు. బ్రహ్మగ్రహణార్థమైన జన్మ బ్రహ్మప్రాప్తి అనే ఫలం కలిగిస్తుంది కాబట్టి ఇహ-పరాలలో రెండింటిలో శాశ్వతమైంది. అందుకే తండ్రి కంటే గురువు శ్రేష్ఠుడే కాని తల్లికంటే కాదు. శ్రీరామచంద్రా! నేను నీ తండ్రికి గురువును. నీకూ గురువుని. నామాట వింటే నీ సన్మార్గ ప్రవర్తనకు భంగం కలగదు. ఇదిగో బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు, నగరంలోని ఇతర పెద్ద మనుష్యులు, అందరూ నిన్ను ఏకగ్రీవంగా ప్రార్థిస్తున్నారు. కాబట్టి వీరినందరినీ నాయనా! పాలించు".

"ఇదిగో... నీ తల్లి కౌసల్య. ఆమె ధర్మానికి విరుద్ధంగా చెప్పే మనిషికాదు. అందునా వృద్ధురాలు....పుత్ర వియోగ బాధను సహించలేని వయసామెది. ఆమె నీ దుఃఖంతో మరణిస్తే ఆమె చావుకు నువ్వే కారణం అవుతావు. అది పుణ్యకార్యం కాదుకదా? తల్లిదండ్రులు జీవించి ఉన్నంతవరకు వారిసేవే తప్ప మరేదీ చేయరాదనే ధర్మశాస్త్రం నీకు తెలియదా? తల్లిమాట దాటి ప్రవర్తించతగునా? కాబట్టి ఆమె మాట వింటే నీకు పరలోక హాని కలగదు. నువ్వు ఇతర రాజులలాగా భుజబలంతో పరుల రాజ్యాన్ని ఆక్రమించాలని అనుకోవు. సత్యధర్మాలను ఆచరించడానికి ఇష్టపడతావు. వాటితోనే పరలోక సుఖాన్ని కోరుకుంటావు. సత్యధర్మాలకు విరుద్ధమైన పని చేయమని నేను

నీకు చెప్పడం లేదు. భరతుడి ప్రార్థన అంగీకరించడం నీ ఆత్మను అతిక్రమించి అంతఃకరణకు విరోధంగా చేయడం కాదు. జానకీశా! నువ్వు కష్టపడగలిగినా, సుకుమారి, జనకరాజు కుమారి సీతను చూడు. ఆమె ఎలా ఈ అడవుల్లో దుఃఖపడగలదు? ఆమెను నిష్కారణంగా దుఃఖపెట్టవచ్చా? కాబట్టి నామాట విను. నీకు ఆత్మాతివర్తన దోషం తగదు. ఆశ్రితులకు పరతంత్రుడివై వుండడం నీ స్వభావం. నువ్వు సామన్య ధర్మాలైన సత్యాన్ని, ధర్మాన్ని ఎలా మీరకూడదని భావిస్తున్నావో, అలాగే, ఆశ్రితులను అతిక్రమించి పోవడమనే ప్రత్యక్ష ధర్మాన్ని మరువరాదు. శరణాగతుడైన భరతుడి మాట కాదని ఎలా శరణాగత రక్షణ చేస్తావు?".

ఆచార్యుల కంటే తల్లిదండ్రులు శ్రేష్ఠులని వసిష్ఠుడికి చెప్పిన శ్రీరాముడు

వసిష్ఠుడికి జవాబుగా శ్రీరాముడు ఆచార్యుల కంటే తల్లిదండ్రులు శ్రేష్ఠులని అంటూ ఇలా చెప్పాడు: అయ్యా! సన్మార్గప్రవర్తన కలిగినవారిలో నువ్వెంతో గొప్పవాడివే! నువ్విలా చెప్తావేంటి? కొడుకుల కావాలని కోరి ఉపవాసాలు చేసి, వ్రతాలు చేసి, ఆహార నియమాలు పాటించి రోగాలతో వాళ్లు పడే కష్టాలకు ప్రత్యుపకారం ఎవరేం చేయగలరు? వారే కదా తల చూసి నీళ్లు, కడుపు చూసి అన్నం, వేళకు పెట్టి బిడ్డలను చలికి-గాలికి బాధపడకుండా దినదినం, గడియగడియ రక్షిస్తారు. వారితో గురుడు సమానమవుతాడా? గురుడు విద్య నేర్పే వాడన్నావు. గోడ వుంటేనే కదా బొమ్మలు గీయడం కాని, అలంకరించడం కాని చేయగలిగేది? అది లేకుంటే ఎవరేం చేయగలరు? అలాగే బిడ్డలు పుతితేనే కదా ఎవరైనా ఉపదేశించేది? గురువు దగ్గరకు పోయేదాకా పోషించిందీ, కావలిసింది ఇచ్చేదీ తల్లిదండ్రులే కదా? అలాంటి తల్లిదండ్రుల కంటే గురువెలా ఎక్కువవుతాడు? శ్రుతిలో కూడా తల్లిని, తండ్రిని చెప్పిన తరువాతే కదా ఆచార్యుడిని చెప్పింది? ఆ తల్లిదండ్రులు తమ పిల్లలు కాపాడుకోలేని దశలో వున్నప్పుడు బుజ్జగిస్తూ పెంచుతారు. సంతోషమైన మాటలు చెప్తారు. వారి మేలే కోరుకుంటారు. ఇలాంటి వారితో ఇతరులెలా సమానులవుతారు? తల్లితో సమానమైన దైవం, తండ్రితో సమానమైన గురువు లేదు".

"ఈ కారణం వల్ల, నా కన్న తండ్రి నన్నిలా చేయమని, మీ అందరికీ తెలిసే విధంగా నాకు ఆజ్ఞ ఇచ్చాడుకదా? ఆయన మాట అబద్ధమై పోయేట్లు చేయడం నాకు న్యాయమా? మీమాట విననందుకు క్షమించమని అడుగవచ్చు.... మరణించినవాడిని ఏమని ప్రార్థిస్తా? మీ మాట మీరితే మీకొచ్చే నష్టం కాని, కష్టం కాని లేదు కదా? ఆయన మాట మీరితే ఆయనకు స్వర్గహాని, నరకప్రాప్తి కలుగుతుంది కదా? నన్ను కని, పెంచినవాడికి ఇదా నేను చేసే ఉపకారం? తండ్రి లేనప్పుడు తల్లి ఆజ్ఞ పాటించాలని అన్నావు. సంతోషమే....కాని అదెప్పుడు? తండ్రి ఏమీ చెప్పకపోతే కదా? నాకు నా తండ్రి ఆజ్ఞ ఎలాంటిదో, ఆమెకు తన భర్త ఆజ్ఞ కూడా అలాంటిదే! భరతుడు ఆశ్రితుడు...ఆశ్రిత త్యాగం ధర్మం కాదన్నావు......సత్యమే! నేను దానిని కాదన. పితృవాక్యపాలన అనే ప్రారబ్దం అతడికి అడ్డుపడింది. అది తీరగానే అతడి కోరిక నెరవేరుస్తా. కాలవిలంబనమే కాని పూర్ణత్యాగం లేదు. ప్రజలందరూ యాచిస్తున్నారన్నావు. వారికి కావాల్సింది పరిపాలనే కదా? పాలించేవారెవరైతే వారికెందుకు? నేను కాకపోతే నా తమ్ముడు పాలిస్తాడు. దానివల్ల వారికే హాని లేదు కదా? కాబట్టి తండ్రి ఆజ్ఞ మీరి ప్రవర్తించడం నాచేతకాదు".

అని శ్రీరాముడనగానే, విన్న భరతుడు నిరాశతో, ఇక వాదనలతో లాభం లేదనుకుంటాడు. మొండికేసి పని పూర్తి చేయాలని భావించాడు. అన్న అయ్యో...పాపం...అనేట్లు చేయాలనుకుంటాడు. సుమంత్రుడితో తనకొరకు ఒక దర్భాసనం ఏర్పాటు చేయమని కోరాడు. రామచంద్రమూర్తికి తన మీద దయకలిగి అయోధ్యకు వస్తానని మాటిచ్చేవరకు, అప్పు ఇచ్చిన బ్రాహ్మణుడు ఇచ్చిన అప్పు రాబట్టుకోవడానికి అప్పు తీసుకున్న వాడి ఇంటి వాకిట్లో ముఖానికి గుడ్డ వేసుకుని కూడు-నీళ్లు ముట్టుకోకుండా ఎలా వుంటాడో అలా పండుకుంటానని, ఇది తన నిశ్చయం అని భరతుడు సుమంత్రుడితో చెప్పాడు. అలా చేయడానికి శ్రీరాముడి ఆజ్ఞ కొరకు ఆయన ముఖమే చూస్తూ సుమంత్రుడు నిలబడి వుంటే, తానే దర్భలు పరచుకుని పండుకోవడానికి సిద్ధపడ్డ భరతుడిని చూసి రామచంద్రమూర్తి ఇలా అన్నాడు: "తమ్ముడా! అప్పిచ్చిన బ్రాహ్మణుడు తన అప్పు రాబట్టుకోవడానికి, అప్పు తీసుకున్న వాడి వాకిటి ముందర ఒకపక్కే ఇటు-అటు పొర్లకుండా పండుకుంటాడు. నీకు నేను ఏ అపకారం చేశానని

నువ్వలా చేస్తానంటునావు? అది బ్రాహ్మణుడికి సరిపోతుంది కాని తలమీద కిరీటం పెట్టుకుని రాజ్యమేలాల్సిన క్షత్రుయుడికి ఇది ధర్మమా? లేలే! ఇలాంటి వ్రతాన్ని వదులు. నా మాట విని మళ్లీ అయోధ్యకు పో".

ఇలా రామచంద్రమూర్తి చెప్పగా విని భరతుడు ప్రజల వైపు తిరిగి, "ప్రజలారా! మా అన్నకు నామీద దయరాలేదు. మీరు ఆయనకు ముఖ్యులుకదా! మీరైనా చెప్పి అయోధ్యకు పిలుచుకుని పొండి. మీరే ఆయనకు సరైన సమాధానం చెప్పండి" అన్నాడు. ప్రజలప్పుడు భరతుడితో, "భరతా! నువ్వు చెప్పినదానికంటే ఎక్కువగా మేమేం చెప్తాం? నీకు ఆయన చెప్తున్న ప్రతి మాటను బట్టి ఆయన మనసు తెల్సిపోయింది. తప్పొప్పులు తెల్సినవాడు కాబట్టి అన్నీ చక్కగానే చెప్పాడు. ఆయనేం తప్పు చెప్పాడని మేం ఆయనకు చెప్పగలం? తండ్రి వాక్యపాలన చేయాలన్నదే ఆయన కోరిక. ఆయనకు దానిమీద వున్న ప్రీతి రాజ్యం మీద కాని, మరి దేనిమీదా కాని లేదు. ఇలాంటివాదిని ఒప్పించడం మాకు సాధ్యమా?"

ప్రజలు చెప్పిన మాటలు విన్న రామచంద్రమూర్తి, "భరతా! లోకులు చెప్పిన మాటలు విన్నావు కదా? నిష్పక్షపాతంగా చెప్పేవారి మాటలు ఇలాగే వుంటాయి. నువ్వు ధర్మ పక్షపాతివిగా కాకుండా నామీద ప్రేమతో మాట్లాడుతున్నావు. కాబట్టి వీరి మాట, నామాట మనసులో పెట్టుకుని న్యాయమార్గంలో పో. క్షత్రియుడు దర్భలమీద పండుకో కూడదు. అది స్వధర్మ విరుద్ధం. కాబట్టి దోషం పోవడానికి నన్ను, నీటిని తాకు" అన్నాడు. శ్రీరాముడిలా చెప్పగానే భరతుడు దర్భల మీద నుండి లేచి, నీటిని తాకి, ప్రజలందరూ వినేట్లు ఇలా అన్నాడు: " తండ్రిని నాకు రాజ్యం ఇవ్వమని నేను అడగలేదు. ఇలాంటి తప్పుడు పని చేయమని తల్లిని కూడా కోరలేదు. శ్రీరాముడు అడవికి పోయిన వార్త కూడా నాకు తెలియదు. తండ్రి మాట పరిపాలించడం ఆవశ్యకమైతే మా అన్నగారికి మారుగా నేనుంటా. ప్రతినిధులను ఏర్పాటుచేయడం శాస్త్ర సమ్మతమైనదే కదా? కాబట్టి ఈ పద్ధతికి అంగీకరించండి".

వనవాసం తరువాత రాజ్యం తీసుకోవడానికి అంగీకరించిన శ్రీరాముడు

భరతుడు చెప్పిన "తథ్యం", "హితం" అయిన మాటకు రామచంద్రమూర్తి ఆశ్చర్యపడి పౌరులతో ఇలా అన్నాడు: "ఆర్యులారా! తండ్రి జీవించి వుండగా ఆయన కొన్నదానిని, అమ్మినదానిని, కుదువ వుంచినదానిని, ఇప్పుడాయన లేడనే కారణాన వీడుకాని, నేను కాని, ఒప్పుకోకుండా వుండవచ్చా? నేనేమో తండ్రిమాట వ్యర్థం చేయకూడదని అంటున్నా. వీడేమో తండ్రి మాట లక్ష్యపెట్టక తాను కూడా అడవిలో వుండి తండ్రి ఆజ్ఞ మీరితే నేనేం చేయగలను? తండ్రి నాకు వనవాసం ఇచ్చి, దానికి వెలగా నా రాజ్యాన్ని తీసుకున్నాడు. దానినెలా మార్చడం సాధ్యం? నాకు ప్రతినిధిగా తాను అడవుల్లో వుంటానంటున్నాడు. శక్తిలేక, వేరే మార్గం లేకపోతే కదా, ప్రతినిధులను శాస్త్రం అంగీకరిస్తున్నది? వారుణ స్నానం చేయలేని వాడికి కదా గౌణ స్నానం విధించబడింది? వారుణ స్నానానికి సక్తి వుంటే, గౌణస్నానం చేయవచ్చా? ఆపద్ధర్మం ఆపదలలో కాని, తక్కిన వేళల్లో ఆచరించవచ్చా? కాబట్టి నేను సన్యాసం చేయడానికి శక్తి వుండగా నాకు బదులుగా చిన్నవాడిని వనవాసం చేయమని ఎలా చెప్తా? పెద్దవాడిని నేనే చేయలేకపోతే వీడేలా చేస్తాడు?"

"ఆర్యులారా! వీడు తండ్రిని, తల్లిని దూషిస్తున్నాడు కాని, వాళ్లలో దోషం లేదు. కైక న్యాయమే చెప్పింది. వివాహ కాలంలో దశరథుడు చేసిన వాగ్దానమే కదా ఆమె అడిగింది? ఒకడు చెప్పిన మాట ప్రకారం నడుచుకోవడం తప్పా? దశరథుడు కూడా ధర్మ మార్గంలోనే పయనించాడు. తాను చేసిన వాగ్దానాన్ని నెరవేర్చడంలో తప్పేంటి? ఇందులో అధర్మం ఏమిటి? ఇతడిలో దోషం లేదు. దీరాత్ముడు, స్తోత్రపాత్రుడు, ఓర్పుకలవాడు, పెద్దల సేవంటే మిక్కిలి భక్తి కలవాడు కాబట్టే నా సేవ కోరుతున్నాడు. ఇవన్నీ నాకు తెలుసు. కాబట్టి సత్యస్వభావం కల భరతుడికి క్షేమం కలుగుగాక! నేను పద్నాలుగు సంవత్సరాలు వనవాసంలో వుండి, ఆ తరువాత అయోధ్యకు వచ్చి పట్టాభిషేకం చేసుకుని ఈ తమ్ముడితో వుంటా. ఏవిధంగానైనా తల్లి కైక చెప్పిన మాట నెరవేరుస్తా. పెద్దది కదా తల్లి! ఆమె మాటను చిన్నవాడినైన నేను నెరవేర్చినట్లే, తనకంటే పెద్దవాడినైన నా మాటను, తండ్రి లాంటివాడి మాటను,వినాలని, గౌరవం వుంచాలని భరతుడు కూడా అనుకోవాలి కదా? ఇంత మొండితనమా?"

సర్గ-112

భరతుడిని సమాధానపర్చిన శ్రీరాముడు

ఈ ప్రకారం శ్రీరాముడు చెప్పగా, సభలో లేని-వారికి కనపడని, సిద్ధులు, ఋషులు, ఆ అన్నదమ్ముల మాటలు విని, “ఔరా! ఇలాంటి గొప్ప మనసు, గొప్ప స్వభావం కలవారిని కొడుకులుగా కన్న దశరథుడు ఎంత పుణ్యాత్ముడో కదా? అతడెంత గొప్పవాడు కాకపోతే ఇంత గొప్పవారిని కొడుకులుగా కంటాడా?” అని శ్రీరామభరతులను తమ మనసులోనే పొగిడారు. ఇక సభలో వుండి వారి సంవాదం వింటున్న గొప్ప మునులు దశకంఠుడి చావు కోరుతున్న వారైనందున శ్రీరాముడు అయోధ్యకు పోవడానికి సమ్మతించని వారై వున్నారు. వారంతా భరతుడిని చూసి, “భరతా! నీ తండ్రి తరించాలని నీకు కోరిక వుందికదా? అందుకే శ్రీరాముడు చెప్పినట్లే చేయి. శ్రీరాముడు తండ్రి ఋణం తీర్చడమే సరైంది. కైక అప్పు తీర్చినందువలనే కదా నీ తండ్రి స్వర్గానికి పోయాడు? లేకపోతె అసత్యమాడిన దోషానికి నరకం పాలై వుండేవాడు కదా?” అని అన్నారు.

ఈ విధంగా గంధర్వులు, ఋషులు, సిద్ధులు చెప్పి వెళ్లిపోయారు. మునుల మాటలకు శ్రీరాముడు వారిని గౌరవించాడు. అందరూ శ్రీరాముడి మాటలనే అంగీకరించడంతో, అన్న అయోధ్యకు రాడే? నా గతి ఏమిటి? అని భయంతో వణుకుతూ, రెండు చేతులు జోడించి వినయంగా శ్రీరాముడితో ఇలా అన్నాడు భరతుడు: “అన్నా! అసమానమైన మన వంశక్రమంలో వచ్చినదైన క్షత్రియ ధర్మాన్ని మనసులో వుంచుకుని నా తల్లి కోరిక నెరవేర్చు. ఈ భూభారం నేనొక్కడినే మోయలేను. ఒకవేళ కోరినా ప్రజలను సంతోషపర్చలేను. మన బంధువులు, మన యుద్ధ శూరులు, మన హితం కోరేవారు, మన మిత్రులు అందరూ నీరాక కోసం ఎదురు చూస్తున్నారు” అని ఆయన కాళ్లమీద పడ్డాడు.

జవాబుగా శ్రీరాముడు, “శత్రువులకు భయం కలిగించగల నీకు భూమిని పాలించడం కష్టమా? అది నువ్వు ఒక్కడివే మోయడం ఎందుకు? మంత్రులు, మిత్రులు, బుద్ధిమంతులు శ్రేయస్కరమైన మాటలే చెప్తారు. కాబట్టి వీరి

అభిప్రాయం ప్రకారం పాలన చేయి. నాయనా! భరతా! ఎందుకు కాదంటావు? చెలియలికట్ట దాటి సముద్రుడు లోకాలను ముంచినా ఈ రామచంద్రుడు ఆడినమాట తప్పడు. కామంతోనో, లోభంతోనో, నీ తల్లి కోరింది నిజం. ఎంత చెడ్డదైనా తల్లి తల్లే! అలాంటి తల్లి మాట కొడుకు వినకుండా వుండవచ్చా? ఆలోచనలన్నీ వదిలిపెట్టు" అని అంటాడు.

భరతుడికి తన పాదుకలను ఇచ్చిన శ్రీరాముడు

శ్రీరాముడు ఇలా తెగేసి చెప్పగా భరతుడిలా అన్నాడు. "అన్నా! సరే! నీ మాట వింటా. నేనెంత ప్రార్థించినా నీ మనసు కరగడం లేదు. నీకు నామీద నిర్మలమైన మనసుంటే, ఈ బంగారు పాదుకలమీద నీ పాదాలను వుంచు". శ్రీరాముడు అలాగే చేశాడు. భరతుడు వాటిని భక్తితో తీసుకుని రెండు చేతులు జోడించి అన్నతో ఇలా అన్నాడు: "అన్నా! నేను చెప్పే మాట సావధానుడవై విను. రోజులు లెక్కపెట్టుకుంటూ, జడలు ధరించి, జింక చర్మం కప్పుకుని, ఊరి బయట ఇల్లు ఏర్పాటు చేసుకుని, రాజ్యతంత్రం అంతా పాదుకలకు అప్పచెప్పి, ప్రాణం బిగబట్టి వుంటా. పదిహేనవ సంవత్సరం మొదటి రోజున నువ్వు రాకపోతే నేను అగ్నిలో దూకుతా". భరతుడి మాటలకు శ్రీరాముడు మాట ఇచ్చాడు. కైకను సంతోషపెట్టమని, ఇక పోయిరమ్మని చెప్పి పంపాడు భరతశత్రుఘ్నులను.

భరతుడు పాదుకలను పట్టపు ఏనుగు కుంభస్థలంలో వినయంగా పెట్టి, శ్రీరాముడికి నమస్కరించాడు. రామచంద్రమూర్తి కూడా అందరికీ వీడ్కోలు పలికాడు.

❖ ❖ ❖

సర్గ-113

అయోధ్యకు ప్రయాణమై పోతూ భరద్వాజ ఆశ్రమానికి పోయిన భరతుడు

భరతుడు పట్టుపు ఏనుగు మీద వున్న పాదుకలను తీసి తన తలమీద పెట్టుకుని, శత్రుఘ్నుడితో కలిసి రథం ఎక్కాడు. వసిష్ఠుడు, జాబాలి, వామదేవుడు ముందుగా తూర్పువైపు వెళ్లారు. మంత్రులతో కలిసి భరతుడు మందాకినీ నది పక్కగా, తూర్పు ముఖంగా గిరికి ప్రదక్షిణగా పోతూ, అక్కడి దృశ్యాలను చూసుకుంటూ, సేనతో సహా చిత్రకూటం సమీపంలో వున్న భరద్వాజ ఆశ్రమాన్ని చూశాడు. రథం దిగి భరద్వాజుడిని సమీపించి, అభివాదం చేశాడు. ఆయన సంతోషంగా, "నాయనా! సూర్యప్రతాపుడైన శ్రీరామచంద్రమూర్తిని చూశావా? నువ్వు పోయిన పని అయిందా?" అని అడిగాడు. తానెన్ని విధాలుగా ప్రార్థించినా శ్రీరాముడి మనసు తిరగలేదని, తానే కాకుండా గురువైన వసిష్ఠుడు ఎంతో బతిమాలాడనీ, అయినా తండ్రి చెప్పిన విధంగా పద్నాలుగు సంవత్సరాలు వనవాసం చేస్తానన్నాడనీ భరతుడు చెప్పాడు. వసిష్ఠుడి మాట ప్రకారం శ్రీరామచంద్రుడు పాదుకలమీద ఎక్కి దిగి, వాటిని ప్రజాపాలనార్థమై ఇచ్చిన విషయం కూడా చెప్పాడు. ఆ రెండు పావుకోళ్లు తీసుకుని అయోధ్యకు పోతున్నానన్నాడు.

భరద్వాజుడప్పుడు, "రాజకుమారా! నీకు సాదుస్వభావం వల్ల, మంచి నడవడి వల్ల, సత్పురుషులతో స్తోత్రం చేయబడ్డవాడివని పేరుంది. పుణ్యాత్మా! నీకిలాంటి నడవడి గొప్పది. స్వభావసిద్ధం. నీలాంటి కొడుకు పుట్టినందువల్ల మీ తండ్రి దశరథుడు చనిపోయినా జీవించినవాడితో సమానం" అని చెప్పగా, భరతుడు ఆ మునికి నమస్కారం చేసి బయల్దేరాడు. సైన్యం వెంట వస్తుంటే, భరతుడు అయోధ్యకు పోతూ, యమునానదిని దాటి, సంతోషంగా గంగానదిని చూసి, అదీ దాటి, శృంగిబేరపురంలో ప్రవేశించి, ప్రయాణమై పోయి, తండ్రి-అన్న లేని అయోధ్యను చూశాడు. భరతుడు సారథితో, "సారథీ! అయోధ్య వున్న పరిస్థితి చూడు. అందం చెడి, సంతోషహీనమై, దుఃఖంతో కూడి, నిస్సారమై ఎలా వుందో చూడు" అంటాడు.

సర్గ-114

ఆనందహీనమైన అయోధ్యాపురి ప్రవేశించిన భరతుడు

సీతారామలక్ష్మణులు లేని అయోధ్యలొ, అదలించే వారు లేకుండా పిల్లులు, గూబలు విస్తారంగా తిరుగుతున్న దానిలాగా వున్న అయోధ్యలో, బాధతో కూడుకున్న అయోధ్యలో, కాంతిహీనమైన అయోధ్యలో, చిమ్మచీకట్లు కమ్ముకున్నట్లుగా వున్నా అయోధ్యలో, భరతుడు దుఃఖాక్రాంతమైన మనసుతో ప్రవేశించాడు. భరతుడు రథం మీదే వుండి, దిగకుండా, సారథిని చూసి, "అయ్యో! సారథీ! శ్రీరామచంద్రమూర్తి ఈ వూళ్లో వున్నప్పటిలాగా శుభకరమైన పాటలు, మంగళ వాద్యాలు చెవుల వినబడడం లేదు. ప్రసిద్ధమైన చందనం వాసనతో, పూలదండల వాసనతో నిండిన మనోహరమైన గాలి వీయడం లేదు. శ్రీరామచంద్రమూర్తి నగరంలో లేకపోవడం వల్లే కదా! పల్లకీల మోతలు కాని, ఏనుగుల ఘీంకారాలు కాని, గుర్రాల సకిలింపులు కాని, రథాల చప్పుడులు కాని వినపడడం లేదు. సుఖం అనుభవించాల్సిన వారు కూడా దుఃఖంగా కనపడుతున్నారు. ఎవరూ ఆభరణాలు ధరించలేదు. విలాసంగా తిరగడం లేదు. ఈ వూరి కాంతి మా అన్నతోనే పోయింది. ఇప్పుడీ అయోధ్య జడివానతో కమ్ముకున్న శుక్ల పక్ష రాత్రిలాగా వుంది. సఖుడా! ఈ వూరి ప్రజల సంతోషం శ్రీరామచంద్రమూర్తితోనే పోయింది. ఆయన వస్తేనే కాని మళ్లీ తిరిగిరాదు. కాబట్టి ఆయనొచ్చే వరకు వీరి స్థితి ఇంతే!" అని అంటూ దుఃఖంతొ రాజు ఇంట్లోకి ప్రవేశించాడు. సింహంలేని గుహలోకి నిర్భయంగా పోయినట్లు అందులోకి పోయిన భరతుడికి ఆ ఇల్లు సూర్యుడు లేని ఆకాశంలాగా కనిపించింది. అది చూసి బాధ పడ్డాడు భరతుడు.

❖ ❖ ❖

సర్గ-115

నందిగ్రామం చేరిన భరతుడు

వూళ్లోకి తన వెంట వచ్చినవారందరినీ ఎవరెవరి ఇళ్లకు వాళ్లను పొమ్మని చెప్పాడు భరతుడు. అప్పుడు, వ్రతదీక్షలో వున్న భరతుడు వసిష్ఠుడితో, "నేను ఇక్కడ వుంటే శోకంతో బతకలేను. ఏది చూసినా నాకు తండ్రి, అన్న జ్ఞాపకానికి వస్తుంటారు. వారనుభవించాల్సిన వాటిని వారు లేకుండా నేనెలా అనుభవిస్తా? ఇక్కడ నాకు సుఖం లేదు. నందిగ్రామం పల్లెటూరు. అక్కడికి పోయి వుంటా. మీరంతా నాకు ఆజ్ఞ ఇవ్వండి. తండ్రి, రాజైన దశరథుడు స్వర్గానికి పోయాడు. గురువైన శ్రీరామచంద్రుడు అడవులకు పోయాడు. నేను ఆ నందిగ్రామంలోనే శ్రీరాముడి రాకకొరకు వేచి వుంటా. మళ్లీ శ్రీరామచంద్రుడితో తిరిగి వస్తా. రాష్ట్రానికంతా శ్రీరాముడే ప్రభువు కాని నేను కాను. కాబట్టి నేనెక్కడ వున్నా ఒకటే. రాజైన వాడే రాజధానిలో వుండాలి" అన్నాడు. భరతుడి మాటలను సుమంత్రుడు, ఇతర మంత్రులు, గురువైన వసిష్ఠుడు శ్లాఘించారు. ఆయన అలా చేస్తానంటే తమకు సమ్మతమే అన్నారు. మంత్రులంతా అలా తనకు అనుకూలంగా చెప్పడంతో శీఘ్రంగా రథాన్ని సిద్ధం చేయమని సారథిని ఆజ్ఞాపించాడు భరతుడు. తల్లులందరికీ నమస్కారం చేశాడు. శత్రుఘ్నుడు తోడురాగా, గురువు, మంత్రులు ముందు పోతుంటే, తూర్పు దిక్కుగా ప్రయాణమై పోయాడు. వచ్చిన ఒక్క పూట కూడా భోజనానికి అయోధ్యలో వుండలేదు. సేనలు, మంత్రులు వెంటరాగా, పాదుకలను రెంటినీ తలమీద పెట్టుకుని భరతుడు నందిగ్రామం చేరాడు.

అక్కడ వసిష్ఠుడితో ఇలా అన్నాడు: "మునీంద్రా! రాజ్యాన్ని తాను వచ్చేవరకు నన్ను పాలించమని చెప్పి, తనకు మారుగా తన స్థానంలో వుండడానికి ఈ పాదుకలను ఇచ్చాడు శ్రీరాముడు. కాబట్టి ప్రజల యోగక్షేమాలను ఇక నుంచి ఇవే విచారిస్తాయి". అ తరువాత మంత్రులతో, "మ ఆన్నగారి పాదాలకు ఛత్రం పట్టండి. వింజామరలు వీచండి. ఈ చరణాలే ఇకమీద భూమిని రక్షించే భారాన్ని వహిస్తాయి. నామీద ఎంతో దయతో మా అన్న వీటినిచ్చాడు.

మళ్లీ శ్రీరామచంద్రమూర్తి తిరిగి వచ్చేవరకు భక్తితో వీటిని కాపాడుతూ వుంటా. ఆయన రాగానే రాజ్యంతో సహా వీటిని ఆయనకు సమర్పించి ఆయన్ను కొలుస్తా. అలా చేసి అపకీర్తిని పోగొట్టుకుంటా. మా అన్న రాజ్యాన్ని ఆయనకే ఇవ్వడం అందరికీ సంతోషం కలిగిస్తుంది. రాజ్యం చేయడం కంటే ఇదే నాకు నాలుగింతలు మేలు చేస్తుంది" అంటాడు.

ఇలా మునివేషం ధరించిన భరతుడు పావుకోళ్లు రెంటినీ బంగారు సింహాసనం మీద వుంచి సంతోషంతో వాటికి పట్టాభిషేకం చేసి, ప్రతిరోజూ ఎవరైనా తెచ్చి ఇచ్చిన కానుకలుంటే వాటిని ముందుగా పాదుకలకు–చరణాలకు సమర్పించి, ఆ నివేదితాన్ని తరువాత తానూ గ్రహిస్తూ రాజ్యాన్ని చేశాడు.

❖ ❖ ❖

సర్గ-116

చిత్రకూటం వదిలిపోయిన ఋషులు

చిత్రకూటంలో శ్రీరామచంద్రమూర్తి తమ్ముడు లక్ష్మణుడితో వుంటూ, భరతుడు వచ్చిపోయిన తరువాత, ఆ పర్వతం మీద వున్న మునులు తనను చూసి తమలో తాము గుస-గుసలాడుకుంటూ ఎదో చెప్పబోయి ఆగిపోవడం గమనించాడు శ్రీరాముడు. వారిని చూసి వారేం చెప్పదలచుకున్నారో తెల్సుకుందామని ఆ మునులలో పెద్దవాడైన ఒకరిని చూసి చేతులు జోడించి, నమస్కారం చేసి, శ్రీరామచంద్రమూర్తి ఇలా అన్నాడు: "మునివర్యా! ఇదివరకు లాగా నేనిప్పుడు నడచుకోవడం లేదా? నా తమ్ముడేమైనా ధర్మం తప్పాడా? లేక సీత నా సేవ చేస్తూ, పొరపాటున మీ సేవలను పతివ్రతలకు తగనట్లు ప్రవర్తించిందా? ఎందుకిలా ఋషీశ్వరులు తత్తరపడుతున్నారు?".

తమ కష్టాలను శ్రీరాముడితో చెప్పిన వృద్ధఋషి

శ్రీరాముడిలా అడగగానే వయసులో పెద్దవాడైన ఆ ముని వణకుతూ ఇలా చెప్పాడు. "నాయనా! రామచంద్రా! స్వభావంగా గొప్ప శుభాచారంకల సీత తపస్వుల విషయంలో వక్రమార్గాన ఎలా పోతుంది? ఆమెలో ఏ లోపం లేదు. నిన్ను ఉద్దేశించే ఈ మునులు ఆడగాలనుకుంటున్నారు. వారి తత్తరపాటుకు నువ్వే కారణం. నువ్వేం చేశానంటావా? రాక్షసులవల్ల బాధపడ్తూ ఇలా గుస-గుసలాడుకుంటున్నారు. రాక్షసరాజైన రావణాసురుడికి ఖరుడు అనే ఒక తమ్ముడున్నాడు. వాడు దయాహీనుడు. మనుష్యులను తింటాడు. పొగరుబోతు....పాపాత్ముడు...యుద్ధంలో ఆరితేరినవాడు. వాడు నువ్వు ఇక్కడికి వచ్చినప్పటి నుంచీ మమ్మల్ని బాదిస్తున్నాడు. రామచంద్రా! నువ్వు ఇక్కడ వుండడం వాడికి ఇష్టం లేదు. మీరు వచ్చిన తరువాత మమ్మల్ని ఇంకా ఎక్కువ బాదిస్తున్నాడు. మమ్ము హింసిస్తున్నాదు. అపరిశుద్ధ వస్తువులను మామీద విసిరేస్తున్నారు. మునులను చంపుతున్నారు. హోమాలను నాశనం చేస్తున్నారు. అందుకే చావగా మిగిలిన వాళ్లం మరెక్కడికైనా పోయి బతుకుదామని అనుకుంటున్నాం. ఆ విషయమే నీకు చెప్పమని మిగతా మునులు అన్నారు.

ఇక్కడికి చాలా దూరంగా వున్న పురాణాశ్రమానికి వెళ్ళుదామని ఆలోచించాం. మీరెంత బలవంతులైనా, మీరు కూడా సీతతో ఇక్కడ వుండడం క్షేమం కాదు. ఖరుడు మనమీదికి రాకముందే బయల్దేరుదాం. వాడితో కలహం హానికరం".

ఆ మునీశ్వరుడు అలా చెప్పగా రామచంద్రమూర్తి, తనకీ విషయం ఇంతకు ముందే ఎందుకు చెప్పలేదని అన్నాడు. చెప్తే దానికి ప్రతిక్రియ చేసేవాడిని కదా అంటాడు. ఇప్పుడు చెప్పారు కాబట్టి ఇక ముందు వాడు మునులను ఏం చేయకుండా రక్షిస్తానని అంటాడు. వారికొచ్చిన భయం ఏమీ లేదని ఎన్ని విధాల సమాధాన పరచినా వారు వినలేదు. వారి ఇష్టప్రకారం వెళ్లిపోయారు. రామచంద్రుడు కూడా అవారి వెంట కొంత దూరం పోయి మరలి వచ్చాడు.

❖ ❖ ❖

సర్గ-117

అత్రి ముని ఆశ్రమం చేరిన సీతారామలక్ష్మణులు

శ్రీరామచంద్రమూర్తి ఆ మునులంతా పోయిన తరువాత తాను ఇంకా అక్కడ వుండడానికి కారణం ఏముందని ఆలోచించాడు. భరతుడు పరివారంతో, తల్లులతో వచ్చి తనను చూసి దుఃఖపడిన విషయం ఆయనకు పలుమార్లు గుర్తుకు రాసాగాయి. మనసు అన్యాక్రాంతం అవుతున్నది. భరతుడు అక్కడికి సమీపంలోనే సేనతో సహా దిగాడు. ఆ సేనలోని ఏనుగుల, గుర్రాల లద్దె కంపుకొడుతున్నది. కాబట్టి అక్కడ వుండడం ఆరోగ్యం కాదనుకుంటాడు. ఈ కారణాన చిత్రకూటం వదిలి దూరంగా పోవడమే తగినపని అని ఆలోచించి సీతారామలక్ష్మణులు ముగ్గురూ బయల్దేరి అత్రి మహామిని ఆశ్రమానికి చేరుకుంటారు. ఆయనకు నమస్కారం చేశారు. ఆయన సంతోషంగా తన బిడ్డలను ఆదరించిన విధంగా వారిని ఆదరించి, సగౌరవంగా భోజనం పెట్టి, తన భార్య, పరమ పతివ్రత అనసూయాదేవిని సీతాదేవికి పరిచయం చేశాడు.

పరిచయం చేస్తూ అత్రి మహాముని సీతాదేవిని చూపిస్తూ అనసూయతో, "ఈ పతివ్రతా శిరోమణి భూదేవి కూతురు. ఈమెను నువ్వు గౌరవించు" అని చెప్పాడు. తరువాత అనసూయాదేవి గొప్పతనాన్ని అత్రి శ్రీరాముడితో ఇలా చెప్పాడు: "చినుకనేది కురవకుండా మనుష్యులు ఇతర జీవికోటులు మాడిపోతే, తన తపస్సుతో ఫలాలను, కందమూలాలను పది సంవత్సరాలుండేలా చేసింది. గంగానది ప్రవహించేదిగా చేసింది. పదివేల సంవత్సరాలు భర్త అనుమతితో విఘ్నం లేకుండా తీవ్ర నిష్ఠపూని తపస్సు చేసింది. దేవకార్యం నిర్వహించడానికి ఆమె పది దినాలు ఒక రాత్రిగా సూర్యోదయం అనేది లేకుండా చేసింది. వ్రతాలన్నీ సొంతం చేసి స్నాతక కర్మ జరిపింది. నువ్వు నీతల్లిలాగా ఈమెను పూజించు. నీపూజకు ఈమె యోగ్యురాలు. ఈమె సమస్త భూతాల నమస్కారాలకు యోగ్యురాలు. సత్కీర్తి కలది...కోపం లేనిది...తాను చేసిన పుణ్యకర్మల వల్ల అసూయలేనిది అనే పేరు సంపాదించింది. స్త్రీ ధర్మమైన పాతివ్రత్యానికి సంబంధించి ఇతరులకు సాధ్యంకాని కార్యాలు చేయడం వల్ల

అసూయపడరానిదని కీర్తి పొందింది. నువ్వు సీతాదేవిని ఈమెకు నమస్కారం చేయమని చెప్పు". అని అత్రిమహాముని చెప్పగా శ్రీరామచంద్రమూర్తి సీతాదేవిని చూసి మునీంద్రుడు చెప్పినట్లు అనసూయను దర్శించమని చెప్పి అలా చేస్తే ఆమెకు మేలు కలుగుతుందని అంటాడు.

సీతకు హితోపదేశం చేసిన అనసూయ

భర్త చెప్పినట్లే సీతాదేవి పోయి, దేహమంతా ముడుతలు పడి, నిండు ముసలితనంతో, తెల్లటి వెంట్రుకల జడలతో, గాలివీస్తే వణికే అరటి చెట్టులాగా వున్న వృద్ధురాలిని చూసింది. ఆమెను చూడగానే, పతివ్రతా ధర్మం ఈ రూపంలో వచ్చిందని అనే విధంగా వుందని అనిపించింది సీతకు. తన పేరు చెప్పి నమస్కారం చేసి రెండు చేతులు జోడించి నిలువబడి కుశలం అడిగింది అనసూయను. నిర్మలమైన మనసున్న అనసూయాదేవి సంతోషంతో ధర్మాత్మురాలైన సీతతో, "సీతా! నువ్వెంత పుణ్యచరిత్రవే! పాతివ్రత్యమే గొప్పదిగా భావించి చుట్టాలను, సంపదను, సౌఖ్యాన్ని వదిలి, మహారాజు కోడలినని కాని, మహారాజు కూతురునని కాని లక్ష్యపెట్టకుండా, తండ్రిని యదార్థవాడిని చేయాలన్న ఉద్దేశంతో అడవికి వస్తున్న భర్తతో వచ్చావు. ఇలాంటి స్త్రీలు కూడా లోకంలో వుంటారా? పతివ్రతైన స్త్రీకి, భర్త ఎలాంటివాడైనా...... భోగాలనుభవించె నాగారికుడైనా, అడవిలో కష్టాలనుభవించే వనచర ప్రాయుడైనా, గుణహీనుడైనా, దరిద్రుడైనా, దుష్టుడైనా, జారుడు-చోరుడు అయినా, అతడే పుణ్యగతులకు కారణం. అతడే ఆమె పాలిటి దైవం" అని చెప్పింది.

"జానకమ్మా! తాను చేసిన పుణ్యం తననెలా రక్షిస్తుందో, అలాగే, మగడి కంటే గొప్ప చుట్టం స్త్రీకి ఎవరూ లేరు. కామాతిశయంతో చెడునడవడి కల స్త్రీలు తప్పుడు మార్గంలో పోతూ ధర్మం తెలుసుకోలేరు. భర్త అంటే లక్ష్యం లేక ఇష్టం వచ్చినట్లు తిరిగే స్త్రీలు, భర్తను తమ ఆజ్ఞలో వుంచే వారు, అపకీర్తితో చెడిపోతారు. చెడు గుణాలవల్ల సుఖం వుందా? కుల ధర్మం పాటిస్తూ, మంచి పనులు చేసే పతివ్రతా రత్నానికి ఆమె ఇంకేమీ చేయకపోయినా, ధర్మాలన్నీ చేసినవారికి లభించే స్వర్గం లభిస్తుంది. మంచి మనసు వుండి, పుట్టింటికి,

మెట్టింటికీ, కీర్తి కలిగిస్తూ సుగుణాలు, సదాచారాలు కలిగిన స్త్రీ, స్వర్గ సుఖాన్ని పొందుతుంది" అని అంటుంది అనసూయ.

అసూయలేని అనసూయ చెప్పిన మాటలు విని తన మీద ఎంతో ప్రేమ వుండబట్టే ఇలా హితం బోధించిందని సీతాదేవి సంతోషించింది. అనసూయతో ఇలా అంది.

❖ ❖ ❖

సర్గ-118

అనసూయ మాటలకు సంతోషించిన సీత

సీత అనసూయతో, "తల్లీ! నీ లాంటి పతివ్రత ఇలా చెప్పడం వింతకాదు. పతివ్రతలకు భర్తే దైవం అనే విషయం నాకూ తెలుసు. తల్లీ! నా తండ్రి నన్ను ఎవరికీ ఇచ్చినా, వాడు గుణహీనుడైనా, వాడిలోనిగుణాలను తప్పుపట్టకుండా వాడే దైవమని నిశ్చల భక్తితో సేవించడం నా విధి. అలాంటప్పుడు ఇంద్రియాలను జయించి, పరిశుద్ధ గుణాలు కలిగి, దయావంతుల్లోమేటివాడై, ధర్మం మీదే బుద్ధి నిలిపి, తల్లిలాగా-తండ్రిలాగా మేలెంచేవాడైన శ్రీరామచంద్రమూర్తి నాకు భారత్ అయినప్పుడు సేవించడంలో ఆశ్చర్యం ఏముంది? నన్ను తప్ప మిగిలిన రాజస్త్రీలందరినీ ఆయన కౌసల్యను చూసినట్లు చూస్తాడు. వీరంతా స్త్రీలేకదా? మాతల్లీ స్త్రీనే కదా? ఆమెకు, వీరికి భేదం ఏమిటి? కాబట్టి వీరు తల్లుల లాంటి వారని సమదృష్టితో చూస్తాడు. దశరథమహారాజు ఒకసారి చూసిన స్త్రీ అయినా తటాలున కనిపిస్తే సాక్షాత్తు తల్లే అని అహంకారం లేకుండా భావిస్తాడు. నేను నా భర్తతో అడవులకు వచ్చేటప్పుడు నా అత్తగారు, పెళ్లి చేసుకున్నప్పుడు మా తల్లి, పాతివ్రత్యాన్ని గురించి చాలా మాటలు చెప్పారు.అవన్నీ మనసులో నాటుకున్నాయి. కాని పాతబడ్డాయి. ఇప్పుడు నువ్వు వాటిని కొత్తగా మనసుకు నచ్చేట్లు చెప్పి బలపర్చావు. తల్లీ! నా అభిప్రాయంలో స్త్రీలకు పతిశుశ్రూష తప్ప వేరే తపస్సు అక్కరలేదు".

"పతిసేవ చేయడం వల్లే కదా సావిత్రి స్వర్గలోకానికి పోయింది? పతిసేవ చేయడం వల్లే కదా నీకు స్వర్గం అరచేతిలోకి వచ్చింది? ఆకాశదేవత, స్త్రీ రత్నమైన రోహిణి అల్పకాలమైనా తన భర్త చంద్రుడి వెంట పోకుండా వుండగలదా? చలించని మనసుతో పతి సేవ చేసే పతివ్రతలు వారు చేసిన పుణ్యం వల్ల స్వర్గంలో పూజించబడుతారు" అనిచెప్పింది. ఆ మాటలకు అనసూయ సంతోషించి సీతను దగ్గరకు తీసుకుని శిరస్సు వాసనచూసి ఇలా అంది: "అమ్మా! ఇంపైన నీ మాటలతో నాకు చాలా సంతోషం కలిగింది.

నీకేం కావాలో కోరుకో. నా తపోబలం వల్ల నీకు అది కలిగిస్తా". అనసూయ మాటలకు ఆశ్చర్యపడ్డ సీత ఆమె తనను పరీక్షిస్తున్నదనుకుని, ఆమె దయవల్ల తనకే కొరత లేదనీ, తానేం కోరాలింకా అని అంటుంది.

సీతాదేవికి అంగరాగాలు (గంధం లాంటివి) ఇచ్చిన అనసూయ

సీతాదేవి అన్న మాటలకు అనసూయ ప్రీతి చెందింది. "ఈ పూల దండలు, ఈ వస్త్రం, ఈ సొమ్ములు, ఈ మైపూతలు, ఈ పరిమళ ద్రవ్యాలు అన్నీ దేవతా సంబంధమైనవే. భూలోకవాసులకు లభించవు. మనసుకు సంతోషం కలిగిస్తాయి ఇవన్నీ. ఈపూలదండలు వాడిపోవు, వీడిపోవు, వాసనపోదు...నీకివి అందంగా వుంటాయి. వీటిని నువ్వు ధరిస్తే ప్రకాశిస్తూ, పూర్ణకాంతితో, మనోహర దేహంతో, లక్ష్మీదేవి విష్ణువును సంతోషపెట్టినట్లు సంతోషపెట్తావు" అని ప్రేమతో అనసూయ ఇవ్వగా, సీతాదేవి సంతోషించి, వాటిని తీసుకుని, నిర్మలమైన భక్తితో ఆ ముని భార్యకు కృతజ్ఞతా సూచకంగా నమస్కారం చేసి ఆమె పక్కన కూచుంది. ఇలా తన పక్కన కూచున్న సీతతో అనసూయ సరదాగా కబుర్లాడుతూ ఇలా అంది.

తన స్వయంవం`వృత్తాంతాన్ని అననసూయకు చెప్పిన సీత

"కుటిలకుంతలా! నిన్ను రామచంద్రమూర్తి తన పరాక్రమంతో స్వయంవరంలో పెళ్లి చేసుకున్నాడని మాటమాత్రంగా వినడమే కాని, అదెలా జరిగిందో వివరంగా వినలేదు. అకథ వినాలని వుంది. జరిగినదంతా వివరంగా చెప్పు" అని అనసూయ అడిగింది.

జవాబుగా సీతాదేవి, "అమ్మా! చెప్తా విను. నా తండ్రి జనకుడు క్షాత్ర ధర్మం అంటే ప్రీతికలవాడు. విదేహ దేశానికి రాజు. ఒకనాడు యజ్ఞం చేయడానికి నేల దున్నిస్తుంటే నాగేటికర్రు తగిలి నేల పెళ్లలు లేచివచ్చి నేను భూమిలోనుండి బయటకు వచ్చా. అప్పుడు ధాన్యం చల్లడానికి పిడికిట్లో గింజలు వుంచుకున్న జనకుడు నన్ను చూసి ఆశ్చర్యపడి తన కన్నకూతురులాగా నన్ను ఆయన తన కుడి తొడమీద కూర్చుండబెట్టుకుని తన కూతురని చెప్పాడు.

ఆకాశవాణి కూడా నేను ఆయన కూతురునే అంది. ఆకాశవాణి మాటలకు సంతోషించిన జనకుడు నన్ను తన పెద్ద భార్యకు ఇచ్చాడు. ఆమె నన్ను తన కన్నబిడ్డలాగా చూసుకుంది. పెంచింది. నాకు వివాహయోగ్యదశ రావడం గమనించిన తల్లిదండ్రులు ఆ దిశగా ఆలోచన చేయసాగారు. ఈ కన్య ఇలాంటి గొప్ప గుణాలు కలది కదా! దీనికి తగిన వాడిని, సద్గుణ సంపత్తికలవాడిని, గొప్పవాడిని, ఏవిధంగా భర్తగా సంపాదించగలనని జనకుడు విచార సముద్రంలో మునిగిపోయాడు. తల్లిగర్భంలో పుట్టని సుందరినైన నాకు, దేవకన్యలాంటి నాకు, తగినవాడిని, మన్మథాకారుడిని, సమానుడైన వాడిని సంపాదించాలని వెతికాడు కాని ఎవరూ దొరకలేదు. అప్పుడు స్వయంవరం చాటిస్తే బాగుంటుందని ఆలోచన చేశాడు".

"ఈ ప్రకారం ఆలోచించి, తాను చేసిన ఒక గొప్ప యజ్ఞంలో వరుణుడు తనకు ఇచ్చిన మనుష్యులు కదిలించ సాధ్యపడని వింటిని, రాజులు కలలో కూడా ఎక్కుపెట్టలేని వింటిని, అక్షయబాణాలను, తాను పిలిపించిన రాజులందరికీ చూపించాడు. ఆవిల్లెక్కుపెట్టిన వాడు తన కూతురుకు భర్త కాగలడని ప్రకటించాడు. అక్కడికి వచ్చిన రాజులు దానిని ఎత్తలేక, చూడగానే భయపడి, దానికి ఒక నమస్కారం చేసి పోయారు. చాలాకాలం ఇలాగే గడిచి పోయింది. రాజకుమారులెవరూ దానిని ఎక్కుపెట్టలేక పోయారు".

"అప్పుడు విశ్వామిత్రుడు మా తండ్రి చేసే యజ్ఞం చూడడానికి రామలక్ష్మణులను తీసుకొచ్చాడు. మా తండ్రికి,మన్మథులలాగా వున్న సుకుమారులైన వారిద్దరినీ, దశరథరాజ పుత్రులను పరిచయం చేశాడు. చేసి, ఆయన దాచిపెట్టిన వింటిని శ్రీరామచంద్రమూర్తికి చూపించమనిఅన్నాడు. జనకుడలాగే చేశాడు. విశ్వామిత్రుడి మాట ప్రకారం శ్రీరాముడు వింటిని సమీపించాడు. ఆ వింటిని శ్రీరాముడు అనాయాసంగా ఎక్కుపెట్టి, అల్లెతాడు గట్టిగాపట్టి లాగగా చూసేవారు భయపడేట్లు, పిడుగుపడ్డ ధ్వనితో అది రెండుగా విరిగింది. విల్లు ఎక్కుపెట్టిన-విరిచిన వారికి తన కూతురును ఇచ్చి వివాహం చేస్తానని ప్రతిజ్ఞచేసిన మా తండ్రి తన మాట ప్రకారం శ్రీరామచంద్రమూర్తికి నన్ను కన్యాదానం చేయడానికి జలపాత్ర చేతిలో తీసుకున్నాడు. కాని తమ

తండ్రి అభిప్రాయం తెలుసుకోవాలని చెప్పి శ్రీరాముడు దానం తీసుకోలేదు. అప్పుడు మా తండ్రి దశరథ మహారాజు దగ్గరకు దూతలను పంపాడు. మా తండ్రి ఆహ్వానాన్ని ఆదరించి దశరథమహారాజు వచ్చాడు. శ్రీరామచంద్రుడికి నన్ను, నా చెల్లెలు ఊర్మిళను లక్ష్మణుడికి దానంచేశాడు జనకుడు. ఈవిధంగా నేను శ్రీరామచంద్రమూర్తిని వివాహం చేసుకున్నా".

❖ ❖ ❖

సర్గ-119

సీతకు సాయంకాలం వర్ణించి చెప్పిన అనసూయ

సీతాదేవి ఇలా చెప్పగా విన్నముని భార్య అనసూయాదేవి సీత శిరస్సును వాసనచూసి కౌగలించుకుని ఇలాఅంది: "కలకంఠీ! వినడానికి చిత్రంగా, సందేహం లేకుండా వుండేవిధంగా, మధురంగానీస్వయంవరచరిత్రచెప్పావు. సూర్యుడుఅస్తమించాడు. చీకట్లుకమ్ముకున్నాయి. పక్షులుగూళ్లకు చేరుకున్నాయి. మునులు నదిలో స్నానంచేసి తడి వస్త్రాలతో జలపాత్రను చేతబట్టుకుని మరలివస్తున్నారు. ఆపక్కచూడు. శాస్త్రప్రకారం ఋషీశ్వరులు అగ్నిహోత్రాలలో హోమంచేస్తుంటే గాలికి ఎగిరేపొగ కనపడుతున్నది. కాంతితోఎగురుతున్నదీపొగ జానకీ! ఆకులు పల్చగాఉన్నప్పటికీ, చెట్లుదూరం నుంచిచూస్తుంటే చీకట్లు వ్యాపించినందువల్ల, దండిగాఆకులున్నట్లుకనపడుతున్నాయి. దిశలు కాంతిహీనం అయ్యాయి. సీతమ్మా! రాత్రి సంచరించే జంతువులు తిరగడం మొదలుపెట్టాయి. తపస్వులు, సాదుకునే జింకలతో శయనించారు. చూశావా? రాత్రి చాలాగడిచింది. చంద్రముఖీ! ఆకాశంనక్షత్రసమూహంతో ప్రకాశిస్తున్నది. వెన్నెల ముసుగేస్తుంటే చంద్రుడుఉదయించాడు. అదిగోచూడు..... ఇక నువ్వు శ్రీరామచంద్రమూర్తి దగ్గరకు పో. నిన్ను చూడడంవల్ల, నీతో మాట్లాడడంవల్ల నాకెంతో సంతోషం కలిగింది. కమలాక్షీ! నేను నీకిచ్చిన చీరెలు, సొమ్ములు, వాసనద్రవ్యాలు నా ఎదుట ధరిస్తే సంతోషిస్తా".

సీత అలాగేచేసి అనసూయకు నమస్కారంపెట్టి శ్రీరామచంద్రమూర్తి దగ్గరకు పోయింది. ఆయనసీతనుచూసిసంతోషించాడు. అనసూయతొ తనకు జరిగిన సంభాషణ అంతా చెప్పి మునిభార్య తనకు చీరె, పూలదండలు, సువాసనద్రవ్యాలు ఇచ్చిన విషయం చెప్పింది. మనుష్యులకు లభించని బహుమానాలను చూసి శ్రీరామలక్ష్మణులు సంతోషించారు. ఆ రాత్రి నిద్రపోయి సూర్యుడు ఉదయించగానే లేచి, సంధ్యావందనం లాంటి ప్రాతఃకాలకృత్యాలను తీర్చుకున్నారు. ఆ తరువాత అక్కడి మునీశ్వరులను తామే మార్గంలో పోవాలో చెప్పమన్నారు. "ఎదారిన పోయినా మమ్మల్ని బాధలు పెట్టే రాక్షసులను

అలాచేయకుండాచూడు. పండ్లు తెచ్చుకోవడానికి అడవుల్లో మునులు పోయే దారి ఇదే. మీరు కూడా అటే పోవచ్చు." అంటారు వారు. అని దీవించారు. అలా మునీశ్వరుల దీవెనలు తీసుకుని సీతారామలక్ష్మణులు ప్రయాణమయ్యారు.

ఇది శ్రీమద్రామచంద్రచరణారవిందా మిలిందాయ, మానమానసత్వ మహావైభవ వావిలికొలను రామచంద్రరాయ తనూభవ వాసుదాస నామధేయ ప్రణీతంబైన మందరాఖ్యవ్యాఖ్యానం శ్రీమదాంధ్రవాల్మీకి రామాయణంలోని అయోధ్యాకాండ.

❖ ❖ ❖



తండ్రి వనం శ్రీనివాసరావు గారు–పరమ భాగవతోత్తములు, శ్రీరామ భక్తులు... తన 83వ ఏట 1998 లో పరమ పదించారు. తల్లి వనం సుశీలమ్మ గారు– సహస్ర చంద్ర దర్శనం చేసుకొని నవంబర్ 2013 లో తన 90 వ ఏట మరణించారు.

స్వగ్రామం–జన్మ స్థలం: ఖమ్మం జిల్లా, ముదిగొండ మండలం, వనం వారి కృష్ణాపురం గ్రామం. ఆగస్ట్ 15, 1947 న భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన ఏడాదికి, ఆగస్ట్ 8, 1948 న జననం. ఒక అక్క, ఇద్దరు చెల్లెళ్లు, నలుగురు తమ్ములు.

విద్యాభ్యాసం: సొంత గ్రామంలో మాధ్యమిక; ఉన్నత పాఠశాల చదువు ఖమ్మంలో; కళాశాల చదువు ఖమ్మం, హైదరాబాద్‌లలో; విశ్వవిద్యాలయం చదువు ఉస్మానియా, నాగపూర్‌లలో... లెక్కలు, భౌతిక–రసాయన శాస్త్రాల్లో డిగ్రీ,; పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌లో ఎం.ఏ; లైబ్రరీ సైన్స్‌లో డిగ్రీ.

వివాహం: ఏప్రియల్ 30, 1969 న (స్వర్గీయ) అయితరాజు రాంరావు–రాధ గార్ల కుమార్తె విజయలక్ష్మి తో వివాహం. ఇద్దరాడ పిల్లలు (ప్రేమ మాలిని, కిన్నెర); ఒక కొడుకు (ఆదిత్య). ఆరుగురు మనుమలు, మనుమరాళ్లు

ఉద్యోగాలు– ఇతర వ్యాపకాలు: లైబ్రేరియన్‌గా వృత్తి ప్రారంభం... గవర్నర్ దగ్గర ప్రాజెక్టు అధికారిగా, ఇద్దరు ముఖ్యమంత్రుల దగ్గర పౌర సంబంధాల అధికారిగా... హస్తకళల అభివృద్ధి సంస్థలో కొన్నాళ్లు... మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివద్ధి సంస్థలో కొంత కాలం... అత్యవసర సహాయ సేవల సంస్థలో మరికొంతకాలం... ఇలా అక్కడా ఇక్కడా... ప్రస్తుతం తెలంగాణ సీఎం గారి దగ్గర సీపీఆర్వో గా.

ఆంగ్లంలో మూడు పుస్తకాలు–హైదరాబాద్, చెన్నై, గోవా (స్టర్లింగ్ పబ్లిషర్స్); ఎ సింక్రోనస్ హిస్టరీ స్క్రాప్ బుక్... తెలుగులో – తిలక్ జ్ఞాపకాలు, సుందర కాండ మందర మకరందం, బాలకాండ మందర మకరందం

SRIMADHAANDHRA VALMIKI RAMAYANAM

Ayodhya Kanda • Mndara Makarandam

written by: *Vanam Jwala Narasimharao*

Published by: *Darshanam Devotional Magazine*